వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

అనుశాసన పర్వం - 1



డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

అనుశాసన పర్వం - 1

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894-82781
రామ - మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

అనుశాసన పర్వం - 1

ప్రథమ ముద్రణ : గీతా జయంతి (డిసెంబర్ 2010)

20 సంపుటాల వెల : రూ. 720/-

E2 74191
సుందరయ్య ... గ్రంథాలయ సంస్థ
10 96387
నెల్లూరు

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, **పోలకంపాడు,**
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

కీ॥శే॥ కరెడ్ల గోపాలకృష్ణమూర్తి గారి స్మృత్యర్థం

వారి ధర్మపత్ని కమలమ్మ

కుమారులు - కోడళ్లు :

వెంకట సీతారామశాస్త్రి - అనంతలక్ష్మి

సుందరశర్మ - లలితా రాజేశ్వరి, శ్రీనివాస్ - రోజామీనాక్షి

టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్ముల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.



కీ॥శే॥ మోచర్ల రామకృష్ణ శర్మ గారు

వారి స్మృత్యర్థం

టైటిల్ బోర్డు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని వరలక్ష్మి

కుమారుడు :

పూర్ణ వెంకట రామశర్మ

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి స్మృత్యర్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని సుభద్ర

కుమారులు - కోడళ్లు :

శ్రీయుతులు శ్రీనివాస్ - సౌభాగ్యలక్ష్మి

సత్యనారాయణ (చినబాబు) - యామినీలక్ష్మి

కుమార్తెలు :

భవాని, విశాలాక్షి

కీ॥శే॥ బ్రహ్మశ్రీ పాలపర్తి వెంకట సుబ్బారావు

వారి ధర్మపత్ని పూర్ణాంబ

As a Hindu, every individual has to study,
observe, and realize the essence of

MAHABHARATHAM

An. Muthu Palaniappam

M. Meenakshi

As a Hindu, every individual has to study,
observe, and realize the essence of

MAHABHARATHAM

M. Bala Subramanyam

Smt. Anbuchelvi

మానవులలో మానవత్వాన్ని పెంపొందించే

మహాభారతానికి మా నమస్కారం

సిరిగిరి దుర్గారావు

వారి ధర్మపత్ని శ్రీమతి శారద

రచయిత :

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి,
వారి ధర్మపత్ని శ్రీమతి సీత

రచయిత :

డాక్టర్ సూరం శ్రీనివాసులు,

వారి ధర్మపత్ని శ్రీమతి సులోచన

ఎందరో మహానుభావులు

అనుశాసన పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి, శ్రీ వెలంపల్లి దాశరథి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంత తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది 'అభిగమ్యకృతే దానం' అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వం తానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంధాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకొంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా। పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా। ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.		శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.		శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

వీటిని అందంగా డి.టి.పి. తయారుచేసిన బెవర వెంకటరమణ, వి.యస్.గ్రాఫిక్స్ వారికి మా కృతజ్ఞతాభివందనములు.

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది, ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణ మని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులను ప్రతినిధులుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని

అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించాడు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం – వ్యాస మహాభారతం (తెలుగు వచనం).*

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాఙ్గేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్పంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమాబ్జభవ శ్రీకన్దరా శ్త్రేయసే

ఇట్లు
అనువక్తలు

★ మహాభారతం యథాతథంగా అనగా అధికపాఠాలతో సహా ఇచ్చాం అధికపాఠాలు చిన్నసైజులో బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	1. దానధర్మ పర్వము - 166	
1.	భీష్ముడు ధర్మరాజును అనునయించుట. (83)★	21
2.	సుదర్శనోపాఖ్యానము. (93)	27
3	విశ్వామిత్రోపాఖ్యానము. (19)	32
4.	అజమీఢ వంశము - విశ్వామిత్ర జన్మము. (62)	33
5.	శుకవాసవ సంవాదము (32)	37
6	పురుషార్ధ ప్రభావ వర్ణనము (49)	38
7.	కర్మఫల వర్ణనము. (29)	42
8.	ఉత్తమ బ్రాహ్మణ మహిమ. (29+1 $\frac{1}{2}$)	44
9.	స్యగాల వానర సంవాదము. (28)	46
10.	శూద్రముని సంవాదము. (75+2)	47
11.	శ్రీరుక్మిణీ సంవాదము. (21+2)	52
12.	స్త్రీ పురుష సంయోగము. (54+26)	53
13.	పాప పరిత్యాగోపదేశము. (6+204 $\frac{1}{2}$)	58
14.	మేఘవాహన పర్వాఖ్యానము. (429+4)	67
15.	శ్రీకృష్ణుడు వరములు పొందుట. (11)	93
16.	తండి మహాదేవుని స్తుతించుట. (76)	94
17.	శివ సహస్రనామస్తోత్రము. (182)	99
18.	శివసహస్రనామస్తోత్ర మహిమ. (83)	110
19.	అష్టావక్ర దిక్సంవాదము - 1. (103)	115
20.	అష్టావక్ర దిక్సంవాదము - 2. (26)	121

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
21.	అష్టావక్ర వివాహము. (19+1)	123
22.	మార్కండేయ నారద సంవాదము – బహుప్రాశ్నికము. (41+46)	124
23.	నిమంత్రణార్హులు – స్వర్గనరకగాముల లక్షణాలు. (103+8 $\frac{1}{2}$)	130
24.	బ్రహ్మహత్యతో సమానమైన పాపాలు. (12)	136
25.	వివిధ తీర్థ మహిమలు. (71)	137
26.	గంగామాహాత్మ్య వర్ణనము. (106+1)	141
27.	ఇంద్ర మతంగ సంవాదము. (30)	149
28.	ఇంద్రుడు మతంగునకు హితబోధ చేయుట. (16)	151
29.	మతంగుడు వరములు పొందుట. (26)	152
30.	వీతహవ్యోపాఖ్యానము. (67)	153
31.	కృష్ణనారద సంవాదము. (36)	157
32.	శ్యేనకపోత సంవాదము. (39)	160
33.	బ్రాహ్మణ మాహాత్మ్యవర్ణనము. (28+ $\frac{1}{2}$)	162
34.	శ్రేష్ఠ బ్రాహ్మణ ప్రశంస. (31)	164
35.	బ్రాహ్మణ ప్రశంస. (23)	165
36.	ఇంద్రశంబరాసుర సంవాదము. (19+1)	167
37.	దానయోగ్యతా పరీక్ష. (18)	168
38.	పంచచూడానారద సంవాదము. (30)	170
39.	స్త్రీరక్షణ విషయమై యుధిష్ఠిరుని ప్రశ్న (14)	172
40.	విపులోపాఖ్యానము. (60+2)	173
41.	విపులుడు ఇంద్రుని నుండి గురుపత్నిని రక్షించుట. (36)	176
42.	విపులుడు దివ్యపుష్పముల కొనితెచ్చుట. (33)	178
43.	దేశశర్మ విపులుని అనునయించుట. (27+2)	180
44.	కన్యావివాహ విషయమై వరయోగ్యతావిచారణ. (56)	182

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
45.	కన్యాదౌహిత్రుల ఉత్తరాధికార నిర్ణయము. (23)	186
46.	స్త్రీ ప్రశంస. (25)	188
47.	బ్రాహ్మణాదివర్ణాల ఆస్తి పంపకాల పద్ధతి. (61)	189
48.	వర్ణసంకర సంతానము. (50)	193
49.	నానావిధ పుత్రుల వర్ణనము. (27)	197
50.	చ్యవనోపాఖ్యాన ప్రారంభము. (27)	199
51.	చేపలు మత్స్యకారులు సద్గతినందుట. (48+2)	200
52.	చ్యవన కుశిక సంవాదము. (39)	203
53.	చ్యవనుడు రాజదంపతుల నాశీర్వదించుట. (70)	205
54.	చ్యవనుడు కుశికునితో వరములు కోరుకొనుమని పలుకుట. (42)	209
55.	చ్యవనుడు కుశికునకు వరములనిచ్చుట. (37)	211
56.	చ్యవనుడు తీర్థయాత్రకు బయలుదేరుట. (21)	213
57.	వివిధతపస్సులు, దానములు - ఫలితము. (44)	215
58.	ఆరామ తటాకాది నిర్మాణము - ఫలితము. (33)	217
59.	ఉత్తమదాన - ఉత్తమ బ్రాహ్మణ ప్రశంస. (41)	219
60.	యాచింపని ధర్మాత్ముడు, నిర్ధనుడైన సద్గుణవంతునకు చేసిన దానము యొక్క ఫలము. (20)	222
61.	యజ్ఞదాన బ్రాహ్మణాదులను రక్షించుట - రాజ కర్తవ్యము. (38+1 $\frac{1}{2}$)	223
62.	ఇంద్ర బృహస్పతి సంవాదము. (96)	226
63.	అన్నదాన ప్రశంస. (52)	232
64.	నక్షత్ర యోగదానము. (36)	235
65.	సువర్ణాదిదాన మహిమ. (19)	237
66.	అన్నదానాది మహిమ. (65+ $\frac{1}{2}$)	238
67.	అన్నదాన జలదాన మహిమ. (19)	242

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
68.	యమధర్మరాజ బ్రాహ్మణసంవాదము. (34)	243
69.	గోదాన మాహాత్మ్యము. (22+3)	245
70.	నృగోపాఖ్యానము. (33)	247
71.	యమధర్మరాజు నాచికేతునకు గోదానమహిమ చెప్పుట. (57)	249
72.	ఇంద్ర యుధిష్ఠిర సంవాదము. (12)	253
73	బ్రహ్మ గోలోక గోదాన మహిమ చెప్పుట. (51)	254
74.	గోదాన సువర్ణదాన మాహాత్మ్యము. (15+$\frac{1}{2}$)	258
75.	దమ సత్య బ్రహ్మచర్యాదుల ఫలము (41)	259
76.	గోదాన కథనము. (31)	261
77.	కపిలగోవుల ఉత్పత్తి మాహాత్మ్యాలు. (35)	264
78.	వసిష్ఠుడు సౌదాసునకు గోదానమహిమ చెప్పుట. (25)	266
79.	వివిన్న గోదానాలు - వివిన్నలోకప్రాప్తి. (27)	268
80.	గోదాన మహిమ. (17)	270
81.	వ్యాసుడు శుకునకు గోదాన మాహాత్మ్యమును చెప్పుట. (47)	271
82.	లక్ష్మీగోసంవాదము. (47)	274
83.	గోలోక వర్ణనము. (52)	276
84.	సువర్ణోత్పత్తి. (82)	278
85.	కార్తికేయ, సువర్ణోత్పత్తి. (168)	282
86.	తారకాసుర వధ. (35)	292
87.	వివిధ తిథులలో శ్రాద్ధఫలము. (19)	294
88.	శ్రాద్ధములో పితరుల తృప్తి - పితృగీత. (10)	295
89.	వేర్వేరు నక్షత్రాలలోని శ్రాద్ధఫలము. (15)	296
90.	శ్రాద్ధభోక్తల నిరూపణము. (54+1)	297

। శ్రీమాత్రే నమః ॥

వ్యాస

మహాభారతం

(తెలుగు వచనం)

అనుశాసన పర్వం - 1

1. భీష్ముడు ధర్మరాజును అనునయించుట.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరుల మనస్సులే నివాస స్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ, సరస్వతీ దేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువవలెను/ చెప్పవలెను.

యుధిష్ఠిరుడు అడిగాడు "పితామహా ! శోకాన్ని వీడి శాంతిని పొందే వివిధ సూక్ష్మోపాయాలను చెప్పావు కాని ఇటువంటి నీ ఉపదేశాన్ని విని కూడా నా హృదయంలో శాంతి నిలవటం లేదు. పితామహా ! ఈ విషయంలో శాంతిని పొందటానికి అనేకోపాయాలను చెప్పావు. కానీ వివిధ శాంతి మార్గాలను విన్నా కూడా స్వయంకృతాపరాధంతో శాంతి ఎలా లభిస్తుంది ? వీరా ! ఒళ్ళంతా బాణాలు గ్రుచ్చుకొని, తీవ్రంగా గాయపడి ఉన్న నిన్ను చూసి, చేసిన పొరపాట్లను తలచుకొంటూ సుఖంగా నిలువలేకపోతున్నాను. పురుషోత్తమా ! ఒళ్ళంతా నెత్తుటితో తడిసి స్రవిస్తున్న పర్వతంవలె ఉన్న నిన్ను చూసి, వర్షాకాలంలో తామరపూవు వలె శిథిలమవుతున్నాను. నా వలననే రణరంగంలో శత్రువులు పితామహుడవైన నీకు ఈ స్థితిని కలిగించారు. నాకు ఇంతకన్న బాధాకరమైన విషయమేముంటుంది ? అదే రీతిగా ఎందరో రాజులు పుత్రులతో, బంధువులతో పాటు నా వల్లనే చనిపోయారు. ఇంతకన్న బాధాకరమైన విషయమేముంటుంది ? రాజా ! మేమూ, ధృతరాష్ట్రుని కొడుకులూ కాలానికీ, క్రోధానికీ లొంగిపోయాం. ఈ పాడుపని చేశాం. ఏ గతిని పొందగలమో ! రాజా ! దుర్యోధనుడు చనిపోవటమే మంచిదని నేను భావిస్తున్నాను. ఎందుకంటే ఈ స్థితిలో ఉన్న నిన్ను చూడనవసరం లేకుండా పోయింది. నేనే మీ జీవితానికి ముగింపు

కల్పించాను. అలాగే మిత్రులను చంపాను. నీవు దుఃఖిస్తూ నేలగూలి ఉంటే చూస్తున్న నేను శాంతిని పొందలేకపోతున్నాను. దురాత్ముడు, కులకళంకరూపుడు అయిన దుర్యోధనుడు సేనలతో, తమ్ములతో సహా యుద్ధంలో చంపబడ్డాడు. ఏమిటీ క్షత్రధర్మం ! ఆ దురాత్ముడు ఈనాడు నేలగూలిన నిన్ను చూడవలసిన అవసరం లేకుండా పోయింది. అందువలన తాను జీవించి ఉండటం కన్న మరణించి ఉండటమే మంచిదనుకొంటున్నాను. వీరా ! నేను కూడా సోదరులతో యుద్ధంలో శత్రువుల చేత నశింపజేయబడి ఉంటే, బాణాలకు గురియై తీవ్ర దుఃఖంతో తపిస్తున్న నీ ఈ అవస్థను చూసేవాడిని కాదు. రాజా ! నిశ్చితంగా పాపపు పనులు చేయటానికి బ్రహ్మ మమ్ములను సృష్టించాడు. రాజా ! మరొక లోకానికి వెళ్ళినపుడైనా పాప విముక్తిని పొందగలగాలి. నాకు మేలు జరగాలని కోరుకొంటున్నట్లయితే దానికి తగిన కర్తవ్యాన్ని నాకుపదేశించు.

భీష్ముడు చెప్తున్నాడు. మహా భాగా ! నీవు అస్వతంత్రుడవు. కానీ కర్మలకు నిన్ను కారణంగా నీవు భావిస్తున్నావెందుకు ? కర్మలకు కారణం పరమసూక్ష్మం. అది ఇంద్రియాలకందని విషయం. ఈ విషయంలో కూడా మృత్యు గౌతములకు కాలుడు, బోయవాడు. సర్పాలతో జరిగిన సంవాద రూపమైన ప్రాచీనేతి హాసాన్ని ఉదాహరిస్తుంటారు. కాంతేయా ! గౌతమి అనే వృద్ధురాలుండేది. ఆమె శాంతి సాధనలో ఆసక్తి గలది. ఒకసారి తన కుమారుని పాము కరవటం ఆమె చూసింది. ఆ బాలుడు చైతన్యాన్ని కోల్పోయాడు. అప్పుడు అర్జును డనే బోయవాడు అసహనంతో ఆ పామును ప్రేవుల త్రాళ్ళతో బంధించి గౌతమి దగ్గరకు తెచ్చి గౌతమితో ఇలా అన్నాడు. "మహాభాగా ! నీ కుమారుని చంపిన పన్నగాధము డితడే. వెంటనే చెప్పు. ఏ రీతిగా దీనిని చంపమంటావు ? బాలకుని చంపిన ఈ పాపి ఎక్కువ కాలం బ్రతకగూడదు. నిప్పులో పడవేయమంటావా ? ముక్కలుగా నరకమంటావా ?" గౌతమి ఇలా చెప్పింది. "అర్జునా ! దీనిని చంపవద్దు. విడిచిపెట్టు. నీవింకా అవివేకంలో ఉన్నావు. జరుగవలసిన దానిని ఎవ్వరూ ఆపలేరు. అది తెలిసి కూడా పాపభారాన్ని తనమీద ఎవడు వేసుకొంటాడు ? **లోకంలో ధర్మ మెరిగి తేలికపడినవారు నీటిలోని తెప్పలవలె తేలుతుంటారు. పాపంతో బరువెక్కినవారు నీటిలోకి విసిరిన శస్త్రంవలె మునిగి పోతుంటారు.** దీనిని చంపినా నా కుమారుడు బ్రతకడు. ఇది బ్రదికి ఉన్నా నీకు వచ్చిన ప్రమాదమేదీ లేదు. ఆ స్థితిలో ప్రాణాలతో ఉన్న ఈ జంతువును చంపి, అనంతమైన మృత్యులోకానికి ఎవరు వెళతారు ?" లుబ్ధకుడన్నాడు. "దేవీ ! నీవు గుణాలు, అవగుణాలు తెలిసినదానవు. పెద్దవాళ్ళు అందరి

కష్టాలలో ఇలా దుఃఖిస్తారు. కానీ ఈ ఉపదేశాలు స్వస్థులై ఉన్నవారికి మాత్రమే చెల్లుతాయి. అందువలన ఈ క్షుద్రసర్పాన్ని చంపివేస్తాను. శాంతిని కోరేవారు కాలగతి అనే చెప్తుంటారు. కానీ అర్థనీతి నెరిగినవారు ప్రతీకారం చేసి, వెంటనే దుఃఖాన్ని విడనాడుతారు. శ్రేయస్సు నశించినప్పుడు కొందరు మోసం వలన నిత్యమూ దుఃఖిస్తుంటారు. కాబట్టి పామును చంపిన బాధపడవద్దు". గౌతమి ఇలా అన్నది. "మనవంటి వారు ఎవరికేహాని జరిగినా బాధపడరు. కానీ సజ్జనులెప్పుడూ ధర్మాత్ములై ఉంటారు. నా కుమారుడు ఎప్పుడైనా మరణించవలసినవాడే. కాబట్టి పామును చంపటానికి నాకు సామర్థ్యం లేదు (ఇష్టం లేదు). బ్రాహ్మణులకు కోపమే ఉండదు. ఇక వారు కోపంతో ఎవరినైనా ఎలా పీడిస్తారు ? సాధూ ! మృదువుగా ఆలోచించు. సహనంతో ఈ పామును విడిచిపెట్టు."

లుబ్ధకు డన్నాడు. "దీనిని చంపితే శాశ్వత లాభం కలుగుతుంది (ఇతరులకు హాని ఉండదు). బలవంతుల నుండి లాభాన్ని పొందటమే ప్రశస్తం. కాలంనుండి లభించే లాభమే సత్యం. ఈ నీచప్రాణి బ్రతికి ఉంటే మీకు ఏ శ్రేయస్సూ లభించదు." గౌతమి ఇలా అన్నది. "శత్రువును బంధించి చంపితే లాభమేముంది ? శత్రువును పట్టుకొని, విడువకుండా ఉంటే తీరే కోరిక ఏమిటి ? సౌమ్యా ! ఈ పాము చేసిన అపరాధాన్ని క్షమించక పోవటానికి కారణం ఏముంది ? దీనిని విడిచిచెట్టే ప్రయత్నం ఏ కారణంతో నేను మానాలి ?" లుబ్ధకుడంటున్నాడు. "ఈ ఒక్కదాని ద్వారా చాలా మందిని రక్షించాలి. గౌతమి ! పదిమంది ఉసురుపోసి ఒక్కని రక్షించగూడదు. ధర్మవేత్తలు పాపం చేసిన వానిని విడిచిపెడతారు (వారికి దూరంగా ఉంటారు). కాబట్టి నీవు పాపి అయిన ఈ పామును చంపు." గౌతమి అంటోంది. "లుబ్ధకా ! ఈ పామును చంపినంతమాత్రాన నా కుమారుడు జీవితాన్ని పొందడు. ఇతనిని చంపటంలో మరే గుణము కూడా కన్పించటం లేదు. కాబట్టి వ్యాధా ! పామును ప్రాణాలతో విడిచిపెట్టు." లుబ్ధకుడన్నాడు. "వృత్రుని చంపి దేవేంద్రుడు గొప్పవాడయ్యాడు. శివదేవుడు యజ్ఞాన్ని నాశనం చేసి యాగభాగాన్ని పొందాడు. నీవు కూడా దేవతల ప్రవర్తననే అనుసరించు. వెంటనే పామును చంపు. అనుమానించవద్దు." భీష్ముడు చెప్తున్నాడు. లుబ్ధకుడు అదేపనిగా చెప్తున్నా మహాభాగ అయిన గౌతమి సర్ప విషయంలో పాపం చేయటానికి ఇష్టపడలేదు. త్రాళ్ళతో బంధింపబడి బాధపడుతున్న పాము మెల్లగా శ్వాస పీలుస్తూ, కష్టం మీద నిలద్రొక్కుకొని, మానవ భాషతో నెమ్మదిగా ఇలా అన్నది. "అర్జునకా ! మూర్ఖా ! ఇందులో నా తప్పేమున్నది ? నాకు స్వాతంత్ర్యం లేదు. ఇతరులకు లోబడి ఉన్నాను. మృత్యువు నన్ను ప్రేరేపించింది.

ఆ మృత్యువు ఆదేశంమేరకు కాటువేశాను. కానీ కోపంతో కాదు. కోరికతోనూ కాదు. లుబ్ధకా ! అది పాపమే అయితే ఆ పాపం మృత్యువుది."

లుబ్ధకుడన్నాడు. "సర్పమా ! ఇతరులకు లోబడి నీవీ అశుభకర్మ చేస్తే, నీవూ ఇక్కడ కారణమే ! కాబట్టి నీవూ అపరాధివే. పన్నగా ! కుండ చేసేటప్పుడు కర్ర, కుమ్మరి చక్రం మొదలయినవి కూడా కారణాలు అయినట్లు నీవు కూడా ఇక్కడ కారణమే. పన్నగా ! నీవు అపరాధివి. నేను చంపవచ్చు నిన్ను. నీవు కూడా అపరాధివే. నీ అంతట నీవే నీ కారణత్వాన్ని చెప్పావు." పామిలా అన్నది. "కుండ చేసేటప్పుడు దండం, చక్రం వంటివి అన్నీ అస్వతంత్రాలే. అలాగే నేను కూడా. కాబట్టి నీవు నాపై దోషాన్ని ఆరోపించటం తగదు. ఒకవేళ నీ అభిప్రాయాన్ని అంగీకరించినా ఆ దండచక్రాదులు పరస్పరం ప్రయోజకాలు. పరస్పర ప్రేరణ ఉన్నచోట కార్యకారణభారం సంశయాస్పదమే. ఆ స్థితిలో నా దోషమేమీ లేదు. నేను నిరపరాధిని చంపదగను. ఒకవేళ దోషమే అంటే అది అన్ని కారణాల మీద కలిసి ఉంటుంది." లుబ్ధకుడన్నాడు. "నీవు కారణం కాదనీ, కర్తవూ కాదనీ అంగీకరించినా సరే (ఈ బాలుని వినాశనంలో నీవే కారణం కాబట్టి నా దృష్టిలో నీవు చంపదగినవాడవే. పన్నగా ! చెడ్డపని చేసినా కూడా పామంటదంటే, దండింపబడుతున్న ఇతరులు కూడా ఆ అపరాధంలో కారణం కాకపోవలసి వస్తుంది. ఎక్కువ మాటాడుతున్నావెందుకు ?" సర్పమిలా అన్నది. "లుబ్ధకా ! ప్రేరకుడున్నా లేకపోయినా, ప్రయోగింపబడే కర్త లేకపోతే పని జరగదు. కాబట్టి ప్రస్తుత విషయంలో నేనూ, మృత్యువు సమానంగా కారణాలమైనాం. విశేష దృష్టిలో మృత్యువే విశేషించి అపరాధి అని నా మతం. నేను స్వాభావికంగా బాలుని మృతికి కారణమని భావించటం కుదరదు. ఈ విషయంలో ప్రయోజకుడైన మృత్యువే దోషి ప్రాణి నాశనాన్ని చేసేది తానే కదా !" లుబ్ధకుడంటున్నాడు. "దుర్మతీ ! పన్నగాధమా ! క్రూరంగా బాలుని చంపిన నీవు నాచే చంపబడదగిన వాడవే. వధింపదగిన వాడవై కూడా ఇంకా ఎక్కువగా మాటాడుతున్నావెందుకు ?" పాము ఇలా అన్నది. "లుబ్ధకా ! ఋత్విక్కులు యజ్ఞంలో ఆహుతులను వేస్తున్నా వారు ఫలితాన్ని పొందరు. ఇక్కడ ఫలప్రాప్తిలో నేనూ అంతే !"

భీష్ముడు చెప్తున్నాడు. "మృత్యువుచే ప్రేరేపింపబడిన పాము అలా చెప్తున్న సమయంలోనే మృత్యువు అక్కడకు వచ్చి ఆ పాముతో ఇలా అన్నాడు". "పన్నగా ! నేను కాలానికి లోబడి నిన్ను ప్రేరేపించాను. కాబట్టి ఈ శిశువు యొక్క ప్రాణాలు నశించటంలో

నీవూ, నేనూ కూడా కారణం కాదు. గాలి మేఘాలను అటూ ఇటూ చెదర గొడుతుంది. అలాగే ఆ మేఘాలవలె నేను కూడా కాలానికి లోబడిన వాడను. సాత్విక, రాజస, తామసభావాలు ఎన్ని ఉన్నా అవన్నీ కాల స్వరూపాలే. కాల ప్రేరణతోనే ప్రాణులలో ప్రవర్తిస్తాయి. సర్పా ! భూలోకంలో కానీ, స్వర్గ లోకంలో కానీ స్థావర జంగమాత్మక ప్రాణులన్నీ కాల స్వరూపాలే. ఈ విశ్వమంతా కాల స్వరూపమే. ఈ లోకంలోని ప్రవృత్తులైనా, నివృత్తులైనా అన్నీ కాల వికారాలే. సర్వమూ కాల స్వరూపమని భావింపబడుతుంది. సర్పమా ! సూర్యుడు, చంద్రుడు, విష్ణువు, జలం, వాయువు, ఇంద్రుడు, అగ్ని, ఆకాశం, నేల, మిత్రుడు, మేఘం, పర్జన్యుడు, వసువులు, అదితి, నదులు, సముద్రాలు, భావం (ఉనికి), అభావం (లకపోవటం) అన్నీ కాలంచేతనే సృష్టింపబడతాయి. మరల సంహరింపబడతాయి. ఇది ఇలా జరుగుతూనే ఉంటుంది. సర్పా ! ఈ విషయం తెలిసి కూడా నేను అపరాధి నని ఎలా భావిస్తున్నావు ? అయినా నేను దోషినంటే నీవు కూడా దోషివే". సర్పమిలా అన్నది. "మృత్యువా ! నేను నిన్ను దోషినని కానీ, నిర్దోషివని కానీ అనటం లేదు. 'నీవు నన్ను ప్రేరేపించావు' అని మాత్రమే అంటున్నాను. ఈ విషయంలో కాలమే దోషి కావచ్చు. కాలం కూడా దోషి కాకపోవచ్చు. కాబట్టి నాలోని దోషాన్ని పరీక్షకు పెట్టకూడదు. మనకు ఆ అధికారం లేదు కూడా. నా మీద పడిన ఈ దోషాన్ని ఏదో ఒక రీతిగా తొలగించుకోవటమే నా పని. మృత్యువు కూడా దోషియే అని చెప్పటం నా ఉద్దేశం కాదు."

భీష్ముడు చెప్తున్నాడు. "అప్పుడు సర్పం అర్జునకునితో ఇలా అంది. "మృత్యువు మాటను విన్నావు గదా ! నిరపరాధినయిన నన్ను త్రాళ్ళతో కట్టి బాధపెట్టదగదు." లుబ్ధకు డిలా అన్నాడు. "సర్పమా ! మృత్యువూ, నీవు చెప్పిన మాటలు విన్నాము. అంతమాత్రం చేత నీవు నిరపరాధివి కాలేవు. ఈ బాలుని వినాశనంలో మృత్యువూ, నీవూ కూడా కారణమే ఇద్దరినీ నేను కారణంగానే భావిస్తున్నాను. ఒకరు కారణమనీ, మరొకరు కాదనీ నేను భావించటం లేదు. ఛీ ! ఛీ ! సజ్జనులకు దుఃఖాన్ని కలిగించే క్రూరుడు, దుర్మార్గుడు ఈ మృత్యువు. ఈ పాపానికి నీవూ, మృత్యువూ ఇద్దరమూ కారణమే, ఇద్దరినీ నేను చంపుతాను". మృత్యువు ఇలా అన్నాడు. "మేమిద్దరమూ కారణం చేతిలో ఉన్నాం. అస్వతంత్రులం. కాలం చెప్పినట్లు చేసేవారమే. సరిగా ఆలోచించి చూడగలిగితే మా ఇద్దరిపై దోషాన్ని ఆరోపించదగదు". లుబ్ధకుడన్నాడు. "మృత్యూ !

పన్నగమా ! మీరిద్దరూ కాలానికి అధీనులై, అస్వతంత్రులై ఉంటే నాకు మీ వలన హర్షం కానీ, క్రోధం కానీ ఎందుకు కలుగుతున్నాయి. ఇది నేను తెలుసుకొనదలచుకొన్నాను". మృత్యువు ఇలా అన్నాడు. "లుబ్ధకా ! ఏ చేష్ట అయినా అంతా కాలప్రేరణమే. కాలప్రేరణతో నేను ముందే నీకీవిషయం చెప్పాను. అందువలన మేమిద్దరమూ అస్వతంత్రులం. కాలం ఆదేశాన్ని పాటించే వాళ్ళం. లుబ్ధకా ! నీవు ఎప్పుడూ మమ్ములను అపరాధులను చేయదగదు".

భీష్ముడు చెప్తున్నాడు. "ఇలా ధర్మార్థసంశయం కలుగగానే కాలుడు అక్కడకు వచ్చి సర్పంతో, మృత్యువుతో, బోయవాడైన అర్జునునితో ఇలా అన్నాడు". కాలుడు చెప్తున్నాడు. "లుబ్ధకా ! నేను కానీ, ఈ మృత్యువు కానీ, సర్పం కానీ ఈ బాలుని మరణంలో అపరాధులం కాము. మేము మృత్యువునకు ప్రయోజకులం కాము. అర్జునకా ! ఈ బాలుడు చేసిన కర్మయే ఈ మృత్యువునకు ప్రేరకం. అంతేకానీ మరెవ్వరూ ఇతని మరణానికి కారణం కాదు. ఈ బాలుడు తన కర్మవలననే మరణించాడు. ఇతడు చేసిన కర్మద్వారానే ఇతడు మరణించాడు. ఇతని కర్మయే ఇతని వినాశానికి కారణం. మేమందరమూ కర్మాధీనులమే. ఈ లోకానికంతటికీ కర్మయే జ్ఞాతి (దాయాది). కర్మయే సుఖ దుఃఖ సూచకం. కర్మలే లోకంలో ఒకరిపై ఒకరిని ప్రేరేపిస్తాయి. మా పరిస్థితి కూడా అదే. (మమ్ములను కూడా కర్మ ప్రేరేపిస్తుంది). మట్టిముద్ద నుండి కర్త తన కిష్టమైన రూపాన్ని తయారు చేసికొన్నట్లు, మానవుడు తాను చేసిన కర్మననుసరించి అన్నీ పొందుతాడు. నిత్యమూ నిరంతరంగా ఎండా, నీడా కలిసి ఉన్నట్టు కర్మా, కర్తా కూడా ఆయా కర్మల కనుగుణంగా కలిసియే ఉంటారు. ఈ రీతిగా నేను కానీ, మృత్యువు కానీ, సర్పం కానీ, నీవు కానీ, ఈ వృద్ధ బ్రాహ్మణి కానీ కారణం కాదు. ఈ శిశువే తన మరణానికి కారణం. రాజా ! కాలుడలా చెప్తుండగా ఆ బ్రాహ్మణి గౌతమి జనులు తమ కర్మలననుసరించియే ఫలితాలను పొందుతారని నిశ్చయించుకొని అర్జునకునితో ఇలా అన్నది. కాలుడు (కాలం) కానీ, సర్పం కానీ, మృత్యువు కానీ ఇక్కడ కారణం కాదు. ఈ బాలుడు తన కర్మలవలననే కాలుని ద్వారా చంపబడ్డాడు. అర్జునకా ! నేను కూడా నా సుతుని మరణానికి కారణమైన కర్మ చేసియే ఉంటాను. కాలుని, మృత్యువును వారి స్థానాలకు వెళ్ళనీ ! పామును విడిచిపెట్టు".

భీష్ముడు చెప్తున్నాడు. "ఆ తరువాత మృత్యువు, కాలుడు, సర్పం వచ్చినట్లే వెళ్ళిపోయారు. అర్జునకుడు, గౌతమి శోకాన్ని విడనాడారు. ఇది విని శాంతించు. రాజా ! శోకానికి లోనుకావద్దు. అందరూ తమ కర్మఫలాలైన లోకాలకే వెళతారు. నీవు ఏ పనీ

చేయలేదు దుర్యోధనుడూ ఏమీ చేయలేదు. ఇదంతా కాలకృతం. రాజులందరూ కాలునిచే చంపబడ్డారు. గ్రహించు". వైశంపాయనుడన్నాడు. "మహాతేజస్వి ధర్మవేత్త అయిన యుధిష్ఠిరుడు ఈ మాట విని చింతను విడనాడాడు. మరల ఇలా అడిగాడు.

2. సుదర్శనోపాఖ్యానము.

యుధిష్ఠిరుడడిగాడు. "పితామహా ! మహాప్రాజ్ఞా ! ఈ మహాఖ్యానాన్ని నేను విన్నాను. రాజా ! నీవు చెపుతుంటే ధర్మార్థ విషయాలను ఇంకా వినగోరుతున్నాను. నాకేదైనా చెప్పాలి. రాజా ! ఏ గృహస్థుడు ధర్మాన్ని ఆశ్రయించి మృత్యువును ఓడించగలిగాడు. ఇదంతా నాకు యథాతథంగా వివరించు." భీష్ముడు చెప్తున్నాడు. "ఈ సందర్భంగా గృహస్థుడు ధర్మాన్ని ఆశ్రయించి మృత్యువును ఓడించిన పురాతనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. రాజా ! మనుప్రజాపతికి ఇక్ష్వాకుడు కొడుకు. సూర్యతేజస్సుగల ఆ రాజుకు నూర్గురు కొడుకులు పుట్టారు. భారతా ! ఆయన పదవ కొడుకు దశాశ్వుడు. ధర్మాత్ముడు, సత్యవిక్రముడు అయిన ఆయన మహిష్మతీపురంలో రాజుగా ఉండేవాడు. దశాశ్వునకు ఒక కొడుకు ఉండే వాడు. ఆ రాజు పరమ ధార్మికుడు. సత్యంపై, తపస్సుపై. దాతృత్వంపై ఆయన మనస్సు నిత్యమూ ఆసక్తమై ఉండేది. ఆ రాజు ఈ భూమండలంలో మదిరాశ్వుడన్న పేర ప్రఖ్యాతుడు. ఆయన ధనుర్వేదాభ్యాసంలో, వేదాధ్యయనంలో సర్వదా ఆసక్తిగొన్నవాడు. మదిరాశ్వుని కొడుకు ద్యుతిమంతుడు. ఆ రాజు మహాభాగ్యశాలి. మహాతేజస్వి, మహాధైర్యశాలి. మహాబలశాలి. ద్యుతిమంతుని కొడుకు సువీరుడన్న పేరుతో సర్వలోకాలలోనూ ప్రసిద్ధికెక్కినవాడు. ఆ రాజు పరమ ధార్మికుడు. మరొక దేవేంద్రునివలె ఆయన ధర్మాత్ముడు, ధనసంపన్నుడు కూడా. సువీరుని కొడుకు దుర్జయుడు. ఆయన సర్వ యుద్ధాలలోనూ ఇతరులకు దుర్జయుడే. సర్వశస్త్ర ధారులలో శ్రేష్ఠుడు.

దుర్జయుని కొడుకు దుర్యోధనుడనే మహారాజు. ఇంద్రుని వంటి శరీరం, అశ్వినీ దేవతల వంటి కాంతి గలవాడు ఆ రాజర్షి శ్రేష్ఠుడు. ఇంద్రునితో సమానమైన పరాక్రమంతో యుద్ధాలలో ఎప్పుడూ వెనుదిరగని ఆ రాజు రాజ్యంలో ఇంద్రుడు చక్కగా వర్షం కురిపించేవాడు. ఆ రోజుల్లో ఆ దుర్యోధనుని నగరమూ, రాజ్యమూ కూడా రత్నాలతో, ధనాలతో, పశువులతో, వివిధ సస్యాలతో నిండుగా ఉండేది. ఆయన రాజ్యంలోని నరులలో కృపణుడు కానీ, దుర్గతికి లోనైన వాడు కానీ, రోగి కానీ, బలహీనుడు కానీ ఎక్కడా ఉండేవాడు కాదు. ఆ రాజు మంచి దక్షిణలనిచ్చేవాడు. మధుర భాషి, అసూయలేనివాడు

జితేంద్రియుడు, ధర్మాత్ముడు, దయామయుడు, పరాక్రమశాలి. తనను తాను ఎప్పుడూ పొగడుకొనేవాడు కాదు. ఆ రాజు యజ్ఞకర్త, జితేంద్రియుడు, మేధావి, బ్రాహ్మణ భక్తుడు, సత్య ప్రతిజ్ఞుడు. ఎవ్వరినీ అవమానించడు. మహాదాత, వేదవేదాంగ పారగుడు కూడా. భారతా ! చల్లని నీటితో శుభాకరంగా, పుణ్యప్రదంగా ప్రవహించే దేవనది. నర్మద స్వరూపంతో ఆ పురుషోత్తముని కామించి, భార్య అయింది. రాజా ! అప్పుడు ఆ నదికి కూతురు పుట్టింది. ఆ బాలిక కమలనయన. పేరు సుదర్శన. రూపం కూడా పేరువలె సుదర్శనమే (చక్కగా చూడదగినది). యుధిష్ఠిరా ! దుర్యోధనుని కుమార్తెవంటి అందగత్తె స్త్రీలకు అంతకుముందు పుట్టలేదు. రాజా ! ఆ రాజకుమారిని సుదర్శనను అగ్ని ప్రేమించాడు. బ్రాహ్మణ రూపం ధరించి ఆ అమ్మాయి నిమ్మని రాజును అడిగాడు. ఇతడు దరిద్రుడు, నాకు సవర్ణుడు కాదు అని భావించి ఆ రాజు తన కుమార్తె అయిన సుదర్శనను ఆ విప్రున కివ్వలేదు. ఆ తరువాత ఆ రాజు చేస్తున్న యజ్ఞం నుండి అగ్ని నిష్క్రమించాడు. దానితో ఆ రాజు చాలా బాధపడి, అప్పుడు బ్రాహ్మణులతో ఈ మాట అన్నాడు. ద్విజశ్రేష్ఠులారా ! నేను కానీ, మీరు కానీ చేసిన తప్పేమిటి ? దుష్టులకు చేసిన ఉపకారం వలె అగ్ని ఎందుకు అదృశ్యమయ్యాడు ? మనం చేసిన తప్పేమీ లేదు. కానీ అగ్ని అదృశ్యమయ్యాడు. ఇది మీలోని దోషమా ? నాలోని దోషమా ? యథాతథంగా పరిశీలించండి. భరతర్షభా ! అక్కడ రాజుమాట విని ఆ బ్రాహ్మణులు నియమపూర్వకంగా, మౌనంగా అగ్నిని శరణు వేడారు.

అప్పుడు పూజ్యుడైన అగ్ని శరత్కాల సూర్యునితో సమానమైన తేజస్సుతో తన రూపాన్ని దీప్తిమంతం చేస్తూ వారి ఎదుట ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు మహాత్ముడైన ఆ అగ్ని 'నా కోసం దుర్యోధనుని కుమార్తెను వరిస్తున్నాను' అని బ్రాహ్మణ శ్రేష్ఠులతో అన్నాడు. ఆపై ఆ బ్రాహ్మణులు అగ్ని చెప్పిన మాటలతో ఆశ్చర్యానికి లోనై మరునాడుదయమే లేచి రాజుకు ఆ విషయం చెప్పారు. ఆపై బ్రహ్మవాదులయిన ఆ విప్రుల మాట విని ధీమంతుడైన ఆ రాజు పరమ హర్షాన్ని పొంది 'అలాగే' అన్నాడు. పూజ్యుడైన ఆ అగ్నిని కన్యాశుల్కం కూడా అడిగాడు. "అగ్నీ ! నీ సాన్నిధ్యం ఇక్కడ ఎప్పుడూ ఉండాలి". అదే ఆ కన్యాశుల్కం. అప్పుడు అగ్నిభగవానుడు 'అట్లాగే జరుగుతుంది'. అని రాజుతో అన్నాడు. అందువలననే ఇప్పటికీ మహిష్మతీపురంలో అగ్ని సాన్నిధ్య మెప్పుడూ ఉంటుంది. సహదేవుడు దక్షిణ దిగ్విజయ సమయంలో దానిని చూశాడు కూడా ! ఆపై దుర్యోధనరాజు తన కుమార్తెకు చక్కని వస్త్రాలను కట్టబెట్టి, నిండుగా అలంకరించి, మహాత్ముడైన అగ్నికి

ఇచ్చారు. యజ్ఞంలో వసుధారను గ్రహించినట్లు వేదోక్త విధానంతో రాజపుత్రి అయిన సుదర్శనను గ్రహించాడు. ఆమె రూపం, నడవడి, వంశం, శరీరం, శోభలతో అగ్ని ప్రీతిని పొందాడు. ఆమెకు గర్భాధానం చేయాలని సంకల్పించాడు.

ఆమె గర్భంలో అగ్నికి ఒక కొడుకు పుట్టాడు. అతని పేరు సుదర్శనుడు. ఆ సుదర్శనుడు రూపంలో పూర్ణ చంద్రుని వంటివాడు. శైశవంలో సర్వరూపమైన నూతన పరబ్రహ్మ జ్ఞానాన్ని పొందాడు. అప్పట్లో నృగుని పితామహుడైన ఓఘవంతుడనే రాజు రాజ్యం చేస్తుండేవాడు. ఆయనకొక కూతురు, ఒక కొడుకు. కూతురి పేరు ఓఘవతి. కొడుకు పేరు ఓఘరథుడు. ఓఘవంతుడు దేవ స్వరూపిని అయిన తన కుమార్తెను ఓఘవతిని పండితుడైన సుదర్శనునికి స్వయంగా భార్యను చేశాడు. రాజా ! గృహస్థాశ్రమంపై ఆసక్తిగల ఆ సుదర్శనుడు ఆ ఓఘవతితో కూడి కురుక్షేత్రంలో నివసించాడు. ధీమంతుడు, దీప్తతేజస్వి అయిన ఆ సుదర్శనుడు "గృహస్థుడనై ఉంటూనే మృత్యువును జయిస్తాను" అని ప్రతిజ్ఞ చేశాడు. రాజా ! అగ్ని కుమారుడైన సుదర్శనుడు ఆ ఓఘవతితో ఇలా అన్నాడు. "నీవెప్పుడూ అతిథికి ప్రతికూలంగా ప్రవర్తించగూడదు. అతిథి ఎప్పుడైనా నీవేం చేస్తే తృప్తి చెందుతాడో అదే చేయాలి. ఒకవేళ శరీరాన్ని సమర్పించవలసి వచ్చినా నీవు ఆలోచించగూడదు. సుశ్రోణి ! ఈ వ్రతం నా హృదయంలో ఎప్పుడూ మసలుతూనే ఉంటుంది. **గృహస్థులకు అతిథిని మించినది ఏదీ లేదు.** నా మాటను నీవు లెక్క చేసేటట్లయితే దీనినెప్పుడూ ప్రశాంతంగా నీ హృదయంలో నిలుపుకో. నా మాటను నీవు ప్రమాణంగా స్వీకరించేటట్లయితే నేనున్నా, లేకపోయినా నీవు అతిథిని అవమానించగూడదు".

అది విని ఓఘవతి చేతులు జోడించి, తలపై నిలిపి "నీ మాట మేరకు నేను చేయకూడనిదంటూ ఏదీ ఉండదు" అని భర్తతో అన్నది. రాజా ! గృహస్థ ధర్మాన్ని పాటిస్తున్న సుదర్శనుని జయింపదలచిన సుదర్శనుడు అతనిలో లోపాలను అన్వేషిస్తూ సదా వెన్నంటి తిరుగుతున్నాడు. ఒకసారి సుదర్శనుడు సమిధలకోసం అడవికి వెళ్ళి ఉన్నప్పుడు ఒక తేజస్వి అయిన బ్రాహ్మణుడు ఓఘవతి దగ్గరకు అతిథిగా వచ్చి అప్పుడిలా అన్నాడు. "వరవర్ణిని ! గృహస్థాశ్రమ ధర్మాన్ని నీవు గౌరవిస్తుంటే ఇప్పుడు నీ ద్వారా ఆతిథ్యాన్ని స్వీకరించాలని ఇష్టపడుతున్నాను." రాజా ! ఆ బ్రాహ్మణుడలా అనగానే యశస్విని అయిన ఆ రాజకుమారి వేదోక్త పద్ధతిలో ఆయనను సత్కరించింది. ఆ బ్రాహ్మణునికి ఆసనాన్ని, పాద్యాన్ని ఇచ్చి 'ఏమి కావాలి ? నీకు ఏమివ్వగలను ?' అని విప్రునితో అన్నది. ఆపై ఆ విప్రుడు రాజకుమారి అయిన సుదర్శనునితో ఇలా అన్నాడు.

"కళ్యాణి ! నీవే నాకు కావాలి. శంక లేకుండా నీవు దానిని ఆచరించాలి. రాణీ ! నీకు గృహస్థాశ్రమ ధర్మం సమ్మతమే అయితే నీ శరీరాన్ని సమర్పించి నా ముచ్చట తీర్చాలి." ఆ రాజకుమారి మరేవైనా కోరుకొమ్మని ఆ విప్రుని ఎంతో ప్రార్థించింది. కానీ ఆ ద్విజుడు ఆమె శరీరదానాన్ని తప్ప మరే వరాన్నీ కోరుకోలేదు. ఆ రాజకుమారి భర్త మొదటి నుండీ చెప్తున్న మాటను స్మరించి, సిగ్గుపడుతూ అలాగే అని బ్రాహ్మణోత్తమునితో అన్నది. గృహస్థాశ్రమ ధర్మపాలనను తీవ్రంగా కోరుకొనే భర్తమాటను తలచుకొని అంగీకారాన్ని తెలుపగానే ఆ విప్రర్షి నవ్వి, ఆమెతోపాటు లోనికి ప్రవేశించాడు. ఆపై సుదర్శనుడు సమిధలు తీసుకొని వచ్చాడు. మృత్యువు నిరంతరమూ క్రౌర్యంతో బంధువువలె సుదర్శనుని వెంటవస్తూనే ఉన్నాడు. ఆపై ఆ అగ్ని కుమారుడు, సుదర్శనుడు ఆశ్రమానికి వచ్చి, అప్పుడు "ఎక్కడకు వెళ్లావు ?" అని చాలా సార్లు ఓఘవతిని పిలిచాడు. భర్తృవ్రత అయిన సతిని - ఓఘవతిని ఆ సమయంలో బ్రాహ్మణుడు చేతులతో పట్టుకొని ఉన్నాడు. అందువలన అప్పుడు ఆమె భర్తకు సమాధానమివ్వలేదు. ఎంగిలి అయినట్లు తనను భావించుకొని ఆమె భర్తను చూడటానికి సిగ్గుపడి, మౌనంగానే ఉన్నది. ఏమీ మాటాడలేదు. ఆపై సుదర్శనుడు ఆమెను మరలా ఇలా అనసాగాడు. "పవిత్ర అయిన నా భార్య ఎక్కడ ? ఎక్కడకు వెళ్ళింది ? నాకన్నా ఆమెకు పెద్ద పని ఏముంది. సత్యశీలయై, పవిత్రతయై నిత్యమూ నిజాయితీపై ఆసక్తిగల ఆమె గతంలో వలె నవ్వుతూ నాకు ఎదురురాలే దెందుకు ? పర్ణశాలలో ఉన్న ఆ విప్రుడు సుదర్శనునితో ఇలా అన్నాడు.

"అగ్నికుమారా ! నేను బ్రాహ్మణుడను. అతిధిగా వచ్చాను. బ్రాహ్మణా ! సజ్జన శ్రేష్ఠా ! ఈ నీ భార్య ఆయా అతిథి సత్కారాల ద్వారా నా కోరిక తీర్చటానికి సిద్ధపడింది. అప్పుడు నేను ఆమెనే కోరాను. ఈ విధానంతో ఈ శుభవదన నన్ను సేవిస్తోంది. ఇప్పుడు నీకు మరేదైనా తగినపని అనిపిస్తే దానిని చేయవచ్చు. 'మాట తప్పితే ఇతని నిక్కడే చంపవచ్చు' అని ఆలోచిస్తూ మృత్యువు లోహదండాన్ని చేతబట్టి సుదర్శనుని వెన్నంటి ఉన్నాడు. సుదర్శనుడు మనస్సులో, చేతలో, చూపులో, మాటలో కూడా ఈర్ష్యనూ, కోపాన్నీ ప్రదర్శించకుండా నవ్వుతూ ఇలా అన్నాడు. "బ్రాహ్మణోత్తమా ! నీ కామాన్ని తీర్చనా ! నాకు పరమ ప్రీతిగా ఉంది. వచ్చిన అతిథిని పూజించటమే గృహస్థునకు ప్రధమ ధర్మం. గృహస్థుని ఇంట అతిధిని ఆదరణను పొంది వెళ్ళితే గృహస్థున కంతకన్న గొప్పధర్మం లేదని బుద్ధిమంతులు అన్నారు. నా ప్రాణాలను అయినా, భార్యను అయినా, నా దగ్గరున్న మరే ధనాన్ని అయినా అతిథులకు ఇవ్వాలని

నేను వ్రతాన్ని చేపట్టాను. బ్రాహ్మణా ! నేను చెప్తున్న ఈ వచనం సందేహాలకు అతీతం. నా శరీరం మీద ఒట్టుపెట్టుకొని సత్య ప్రమాణంగా చెప్తున్నాను. ధర్మాత్ములలో శ్రేష్ఠుడా ! పృథివి, వాయువు, ఆకాశం, నీరు, నిప్పు, బుద్ధి, ఆత్మ, మనస్సు, కాలం, దిక్కులు - ఈ పది గణాలు నిత్యమూ ప్రాణుల శరీరాలను ఆశ్రయించి, మంచి పనిచేస్తూ, చెడ్డపని చేసినా చూస్తూనే ఉంటాయి. నేనీనాడు పలికిన ఈ మాట అసత్యం కాకపోతే ఆ సత్యఫలాతో దేవతలు నన్ను రక్షిస్తారు. అసత్యమే అయితే నన్ను దహిస్తారు. భారతా ! అప్పుడు సర్వదిక్కుల నుండి, అన్నివైపుల నుండి "ఇది సత్యమే, మిథ్య కాదు" అన్న ధ్వని పదే పదే వినిపించింది. అప్పుడు ఆ బ్రాహ్మణుడు పర్ణశాలనుండి వెలుపలికి వచ్చాడు. ఎగిసిన గాలి వలె తన శరీరంతో ఆయన భూమ్యాకాశాలను వ్యాపించి నిలిచాడు. ఆయన శిక్షాశాస్త్రానికి అనుకూలంగా ఉన్న స్వరంతో మూడు లోకాలను ప్రతిధ్వనింపజేస్తూ ధర్మజ్ఞుడైన ఆ సుదర్శనుని ముందుగా పేరుపెట్టి పిలిచి ఇలా అన్నాడు.

"అనఘా ! నేను ధర్ముడను. నీకు మేలు కలగాలి నిన్ను తెలుసుకోవాలని వచ్చాను. నీ సత్యాన్ని గ్రహించి నీపై ఎంతో ప్రసన్నుడ నయ్యాను. నిన్ను అనుసరిస్తున్న మృత్యువును నీవు ఓడించావు కూడా. ఎప్పుడూ నీలో లోపాలను అన్వేషిస్తున్న ఈ మృత్యువును నీవు ధైర్యంతో వశం చేసుకొన్నావు. పురుష శ్రేష్ఠా ! పతివ్రత అయిన ఈ నీ భార్యను తేరి చూడటానికి కూడా మూడు లోకాలలోనూ ఎవ్వరికీ శక్తి లేదు. నీ గుణాలచే, పవిత్రతా గుణాలచే కూడా ఈమె రక్షింపబడింది. ఈమెనెవ్వరూ ఎదుర్కొన జాలరు. ఈమె చెప్పినది చెప్పినట్లు జరుగుతుంది. తన తపస్సుతో కూడిన ఈ బ్రహ్మవాదిని లోకాన్ని పావనం చేయటానికై నదీమతల్లి అవుతుంది. శరీరంలోని అర్ధభాగంతో నదిగా మారి, మిగిలిన అర్ధభాగంతో నిన్ను అనుసరించి సేవిస్తుంది. ఆ యోగశక్తి ఈమె అధీనంలో ఉంది. నీవు కూడా ఈమెతోపాటు తపోబలంతో సంపాదించుకొన్న సనాతనలోకాలను పొందగలవు. అవి శాశ్వతాలు అక్కడనుండి మరలిరావు. నీవు ఈ శరీరంతోనే ఆ లోకాలను చేరగలవు. నీవు మృత్యువును ఓడించావు. నీవు ఉత్తమైశ్వర్యాన్ని పొందగలవు. నీ శక్తితో పంచభూతాలను కూడా అతిక్రమించి, మనోవేగాన్ని పొందగలిగావు. ఈ గృహస్థ ధర్మపాలనంతో కామక్రోధాలను కూడా జయించావు. రాజా ! ఈ రాజకుమారి కూడా నీ శుశ్రూషతో ఆసక్తిని, రాగాన్ని, అలసతను, మోహాన్ని, ద్రోహాన్ని కూడా గెలిచి నిర్లేపంగా నిలిచింది". భీష్ముడు చెప్తున్నాడు. "అప్పుడు పూజ్యులైన ఇంద్రుడు వేయితెల్లని గుర్రాలను పూన్చిన శ్రేష్ఠరథాన్ని తీసికొని సుదర్శనుని దగ్గరకు వచ్చాడు. ఈ రీతిగా

సుదర్శనుడు అతిథి సేవతో మృత్యువును, తనను, లోకాలను, పంచభూతాలను, బుద్ధిని, కాలాన్ని, మనస్సును, ఆకాశాన్ని కామక్రోధాలను జయించాడు. కాబట్టి నరశ్రేష్ఠా ! గృహస్థాశ్రమంలో ఉన్న వానికి అతిథిసేవనం తప్ప మరొక దైవం లేదు. దీనిని మనస్సులో స్థిరాభిప్రాయం చేసుకో. ఆదరింపబడిన అతిథి మనసా గృహస్థుని శుభాన్ని కోరుకొంటే వందయాగాలు కూడా దానికి సాటిరావని బుద్ధిమంతులు చెప్పారు. శీలసంపన్నుడై, యోగ్యుడయిన అతిథి వస్తే అతనిని ఆదరించకపోతే ఆ అతిథిని తన పాపాన్ని గృహస్థునకిచ్చి, గృహస్థుని పుణ్యాన్ని కొనిపోతాడు. కుమారా ! గతంలో గృహస్థుడు మృత్యువును జయించిన ఉత్తమ కథను నీకు నేను వివరంగా చెప్పాను. ఈ ఉత్తమాఖ్యానం ధనాన్ని, కీర్తిని, ఆయుస్సును కలిగించేది, సర్వపాపాలనూ హరించేది. ఎదగదలచుకొన్నవాడు సమాదరింపదగినది. భారతా ! ఈ సుదర్శన చరితాన్ని ప్రతిదినమూ చెప్పిన పండితుడు పుణ్యలోకాలను పొందగలడు.

3. విశ్వామిత్రోపాఖ్యానము.

యుధిష్ఠిరుడడిగాడు. "నరాధిపా ! మహారాజా ! మిగిలిన మూడు వర్ణాల చేత బ్రాహ్మణత్వం పొందటం కష్టమయితే క్షత్రియకులంలో పుట్టిన మహాత్ముడైన విశ్వామిత్రుడు దానినెలా పొందగలిగాడు. నరర్షభా ! దీనిని వినగోరుచున్నాను. నాకు ఉన్నదున్నట్లు చెప్పు. పితామహా ! అమిత శక్తిశాలి అయిన ఆ విశ్వామిత్రుడు మహాత్ముడైన వసిష్ఠుని నూరుగురుపుత్రులను తన తపోబలంతో అప్పటికప్పుడు నశింపజేశాడు. ఆయన ఒళ్ళంతా కోపమాక్రమించగా కాలాంతక సమానులు, ప్రచండ తేజస్సులు అయిన యాతుధానులను, రాక్షసులను సృష్టించాడు. వందలకొలది బ్రహ్మర్షులతో నిండిన మహా కుశికవంశాన్ని ఈ నరలోకంలో స్థాపించాడు. పండితుల యొక్క బ్రాహ్మణుల యొక్క మన్ననలను పొందాడు. ఋచీకుని కొడుకు, మహాతపస్వి అయిన శునశ్శేపుడు మహాయాగంలో యజ్ఞపశువు కాగా ఆ విశ్వామిత్రుడు విముక్తి కలిగించాడు. హరిశ్చంద్రుని క్రతువులో తన తేజస్సుతో దేవతలను సంతోషపెట్టి శునశ్శేపుని విడిపించాడు. ఆ బాలుడు ధీమంతుడైన విశ్వామిత్రునకు కుమారుడయ్యాడు. రాజా ! శునశ్శేపుడు దేవరాతుడన్న పేర విశ్వామిత్రుని పెద్ద కొడుకయ్యాడు. అతనికి నమస్కరించటం లేదని మిగిలిన తన ఏబయి మంది కొడుకులను శపించాడు. వారు చండాలురయ్యారు. ఇక్ష్వాకు వంశీయుడైన త్రిశంకుని బంధువులంతా విడిచిపెట్టారు. ఆయన స్వర్గభ్రష్టుడై దక్షిణ దిక్కున తలక్రిందులుగా

పడుతుంటే ప్రేమ పూర్వకంగా ఆయనను స్వర్గానికి పంపాడు. దేవర్షులు, బ్రహ్మర్షులు, దేవతలు సేవించే కౌశికీనది పవిత్రమైనది, మంగళకరమైనది, విశాలమైనదీ కూడా. అది విశ్వామిత్ర ప్రభావంతో పుట్టినదే.

అయిదు జుట్టుముడులు గల రంభ అనే అప్సర లోకులు ఇష్టపడేది. ఆమె విశ్వామిత్రుని తపస్సును భంగ పరచటానికి వచ్చి ఆయన శాపంతో శిలగా మారింది. అలాగే గతంలో విశ్వామిత్రునకు భయపడి, శ్రీమంతుడైన వసిష్ఠుడు తనను తాను బంధించుకొని నీటిలో మునిగాడు. ఆ నదీ ప్రభావంతో బంధ విముక్తుడై మరల పైకి తేలాడు. అప్పటినుండి మహాత్ముడైన ఆ వసిష్ఠుని చేష్ట వలన ఆ పవిత్ర మహానది 'విపాశ' అని ప్రసిద్ధికెక్కింది. దేవసేనలకు నాయకుడు, సమర్థుడు, పూజ్యుడు అయిన ఇంద్రుడు విశ్వామిత్రుని స్తుతి వచనాలతో ప్రసన్నుడై ఆయనను శాపవిముక్తుని చేశాడు. ఉత్తానపాదుని కొడుకైన ధ్రువునకు, బ్రహ్మర్షులకు మధ్య నిత్యమూ ఉత్తర దిక్కును ఆశ్రయించి గగనతలంలో ప్రకాశిస్తుంటాడు. కౌరవా ! ఆ క్షత్రియుని అద్భుతకర్మలు ఇవేకాక ఇంకా ఉన్నాయి. అందువలన నాకు ఈ కుతూహలం కలిగింది. భరతర్షభా ! ఇదేమిటి ? నాకు ఉన్నదున్నట్లు చెప్పు. మరొక శరీరాన్ని పొందకుండానే ఆయన బ్రాహ్మణుడెలా కాగలిగాడు ? తాతా ! దీనిని యథాతథంగా, పూర్తిగా నాకు చెప్పాలి. మతంగుడు తపస్సుతో బ్రాహ్మణత్వాన్ని పొందలేకపోయాడు. కానీ విశ్వామిత్రుడెలా కాగలిగాడు ? నాకు చెప్పు. చండాల జాతిలో పుట్టిన మతంగుడు బ్రాహ్మణత్వాన్ని పొందకపోవటం సముచితమే. మరి విశ్వామిత్రుడెలా పొందగలిగాడు ?

4. అజమీఢ వంశము - విశ్వామిత్ర జన్మము.

భీష్ముడు చెప్తున్నాడు. "పార్థా ! నాయనా ! గతంలో విశ్వామిత్రుడు బ్రాహ్మణత్వాన్ని, బ్రహ్మర్షిత్వాన్ని ఎలా పొందాడో యథాతథంగా విను. భరతుని వంశంలో అజమీఢుడనే రాజుండేవాడు. ఆయన యాగాలు చేసినవాడు. ధర్మధారులలో శ్రేష్ఠుడు. జహ్నువనే పేర మహారాజు ఉండేవాడు. ఆయన అజమీఢుని కొడుకు. మహాత్ముడైన ఆ జహ్నువును సమీపించి గంగ ఆయన కుమార్తెగా నిలిచింది. ఆ జహ్నువు కొడుకు సింధుద్వీపుడు. మహాయశస్వి. గుణాలలో తండ్రితో సమానుడు. సింధుద్వీపుని కుమారుడు రాజర్షి అయిన బలాకాశ్వుడు. ఆయన మహాబల సంపన్నుడు. సింధుద్వీపుని కొడుకు వల్లభుడు. సాక్షాత్తు మరొక ధర్ముని వంటివాడు. వల్లభుని కుమారుడు కుశికుడు. ఆయన ఇంద్రునితో

సమానమైన తేజస్సు గలవాడు. కుశికుని కొడుకు శ్రీమంతుడైన గాధి మహారాజు. ఆయన సంతానహీనుడై సంతానం కోసం వనవాసానికి వెళ్ళాడు. వనంలో నివసిస్తూనే ఆయన సోమయాగం చేశాడు. ఒక కూతురు పుట్టింది. ఆమె పేరు సత్యవతి. భూలోకంలో అందంలో ఆమె సాటిలేనిది. ఆ సత్యవతిని చ్యవనుని కుమారుడైన ఋచీకుడు వరించాడు. ఆ ఋచీకుడు శ్రీమంతుడు, భృగువంశీయుడు. విస్తారంగా తపస్సు చేసినవాడు. కాని శత్రుసూదనుడైన గాధి దరిద్రుడన్న భావంతో మహాత్ముడైన ఋచీకునకు కూతురు నివ్వలేదు. ఒకసారి ఋచీకుని తిరస్కరించాడు. కానీ ఋచీకుడు మరల వచ్చి అడిగాడు. అప్పుడు ఆ రాజశ్రేష్ఠుడు "నాకు కన్యాశుల్కమివ్వు. ఆ తరువాత నా కూతురుతో కలిసి జీవించవచ్చు" అన్నాడు. ఋచీకుడిలా అన్నాడు. "రాజేంద్రా ! నీ కుమార్తెకై నీకు నేను కన్యాశుల్కంగా ఏమివ్వాలి ? సంశయించకుండా చెప్పు. మరొక ఆలోచన అవసరం లేదు". గాధి ఇలా అన్నాడు. "భార్గవా ! చంద్రకిరణ ప్రకాశం, వాయువేగం గల్గి, ఒక వైపు చెవికిశ్యామల వర్ణం గల వేయిగుర్రాల నివ్వు".

భీష్ముడు చెప్తున్నాడు. ఆపై భృగువంశ శ్రేష్ఠుడు, చ్యవనుని కుమారుడు, సమర్థుడు అయిన ఋచీకుడు జలాధిపతి, అదితినందనుడు అయిన వరుణునితో ఇలా అన్నాడు. "దేవసత్తమా ! చంద్రకిరణ ప్రకాశమూ, వాయువేగమూ, ఒక చెవికి శ్యామలవర్ణమూ గల వేయి గుర్రాలను ఇమ్మని నిన్ను యాచిస్తున్నాను". అదితి కుమారుడైన వరుణుడు 'అలాగే'నని అంగీకరించి, భృగుసత్తముడైన ఋచీకునితో ఇలా అన్నాడు. "నీవు ఎక్కడ కోరితే అక్కడే గుర్రాలు నీకు ప్రాప్తిస్తాయి". ఋచీకుడు తలచుకోగానే చంద్రకాంతి, విపుల తేజస్సుగల వేయి గుర్రాలు గంగాజలం నుండి పైకి వచ్చాయి. కాన్యకుబ్జానికి దగ్గరలో ఈ ఉత్తమ గంగాతీరాన్ని ఇప్పటికీ **అశ్వ తీర్థమనే** పేర మానవులు చెప్తున్నారు. నాయనా ! ఆపై తపస్విశ్రేష్ఠుడైన ఋచీకుడు ప్రసన్నుడై శుభప్రదాలయిన ఆ వేయి గుర్రాలను శుల్కంగా గాధికిచ్చాడు. దానితో గాధిరాజు ఆశ్చర్యానికి లోనయ్యాడు. ఆ ఋచీకుడు శపిస్తాడేమో అని భయపడ్డాడు. తన కుమార్తెను చక్కగా అలంకరించి భృగుసుతునికి దానం చేశాడు. బ్రహ్మర్షి శ్రేష్ఠుడైన ఋచీకుడు శాస్త్రోక్త పద్ధతిలో ఆమె పాణిగ్రహణం చేశాడు. ఆమె కూడా ఆయనను భర్తగా పొంది పరమానందాన్ని పొందింది. భారతా ! ఆ బ్రహ్మర్షి ఆ సత్యవతి ప్రవర్తనతో సంతోషించాడు. ఆ అందగత్తెను వరం కోరుకొమ్మని మొహమాటపెట్టాడు. రాజశ్రేష్ఠా ! ఆ అమ్మాయి అదంతా తన తల్లికి చెప్పింది. అప్పుడు ఆ తల్లి కొంచెం తలవాల్చి కూతురుతో ఇలా అన్నది. "కుమారీ !

నీ భర్త నా మీద కూడా దయచూపాలి. సంతానాన్ని కలిగించాలి. ఆ మహాతపస్వి ఆ పని చేయగలడు". అప్పుడు సత్యవతి త్వరగా వెళ్ళి ఆ విషయమంతా ఋచీకునకు చెప్పింది. రాజా ! తల్లి కోరికను వెల్లడించింది. ఋచీకుడిలా అన్నాడు.

"కళ్యాణి ! నా అనుగ్రహంతో త్వరలోనే నీ తల్లి గుణవంతుడైన కొడుకును కంటుంది. నీ ప్రేమ నిరర్థకం కారాదు. నీకు కూడా గుణవంతుడు, మహాత్ముడు అయిన కొడుకు పుడతాడు. అతడు శ్రీమంతుడై, మనవంశాన్ని నిలబెడతాడు. నీకీ సత్యం చెప్తున్నాను. ఋతుస్నానం తర్వాత మీ అమ్మ అశ్వత్థవృక్షాన్ని, నీవు మేడిచెట్టును కౌగిలించుకోండి. కళ్యాణీ ! ఆ తరువాత నేను చెప్పినట్టు సంతానాన్ని పొందగలరు. ఇదిగో మంత్ర పవిత్రమైన చరుద్వయమిది. వీటిలో ఒకదానిని నీవు, ఒక దానిని మీ అమ్మ తినండి. దానితో పుత్రులు పుడతారు". ఆపై సత్యవతి ఋచీకుడు చెప్పినదంతా తల్లికి చెప్పింది. ఆ చరుద్వయాన్ని గురించి కూడా వివరించింది. అప్పుడు ఆ తల్లి తన కుమార్తె అయిన సత్యవతితో ఇలా అన్నది. "కుమారీ ! నేను నీ కన్న పెద్దదానను. తల్లి నా మాట నీవు పాటించాలి. మంత్రపూర్వకంగా నీ భర్త నీకిచ్చిన చరువును నాకివ్వు. నా చరువును నీవు తీసుకో. శుచిస్మితా ! చెట్లను కౌగిలించుకోవటం కూడా తారుమారు చేద్దాం. అనిందితా ! తల్లిని నేను చెప్తున్న మాట నీకు ఇష్టమే కదా ! తమ బిడ్డలు నిష్కల్మషంగా గొప్పగా ఉండాలని, అందరూ కోరుకొంటారు. పూజ్యుడైన ఋచీకుడు కూడా చరువును సిద్ధం చేసేటప్పుడు ఇలా భావించియే ఉంటాడు. అందువలన నేను నీ చరువు మీద, నీకై నిర్దేశించిన చెట్టు మీదా మనస్సు పడుతున్నాను. 'నా సోదరుడు ఎలా మంచివాడు కావాలన్న విషయమే నీవు ఆలోచించు". ఆ తల్లి, ఆ సత్యవతి అలాగే చేశారు. ఆపై యుధిష్ఠిరా ! వారిద్దరూ గర్భవతు లయ్యారు. గర్భవతి అయిన తన భార్యను చూసి ఆ మహర్షి ఖిన్నుడయ్యాడు.

ఆ భృగువంశ శ్రేష్ఠుడు ఆమెతో ఇలా అన్నాడు. "కళ్యాణీ ! నీవు తారుమారుగా చరువును వినియోగించినట్లు తెలుస్తోంది. చెట్లను కూడా తారుమారు చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. నేను నీ చరువులో సమస్త బ్రహ్మతేజాన్ని ప్రవేశపెట్టాను. ఆమె చరువులో సకల క్షత్ర శక్తిని ప్రవేశపెట్టాను. మూడు లోకాలలోనూ ప్రసిద్ధిని పొందే బ్రాహ్మణుని నీవు కనాలని, గొప్ప క్షత్రియుని ఆమె కనాలని నేను ఇలా రెండు చరువులు సిద్ధం చేశాను. కళ్యాణీ ! నీవు, నీ తల్లి చరువులను తారుమారు చేశారు కాబట్టి ఆ నీ తల్లి బ్రాహ్మణోత్తముని కంటుంది. భద్రా ! నీవు భీకరకృత్యాలు చేసే క్షత్రియుని కంటావు. తల్లిమీద ఉన్న ప్రేమతో నీవు తప్పుడు పని చేశావు". రాజా ! ఆ మాట విని శోకంతో

తపిస్తూ ఆ సుందరి-సత్యవతి అందమైన తీగ తెగిపడినట్లు నేల కూలింది. ఆమె స్పృహలోనికి వచ్చి, శిరస్సు వాల్చి నమస్కరించింది. గాధినందన అయిన సత్యవతి భృగువంశీయుడైన భర్తతో ఇలా అన్నది. "బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడా ! నేను నీ భార్యను వేడుకొంటున్నాను. బ్రహ్మర్షీ ! అనుగ్రహించు. నాకు క్షత్రియుడైన కొడుకు వద్దు. కావాలంటే నా మనుమడు భీకర కృత్యాలు చేసేవాడు. కావచ్చు. బ్రహ్మస్వరూపా ! నా కొడుకు మాత్రం క్షత్రియుడు కావద్దు. నాకీ వరమివ్వాలి. ఆ మహాతపస్వి అలాగేనని భార్యతో అన్నాడు. ఆ తరువాత ఆమె మంచి కొడుకును కన్నది. ఆయనయే జమదగ్ని. రాజేంద్రా ! యశస్విని అయిన గాధిభార్య బ్రహ్మర్షి అయిన ఆ ఋచీకుని అనుగ్రహం వలన బ్రహ్మవాది అయిన విశ్వామిత్రుని కన్నది. దానితో మహాతపస్వి అయిన విశ్వామిత్రుడు క్షత్రియుడైనా ఆ విధంగా బ్రాహ్మణత్వాన్ని పొందాడు. బ్రాహ్మణవంశ కర్త అయ్యాడు.

ఆయన కుమారులు మహాత్ములు, బ్రాహ్మణవంశ ప్రవర్దకులు, తపస్వులు, బ్రహ్మవాదులు, గోత్రకర్తలు కూడా వారు... పూజ్యుడైన మధుచ్ఛందుడు, శక్తిశాలి అయిన దేవరాతుడు, అక్షీణుడు, శకుంతుడు, బభ్రువు, కాలపధుడు, ప్రసిద్ధుడైన యాజ్ఞవల్క్యుడు, మహావ్రతుడైన స్థూణుడు, ఉలూకుడు, యమదూతుడు, సైంధవాయనముని, పూజ్యుడైన వల్గు జంఘుడు, గాలవ మహర్షి, వ్రజముని, ప్రఖ్యాతుడైన సాలంకాయనుడు, లీలాధ్యుడు, నారదుడు, కూర్చముఖుడు, వాదులి, ముసలుడు, వక్ష్ణో గ్రీవుడు, ఆంఘ్రీకుడు. నైకదృక్కు, శిలా యూపుడు, శితుడు, చక్రకుడు, మారుతంతవ్యుడు, వాతఘ్నుడు, ఆశ్వలాయనుడు, శ్యామాయనుడు, గార్గ్యుడు, జాబాలి, సుశ్రుతుడు, కారీషి, సంశ్రుత్యుడు, పరుడు, పౌరవుడు, తంతువు, కపిలమహర్షి, మునిశ్రేష్ఠుడైన తాడకాయనుడు, ఉపగహనుడు, ఆసురాయణముని, మార్దమర్షి, హిరణ్యాక్షుడు, జంగారి, బాభ్రవాయణి, భూతి, విభూతి, సూతుడు, సురకృత్తు, అరాలి, నాచికుడు, చాంపేయుడు, ఉజ్జయనుడు, నవతంతువు, బకనఖుడు, సేయనుడు, యతి, అంభోరుహుడు, చారుమత్స్యుడు, శిరీషి, గార్దభి, ఊర్జయోని, ఉదాపేక్షి, నారదీముని - వీరంతా విశ్వామిత్రుని కుమారులు. అందరూ మునులు, బ్రహ్మవాదులు. రాజా ! యుధిష్ఠిరా ! మహాతపస్వి అయిన ఆ విశ్వామిత్రుడు క్షత్రియుడైన ఋచీకుడు ఆయనలో ఉత్కృష్టమైన బ్రాహ్మణత్వాన్ని కలిగించాడు. భరతర్షభా ! ఈ విధంగా సూర్య, అగ్ని, చంద్రుల తేజస్సుగల విశ్వామిత్రుని జన్మకు సంబంధించిన ఈ విషయమంతా ఉన్నదున్నట్లు నీకు చెప్పాను. రాజశ్రేష్ఠా ! నీకు మరేవేనైనా సందేహాలుంటే అవన్నీ నన్ను అడుగు. నీ సంశయం తీరుస్తాను.

5. శుకవాసవ సంవాదము.

యుధిష్ఠిరు అడిగాడు. "ధర్మజ్ఞా ! పితామహా ! దయామయుల గుణాలను, భక్తజనుల గుణాలను వినగోరుతున్నాను. నాకు చెప్పవలసినది". భీష్ముడు చెప్తున్నాడు. "ఈ విషయంలో కూడా మహామనస్వి అయిన చిలుకకు, ఇంద్రునకు మధ్య జరిగిన సంవాదరూపమైన ప్రాచీనేతిహాస్ని ఉదాహరిస్తుంటారు. కాశిరాజు రాజ్యంలో ఒక బోయవాడు విషం పూసిన బాణాన్ని తీసుకొని, గ్రామం నుండి వెలువడి, వేటకు వెళ్ళి, మృగాలను వెదుకసాగాడు. ఆ మహారణ్యంలో కొంతదూరం వెళ్ళి, మాంసం మీది లోభంతో ఆ బోయవాడు మృగాలను చూసి బాణం వేశాడు. ఆ బోయవాని బాణం అమోఘం. కానీ గురి తప్పినందువలన మృగాన్ని చంపాలని వేసిన ఆ బాణం ఒక పెద్ద చెట్టుకు గ్రుచ్చుకొంది. తీవ్రమైన విషం పూసిన ఆ బాణం మహాబలంగా తగిలి ఆ చెట్టు గాయపడింది. ఆకులు, పండ్లు, రాలిపోయాయి. చెట్టు ఎండిపోయింది. చెట్టు అలా ఎండిపోయినా చాలాకాలం నుండి దాని తొర్రలో ఉంటున్న చిలుక ఆ చెట్టు మీద ఉన్న భక్తిభావంతో తన నివాసాన్ని వీడలేదు. ధార్మికబుద్ధి, కృతజ్ఞత గల ఆ చిలుక అటూ ఇటూ ఎగరటం లేదు. ఆహారం లేదు. చిక్కిపోయింది. మాట కూడా లేని స్థితి. ఆ చెట్టుతో పాటే ఎండిపోసాగింది. ఔదార్యం, గొప్ప ధైర్యం, అమానుష ప్రవర్తన, సుఖ దుఃఖాలను సమానంగా భావించే మనస్సు కల ఆ చిలుకను చూసి ఇంద్రుడు ఆశ్చర్యానికి లోనయ్యాడు. అప్పుడిలా ఆలోచించాడు. పక్షి జాతిలో దాదాపు ఊహింపరాని దయాభావాన్ని ఈ చిలుక ఎలా సాధించుకొనగలిగింది ? అయినా ఇదేమీ ఆశ్చర్యకరంగాదు. సర్వత్ర, సర్వప్రాణులలో, సర్వమూ సంభావ్యమే. ఇలా ఆలోచించి ఇంద్రుడు ప్రశాంతతను పొందాడు.

ఆ తరువాత ఇంద్రుడు మానవరూపాన్ని, బ్రాహ్మణ వేషాన్ని ధరించి, నేలకు దిగి చిలుకతో ఇలా అన్నాడు. "పక్షిశ్రేష్ఠా ! నీచే దక్షుని మనుమరాలు శుకి చక్కని సంతానాన్ని పొందింది. అటువంటి నీ గురించి అడుగుతున్నాను. ఈ చెట్టునెందుకు వదలటం లేదు ?" ఇంద్రుడలా అడగగానే ఆ చిలుక శిరసా నమస్కరించి, ఇంద్రునితో ఇలా అన్నది. "దేవేంద్రా ! స్వాగతం. నా తపస్సు వలన నిన్ను నేను తెలిసికొనగలిగాను". అప్పుడు ఇంద్రుడు 'భళీ భళీ' అని దాని నభినందించాడు. "ఆహా ! ఎంత జ్ఞానం" అని మనస్సులోనే దానిని పూజించాడు. ఆ చిలుక మంచి పనులే చేస్తుంది. పరమ ధార్మికంగా ఉంటుంది. ఆ చెట్టుపై దానికి ప్రీతి ఎక్కువ. ఇదంతా తెలిసి కూడా ఇంద్రుడు ఈ రీతిగా ప్రశ్నించాడు. "ఈ చెట్టుకు ఆకులు లేవు. పండ్లు లేవు. ఎండిపోయింది. పక్షులకు

వాసయోగ్యం కాదు. ఇంత పెద్ద అరణ్యముంటే ఈ చెట్టునే ఎందుకు ఆశ్రయించి ఉన్నావు ? ఈ మహారణ్యంలో ఇంకా ఎన్నో చెట్లున్నాయి. ఆకులు కప్పిన తొర్రలు వాటికున్నాయి. అవి శుభకరాలు. పక్షులు సంచరించటానికి చాలినవి, తగినవి. ధీరా ! ఆయువు ముగిసి, సామర్థ్యం నశించి, సారం అదృశ్యమై, కాంతి తొలగిపోయిన ఈ ముసలి చెట్టును విడిచిపెట్టు. బుద్ధి కలిగి ఆలోచించు".

భీష్ముడు చెప్తున్నాడు. "ధార్మిక బుద్ధిగల ఆ చిలుక ఇంద్రుని మాటను విని ఎంతోసేపు దీర్ఘంగా విశ్వసించి, దీనంగా ఇలా అన్నది. "ఇంద్రా ! దైవాన్ని అతిక్రమించలేము. ఇంద్రా ! నీవు ప్రశ్ననడిగావు. ఆ విషయంలో సమాధానం విను. నేను ఈ చెట్టు మీదనే పుట్టాను. ఇక్కడే మంచి గుణాలను అలవరచుకొన్నాను. పసిబిడ్డను వలె నన్నిది రక్షించింది. శత్రువులు నాపైకి రాకుండా చూసింది. అనఘా ! కాబట్టి నేను దీని భక్తుడను. దయాధర్మాన్ని పాటిస్తున్నాను. మరెక్కడికీ వెళ్లలేను. నీవు దయను చూపుతూ నాలోని సదాలోచనను విఫలం చేస్తావెందుకు ? సజ్జనులు దయను చూపించటమే గొప్ప ధర్మలక్షణం. దయ చూపగలగటం సదా సత్పురుషులకు ప్రీతిని కలిగిస్తుంది. దేవతలందరూ నిన్నే ధర్మ సందేహాలను అడుగుతుంటారు. అందుకే నిన్ను దేవాధిపతిగా నియమించుకొన్నారు. ఇంద్రా ! ఈ చెట్టు నుండి నన్ను విడదీయబూనటం నీకు తగదు. ఎప్పటినుండియో దీని ద్వారా జీవిస్తున్న నేను ఇప్పుడు దీనినెలా విడువగలను ?" ఆ చిలుక పలికిన సౌమ్య వచనాలతో, దాని దయా స్వభావంతో ఆనందించిన ధర్మాత్ముడైన ఇంద్రుడు చిలుకతో ఇలా అంటున్నాడు. "వరం కోరుకో" ! అప్పుడు దయాభారం మీదనే ఆసక్తిగల ఆ చిలుక 'మరల చెట్టు జీవించా'లని వరాన్ని కోరింది. ఆ చిలుకలోని దృఢభక్తిని, శీల సంపదను తెలిసికొని ప్రసన్నుడై దేవేంద్రుడు వెంటనే ఆ చెట్టుపై అమృతాన్ని చిలుకరించాడు. వెంటనే ఆకులు, పండ్లు, అందమైన కొమ్మలు అన్ని వచ్చాయి. చిలుక యొక్క దృఢ భక్తితో ఆ చెట్టు శోభను పొందింది. మహారాజా ! తన దయాగుణంతో చేసిన ఆ కర్మ ఫలితంగా ఆ చిలుక మరణానంతరం ఇంద్రలోకాన్ని పొందింది. రాజా ! ఈ రీతిగా చిలుకను పొందిన చెట్టువలె భక్తిమంతుని ఆశ్రయించినవాడు సర్వార్థ సిద్ధిని పొందగలడు.

6. పురుషార్థ ప్రభావ వర్ణనము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "పితామహా ! మహాప్రాజ్ఞా ! సర్వశాస్త్ర విశారదా ! దైవం, పురుషకారం - ఈ రెండింటిలో ఏది శ్రేష్ఠతరం ?" భీష్ముడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరా ! ఈ విషయంలో కూడా **వసిష్ఠ బ్రహ్మసంవాద రూపమైన** ప్రాచీనేతిహాసాన్ని

ఉదాహరిస్తుంటారు. 'దైవం, మానుషం ఈ రెండు కర్మలలో ఏది శ్రేష్ఠం' అని గతంలో వసిష్ఠభగవానుడు బ్రహ్మను అడిగాడు. రాజా ! అప్పుడు బ్రహ్మ అర్థవంతమూ, తర్కసహమూ అయిన మధుర వాక్యాన్ని ఇలా పలికాడు. "బీజం నుండి మొలక వస్తుంది. మొలక నుండి ఆకు వస్తుంది. ఆకు నుండి కాడలు, కాడల నుండి కాండమూ వస్తాయి. కాండం నుండి పుష్పం, పుష్పం నుండి ఫలం వస్తాయి. ఫలం నుండి గింజ వస్తుంది. గింజ ఎప్పుడూ నిరర్థకం కాదు. బీజం లేకుండా ఏదీ మొలవదు. బీజం లేకపోతే ఫలముండదు. గింజనుండి గింజ పుడుతుంది. గింజ నుండియే ఫలం వస్తుంది. కర్షకుడు పొలంలో ఏ గింజనాటితే అటువంటి ఫలితాన్నే పొందినట్లు, మంచి చేసినా, చెడు చేసినా అటువంటి ఫలితమే వస్తుంది. గింజ అయినా పొలంలో విత్తకపోతే ఫలితాన్ని ఇవ్వలేనట్లు పురుష ప్రయత్నం లేకుండా దైవం కూడా సిద్ధించదు. **పురుష ప్రయత్నం క్షేత్రం. దైవం బీజం.** క్షేత్ర బీజ సంయోగమున్నప్పుడే సస్యసమృద్ధి ఉంటుంది. పని చేసినవాడు అది మంచిపని అయినా చెడ్డపని అయినా ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. ఇది లోకంలో కళ్ళకు కనిపించేదే. శుభకర్మ ద్వారా సౌఖ్యం. పాపకర్మ ద్వారా దుఃఖం. చేసిన పనియే ఎక్కడైనా ఫలిస్తుంది. చేయని దానికి ఎక్కడా అనుభవముండదు. పనిచేసేవాడు సర్వత్ర తన భాగ్యాన్ని అనుసరించి ప్రతిష్ఠ నందుతాడు. పనిచేయనివాడు భ్రష్టుడై పుండుమీద కారం చల్లినట్లు దుఃఖాన్ని అనుభవిస్తాడు.

తపస్సు ద్వారా రూప సౌభాగ్యం లభిస్తుంది. వివిధ రత్నాలు లభిస్తాయి. ఇలా కర్మ ద్వారా సర్వమూ పొందవచ్చు. అంతేకాని అదృష్టాన్నే నమ్మి పనిచేయనివాడు ఏమీ పొందలేడు. అలాగే పురుష ప్రయత్నం చేస్తేనే స్వర్గం, భోగం, నిష్ఠ, బుద్ధి కలిగి ఉండటం - ఇదంతా లభిస్తుంది. పురుష ప్రయత్నం ద్వారానే నక్షత్రాలు, దేవతలు, నాగులు, యక్షులు, చంద్రుడు, సూర్యుడు, మారుతం - అందరూ మనుష్యత్వం నుండి దివ్యత్వాన్ని పొందారు. పురుష ప్రయత్నం చేయనివారు ధనం, మిత్రవర్గం, ఐశ్వర్యం, ఉత్తమ వంశం, దుర్లభమైన లక్ష్మి - ఇవేవీ పొందలేరు. బ్రాహ్మణుడు శౌచంతో, క్షత్రియుడు పరాక్రమంతో, వైశ్యుడు పురుషకారంతో, శూద్రుడు శుశ్రూషతో సంపదను పొందగలరు. దానం చేయని వానిని, నపుంసకుని, క్రియాశూన్యుని, పనిచేసే లక్షణం లేనివానిని, శౌర్యంలేని వానిని, తపస్సు చేయని వానిని అర్థాలు సేవింపవు. మూడు లోకాలనూ, దైత్యులను, సర్వదేవతలను కూడా సృష్టించిన ఆ విష్ణుభగవానుడు కూడా సముద్రంలో తపస్సు చేస్తూనే ఉంటాడు. తాను చేసిన పనులకు ఫలితమే లేదంటే కర్మలన్నీ ఎ ఫలమూ లేని వవుతాయి.

లోకులు అదృష్టం వైపే చూస్తూ తటస్థంగా ఉండిపోతారు గదా ! పురుష ప్రయత్నం చేయకుండా దైవాన్నే అనుసరించేవాడు నపుంసకుని భర్తగా పొందిన స్త్రీ వలె నిరర్థకంగా కష్టపడతాడు. స్వర్గలోకంలో అల్పపాపంవలన కూడా ఎంతో భయం కలుగుతుంది. ఆ రీతిగా మానవ లోకంలో శుభా శుభకర్మల వలన అంతగా భయముండదు. చేసిన పురుష ప్రయత్నమే దైవాన్ని అనుసరిస్తుంది. ఏ పనీ చేయనివానికి దైవం కూడా ఏమీ ఇవ్వలేదు. దేవతలలో కూడా ఇంద్రాది పదవులు అనిత్యాలుగా కనిపిస్తున్నాయి. కర్మ లేకపోతే దైవం ఎలా స్థిరంగా ఉండగలుగుతుంది ? ఎవరిని స్థిరంగా నిలుపగలుగుతుంది ? దేవతలు కూడా ఈ లోకంలో ఎవరు పుణ్యకర్మలు చేస్తున్నా ఆమోదించలేరు. తాము పరాభవానికి గురికావలసి వస్తుందన్న శంకతో తీవ్రమైన ఆసక్తిని వారిలో కలిగిస్తారు. ఋషులు, దేవతల మధ్య ఎప్పుడూ పోరుసాగుతూనే ఉంటుంది. అయినా దైవం లేకుండా మాటమాత్రం చేత ఫలితాలు కలుగవు. ఎందుకంటే కర్మల మూలం కూడా దైవ ప్రవర్తనమే. దైవం లేకుండా కర్మ ప్రవృత్తి కూడా ఏర్పడదు. దైవమే ప్రవృత్తికి కూడా మూల కారణం. ఇదే రీతిగా దేవ లోకంలో కూడా దైవికంగానే ఎన్నో గుణాలు లభిస్తాయి. తనకు తానే బంధువు. తనకు తానే శత్రువు. కర్మను చేయటంలో కానీ ! చేయకపోవటంలో కానీ తనకు తానే సాక్షి. పెద్ద పనికి పూనుకొన్నపుడు అంతకుముందు చేసిన చిన్న పని చేయనట్లే అవుతుంది. ఆ పెద్ద పనియే సిద్ధిస్తుంది. కాబట్టి మంచిపని అయినా, చెడ్డ పని అయినా తమ వాస్తవ ఫలితాన్ని అందజేయలేవు.

దేవతలకు పుణ్యమే ఆశ్రయం. పుణ్యం చేతనే సర్వమూ లభిస్తుంది. పుణ్యశీలుడైన నరుని పొంది దైవం ఏం చేయగలుగుతుంది ? గతంలో యయాతి పుణ్యక్షయంతో క్రిందకు నెట్టివేయబడ్డాడు. మరల కూతురి బిడ్డల పుణ్య కర్మలతో స్వర్గానికి చేర్చబడ్డాడు. పూర్వకాలంలో ఐలుడని ప్రసిద్ధికెక్కిన పురూరవరాజర్షి కూడా బ్రాహ్మణుల ఆశీస్సులతో స్వర్గాన్ని పొందగలిగాడు. కోసలరాజైన సౌదాసుడు అశ్వమేధాది యజ్ఞాల ద్వారా సత్కృతిని పొందినవాడు. అయినా మహర్షి శాపం వలన నరభక్షకుడైన రాక్షసుడయ్యాడు. అశ్వత్థామ, పరశురాముడు - ఈ ఇద్దరూ ఋషి పుత్రులు, విలుకాండ్రు. వీరిద్దరూ ఈ లోకంలో పుణ్యకర్మ చేసి కూడా స్వర్గ లోకానికి వెళ్ళలేకపోయారు. వసురాజు రెండవ ఇంద్రునివలె వందయాగాలు చేశాడు. అయినా ఒక్క ఆసత్యవచనంతో పాతాళలోకానికి వెళ్ళాడు. విరోచన కుమారుడైన బలిచక్రవర్తిని దేవతలు ధర్మపాశాలతో బంధించారు. విష్ణువు యొక్క పురుష ప్రయత్నంతో ఆయన పాతాళ నివాసి అయ్యాడు. జనమేజయ మహారాజు

బ్రాహ్మణ స్త్రీలను వధించి కూడా ఇంద్రుని చరణాల నాశ్రయించి, స్వర్గలోకానికి బయలు దేరినప్పుడు దైవమెందుకు నిరోధించలేదు ? వైశంపాయనుడనే విప్రర్షి అజ్ఞానంతో బ్రాహ్మణుని చంపాడు. బాలవధపాపం కూడా అంటింది. అయినా దైవం ఆయనను స్వర్గానికి వెళ్ళకుండా నిరోధించలేదెందుకు ? గతంలో నృగుడనే రాజర్షి మహాయాగంలో మిథ్యా గోదానం చేశాడు (ఒకే గోవును రెండుసార్లు దానం చేశాడు). దానితో ఆయన ఊసరవెల్లిగా జన్మించాడు. ధుంధుమారుడనే రాజర్షి యాగాలు చేస్తూనే ముసల్ఫాడయ్యాడు. అయినా దేవతలు ప్రీతితో ఇచ్చిన స్వర్గఫలాన్ని కాదని గిరి వ్రజంలో నిదురించాడు.

మహాబలులైన ధార్తరాష్ట్రులు పాండవుల రాజ్యాన్ని అపహరించారు. మరల తిరిగి సంపాదించుకొన్నారు. అది భుజబలంతోనే కానీ దైవంవలన కాదు. తపోనియమాలతో కూడి, తీవ్ర వ్రతాలను పాటించే మునులు దైవ బలంతోనే శపిస్తున్నారా ? కర్మ బలంతో కాదా ? లోకంలో మరీ దుర్లభమైన సుఖభోగమంతా ఒక పాపని చేరినా, వెంటనే తొలగిపోతుంది. లోభమోహాలకు లోనైన నరుని దైవం రక్షించలేదు. నిప్పు రవ్వ అయినా గాలికి పైకెగసి మహాగ్నిగా మారినట్లు పురుషార్థంతో కూడిన దైవబలం చక్కగా వర్ధిల్లుతుంది. నూనె అయిపోతే దీపం ఆరిపోయినట్లు, కర్మ క్షీణిస్తే దైవ (ఫలం) నశిస్తుంది. ప్రయత్న రహితుడైన పురుషుడు పెద్ద ధనరాశిని, భోగాలను, స్త్రీలను పొందినా అనుభవించలేడు. నిత్యమూ ప్రయత్నశీలుడు, మహోత్ముడు అయిన పురుషుడు దేవతలు రక్షిస్తూ చక్కగా సమకూర్చిన అర్థాన్ని అనుభవిస్తాడు. దానాలతో ధనాన్ని వ్యయం చేసిన సజ్జనుని అతని కర్మఫలంగా దేవతలు కూడా ఆశ్రయిస్తారు. ఆ ఇల్లు మనుష్య లోకంలో గొప్పదై దేవలోకం వలె కనిపిస్తుంది. దానగుణం లేకపోతే బహువిధ సమృద్ధి కలిగినా, మనుష్యుల ఇళ్ళు దేవతలకు శ్మశానాల వలె కనిపిస్తాయి. జీవలోకంలో పనిచేయనివాడు ఫలితాన్ని పొందలేడు. అపమార్గం నుండి తప్పించటానికి దైవానికి శక్తి లేదు. శిష్యుని ముందుంచుకొని నడిచే గురువువలె దైవం కర్మను ముందు నిలిపి దాని వెనుక నడుస్తుంది. పురుష ప్రయత్నమే దైవాన్ని కూడా అవసరమైన చోటికి నడిపిస్తుంది. ముని సత్తమా ! నేను పురుష ప్రయత్న ఫలాన్ని ప్రత్యక్షంగా చూసి ఉన్నాను. ఉన్నదున్నట్లు నీకు మొత్తం చెప్పాను. నరుడు దైవప్రేరణచే ప్రారంభించిన పురుష ప్రయత్నంతో శాస్త్రోక్త పద్ధతిలో సత్కర్మాచరణం ద్వారా స్వర్గమార్గాన్ని పొందవచ్చు.

7. కర్మఫల వర్ణనము.

యుధిష్ఠిరు డడిగాడు. భరత శ్రేష్ఠా ! మహాత్ములలో నీవు గొప్పవాడవు. సమస్తశుభ కర్మల ఫలాలను గూర్చి అడుగుతున్నాను. వివరంగా చెప్పవలసినది. భీష్ముడు చెప్తున్నాడు. "భారతా ! నీవు నన్నడిగిన దానిని చెపుతాను. యుధిష్ఠిరా ! అది ఋషి రహస్యం. మరణానంతరం మనుష్యులు చిరాభిలషితమైన ఏ గతులను పొందుతారో విను. **ఎవడు ఏయే శరీరంతో ఏయే పని చేస్తే తాను ఆయా శరీరంతో ఆయా కర్మ ఫలితాన్ని అనుభవిస్తాడు. ఏయే అవస్థలో ఏయే శుభాశుభకర్మలను చేస్తే జన్మజన్మలలోనూ ఆయా అవస్థలో ఆ ఫలము అనుభవిస్తాడు.*** ఈ లోకంలో పంచేంద్రియాలతో చేస్తున్న కర్మ ఎప్పుడూ నశించదు. ఈ పంచేంద్రియాలు, మనస్సు కర్మసాక్షులు. అతిథిని ప్రసన్న దృష్టితో చూడటం, మనసా సేవించటం, యథార్థంగా మాటాడటం, వెళుతుంటే వెంటనడవటం, సత్కరించటం – ఈ అయిదు దక్షిణలుగా గృహస్థులు చేయవలసిన యజ్ఞమిది. పరిచయం లేకపోయినా అలసిపోయిన బాటసారికి ప్రసన్న దృష్టితో అన్నంపెట్టిన వానికి మహాపుణ్య ఫలం లభిస్తుంది. వానప్రస్థులై అరుగులపై పడుకొనేవారికి మరుసటి జన్మలో మంచిఇళ్ళు, శయ్యలు లభిస్తాయి. చీరలు, వల్కలాలు ధరించిన వారికి మరో జన్మలో మంచి బట్టలు, ఆభరణాలు దొరుకుతాయి. యోగంలో మనస్సు లగ్నం చేసిన తపోధనునకు మరుసటి జన్మలో మంచి వాహనాలు, రథాలు లభిస్తాయి. అగ్నులను ఉపాసించే రాజులకు జన్మాంతరంలో పౌరుషం సిద్ధిస్తుంది. రసాలను పరిత్యజించినవాడు సౌభాగ్యాన్ని పొందుతాడు. మాంసాన్ని పరిత్యజించినవాడు పశువులను, పుత్రులను పొందుతాడు. తల క్రిందులుగా కానీ, నీటిలో నిలిచి కానీ, ఎప్పుడూ ఒంటరిగా కానీ శయనించినవాడు కోరిన గతిని పొందుతాడు. అతిథి పూజలో పాద్యాన్ని, ఆసనాన్ని, దీపాన్ని, అన్నాన్ని, వసతి గృహాన్ని ఇవ్వాలి. అది పంచదక్షిణలు గల యజ్ఞం.

వీరాసనంతో రణభూమిలో ప్రవేశించి, వీరశయ్యపై శయనించి, వీరస్థానాన్ని (స్వర్గాన్ని) చేరినవారికి అక్షయ లోకాలు లభిస్తాయి. కోరికలన్నీ తీరుతాయి. రాజా ! దానం వలన ధనం, మౌనం వలన ఆజ్ఞాపించగలగటం, తపస్సుతో ఉపభోగాలు,

---

* **యేన యేన శరీరేణ యద్ యత్ కర్మ కరోతి యః ।**
తేన తేన శరీరేణ తత్ తత్ ఫలముపాశ్నుతే ॥ 3
యస్యాం యస్యామవస్థాయాం యత్ కరోతి శుభాశుభమ్ ।
తస్యాం తస్యామవస్థాయాం భుంక్తే జన్మని జన్మని ॥ 4

బ్రహ్మచర్యంతో ఆయువు లభిస్తాయి. **అహింసాఫలంగా రూపాన్ని, ఐశ్వర్యాన్ని, ఆరోగ్యాన్ని పొందగలడు.** పండ్లను, దుంపలను తినేవాడు రాజ్యాన్ని, పర్ణభక్షకుడు స్వర్గాన్ని పొందుతారు. రాజా ! ప్రాయోపవేశం చేసినవాడు సర్వత్ర సుఖాన్ని పొందుతాడు. శాకాహార దీక్ష గొన్నవాడు. గోబలాన్ని, తృణ భక్షకుడు స్వర్గాన్ని పొందగలరు. ముమ్మారు స్నానం చేసినవాడు స్త్రీ సుఖాన్ని, గాలిని భుజించి నిలిచినవాడు యజ్ఞఫలాన్ని, సత్యంతో స్వర్గాన్ని, దీక్షతో ఉత్తమ వంశాన్ని పొందవచ్చు. బ్రాహ్మణుడు నిత్యమూ నీటినే ఆహారంగా తీసుకొంటూ, అగ్నిహోత్రం చేస్తూ, మంత్రసాధన చేస్తుంటే రాజ్యం లభిస్తుంది. నిరాహార వ్రతాన్ని చేసినవాడు స్వర్గలోకానికి వెళ్తాడు. రాజా ! పండ్రెండు సంవత్సరాల పాటు వ్రత ధారియై, ఆహారాన్ని పరిత్యజించి, తీర్థస్నానం చేసినవాడు స్వర్గానికి పైనున్న స్థానాన్ని పొందుతాడు. సర్వవేదాధ్యయనం చేసినవాడు వెంటనే దుఃఖ విముక్తుడు కాగలడు. మానసికంగా ధర్మాచరణం చేసేవాడు స్వర్గలోకాన్ని పొందుతాడు. తృష్ణ ప్రాణాంతకమైన రోగం. దుర్మతులు దానిని విడనాడటం కష్టం. శరీరం శిథిలమైనా అది శిథిలం కాదు. ఆ తృష్ణను విడిచిపెడితే సుఖం లభిస్తుంది.

వేలకొలది ఆవుల మందలో ఉన్నా దూడ తల్లిని గుర్తించినట్లు ముందు చేసిన కర్మ కర్తను అనుసరిస్తుంది. పూలు, పండ్లు ఎవరి ప్రేరణా లేకపోయినా తమ కాలాన్ని అతిక్రమించనట్లు పురాకృత కర్మ తగిన వేళలో ఫలితమిస్తుంది. మనిషి ముసలివాడవుతుంటే వెంట్రుకలు వదలిపోతాయి. పెరిగే కొద్దీ దంతాలు శిథిలమవుతాయి. కళ్లు, చెవులు కూడా శక్తిని కోలుపోతాయి. తృష్ణ ఒక్కటే శిథిలం కాదు. **తండ్రిని తృప్తిపరిస్తే బ్రహ్మను ప్రసన్నుని చేసికొన్నట్లే. తల్లిని తృప్తిపరిస్తే భూదేవిని తృప్తిపరిచినట్లే. గురువును తృప్తిపరిస్తే పరమాత్మను పూజించినట్లే. ఈ మూడింటిని ఆదరించినవాడు సర్వధర్మాలను ఆదరించినట్లే.** ఈ మూడింటిని నిరాదరించిన వాని సమస్త క్రియలు నిష్ఫలాలే". వైశంపాయనుడు చెప్తున్నాడు. భీష్ముని ఈ మాటలు విని కురు పుంగవులు ఆశ్చర్యానికి లోనయ్యారు. అప్పుడు మనసా ఆనందించి ప్రసన్నులయ్యారు. మంత్రాలను వ్యర్థంగా ఉపయోగిస్తే వచ్చే పాపం, సోమాన్ని వ్యర్థంగా నూరి రసాన్ని తీస్తే వచ్చే పాపం, వ్యర్థంగా అగ్నికి అహుతుల నిస్తే వచ్చే పాపం, నిరర్థకంగా మాటా మాటలవలన వస్తుంది. రాజా ! శుభాశుభఫల ప్రాప్తికి సంబంధించి వ్యాసముని చెప్పిన దంతా చెప్పాను. ఇంకా ఏం వినాలనుకొంటున్నావు ?

8. ఉత్తమ బ్రాహ్మణ మహిమ.

యుధిష్ఠిరు డడిగాడు. "భారతా ! ఎవరు పూజింపదగినవారు ? నమస్కరింపదగిన వారెవరు ? ఎవరికి నమస్కరిస్తున్నావు ? రాజా ! నీవు దేన్ని కోరుతున్నావు ? ఇదంతా నాకు చెప్పు. పెద్ద ఆపదలో ఉన్నా నీ మనస్సు దేనిపై లగ్నమై ఉంది ? ఈ సమస్త మానవ లోకం మీదనా ? లేక పరలోకం మీదనా ?" భీష్ముడు చెప్తున్నాడు. "పరబ్రహ్మనే ఉత్తమధనంగా, ఆత్మ జ్ఞానమే స్వర్గంగా, స్వాధ్యాయాన్నే తపస్సుగా భావించే బ్రాహ్మణులను నేను ఇష్టపడతాను. బాలుర నుండి వృద్ధులదాకా అందరూ తరతరాలుగా వంశాచారంగా వస్తున్న ధర్మభారాన్ని మోస్తూ, ఎప్పుడూ దుఃఖపడక ఉంటారో వారిని నేను ఇష్టపడతాను. వినయంతో విద్యలనభ్యసిస్తూ, జితేంద్రియులై, మృదువుగా భాషిస్తూ, శాస్త్రజ్ఞాన సదాచార సంపన్నులై, ఆత్మజ్ఞాన వేత్తలైన సత్పురుషులను ఇష్టపడతాను. నాయనా ! యుధిష్ఠిరా ! సదస్సులలో హంసల సమూహాల వలె, దివ్యమేఘ ధ్వనులవలె, మంగళప్రదాలై, మనోహరాలైన మంచి మాటలను, చక్కని ఉచ్చారణతో వినిపించే వారిని ఇష్టపడతాను. అటువంటి వారిని సేవించే రాజుకు ఇహపరాలలో వారు సుఖాన్ని కలిగించగలవారు. ప్రతిదినమూ వారి మాటలను వింటూ, సదస్సులలో మన్ననలను పొందుతూ జ్ఞాన విజ్ఞాన సంపన్నులయిన వారుంటారు. వారన్నా నాకిష్టమే.

యుధిష్ఠిరా ! బ్రాహ్మణుల తృప్తికోసం సర్వదా పవిత్ర భావంతో చక్కగా, శుచిగా వండిన రుచికరమైన అన్నాన్ని పెట్టే వారంటే నేను ఇష్టపడతాను. రణరంగంలో పోరాడటం సాధ్యమే. కానీ అసూయ లేకుండా దానం చేయటం కష్టం. లోకంలో శూరులు, వీరులు వందలమంది ఉన్నారు. కానీ వారిని పరిగణించే సమయంలో దానశూరులు మిగులుతారు. సౌమ్యా ! నేను ఉత్తమ వంశం, ధర్మ ప్రవృత్తి, తపోవిద్యా పరాయణత్వం గల బ్రాహ్మణుడను లేదా ఏదో ఒక స్థాయి బ్రాహ్మణుడను కాగలిగితే ధన్యుడనైనట్లు భావిస్తాను. పాండునందనా ! నాకు లోకంలో నీ కన్న ఇష్టమైన వారు లేరు. కానీ భరతర్షభా ! బ్రాహ్మణులు మాత్రం నీకన్న ప్రియమైన వారే ! కురుశ్రేష్ఠా ! విప్రులు నాకు నీకన్న కూడా ప్రియతములనటం సత్యమే అయితే ఆ సత్యఫలంతో నేను నా తండ్రి - శాంతను మహారాజు ఉన్న లోకాలకు వెళ్ళాలి. నాకు బ్రాహ్మణులకన్నా నా తండ్రి కానీ, అలాగే నా పితామహుడు కానీ, ఇతరులైన ఆత్మీయులు కానీ ప్రియతరులు కాదు. సత్కార్యాలలో ఎప్పుడూ బ్రాహ్మణుల విషయంలో నేను చిన్నదయినా కావచ్చు,

పెద్దదయినా కావచ్చు. ఏ తప్పు కొంచెం కూడా చేయలేదు. పరంతపా ! మనసా, వాచా, కర్మణా కూడా నేను బ్రాహ్మణులకు నేను చేసిన మేలు వలననే ఇప్పుడు ఈ స్థితిలో కూడా నేను తాపానికి లోను కాకుండా ఉన్నాను.

నన్ను బ్రాహ్మణ భక్తుడన్నారు. ఆ మాటతోనే నేను సంతోషించాను. బ్రాహ్మణ సేవ సర్వపవిత్ర కర్మల కన్న పరమ పవిత్రమైన కార్యం. నాయనా ! బ్రాహ్మణులను సేవించేవారు పొందే పవిత్రలోకాలు నా కళ్ళ ఎదుట కనిపిస్తున్నాయి. నేను త్వరగా, శాశ్వతంగా ఉండేందుకు అక్కడకు చేరాలి. యుధిష్ఠిరా ! లోకంలో స్త్రీలకు భర్తనాశ్రయించి ఉండటమే ధర్మమైనట్లు, క్షత్రియునకు కూడా బ్రాహ్మణుల నాశ్రయించి ఉండటమే ధర్మం. అదే గతి. మరొక గతిలేదు. బ్రాహ్మణుడే వారికి దేవుడు. వంద సంవత్సరాల వయస్సు గల క్షత్రియుడు, పది సంవత్సరాల వయస్సు గల బ్రాహ్మణుడు – వీరిద్దరూ తండ్రి కొడుకుల వంటివారు. కానీ వారిలో బ్రాహ్మణుడే తండ్రి వంటివాడు. భర్తలేని స్త్రీ మరిదిని భర్తను చేసికొన్నట్లు భూమి కూడా బ్రాహ్మణుడు దొరకనపుడు క్షత్రియుని భర్తను చేసికొంటుంది.

బ్రాహ్మణుని అనుజ్ఞతోనే రాజు పురోహిత సహితంగా రాజ్యాన్ని స్వీకరించాలి. బ్రాహ్మణ రక్షణ చేస్తే రాజుకు స్వర్గం లభిస్తుంది. బ్రాహ్మణుడు కోపిస్తే తాను నరకానికి వెళతాడు.

కురుసత్తమా ! బ్రాహ్మణులను పుత్రులనువలె కాపాడాలి. గురువులనువలె ఉపాసించాలి. అగ్నినివలె సేవించాలి. సరళ స్వభావులు, సజ్జనులు, సత్యశీలురు, సర్వప్రాణిహితంపై ఆసక్తి కలవారు అయిన బ్రాహ్మణులను సర్వదా సేవించాలి. వారు కోపిస్తే పాముపంటివారని గ్రహించాలి. విప్రుల భార్యలను చక్కగా రక్షిస్తూ తల్లిని వలె వారిని దూరం నుండి పూజించాలి. యుధిష్ఠిరా ! బ్రాహ్మణుల తేజస్సును, తపస్సును చూసి నిత్యమూ భయపడాలి. వారి దగ్గర తమ తేజస్తపస్సులను ప్రక్కన పెట్టాలి. మహారాజా ! బ్రాహ్మణ తపస్సు, క్షత్రియ తేజస్సు – ఈ రెండింటి ఫలం వెంటనే బయటపడుతుంది. కానీ తపస్సంపన్నులైన బ్రాహ్మణులు కోపిస్తే క్షత్రియుని తపస్సుతో చంపగలరు. గోపాలుడు నిత్యమూ కర్ర చేతబట్టి గోవులను రక్షించినట్లు క్షత్రియుడు కూడా బ్రాహ్మణులనూ, వేదాన్నీ రక్షించాలి. ధర్మబుద్ధిగల బ్రాహ్మణులను తండ్రి, పిల్లలను రక్షించినట్లు రక్షించాలి క్షత్రియుడు. బ్రతకటానికి అవసరమైనది వారి ఇంట ఉన్నదా ? లేదా ? అని గమనిస్తుండాలి.

9. నృగాల వానర సంవాదము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "పితామహా ! మహాతేజస్వీ ! ధర్మధారులలో శ్రేష్ఠుడవు నీవు. బ్రాహ్మణులకు మాట ఇచ్చి, మోహం కారణంగా దానాన్ని ఇవ్వటం లేదు కొందరు. మాట ఇచ్చి తప్పిన ఆ దురాత్ములైన నరులు ఏ లోకాలకు పోతారు ? అది నాకు యథాతథంగా చెప్పు". భీష్ముడు చెప్తున్నాడు. "బ్రాహ్మణులకు మాట ఇచ్చి, ఆ వస్తువు కొంచెమైనా, అధికమైనా సరే ! ఇవ్వని వాని ఆశలన్నీ నపుంసకునికి సంతాన ఫలంవలె నశించిపోతాయి. భారతా ! జీవుడు ఒక రాత్రి పుడతాడు. మరొక రాత్రి మరణిస్తాడు. ఈ రెండింటి మధ్యలో జీవించినంత కాలం తాను చేసిన పుణ్యం, జీవితాంతం చేసిన హోమాలు, ఇచ్చిన దానాలు, సాగించిన తపస్సు అన్నీ ఆ మాటతప్పిన పాపంవలన నశించిపోతాయి. ఈ విషయాన్ని ధర్మశాస్త్రవేత్తలైన జనులు పరమయోగంతో కూడిన బుద్ధితో ఆలోచించి చెప్పారు. మాట తప్పిన వాడు శ్యామకర్ణాలు గల వేయి గుర్రాలను దానం చేస్తే ఆ పాపం నుండి విముక్తి పొందుతాడని ధర్మశాస్త్ర మెరిగిన పండితులు చెప్తుంటారు. ఈ విషయంలో శృగాలవానరసంవాద రూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. గతంలో మానవ జన్మలో మిత్రులైన ఇద్దరు ఉండేవారు. మరుసటి జన్మలో వారు ఒకరు నక్కగా మరొకరు కోతిగా పుట్టారు. ఆ తరువాత శ్మశాన మధ్యంలో శవాలను తింటున్న నక్కను చూసి, గత జన్మ విషయాన్ని స్మరించి కోతి నక్కతో ఇలా అన్నది. "గతజన్మలో దారుణ పాపకృత్యమేదైనా చేశావా ? తత్ఫలితంగా శ్మశానంలో పాడయిపోయి, చెడువాసన గల శవాలను తింటున్నావు". కోతి అలా అడగగానే నక్క ఇలా బదులిచ్చింది. "బ్రాహ్మణునికి ఇస్తానని మాట ఇచ్చి నేను దాని నివ్వలేదు. కోతీ ! ఆ కారణంగా హీన జన్మనెత్తాను. అందువలననే ఆకలివేస్తే ఇటువంటి ఆహారాన్నే తింటున్నాను. అప్పుడు నక్క" నీవు ఏ పాపకర్మ చేసి కోతిగా పుట్టావు ?" అని కోతి నడిగింది. వానరమిలా చెప్పింది. "నేను ఎప్పుడూ బ్రాహ్మణుల పండ్లను దొంగిలించే దాన్ని. అందువలన కోతినయ్యాను. కాబట్టి వివేకి ఎప్పుడూ బ్రాహ్మణుల సొమ్మును అపహరింపదగదు. వారితో ఎప్పుడూ గొడవపడరాదు. మాట ఇస్తే దానిని తప్పక ఇవ్వాలి." భీష్ముడు చెప్తున్నాడు. "రాజా ! ధర్మజ్ఞుడైన ఒక బ్రాహ్మణుడు ఈ పురాతన కథను చెపుతుంటే నేను విన్నాను. పాండవా ! రాజా ! మరలా గతంలో కృష్ణుడు ఒక బ్రాహ్మణునకు చెపుతుండగా కూడా విన్నాను.

బ్రాహ్మణుల ధనాన్ని అపహరింపదగదు. వారిని ఎప్పుడూ క్షమించాలి.

బ్రాహ్మణులు బాలురయినా, దరిద్రులయినా, దీనులయినా వారిని అవమానింపరాదు. బ్రాహ్మణునకు మాట ఇస్తే దానిని తప్పక ఇచ్చి తీరాలనీ, ఆశాభంగం చేయరాదని నాకు బ్రాహ్మణులు నిత్యమూ ఉపదేశించేవారు. రాజా ! ముందుగా బ్రాహ్మణునకు ఆశపెడితే ఆయన చక్కగా సమిధలు వేసిన అగ్నివలె ప్రజ్వలిస్తాడంటారు. రాజా ! ముందు పుట్టిన ఆశ భంగపడితే ఆ బ్రాహ్మణుడు తీవ్ర కోపానికి లోనయి, అగ్ని కసవును తగలబెట్టినట్టు చూపుతోనే మాటతప్పిన వానిని దగ్ధం చేయగలడు. భారతా ! ఆ బ్రాహ్మణుడే ఆనందించినప్పుడు మాటమాత్రంతో అభినందిస్తే చాలు, ఆ రాజ్యానికి అతడు వైద్యుని వంటివాడు కాగలడు. అలాగే దాతయొక్క పుత్రులను, మనుమలను, పశువులను, బంధువులను, మంత్రులను, నగరాన్ని, గ్రామాలను ప్రశాంతపరచి వాటిని శుభాలతో పోషించగలడు. ఈ లోకంలో, ఈ భూతలంలో ఈ బ్రాహ్మణ తేజస్సు వేయి వెల్గులు గల సూర్యుని వలె కనిపిస్తుంటుంది. కాబట్టి యుధిష్ఠిరా ! భవిష్యత్తులో మంచి పుట్టుక పుట్టాలంటే మాట ఇచ్చిన మేరకు దానం చేసియే తీరాలి. బ్రాహ్మణునకు దానం చేస్తే నిశ్చయంగా ఉత్తమ స్వర్గాన్ని ప్రత్యేకంగా పొందవచ్చు. దానమన్నది గొప్పపని. ఇక్కడ చేసిన దానం వలననే దేవతలు, పితరులు తృప్తిపడతారు. కాబట్టి వివేకి బ్రాహ్మణులకు దానాలు ఇవ్వాలి. బ్రాహ్మణుడు మహాతీర్థం వంటివాడు. కాబట్టి ఏ సమయంలో వచ్చినా సత్కరించకుండా పంపగూడదు.

10. శూద్రముని సంవాదము.

యుధిష్ఠిరు అడిగాడు. "పితామహా ! ఎవరైనా స్నేహం వలన కానీ, సౌహార్దం వలన కానీ తనకన్న హీనజాతి వానికి ఉపదేశం చేస్తే ఆ రాజర్షికి దోషమంటుతుందా ? అంటారా ? దీనిని యథాతథంగా వ్యాఖ్యానించవలసినదిగా కోరుతున్నాను. ధర్మగతి సూక్ష్మమైనది దాని విషయంలో మానవులు మోహానికి లోనవుతూనే ఉంటారు". భీష్ముడు చెప్తున్నాడు. రాజా ! ఈ విషయమై గతంలో ఋషులు చెప్పగా నేను విని ఉన్నాను. దానిని నీకు యథాక్రమంగా చెపుతాను. విను. ఎవ్వరూ కూడా జాతిహీనునకు ఉపదేశించరాదు. అలా ఉపదేశిస్తే ఆ ఉపాధ్యాయుడు పెద్ద తప్పు చెప్పినట్లే అని అంటుంటారు. రాజా ! దానికొక నిదర్శనాన్ని నేను చెపుతా విను. యుధిష్ఠిరా ! ఇదిగతంలో దుఃఖంలో నున్న ఒక హీనజాతి వానికి చేసిన ఉపదేశానికి సంబంధించినది.

అందమైన హిమగిరి పార్శ్వభాగంలో బ్రాహ్మణుల ఆశ్రమాలలో జరిగిన సంఘటన

ఇది. అక్కడ అనేక వృక్ష సమూహాలతో కూడి పుణ్యప్రదమైన ఆశ్రమమొకటుండేది. ఎన్నో పాదలతో, తీగెలతో నిండి, జంతువులు పక్షులు సేవించే అందమైన ఆశ్రమమది. విరిసిన వనాలతో సిద్ధ చారణ సమూహాలతో కూడిన దది. వ్రతధారులెందరో అక్కడుంటారు. తాపసులు దానిని సేవిస్తారు. మహాభాగులై, సూర్యునివలె అగ్నివలె ప్రకాశించే బ్రాహ్మణు లక్కడుంటారు. భరతశ్రేష్ఠ ! నియమ వ్రత సంపన్నులు, దీక్షితులు, మితాహారులు, జితేంద్రియులు అయిన తాపసులతో అది నిండి ఉంటుంది. భరతర్షభా ! వేదాధ్యయన ఘోషలతో అది నివదిస్తుంటుంది. వాలఖిల్యులు, అనేక సన్యాసులు ఆ ఆశ్రమాన్ని సేవిస్తారు. ఆ ఆశ్రమానికి దయామయుడైన ఒక శూద్రుడు ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ వచ్చాడు. తాపసులు ఆయనను సత్కరించారు. భారతా ! మహాతేజస్వులై, దేవతా సమానులై, వివిధ దీక్షలను పూని ఉన్న ఆ మునిగణాలను చూసి ఆయన ఎంతో ఆనందించాడు. అప్పుడాయనకు తపస్సు చేయాలని బుద్ధి పుట్టింది. దానితో కులపతి పాదాలను పట్టి ఆయన ఇలా అన్నాడు. "ద్విజశ్రేష్ఠ ! తమ అనుగ్రహంతో నేను ధర్మజ్ఞానాన్ని పొందగోరుతున్నాను. కాబట్టి పూజ్య ! నాకు సంన్యాసాన్ని ఇప్పించాలి. భగవన్ ! సజ్జనశ్రేష్ఠ ! నేను జాతిచే తక్కువవాడను. శూద్రుడను. తమకు సేవ చేయదలచుకొన్నాను. ఆశ్రితుడను నన్ను అనుగ్రహించండి". కులపతి ఇలా అన్నాడు. "శూద్రుడు ఈ ఆశ్రమంలో సంన్యాసాన్ని స్వీకరించి ఉండగూడదు. ఇక్కడే ఉండాలని కోరిక ఉంటే ఇక్కడ సేవా తత్పరుడవై ఉండు. శుశ్రూష ద్వారా పరలోకాలను పొందగలవు. అనుమానం లేదు".

భీష్ముడు చెప్తున్నాడు. రాజా ! ఆ ముని అలా చెప్పిన తరువాత ఆ శూద్రుడు ఇలా ఆలోచించాడు. ఇక్కడ నేనేం చేయాలి ? నాకు సంన్యాస ధర్మం మీదనే శ్రద్ధ ఉంది. సరే ! తెలిసింది. ఆ నియమాన్ని అలాగే ఉండనీ ! నాకు ఇష్టమైనదీ నేను చేస్తాను. అలా భావించి ఆ ఆశ్రమ పదం నుండి దూరంగా పోయి ఆయన పర్ణశాలను నిర్మించుకొన్నాడు. అక్కడ యజ్ఞ వేదికలను, నివాస స్థానాన్ని, దేవతా నిలయాలను ఏర్పరచి నియమబద్ధుడై మునివలె అయి జీవించసాగాడు. స్నానాలు, నియమ పాలనాలు, దేవతా నిలయాలలో బలిదానాలు, హోమాలు చేసి దేవతలను పూజించసాగాడు. సంకల్పాలను నియంత్రించి, ఫలాలనే తింటూ, జితేంద్రియుడై ఉండేవాడు. నిత్యమూ తన దగ్గరున్న ఔషధులతో, పండ్లతో ఆశ్రమానికి వచ్చిన అతిథులను యథావిధిగా అర్చించేవాడు. ఈ రీతిగా ఆ ముని చాలా కాలం గడిపాడు. ఆపై ఒకరోజు ఒక ముని సత్సంగానికై ఆ ఆశ్రమానికి వచ్చాడు. యథావిధిగా స్వాగత సత్కారాలతో ఆ మునిని సంతోషపెట్టాడు.

ఆపై అనుకూల విషయాలను ప్రస్తావిస్తూ ఆయన రాకను గురించి అడిగాడు. ఈ రీతిగా ఎన్నోసార్లు ఆ ఋషి శూద్రమునిని చూడటానికి ఆయన ఆశ్రమానికి వచ్చాడు.

ఆపై ఒకసారి ఆ శూద్రుడు ఆ తాపసితో "పితృకార్యం చేస్తాను. నన్ను అనుగ్రహించి, సహకరించాలి" అని అడిగాడు. 'అలాగే' అని ఆ బ్రాహ్మణుడన్నాడు. భరతర్షభా ! ఆ శూద్రుడు శుచియై ఆ మహర్షికై పాద్యాన్ని తీసుకొనివచ్చాడు. భరతర్షభా ! ఆపై దర్భలను, అడవిలో పుట్టిన ఓషధులను, పవిత్రాసనాన్ని, దర్భలచాపను కొనితెచ్చాడు. ఆ తరువాత అప్రదక్షిణంగా తీసుకొనిపోయి, పశ్చిమాగ్రంగా చాపను పరిచాడు. అశాస్త్రీయంగా ఉన్నా ఆ ప్రవర్తనను చూసి ఆ ముని శూద్రునితో ఇలా అన్నాడు. "ఈ దర్భల చాపను ప్రాగగ్రంగా పరు. నీవు శుచివై ఉత్తరాభిముఖంగా కూర్చో" ఆ ఋషి చెప్పినది చెప్పినట్లు చేశాడు ఆ శూద్రముని. మేధావి అయిన ఆ శూద్రముని దర్భలు, అర్ఘ్యం, హవ్యకవ్య విధి - మొదలయినదంతా ఆ తాపసి చెప్పిన రీతిగా యథాతథంగా పాటించాడు. ఋషి ద్వారా పితృకార్యం పూర్తి అయింది. పితృకార్యం పూర్తి కాగానే ఆ ఋషి సెలవు తీసికొని వెళ్ళిపోయాడు. శూద్రముని మరలా ధర్మమార్గంలో నిలిచాడు. ఆపై చాలా కాలానికి ఆ శూద్రముని తపిస్తూనే ఆ వనంలోనే మరణించాడు. తాను చేసిన పుణ్యఫలంగా మహారాజవంశంలో మహా తేజస్వియై పుట్టాడు. నాయనా ! అలాగే ఆ ఋషి కూడా కాల ధర్మంచెందాడు. భరతర్షభా ! ఆ విప్రుడు పురోహితవంశంలో జన్మించాడు.

ఈ రీతిగా జన్మించిన ఆ శూద్రుడు, ఆ ముని అప్పుడు క్రమంగా వృద్ధి చెందుతూ విద్యలలో కూడా ఇద్దరూ నేర్పరులయ్యారు. ఆ ఋషి వేదాలలో, అథర్వవేదంలో పారంగతుడయ్యాడు. కల్ప ప్రయోగంలోనూ, జ్యోతిషంలోనూ పండితుడయ్యాడు. సాంఖ్యసిద్ధాంతంపై కూడా ఆయనకు పరమప్రీతి వర్థిల్లింది. రాజా ! తండ్రి మరణించగానే, ఆశౌచం పూర్తికాగానే ఆ రాజకుమారుడు (శూద్రముని) అమాత్యులచే రాజుగా అభిషిక్తుడయ్యాడు. తాను అభిషిక్తుడు కాగానే ఆ రాజకుమారుడు ఆ ఋషిని పురోహితునిగా నియమించాడు. ఆ ఋషిని పురోహితుని చేసికొని ఆ రాజకుమారుడు సుఖంగా వసించాడు. ప్రజలను రక్షిస్తూ ధర్మబద్ధంగా రాజ్యపాలన చేశాడు. ఆ పురోహితుడు నిత్యమూ పుణ్యాహవాచనం చేసేవాడు. నిరంతరంగా ధర్మకార్యాలు జరిపించేవాడు.

ఆ పురోహితుని చూసి రాజు అప్పుడప్పుడు చిరునవ్వు నవ్వేవాడు. అప్పుడప్పుడు పెద్దగా నవ్వేవాడు. రాజా ! ఈ రీతిగా ఆ రాజు చాలాసార్లు పురోహితుని పరాభవించాడు. పురోహితుడు కూడా చాలాసార్లు రాజు ప్రవర్తనను గుర్తించాడు. అదేపనిగా నవ్వుతున్న

రాజును చూసి ఆయనకు కోపం వచ్చింది. ఆపై ఒకసారి పురోహితుడు ఏకాంతంలో రాజును కలిసి అనుకూల విషయాలు ప్రస్తావిస్తూ రాజును ప్రసన్నుని చేసికొన్నాడు. భరతర్షభా ! ఆపై ఆ పురోహితుడు రాజుతో ఇలా అన్నాడు. "మహాతేజస్వీ ! నీనుండి ఒక వరాన్ని కోరుతున్నాను". రాజు అన్నాడు. "అయ్యో ! ద్విజోత్తమా ! ఒక్క వరమేమిటి ? నీకు వందవరాలనయినా ఇస్తాను. స్నేహం వలన, గౌరవంవలన నీకు ఇవ్వకూడనిదంటూ ఏదీ లేదు". పురోహితుడన్నాడు. "రాజా ! నీవు ఆనందంగా ఇస్తే ఒక్క వరం చాలు. 'ఇస్తా'నని మాట ఇమ్ము. ఈ విషయంలో సత్యమే చెప్పు. అసత్యమాడవద్దు". 'అలాగే' అని ఆ రాజు పురోహితునకు వరమిచ్చి" నాకు తెలిస్తే చెప్తాను. తెలియపోతే చెప్పను" అని అన్నాడు. పురోహితుడడిగాడు. "నిత్యమూ పుణ్యాహవాచన సమయంలో, నిరంతరం సాగే ధర్మకార్యాలలో, శాంతి హోమాల వేళలో సర్వదా నన్ను చూసి ఎందుకు నవ్వుతున్నావు ? రాజా ! నీవు పరిహసిస్తుంటే నా మనస్సు సిగ్గుపడుతోంది. మాట తీసికొని అడుగుతున్నాను. మాట మార్చి చెప్పగూడదు. నీ పరిహాసానికి స్పష్టమైన కారణముండి ఉంటుంది. అది కారణం లేని నవ్వు కాదు. నాకు చాలా కుతూహలంగా ఉన్నది. నాకు ఉన్నదున్నట్టు చెప్పు.

రాజు చెప్తున్నాడు. "బ్రాహ్మణా ! నీవలా అంటే చెప్పకూడని దానినైనా తప్పక చెప్పవలసినదే. ద్విజా ! సావధానచిత్తంతో వినుము. ద్విజశ్రేష్ఠా ! గత జన్మలో మన మధ్య జరిగినది వినుము. నాకు గత జన్మ స్మృతి ఉంది. బ్రాహ్మణా ! ఏకాగ్రతతో వినుము. ద్విజశ్రేష్ఠా ! గత జన్మలో నేను శూద్రుడను. అయినా తీవ్ర తపస్సు చేశాను. అప్పుడు నీవు కూడా తీవ్ర తపస్సు చేసిన ఋషివే. అప్పుడు నా మీద ఉన్న ప్రేమతో, నన్ను అనుగ్రహించాలన్న ఆలోచనతో పితృకార్యంలో నీవు నాకు ఉపదేశం చేశావు. మునిసత్తమా ! దర్భలచాపను పరచటంలో, దర్భల వినియోగంలో, హవ్యకవ్య విషయంలో నాకు ఉపదేశం చేశావు. ఆ కర్మ దోషం వలన నీవు పురోహితుడుగా పుట్టావు. విప్రేంద్రా ! నేను రాజునయ్యాను. కాలం ఎంత తారుమారుగా ఉంటుందో చూడు. నాకు ఉపదేశించినందు వలన నీవు ఈ ఫలితాన్ని పొందావు. బ్రహ్మస్వరూపా ! ద్విజోత్తమా ! ఈ కారణం వలన నిన్ను చూసి నవ్వుతున్నాను. నిన్ను పరాభవించాలని కాదు. నాకు నీవు గురువువు. కాలం తారుమారయినందువలన నాకు కోపం. నా మనస్సు ఎంతో తపిస్తోంది. నేను మన గత జన్మను నీకు గుర్తు చేస్తున్నాను. అందువలన నిన్ను చూసి నవ్వుతున్నాను. ఈ రీతిగా

నీ తీవ్ర తపస్సు నాకు ఉపదేశం చేసినందువలన నశించింది. ఇప్పుడు పురోహిత కర్మను వీడి నీవు రాబోవు జన్మను గురించి ఆలోచించు. ద్విజా ! నీవు ఇంతకన్న అధమ జాతిలో జన్మించగూడదు. విప్రా ! కావలసినంత ధనం తీసుకో. సజ్జన శ్రేష్ఠా ! పవిత్రహృదయుడవు కమ్ము". భీష్ముడు చెప్తున్నాడు. "ఆపై రాజు నుండి సెలవు తీసుకొని ఆ విప్రుడు ధనం, భూమి, గ్రామాలు మొదలయిన దానాలన్నీ విరివిగా బ్రాహ్మణులకిచ్చాడు. ద్విజోత్తములు చెప్పిన రీతిగా కృచ్ఛ్రవ్రతాలను ఎన్నింటినో చేశాడు. తీర్థాలకు పోయి అక్కడ వివిధ దానాలను చేశాడు. బ్రాహ్మణులకు గోవులను కూడా దానం చేసి పవిత్ర హృదయుడై ఆ మనస్వి అదే ఆశ్రమానికి వెళ్ళి తీవ్ర తపస్సు చేశాడు. రాజసత్తమా ! ఆ తరువాత ఆ బ్రాహ్మణుడు ఉత్తమ సిద్ధిని పొందాడు. ఆ ఆశ్రమంలో నివసించే వారికి నచ్చినవాడు అయ్యాడు. రాజశ్రేష్ఠా ! తాను ఋషి అయి కూడా ఈ రీతిగా ఎంతో కష్టానికి లోనయ్యాడు. కాబట్టి జాతిహీనుడైన జనునికి బ్రాహ్మణుడు ఉపదేశించరాదు.

రాజా ! బ్రాహ్మణుడు సర్వదా జాతిహీనునకు ఉపదేశించటం విడనాడాలి. అలా ఉపదేశించే ద్విజుడు కష్టాలు పడతాడు రాజశ్రేష్ఠా ! బ్రాహ్మణుడు వాచా ఎప్పుడు ఉపదేశం చేయాలని కోరుకొనరాదు. ఒకవేళ ఉపదేశిస్తే జాతిహీనునకు కొంచెం కూడా ఉపదేశింపరాదు.

రాజా ! బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు. ఈ ముగ్గురు ద్విజన్ములు. వీరికి ఉపదేశిస్తే బ్రాహ్మణునకు దోషం లేదు. కాబట్టి సజ్జనులు ఎవరి ముందు ఎప్పుడూ ఏ ఉపదేశమూ చేయకూడదు. ధర్మగతి సూక్ష్మమైనది. అంతఃకరణ శుద్ధి లేనివారు దానిని గ్రహించలేరు. అందువలననే మునులు మౌనంగానే సాదరంగా దీక్షనిస్తారు. రాజా ! చెడ్డమాటలు వస్తాయేమో అన్న భయంతో ఏమీ మాటాడరు. ధార్మికులు, గుణసంపన్నులు, సత్యమూ, నిజాయితీ కలవారైనా తగని మాటలు పలికితే దుష్కర్మ ఫలాన్ని పొందవలసి వస్తుంది. ఎప్పుడూ, ఎవ్వరికీ ఉపదేశాలు చేయగూడదు. ఉపదేశం వలననే బ్రాహ్మణుడు ఆ పాపాన్ని పొందాడు. కాబట్టి ధర్మాన్ని అభిలషించే వివేకి బాగా ఆలోచించి మాటాడాలి. సత్యాసత్యాలను కలిపి చేసిన ఉపదేశం హాని కలిగిస్తుంది. ఎవరైనా అడిగితే బాగా ఆలోచించి శాస్త్రీయ నిశ్చయాన్ని చెప్పాలి. ధర్మాన్ని పొందించే ఉపదేశాన్నే చేయాలి. ఉపదేశానికి సంబంధించి సర్వ విషయాన్ని నేను నీకు చెప్పాను. తగని వారికి ఉపదేశిస్తే ఎంతో కష్టపడవలసి వస్తుంది. కాబట్టి ఈ లోకంలో ఎవ్వరికీ ఉపదేశించగూడదు.

సాందీప్ని గ్రంథాలయ సంస్థ
A C.No. 96367
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

11. శ్రీరుక్మిణీ సంవాదము.

యుధిష్ఠిరుడడిగాడు. "తాతా ! ఎటువంటి పురుషునిలో లేదా స్త్రీలో లక్ష్మి నిత్యమూ నివసిస్తుంది ? అది నాకు చెప్పు". భీష్ముడు చెప్తున్నాడు. "ఈ సందర్భంగా నేను విన్న యథార్థ వృత్తాంతాన్ని విన్నది విన్నట్లు చెపుతాను. రుక్మిణి శ్రీకృష్ణుని సమక్షంలో లక్ష్మినిలా అడిగింది. పద్మంతో సమానమైనవన్నె కలిగి, నారాయణుని ఒడిలో కూర్చొని, ప్రకాశిస్తున్న లక్ష్మిని చూసి, కుతూహలంతో వికసించిన అందమైన కన్నులుగల రుక్మిణి ఇలా అడిగింది. 'మహర్షి పుత్రీ ! త్రిలోకాధిపతి అయిన నారాయణునకు ఇష్టమైనదానా ! నీవు ఈ లోకంలో ఎవరి దగ్గర ఉంటావు ? ఎవరి దగ్గర నివసిస్తావు ? ఎవరిని సేవిస్తావు ? యథార్థంగా నాకు చెప్పు". ఈ రీతిగా రుక్మిణి విష్ణు సమక్షంలో తనను అడుగగా ఆ లక్ష్మి ప్రసన్నమై మధురపదాలతో మనోహరంగా ఇలా అన్నది. లక్ష్మి అంటోంది. "నేను నిత్యమూ సౌభాగ్యవంతుడై, భయరహితుడై, సమర్థుడై, క్రోధరహితుడై, దైవభక్తుడై, కృతజ్ఞుడై, జితేంద్రియుడై, సత్త్వగుణ సహితుడై, కర్మతత్పరుడైన నరుని దగ్గర నివసిస్తాను. పనిచేసే స్వభావం లేనివాడు, నాస్తికుడు, వర్ణ సాంకర్యం గలవాడు, కృతఘ్నుడు, దురాచారి, క్రూరుడు, దొంగ, గురువులలో తప్పులను వెదకేవాడు. ఇటువంటి లక్షణాలు గల పురుషుని దగ్గర నేనుండను. తేజస్సు, బలం, సత్త్వం, గౌరవం తక్కువగా ఉన్నవాడు. అన్నింటికీ బాధపడేవాడు, ఎక్కడికక్కడ కోపపడేవాడు, మనస్సును (కోరికలను) దాచి, మరొక రీతిగా మాటాడేవాడు – ఇటువంటి నరుల దగ్గర నేనుండను. తన కోసం ఏమీ ఆశించనివాడు, మూఢత్వంతో దెబ్బతిన్న అంతఃకరణం గలవాడు, అల్పసంతోషి – ఇటువంటి నరుల దగ్గర నేను చక్కగా నిత్యనివాసం చేయను. స్వధర్మపరాయణుడు, ధర్మవేత్తలు, వృద్ధ సేవాతత్పరులు, జితేంద్రియులు, మనస్సును అదుపులో నుంచుకొన్నవాడు, సహనశీలుడు, సమర్థుడు, క్షమాశీలురు, దమనశీలురు, దుర్బలులు, సత్య స్వభావంతో, ఋజుత్వంతో కూడినవారు, దేవతలను, బ్రాహ్మణులను పూజించేవారు – ఇటువంటి వారి దగ్గర నేను నివసిస్తాను.

ఎప్పుడూ సమయం వ్యర్థం చేయనివారు, దానశీలాసక్తులు, బ్రహ్మచర్యం, తపస్సు, జ్ఞానం, గోవులు, బ్రాహ్మణులను ఇష్టపడేవారు – ఇటువంటి వారి దగ్గర నివసిస్తాను. సద్గుణాలు కలిగి, దేవతలను, బ్రాహ్మణులను సేవిస్తూ, ఇంటిని, పాత్రలను శుభ్రంగా ఉంచుకొంటూ, గోవులపై, ధాన్యంపై ఆసక్తిగల స్త్రీల దగ్గర నివసిస్తాను.

ఇంటిలోని పాత్రలను చెల్లాచెదరుగా ఉంచుకొనేవాడు, ఆలోచించకుండా పని చేసేవారు, నిత్యమూ భర్తకు ప్రతికూలంగా మాటాడేవారు, ఇతరుల ఇండ్లపై ఆసక్తి

గలవారు, సిగ్గువిడిచినవారు – ఇటువంటి స్త్రీలను పరిహరిస్తాను. పాపపు పనులు చేసేది, శుభ్రత లేనిది, తిండిపోతు, ధైర్యహీన, కలహప్రియ, నిద్రకు వశమై ఎప్పుడూ పడుకొని ఉండేది – ఇటువంటి లక్షణాలు గల స్త్రీని పరిహరిస్తాను. సత్యవాదిని, చూడముచ్చటైనది, సౌభాగ్యవతి, గుణసంయుక్త, శుభాచారవతి, అలంకారవతి, పతివ్రత – ఇటువంటి స్త్రీలలో నివసిస్తాను. మంచి వాహనాలలో, కన్యలలో అలంకారాల్లో, యజ్ఞాలలో, వర్షించే మేఘాలలో, వికసించిన సరోవరాల్లో, ఏనుగులలో, గోశాలలో, మంచి ఆసనాలలో, వికసించిన కలువలు, కమలాలు గల సరస్సులలో నేను నివసిస్తాను. హంసల కూజితాలతో నినదిస్తూ, క్రౌంచపక్షుల కలరవాలతో శోభిస్తూ, ఒడ్డున పెరిగిన తరువులతో అందగిస్తూ, తపస్సులు, సిద్ధులు, బ్రాహ్మణులచే సేవింపబడుతూ, సింహాలు, ఏనుగులు కలతపెట్టిన నీటితో భాసిస్తూ నిండుగా ప్రవహించే నదులలో నిత్యమూ నివసిస్తాను. మదపుటేనుగులో, ఆబోతులో, రాజులో, సింహాసనంలో, సజ్జనులలో నేను నిత్యమూ నివసిస్తాను. అగ్నికి ఆహుతులనిస్తున్న ఇంటిలో; గోవులను, బ్రాహ్మణులను, దేవతలను అర్చిస్తున్న ఇంటిలో; ఆయా వేళలలో దేవతలకు పూలను కానుక చేస్తున్న ఇంటిలో నేను నిత్యమూ నివసిస్తాను. నిత్యమూ స్వాధ్యాయతత్పరులైన విప్రులలో, ధర్మాసక్తి గల క్షత్రియునిలో, వ్యవసాయంపై అనురక్తిగల వైశ్యునిలో, సంతతమూ సేవాసక్తిగల శూద్రునిలో నేను నిత్యమూ నివసిస్తాను. సమస్త భావాన్ని రూపు కట్టించి, అనన్య మనస్కనై నారాయణునిలో నివసిస్తాను. ఆయనలో మహాధర్మం గూడుకట్టుకొని ఉన్నది. అలాగే బ్రాహ్మణులపై ప్రేమ, అందరికీ నచ్చే లక్షణం ఆయనలో ఉన్నాయి. దేవి ! నేను శరీరంతో నివసించను. ఏ రూపంలో ఉంటానో చెప్పటం కూడా వీలుకాదు. భావాత్మకంగా నేను ఎవరిలో నిలుస్తానో, అతడు ధర్మంతో, కీర్తితో, అర్థకామాలతో వర్ధిల్లుతాడు.

12. స్త్రీ పురుష సంయోగము.

యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. పితామహా ! కృతఘ్నులకు తగిన ప్రాయశ్చిత్తం ఏమిటి ? తల్లిదండ్రులను, గురువులను అవమానించే వారికీ, కృతఘ్నులకు, సిగ్గులేనివారికీ, వట్టే గతి ఏమిటో తెలుసుకోవాలని ఉంది. చెప్పండి. భీష్ముడు చెప్తున్నాడు. నాయనా ! కృతఘ్నులు చాలా సంవత్సరాలు నరకంలో పడతారు. తల్లి, తండ్రి, గురువుల మాట వినినివారు క్రిములుగా, కీటకాలుగా, చీమలుగా, స్థావరాలుగా పుడతారు. వారు మరల మానవ జన్మను పొందటం దుర్లభం. ఈ విషయంలో కూడా ఈ ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. వత్సనాభుడనే పేరుగల మహాప్రాజ్ఞుడైన మహర్షి ఉండేవాడు. ఆయన కఠోరవ్రతాలు పాటించేవాడు. ఆయన చుట్టూ పుట్టలు ఏర్పడ్డాయి. ఆ బ్రహ్మర్షి తీవ్ర

తపస్సు చేస్తుండేవాడు. ఆయన తపస్సు చేస్తుండగా ఇంద్రుడు ఉరుములు, మెరుపులతో బడివాన కురిపించాడు. ఇంద్రుడక్కడ వీడు సంవత్సరాల పాటు వర్షించాడు. కానీ ఆ ద్విజుడు కళ్ళు మూసుకొని ఆ వృష్టిని సహించాడు. చలిగాలులతో కూడి ఆ రీతిగా వాన పడుతుండగా ఆ పుట్టపై పిడుగుపడింది. దాని శిఖరం విరిగివడింది. మహాత్ముడైన ఆ వత్సనాభునిపై వాన పడుతోంది. అది చూసి ధర్ముడి మనస్సులో జాలి కలిగి ఆయన తన దయాగుణాన్ని ప్రదర్శించాడు. పరమధార్మికుడై తపస్సు చేస్తున్న ఆ బ్రహ్మర్షిని గురించి ఆలోచిస్తున్న ధర్మునకు అప్పటికి తగిన స్వాభావికమైన సదాలోచన వెంటనే కలిగింది. తాను వెంటనే అందమైన పెద్ద దున్నపోతుగా మారాడు. వత్సనాభ సంరక్షణకై నాలుగు పాదాలను చాచి ఆయనపైన కప్పుగా నిలిచాడు. చలిగాలులతో కూడిన ఆ వాన తగ్గిపోగానే మహిషరూపంలోనున్న ధర్ముడు మెల్లగా పుట్టను తొలగించి, పరుగెత్తిపోయాడు. అలా వెను వృష్టి కురిసినప్పుడు ఆ మహాతపస్వి ధర్ముని నిలకడచే రక్షింపబడ్డాడు. ఆపై విపుల దిక్కులను, పర్వత శిఖరాలను, నీటమునిగిన సమస్త పృథివిని, జలాశయాలను చూసి ఆ విప్రుడు పరమానందపడ్డాడు. అప్పుడు ఆయన ఆశ్చర్యపడి 'నన్నెవరు రక్షించారు' ? అని ఆలోచింపసాగాడు. అంతలో దగ్గరలోనే నిలబడియున్న దున్నపోతును చూశాడు. "పశుజాతిలో పుట్టినా కూడా ధర్మవత్సలుడుగా ఎలా కనిపిస్తున్నాడు ! బహుశ ఇది నాపై నూరుడు రాయివలె నిలబడి ఉంటుంది. అందుకే నాకేమీ కాలేదు. ఇది లావుగా బలిసి ఉంది. ఆపై ధర్మంమీద అనురక్తిగల ఆ మునిలో ఇలా ఆలోచన కలిగింది. నమ్మినవారికి ద్రోహం చేసే కృతఘ్నులు నరకానికి పోతారు. ధర్మజ్ఞుల మాటలను బట్టి ప్రాణ పరిత్యాగం తప్ప కృతఘ్నులకు మరొక నిష్కృతి లేదు. పితరులను పోషింపకపోయినా, గురుదక్షిణ నివ్వకపోయినా కృతఘ్నుడవుతాడు. దానికి ప్రాయశ్చిత్తం మృత్యువే. తమ జీవితంపై ఆకాంక్ష, ప్రాయశ్చిత్తం మీద ఉపేక్ష ప్రదర్శిస్తే పాతకం పెరుగుతూనే ఉంటుంది. కాబట్టి ప్రాయశ్చిత్తంగా ప్రాణాలను పరిత్యజిస్తాను. ఆయన అనాసక్తమనస్కుడై మేరు శిఖరానికి వెళ్ళి, ప్రాయశ్చిత్తం చేసికొనగోరి, ప్రాణాలను విడిచటానికి ఉద్యమించగా ధర్ముడు వచ్చి ధర్మవేత్త, ధర్మాత్ముడు అయిన వత్సనాభుని చేయి పట్టుకొన్నాడు. ధర్ముడిలా అన్నాడు "వత్సనాభా ! మహాప్రాజ్ఞా ! నీవు శతాయుష్కుడవు అనాసక్తంగా నీవు చేసిన ఆత్మత్యాగ భావనతో సంతోషించాను. ఇలా ధర్మాత్ములందరూ తాము చేసిన పనిని గూర్చి ఆలోచిస్తారు. మనస్సు ఎప్పుడూ కలుషితం కాని వారు లోకంలో ఎవ్వరూ లేరు. నిర్దుష్టంగా, పూర్తిగా ధర్మాన్ని పాటించేవాడే శక్తిమంతుడు. మహాప్రాజ్ఞా ! వెనుదిరుగు. నీవు సనాతనపరమాత్మవు.

యుధిష్ఠిరుడడిగాడు. "రాజా ! స్త్రీ పురుషులు కలసినప్పుడు ఎవరికి అనుభూతి ఎక్కువ ? ఈ సంశయానికి సంబంధించి యథాతథంగా నాకు చెప్పాలి". భీష్ముడు చెప్పున్నాడు. "ఈ విషయంలో కూడా గతంలో భంగాస్వనునితో ఇంద్రునకు శత్రుత్వం మేర్పడిన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. పురుషశ్రేష్ఠ ! గతంలో భంగాస్వనుడనే రాజర్షి ఉండేవాడు. ఆయన పరమ ధార్మికుడు. పిల్లలు లేరు. సంతానం కోసం యజ్ఞం చేశాడు. మహాబలుడైన ఆ రాజర్షి అగ్నిష్టుతమనే యాగాన్ని ఆరంభించాడు. అది మనుష్యులకు ప్రాయశ్చిత్తమవసరమైనపుడు, పుత్రకామన కలిగినపుడు చేసే యాగం. దానిలో ఇంద్రునకు

ప్రాధాన్యం లేదు. అందువలన ఇంద్రుడు దానిని ద్వేషిస్తాడు. మహా భాగ్యశాలి అయిన దేవేంద్రుడు ఆ యజ్ఞ విషయాన్ని తెలిసికొని, నియతాత్ముడైన ఆ రాజర్షిలో లోపాలు వెదుకసాగాడు. రాజా ! ఆ మహాత్మునిలో ఏ లోపమూ కనిపించలేదు.

కొంతకాలం తర్వాత ఆ రాజు వేటకు వెళ్ళాడు. 'ఇదే అవకాశ'మని భావించి ఇంద్రుడు ఆ రాజును మోహానికి గురిచేశాడు. ఇంద్రునిచే భ్రమ కలిగింపబడిన ఆ రాజర్షి ఒకే గుర్రంపై అటూఇటూ తిరుగసాగాడు. ఆ రాజుకు దిక్కు తెలియలేదు. ఆకలిదప్పులు పీడించసాగాయి. రాజా ! అలసిపోయి, దప్పికతో ఎటుబడితే అటు తిరగసాగాడు. అప్పుడు మంచినీటితో నిండుగా ఉన్న అందమైన సరస్సును చూశాడు. నాయనా ! ఆయన సరస్సులో గుర్రానికి స్నానం చేయించి నీళ్ళు త్రాగించాడు. గుర్రం నీళ్ళు త్రాగిన పిమ్మట రాజశ్రేష్ఠుడైన ఆ భంగాస్వనుడు గుర్రాన్ని చెట్టుకు కట్టి, సరస్సులో దిగి స్నానం చేశాడు. అప్పుడు స్త్రీగా మారిపోయాడు. తాను స్త్రీగా మారిపోవటం చూసి ఆ రాజశ్రేష్ఠుడు సిగ్గు పడ్డాడు. చింత మనస్సులో పూర్తిగా వ్యాపించింది. ఇంద్రియాల చైతన్యం కలతకు లోనైంది. "గుర్రాన్ని ఎలా ఎక్కగలను ? నగరానికి ఎలా వెళ్ళగలను ? అగ్నిష్టుతయాగ ఫలంగా మహాబలులయిన వందమంది కొడుకులు పుట్టారు. ఆ వారసులకు ఏం చెప్పగలను ? నా భార్యలు, పౌరులు, జానపదులతో ఎలా సంచరింపగలను ? ధర్మతత్త్వాన్ని, ధర్మ ప్రయోజనాన్ని దర్శించిన ఋషులు మృదుత్వం, సన్నగా ఉండటం, కలవరపాటు స్త్రీ లక్షణాలని చెప్పారు. వ్యాయామంలో కఠినత్వం, బలపరాక్రమాలు పురుష గుణాలు. నా పౌరుషం నశించింది. ఏ కారణం చేతనో నాకు స్త్రీత్వం కలిగింది. స్త్రీనిగా ఉన్నాను కాబట్టి మరల గుర్రాన్ని ఎక్కడానికి ఉత్సాహమెలా వస్తుంది ? "అలా ఆలోచించి, ఆపై మహా ప్రయత్నంతో ఆ రాజు గుర్రాన్ని ఎక్కి, స్త్రీ రూపంతో నగరానికి తిరిగి వచ్చాడు. రాజ పుత్రులు, భార్యలు, సేవకులు, పౌరులు, జానపదులు ఏమిటిది' అని విచారించి, తెలిసికొని, పరమాశ్చర్యానికి లోనయ్యారు.

అప్పుడు వాగ్మి అయిన ఆ రాజర్షి స్త్రీ రూపంతో ఇలా చెప్పాడు. "సేనా పరివృతుడనై వేటకు బయలుదేరాను. దైవప్రేరణచే తీవ్ర మోహానికి లోనై ఘోరవనంలో ప్రవేశించాను. ఆ భీకరారణ్యంలో దప్పికతో పీడింపబడుతూ, దాదాపు చైతన్యాన్ని కోల్పోతూ ఒక సరస్సును చూశాను. దాని చుట్టూ పక్షులున్నాయి. అది శోభాయమానంగా ఉంది. ఆ సరస్సులో దిగి స్నానం చేసీ చేయగానే నన్ను దైవం స్త్రీగా మార్చింది. తన మంత్రుల యొక్క, భార్యలయొక్క నామ గోత్రాలను తెలిపి (విశ్వాసం కోసం), స్త్రీ రూపంలో ఉన్న

ఆ రాజశ్రేష్ఠుడు తన కుమారులతో ఇలా అన్నాడు. "కుమారులారా ! ఆనందంగా రాజ్యాన్ని అనుభవించండి. నేను వనానికి వెళతాను". నూర్గురు కొడుకులతో అలా చెప్పి ఆ రాజు అరణ్యానికి వెళ్ళిపోయాడు. ఆమె ఒక ఆశ్రమానికి పోయి ఒక తాపసుని ఆశ్రయించింది. ఆ ఆశ్రమంలో ఆ తాపసుని ద్వారా ఆమెకు నూర్గురు కొడుకులు పుట్టారు. ఆపై ఆమె వారినందరినీ తీసికొనివచ్చి మొదటి కొడుకులతో ఇలా అన్నది." నేను పురుషుడుగా ఉన్నప్పుడు మీరు కొడుకులు. స్త్రీత్వంలో ఈ నూరుగురు కొడుకులు కుమారులారా ! మీరు సోదర ప్రేమతో ఒకేచోట ఉండి రాజ్యాన్ని అనుభవించండి అప్పుడు సోదరులంతా కలిసి రాజ్యాన్ని అనుభవించసాగారు. వారలా సోదరభావంతో ఉత్తమరాజ్యాన్ని అనుభవించటం చూసి దేవేంద్రుడు క్రోధంతో నిండి "ఈ రాజర్షికి నేను ఉపకారమే చేశానే. అపకారం చేయలేకపోయానే" అని ఆలోచించాడు.

ఆ తరువాత నూరుయాగాలు చేసిన దేవేంద్రుడు ఆ నగరానికి వెళ్ళి, ఆ రాజకుమారులలో భేదభావాన్ని కలిగించాడు. వారితో ఇలా అన్నాడు. "ఒకే తండ్రి బిడ్డలయినా సరే సోదరులలో సౌభ్రాత్రముండదు. కశ్యపుని కుమారులైన దేవతలు, రాక్షసులు కూడా రాజ్యం కోసం గొడవపడ్డారు. మీరు భంగాస్వనుని కుమారులు. వారు తాపసుని కొడుకులు. దేవతలు, రాక్షసులు కశ్యపుని కుమారులే. అయినా వారిలో సౌభ్రాత్రం లేదు. మీ పిత్రార్జితమైన రాజ్యాన్ని తాపసుని కొడుకులు అనుభవిస్తున్నారు. ఇలా ఇంద్రుని చేత భేదింపబడిన వారు పోరాడి పరస్పరం చంపుకొన్నారు. అది విని ఆ తాపసి కూడా దుఃఖతాపంతో రోదించింది. అప్పుడు ఇంద్రుడు బ్రాహ్మణరూపంతో వచ్చి ఆమెతో ఇలా అన్నాడు. "వరాననా ! ఏ దుఃఖంతో తపిస్తూ నీవు ఏడుస్తున్నావు ?" ఆపై ఆ బ్రాహ్మణుని చూసి ఆమె దీనంగా ఇలా అన్నది.

బ్రాహ్మణా ! నా కొడుకులు రెండు వందలమంది కాలం కబళించింది. నేను ముందు రాజును. అప్పుడు వందమంది కొడుకులు పుట్టారు. అందరికీ నా పోలికలే. ఒకసారి వేటకై దట్టమైన అడవిలోనికి వెళ్ళాను. అక్కడ భ్రాంతికి లోనయ్యాను. బ్రాహ్మణోత్తమా ! అక్కడ సరస్సులో స్నానం చేసి స్త్రీనయ్యాను. ఆపై కొడుకులను రాజ్యంలో ప్రతిష్ఠించి అరణ్యానికి వెళ్ళాను. బ్రాహ్మణా ! ఆ ఆశ్రమంలో మహాత్ముడైన తాపసి ద్వారా నాకు వందమంది కొడుకులు పుట్టారు. వారిని నేను నగరానికి తీసికొని పోయాను. ద్విజా ! కాలప్రభావం వలన వారిలో శత్రుత్వమేర్పడింది (అందరూ చనిపోయారు). దైవం నన్ను ముంచివేసింది. దానికై దుఃఖిస్తున్నాను. దుఃఖిస్తున్న ఆమెను చూసి ఇంద్రుడు

పరుషంగా ఇలా అన్నాడు. "కళ్యాణీ ! గతంలో నేను నీకు దుస్సహమైన దుఃఖాన్ని కలిగించాను. నాకు ఇష్టంలేని యాగం చేస్తూ, నన్ను ఆహ్వానించకుండానే దానిని ముగించావు. దుర్మతీ ! నేను ఇంద్రుడను. నా శత్రుత్వానికి బదులు తీర్చుకొన్నాను". ఇంద్రుని చూసి ఆ రాజర్షి (భంగాస్వనుడు) తలవాల్చి పాదాలపై పడ్డాడు. "దేవతాశ్రేష్ఠా ! ప్రసన్నుడవు కమ్ము. సంతాన వాంఛతో నేను ఆ యాగం చేశాను. నన్ను క్షమించాలి" అన్నాడు. ఆయన తన పాదాలపై పడటంతో ఇంద్రుడు సంతోషించి వరమిచ్చాడు. "రాజా ! ఈ నీ కుమారులలో ఎవరు బ్రతకాలో నాకు చెప్పు. స్త్రీగా ఉన్నప్పుడు పుట్టినవారా ? పురుషుడవుగా ఉన్నప్పుడు పుట్టినవారా ?" అప్పుడు తాపసి చేతులు జోడించి ఇంద్రునితో "వాసవా ! స్త్రీగా ఉన్నప్పుడు పుట్టిన ఆ నా కుమారులే జీవించాలి' అన్నది.

ఇంద్రుడు ఆశ్చర్యంగా చూస్తూ ఆ స్త్రీని మరలా ఇలా అడిగాడు. "పురుషుడవుగా ఉన్నప్పుడు పుట్టిన ఆ కుమారులను ఎందుకు వద్దంటున్నావు ? వారి మీదకన్నా స్త్రీగా ఉన్నప్పుడు పుట్టినవారిపై స్నేహమెలా ఎక్కువయింది ? కారణం వినగోరుతున్నాను. నాకు నీవు చెప్పాలి". స్త్రీ ఇలా అంది. "స్త్రీలకు స్నేహమెక్కువ. పురుషులకు అలా ఉండదు. అందువలననే ఇంద్రా ! స్త్రీగా ఉన్నప్పుడు కలిగిన సంతానమే బ్రతకాలని కోరుతున్నాను". భీష్ముడు చెప్తున్నాడు. అలా చెప్పిన తరువాత ఇంద్రుడు ఆనందించి ఇలా అన్నాడు. "సత్యవాదిని ! నీ కుమారులు అందరూ బ్రతుకుతారు. రాజేంద్రా ! సువ్రతా ! నీకు ఇష్టమైన వరాన్ని కూడా కోరుకో. నా నుండి పురుషత్వాన్ని కోరుకొంటావా ? స్త్రీత్వాన్ని కోరుకొంటావా ? స్త్రీ ఇలా అన్నది. "ఇంద్ర ! వాసవా ! పురుషత్వ మవసరం లేదు. స్త్రీత్వాన్నే కోరుతున్నాను". అలా చెప్పగా ఇంద్రుడు ఆ స్త్రీతో ఇలా పలికాడు. "రాజా ! పురుషత్వాన్ని కాదని స్త్రీత్వాన్ని ఎందుకు కోరుతున్నావు ?" అప్పుడు స్త్రీగా ఉన్న రాజశ్రేష్ఠ డిలా చెప్పాడు. పురుషునితో కలిసినప్పుడు ఎప్పుడూ స్త్రీకే ప్రీతి ఎక్కువగా ఉంటుంది. ఈ కారణం వలననే ఇంద్రా ! నేను స్త్రీత్వాన్ని కోరుకొంటున్నాను. దేవశ్రేష్ఠా ! స్త్రీగా ఉన్నప్పుడే నేను ఎక్కువగా రతి సుఖాన్ని పొందాను. సత్యం చెప్తున్నాను. దేవేంద్రా ! స్త్రీగా ఉంటేనే ఆనందిస్తాను. ఇక వెళ్ళవచ్చు". మహారాజా ! అలాగే అని పలికి ఇంద్రుడు సెలవు తీసుకొని స్వర్గానికి వెళ్ళాడు. ఈ రీతిగా స్త్రీ పురుషయోగంలో స్త్రీకే ప్రీతి ఎక్కువ".

13. పాప పరిత్యాగోపదేశము.

యుధిష్ఠిరుడడిగాడు. "ఇహపరలోకాలలో హితాన్ని కోరుకొనే మనిషి ఏం చేయాలి ? ఏ స్వభావంతో, ఏ విధంగా లోకంలో జీవించాలి ?" భీష్ముడు చెప్తున్నాడు. "శరీరంతో మూడు పనులు, మాటతో నాలుగు పనులు, మనస్సుతో మూడు పనులు - ఇలా పది రకాల కర్మలను పరిత్యజించాలి. ఇతరుల ప్రాణాలు తీయటం, దొంగతనం, పరదారాగమనం - ఈ మూడు శారీరక పాపాలు. వీటిని పూర్తిగా విడనాడాలి. రాజేంద్రా ! అసత్ప్రలాపనం, పరుషవచనం, చాడీలు చెప్పటం, అసత్యమాడటం - ఇవి నాలుగు వాచా పాపాలు. ఇలా మాటాడకూడదు. కనీసం తలచుకోకూడదు. పరుల సొమ్ములు నపహరించే ఆలోచన చేయకుండుట, సర్వ ప్రాణులపై స్నేహదృష్టి, కర్మలకు ఫలముంటుందన్న విశ్వాసం - ఈ మూడింటిని మనసా పాటించాలి. కాబట్టి మనసా, వాచా, కర్మణా నరుడు అశుభాన్ని ఆచరించగూడదు. శుభాలనయినా, అశుభాలనయినా ఆచరిస్తే వాటి వాటి ఫలాలను అనుభవించవలసినదే.

అమృతం పుట్టిన తరువాత దేవతలకు రాక్షసులతో అరవై వేల సంవత్సరాల పాటు దేవాసురసంగ్రామ'మని పేరుగన్న యుద్ధం జరిగింది. అక్కడ ఆ యుద్ధంలో పరమ భయంకరులైన రాక్షసులు దేవతలను సంహరిస్తున్నారు. దేవతలకు రక్షకుడు దొరకలేదు. ఆ దేవతలు ఆర్తులై, రక్షకుని కోరుతూ మహాప్రాజ్ఞుడైన పితామహుని శరణుజొచ్చారు. బ్రహ్మ వారిందరితో కలిసి విష్ణువును శరణుగోరాడు. రాజా ! ఆపై బ్రహ్మ దేవతలతో కలిసి చేతులు జోడించి, అనామయుడైన నారాయణుని స్తుతింపసాగాడు బ్రహ్మ ఇలా అన్నాడు. "నీ రూపాన్ని చింతించినా, నీ పేరు తలచినా, నిన్ను పూజించినా, తపోయోగాదులను పాటించినా ధీమంతులు శ్రేయస్సును పొందుతారు. భక్తవత్సలా ! పద్మాక్షా ! పరమేశ్వరా ! పాపహారీ ! పరమాత్మా ! నిర్వికారా ! ఆదిపురుషా ! నారాయణా ! నీకు నమస్కారం. సర్వలోకాలకు ఆదికారణుడా ! సర్వాత్మా ! అమిత పరాక్రమా ! భూతభవిష్యత్తుల కన్నింటికీ స్వామీ ! సర్వభూత మహేశ్వరా ! నీకు నమస్కారం. నీవు దేవతలకే దేవుడవు. సర్వవిద్యాపరాయణుడవు జగత్తులోని సర్వబీజాలకూ సమాహారుడవు నీవే జగత్తుకు పరమకారణం నీవే. వీరా ! జయశీలురలో నీవు శ్రేష్ఠుడవు. దానవాదులచే తీవ్రంగా పీడింపబడుతున్న దేవతలను రక్షించు. లోకాలను, లోకపాలకులను, ఋషులను రక్షించు. వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు, వాటి రహస్యాలు, వాటి సంగ్రహాలు, ఓంకారం, వషట్కారాలు నిన్నే ఉత్తమ యజ్ఞ స్వరూపునిగా చెప్తున్నాయి. నీవు పవిత్రులలో పవిత్రుడవు శుభాలలో శుభుడవు. తపస్సులలో తపస్సువు. దేవతలకే దేవుడవు.

భీష్ముడు చెప్తున్నాడు. 'ఇలా దేవతలందరూ బ్రహ్మతో కలసి ఒక్కటై ఋక్, సామ, యుర్వేద మంత్రాలతో విష్ణువును స్తుతించారు. అప్పుడు మేఘగంభీర ధ్వనితో అశరీరవాణి వినిపించింది. "నాతో కలిసి పోరాడి మీరు దానవులను గెలువగలరు". ఆపై దేవగణాలు, దానవులు పోరాడుతున్న

సమయంలో శంఖచక్రగదలను ధరించి మహాతేజస్వి అయిన విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. గరుడుని వీపుపై ఎక్కి, తేజస్సుతో దహిస్తూ, బాహుబల పరాక్రమాలతో దానవులనందరినీ చంపాడు. మహారాజా ! యుద్ధంలో దైత్య దానవ శ్రేష్ఠులు విష్ణువును సమీపించి అగ్నిని సమీపించిన మిడతలవలె నశించారు. మహామతి అయిన ఆ విష్ణువు అసురులను, దానవులను అందరినీ ఓడించి దేవతలు చూస్తుండగానే అక్కడే అంతర్ధానమయ్యాడు. అమిత తేజస్వి అయిన ఆ విష్ణువు అదృశ్యం కావటంచూసి, దేవతలు ఆశ్చర్యంతో కన్నులు వికసించగా బ్రహ్మతో ఇలా అన్నారు. భగవంతుడా ! సర్వలోకేశ్వరా ! సర్వలోక పితామహా ! ఈ అత్యద్భుత వృత్తాంతాన్ని నీవు మాకు వివరంగా చెప్పాలి. మమ్ములను రక్షించి, మౌనంగా వచ్చినట్లే వెళ్లిపోయిన ఈ దివ్యాత్ముడెవరు ? ఆయనను గురించి మాకు చెప్పాలి.

భీష్ముడు చెప్తున్నాడు. 'రాజా ! దేవతలందరూ అలా అనగానే వచనార్థవేత్త అయిన బ్రహ్మ పద్మనాభుని పూర్వరూపాన్ని గురించి ఇలా చెప్పాడు'. బ్రహ్మ చెప్తున్నాడు. "ఈయన లోకాల కేశ్వరుడు. లోకంలో ఎవ్వరూ ఈయన గురించి యథాతత్వంగా తెలియలేరు. గుణవంతులలో శ్రేష్ఠుడు, నిర్గుణుడు అయిన ఈ పరమాత్మను ఎవ్వరూ వర్ణించలేరు. దేవతలారా ! ఈ విషయంలో గతంలో గరుడునకు, ఋషులకు మధ్య జరిగిన సంవాదరూపమైన ఇతిహాసాన్ని మీకు తెలియజేస్తాను. గతంలో ఒకసారి హిమగిరి శిఖరంపై బ్రహ్మర్షులు, సిద్ధులు భువనేశ్వరుడైన నారాయణుని శరణుజొచ్చి వివిధ కథలను చెప్పుకొనసాగారు. వారి మాటలు ముగిసే సమయంలో చక్రగదాధారికి వాహనమైన, మహాతేజస్వి, పతగశ్రేష్ఠుడైన గరుడుడు అక్కడకు వచ్చాడు. మహాబలశాలి అయిన గరుడుడు ఆ మహర్షులను సమీపించి, నేలకు వ్రాలి, వినయంతో తలవాల్చి వారి దగ్గరకు వచ్చాడు. వేగవంతులలో శ్రేష్ఠుడు, తేజస్వి, మహాబలుడు అయిన ఆ గరుడుడు ఋషుల అర్చనల నంది క్రింద కూర్చున్నాడు. అలా కూర్చోగానే పెద్ద శరీరం, మహాకాంతి, గొప్ప మనస్సు గల ఆ గరుడుని తపస్సంపన్నులైన ఋషులు ఇలా ప్రశ్నించారు. ఋషులు అడుగుతున్నారు వైనతేయా ! మా మనస్సులలో ఎంతో కుతూహలముంది. నీవు తప్ప చెప్పగలవాడిక్కడ మరొకడు లేడు కాబట్టి నీవు ఆ మంచి ప్రశ్నను గూర్చి వివరించాలని కోరుతున్నాం. గరుడుడు ఇలా అన్నాడు. "వాగ్మి శ్రేష్ఠులారా ! చెప్పండి. నేనేం చెప్పాలి ? ఏం చేయాలి ? మీరందరూ నన్ను తగిన పనులకై ఆదేశించవచ్చు". బ్రహ్మ ఇలా అన్నాడు. "దేవతలారా ! ఆపై అక్కడ సజ్జన శ్రేష్ఠులైన ఋషులు అనంతునకు నమస్కరించి, మహాబలుడైన గరుడుని అడుగనారంభించారు.

ఋషులు ఇలా అడిగారు "అనామయుడు, మహాత్ముడు, దేవ దేవుడు, వరదుడు అయిన నారాయణుని నీవు ఉపాసిస్తావు. అసలు ఆయన ఎలా వ్యక్తమయ్యాడు ? వాస్తవంగా తానెవరు ? ఆయన ప్రకృతి ఎటువంటిది ? ఆయన వికృతి ఎటువంటిది ? ఆయన ఉనికి ఎక్కడ ? ఆ భగవంతుని నివాసమెక్కడ ? ఇది నిన్ను అడుగుతున్నాం. కాశ్యపా ! ఆ దేవుడంటే భక్తులకిష్టం. భక్తులంటే ఆయనకిష్టం. నీవు ఆయన భక్తుడవు, ఆయనకు ప్రియమైన వాడవు కూడా. నీవంటివాడు మరొకడు లేడు. ఆయన అందరి మనస్సులను, చూపులను అపహరిస్తున్నట్లు ఉంటాడు ఆయన స్వరూపాన్ని ఊహించలేము. సర్వ వ్యాపకుడైన ఆయనకు మొదలు, మధ్య, తుది లేవు. ఆయన ఎక్కడ నుండి ఉద్భవించాడో తెలియలేము వేదాలలో కూడా ఆయనను విశ్వాత్ముడని గానం

చేస్తారు. కానీ తత్త్వ భూతస్వరూపుడు, విభుడు, నిత్యుడూ, సనాతనుడు అయిన ఆయన వాస్తవ స్వరూపం అర్థం కాదు. పృథివి, వాయువు, ఆకాశం, నీరు, నిప్పు - ఈ పంచభూతాలూ; క్రమంగా వీటి గుణాలు (గంధం, స్పర్శ, శబ్దం, చల్లదనం, వెచ్చదనం); భావం, అభావం; సత్త్వం, రజస్సు, తమస్సు, సాత్త్వికరాజస తామసగుణాలు, మనస్సు, బుద్ధి, తేజస్సు - ఇవన్నీ వాస్తవంగా బుద్ధిగమ్యాలు. నాయనా ! ఇవన్నీ ఆయన నుండి పుట్టినవే. వీటి అన్నింటిలో ఆయన వ్యాపకుడై ఉంటాడు. బుద్ధితో ఎంత ఆలోచించినా సరియైన నిర్ణయానికి రాలేకపోతున్నాం. ఆ దేవుని తత్త్వాన్ని నీవు మాకు యథాతథంగా చెప్పు". గరుడుడు చెప్తున్నాడు. "స్థూల రూపంలో నున్న భగవంతుడు, త్రిలోకరక్షణకై కారణభూతమైన తన రూపంతోనే కనిపిస్తుంటాడు. ఒకప్పుడు నేను శ్రీవత్సలాంఛనుడైన ఆ సనాతన దేవునిలో మహాశ్చర్యకరమైన విషయాన్ని చూశాను. దానిని పూర్తిగా చెపుతాను వినండి. నేను కానీ మీరు కానీ ఏ రీతిగానూ ఆయనను తెలిసికోలేము. ఆ భగవంతుడు తానే స్వయంగా చెప్పిన దాన్ని నేను చెపుతాను వినండి. మునివరులారా ! దేవతలు చూస్తుండగానే నేను వారి రక్షణ యంత్రాన్ని బద్దలు చేసి, అమృత రక్షకులను పారద్రోలి, యుద్ధంలో మరుద్గణాలతో ఇంద్రునితో పాటు దేవతలను ఓడించి, అమృతాన్ని అపహరించాను. ఆ నా పరాక్రమాన్ని చూసి అశరీరవాణి ఇలా పలికింది.

అశరీరవాణి అంటోంది. "వైనతేయా ! సువ్రతా ! నీవు చూసిన పరాక్రమంతో నేను ప్రసన్నతను పొందాను. నామాట వ్యర్థం కాకూడదు చెప్పు. నీ కోసం నేనేం చేయగలను ? సుపర్ణుడు చెప్తున్నాడు. అలా పలికిన అశరీరవాణితో "నీవెవరో తెలిసికోవాలను కొంటున్నాను. ఆపై నాకు వరమివ్వవచ్చు" అని బదులు పలికాను. అప్పుడు వాగ్మిశ్రేష్ఠుడు, వరదుడు అయిన భగవానుడు ప్రసన్నుడై మేఘ గంభీర ధ్వనితో పెద్దగా నవ్వి ఇలా అన్నాడు". తగిన సమయంలో నా గురించి తెలిసికొంటావు. పతగశ్రేష్ఠా ! నీకు గొప్ప వరమిస్తున్నాను. పరాక్రమంలో నీవంటివాడు లోకంలో దేవతలలో కానీ, దానవులలో కానీ ఎవ్వడూ లేడు. నీవు నాకు వాహనం కావాలి. నాకు సఖుడవై ఉండి, తిరుగులేనివాడవు కాగలవు". అప్పుడు నాతో ఇలా పలుకుతున్న విభుడు, దేవదేవుడు, పరమపురుషుడు అయిన ఆయన దగ్గర చేతులు జోడించి, నమస్కరించి, ఇలా అన్నాను. "మహాబాహూ ! అలాగే ! నీవు ఆదేశించింది అలాగే జరుగుతుంది. నీవు చెప్పినట్లే నీకు వాహనమవుతాను. నీవు రథం మీద ఉన్నప్పుడు మాత్రం నేను నీ ధ్వజం మీద ఉంటాను. సంశయం లేదు". "అలాగే జరగనీ" అని చెప్పి ఆ భగవంతుడు వచ్చినట్లు వెళ్ళిపోయాడు. సజ్జన శ్రేష్ఠులారా ! అలా ఎవరో తెలియని ఆ భగవానునితో సంభాషించిన నేను కుతూహలానికి లోనయి నా తండ్రి అయిన కాశ్యపుని దగ్గరకు వెళ్ళాను. అలా నేను తండ్రి దగ్గరకు పోయి పాదాలపై బడి నమస్కరించి, ఈ వృత్తాంతమంతా ఉన్నదున్నట్లు తండ్రికి చెప్పాను నా మాటలు విని ఆ భగవంతుడు ముహూర్తకాలం ధ్యానంలోకి వెళ్ళాడు. అలా ధ్యానించి ఆ వాగ్మిశ్రేష్ఠుడు నాతో ఇలా అన్నాడు. నాయనా ! "నేను ధన్యుడను. అనుగ్రహింపబడ్డాను. నా కుమారుడవైన నీవు మహాత్ముడు, గుహ్యుడు అయిన ఆ పరమాత్మతో మాటాడగలిగావు. నేను కూడా అనన్య చిత్తంతో, యోగంతో, తీవ్ర తపస్సుతో మహాతేజస్వి, తపోనిధి అయిన ఆయనను సంతోషపెట్టాను. నాయనా ! అప్పుడు నన్ను ఆనందింపజేస్తూ ఆయన నాకు ప్రత్యక్షమయ్యాడు. ఆయన శరీరం తెలుపు, పసుపు, ఎరుపు, కపిల, పింగళ, చిత్ర వర్ణాలతో

శోభిస్తుంది. ఆయన ఎర్రగా, నీలంగా, నల్లగా కూడా కనిపించాడు. వేల పొట్టలు, వేల చేతులు ఆయనకున్నాయి. రెండువేల పెద్ద ముఖాలవాడు. ఆయన ఏకాక్షుడు, శతలోచనుడు కూడా. విశ్వస్వరూపుడైన ఆయనను సమీపించి నేను తలవాల్చి నమస్కరించి, ఋక్కులతో, సామలతో, యజస్సులతో స్తుతించి, శరణ్యుడైన ఆయన శరణు కోరాను. కానీ సర్వహితాభిలాషి, విశ్వరూపుడు, శరీరాంతర్వర్తి అయిన ఆ పరమదేవుడు నీతో స్వయంగా సంభాషించాడు. వెంటనే ఆయననే ఆరాధించు. ఆయనను ఆరాధిస్తే కష్టపడవు.

బ్రహ్మర్షి శ్రేష్ఠులారా ! ఈ రీతిగా పూజ్యుడైన నా తండ్రి నన్ను యథాన్యాయంగా సమాధాన పరిచిన తరువాత నేను నా ఇంటికి వెళ్ళాను. తండ్రి దగ్గర సెలవు తీసుకొని ఇంటికి వచ్చిన నేను మనస్సులో ఆ పరమాత్మనే నిలుపుకొని ఆయనను గురించి మనస్సులో ఆ పరమాత్మనే నిలుపుకొని ఆయనను గురించి ఆలోచింపసాగాను. ఆయన మీదనే భక్తిగల నా మనస్సు తద్భావనలోనే లగ్నమైంది. నా హృదయం ఆలోచించి, ఆలోచించి ఆయనగా మారిపోయింది. సనాతనుడు, అవ్యయుడు అయిన ఆ పరమ పురుషుని - గోవిందుని చింతిస్తూ కూర్చున్నాను. నా హృదయంలో నారాయణుని చూడాలన్న కోరిక స్థిరంగా నిలిచింది. ఆ స్థితిలో వాయువేగ మనోవేగాలు గల నేను వేగంగా నారాయణాశ్రమానికి వెళ్ళాను. విశాలమైన బదరీతీర్థంలో అందమైన ఆశ్రమమిది అపై అక్కడ హరిని చూశాను. ఆయన జగత్కారణం, విశ్వవ్యాపకుడు, గోవిందుడు, పుండరీకాక్షుడు. ఆయనకు శిరసా నమస్కరించి, పరమానందంతో ఋగ్యజుస్సామలతో స్తుతించాను. అప్పుడు నేను మనసా ఆ సనాతన దేవదేవుని శరణుకోరి, చేతులు జోడించి ఇలా అన్నాను. "భగవంతుడా ! భూత భవిష్యద్దీశా ! భూతవర్తమాన కర్తా ! అవ్యయా ! అరిందమా ! శరణుగోరిన నన్ను కాపాడాలి. 'నీవెవరవు ? ఎవరి వాడవు ? ఎక్కడుంటావు ?' ఈ తత్త్వాన్ని తెలియగోరి నేను నీ పాదాల వద్దకు వచ్చాను. నన్ను రక్షించాలి.

శ్రీ భగవానుడన్నాడు. "సౌమ్యా ! నా తత్త్వాన్ని గురించి యథాతథంగా తెలిసికోవాలని ప్రయత్నిస్తున్నావని నాకు తెలుసు. నీ తండ్రి నీకు నా గురించి కొంత చెప్పాడు. అది కూడా నేనెరుగుదును. మైనతేయా ! ఎవరికీ, ఏ రీతిగా కూడా నా గురించి పూర్తిగా తెలియదు. జ్ఞానపరినిష్ఠితులయిన పండితులు నన్ను తెలిసికొనగలరు. అహంకార మమకార రహితులు, కామబంధనాలలో చిక్కుకొననివారు మాత్రమే నా గురించి గ్రహించగలరు. పతగశ్రేష్ఠా ! నీవు సర్వదా నా భక్తుడవు. నాపై మనస్సు గలవాడవు. అందువలననే జగత్కారణ రూపుడనైన నా స్థూల రూపాన్ని గ్రహించగలవు". సువర్ణుడిలా అన్నాడు. "ఋషిశ్రేష్ఠులారా ! ఆపై ఆయన అలా అభయమివ్వగానే నా ఖేదం, శ్రమ, భయం క్షణకాలంలోనే నశించాయి. అప్పుడు వేగంగా పయనించగల ఆయన మెల్లగా వెళ్తున్నాడు. నేను తీవ్ర వేగాన్ని అనుసరించి ఆయన వెంట నడుస్తున్నాను. అమిత తేజస్వి, ఆత్మతత్త్వవేత్త అయిన ఆయన ఆకాశంలో చాలా దూరం ప్రయాణించి ఒక ప్రాంతాన్ని చేరాడు. అది మనసా కూడా నేను వెళ్ళలేనిది. ఆపై ఆ భగవానుడు మనోవేగాన్ని స్వీకరించి, నన్ను మోహానికి గురిచేసి తాను క్షణంలో మాయమయ్యాడు. అక్కడ మేఘధ్వని వంటి ధీర స్వరంతో "ఓయీ" అని నన్ను పిలిచాడు. ఆ ధ్వని ప్రతిధ్వనించింది. అప్పుడు వాక్య విశారదుడైన ఆయన "ఓయీ ! నేను ఇక్కడ" అన్నాడు. ఆ శబ్దాన్ని అనుసరించి నేను

ఆ ప్రదేశానికి వెళ్ళాను. అక్కడొక సరస్సును చూశాను. అది అందంగా, హంసలతో కూడి ఉంది. ఆత్మవేత్తలలో సర్వోత్తముడైన ఆ భగవానుడు ఆ సరస్సు దగ్గరకు వెళ్ళి, ఎదురులేని కంఠస్వరంతో "ఓయీ !" అని నన్ను పిలుస్తూనే తన నివాస స్థానమైన జలంలో ప్రవేశించాడు. నాతో ఇలా అన్నాడు. శ్రీభగవానుడన్నాడు. "సోమా ! నీటిలోనికి ప్రవేశించు. ఇక్కడ సుఖంగా నివసిద్దాం".

సుపర్ణుడు చెప్తున్నాడు. "ఆపై ఆ మహాత్మునితో కలిసి నీటిలోనికి ప్రవేశించాను. ఆ సరస్సులో పరమాద్భుత దృశ్యాన్ని చూశాను. అక్కడక్కడ యధావిధిగా తీర్చిన అగ్నులు ఇంధనం లేకుండానే ప్రజ్వలిస్తున్నాయి. ఆజ్యంతో తడిసి ఉజ్జ్వలిస్తున్నాయి. ఆజ్యం (నేయి) లేకపోయినా ఆ అగ్నులు ఆజ్యంతో తడిసిన అగ్నులతో సమానంగానే ఉన్నాయి ఇంధనం లేకపోయినా ఇంధనంతో కూడిన అగ్నులవలెనే ప్రకాశిస్తున్నాయి. అక్కడకు వెళ్ళినా కూడా వరదుడైన ఆ దేవుడు నాకు కనిపించలేదు. వేలకొలది తావులలో ప్రశంసనీయంగా జ్వలిస్తున్న ఆ అగ్నిహోత్రాల సమీపంలో పరమాద్భుతుడు, అవ్యయుడు అయిన ఆ హరిని వెదుకసాగాను. ఆ అగ్నుల సమీపంలోనే మధుర స్వరాలు వినిపించాయి. తమ ప్రభావంతో అదృశ్యులై, సుస్పష్టంగా అక్షరాలను ఉచ్చరించే ఋగ్వేద, యజుర్వేద, సామవేద పండితులు వేదాన్ని పఠిస్తున్నారు వారు పదాలను, అక్షరాలను అందంగా ఉచ్చరిస్తున్నారు. నేను తీవ్ర వేగంతో అక్కడున్న వేలకొలది ఇళ్ళచుట్టూ తిరిగాను. కానీ ఎక్కడా ఆ దేవుని చూడలేకపోయాను. దానితో వ్యధకు లోనయ్యాను. నిర్మల జ్వాలలతో అక్కడ అగ్నిహోత్రాలు ప్రకాశిస్తూనే ఉన్నాయి. అక్కడ కూడా ఆ సనాతన దేవదేవుడు కనిపించలేదు. ఆపై నేను ప్రజ్వలిస్తున్న ఆ అగ్నిహోత్రాల చుట్టూ తిరుగుతూ అలసి పోయాను. వాటికి అంతం కనిపించలేదు. నన్ను అక్కడకు కొనిపోయిన ఆ భగవానుడూ కనిపించలేదు. ఆ రీతిగా చింతకు లోనై నేను భగవానుని ధ్యానింప నారంభించాను వినయంతో తలవాల్చి, ఆ మహాత్మునికి నమస్కరించి, ఆద్యంతాలు లేని ఆ పరమాత్మను ఈ క్రింది పేర్లతో నుతించసాగాను

శుద్ధుడు, శాశ్వతుడు, ధ్రువుడు, భూతవర్తమాన భవిష్యత్ ప్రభువు, శివుడు, శివస్వరూపుడు, మంగళకారకుడు, శివునకు మూలకారణం, శివుడు కూడా పూజింపదగినవాడు అయిన నారాయణునకు నమస్కారం వరమఘోర స్వరూపుడు, యుగాంత కర్త, విశ్వరూపుడు, విశ్వ దేవుడు, విశ్వేశ్వరుడు, పరమాత్మ అయిన హరికి నమస్కారం వేల ఉదరాలు, వేల పాదాలు, వేల నయనాలు, వేల బాహువులు, వేల వదనాలు గల నారాయణునకు నమస్కారం. పవిత్ర కీర్తిమంతుడు, మహాత్ముడు, ఋతు సంవత్సర స్వరూపుడు, ఋగ్యజుస్సామవదనుడు, అధర్వశిరస్కుడు అయిన హరికి నమస్కారం. హృషీకేశుడు, కృష్ణుడు, బ్రహ్మ, త్రివిక్రముడు, బ్రహ్మేంద్ర స్వరూపుడు, గరుడరూపుడు, ఏకశృంగవరాహుడు ఆయిన నారాయణునకు నమస్కారం. శిపివిష్టుడు, సత్యస్వరూపుడు, హరి, శిఖండి, అగ్ని స్వరూపుడు, ఊర్ధ్వముఖుడు, రౌద్రానీకుడు, సాధువు, సింధువు, సముద్రంలో వర్షాన్ని సంహరించేవాడు, గంగాస్వరూపుడు ఆయిన హరికి నమస్కారం. గరుడ రూపుడు, రుద్రరూపుడు, సుధాముడు, ధర్మాధర్మస్వరూపుడు, సమ్రాట్టు, ఉగ్రరూపుడు, సత్కర్మలు గలవాడు, రజోగుణహీనుడు, ఉత్పత్తికారణం, భవరూపుడు అయిన నారాయణునకు నమస్కారం. వృషునకు, (కోరినవి కురిపించేవాడు), ధర్మరూపునకు, విభునకు, భూలోక భువర్లోక రూపునకు, తేజస్సులు సంపాదించే యజ్ఞ స్వరూపునకు, స్థిరునకు, స్థవిరునకు

నమస్కారం. అచ్యుతుడు, తుషారుడు, వీరుడు, సముడు, జిష్ణువు, పురుహూతుడు, వశిష్టుడు, వరుడు అయిన హరికి నమస్కారం. సత్యస్వరూపుడు, దేవేశుడు, హరి, శిఖండి, బర్హిషుడు, వరేణ్యుడు, వసువు, విశ్వసృష్ట అయిన హరికి నమస్కారం. కిరీటి, సుకేశుడు, వాసుదేవుడు, పరాక్రమవంతుడు, బృహదుక్థ సామస్వరూపుడు, సుషేణుడు, యుగ్యుడు, దుందుభి అయిన నారాయణునకు నమస్కారం జీవ సఖుడు, వ్యాపకుడు, భరద్వాజునకు అభయదాత, భాస్కరుడు, వరేంద్రుడు, పద్మనాభుడు, భూరి అయిన హరికి నమస్కారం. పునర్వసు నక్షత్రపాలితుడు, జీవోత్పత్తి స్థానం, వషట్కారుడు, స్వాహా, స్వధా, నిధన స్వరూపుడు, ఋగ్యజుస్సామ స్వరూపుడు, త్రిలోకపతి అయిన నారాయణునకు నమస్కారం.

శ్రీపద్మం చేతగలవాడు, తనంతవాడు, ధరించువాడు, ధరింపజేసేవాడు, పరముడు, సౌమ్యుడు, సౌమ్య స్వరూపుడు, సౌమ్యరూపుడు, సుమనస్కుడు అయిన హరికి నమస్కారం. విశ్వరూపుడు, సువిశ్వరూపుడు, విశ్వరూపధరుడు, కేశవుడు, సుకేశుడు, రశ్మికేశుడు, మహాత్ముడు అయిన హరికి నమస్కారం. హిరణ్య గర్భుడు, సౌమ్యుడు, ధర్మరూపధారి, నారాయణుడు, శ్రేష్ఠశరీరుడు, పురుహూతుడు, వజ్రి, ధర్మాత్ముడు, వృషసేనుడు, ధర్మసేనుడు, తట స్వరూపుడు అయిన నారాయణునకు నమస్కారం. ముని, చింతారహితుడు, జ్వరాధివతి, అనేత్రుడు, త్రినేత్రుడు, పింగళుడు, ప్రజాసముద్రుడు అయిన హరికి నమస్కారం. తపోవేదనిధి, యుగ ప్రవర్తకునకు, శరణునకు శరణ్యకునకు శక్తిశాలురకు ఇష్టమైన ఆశ్రయరూపుడు, సర్వజగదధివతి, భూతవర్తమాన భవిష్యద్రూపుడు అయిన హరికి నమస్కారం. దేవదేవేశా ! నన్ను కాపాడు. నీవు అనిర్వచనీయుడవు. అజుడవు. సనాతనా ! బ్రాహ్మణులకు నీవు శరణ్యుడవు. ఇలా నిన్ను శరణుకోరుతున్నాను. స్తుతింపదగిన వానిని అలా స్తుతించటంతో నా దుఃఖం నశించింది. ఆపై ఏదో అదృశ్యశక్తి ద్వారా మంగళ కరమైన ఈ దివ్యవాణి వినిపించింది.

శ్రీభగవానుడిలా అన్నాడు. "గరుత్మంతుడా ! భయపడవలదు. నీవు మనస్సును, ఇంద్రియాలను జయించావు. ఇక ఇంద్రునితో సహా దేవతలతో కలిసి నీ ఇంటికి వెళ్ళి పుత్రబాంధవులను చూడు". సుపర్ణుడిలా అన్నాడు. "మునులారా ! ఆపై ఆ క్షణంలోనే మహాకాంతిమంతుడు తేజస్వి అయిన నారాయణుడు వెంటనే నా ఎదురుగా, దగ్గరగా కనిపించాడు. ఆ తరువాత మంగళరూపుడైన ఆ పరమాత్ముని సమాగమంతో నేనెంతో సంతోషించాను అష్టభుజుడైన ఆ సనాతన దేవుడు నరనారాయణాశ్రమం వైపు రావటం నేను చూశాను. యాగాలు చేస్తున్న ఋషులను, మాటాడుకొంటున్న దేవతలను, ధ్యాన నిమగ్నులైన మునులను, యోగంలో ఉన్న సిద్ధులను, జపిస్తున్న నైష్ఠికులను, యజిస్తున్న గృహస్థులను అక్కడ చూశాను. ఆ నరనారాయణాశ్రమం ధూపదీపాలతో, అంతటా చల్లి ఉన్న పూలరాసులతో, సర్వజనహితకరమై, సర్వజనవందితమై ఉంది. అక్కడ నీళ్ళు చల్లి, చిమ్మారు. అనఘులారా ! అప్పుడు ఆ అద్భుతాన్ని చూసి నేను ఆశ్చర్యానికి లోనయ్యాను. అంతఃకరణాన్ని నియంత్రించి, శిరస్సు వంచి, ఆ దేవునకు నమస్కరించాను. అదంతా అద్భుతమనిపించింది. 'ఇదేమిటి' ? అని ఆలోచించాను. కానీ తెలియలేదు. సర్వజగత్తుకూ ఉత్పత్తి హేతువైన ఆ దివ్యపరమాత్మను గ్రహించలేకపోయాను. దుర్జయుడైన ఆ పరమాత్మకు పదే పదే ప్రణమిల్లి, తేరిచూసి, శిరస్సుపై చేతులు జోడించి, విస్మయంతో కన్నులు వికసించగా శ్రేష్ఠ పురుషులలో శ్రేష్ఠుడైన ఆ ఉదార పురుషోత్తమునితో

ఇలా అన్నాను. 'భగవంతుడా ! భూత భవిష్యద్వర్తమాన ప్రభూ ! నీకు నమస్కారం. దేవా ! నీకు సంబంధించిన ఈ అద్భుతాన్ని నేను చూశాను. దీనికి మొదలు ఎక్కడ ? మధ్యమెక్కడ ? అంతమెక్కడ ? ఇదంతా ఏమిటి ? నాకు చెప్పవలసినది. నన్ను నీ భక్తునిగా భావిస్తే, నాపై అనుగ్రహముంటే, నేను వినదగినదే అయితే నాకు పూర్తిగా చెప్పవలసినది. నీ స్వభావాన్ని తెలియటం కష్టం. ఆ భవుడవైన నీ ప్రాదుర్భావాన్ని తెలియటమూ కష్టమే. వర్తమాన, భూత, భవిష్యత్తులకు నీవు అధిపతివి. సర్వధా నిన్ను తెలియలేము మహామునీ ! అన్నివైపులా అగ్నులు ప్రజ్వరిల్లుతూ కనిపించాయి. అవి ఏమిటి ? ఆ ఆశ్చర్యకరమైన అద్భుత వృత్తాంతాన్ని నాకు నిశ్శేషంగా చెప్పు ఆ అగ్నిహోత్రాలు ఏవి ? అదృశ్యులై నిరంతరంగా వేదపఠనం చేస్తున్న ఆ మహాత్ములెవరు. నేను విన్న శబ్దమేమిటి ? భగవంతుడా ! కృష్ణా ! ఇదంతా నాకు పూర్తిగా చెప్పు అగ్ని సమీపంలో వేదాలు వల్లిస్తున్న ఆ బ్రాహ్మణగణాలు ఎవరు ?"

శ్రీ భగవానుడు చెప్పున్నాడు. "దేవతలు .కానీ, గంధర్వులు కానీ, పిశాచాలు కానీ, రాక్షసులు కానీ నాతత్వం తెలియలేరు. నేను సర్వతత్వాలలోనూ సూక్ష్మాత్మ స్వరూపంతో ఉంటాను. లోకహితం కోసం నన్ను నేను నాలుగు రకాలుగా విభజించుకొన్నాను నేనే భూతాన్ని, నేనే వర్తమానాన్ని, నేనే భవిష్యత్తును, నేనే ఆదిని నాకు ఆది ఎవ్వరూ లేరు నేనే విశ్వ సృష్టలలో ఉత్తముడను. పృధివి, వాయువు, ఆకాశం, నీరు, నిప్పు, మనస్సు, బుద్ధి, అహంకారం, తమస్సు, సత్వం, రజస్సు, ప్రకృతి, వికృతి, విద్య, అవిద్య, శుభం, అశుభం - ఇవన్నీ నా నుండి పుడతాయి. నేను దేనినుండీ కూడా పుట్టను. మానవుడు శ్రేయోభావనలో నిలిచి ధర్మయుక్తమూ, పవిత్రమూ అయిన ఏ శ్రేష్ఠభావాన్ని నిర్ణయించినా అదంతా విరామయుడనైన నేనే స్వభావాన్నీ, ఆత్మతత్వాన్ని తెలిసినవారు ఆయా కారణాలతో సాక్షాత్కరించుకొనే పురుషుడను నేనే. నేను ఆది మధ్యాంతరహితుడనూ, సర్వాంతరాత్మనూ, సనాతన పురుషుడను కూడా. సూక్ష్మార్థాలనూ, సూక్ష్మభావాలనూ తెలిసినవారు పరమరహస్యమైన నా రూపాన్ని గ్రహిస్తారు. చింతనీయుడైన ఆ సనాతన పరమాత్మను నేనే. నా పరమ రహస్యరూపంతోనే ఈ జగమంతా వ్యాపించి ఉంది అలా సర్వసత్వ స్వరూపమైన పరమాత్మను నేనే వీటి అన్నింటికీ కారణం నేనే. నేను అవ్యయుడను. పక్షిరాజా ! నా నుండి ప్రాణులు పుడతాయి. నేనే అహర్నిశం వాటిని ధరిస్తాను. ప్రళయకాలంలో నాలోనే లీనమవుతాయి. కశ్యపసుతా ! నన్ను ఎవరు ఎలా గ్రహిస్తే వారికి నేను అటువంటివాడనే. పక్షీ ! నేనే అందరి మనస్సులో, బుద్ధిలో ఉండి వారికి శ్రేయస్సు కలిగిస్తాను. పక్షి శ్రేష్ఠా ! నీవు నన్ను తెలిసికోవాలని ఆలోచించావు. నేను ఎవడనో, ఎక్కడ నుండి వచ్చానో, దేనికోసం ఉద్యమిస్తున్నానో చెపుతా విను.

కొందరు బ్రాహ్మణులు మనస్సును నియంత్రించి, త్రేతాగ్నులపై ఆసక్తిగొని, నిత్యమూ అగ్ని కార్య తత్పరులై, జపహోమ పరాయణులై ఉంటారు. కొందరు నియమపూర్వకంగా, ఇంద్రియాలను నియంత్రించి, తమలోనే అగ్న్యాధానం చేసికొని, అనన్యమనస్కులై నన్ను ఉపాసిస్తుంటారు. కొందరు తమను తాము పూర్తిగా నియంత్రించుకొని జపయజ్ఞాలతో మానసయజ్ఞాలతో నన్ను సేవిస్తుంటారు. కొందరు అగ్ని హోత్రతత్పరులై సదా అగ్నులనే స్వాగతిస్తూ, మరే పనీ చేయకుండా పవిత్రభావంతో అగ్నులనే ఆరాధిస్తుంటారు ఇలా వివిధాభిప్రాయాలుగల ఆ ధీరులు ఆయా భావాలకు అనుగుణంగా

నన్ను చేరుతారు. నిష్కామభావనతో సంకల్పాలను తొలగించుకొని, నిత్యమూ జ్ఞానసిద్ధి మీదనే మనస్సును ఏకాగ్రతతో నిలిపి, తమలోనే అగ్న్యాధానం చేసికొని, నిరాహారులై, నిరాకాంక్షులై, విషయారంభాలను పరిత్యజించి, బంధవిముక్తులై, జ్ఞాననేత్రులై, స్వాభావికంగానే నియమ శీలురై, అనన్యమనస్కులైన ధీరులు నన్ను చేరుతారు. నీవు ఆకాశంలో కమలాలతో, కలువలతో నిండిన సుందర సరోవరాన్ని చూశావు. దాని సమీపంలో ప్రతిష్ఠింపబడి ఇంధనం లేకుండానే ప్రజ్వలిస్తున్న అగ్నులను చూశావు. పక్షీ ! జ్ఞాన దీప్తితో నిర్మలమైన అంతఃకరణాలు కలిగి, చంద్రకిరణాల వలె ప్రకాశిస్తున్న వారే అక్కడ స్పష్టంగా అక్షరాలను పలుకుతూ వేదమంత్రోచ్చారణ పూర్వకంగా అగ్నిని ఉపాసిస్తున్నారు. వారు పవిత్రభావంతో అగ్ని పరిచర్యను కోరుకొంటున్నవారు. సదా మదుపాసనాను రక్తులై, నా గూర్చి ఆలోచించిన కారణంగా పవిత్రాంతఃకరణులై, రోగశోకరహితులై జ్యోతిస్స్వరూపులై వారు నన్నే ఉపాసిస్తుంటారు. వారు ఎప్పుడూ దారితప్పని వారు. వీతరాగులై వారు అక్కడే నివసిస్తుంటారు. చంద్రకిరణాల వంటి కాంతితో ప్రకాశించేవారు నిరాహారులై, స్వేదబిందురహితులై, నిర్మలులై, నిరహంకారులై, నిరాలంబులై, నిష్కాములై సంతతమూ నా భక్తులై ఉంటారు. నేను కూడా వారి భక్తుడనే.

జగద్ధితం కోరి నన్ను నేను నాలుగుగా విభజించుకొని సంచరిస్తుంటాను. లోకధారణకోసం నేను విధానాన్ని కూడా ఏర్పరుస్తాను. దానిని యథాతథంగా, పూర్తిగా వినటానికి నీవు అర్హుడవే. నాలుగు రూపాలలో ఒకటి నిర్గుణమూర్తి. పరమయోగాన్ని ఆశ్రయించి ఉంటుంది. నాయనా ! రెండవ మూర్తి చరాచర భూతసమూహాన్ని సృష్టిస్తుంది. సృష్టించిన ఈ స్థావర జంగమాత్మకమైన జగత్తును మరొకమూర్తి సంహరిస్తుంది. నాలుగవ మూర్తి ఆత్మనిష్ఠం. అది ఆసురశక్తులను మాయామోహితులను చేసి నశింపజేస్తుంది. తన మాయతో ఆసురశక్తులను మోహింపజేసి, నశింపజేసే ఆత్మనిష్ఠమైన నా నాలుగవమూర్తి నియమపూర్వకంగా నిలిచి జగత్తును వర్ధిల్లజేస్తూ, రక్షిస్తుంది. ఖేచరా ! ఆ నాలుగవమూర్తిని నేనే. నేనే జగమంతా వ్యాపించి ఉంటాను. నాలోనే జగమంతా ఉంటుంది. సర్వజగత్తుకు నేనే బీజం. నేనే సర్వగతిని, అవ్యయుడను. విహంగమా ! ఆ అగ్నిహోత్రాలను చూశావు. వాటి దగ్గర కూర్చొని చంద్రకిరణాల రాసులవలె ప్రకాశిస్తూ నిరంతరంగా వేదాలను వల్లిస్తున్న వారిని చూశాను. వారు జ్ఞాన సంపన్నులై, సుఖించి, క్రమంగా నన్ను చేరుతారు. దీప్తమైన వారి తపస్సు, చక్కగా ప్రోదిచేసికొన్న వారి తేజస్సు నేనే. వారెప్పుడూ నాలో ఉంటారు. నేను కూడా సావధానంగా వారిలో ఉంటాను. అన్నివైపుల నుండి ఆసక్తిని విడనాడి, అనన్య భావంతో మనస్సును నాపై నిలిపి, జ్ఞాననేత్రంతో నన్ను సాక్షాత్కరింప జేసికొనవచ్చు. సంన్యాసాన్ని స్వీకరించి, అనన్య భావంతో ధ్యానతత్పరులైన వారు నన్ను చేరగలరు. బుద్ధిలో సత్త్వగుణాన్ని నిలుపుకొని, నిర్గుణాత్మతత్త్వాన్ని నిశ్చయించుకొని, స్వాత్మరూపుడై, అవ్యయుడైన పరమాత్మను చూడవచ్చు. సర్వప్రాణుల విషయంలో అహింస, ఋజుత్వం వారిలో ఉంటాయి. ఆ గుణాలలోనే లగ్నమైన హృదయాన్ని నాపై చక్కగా నిలిపి వారు అవ్యయుడనైన నన్ను చేరగలరు. ఇది పరమ రహస్యమూ, పరమాద్భుతమూ అయిన ఆఖ్యానం. దీన్ని సావధానంగా, యథాతథంగా, పూర్తిగా వినదగిన వాడవు. నియతాగ్నిహోత్రులై, జపయజ్ఞపరాయణులై, నిరంతరంగా నన్ను ఉపాసించేవారు వీరు. నీవు ప్రత్యక్షంగా చూశావు వీరిని. వీరు శాస్త్రోక్తవిధానాన్ని ఎరిగి, అనాసక్తంగా సత్కర్మలు చేసేవారు. ఒక్కొక్కసారి దానికి భిన్నంగా ఉంటారు. సత్కర్మల మీద కూడా దృష్టిపోదు.

వారు నన్ను గ్రహించగలరు. నా అవ్యయపరతత్త్వాన్ని గ్రహింపగలరు. కాబట్టి పరిశుద్ధ జ్ఞానంతో పవిత్రమైన మనస్సు కలిగి, ఆత్మతత్త్వ మెరిగి, పవిత్రుడైన జ్ఞాని ఆ బ్రహ్మపదాన్ని పొందగలడు. అక్కడకు చేరిన తరువాత దుఃఖముండదు.

పవిత్ర వంశంలో జన్మించిన ద్విజోత్తములు శ్రద్ధాసక్తమైన మనస్సుతో, నా మీది భక్తితో పరమగతిని పొందవచ్చు. పరబ్రహ్మ బుద్ధికి అతీతం. పరమరహస్యం. ఏ ఆకృతితోనో గ్రహింప వీలు కానిది అనుభవానికి రానిది. దానిని తత్త్వద్రష్టలు, సంన్యాసులు అయిన విప్రులే గ్రహింపగలరు. అక్కడ గాలి ప్రసరించదు గ్రహ నక్షత్రాలకు అక్కడ గతిలేదు. జలముండదు. నేల ఉండదు. ఆకాశముండదు. మనస్సు కూడా అక్కడ ప్రవర్తించదు. విహంగమా ! దాని నుండి సర్వద్రవ్యాలు పుడతాయి వ్యాపన శీలుడు, నిర్మలుడు అయిన ఆ పరమాత్మ వాటి అన్నింటి నుండియే అన్నింటిని పుట్టింపగలుగుతాడు. అనఘా ! నీవు నా స్థూల రూపాన్ని చూశావు. ఇది నా సూక్ష్మరూపంలో ప్రవేశించటానికి ద్వారం. సర్వకార్యాలకూ నేనే కారణం. అమిత విక్రమా ! అందువలననే నీవు నన్ను ఆ సరస్సులో చూడగలిగావు. యజ్ఞవేత్తలు నన్ను యజ్ఞమంటారు. వేదవేత్తలైన జనులు వేదమంటారు. మునులు నన్నే జపయజ్ఞమంటారు. నేనే వక్తను. నేనే ఆలోచించేవాడిని. రసాన్ని ఆస్వాదించే వాడు, వాసన చూసేవాడు, చూసేవాడు, చూపేవాడు, తెలిసికొనేవాడు, తెలియజెప్పేవాడు, వినేవాడు, చిదాత్మ - అన్నీ నేనే నా గురించి యజించిన యజమాని స్వర్గాన్ని చేరి ఆపై మహాపదాన్ని పొందగలడు. అలాగే అనాసక్తమైన మనస్సుతో నన్ను గ్రహించినవాడుకూడా మహాపదాన్ని పొందగలడు. బ్రాహ్మణుల తేజస్సును నేనే. నా తేజస్సే బ్రాహ్మణులు. నా తేజస్సుతో వ్యక్తమైన దేహమే అగ్ని అని గ్రహించు. శరీరంలో నేను ప్రాణ రక్షకుడను యోగులలో నేను ఈశ్వరుడను. సాంఖ్యులలో నేనే ప్రధానతత్త్వం. ఈ జగమంతా నాలోనే ఉంటుంది. ధర్మం, అర్థం, కామం, మోక్షం, ఋజుత్వం, జపం, తమస్సు, సత్త్వం, రజస్సు, కర్మఫలమైన పుట్టుక, వినాశం - అన్నీ నేనే. అప్పుడు ఆ సనాతనరూపంలో నన్ను నీవు చూశావు దానికన్నా పరమైన నా రూపాన్ని నీవు కాలక్రమంలో చూడగలవు. పరమగోపనీయమూ, శాశ్వతమూ, స్థిరమూ, అవినాశి అయిన నా గూర్చిన జ్ఞానం కూడా నీకు కాలక్రమంగా కలుగుతుంది. ఈ రీతిగా నారాయణ దేవుడు హరి పరమేశ్వరుడు పరమగోపనీయుడు (రహస్యంగా ఉంచదగినవాడు). పన్నగరిపూ ! లౌకికమైన అభ్యుదయాన్ని కోరేవారు ఆ నా స్వరూపాన్ని గ్రహించలేరు. కర్మలనారంభించటం మాని, నమస్కారాలకు దూరంగా నిలిచి, కామనలు, బంధనాల నుండి విముక్తులైన సంన్యాసులు సనాతన పరమాత్మ అయిన ఆ పరబ్రహ్మను చూడగలరు. విహగా ! అనఘా ! పన్నగాశనా ! ఈ రీతిగా నీకు నేను నా స్థూలరూపాన్ని ప్రదర్శించాను కానీ నీవు తప్ప ఇతరులు ఈ రూపాన్ని కూడా గ్రహించలేరు. నీ బుద్ధి నశింపకుండుగాక ! ఇది సర్వోత్తమగతి. నీవు నిత్యమూ నా భక్తుడవు కమ్ము. ఆపై నా స్వరూపం నీకు అర్థమవుతుంది. ఇది నీకు పూర్తిగా చెప్పాను ఇది మానవులకూ, దేవతలకూ కూడా రహస్యమే ఇది పరమశ్రేయస్సు, మోక్షాభిలాషగలవారికి కూడా ఇదే మార్గమని గ్రహించు". సుపర్ణుడు చెప్తున్నాడు "అలా చెప్పి ఆ భగవానుడు అక్కడే మాయమయ్యాడు. మహాయోగి, ఆత్మగతి స్వరూపుడు అయిన ఆయన నేను చూస్తుండగానే అదృశ్యుడయ్యాడు.

ఈ రీతిగా నేను గతంలో అచ్యుతుడు, ఆ ప్రమేయమహాత్ముడు అయిన ఆయన

మహిమను చూడగలిగాను. అద్భుత కర్మలు చేయగల ధీమంతుడైన ఆ నారాయణుని లీలను - నేను ప్రత్యక్షంగా చూసి అనుభవించిన దానిని - మీకు చెప్పాను". ఋషులిలా అన్నారు. "అత్యద్భుతమైన మహా ఖ్యానాన్ని నీవు వినిపించావు ఇది పుణ్యప్రదం, కీర్తికరం, ఆయుర్వర్ధకం, స్వర్గకారణం, మహాశుభప్రదం. పరంతపా ! ఈ పవిత్ర కథ దేవతలకు కూడా మహా రహస్యమే. జ్ఞానులు తెలియదగిన జ్ఞానమిదియే. ఉత్తమగతి ఇదియే. ప్రతిపర్వ సమయంలో ఈ కథను వినిపించిన పండితుడు దేవతలు ప్రశంసించే పుణ్య లోకాలను పొందగలడు. శ్రాద్ధకాలంలో పవిత్రుడై బ్రాహ్మణులకు దీనిని వినిపిస్తే ఆ శ్రాద్ధంలో రాక్షసులకు కానీ, అసురులకు కానీ భాగముండదు. అసూయారహితుడై, క్రోధాన్ని జయించి, సర్వభూత హితరతుడై దీనిని చదివినవాడు విష్ణుసాలోక్యాన్ని పొందగలడు. దీనిని చదివిన బ్రాహ్మణుడు వేదాలలో పారంగతుడు కాగలడు. క్షత్రియుడు విజయాన్ని పొందగలడు. వైశ్యుడు ధనధాన్యసంపన్నుడు కాగలడు. శూద్రుడు సుఖాన్ని పొందుతాడు". భీష్ముడు చెప్పున్నాడు. "ఆపై మునులందరూ వైనతేయుని పూజించి తమతమ ఆశ్రమాలకు వెళ్లారు. అక్కడ శాంతి సాధన తత్పరులయ్యారు. మహారాజా ! ధర్మధారులలో శ్రేష్ఠుడా ! పరంతపా ! మనస్సు అదుపులో లేక స్థూల రూపాలనే చూడగలవారికి ఈ హరి తత్త్వజ్ఞానం తేలికగా అర్థంగానిది. ఇది ధర్మబుద్ధమైన శ్రుతి. ఆశ్చర్యచకితులైన దేవతలకు బ్రహ్మ దీనిని చెప్పాడు. నాయనా ! నాకు కూడా నా తల్లి సమక్షంలో సత్త్వసంపన్నులైన వసువులచే ఈ కథ చెప్పబడింది. నేను నీకు దీనిని చెప్తున్నాను. అగ్నిహోత్రతత్పరులై, జపయజ్ఞ పరాయణులై, నిష్కాములై, బంధరహితులైన సజ్జనులు ఆ అక్షర పరమాత్మను చేరగలరు. క్రియారూపాలయిన యజ్ఞాలను వీడి, జపహోమ పరాయణులై, మనసా విష్ణువును ధ్యానించేవారు ఉత్తమగతిని పొందగలరు భారతా ! నిశ్చిత బుద్ధిగల పురుషులు పరమాత్మ తత్త్వాన్ని గ్రహించి, పరమగతిని పొందగలరు అదియే మోక్షం, లేదా మోక్షద్వారం.

14. మేఘువాహన పర్వాఖ్యానము.

యుధిష్ఠిరుడడిగాడు. రాజా ! పితామహా ! బ్రహ్మద్వారా నీవు కళ్యాణ కారకాలైన ఈశ్వరుని నామాలను కూడా విన్నావు గదా ! ఆ నామాలను చెప్పు. బభ్రువు, విశ్వరూపుడు, సురాసుర గురువు అయిన శంకర దేవుని మాహాత్మ్యాన్ని కూడా యథాతథంగా చెప్పు".

భీష్ముడు చెప్పున్నాడు. ధీమంతుడైన ఆ మహాదేవుని గుణాలను వివరించటానికి నేను అశక్తుడను. ఆ దేవుడు అన్ని చోట్లా ఉంటాడు. కానీ ఎక్కడా కనిపించడు. బ్రహ్మ, విష్ణువు, ఇంద్రులకు ఆయన సృష్టికర్త. ప్రభువు. బ్రహ్మ మొదలు పిశాచాల వరకు ఆ దేవుని ఉపాసిస్తారు. ఆయన ప్రకృతికి అతీతుడు. పురుషునకు కూడా అతీతుడు. తత్త్వ దర్శనులయిన యోగులు, ఋషులు ఆయనను గూర్చి ఆలోచిస్తుంటారు. ఆయన అక్షర పరబ్రహ్మ, సత్తు, అసత్తు ఆయనయే. ఆయన తన తేజస్సుతో ప్రకృతిని, పురుషుని క్షోభింపజేసి, బ్రహ్మను సృష్టించాడు. అందువలన ఆ దేవదేవుడు ప్రజాపతి. ధీమంతుడైన

ఆమహాదేవుని గుణాలను వర్ణించటానికి గర్భావాస జనన వార్ధక్యాలతో, మృత్యువుతో కూడిన ఏ మర్త్యుడు సమర్థుడు కాగలడు ? నాయనా ! శంఖ చక్రగదాధారి అయిన నారాయణుడు తప్ప నావంటివాడు ఎవడు పరమేశ్వరుడైన ఆ శివుని గూర్చి తెలిసికొనగలడు ? ఈ నారాయణుడు విద్వాంసుడు. గుణోత్తముడు సర్వవ్యాపి. గెలువ వీలుకానివాడు. దివ్య నేత్రుడు. మహా తేజస్వి. కాబట్టి యోగదృష్టితో ఆయనను చూడగలడు. రాజేంద్రా ! భారతా ! రుద్రుని మీదగల భక్తితోనే మహాత్ముడైన కృష్ణుడు విశ్వమంతా వ్యాపించగలిగాడు. గతంలో బదరీవనంలో ఆ దేవుని ప్రసన్నుని చేసికొని, దివ్య దృష్టిగల ఆ మహేశ్వరుని నుండి సర్వపదార్థాలకన్న ప్రియతర భావాన్ని పొందగలిగాడు. అందుకే లోకాలలో ఆయన ప్రియతముడు కాగలిగాడు. ఈ మాధవుడు వరదాయకుడు, చరాచర గురువు అయిన మహాదేవుని ప్రసన్నుని చేసికొంటూ నిండు వేయి సంవత్సరాలు తపస్సు చేశాడు. కృష్ణుడు ప్రతియుగంలోనూ పరమ భక్తి భావంతో మహేశ్వరుని సంతోషపెట్టాడు. మహాత్ముడైన శ్రీకృష్ణుని భక్తితో ఆయన ప్రసన్నుడయ్యాడు. జగత్తునకు కారణభూతుడైన ఆ మహాత్ముని ఐశ్వర్యం ఎటువంటిదో సాక్షాత్తుగా చూడగలిగాడు ఈ శ్రీహరి. అప్పుడు ఈయన పుత్రుల కొరకై అచ్యుతుడై తపస్సు చేస్తున్నాడు. భారతా ! ఆ ఐశ్వర్యం వల్లనే ఆ దేవదేవుని నామాలను పూర్తిగా వర్ణించటానికి పరాత్పరుడైన శ్రీకృష్ణుడు తప్ప మరొకడు నాకు కనిపించడు. రాజా ! మహాబాహువైన శ్రీకృష్ణుడే ఐశ్వర్యశాలి అయిన శివుని గుణాలను, మహేశ్వరుని విభూతిని (ఐశ్వర్యాన్ని) పూర్తిగా వర్ణించగలడు.

వైశంపాయనుడు చెప్తున్నాడు. ఆ రీతిగా ధర్మరాజుతో పలికి, మహాయశస్వి అయిన భీష్మ పితామహుడు భవమాహాత్మ్యానికి సంబంధించి వాసుదేవునితో ఇలా అన్నాడు. "సురాసురగురూ ! దేవా ! విష్ణూ ! యుధిష్ఠిరుడు నన్ను అడిగిన ఈ విశ్వరూప పరమేశ్వర మాహాత్మ్యాన్ని నీవే చెప్పగలవు. పూర్వకాలంలో బ్రహ్మ కుమారుడైన తండి బ్రహ్మ లోకంలో బ్రహ్మ సమక్షంలో ఈ మహేశ్వరుని సహస్రనామాలను నిరూపించాడు గదా ! వ్యాసుడు మొదలైన తపోధనులు; సద్వ్రతశీలురు, జితేంద్రియులు అయిన ఈ ఋషులు నీవు చెపితే వాటిని వింటారు. కూటస్థుడు, ఆనంది, హోత, రక్షకుడు, విశ్వస్రష్ట, అగ్ని, కొప్పులేని వాడు (ముండి), కపర్ది (జటాజూట ధారి) అయిన ఆ శంకరుని మాహాత్మ్యాన్ని వర్ణించి చెప్పు"

వాసుదేవుడు చెప్తున్నాడు. "ఈశ్వరుని కర్మగతిని వాస్తవంగా తెలిసికొనగలగటం ఆశక్యం. బ్రహ్మ మొదలయిన దేవతలు, దేవేంద్రుడు, మహర్షులు, సూక్ష్మదృష్టిగల

ఆదిత్యులు కూడా ఆయన ఉనికిని తెలిసికొన లేరు. ఇక సజ్జనులకు గతి అయిన ఆయనను గూర్చి మానవ మాత్రుడెలా తెలిసి కొనగలడు ? అసురసంహారి, వ్రతేశ్వరుడు అయిన ఆ భగవంతుని గుణాలను కొన్నింటిని యథాతథంగా మీకు వర్ణించి చెపుతాను".

వైశంపాయనుడు చెప్తున్నాడు. 'అలా పలికి కృష్ణ భగవానుడు ఆచమించి, పవిత్రుడై, ధీమంతుడు, మహాత్ముడు అయిన ఆ మహేశ్వరుని గుణాలను చెప్పసాగాడు.'

వాసుదేవుడు చెప్తున్నాడు. "నాయనా ! యుధిష్ఠిరా ! బ్రాహ్మణోత్తములారా ! గాంగేయా ! మీరంతా ఆ కపర్దినామాలను వినండి. గతంలో నేను సాంబునికై సుదుష్కరమైన తపస్సు చేసినప్పుడు, సమాధిలో ఆయన సాక్షాత్కారాన్ని పొందినప్పుడు ఆ భగవానుడు నాకు చెప్పాడు. యుధిష్ఠిరా ! గతంలో ధీమంతుడైన రుక్మిణి కొడుకు ప్రద్యుమ్నుడు శంబరాసురుని చంపి, పండ్రెండు సంవత్సరాలు గడిచిన తరువాత; రుక్మిణీ కుమారులయిన ప్రద్యుమ్న, చారుదేష్ణాదులను చూసి, జాంబవతి పుత్రకామనతో నా దగ్గరకు వచ్చి నాతో ఇలా అన్నది. "అచ్యుతా ! నాకు నీతో సమానుడై, శూరుడై, బలశాలియై, సుందరుడై, నిష్కల్మషుడై, శ్రేష్ఠుడైన కుమారుని నాకు ప్రసాదించు జాగుసేయవద్దు. యదుకులో ద్వహా ! మూడులోకాలలో కూడా నీవు పొందవలసినది ఏదీ లేదు. నీవు తలచుకొంటే వేరువేరు లోకాలను సృష్టించగలవు కూడా ! నీవు పండ్రెండు సంవత్సరాలపాటు వ్రతంగానే మారిపోయి, శరీరాన్ని శుష్కింపజేసి, మహేశ్వరుని ఆరాధించి, రుక్మిణీ గర్భం ద్వారా పిల్లలను కన్నావు. చారుదేష్ణుడు, సుచారుడు, చారువేశుడు, యశోధరుడు, చారుశ్రవుడు, చారుయశుడు, ప్రద్యుమ్నుడు, శంభువు, చారుసుందరులైన వీరందరూ రుక్మిణిలో నీకు కొడుకులుగా పుట్టారు. అలాగే నాకు కూడా కుమారుని ప్రసాదించు." జాంబవతి అలా ప్రేరేపించగా ఆ సుమధ్యమతో ఇలా అన్నాను. "రాణి ! నేను వెళ్ళటానికి అనుమతించు. నీ మాటను పాటిస్తాను." ఆమె కూడా నాతో ఇలా అన్నది. "వెళ్ళు ! నీకు శుభము, విజయమూ కలుగుతాయి. బ్రహ్మ, శివుడు, కాశ్యపుడు, నదులు, మనస్సును అనుసరించే దేవతలు, క్షేత్రాషధులు, యజ్ఞవాహకాలు (మంత్రాలు), ఛందస్సులు (వేదాలు), యజ్ఞాలు, సముద్రాలు, దక్షిణలు, స్తోభాలు (సామగానంలోని శబ్దాలు), నక్షత్రాలు, పితరులు, గ్రహాలు దేవపత్నులు, దేవకన్యలు, దేవమాతలు, మన్వంతరాలు, గోవులు, చంద్రుడు, సూర్యుడు, ఇంద్రుడు, సావిత్రి, బ్రహ్మవిద్య, ఋతువులు, సంవత్సరాలు, క్షణాలు, లవాలు, ముహూర్తాలు, నిమేషాలు, యుగాలు ఇవన్నీ అన్నిచోట్లా నిన్ను కాపాడుతాయి. యాదవా ! సుఖాన్ని కలిగిస్తాయి. నీ దారిలో నిర్విఘ్నంగా పయనించు, అనఘా !

సావధానంగా ఉండు."

ఇలా ఆమె ద్వారా స్వస్తివాచనం తరువాత నేను ఆ రాజకుమారి అనుమతి తీసుకొని, నరోత్తముడైన నా తండ్రి వసుదేవుని దగ్గరకు తల్లి దగ్గరకు, ఉగ్రసేనుని దగ్గరకు వెళ్ళి, విద్యా ధర రాజకుమారి అయిన జాంబవతి. ఆర్తితో నాతో అన్న మాటలను చెప్పి, వారి అనుమతి తీసికొన్నాను.

ఆపై అత్యంతబలశాలి అయిన బలరామునితో, గదునితో కలిసి వారి అనుమతి తీసికొన్నాను. అప్పుడు వారు తీవ్రదుఃఖంతో, ప్రీతితో నిర్విఘ్నంగా నీ తపస్సు వర్ధిల్లుగాక అని పలికారు. అలా గురుజనులనుండి అనుమతిని పొంది, నేను గరుడుని తలచుకొన్నాను. అతడు నన్ను హిమవత్పర్వతానికి చేర్చాడు. అక్కడకు చేరి గరుడుని పంపించివేశాను.

అక్కడ ఆ శ్రేష్ఠపర్వతంపై నేను అద్భుతభావాలను చూశాను. ఆ ప్రదేశం తపస్సుకై అద్భుతమైన ఉత్తమ ప్రదేశంగా నా కనిపించింది. అక్కడ వ్యాఘ్రపాదుని కొడుకు, మహాత్ముడు అయిన ఉపమన్యుని ఆశ్రమ ముంది. అది దేవగంధర్వపూజితం, బ్రాహ్మలక్ష్మీ సంపన్నం. అక్కడ ఫలపుష్పాల నిచ్చే రకరకాల ఆటవిక వృక్షాలున్నాయి. అవి ధవం, కకుభం, కదంబం, నారికేలం, కురవకం, కేతకం, జంబువు, పాటలం, వటం, వరుణకం, వత్సనాభం, బిల్వం, సరళం, కపిత్థం, ప్రియాలం, సాలం, తాలం, బదరి, కుందం, పున్నాగం, అశోకం, ఆమ్రం, అతిముక్తకం, మధూకం, కోవిదారం, చంపక, పనసం, మొదలగు చెట్లు పూలు, పొదలు, లతలు వ్యాపించి ఉన్నాయి. కదళీవనాలు ఆశ్రమానికి శోభను కలిగిస్తున్నాయి. వివిధ పక్షులకు ఆహారమైన ఫలాలు, చెట్లు ఆశ్రమానికి అలంకారంగా ఉన్నాయి. తగిన స్థానాలలో ఉంచిన భస్మ సమూహాలతో ఆశ్రమం శోభిస్తోంది. దుప్పులు, కోతులు, పులులు, సింహాలు, చిరుత పులులు, జింకలు, నెమళ్ళు, పిల్లులు, పాములు, వివిధ మృగజాతుల సమూహాలు, మహిషాలు, ఎలుగుబంట్లతో సమీపవనాలు నిండి ఉన్నాయి. మొదటి సారిగా మదధారను స్రవిస్తున్న ఏనుగులు, ఆనందంగా సంచరిస్తున్న వివిధ పక్షులు ఆ ఆశ్రమాన్ని సేవిస్తూ, దానిని అలంకరించాయి. చక్కగా పుష్పించి, మేఘాలవలె కనిపిస్తున్న విచిత్ర తరు వనాలతో ఆశ్రమం శోభిస్తోంది. రకరకాల పూల పుప్పొడులతో కలిసి, ఏనుగుల మదజలంతో పరిమిళితమై, దివ్య కాంతల గీతధ్వనితో కలిసి గాలి అనుకూలంగా వీచింది. జారుతున్న సెలయేళ్ళ చప్పుళ్ళతో, పక్షుల కలరవాలతో, శుభప్రదాలైన ఏనుగుల ఘీంకారాలతో, మనోహరాలయిన కిన్నరుల గానాలతో, సామగాన శుభస్వనాలతో ఆ ఆశ్రమం సంగీతమయమైంది. ఆ హిమగిరి ఇతరుల ఊహలకు కూడా అందని సరస్సులతో అలంకరింపబడి ఉంది. పైన పుష్పాలంకరణలు గల పెద్దపెద్ద

అగ్ని గృహాలు దాన్ని శోభింపజేస్తున్నాయి.

సతతమూ పుణ్య పవిత్ర జలాలతో ప్రవహించే జాహ్నవి (గంగ) ఆ హిమగిరిని సేవిస్తూ శోభ చేకూరుస్తోంది. అగ్ని సమానులై, ధర్మధారులలో శ్రేష్ఠులైన మహాత్ములు ఆ ప్రదేశానికి వన్నె కలిగిస్తున్నారు.

అన్ని వైపులా బ్రాహ్మణోత్తములు దానిని సేవిస్తున్నారు. వారిలో కొందరు గాలిని ఆహారంగా స్వీకరించేవారు. కొందరు నీటిని మాత్రమే త్రాగేవారు. కొందరు నిత్యమూ జపతత్పరులు. కొందరు చిత్తాన్ని ప్రక్షాళన చేసికొనేవారు. కొందరు నిత్యమూ ధ్యానపరులైన యోగులు. కొందరు పొగను త్రాగేవారు. కొందరు సూర్యకిరణాలు ఆస్వాదించేవారు. మరి కొందరు క్షీరపానం చేసేవారు. కొందరు గోసేవకులు. కొందరు రాళ్ళతో కొట్టి భక్షించే వారు. కొందరికి దంతాలే రోళ్ళు, రోకళ్ళు. కొందరు కిరణాలను ఆస్వాదించేవారు. కొందరు నురుగు త్రాగేవారు. కొందరు మృగాలతో పాటు సంచరించేవారు. కొందరు అశ్వత్థఫలాలను తినేవారు. కొందరు నీటిలో శయనించేవారు. కొందరు నారబట్టలు, చర్మాలు ధరించినవారు. కొందరు మృగచర్మాలు ధరించినవారు. కష్టకారణాలయిన ఆయా నియమాలను పూని, తపోధనులయిన వివిధ మునులను చూస్తూ ఆశ్రమంలో ప్రవేశించసాగాను. ఆ ఆశ్రమ మండలం సర్వదా మహాత్ములై, పుణ్యకర్ములయిన శివాది దేవతలచే పూజింపబడుతూ ఆకాశంలో చంద్రమండలంవలె రాజిల్లుతోంది. తీవ్రమైన తపస్సు నాచరించే ఆ మహాత్ముల ప్రభావం వలన, సాన్నిధ్యం కారణంగా అక్కడ ముంగిసలు పాములతో ఆడుకొంటున్నాయి. పులులు జింకలతో మిత్రులవలె ప్రవర్తిస్తున్నాయి. ఆ ఆశ్రమపదం శ్రేష్ఠం. సర్వప్రాణి మనోహరం. వేదవేదాంగ వేత్తలైన బ్రాహ్మణోత్తములు, వివిధ నియమాలతో ప్రఖ్యాతులై, మహాత్ములైన ఋషులు దాన్ని సేవిస్తున్నారు. ఆశ్రమంలో ప్రవేశిస్తూనే జటాచీరలను ధరించి, సమర్థుడై, తేజస్సుతో, తపస్సుతో అగ్నివలె ప్రజ్వలిస్తున్న బ్రాహ్మణశ్రేష్ఠుని చూశాను. ఆయన యువకుడు, ప్రశాంతుడు. శిష్యులు ఆయన ననుసరించి ఉన్నారు. నేను తలవాల్చి నమస్కరించాను. ఆ స్థితిలో నన్ను చూసి, ఉపమన్యు విలా అన్నాడు. 'పుండరీకాక్షా ! స్వాగతం మా తపస్సులు సఫల మయ్యాయి. పూజింపదగిన నీవే మమ్ము పూజిస్తున్నావు. చూడదగిన నీవే మమ్ము చూడగోరుతున్నావు.' నేను చేతులు జోడించి మృగాలు, పక్షులు, అగ్నులు, ధర్మం, శిష్య వర్గం వీటి క్షేమాన్ని గురించి ఆయన నడిగాను.

అప్పుడు ఆ భగవానుడు పరమ మధురంగా నన్ను అనునయిస్తూ ఇలా అన్నాడు. "కృష్ణా ! నీతో సమానుడైన కుమారుని పొందగలవు. సంశయం లేదు. మహాతపస్సు

నారంభించి ఈశ్వరుడైన మహేశుని సంతోషపెట్టు. ఆయన ఈ పర్వతం మీదనే భార్యతో కలిసి క్రీడిస్తున్నాడు. జనార్దనా ! దేవతా శ్రేష్ఠుడైన మహేశ్వరుని ఇక్కడనే గతంలో దేవతలు, ఋషులు తపస్సుతో, బ్రహ్మచర్యంతో, సత్యంతో, జితేంద్రియత్వంతో సంతోషపెట్టి తమ శుభమనోరథాలను పొందగలిగారు. నీవు ప్రార్థిస్తున్న ఆ శంకర భగవానుడు తేజస్సులకు, తపస్సులకు నిధి. ఆలోచన కందనివాడు. ఆయన శుభ భావాలను సృష్టిస్తూ, అశుభ భావాలను సంహరిస్తూ పార్వతీ దేవితో కలిసి ఇక్కడే ఉంటాడు. మేరువునే కంపింపజేసిన హిరణ్యకశిపుడనే దానవు డొకడుండేవాడు. ఆయన శివుని ద్వారా పదికోట్ల సంవత్సరాలవరకు సర్వదేవాధిపత్యాన్ని పొందగలిగాడు. ఆయన మేటి కొడుకు మందారు డన్న పేర ప్రసిద్ధి కెక్కిన వాడు మహాదేవుని వరప్రభావంతో పదికోట్ల సంవత్సరాలపాటు ఇంద్రునితో పోరాడాడు. కేశవా ! గతంలో భయంకరమైన విష్ణు చక్రమూ, ఇంద్రుని వజ్రాయుధమూ ఆగ్రహుని (మందారుని) శరీరంపై బడి శిథిల మయ్యాయి. పూర్వకాలంలో నీటిలోపల సంచరిస్తూ బలగర్వితుడైన రాక్షసుని చంపి, మహేశుడు నీకు చక్రాన్ని ఇచ్చాడు గదా ! మండిపడుతున్న అగ్నితో సమానమైన ఆ చక్రాన్ని వృషభధ్వజుడే (శివుడు) స్వయంగా సృష్టించి, నీకు ఇచ్చాడు. భగవద్దత్తమైన ఆచక్రం అద్భుత తేజస్సుగలదీ, ఎదురులేనిది శివుడు తప్పమరెవ్వరూ దానిని చూడలేకపోయారు. అప్పుడు శివుడు ఇది సుదర్శన (చూడదగినది) మవుతుంది అన్నాడు. అప్పటి నుండి దానికి లోకంలో సుదర్శన మన్న పేరు వచ్చింది. కేశవా ! అటువంటి ఆ చక్రం మందారుని శరీరాన్ని తాకి శిథిలమైంది. శంకరుడు ఆయనకు వరమిచ్చాడు. ధీమంతుడు, మహా బలశాలి అయిన ఆ గ్రహుని (మందారుని) శరీరంపై చక్రాలు, వజ్రాల వంటి ఆయుధాలు వందలయినా పనిచేయవు. మహా బలశాలియైన గ్రహుని పీడనకు లోనై దేవతలు కూడా శివుని ద్వారా వరం పొందిన ఆ రాక్షసేంద్రులను తీవ్రంగా సంహరించసాగారు. ఇలాగే విద్యుత్ప్రభుని తపస్సును మెచ్చి కూడా శంకరుడు ఆయనకు త్రిలోకాధిపత్య మిచ్చాడు. లక్ష సంవత్సరాలపాటు విద్యుత్ప్రభుడు సర్వలోకాధిపతి అయ్యాడు. ఎప్పుడూ నా అనుచరుడవుగానే ఉంటావని కూడా వరమిచ్చాడు. అలాగే విద్యుత్ప్రభునకు కోటి మంది కొడుకులను కూడా అనుగ్రహించాడు. పూజ్యుడైన ఆ అజుడు (శివుడు) విద్యుత్ప్రభునకు కుశద్వీపాన్ని కూడా రాజ్యంగా ఇచ్చాడు. అలాగే బ్రహ్మ ఒకసారి శతముఖుడనే మహారాక్షసుని సృష్టించాడు. ఆయన నూరు సంవత్సరాలకన్న ఎక్కువ కాలం తన మాంసాన్నే అగ్నికి ఆహుతి చేశాడు. దానితో ఆనందించిన శంకర భగవానుడు 'ఏం చేయమంటావు' అని అడిగాడు. ఆ

శతముఖుడు 'నాకు అద్భుత యోగం సిద్ధించాలి. దేవతాశ్రేష్ఠా ! శాశ్వతంగా నిలిచే బలాన్ని కూడా నాకిమ్ము' అని కోరాడు. 'అలాగే' అని ప్రభువైన శంకర భగవానుడు అతని మాటను అంగీకరించాడు. ఇలాగే స్వయంభువు కుమారుడైన క్రతువు గతంలో పుత్రుల కోసం, మూడు వందల సంవత్సరాలపాటు యోగంతో తనను తాను పరమేశ్వరుని చింతనలో నిలిపాడు. అప్పుడు శివుడు క్రతువువంటి కొడుకులను వేయి మందిని అనుగ్రహించాడు. కృష్ణా ! దేవతలు కూడా కీర్తించే యోగేశ్వరుని, మహేశ్వరుని నీ వెరుగుదువు. సంశయంలేదు. యాజ్ఞ వల్క్యుడన్న ప్రసిద్ధి గల పరమధార్మికుడైన ఋషి మహాదేవుని ఆరాధించి, సాటిలేని కీర్తిని పొందాడు. పరాశర కుమారుడు యోగాత్ముడైన వేదవ్యాసముని కూడా శంకరుని ఆరాధించి, అసమాన కీర్తిని పొందాడు. గతంలో వాలఖిల్య మహర్షులు ఇంద్రుని పరాభవానికి గురి అయ్యారు. వారు క్రుద్ధులై తపస్సుతో రుద్రభగవానుని సంతోషపెట్టారు. దేవతా శ్రేష్ఠుడు జగత్పతి అయిన శివుడు వారి తపస్సుతో ప్రసన్నుడై, 'మీరు తపస్సుతో గరుడుని పుట్టిస్తారు. అతడు అమృతాన్ని అపహరిస్తాడు' అని వారికి మాట ఇచ్చాడు. గతంలో మహాదేవుని కోపంవలన నీళ్లు అదృశ్య మయ్యాయి. అప్పుడు దేవతలు సప్తకపాల యజ్ఞంతో వేరే జలాన్ని సృష్టించారు. రుద్రుడే సప్త కపాల యజ్ఞానికి అధిపతి. ఈ రీతిగా త్రినేత్రుని ప్రసన్నతతోనే లోకంలో నీరు నిలిచింది. అత్రి భార్య అనసూయ. ఆమె బ్రహ్మవాదిని. ఆమెను భర్తను వీడి, "ఇక మరలా ఆయన కెప్పుడూ నేను లొంగను" అని చెప్పి, మహాదేవుని శరణు కోరింది. అత్రిమునికి భయపడుతూ ఆమె నిరాహారంగా మూడు వందలసంవత్సరాల పాటు, శివుని అనుగ్రహం కోసం రోకళ్ళ మీదనే శయనించింది. అప్పుడు మహాదేవుడు నవ్వుతూ ఆమెతో ఇలా అన్నాడు. "దేవి ! నా అనుగ్రహం వలన నీకు నీ భర్త అయిన రుద్రునితో కలయిక లేకుండానే కొడుకు పుడతాడు. సంశయం లేదు. ఆ కొడుకు నీ వంశంలో నీ పేరుతోనే కోరుకొన్నంత కీర్తిని పొందగలడు."

మధుసూదనా ! అలాగే భగవానుడైన వికర్ణుడు కూడా భక్తులకు సుఖాన్ని కలిగించే మహాదేవుని ప్రసన్నుని చేసికొని, సిద్ధిని పొందాడు. కేశవా ! శాకల్యుడు కూడా మనస్సును నిగ్రహించి, తొమ్మిది వందల సంవత్సరాలపాటు మనో యజ్ఞంతో శివుని ఆరాధించాడు. దానితో ఆనందించిన రుద్రభగవానుడు ఆయనతో ఇలా అన్నాడు. "వత్సా ! నీవు గ్రంథ కర్తవు కాగలవు. నీ కీర్తి మూడు లోకాలలోనూ అక్షయంగా నిలువగలదు. నీ వంశం మహర్షులచే అలంకరింపబడి, అక్షయ మవుతుంది. నీ కుమారుడు ద్విజోత్తముడై

సూత్రకర్త కాగలడు." కృతయుగంలో సావర్ణి అని ప్రఖ్యాతి చెందిన ఋషి ఉండేవాడు. ఆయన ఇహలోకంలో ఆరువందల సంవత్సరాల పాటు తపస్సు చేశాడు. రుద్రభగవానుడు సాక్షాత్కరించి 'అనఘా ! సంతోషించాను. నీవు గ్రంథకర్తవై, విశ్వ విఖ్యాతి నంద గలవు. అజరామరుడవు కాగలవు' అని వరమిచ్చాడు. జనార్దనా ! పూర్వకాలంలో ఇంద్రుడు భక్తి భావంతో వారాణసిలో దిగంబరుడు, భస్మభూషితుడైన రుద్రుని ఆరాధించాడు. ఆ మహాదేవుని ఆరాధించియే ఇంద్రుడు దేవరాజపదవిని పొందారు. గతంలో నారదుడు భక్తితో ఈ భవుని ఆరాధించాడు. దానితో సంతోషించిన గురుస్వరూపుడు, దేవ గురువు అయిన మహాదేవు డిలా అన్నాడు. తేజస్సులో, తపస్సులో, కీర్తిలో నీతో సమానమైనవాడు మరొకడుండడు. గీత వాద్యాలతో నిత్యమూ నన్ను అనుసరించగలవు. మాధవా ! గతంలో పశుపతి అయిన ఆ దేవదేవుని నేను కూడా ప్రత్యక్షంగా చూశాను. అది కూడా విను విభూ ! మహాతేజస్వి అయిన ఆ దేవదేవుని నేను ఎందుకోసం ప్రయత్న పూర్వకంగా సంతోషింపజేశానో, అది కూడా వివరంగా విను. అనఘా ! గతంలో నేను దేవ దేవుడైన మహేశ్వరుని నుండి ఏం పొందానో అదంతా కూడా పూర్తిగా నీకు చెపుతాను.

నాయనా ! పూర్వం కృతయుగంలో వేదవేదాంగ పారగుడు, మహాయశస్వి అయిన వ్యాఘ్రపాదు డనే ఖ్యాతి వహించిన ఋషి ఉండేవాడు. నేను ఆయనకు కొడుకును. ధౌమ్యుడు నా తమ్ముడు. మాధవా ! ఆపై కొంతకాలం తరువాత ఒకసారి ధౌమ్యునితో కలిసి ఆడు కొంటూ పవిత్ర హృదయులైన మునుల ఆశ్రమానికి వచ్చాను. అక్కడ నేను పాలు పితుకబడుతున్న ఒక ఆవును చూశాను. అమృతంతో సమానమైన రుచిగల పాలను నేను అక్కడ చూశాను. ఆపై బాల్య చాపల్యం వలన నేను 'నాకు పాల అన్నం పెట్ట'మని మా అమ్మను అడిగాను. మాధవా ! అప్పుడు పాలు లేనందువలన మా అమ్మ బాధపడి, నీళ్ళలో పిండి కలిపి 'మనకు ఇవే పాలు' అంటూ త్రాగటానికి తెచ్చి ఇచ్చింది. ఆ తరువాత ఒకసారి నేను ఆవు పాలు త్రాగాను. దాయాదులు చేస్తున్న ఒక యజ్ఞానికై నేను తండ్రితో కలిసి ఒక ధనికుల ఇంటికి వెళ్లాను. అక్కడ నేను దివ్య సురభి అయిన ఆవు పాలు ఇస్తుంటే చూశాను. అప్పుడు అమృతం వంటి రుచిగల ఆ పాలను త్రాగి నేను పాల గుణాలను, పాలు లభించే తీరును తెలిసి కొన్నాను. నాయనా ! ఆ పిండి నీళ్ళు నాకు ప్రీతిని కలిగించలేదు. అప్పుడు బాల్యచాపల్యంతో మా అమ్మతో ఇలా అన్నాను. 'అమ్మ ! నీవు నాకిచ్చిన పాల అన్నం నిజంగా పాల అన్నం కాదు'. అప్పుడు దుఃఖశోకాలకు లోనైన మా అమ్మ పుత్ర వాత్సల్యంతో నన్ను కౌగిలించుకొని, శిరస్సు

నాఘ్రాణించి, "వత్సా ! పవిత్ర హృదయులమై నిత్యమూ కందమూలాలు తింటూ వనంలో నివసించే మనకు పాలు ఎలా దొరుకుతాయి ? వాలఖిల్యులు సేవించే దివ్య నదిని ఆశ్రయించి, పర్వతాలలోనో, వనాలలోనో నివసించే మనకు పాలు ఎలా దొరుకుతాయి. వనాలలోనో, ఆశ్రమాలలోనో నివసిస్తూ గాలినో, నీళ్ళనో ఆహారంగా స్వీకరిస్తూ గ్రామాలలో దొరికే ఆహారానికి దూరమై, అడవిలో దొరికే వానినే తింటూ గడిపే మనకు పాలు ఎలా దొరుకుతాయి ? కుమారా ! ఇక్కడ సురభిసంతానం లేదు. అరణ్యంలో పాలు దొరకవు. నదీతీరాలలోనో, గుహలలోనో, కొండల మీదనో, వివిధ తీర్థాలలోనో నివసిస్తూ తపస్సుతో నిత్యమూ జపతత్పరులమైన మనకు శివుడే పరమగతి. బిడ్డ ! అవ్యయుడు, స్థాణువు, వరదుడు అయిన విరూపాక్షుని సేవించకుండా పాల అన్నం కానీ, సుఖాలు కానీ, వస్త్రాలు కానీ ఎక్కడ నుండి వస్తాయి. వత్సా ! సదా సర్వభావనతో ఆ శంకరుని శరణుగోరి, ఆయన అనుగ్రహంతో కోరిన ఫలాన్ని పొందగలవు.' శత్రుసూదనా ! అమ్మ చెప్పిన ఆ మాటవిని అప్పుడే చేతులు జోడించి, వినయంతో తల్లిని ఇలా అడుగుతూ ఒత్తిడి చేశాను. "అమ్మా ! ఈ మహాదేవుడెవరు ? ఎలా ప్రసన్ను అవుతాడు ? ఆ దేవుని నివాసమెక్కడ ? ఎలా చూడగలను ? ఆ శర్వుడెలా సంతోషిస్తాడు ? ఆయన రూప మెటువంటిది ? ఎలా తెలుసుకోవాలి ? ఎలా ప్రసన్నుని చేసికోవాలి ? అమ్మా ! ఆయన నెలా చూడగలను ?"

గోవిందా ! కృష్ణా ! అలా నేను అడగగానే పుత్ర వాత్సల్యం గల మా అమ్మ నా శిరస్సు నాఘ్రాణించింది. కన్నీటితో ఆమె కళ్ళు కలతపడ్డాయి. అప్పుడు నా శరీరాన్ని తడుముతూ మా అమ్మ దైన్యానికి లోనై ఇలా అన్నది. 'మనస్సు అదుపులో లేని వారు ఆ మహాదేవుని తెలిసికోవటం కష్టం. ఆయనను మనసా ధరించటం కష్టం. ఆమార్గం కష్ట భూయిష్ఠం. దాటరాని బాధలుంటాయి. ఆయనను గ్రహించటం, చూడగలగటం చాలా కష్టం. ఆయన రూపాలు అనేకంగా ఉంటాయని ధీమంతులు అంటారు. ఆయన స్థానాలు విచిత్రాలు. ఆయన అనుగ్రహం కూడా అనేక విధాలుగా ఉంటుంది. ఆ దేవదేవుడు గతంలో ఏయే రూపాలు ధరించాడో, ఎలా లీలలు ప్రదర్శిస్తాడో, ఎలా అనుగ్రహిస్తాడో ! శుభప్రదమైన ఈ ఈశ్వరతత్వాన్ని యథాతథంగా ఎవడు తెలియగలడు ? విశ్వరూపుడైన ఆ మహేశ్వరుడు సర్వప్రాణుల హృదయ స్థానంలో ఉంటాడు. భక్తుల ననుగ్రహించటానికి ఎలా దర్శన మిస్తాడు ? శుభప్రదమైన ఈ ఈశానుని దివ్య చరితాన్ని మునులు చెపుతుండగా నేను విన్నది విన్నట్లు చెపుతాను. వత్సా ! బ్రాహ్మణులను

అనుగ్రహించటానికై ఆయన ఏయేరూపాలు ధరించారో వాటిని దేవతలు చెప్పారు. నీవు అడిగిన ఆ విషయాన్ని సంక్షేపంగా నీకు చెపుతాను, విను.

"బ్రహ్మ, విష్ణువు, దేవేంద్రుడు, రుద్రులు, అదిత్యులు, అశ్వినులు, విశ్వే దేవులు ఈ అందరి రూపాలను ధరించగలవాడు భవుడు. పురుషులు, దేవకాంతలు, ప్రేతాలు, పిశాచాలు, కిరాతులు, శబరులు, అనేక జల జంతువులు, ఆటవికులైన బోయవారు ఈ రూపాల నన్నింటినీ ధరించగలవాడు భవుడు. కూర్మం, మత్స్యం, శంఖం, చివురులతో మొలకలతో శోభించే వసంతం, యక్షులు, రాక్షసులు, పాములు, దైత్యులు, దానవులు, పాతాళవాసులు ఈ రూపాల నన్నింటినీ ధరించగలవాడు భవుడు. పులి, సింహం, జింక సివంగి, ఎలుగు బంటి, గుడ్లగూబ, కుక్క, నక్క ఈ రూపాల నన్నింటినీ ధరించగలవాడు భవుడు. హంస, కాకి, నెమలి, ఊసరవెల్లి, బెగ్గురు పక్షి, కొంగ, గ్రద్ద, చక్రవాకం ఈ రూపాలను కూడా ధరించగలవాడు భవుడు. పర్వతం, గోవు, ఏనుగు, గుర్రం, ఒంటె గాడిద ఈ రూపాలలో కూడా ఉంటాడు. మేక, పులి రూపంలో కూడా ఆయన ఉంటాడు. అనేక మృగరూపాలను ధరిస్తాడు. ఆ భవుడు దివ్యపక్షుల రూపాన్ని కూడా ధరిస్తాడు.

ద్విజలక్షణాలైన దండాన్ని, గొడుగును, కమండలాన్ని ధరిస్తాడు. షణ్ముఖుడుగా ఉంటాడు. బహుముఖుడుగానూ ఉంటాడు. ఆయన త్రినేత్రుడు. చాలా తలలు కూడా ధరిస్తాడు. అనేక పాదాలు అనేక కటి ప్రదేశాలు, అనేకోదరాలు, అనేక ముఖాలు, అనేక హస్తాలు, అనేక పార్శ్వాలు ఆయన కుంటాయి. అనేక పార్షదగణాలు ఆయన చుట్టూ ఉంటాయి. ఋషులు గంధర్వులు, సిద్ధులు, చారణులు వీరి రూపాలను కూడా ధరిస్తాడు. ఆయన శరీరం బూడిదతో తెల్లగా ఉంటుంది. అర్ధ చంద్రుడు ఆయనకు ఆభరణం. ఆయన దగ్గర అనేక ఘోషలు వినిపిస్తుంటాయి. ఆయనను అనేక స్తోత్రాలతో స్తుతిస్తుంటారు. సర్వప్రాణులను సంహరించేవాడు తానే. సర్వస్వరూపుడు తానే. సర్వలోక ప్రతిష్ఠితుడు తానే. సర్వలోకాలకు అంతరాత్మ ఆయనయే. ఆయన సర్వ వ్యాపి. సర్వవాది ఆ భగవానుడే అన్ని తావులలో, సర్వప్రాణుల హృదయాలలో కూడా ఉంటాడని గ్రహించాలి. ఎవరు ఏ కోరిక కోరుతున్నారో, ఎవరు దేని కోసం పూజిస్తున్నారో అదంతా ఆదేవదేవునకు తెలుసు. నీకు ఏదైనా కావాలంటే ఆయన శరణువేడు. ఆయన ఆనందిస్తాడు. కోపిస్తాడు. హుంకరిస్తాడు కూడా. ఆయన చక్రాన్ని, శూలాన్ని గదను, రోకలిని, కత్తిని, పట్టిశాన్ని చేతబడతాడు. ఆయన భూధరుడు (ఆదిశేషువు). పాములే ఆయన మౌంజి. పాములనే కుండలాలుగా ధరించిన కుండలి తాను. పామే ఆయన జందెం. నాగచర్మాన్నే ఆయన ఉత్తరీయంగా

ధరిస్తాడు. గణాలతో కూడి ఆయన నవ్వుతాడు. మనోహరంగా నృత్యం చేస్తాడు. విచిత్ర వాద్యాలను వాయిస్తాడు. ఆయన గెంతుతాడు. ఆవులిస్తాడు. ఏడుస్తాడు, ఏడిపిస్తాడు. ఒక్కొక్కసారి పిచ్చివాని వలె, మత్తెక్కిన వానివలె మాటాడుతాడు. ఒక్కొక్కసారి సుస్వరంగా పలుకుతాడు. కళ్ళతో జనాన్ని భయపెడుతూ పరమభయంకరంగా నవ్వుతాడు. మేల్కొని ఉంటాడు, నిదురిస్తుంటాడు. సుఖంగా ఆవులిస్తాడు. జపంచేస్తాడు. జపింపబడతాడు. తపిస్తాడు. తనను గురించి తపస్సు చేయబడతాడు. ఇస్తాడు, స్వీకరిస్తాడు. యోగధ్యానాలు ఆచరిస్తాడు. యజ్ఞవేది మధ్యలో, యూపస్తంభంలో, గోశాలలో, అగ్నిలో కనిపిస్తాడు. బాలుడుగా, వృద్ధుడుగా, యువకుడుగా కూడా కనిపిస్తాడు. ఋషిపుత్రికలతోనూ, ఋషి పత్నులతోనూ కూడా క్రీడిస్తాడు. ఆయన ఊర్ధ్వకేశుడు. మహాశేపుడు దిగంబరుడు, వికృతలోచనుడు.

ఒకప్పుడు పచ్చగా, ఒకప్పుడు శ్యామల వర్ణంతో, ఒకప్పుడు నల్లగా, ఒకప్పుడు తెల్లగా, ఒకప్పుడు పాగవలె ఎర్రగా కనిపిస్తాడు. ఆయన వికృత నయనుడు. విశాల నయనుడు. దిగంబరుడు. సర్వవ్యాపకుడు. ఆయన రూపరహితుడు. తన రూపమే ఆదికారణం. ఆయన రూపాతీతుడు. ఆదిరూపుడు. అజుడైన ఆయన ఆద్యంత రహితుడు. ఆయన వాస్తవ రూపాన్ని ఎవరు తెలియగలరు ? హృదయంలోని ప్రాణం, మనస్సు, జీవుడు ఆయనయే. యోగస్వరూపుడు, యోగి, ధ్యానం, పరమాత్మ ఆయనయే. ఆ మహేశ్వరుని భక్తి భావంతోనే గ్రహించవచ్చు. వాద్యాలు వాయించేవాడు, గాయకుడు ఆయనయే. లక్షల కళ్ళు ఆయనకుంటాయి. ఆయన ఏకముఖుడు, ద్విముఖుడు, త్రిముఖుడు, అనేక ముఖుడు కూడా. కుమారా ! ఆయనపై భక్తితో, నిత్యమూ ఆయనపై ఆసక్తితో, ఆయనపై మనస్సు నిలిపి, తత్పరాయణుడవై ఆ మహాదేవుని ఆరాధించు. అప్పుడు కోరినది పొందగలవు." శత్రుసూదనా ! తల్లి చెప్పిన ఆ మాటవిని అప్పటి నుండి మహాదేవునిపై నాకు స్థిరభక్తికుదిరింది.

అప్పుడు నేను తపస్సు చేసి, శంకరుని సంతోష పెట్టాను. ఎడమ కాలి బొటన వ్రేలిపై నిలిచి ఒక వేయి సంవత్సరాలు తపించాను. ఒక వంద సంవత్సరాలు పండ్లను ఆహారంగా తీసికొన్నాను. రెండవ వంద సంవత్సరాలు పండుటాకులు తిన్నాను. మూడవ వంద సంవత్సరాలు నీటిని ఆహారంగా భుజించాను. అప్పుడు ఏడువందల సంవత్సరాలపాటు గాలిని భుజిస్తూ గడిపాను. ఇలా ఒక వేయి దివ్య సంవత్సరాలు ఆయనను ఆరాధించాను. దానితో ప్రభువు, సర్వలోకేశ్వరుడు అయిన మహాదేవుడు

ఆనందించి, నా అనన్య భక్తిని గ్రహించి, అప్పుడు నన్ను పరీక్షింపసాగాడు. సర్వదేవగణాలు తన చుట్టూ నిలిచిన ఇంద్రరూపాన్ని ధరించాడు. సహస్రాక్షుడుగా, వజ్రపాణిగా ఆ మహాయశస్వి రూపొందాడు. ఆ ఇంద్రభగవానుడు ఐరావతాన్ని ఎక్కి వచ్చాడు. అది అమృతంవలె తెల్లగా ఉంది. ఎర్ర కళ్ళతో నిక్కపొడుచు కొన్న చెవులతో, ముడిచిన తొండంతో, నాలుగు దంతాలతో మదమత్తమై మహాభయంకరంగా ఉంది. ఆయన కిరీటాన్ని హారకేయూరాలను అలంకరించుకొని, తన తేజస్సుతో ప్రకాశిస్తూ వచ్చాడు. తలపై తెల్లని గొడుగును ధరించాడు. అప్సరసలు ఆయనను సేవిస్తున్నారు. దివ్యగంధర్వనాదాలు వినిపిస్తున్నాయి.

అప్పుడు దేవేంద్రుడు "ద్విజోత్తమా ! నేను నీ తపస్సుతో ఆనందించాను. నా నుండి నీమనస్సులో ఉన్న వరాన్ని కోరుకో" అని నాతో అన్నాడు. ఇంద్రుని మాటను విని, నేను ఆనందించలేదు. అప్పుడు పైకి ఆనందాన్ని ప్రకటిస్తూ, దేవరాజుతో ఇలా అన్నాను. "సౌమ్యా ! నేను మహాదేవుని నుండి తప్ప, నీ నుండి కానీ, మరే ఇతర దేవుని నుండి కానీ వరాన్ని ఆకాంక్షించటం లేదు. నీకు సత్యం చెప్తున్నాను. ఇంద్రా ! ఈ మాట సత్యం. సత్యమే కాదు సునిశ్చితం కూడా. మహేశ్వరుని గురించి తప్ప మరే ఇతర కథా నాకు రుచించదు. పశుపతి మాటతో కృమిని లేదా చాలా కొమ్మలుగల చెట్టునైనా అవుతాను. పశుపతికాని వారి వరప్రసాదంతో నాకు త్రిలోకరాజ్యాధిపత్యం కూడా ఇష్టంలేదు. శివుని పాదారవిందాలపై ఆసక్తితో చండాలుర మధ్యనైనా నేను జన్మిస్తాను. ఈశ్వరారాధన లేకపోతే ఇంద్రభవనంలో అయినా ఉండను. వాయుభక్షకుడై, జలభక్షకుడై ఉన్నా సురాసురగురువయిన విశ్వేశ్వరునిపై భక్తి లేని నరునకు దుఃఖనాశ మెలా కలుగుతుంది ? క్షణకాలమైనా శివచరణ స్మరణ వియోగాన్ని ఇష్టపడని వారికి అన్యధర్మాలతో కూడిన ఇతరేతర కథలన్నీ అనవసరం. ఋజుత్వం లేని కలియుగంలో పుట్టినా శివచరణాలపై మతిని నిలిపియే ఉండాలి. శివభక్తి రసాయనాన్ని త్రాగితే సంసారభయ ముండదు. శివుని అనుగ్రహం లేకపోతే ఒకరోజు కానీ, ఒక పూట కానీ, ముహూర్తం కానీ, క్షణకాలం కానీ, లవకాలం కానీ శంకరునిపై భక్తి కుదరదు. ఇంద్రా ! శంకరుడు ఆదేశిస్తే పురుగునైనా, పక్షినైనా కాగలను. నీవు ఇస్తే మూడులోకాల నయినా నేను కోరుకోను. మహేశ్వర వచనంతో కుక్కనైనా అవుతాను. అదే నా తీవ్రకాంక్ష. మహేశ్వరుడు ఆజ్ఞాపించక పోతే (మహేశ్వరుడు కాని వాడు ఆదేశిస్తే) స్వర్గలోక రాజ్యమైనా ఇష్టపడను. నాకు స్వర్గలోక మవసరం లేదు. దేవరాజ్య మక్కర లేదు. బ్రహ్మలోకం కానీ, నిర్గుణ బ్రహ్మ సాయుజ్యం

కానీ అవసరం లేదు. ఇతరకామనలు ఏవైనా సరే నేను కోరుకొనను. శివునికి దాస్యం చేయటమే నేను వరిస్తాను. తెల్లగా, నిర్మలంగా ఉన్న అర్ధచంద్రుడనే కిరీటాన్ని తలదాల్చిన నా స్వామి శంకర భగవానుడు ప్రీతి నందే దాకా వార్ధక్యం, మరణం, జననం అనే వందల దెబ్బలు తిని దేహధారులకై విధించిన దుఃఖాలను మోస్తాను. సూర్యుడు, చంద్రుడు, అగ్ని - వీరిని కన్నులుగా దాల్చి ప్రకాశిస్తూ, త్రిభువన సారరూపుడై, సారరహితుడై, ఆద్యుడై, అద్వితీయుడై, అజరుడూ, అమరుడైన రుద్రుని ప్రసన్నుని చేసికొనలేకపోతే ఏ మనిషి ఈ లోకంలో శాంతిని పొందగలడు ? ఒక వేళ నా దోషాల కారణంగా పదేపదే ఈలోకంలో జన్మించవలసి వచ్చినా ఆయా జన్మలలో కూడా నాకు శివునిపై అక్షయ భక్తి ఉండాలి."

శక్రుడిలా అన్నాడు. "నీవు శివుని నుండి తప్ప ఇతరుని నుండి అనుగ్రహాన్ని కోరటం లేదు. అసలు కారణానికే కారణుడైన ఆ జగదీశ్వరుని అస్తిత్వంలో ప్రమాణమేమిటి ?" ఉపమన్యువిలా అన్నాడు. "బ్రహ్మవాదులు ఎవనిని సత్తుగానూ, అసత్తుగానూ, వ్యక్తుని గానూ, అవ్యక్తుని గానూ; నిత్యునిగానూ; అద్వితీయునిగానూ; అనేకుని గానూ చెప్తుంటారో ఆయననుండి వరాన్ని కోరుతున్నాను. ఆదిమధ్యాంతరహితుడు, జ్ఞాన సంపన్నుడు, అచింత్యుడు - ఈ కారణాలతో ఎవనిని పరమాత్మగా చెప్తున్నారో ఆ పరమాత్మనుండి వరాన్ని కోరుతున్నాను. మహాదేవుని సకలైశ్వర్యమూ నిత్యసిద్ధం, అక్షయం ఆయన కారణ రహితుడు. సర్వకారణాలకూ ఆయనయే బీజం. కాబట్టి ఆయననుండి వరాన్ని కోరుతున్నాను. అజ్ఞానాంధకారానికి పైనున్న జ్ఞాన జ్యోతిః స్వరూపుడు ఆయన. తాపసుల కన్న పరమతపస్సు. ఆయన అర్థమయితే శోకమే ఉండదు. ఆయన నుండి వరం కోరుతున్నాను. పురందరా ! ప్రాణుల పుట్టుక, వాటి భావాలు తెలిసిన వాడాయన. సర్వప్రాణులకు లయకారకుడు. ఆయన సర్వవ్యాపి, సర్వదాత. ఆ దేవుని పూజిస్తున్నాను. ఆయన హేతువాదాలకు లొంగడు. తన భక్తుల సాంఖ్యయోగాల పరమ ప్రయోజనాన్ని ఇచ్చేవాడు. తత్త్వ వేత్తలు ఆయననే ఉపాసిస్తారు. ఆయన నుండి వరం కోరుతున్నాను. ఇంద్రా ! జ్ఞానులు ఆయననే దేవేశ్వరుడైన ఇంద్రుడంటారు. ఆయన సర్వప్రాణులకూ దివ్య గురువు. ఆయన నుండి వరం కోరుతున్నాను. పూర్వకాలంలో ఆకాశమంతా వ్యాపించిన బ్రహ్మాండాన్ని, లోక భావనుడైన బ్రహ్మదేవుని ఆయనయే సృష్టించాడు. ఆయన నుండి వరాన్ని కోరుతున్నాను. అగ్ని, జలం, వాయువు పృధివి, ఆకాశం, బుద్ధి, మనస్సు, మహత్తు (అహంకారం) వీటికన్నింటికీ పరమేశ్వరుడు తప్ప మరొక స్రష్ట ఎవడున్నాడు ? చెప్పు.

ఇంద్రా ! మనస్సు, బుద్ధి, అహంకారం, తన్మాత్రలు (అయిదు), ఇంద్రియాలు (పది) – వీటిని సృష్టించగలవాడు పరమశివుడు తప్ప మరొకడెవరున్నారు ? చెప్పు. ఈ లోకాలకు పితామహుడు సృష్టి కర్త అంటున్నారు. ఆ బ్రహ్మ కూడా పరమశివుని ఆరాధించియే మహైశ్వర్యాన్ని పొందుతున్నాడు. భగవంతునిలో బ్రహ్మ విష్ణువులకన్న ఉత్తమమైన ఐశ్వర్య ముంది. ఆ భగవంతుడు పరమేశ్వరుడైన మహాదేవుడు తప్ప మరి ఎవరు ? చెప్పు. దైత్యులు, దానవులలో ప్రముఖులెందరో త్రిలోకాధిపత్యాన్ని పొంది, శత్రువులను మర్దించటం విన్నాం. ఆ దితి సుతులకు ఐశ్వర్యాన్ని కల్గించటంలో పరమేశ్వరుడు తప్ప మరెవరు సమర్థుడు ? దిక్కులు, కాలం, సూర్యుడు, తేజస్సులు, గ్రహాలు, వాయువు, చంద్రుడు, నక్షత్రాలు ఇవన్నీ మహాదేవుని వలన నిలిచినవే. ఆయన పరమేశ్వరుడు కాన మరెవరు ? చెప్పు ! యజ్ఞం యొక్క ఉత్పత్తి వినాశాలు కానీ, త్రిపురాల ఉత్పత్తి వినాశాలు కానీ, దైత్యదానవులకు ఆధిపత్యం కానీ, శత్రు మర్దన శక్తి కానీ ఆయన అనుగ్రహ ఫలాలే. ఇంద్రా ! ఇక్కడ హేతువాదంతో కూడిన ఇన్ని మాట లెందుకు ! నీవు వేయికళ్ళతో శోభిస్తున్నావు. సిద్ధులు, గంధర్వులు, దేవతలు, ఋషులు నిన్ను పూజిస్తున్నారు. అదంతా దేవదేవుని అనుగ్రహంవలననే కలుగుతోంది. చేతన పదార్థాలలో కానీ, అచేతన పదార్థాలలో కానీ 'ఉన్నది ఇటువంటిది అని' కనిపించే లక్షణం అవ్యక్తుడు, యుక్త కేశుడు, సర్వవ్యాపి అయిన ఆ మహేశ్వరుని ద్వారానే ఏర్పడుతోంది, గ్రహించు. ఇంద్రా ! భూలోకంతో ప్రారంభించి, మహలోకం వరకు లోక (భూలోకం మొదలయినవి) అలోకాల (అగ్న్యాదుల)లో, పర్వత మధ్యాలలో, ద్వీపస్థానాలలో, మేరపర్వత సంపదలలో మమాదేవుని స్థితినే తత్త్వ ద్రష్టలు చెప్తున్నారు. ఇంద్రా ! దివ్యులయిన సురలకు పరమేశ్వరుడు తప్ప మరొక గతి ఉంటే, అసురుల బాధలకు గురి అయినప్పుడు ఆ దేవతలు ఆయననే ఎందుకు శరణు కోరటం లేదు ? దేవతలు, యక్షులు, నాగులు, రాక్షసులు వీరంతా సంఘర్షించి, పరస్పరం నాశనం చేసి కొన్నప్పుడు మరల వారి వారి స్థానాలను, ఐశ్వర్యాన్ని కల్పించేవాడు పరమేశ్వరుడే.

అంధకునకు, శుక్రునకు, దుందుభికి, మహిషునకు, యక్షరాజైన కుబేరునకు, రాక్షసులకు, నివాత కవచులకు వరాల నిచ్చింది కానీ, వారిని నాశనం చేసింది కానీ మహేశ్వరుడు తప్ప మరెవరో చెప్పు ! గతంలో సురాసుర గురువయిన అగ్ని ముఖంలో ఎవరి రేతస్సు ఆహుతి చేయబడింది ? బంగారు కొండ అయిన మేరు పర్వతం పరమేశ్వరుని రేతస్సుతో తప్ప మరెవరి వీర్యంతో ఏర్పడింది ? పరమేశ్వరుడు కాక మరెవరు దిగంబరుడు ? లోకంలో ఊర్ధ్వరేతస్కుడెవరు ? ఎవని దేహంలో అర్ధభాగంగా

భార్య ఉన్నది ? మన్మథుని ఓడించిన దెవరు ? ఇంద్రా ! ఎవరి పరమ స్థానాన్ని దేవతలు ప్రశంసిస్తారు ? ఎవరి క్రీడకోసం శ్మశానం ? నృత్య విషయంలో ఎవరిని గురించి చెప్పుకొంటారు ? చెప్పు ! పరమేశ్వరునితో సమానమైన ఐశ్వర్యం మరెవరికుంది ? భూతాలతో ఆడుకొనే దెవరు ? స్వామితో సమానమైన బలం ఐశ్వర్యాభిమానం గల గణాలు ఎవరి కున్నాయి ? ఎవరి స్థానం త్రిలోక పూజితమై, అచలంగా ఘోషింప బడుతోంది ? పరమేశ్వరుడు తప్ప మరెవరు వర్షింపగలడు ? తపించగలరు ? తేజస్సుతో ఎవరు ప్రజ్వలింపగలరు ? ఓషధి సంపద ఎవరివలన కలుగుతోంది ? ధనాన్ని ధరించేది ఎవరు ? స్థావర జంగమాత్మకాలైన మూడులోకాలలోనూ స్వేచ్ఛగా క్రీడింపగల వాడెవడు? యోగులు, ఋషులు, గంధర్వులు, సిద్ధులు జ్ఞానంతో, సిద్ధితో, క్రియా యోగంతో సేవిస్తూ పరమకారణంగా ఎవరిని ఆశ్రయిస్తారు ?

దేవతలు, అసురులచే కర్మ, యజ్ఞం, క్రియా యోగాల ద్వారా నిత్యమూ సేవింపబడుతూ కూడా, కర్మఫల రహితుడైన ఆ పరమేశ్వరునే నేను సర్వకారణంగా చెపుతాను. మహేశ్వరుని పరమ పదం స్థూలమూ, సూక్ష్మమూ. అది సాటిలేనిది. ఇంద్రియాల కందనిది. సగుణమూ, నిర్గుణమూ కూడా. గుణనియామక మదియే. ఇంద్రా ! ఆయన విశ్వేశుడు. ప్రకృతికి నియామకుడు. లోక సృష్టికీ, వినాశనానికీ కారణం ఆయనయే. భూతభవిష్య ద్వర్తమానాల సర్వోత్పత్తికీ ఆయనయే కారణం. అక్షరం, క్షరం, అవ్యక్తం, విద్య, అవిద్య, కృతం, అకృతం, ధర్మం, అధర్మం ఆయన నుండియే వ్యక్తమవుతాయి. ఆయినయే సర్వకారణమని నేనంటాను. దేవేంద్రా ! సృష్టిసంహారహేతువు, దేవదేవుడు అయిన ఆ రుద్రుడు భగ చిహ్నమైన అంగరూపాన్ని ధరించాడు గదా ! చూడు ఆయన సర్వ కారణ స్వరూపం కనిపిస్తూనే ఉన్నది కదా ! పరమేశ్వరుని కన్న మరొకరు లోకమనే కార్యానికి కారణమైన వాడు లేడు. ఏదైనా కావాలంటే ఆయననే శరణు వేడుమని మా అమ్మ నాకు ముందే చెప్పింది. బ్రహ్మాది ప్రజాపతుల సంకల్పంతో పుట్టిన ఈ త్రిభువనాలు, వాటిలోని బద్ధజీవులు, ముక్త జీవులు భగ లింగ సంయోగంతో పుట్టినవారే. ఇది ప్రత్యక్షంగా తెలిసినదే. వేల కోరికలను మనస్సులలో నిలుపుకొన్న బ్రహ్మ, ఇంద్రుడు, అగ్ని, విష్ణువులతో సహా దేవతలు దేవతలు, దయ్యాలు పరమేశ్వరుని మించిన వాని నెవ్వడినీ చెప్పటం లేదు. స్థావర జంగమాత్మకమైన జగత్తున కధిపతి, వేద వేద్యమైన ఉత్తమతత్త్వ స్వరూపుడు అయిన శివుని కామపూర్తికై, మోక్షసిద్ధికై మనస్సును నియంత్రించి ఆశ్రయిస్తున్నాను. ఇన్ని కారణాలెందుకు ? ఈశ్వరుడే కారణానికి కూడా కారణం. దేవతలు మరొకరి

లింగాన్ని అర్చించినట్లు మన మెప్పుడూ వినలేదు. మహేశ్వర లింగాన్ని తప్ప మరెవరి లింగాన్ని అయినా సర్వదేవతలలో ఎవరైనా అర్చిస్తున్నారా ? పోనీ ఇంతకు ముందు ఎప్పుడైనా అర్చించారా ? నీవు విని ఉంటే చెప్పు. బ్రహ్మ, విష్ణువు, దేవతలతో సహా నీవు కూడా సదా ఆ లింగాన్ని అర్చిస్తున్నావు. కాబట్టి ఆయన సర్వశ్రేష్ఠుడు. ప్రజల శరీరాలపై పద్మం కానీ, చక్రం కానీ, వజ్రాయుధం కానీ గుర్తులుగా లేవు, అందరికీ భగలింగాలే గుర్తులు. కాబట్టి సంతతి మహేశ్వరునికి చెందినదే.

పార్వతీ దేవి యొక్క కారణ రూపభావంతోనే స్త్రీలందరూ భగ చిహ్నంతో పుట్టారు. హరుని కారణ రూపభావనతో పురుషులందరూ లింగ చిహ్నంతో పుట్టారు. ఈ స్థితిలో పార్వతీ పరమేశ్వరుల కన్న ఇతరకారణాన్ని చెప్పినా ఆ చిహ్నాలు కనిపించటం లేదు. అలా మాటాడే వానిని చరాచరాత్మకాలైన ఈ మూడు లోకాలనుండి బయటకు పంపాలి. పులింగ మంతా శివసంబంధి. స్త్రీలింగ మంతా ఉమాసంబంధి. ఈ చరాచర జగత్తు ఈ రెండు లింగాలతోనే వ్యాపించి ఉన్నది.

సూర్యుడు, చంద్రుడు, అగ్ని వీరిని కన్నులుగా దాల్చి ప్రకాశిస్తూ, త్రిభువన సారరూపుడై, అనంతుడై, ఆద్యుడై, ఈశుడై, అజరుడై, అమరుడైన రుద్రుని ప్రసన్నుని చేసికొన లేకపోతే ఏ మనిషి ఈ లోకంలో శాంతిని పొందగలడు ?

కాబట్టి కౌశికా ! నేను చావైనా సరే ఆ వరాన్ని ఆయన నుండియే కోరుతున్నాను. ఇంద్రా ! ఉంటావో, వెళతావో నీ ఇష్టం. ఈ వరమైనా, శాపమైనా నాకు మహేశ్వరుని ద్వారానే లభించాలి. సర్వకామ ఫలాల నివ్వగలదయినా సరే ! మరొక దేవతను నేను కోరను. దేవేంద్రునితో అలా పలికిన తరువాత నా ఇంద్రియాలు దుఃఖంతో కలత పడసాగాయి. ఏమిటిది ? శివుడు ఎందుకు ప్రసన్నుడు కావటం లేదు అని ఆలోచింపసాగాను.

అంతలో క్షణకాలంలోనే ఆ ఐరావతం వృషభరూపాన్ని ధరించటం చూశాను. అది హంసవలె, మొల్లపూలవలె, చంద్రుని వలె తెల్లగా ఉంది. తామర తూళ్ళవలె, వెండివలె ప్రకాశిస్తోంది. పాల సముద్రమే వృషభంగా మారినట్లుంది. పెద్ద శరీరంతో, నల్లని తోకతో, తేనె వంటి పింగళ వర్ణంగల నేత్రాలతో అది శోభిస్తోంది. వజ్రసారంతో చేసినట్లుగా ఉన్న కొమ్ముల నుండి మేలిమి బంగారు వెలుగులు ప్రసరిస్తున్నాయి. కొమ్ముల కొనలు పదునుగా, మృదువుగా, ఎర్రగా ఉన్నాయి. అది కొమ్ములతో నేలను చీల్చబోతున్నట్లుంది. దాని శరీరమంతా బంగారుత్రాళ్ళతో అలంకరింపబడి ఉంది. మంచి ముఖం, గిట్టలు, ముక్కు, చెవులు, కటి ప్రదేశాలతో అది శోభిస్తోంది. అందమైన ప్రక్కలు, విశాలమైన మెడ, అందమైన రూపంతో అది చూడ ముచ్చటగా ఉంది. దాని నూపురం

మెడను కప్పి, పైకి సాగి ప్రకాశిస్తోంది. హిమగిరి శిఖరం వలె, తెల్లని మేఘాలతో ఏర్పడిన పెద్ద శిఖరం వలె ఉన్నా ఆ దున్నపోతుపై భగవంతుడైన దేవదేవుడు ఉమతో కలిసి కూర్చొని ఉన్నాడు. ఆ మహాదేవుడు పున్నమి చంద్రుని వలె శోభించాడు. ఆయన తేజస్సు నుండి పుట్టిన అగ్నిప్రభ గర్జిస్తున్న మేఘాలతో కలిసి, ఆకాశమంతా వ్యాపించి నిలిచిన వేయి సూర్యులవలె వెలుగొందుతోంది. మహాతేజస్వి అయిన ఆ ఈశ్వరుడు ప్రళయకాలంలో సర్వప్రాణులను దహించటానికి ఉద్యమించిన సంవర్తకాగ్నివలె ప్రజ్వలిస్తున్నాడు. అప్పుడు ఆ మహాదేవుడు తేరి చూడటానికి వీలుకానట్లు తన తేజస్సుతో అంతటా వ్యాపించాడు. ఇదేమిటని ఆలోచిస్తూ మరల మనసా ఉద్వేగానికి లోనయ్యాను.

ముహూర్త కాలంలోనే ఆ తేజస్సు పది దిక్కులలోనూ పూర్తిగా వ్యాపించింది. కానీ ఆ దేవదేవుని మాయతో సర్వ దిక్కులలోనూ ప్రశాంతత నెలకొన్నది. అప్పుడు భగవానుడైన మహేశ్వరుడు స్థిరంగా నిలిచి ఉండటం చూశాను. ఆయన తేజోనిధి. నీలకంరుడు. ఆ మహాత్ముడు అసంగుడు. ఆయన పద్దెనిమిది భుజాలతో ఉన్నాడు. సర్వాభరణాలను అలంకరించుకొని ఉన్నాడు. ఆ మహాదేవుడు శుక్లాంబరధరుడు. తెల్లని పూలమాలలను ధరించి, శ్రీచందనాన్ని పూసికొని ఉన్నాడు. తెల్లని ధ్వజం, తెల్లని యజ్ఞోపవీతం ధరించాడు. ఆయన అజేయుడు. తనతో సమానంగా పరాక్రమవంతులైన దివ్య పార్శ్వచరులు పాటలు పాడుతూ, నృత్య మాడుతూ, వాద్యాలను మోగిస్తూ అన్ని వైపుల ఆయనను చుట్టి నిలిచారు. ఆయన తలపై బాలచంద్రుడు కిరీటంవలె ఉన్నాడు. తెల్లని తనుకాంతితో ఆయన ఉదయించిన శరత్కాల చంద్రునివలె ఉన్నాడు. మూడు కళ్ళనుండి మూడు సూర్యులు ఉదయించినట్లు తేజస్సు వెలువడుతోంది.

తెల్లని వన్నెగల ఆ మహాదేవుని శరీరంపై బంగారు తామరలతో గ్రుచ్చి, రత్నాలతో అలంకరించిన మాల ప్రకాశిస్తోంది.

గోవిందా ! అమితతేజస్వి అయిన ఆ భవుని సర్వ తేజోమయాస్త్రాలన్నీ రూపుదాల్చి ఆయనను సేవించటం నేను చూశాను. ఆ మహాత్ముని ధనుస్సు పినాకం. ఇంద్ర ధనుస్సువలె ప్రకాశిస్తున్న ఆ ధనుస్సు మహాసర్పరూపంలో కనిపించింది. ఆ సర్పం ఏడుతలలతో, పెద్ద శరీరంతో, తీక్ష్ణమైన కోరలతో, ప్రచండ విషంతో మెడకు చుట్టుకొన్న అల్లెత్రాటితో పురుషరూపంతో నిలిచింది. ఆయన బాణం మహాభయంకరమూ, మహాదివ్యమూ అయిన పాశుపతం. అది సూర్యకాంతితో, ప్రళయకాలాగ్ని కాంతితో ప్రకాశిస్తోంది. ఆ అస్త్రం అద్వితీయం. సర్వప్రాణులకు భయాన్ని కలిగించేది. అది అనిర్వచనీయం. విశాల శరీరంతో అది తన ముఖం నుండి నిప్పు రవ్వలతోపాటు

మంటలను వెడల గ్రక్కుతోంది. ఏక పాదంతో, పెద్ద కోరలతో, వేల తలలతో, వేల ఉదరాలతో, వేల భుజాలతో, వేలనాలుకలతో నిప్పులు క్రక్కుతున్నట్లుంది. మహాబాహూ ! అది బ్రహ్మాస్త్రం కన్న, నారాయణాస్త్రం కన్న, ఐంద్రాస్త్రం కన్న, ఆగ్నేయాస్త్రం కన్న, వారుణాస్త్రం కన్న విశిష్టం. సర్వశస్త్రాలనూ నాశనం చేయగలది. గోవిందా ! గతంలో ఆ ఒకే అస్త్రంతో మహాదేవుడు లీలగా త్రిపురాలను క్షణంలో దహించి, భస్మం చేశాడు. మహేశ్వరుని భుజం నుండి వెలువడి ఆ శస్త్రం అరనిముసంలో చరాచరాత్మకాలయిన మూడులోకాలనూ పూర్తిగా దహింప గలదు. సంశయం లేదు. ఈ లోకంలో బ్రహ్మావిష్ణు దేవతలలో కూడా ఆ అస్త్రంతో చంపరానివాడు ఎవ్వడూ లేడు. ఆశ్చర్య జనకమైన ఆ ఉత్తమాస్త్రాన్ని నేను అక్కడ చూశాను. దాన్ని మించినది లేదా దానితో సమానమైనది మరొక రహస్యాస్త్రం లేదు.

శివుడు సర్వలోకాలలో శూలిగా ప్రసిద్ధుడు. శూలపాణి అయిన శివుడు ఆ శూలాన్ని వదలితే అది భూమినంతా బ్రద్దలు చేయగలదు. సముద్రాన్ని ఎండింపజేయగలదు. సర్వజగత్తునూ సంహరింపగలదు. గోవిందా ! పూర్వకాలంలో యువనాశ్వుని కుమారుడైన మాంధాత అనే చక్రవర్తి ఉండేవాడు. ఆయన మహాతేజస్వి. త్రిలోకాలనూ జయించిన రాజు. మహాబలశాలి. మహాపరాక్రమశాలి. ఇంద్రతుల్య పరాక్రముడు. లవణాసురుడు ఈ శూలాన్ని ప్రయోగించి ఆయనను సేనా సహితంగా నాశనం చేశాడు. శూలం ఆ రాక్షసుని చేతి నుండి వెలువడగానే సర్వనాశనం జరిగి పోయింది. ఆ శూలం యొక్క మొన చాలా తీక్ష్ణమైనది. అది చాలా భయంకరమై, గగుర్పాటు కలిగించేది. కనుబొమలను మూడుముళ్ళు వేసి, ఎదిరిని బెదిరిస్తున్నట్లు అది కనిపించింది. గోవిందా ! పొగలేని మంటలతో కూడిన ఆ నల్లని శూలం ఉదయించిన ప్రళయకాల సూర్యునివలె ఉన్నది. చేతిలో పామును పట్టుకొన్న అనిర్వచనీయ పాశహస్తుడైన యముని వలె అది కనిపించింది. రుద్ర సన్నిధిలో ఆ అస్త్రాన్ని చూశాను. తీక్ష్ణమైన వాదర గల పరశువు కూడా రుద్రుని దగ్గర కనిపించింది. గతంలో మహాదేవుడు ఆనందించి, పరశురామునకిచ్చిన అస్త్ర మదే. అదే క్షత్రియ వినాశనం చేసింది. ఆ అస్త్రంతోనే మహాసంగ్రామంలో కార్త - వీర్యచక్రవర్తి మరణించింది. గోవిందా ! అనాయాసంగా కార్యసాధన చేయగల పరశురాముడు ఆ పరశువుతోనే ఇరవై యొక్క సార్లు భూమండలాన్ని క్షత్రియ శూన్యంగా చేశాడు. దాని వాదర తళతళలాడుతోంది. దాని ముఖ భాగం భయంకరంగా ఉంది. అది మహాదేవుని కంఠాగ్రంలో ఉంది. ఈ రీతిగా శూలి సమీపంలో మండుతున్న నూరు అగ్నుల వలె అది

ప్రజ్వలిస్తోంది. అనఘా ! ఆ ధీమంతుని దివ్యాస్త్రాలు లెక్క కందనివి. ప్రాధాన్యాన్ని బట్టి వీటిని మాత్రమే నేను వర్ణించాను.

ఆ మహాదేవునకు కుడి ప్రక్కన లోకపితామహుడైన బ్రహ్మ మనోవేగంగల హంసలుగల దివ్య విమానంపై కూర్చొని ఉన్నాడు. ఎడమ వైపున శంఖ చక్రగదా ధరుడైన నారాయణుడు గరుడునిపై కూర్చొని విరాజిల్లు తున్నాడు. స్కందుడు చేతులలో శక్తిని, ఘంటను ధరించి నెమలినెక్కి, పార్వతీదేవి సమీపంలో నిలిచి, రెండవ అగ్నివలె ప్రకాశిస్తున్నాడు. ఆ మహాదేవునకు ముందుగా శూలాన్ని ఎత్తి పట్టి, నంది నిలిచిఉండగా చూశాను. ఆయన మరొక శంకరునివలె ఉన్నాడు. అక్కడకు స్వాయంభువుడు మొదలయిన మనువులు, భృగువు మొదలయిన ఋషులు, ఇంద్రాది దేవతలు అందరూ వచ్చారు. సర్వభూతగణాలు, వివిధ మాతృకలు కూడా వచ్చారు. వారు అన్ని వైపులా ఆ మహాత్ముని చుట్టి నిలిచారు. అప్పుడు దేవతలు వివిధ స్తోత్రాలతో మమాదేవుని స్తుతించారు. బ్రహ్మ రథంతరసామగానం చేస్తూ భవుని స్తుతించాడు. ఆపై నారాయణుడు జ్యేష్ఠ సామగానంతో దేవదేవుని నుతించాడు. ఇంద్రుడు ఉత్తమమైన శతరుద్రీయాన్ని పరిస్తూ ఆ పరబ్రహ్మను స్తుతించాడు. బ్రహ్మ, నారాయణుడు, దేవరాజైన ఇంద్రుడు ఈ ముగ్గురు మహాత్ములూ త్రేతాగుల వలె శోభించారు. వారి మధ్య నిలిచిన ఆ దేవుడు - శంకర భగవానుడు శరత్కాల మేఘాల నుండి బయటపడి పరిధిలో (గుడిలో) నిలిచిన సూర్యుని వలె విరాజిల్లాడు. కేశవా ! అప్పుడు ఆకాశంలో వేలకొలదిగ చంద్రులు, సూర్యులు కనిపించారు. అప్పుడు జగత్పతి అయిన ఆ మహాదేవుని నేనిలా స్తుతించాను.

"దేవాధిదేవునకు నమస్కారం మహాదేవునకు నమస్కారం. శక్రరూపునకు, శక్రునకు, శక్ర రూపధరునకు నమస్కారం. వజ్రహస్తునకు, పింగళ వర్ణునకు, అరుణ వర్ణునకు నమస్కారం. పినాక పాణికి, నిత్యమూ శంఖ శూలధారికి, నల్లని వస్త్రాలు గలవానికి, ముడివేసిన నల్లని వెంట్రుకలు గలవానికి నమస్కారం. మృగ చర్మం ఉత్తరీయంగా ధరించిన వానికి, కృష్ణాష్టమిపై అనురక్తిగల వానికి, శుక్ల వర్ణునకు, శుద్ధునకు, శుక్ల వస్త్రధారికి నమస్కారం. తెల్లని బూడిదను పూసికొన్నవానికి, శుద్ధ కర్మలపై ఆసక్తి గల వానికి, రక్త వర్ణునకు, రక్త వస్త్రాలు ధరించిన వానికి నమస్సు. ఎర్రని ధ్వజపతాకంగలవానికి, ఎర్రని మాలలు, అనులేపనాలు గలవానికి, పీత వర్ణునకు, పీతాంబర ధరునకు నమస్సు. తలపై ఎత్తైన గొడుగు గలవానికి, అందమైన కిరీటం ధరించిన వానికి; అర్ధహారం, అర్ధకేయూరం, ఒక చెవికే కుండలం గలవానికి నమస్సు. వాయువేగునకు నమస్కారం.

దేవునకు నమస్కారం. సురేంద్రునకు, మునీంద్రునకు, మహేంద్రునకు – నీకు నమస్సు. శరీరంలోని అర్ధ భాగంలో పద్మమాల, మరొక అర్ధభాగంలో ఉత్పలమాల గలవానికి, శరీరంలోని అర్ధభాగానికి చందనం, మరొక అర్ధాభాగానికి పుప్పొడి పూసికొన్న వానికి నమస్కారం. ఆదిత్య వదనునకు, ఆదిత్య నేత్రునకు నమస్కారం. ఆదిత్య వర్ణునకు, సూర్య ప్రతిమ వంటివానికి నమస్కారం. సోమునకు, సౌమ్యునకు, సౌమ్యముఖునకూ, సౌమ్య రూపునకు, ముఖ్యునకు, సౌమ్యదంతాలతో శోభిస్తున్నవానికి నమస్కారం. శ్యామల వర్ణుడవు. గౌరవర్ణుడవు. సగం పచ్చగా, సగం తెల్లగా ఉన్నవాడవు, నారీ నరశరీరుడవు, స్త్రీ పుం స్వరూపుడవు. నీకు నమస్కారం. వృషభ వాహనునకు, గజేంద్ర గమనునకు నమస్కారం. దుర్గముడవు, అగమ్యగమనుడవు అయిన నీకు నమస్కారం. ప్రమథ గణులు కీర్తించేవానికి, గణ వృందాసక్తునకు, గణాలు అనుసరించిన మార్గంగలవానికి, ప్రమథగణాలు నిత్యవ్రతంగా సేవించే వానికీ నమస్కారం.

నీవు తెల్లని మేఘాలవంటి వన్నె గలవాడవు. సంధ్యారాగంవంటి కాంతి గలవాడవు. ఏ పేరూలేని వాడవు. స్వరూపుడవు. నీకు నమస్కారం. ఎర్రని సుందర వస్త్రాలు ధరించిన వానికి, రక్త సూత్ర ధరునకు, రక్త పుష్పమాలలతో విచిత్రంగా ఉన్న వానికి, రక్తాంబరధరునకు నమస్కారం. మణిభూషిత మస్తకునకు, అర్ధచంద్రభూషితునకు, విచిత్ర మణులు తలదాల్చిన వానికి. ఎనిమిది రకాల పూలు ధరించెడివానికి నమస్కారం. ముఖ నేత్రాలలో అగ్ని నివసించే వానికి, సహస్ర చంద్రుల వంటి కన్నులు గలవానికి, అగ్ని రూపునకు, మనోహరునకు, గహన రూపునకు నమస్సు. నీవు ఖచరుడవు. గోవులు చరించే స్థానంపై ఆసక్తి గలవాడవు. భూచరుడవు. భువన స్వరూపుడవు. అనంతుడవు. శివుడవు. నీకు నమస్కారం. దిగంబరునకు నమస్సు. నిత్యనివాస స్థాణునకు నమస్సు. సుందర వస్త్రాలు ధరించే వానికి, జగన్ని వాసునకు, **సర్వసిద్ధి ముఖునకు నమస్సు.** నిత్యమూ కిరీటం ధరించినవానికి మహాకేయూర ధారికి, కంఠంలో సర్పహారాలు గలవానికి, విచిత్రా భరణ ధారికి నమస్కారం. సూర్యచంద్రాగ్నులు నయనులైన వానికి, లక్ష కన్నులు గల వానికి, స్త్రీ పుంస్వరూపునకు, నపుంసక రూపునకు, సాంఖ్యునకు, యోగికి నమస్సు. శంయు దేవతా ప్రసాదరూపునకు, అథర్వవేదస్వరూపునకు నమస్సు. సర్వార్తి నాశకునకు నమస్సు, శోక హరునకు నమస్సు. మేఘంవలె నినదించే వానికి, బహుమాయా ధరునకు, బీజక్షేత్రరక్షకునకు, సృష్టికర్తకు నమస్కారం. సురాసురేశునకు నమస్సు. విశ్వేశునకు నమస్సు. పవనవేగునకు నమస్సు. పవన రూపునకు నమస్సు. కాంచనమాలలు ధరించిన వానికి నమస్సు. గిరిమాలునకు

నమస్సు. సురశత్రువుల మొండెములను మాలలుగా ధరించేవానికి నమస్సు. చండవేగునకు నమస్సు.

బ్రహ్మ శిరస్సును అపహరించినవానికి, మహిషుని చంపినవానికి నమస్సు. స్త్రీ రూపధరునకు, యజ్ఞవినాశకునకు నమస్సు. త్రిపురహర్తకు, యజ్ఞ విధ్వంసకునకు నమస్సు. కామశరీర నాశకునకు, కాలదండధారికి నమస్సు. స్కంద విశాఖరూపునకు నమస్సు. బ్రహ్మదండ స్వరూపునకు నమస్సు. భవునకు, శర్వునకు నమస్కారం. విశ్వరూపునకు నమస్కారం. ఈశానునకు, సంసార బంధ ధ్వంసకునకు, అంధకాసుర సంహారికి నమస్కారం. విశ్వరూపునకు మాయారూపునకు, చింత్యునకు, అచింత్యునకు నమస్సు.

మాకు నీవే గతి. శ్రేష్ఠుడవు నీవే. మాకు హృదయం నీవే. సర్వదేవతలలో బ్రహ్మవు నీవే. రుద్రులలో నీలలోహితుడవు నీవే. సర్వభూతాత్మవు నీవే. సాంఖ్యమతం చెప్పే పురుషుడవు నీవే. పవిత్రులలో శ్రేష్ఠుడవు నీవే. యోగంలోని నిష్కల శివస్వరూపం నీవే. ఆశ్రమ వాసులలో నీవు గృహస్థుడవు. ఈశ్వరులలో మహేశ్వరుడవు. యక్షులలో కుబేరుడవు. క్రతువులలో విష్ణువువు. పర్వతాలలో నీవు మేరువువు. నక్షత్రాలలో చంద్రుడవు. ఋషులలో వసిష్ఠుడవు. గ్రహాలలో సూర్యుడవు. పరమేశ్వరుడవైన నీవు ఆటవిక పశువులలో సింహానివి. గ్రామ్య పశువులలో లోక పూజితమైన ఆబోతువు నీవే. ఆదిత్యులలో నీవే విష్ణువువు. వసువులలో పావకుడవు. పక్షులలో గరుత్మంతుడవు. సర్పాలలో అనంతుడవు. వేదాలలో సామవేదం నీవు. యజుస్సులలో శతరుద్రియం నీవు. యోగులలో సనత్కుమారుడవు. సాంఖ్యులలో కపిలుడవు. దేవా ! దేవతలలో ఇంద్రుడవు. పితరులలో అగ్నివి లోకాలలో బ్రహ్మలోకానివి. గతులలో మోక్షానివి. సాగరాలలో పాలకడలివి. పర్వతాలలో హిమగిరివి. వర్ణాలలో బ్రాహ్మణుడవు. బ్రహ్మణులలో దీక్షితుడవు. లోకాలకు మొదలు నీవే, లోకాలను సంహరించే కాలుడవు నీవే. లోకంలో తేజస్సులో గొప్పవైన సర్వ పదార్థాలూ భగవంతుడవైన నీ స్వరూపాలే అని నా గట్టి నిర్ణయం.

భగవంతుడా ! దేవా ! నీకు నమస్సు. భక్తవత్సలా ! నీకు నమస్సు. యోగేశ్వరా ! నీకు నమస్కారం. విశ్వసంభవా ! నీకు నమస్కారం. సనాతనా ! ప్రసన్నుడవు కమ్ము. నేను నీ భక్తుడను. దీనుడను, కృపణుడను, ఐశ్వర్యహీనుడను. నీవే నాకు గతి కావాలి. దేవేశా ! పరమేశ్వరా ! తెలియక అపరాధమేదైనా చేసినా నా భక్తుడే కదా అన్న భావంతో అదంతా క్షమించాలి. దేవేశా ! నీవు రూపం మార్చుకొని నందువలన మోహానికి లోనయ్యాను. మహేశ్వరా ! నేను నీకు అర్ఘ్యపాద్యాలు కూడా ఇవ్వలేదు. ఈ రీతిగా ఈశానుని

స్తుతించి, భక్తితో చేతులు జోడించి నిలిచి, అర్ఘ్యపాద్యాదులన్నీ ఆయనకు నివేదించాను. నాయనా ! ఆ తరువాత చల్లని నీటి తుంపురులతో, దివ్య గంధాలతో కూడిన పూలవాన శుభంగా నాతలపై కురిసింది. దేవకింకరులు దివ్య దుందుభిని మ్రోగించారు. సువాసనతో, సుఖావహంగా పుణ్యమారుతం వీచింది. ఆపై వృషధ్వజుడైన మహాదేవుడు పార్వతితో సహా ప్రసన్నుడై, అప్పటి నాకు ఆనందాన్ని కలిగిస్తూ, అక్కడున్న దేవతలతో ఇలా అన్నాడు. "దేవతలారా ! అందరూ చూడండి మహాత్ముడైన ఈ ఉపమన్యువునకు నాపై అనన్య భావంతో ఉన్న పరమ భక్తిని గమనించండి". కృష్ణా ! శూలపాణి అలా పలుకగానే ఆ దేవతలు చేతులు జోడించి, వృషధ్వజునకు నమస్కరించి, ఇలా అన్నారు.

"భగవంతుడా ! దేవదేవేశా ! లోకనాథా ! జగత్పతీ ! ఈ ద్విజోత్తముడు నీ నుండి తన కోరికలు అన్నీ తీరేటట్లు ఫలాన్ని పొందాలి". బ్రహ్మాది దేవతలు ఆ రీతిగా చెప్పగానే శివుడు, సర్వేశుడు అయిన శంకర భగవానుడు నవ్వుతూ, నాతో ఇలా అన్నాడు. "వత్సా ! ఉపమన్యూ ! ఆనందించాను. మునిపుంగవా ! నన్ను చూడు. విప్రర్షి ! నీవు దృఢభక్తుడవు. నాచే పరీక్షింపబడినావు కూడా. ఈ నీ భక్తితో నేను చాలా ప్రీతిని పొందాను. కాబట్టి నీవు కోరిన కోరికలనన్నింటినీ నేడు అనుగ్రహిస్తాను. ధీమంతుడైన మహాదేవుడు నాతో ఆ విధంగా పలుకగానే ఆనందంతో నా కన్నులలో నీళ్ళు నిలిచాయి. శరీరం పులకించింది. అప్పుడు మోకాళ్ళపై నిలిచి ఆయనకు పదే పదే ప్రణమిల్లి, హర్షంతో గద్గదమైన వాక్కుతో ఆ మహాదేవునితో ఇలా పలికాను. "దేవా ! ఈనాడే నేను పుట్టినట్లు. ఈనాడే నా జన్మ సఫలమైంది. సురాసురగురువైన మహాదేవుడే నా ఎదుట నిలిచాడు. దేవతలు కూడా అంత తేలికగా చూడలేని అమిత విక్రమశాలి అయిన మహాదేవుని నేను చూడగలిగాను. నాకన్న ధన్యతరుడు మరొక డెవడు ? అజుడు, అక్షరుడు, జ్ఞాన స్వరూపుడు, సర్వ శ్రేష్ఠుడుగా ప్రసిద్ధుడు అంటూ జ్ఞానులు నూతన పరతత్త్వాన్ని ధ్యానిస్తుంటారు. (కానీ నేను చూడగలిగాను). సర్వ ప్రాణులకు ఆదిభూతుడు, అవ్యయుడు, సర్వతత్త్వ విధాన మెరిగినవాడు, ప్రధానుడు, పరమ పురుషుడు అయిన మహాదేవుడవు, భగవంతుడవు నీవే. ఈశ్వరుడవైన నీవు శరీరంలోని దక్షిణ భాగం నుండి లోకస్రష్ట అయిన బ్రహ్మను సృష్టించావు. వామభాగం నుండి లోకరక్షణకై విష్ణువును సృష్టించావు. యుగాంతకాలం సంభవించినపుడు ఈశుడవైన నీవే సమర్థుడవై రుద్రుని సృష్టించావు. ఆ రుద్రుడే స్థావర జంగమ రూపమైన సమస్త జగత్తును సంహరించాడు. మహా తేజస్వి వయిన ఆ నీవే కాలుడవై, ప్రళయ వేళలో సర్వప్రాణులను మ్రింగుతూ,

సంవర్తకాగ్నివలె నిలిచావు. మహాదేవుడవు, దేవుడవు అయిన నీవే చరాచర జగత్తును సృష్టించి, ప్రళయకాలంలో అందరి స్మరణ శక్తినీ లాగివేసి నిలుస్తావు. ఆ నీవు సర్వగతివై, సర్వభూతాత్మకుడవై, సర్వప్రాణి జన్మ వృద్ధి కారణుడవై, సర్వవ్యాపివై, సర్వదేవతలకు కూడా కనిపించకుండా ఉంటావు. ప్రభూ ! నా భక్తికి సంతసించి, నాకు వర మివ్వవలసి వస్తే దేవా ! సురేశ్వరా ! నీపై నాకు నిత్యమూ భక్తి నిలవాలి. విభూ ! సురశ్రేష్ఠా ! నీ అనుగ్రహంతో నేను గడచిన దానిని, జరగబోయేదానిని, జరుగుతున్న దానిని తెలిసికొనగలను. ఇది నా విశ్వాసం. బాంధవులతో కలసి నేను అక్షయంగా పాల అన్నం తినగలగాలి. మా ఆశ్రమంలో సదా నీ పరమసాన్నిధ్యం కలగాలి. నేను అలా అడుగగానే లోకపూజితుడు, మహా తేజస్వి, చరాచరగురువు, శివుడు, భగవంతుడు అయిన మహేశ్వరుడు నాతో ఇలా అన్నాడు. 'నీవు దుఃఖరహితుడవై అజరుడవు, అమరుడవు, యశస్వివి, తేజస్వివి, దివ్యజ్ఞానివి కాగలవు. నా అనుగ్రహంతో ఋషులు కూడా ఆశ్రయింపదగిన వాడవు కాగలవు. శీలవంతుడవు, గుణసంపన్నుడవు, సర్వజ్ఞుడవు, ప్రియదర్శనుడవు కాగలవు. నీకు అక్షయయౌవనం సిద్ధిస్తుంది. అగ్నితో సమానమైన తేజస్సు లభిస్తుంది. ఎక్కడ ఏది నీ కిష్టమయితే అక్కడ అది పొందగలవు. క్షీరసాగర సన్నిధి కూడా నీకు దొరుకుతుంది. నీవు నీ బంధువులతో కలిసి అమృతంతో కలిసిన పాల అన్నాన్ని ఒక కల్పకాలం వరకు భుజించు. ఆ తరువాత నన్ను చేరగలవు. నీ బంధువులు, వంశమూ, గోత్రమూ అక్షయంగా, శాశ్వతంగా నిలుస్తాయి. ద్విజశ్రేష్ఠా ! నాపై శాశ్వత భక్తి కూడా ఉంటుంది. ద్విజోత్తమా ! నిత్యమూ నీ ఆశ్రమంలో నా సాన్నిధ్యాన్ని కూడా కల్పిస్తాను. వత్సా ! స్వేచ్ఛగా ఉండు. దేని మీదా ఉత్కంఠ వద్దు. విప్రా ! మరల నీవు ఎప్పుడు తలచుకొంటే అప్పుడు దర్శన మిస్తాను.' అలాపలికి కోటి సూర్యుల వంటి కాంతి గల ఆ ఈశానభగవానుడు వరాల నిచ్చి, అక్కడే అదృశ్యమయ్యాడు.

కృష్ణా ! ఈ విధంగా సమాధితో నేను ఆదేవదేవుని చూడగలిగాను. ధీమంతుడైన ఆయన చెప్పిన దంతా నేను పొందగలిగాను. కృష్ణా ! ఇదంతా నీకు కనిపిస్తూనే ఉంది. చూడు సిద్ధులు, ఋషులు, విద్యాధరులు, యక్షులు, గంధర్వులు, అచ్చరలు అందరూ ఇక్కడున్నారు. చెట్లను, తీగెలను, పొదరిళ్ళను చూడు. ఇవి సకల పుష్పాలను, ఫలాలను ఇస్తాయి. అన్ని ఋతువులలోని పూలతో కూడి ఉన్నాయి. మంచి ఆకులతో, పరిమళంతో కూడి ఉన్నాయి. మహాబాహూ ! మహాత్ముడు, దేవదేవుడు అయిన ఆ ఈశ్వరుని అనుగ్రహం వలన ఇక్కడ అంతా దివ్య భావంతో కూడి ఉంటుంది. వాసుదేవుడున్నాడు.

"ఆయన మాటలు విని, ప్రత్యక్షంగా అదంతా చూసి, పరమాశ్చర్యానికిలోనై, ఆమహాముని తో ఇలా అన్నాను. "విప్రేంద్రా ! నీవు ధన్యుడవు. నీ కన్నా పుణ్యకర్త ఎవడు ? దేవాధిదేవుడు కూడా నీ ఆశ్రమంలో నివసిస్తున్నాడు. భగవంతుడైన ఆ శివుడు నన్ను కూడా ఇలా అనుగ్రహిస్తాడా ? ప్రసన్నుడై దర్శనమిస్తాడా ? ఉపమన్యువు చెప్తున్నాడు. "పుండరీకాక్షా ! నేను దర్శించినట్లే అచిరకాలంలోనే మహాదేవుని చూడగలవు. సంశయం లేదు. అమిత విక్రమా ! దివ్య చక్షువుతో నేను చూస్తున్నాను నేటినుండి ఆరవ నెలలో మహాదేవుని చూడగలవు. ఆ పార్వతీ పరమేశ్వరుల నుండి ఇరవై నాలుగు వరాలను పొందగలవు. ఈ సత్యాన్ని నీకు చెప్తున్నాను. ధీమంతుడైన ఆ మహేశ్వరుని అనుగ్రహం వలన నాకు ఎప్పుడైనా జరిగినదీ, జరగబోయేదీ, జరుగుతున్నదీ తెలుస్తుంది. మాధవా ! ఆ హరుడు ఇక్కడున్న ఈ వేలమందిని అనుగ్రహించాడు. నీపై ఆ భగవానుడు అనుగ్రహాన్ని ఎందుకు చూపడు ? అంతేగాదు. బ్రాహ్మణభక్తి, దయ, శ్రద్ధగల నీవంటి వానితోనే దేవతల సమాగమం ప్రశంసనీయమవుతుంది. శంకరుని సందర్శించగల మంత్రాన్ని నీకు ఉపదేశిస్తాను."

శ్రీకృష్ణుడు చెప్తున్నాడు. 'అప్పుడు నేను ఆయనతో ఇలా పలికాను. బ్రహ్మస్వరూపా ! మహామునీ ! నీ అనుగ్రహంతో దైత్య సమూహాలను సంహరించిన ఆ దేవదేవుని నేను చూడగలను.' ఈ రీతిగా మహాదేవునకు సంబంధించిన కథలను చెప్పుకొంటూ ఉండగా ఎనిమిది రోజులు ముహూర్త కాలంగా గడచిపోయాయి. ఎనిమిదవ రోజు ఆ విప్రుడు నాకు యథాశాస్త్రంగా దీక్షనిచ్చాడు. నాకు గుండు చేయించాడు. దండాన్ని, దర్భలను, నారబట్టలను, మేఖలను సమకూర్చాడు. శరీరమంతా నేయిపూశాడు. పండ్లుతింటూ ఒక నెలా, నీరు త్రాగుతూ రెండవ నెలా గడిపాను. మూడవనెలా, నాల్గవ నెలా, అయిదవనెలా గాలినే ఆహారంగా స్వీకరించాను. అలసత లేకుండా చేతులుపైకెత్తి ఒంటికాలిపై నిలిచేవాడను. (ఆరవనెలలో) వేయిమంది సూర్యుల వెలుగువంటి తేజస్సును చూశాను. ఆ తేజస్సు మధ్యలో మరొక తేజోమండలం కనిపించింది. అది నల్లకొండల వరుసవలె ఉన్నది. దానిచుట్టు ఇంద్ర ధనుస్సు కనిపిస్తోంది. మెరుపుల మాల దాని గవాక్షంలా చూపడుతోంది. ఆకాశం ఆడుకొంగలతో అలంకరింపబడినట్లు కనిపించింది. మహాతేజస్వి అయిన శంకర భగవానుడు ఆ నీలతేజస్సు మధ్య తపస్సుతో, తేజస్సుతో, కాంతితో, దీప్తితో తన భార్యతో కలిసి నిలిచి ఉన్నాడు. అక్కడ మహేశ్వర భగవానుడు భార్యతో కలిసి మేఘాల మధ్య చంద్రునితో కలిసి ఉన్న సూర్యుని వలె విరాజిల్లాడు. కౌంతేయా ! దేవ సమూహాలకు దిక్కై, అందరి ఆర్తిని పోగొట్టే హరుని చూసి, నా వెంట్రుకలు నిక్కబొడుచుకొన్నాయి.

ఆశ్చర్యంతో కన్నులు విప్పారాయి. ఆ భగవానుడు కిరీటధారి. గదాధరుడు, శూలపాణి, పులితోలు ధరించినవాడు, జటిలుడు దండపాణి, పినాకధారి, వజ్రధారి, తీక్ష్ణమైన కోరపళ్లుగలవాడు. అందమైన అంగదాలను, జందెంగా పామును ధరించినవాడు. అనేక వర్ణాలుగల దివ్య పుష్పమాలను గుండెలపై ధరించాడు. అది చీలమండల వరకు వ్రేలాడుతోంది. శరత్కాలంలో సంధ్యాకాలంలోని ఎర్రదనంతో కలిసి గుడి మధ్య ప్రకాశిస్తున్న చంద్రునివలె ఉన్న ఆయనను నేను చూశాను.

ప్రమథ గణాలు ఆయన చుట్టూ ఉన్నాయి. పరివేషం గల శరత్కాల సూర్యునివలె తేరి చూడటానికి వీలు కాకుండా ఉన్నాడు. నియతాత్ముడై, శుభకర్మలనే ఆచరించే ఆ మహాదేవుడు పదకొండు వందల మంది రుద్రుల మధ్య నిలిచి ఉండగా నేను స్తుతించాను. ఆదిత్యులు, వసువులు, సాధులు, విశ్వేదేవులు, అశ్వినులు, సమస్త స్తుతులతో ఆ విశ్వదేవుని స్తుతించారు. అదితినందను లయిన ఇంద్రుడు, విష్ణుభగవానుడు, బ్రహ్మశివుని సన్నిధిలో రథంతర సామగానం చేస్తున్నారు. ఎందరో యోగిశ్రేష్ఠులు, బ్రహ్మర్షులు, వారి కుమారులు, దేవర్షులు కూడా యోగప్రదాత, జగత్పిత, జగద్గురువు అయిన ఆ మహాదేవుని స్తుతిస్తున్నారు.

మహాభూతాలు, ఛందస్సులు, ప్రజాపతులు, యజ్ఞాలు, నదులు, సముద్రాలు, నాగులు, గంధర్వులు, అచ్చరలు, విద్యాధరులు తేజోమధ్యగతుడై, తేజోరాశి అయిన ఆ జగత్పతిని గీతాలతో, నృత్త వాద్యాదులతో అర్చిస్తున్నారు.

రాజా ! పృథివి, అంతరిక్షం, నక్షత్రాలు, గ్రహాలు, నెలలు, పక్షాలు, ఋతువులు, రాత్రి, సంవత్సరాలు, క్షణాలు, ముహూర్తాలు, నిమేషాలు, యుగచక్రాలు, దివ్య విద్యలు రూపుదాల్చి ఆయనకు నమస్కరిస్తున్నాయి. అలాగే సత్త్వవేత్తలు కూడా ఆయనకు నమస్కరిస్తున్నారు.

యుధిష్ఠిరా ! సనత్కుమారుడు, దేవతలు, ఇతిహాసాలు, మరీచి, అంగిరుడు, అత్రి,పులస్త్యుడు, పులహుడు, క్రతువు, ఏడుగురు మనువులు, సోముడు, అథర్వుడు, బృహస్పతి, భృగువు, దక్షుడు, కశ్యపుడు, వసిష్ఠుడు, కాశ్యుడు, ఛందస్సులు, దీక్షలు, యజ్ఞాలు, దక్షిణలు, అగ్ని, హవిస్సు, రూపుదాల్చిన యజ్ఞద్రవ్యాలు, సర్వప్రజా పాలకులు, సర్వనదులు, సర్పాలు, కొండలు, దేవ మాతృకలు, దేవపత్నులు, దేవకన్యలు, ఫేలు, లక్షలు, కోట్లుగా ఉన్న మహర్షులు, పర్వతాలు, సముద్రాలు, దిక్కులు శాంత స్వరూపుడైన ఆ మహాదేవునకు నమస్కరించాయి. పాడటంలో, వాయించటంలో నేర్పరులైన గంధర్వులు, అప్సరసలు దివ్యతాళాలతో గానం చేస్తూ అద్భుతస్వరూపుడైన భవుని స్తుతిస్తున్నారు.

విద్యాధరులు, దానవులు, గుహ్యకులు, రాక్షసులు, చరాచరాత్మకాలైన సమస్త ప్రాణులు మనసా, వాచా, కర్మణా ఆ మహేశ్వరునికి నమస్కరిస్తున్నారు. దేవదేవుడైన శర్వుడు నా ఎదుట నిలిచాడు. భారతా ! నా ఎదుట నిలిచి ఉన్న ఈశానుని చూసి, ప్రజాపతి నుండి ఇంద్రుని వరకు సకల జగత్తు నావైపు చూసింది. మహాదేవుని చూడటానికి కూడా నాకు శక్తి చాలలేదు.

అప్పుడు ఆ దేవుడు నాతో ఇలా అన్నాడు. 'కృష్ణా ! చూడు నాతో మాటాడు. గతంలో కూడా వందల, వేల సార్లు నీవు నన్ను ఆరాధించావు. మూడులోకాలలో కూడా నీవలె నా కిష్టమైనవాడు లేడు.. తలవాల్చి, శివునకు నమస్కరించగానే ఉమాదేవి కూడా ప్రీతి చెందింది. అప్పుడు బ్రహ్మాది దేవతలు స్తుతించే స్థాణువుతో నేనిలా అన్నాను "సర్వకారణా ! శాశ్వతా ! నీకు నమస్సు. బ్రహ్మకు కూడా నీవే అధిపతి వని ఋషులు పలుకుతున్నారు. తపస్సు, సత్త్వమూ, రజస్సూ, తమస్సూ, సత్యమూ నీవే నని సజ్జనులు చెప్తున్నారు. నీవే బ్రహ్మవు, రుద్రుడవు, వరుణుడవు, అగ్నివి, మనువువు, భవుడవు, ధాతవు, త్వష్టవు, విధాతవు, ప్రభువువు. సర్వతో ముఖుడవు నీవే. చరాచరభూతాలు నీనుండియే పుడుతున్నాయి. చరాచరాత్మకాలైన మూడులోకాలనూ పూర్తిగా నీవే నిర్మించావు. ఇంద్రియాలు, సంపూర్ణ మనస్సు, సప్త వాయువులు, అగ్నులు, దేవగణాలు, స్తుతించే దేవతలు - వీరందరికి ఉన్నతస్థానంలో ఉన్న వానినిగా నిన్ను భావిస్తారు ఋషులు. వేదాలు, యజ్ఞాలు, సోముడు, దక్షిణలు, అగ్ని, హవిస్సు, యజ్ఞాని కుపయోగపడే ఏ చిన్న వస్తువయినా అదంతా భగవత్స్వరూపమే. సంశయం లేదు. యజ్ఞం, దానం, అధ్యయనం, వ్రతాలు, నియమాలు, హ్రీ, కీర్తి, శ్రీ, ద్యుతి, తుష్టి, సిద్ధి - ఇవన్నీ నీ దగ్గరకు చేర్చేవే. భగవంతుడా ! కామం, క్రోధం, భయం, లోభం, మదం, స్తంభం, మత్సరం, ఆధులు, వ్యాధులు, అన్నీ నీ శరీరాలే. క్రియ, వికారం, ప్రణయం, ప్రధానం, అవ్యయం బీజం, మనస్సుకు పరమకారణం, శాశ్వత ప్రభావం అన్నీ నీ రూపాలే. అవ్యక్తం, పావనం, అచింత్యం, హిరణ్మయ సూర్యస్వరూపం, గణాలకు ఆదికారణం, జీవితాశ్రయం అన్నీ నీవే. మహత్తు, ఆత్మ, మతి, బ్రహ్మ, విశ్వం, శంభుడు, స్వయంభువుడు, బుద్ధి, ప్రజ్ఞ, ఉపలబ్ధి, సంవిత్తు, ఖ్యాతి, ధృతి, స్మృతి - ఈ పర్యాయ పదాలతో పరమాత్మవయిన నీవే భావింపబడతావు. వేదాల ద్వారా నిన్ను గ్రహించియే బ్రాహ్మణులు మోహాన్ని నియంత్రించగలుగుతారు.

సర్వప్రాణి హృదయాలలోని క్షేత్రజ్ఞని ఋషులు స్తుతిస్తారు. ఆ క్షేత్రజ్ఞుడవు

నీవే. నీవు అన్నివైపులా చేతులు, కాళ్ళు, కళ్ళు, శిరస్సులు, ముఖాలు ఉంటాయి. అన్ని వైపులా నీకు చెవులుంటాయి. లోకమంతటినీ నీవు వ్యాపించి ఉంటావు. జీవుని నిమేషాది కర్మల కన్నింటికీ ఫలం నీవే. నీవే కాంతివి. నీవే జ్వాలవు. అందరి హృదయాలలో ఉన్న పురుషుడవు నీవే అణిమ, మహిమ, ప్రాప్తి, ఈశానుడు, జ్యోతి ఇవన్నీ అవ్యయుడవైన నీవే. బుద్ధి, మతి నీలోనే ఉన్నాయి. నీ శరణు కోరి నిన్ను ఆశ్రయించినవారు ధ్యాన తత్పరులు, నిత్యయోగులు, సత్య సంకల్పులు, జితేంద్రియులు కాగలరు. హృదయ గుహలలో ఉన్న ఆత్మ, ప్రభువు, పురాణ పురుషుడు, మూర్తి మంతుడైన పరబ్రహ్మ, హిరణ్మయ పురుషుడు, జ్ఞానులను పరమగతి అన్నీ నీవే అని నిశ్చితంగా గ్రహించిన బుద్ధిమంతుడు బుద్ధిని కూడా అతిక్రమించి, పరమాత్మరూపుడై నిలువగలడు. పంచతన్మాత్రలు, మహత్తత్త్వం, అహంకారం, ఈ ఏకు సూక్ష్మాలను, నీ రూపాలయిన షడంగాలను (సర్వజ్ఞత, తృప్తి, అనాదిబోధ, స్వాతంత్ర్యం, అవ్యయశక్తి అనంతశక్తి) గ్రహించి, ప్రధాన విధియోగాన్ని ఆశ్రయించినవాడు నీలో చేరగలడు.

పార్థా ! అందరి ఆర్తినీ పోగొట్టే మహేశునితో నేను అలా అనగానే చరాచరజగత్తు అంతా సింహనాదం చేసింది. అప్పుడు బ్రాహ్మణ సమూహాలు, సురాసురులు, నాగులు, పిశాచాలు, పితరులు, పక్షులు, రాక్షస గణాలు, సర్వభూతగణాలు, మహర్షులు ఆయనకు నమస్కరించారు. నా తలపై పరిమళిస్తున్న దివ్యకుసుమాల రాసులు పడ్డాయి. సుఖకరంగా గాలివీచింది. జగానికి హితాన్ని కలిగించే శంకర భగవానుడు ఉమాదేవిని, నన్ను, ఇంద్రుని చూసి నాతో ఇలా అన్నాడు. "శత్రుసూదనా ! మాపై నీకున్న పరమ భక్తి తెలిసింది. నా శ్రేయస్సును నీవు పొందగలవు. నీపై నాకు పరమ ప్రీతి ఉన్నది. కృష్ణా ! సత్తమా ! యాదవశ్రేష్ఠా ! ఎనిమిది వరాలను కోరుకో ! చెప్పు, ఏదుర్లభవరాలు నీవు కోరుతున్నావు."

15. శ్రీకృష్ణుడు వరములు పొందుట.

శ్రీకృష్ణుడు చెప్తున్నాడు "ఆ తరువాత మనస్సును నియంత్రించుకొని, తల వాల్చి, నమస్కరించి, ఆ తేజోరాశితో పరమహర్షంతో ఇలా అన్నాను. ధర్మంమీద దృఢబుద్ధిని, యుద్ధంలో శత్రుసంహారం చేయగలగటాన్ని, ఘనకీర్తిని, పరమ బలాన్ని, యోగ ప్రియత్వాన్ని, నీ సాన్నిధ్యాన్ని పదివేల మంది కొడుకులను కోరుకొంటున్నాను. నేను అలా కోరుకొనగానే శంకరుడు 'అలాగే జరుగుగాక' అన్నాడు. ఆ పై సర్వపావని, జగన్మాత, ధారిణి, తపోనిధి, శర్వాణి అయిన ఉమ సావధానంగా నాతో ఇలా అన్నది. 'అనఘా ! భగవంతుడు నీకు

సాంబుడనే కుమారుని ఇచ్చాడు. నానుండి కూడా నీవు ఎనిమిది వరాలను కోరుకో ఇస్తాను' పాండునందనా ! అప్పుడు శిరసా నమస్కరించి, నేను ఆమెతో ఇలా అన్నాను "బ్రాహ్మణులపై కోపం కలుగకుండుట, పితృఅనుగ్రహం, వందమంది కొడుకులను, పరమభోగాన్ని, వంశప్రీతిని తల్లి అనుగ్రహాన్ని, శాంతిని, సామర్థ్యాన్ని కోరుకొంటున్నాను ఉమాదేవి ఇలా అన్నది. "అమర ప్రభావా ! అలాగే జరుగుతుంది. నేను ఎప్పుడూ ఏ అసత్యమూ పలుకను. నీకు పదహారువేల పదహారు మంది భార్యలను, వారిలో ప్రేమను, అక్షయధనాన్ని, బాంధవుల నుండి శ్రేష్ఠప్రీతిని, అందమైన శరీరాన్ని, నిత్యమూ నీ ఇంట ఏడు వేల మంది అతిథులు భోజనం చేయటాన్ని నీకు నేను ఇస్తున్నాను" వాసుదేవుడు ఇలా అన్నాడు. 'భారతా ! నాకు ఇలా వరాల నిచ్చి మహాదేవుడు, ఉమాదేవి ఆ క్షణంలోనే గణాలతో సహా మాయమయ్యారు. రాజశ్రేష్ఠా ! ఈ అత్యద్భుత వృత్తాంతాన్ని ముందుగా నేను అమిత తేజస్వి అయిన బ్రాహ్మణుడు – ఉపమన్యువు దేవదేవునకు నమస్కరించి ఇలా అన్నాడు. **"శర్వునివంటి దేవుడు లేడు. శర్వుని వంటి గతి లేదు. శర్వునితో సమానమైన దానంలేదు. యుద్ధంలో శర్వునితో సమానుడు లేడు."***

16. తండి మహాదేవుని స్తుతించుట.

ఉపమన్యు విలా చెప్తున్నాడు. "నాయనా ! కృతయుగంలో తండి అను పేర ప్రసిద్ధిచెందిన ఋషి ఉండే వాడు. ఆయన భక్తితో పదివేల సంవత్సరాల పాటు సమాధి నిష్ఠుడై మహాదేవుని ఆరాధించాడు. ఆయన పొందిన ఫలాన్ని విను. ఆయన మహాదేవుని సాక్షాత్కారాన్ని పొంది, ఆ ప్రభువును స్తుతించాడు. ఈ రీతిగా తండి తపోయోగంతో అవ్యయ పరమాత్మ అయిన ఆ మహాత్ముని శంకరుని గూర్చి ఆలోచించి, ఆశ్చర్యంతో ఇలా అన్నాడు. నేను మహాదేవుని శరణు కోరుతున్నాను. ఆయననే సాంఖ్యులు పరముడని, ప్రధానుడని, పురుషుడని, అధిష్ఠాత అని, ఈశ్వరుడని చెప్తుంటారు. యోగులు ఆయననే ధ్యానిస్తుంటారు. పండితులు జగదుత్పత్తివినాశాలకు ఆయనయే కారణమంటారు. దేవతలలో, అసురులలో, మునులలో కూడా ఆయనను మించిన వాడు లేడు ఆయన అజుడు, ఈశానుడు, అనాది, అమరుడు, సమర్థుడు, పరమసుఖి, అనఘుడు కూడా.'

ఇలా అంటూనే ఆ తండి తపోనిధి, అవ్యయుడు, సాటిలేనివాడు, అచింత్యుడు,

---

* నాస్తి శర్వసమో దేవః నాస్తి శర్వసమా గతిః ।
నాస్తి శర్వసమో దానే నాస్తి శర్వసమో రణే ॥ 11

శాశ్వతుడు, స్థిరుడు, నిష్కలుడు, సకలుడు, నిర్గుణుడు, గుణగోచరుడు అయిన పరబ్రహ్మను చూశాడు. ఆ పరబ్రహ్మయే యోగుల దృష్టిలో పరమానందం, అక్షరం, మోక్షనామకం కూడా. ఆయనయే మనువునకు, ఇంద్రునకు, మరుత్తులకు, విశ్వానికీ, బ్రహ్మకు కూడా గతి. ఆయన గ్రహింప వీలుకాని వాడు, అచలుడు, శుద్ధుడు, బుద్ధిచే ఎరుగదగినవాడు, మనోమయుడు. ఆయనను గురించి తెలిసికొనటం చాలా కష్టం. పరిగణించటం కుదరదు. నిగ్రహంలేనివారు ఆయనను సమీపించలేరు. సమస్త జగత్తుకు ఆయన కారణం. అంధకారానికి పరాత్పరుడు. తనను జీవస్వరూపునిగా చేసికొని, దానిలోనూ మనోమయ జ్యోతిస్వరూపుని చేసికొని ఉన్న ఆ మహాదేవుని దర్శింపగోరి, ఆ ఋషి - తండి తీవ్రతపస్సులో నిలిచి, దర్శనం పొంది. ఈశ్వరుని ఇలా స్తుతించాడు. "సర్వ శ్రేష్ఠ ! నీవు పవిత్రులలో పవిత్రుడవు. గతి శీలురలో ఉత్తమ గతివి. తేజస్సులలో ఉగ్రతేజస్సువు. తపస్సులలో పరమ తపస్సువు. విభూ ! విశ్వావసువు, హిరణ్యాక్షుడు, ఇంద్రుడు నీకు నమస్కరిస్తారు. నీవు ఎన్నో శుభాల నిచ్చేవాడవు. పరమ సత్య స్వరూపుడవు. నీకు నమస్సు. జనన మరణ భయంతో వాటిని దాటటానికి ప్రయత్నించే యతులకు మోక్షమిచ్చేవాడవు. విభూ ! నీవు సహస్రకిరణుడవు. సుఖానికి నిలయుడవు. నీకు నమస్సు. బ్రహ్మ, ఇంద్రుడు, విష్ణువు, విశ్వేదేవులు, మహర్షులు కూడా నీ తత్త్వాన్ని తెలియలేరు. మేమెలా తెలిసికొనగలం. నీ నుండి సర్వమూ ప్రవర్తిస్తుంది. నీలోనే సర్వమూ నిలిచి ఉంటుంది. కాలం, పురుషుడు, బ్రహ్మ ఈ పేర్లతో ప్రసిద్ధి చెందిన వాడవు నీవే. పురాణ వేత్తలయిన దేవర్షులు ఈ మూడు నీ రూపాలన్నారు. అధిపౌరుషం, అధ్యాత్మం, అధిభూతం, అధిదైవతం, అధిలోకం, అధిజ్ఞానం, అధియజ్ఞం నీవే. దేవతలు కూడా తెలియలేని నిన్ను తమ దేహాలలోనే ఉన్నావని తెలిసికొన్న జ్ఞానులు బంధవిముక్తులై, అనామయమైన పరమ భావాన్ని పొందుతారు. నీకు ఇష్టం లేకపోతే జీవుడు అనేక పర్యాయాలు జనన మరణాలకు లోనవుతాడు. స్వర్గ మోక్షాలకు నీవే ద్వారం. వాటిని పొందకుండా లాగేవాడవు నీవే, వాటినిచ్చే వాడవూ నీవే. నీవే స్వర్గమూ, మోక్షమూ. కామక్రోధాలు నీవే. సత్త్వరజస్తమస్సులు నీవే. క్రిందుమీదులు నీవే.

బ్రహ్మ, శివుడు, విష్ణువు, స్కందుడు, ఇంద్రుడు, సూర్యుడు, యముడు, వరుణుడు, చంద్రుడు, మనువు, ధాత, విధాత, కుబేరుడు నీవే. భూమి, వాయువు, జలం, అగ్ని, ఆకాశం, వాక్కు, బుద్ధి, స్థితి, మతి, కర్మ, సత్యం, అసత్యం, ఉనికి, లేమి నీవే. ఇంద్రియాలు, ఇంద్రియార్థాలు నీవే. ప్రకృతికన్న పరమైన స్థిరతత్త్వం నీవే. నీవే విశ్వా విశ్వాలకన్న విలక్షణమైన భావం. నీవే చింత్యుడవు, అచింత్యుడవు కూడా. పరబ్రహ్మ

పరమ పదం, సాంఖ్యులు, యోగులు పొందే గతి నీవే. ఈ విషయంలో సంశయం లేదు. జ్ఞానంచే నిర్మలమైన బుద్ధి గల వారు కోరుకొనే గతిని, సత్పురుషులు పొందేగతిని నిశ్చితంగా పొందగలిగాం. ఇప్పుడు నిశ్చయంగా కృతార్థుల మయ్యాం. ఆహా ! అజ్ఞానంతో ఇంత సుదీర్ఘకాలం మోహానికి లోనై ఉన్నాం. అందుకే జ్ఞానులు తెలిసికొని సనాతన పరమ దేవుని ఇంతవరకు గ్రహింపలేకపోయాం. అనేక జన్మల ప్రయత్నంతో నేను ఇప్పుడు ప్రత్యక్షంగా నీ మీద భక్తి భావాన్ని పొందగలిగాను. నీవే భక్తులను అనుగ్రహించే దేవుడవు. నిన్ను తెలిసినవారు మోక్షాన్ని అనుభవించగలరు. దేవతలకు, అసురులకు, మునులకు కూడా రహస్యమైన నూతన బ్రహ్మ ఈ భగవంతుడే. హృదయ గుహలో నిలిచి, మునులు కూడా గ్రహించలేని భగవాను డీయనయే. సర్వసృష్టికర్త, సర్వతోముఖుడు ఈయన. ఈయన సర్వాత్మ, సర్వదర్శి, సర్వవ్యాపి, సర్వజ్ఞుడు. ఈయన దేహకర్త, దేహభర్త, దేహి, దేహభోక్త, దేహులకు గతి, ప్రాణకర్త, ప్రాణభర్త, ప్రాణి, ప్రాణదుడు, ప్రాణులకు గతి. ప్రియభక్తులై ధ్యానం చేసేవారికి అధ్యాత్మగతి ఈయనయే. పునర్జన్మ వద్దనుకొనే ఆత్మ జ్ఞానులకు ఈ ఈశ్వరుడే గతి. ఈయనయే సర్వప్రాణులకు శుభగతిని కానీ, అశుభగతిని కానీ ఇచ్చేవాడు. సర్వజంతువులకు జనన మరణాలను విధించే వాడు ఈయనయే. మోక్షకాములకు పరమగతి ఈ పరమేశ్వరుడే. భూమి మొదలుగా గల సకలభువనాలను దేవతలతో సహా నిర్మించి తన ఎనిమిది శరీరాలతో ధరించి, భరించేది ఈయనయే.

ఈయన నుండియే సర్వమూ పుడుతుంది. సర్వమూ ఈయనయందే నిలిచి ఉంటుంది. ఈయనలోనే లీనమవుతుంది. ఈయన ఒక్కడే సనాతన పురుషుడు. సత్యకాములైన సజ్జనులకు సర్వోత్తమ సత్యలోక మీయనయే. ముక్తులకు మోక్షమూ, ఆత్మజ్ఞానులకు కైవల్యమూ ఈయనయే. దేవతలు, అసురులు, మనుష్యులు ఈయన ఉనికిని గ్రహించలేరు. బ్రహ్మాది సిద్ధులు తమ హృదయ గుహలలో రహస్యంగా దాచుకొన్నది ఈయననే. హృదయ గుహలో రహస్యంగా ఉండి, పైకి కనిపించని అటువంటి నీ మాయలో పడి, మోహానికిలోనై దేవతలు, అసురులు, నరులు పరమేశ్వరుడనైన నిన్ను వాస్తవికంగా తెలియలేకున్నారు. భక్తి భావంతో పవిత్రులై తనను ఆశ్రయించిన వారికే హృదిస్థితుడైన ఈ మహేశ్వరుడు సాక్షాత్కరిస్తాడు. ఈయనను తెలిసికొన్న తరువాత పునర్జన్మ మరణాలు ఉండవు. ఈయన పరమవేద్యుడు. ఈయనను తెలిసికొన్న తరువాత ఇక తెలియవలసిన దుండదు. ఈయన పరమలాభం. దీనిని పొందిన తరువాత పండితుడు

మరేలాభాన్ని గొప్పగా భావించడు. సూక్ష్మమైన పరమప్రాప్తి ఈయనయే. ఈయనను పొందితే అవ్యయాక్షరస్థానాన్ని పొందినట్లే. గుణతత్త్వజ్ఞులు, సూక్ష్మజ్ఞానంతో సంసారాన్ని తరించేవారు అయిన సాంఖ్యశాస్త్ర విశారదులు ఈ సూక్ష్మం తెలిసికొని బంధాలనుండి విముక్తి నందుతారు. వేదవేత్తలై సతతమూ ప్రాణాయామ పరాయణులైన యోగులు వేద్యుడు, వేదాంత ప్రతిష్ఠితుడు అయిన ఈయననే జపిస్తుంటారు. ఈయనలోనే ప్రవేశిస్తారు. వారు ఓంకార రథాన్ని ఆరోపించి మహేశ్వరునిలో ప్రవేశిస్తారు. దేవయానానికి ద్వారంగా భావింపబడే సూర్యుడని ఈ మహాదేవునే వ్యవహరిస్తారు.

పితృయానానికి ద్వారమయిన చంద్రుడు కూడా ఈయనయే. ఈయనయే కాష్ఠలు, దిక్కులు, సంవత్సరాలు, యుగాదులు కూడా. దివ్యలాభం, అదివ్యలాభం, పరమలాభం, దక్షిణాయనం, ఉత్తరాయణం ఈయనయే. నీలలోహితుడని పేరుగల ఈయననే పూర్వకాలంలో అనేక స్తుతులతో ఆరాధించి, ప్రజాపతి ప్రజాసృష్టికై వరాన్ని పొందాడు.

ఋగ్వేదపండితులు తాత్విక యజ్ఞకర్మలలో ఈయననే ఋక్కులతో నుతిస్తారు. యజుర్వేద పండితులు అధ్వర్యువులు యాగంలో త్రేతాగ్నులుగా ఈయనను భావించియే ఆహుతుల నిస్తారు. శుద్ధబుద్ధులైన సామవేదపండితులు సామలతో ఈయననే గానం చేస్తారు. అధర్వవేత్తలయిన బ్రాహ్మణులు ఋతమని, సత్యమని, పరబ్రహ్మ అనీ ఈయననే స్తుతిస్తారు. ఈయనయే యజ్ఞానికి పరమ కారణం. ఈయనయే పరమ యజ్ఞపతి. రాత్రి ఈయన చెవి. పగలు ఈయనకన్ను. పక్షం శిరస్సు. మాసం భుజం. ఋతువు వీర్యం. తపస్సు ధైర్యం. సంవత్సరం గుహ్యేంద్రియం, ఊరువులు, పాదాలు కూడా. మృత్యువు, యముడు, అగ్ని, సంహారం కోసం వేగంగా సాగే కాలుడు, కాలునికి కూడా పరమ కారణమైన కాలం సనాతనుడైన ఈ మహాదేవుడే. చంద్రుడు, సూర్యుడు, నక్షత్రాలు, గ్రహాలు, వాయువు, ధ్రువుడు, సప్తర్షులు, సప్తభువనాలు, ప్రధానం (మూల ప్రకృతి), మహత్తత్వం, వికారాలతో ప్రారంభించి విశేష పర్యంతమూ ఉన్న తత్త్వం, బ్రహ్మాది స్తంబ పర్యంతమైన జగత్తు, సత్తు, అసత్తు, ఎనిమిది ప్రకృతులు, ప్రకృతికి కన్న పైనున్న పురుషుడు ఈ మహాదేవుడే ఈ దైవాంశతో సమస్త జగత్తు చక్రంవలె తిరుగుతుంటుంది. ఈయనయే ఆజగత్తు. పరమానంద మీయనయే. శాశ్వత బ్రహ్మ ఈయనయే. విరక్తులకు గతి, సత్పురుషులకు పరమ భావమూ ఈయనయే. ఈయనయే ఉద్వేగ రహితమైన పరమ పదం. ఈయనయే సనాతన బ్రహ్మ. శాస్త్రవేత్తలకు, వేదాంగవేత్తలకు కూడా

ధ్యానింప దగిన పరమ పద మీయనయే ఈయనయే పరమకాష్ఠ. ఈయనయే పరమకళి. ఈయనయే పరమసిద్ధి. ఈయనయే పరమగతి. ఆ పరమ శాంతి ఈయనయే. ఆ పరమానంద మీయనయే. ఈయనను పొందిన తరువాతనే యోగులు కృతకృత్యుల మనుకొంటారు.

ఈయనయే తుష్టి. ఈయనయే సిద్ధి. ఈయనయే శ్రుతి, స్మృతి. యజ్ఞం చేసినవారు పొందే గతి, జ్ఞానులు పొందే అవ్యయస్థితి ఈయనయే. భూరిదక్షిణలతో కోరికలను సిద్ధింపజేసికొనటానికి యాగాలు చేసే యజ్ఞశీలురు పొందే గతి కూడా నీవే. సంశయం లేదు. దేవా ! ఉత్తమ యోగజపాలతో శరీరాన్ని శుష్కింపజేసే నియమాలతో లభించే శాంతి, తపించే వారు పొందే పరమగతి నీవే. సనాతనా ! కర్మ సంన్యాసులు, విరక్తులు బ్రహ్మలోకంలో ఏ ఉత్తమ గతిని పొందుతారో ఆ గతి నీవే. సనాతనా ! మోక్షార్థులై, వైరాగ్య మార్గంలో చరించేవారు, ప్రకృతిలో లీనమయ్యేవారు పొందే గతి నీవే. జ్ఞాన విజ్ఞానయుక్తులై ఏ పేరూ, ఏ బంధమూ లేని కైవల్య రూపమైన పరమగతిని పొందుతారు. ఆ గతి నీవే. విభూ ! వేదశాస్త్ర పురాణాలలో చెప్పిన పంచగతులు (సామీప్య, సాలోక్య, సారూప్య, సాయుజ్య, కైవల్యగతులు) నీ అనుగ్రహంతోనే లభిస్తాయి. మరొక రీతిగా లభించవు."

ఈ విధంగా తపోరాశి అయిన తండి మనసా భగవానుని స్తుతించాడు. పూర్వకాలంలో లోక కర్త అయిన బ్రహ్మ బ్రహ్మస్వరూపాన్ని స్తుతించిన రీతిగా తానూ స్తుతించాడు. ఉపమన్యువు చెప్తున్నాడు. 'ఈ రీతిగా బ్రహ్మవాది అయిన తండి స్తుతించగా భగవానుడు, ప్రభువు అయిన మహాదేవుడు పార్వతితో కూడి ఉండి ఆయనతో ఇలా అన్నాడు. తండి తన స్తుతిలో బ్రహ్మ, ఇంద్రుడు, విశ్వేదేవులు, మహర్షులు కూడా నిన్నెరుగలేరు' అన్నాడు. దానితో తుష్టిచెందిన శివుడు ఇలా అన్నాడు. "నీవు అక్షయుడవు, అవ్యయుడవు కాగలవు, దుఃఖరహితుడవు, యశస్వివి, తేజస్వివి, దివ్యజ్ఞాన సంపన్నుడవు కాగలవు. ద్విజోత్తమా ! నా అనుగ్రహంతో నీ కొక కొడుకు పుడతాడు. అతడు సూత్ర కర్తయై ఋషులు కూడా ఆశ్రయింప దగినవాడు కాగలడు. సందేహంలేదు. వత్సా ! ఇంకా ఏమి కావాలి ? నీవేమి కోరుకొంటున్నావో చెప్పు." ఆ ఉపమన్యువు చేతులు జోడించి, 'నీపై దృఢభక్తి కావాలి' అన్నాడు. ఉపమన్యువు ఇలా చెప్పాడు. "ఈ వరాలనిచ్చి మహాదేవుడు దేవర్షుల నమస్కారాల నందుకొంటూ, దేవతలచే స్తుతింపబడుతూ అక్కడే అంతర్ధాన మయ్యాడు. యాదవరాజా ! ఆ భగవానుడు అనుచరులతో పాటు అదృశ్యం

కాగా తండిముని ఆశ్రమానికి వచ్చి, ఇది నాకు చక్కగా చెప్పాడు. మానవశ్రేష్ఠా ! ఆదికాలంలో ప్రసిద్ధి కెక్కిన ఏ నామాలను తండి నాకు చెప్పాడో ఆ నామాలను నీవు కూడా వినుు. సిద్ధి లభిస్తుంది. పితామహుడైన బ్రహ్మ దేవతలకు మహాదేవుని పదివేల నామాలను చెప్పాడు. శాస్త్రాలలో శివుని సహస్రనామాలు వర్ణింపబడ్డాయి. అచ్యుతా ! ఈ నామాలు, రహస్యాలు తొలుత దేవేశుడైన బ్రహ్మ మహాదేవుని అనుగ్రహంతో ఈ నామాలను తండికి చెప్పాడు. తండి ఆ భగవన్నామాలను నా దగ్గర ప్రకటించాడు.

17. శివ సహస్రనామస్తోత్రము.

వాసుదేవుడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరా ! ఆపై బ్రహ్మర్షి అయిన ఉపమన్యువు ప్రయత్న పూర్వకంగా చేతులు జోడించి, శివనామసంగ్రహాన్ని మొదటి నుండి ఇలా చెప్పాడు. 'ఇవి ముందు బ్రహ్మ చెప్పినవి. ఆపై ఋషులు చెప్పినవి. వేదవేదాంగాల నుండి ఇవి పుట్టాయి. సర్వలోకవిఖ్యాతుడై. స్తోత్రార్హుడయిన మహేశ్వరుని ఈ పేర్లతో స్తుతిస్తున్నాను. ఈ నామాలు మహాత్ములు విధించినవి. సత్యాలు, సిద్ధిప్రదాలు. సర్వార్థ సాధకాలు వేదమందు మనస్సుపెట్టిన తండిమునిచే భక్తి పూర్వకంగా కొనిరాబడినవి. తత్త్వద్రష్ట లయిన మహర్షులు వీటిని పరించారు. సాధుజనులు వీటికి ఖ్యాతితెచ్చారు. ఈ నామసహస్రం శ్రేష్ఠం. అగ్రగణ్యం, స్వర్గసాధన హేతువు. సర్వప్రాణిహితకరం. శుభకరం. తండి బ్రహ్మలోకం నుండి దీనిని అవతరింపజేశాడు అందుకే లోకమంతా ఈ నామాలను సాదరంగా వింటుంది. సనాతనమైన పరబ్రహ్మ సత్యవచనాలతో బ్రహ్మచే దీనిలో స్తుతింపబడినది. యదుకుల శ్రేష్ఠా ! నేను నీకు చెపుతాను. సావధానంగా వినుు. నీవు భక్తుడవు. పరమేశ్వరుడైన ఈ భవుని, ఈ మహాదేవుని ప్రార్థించు. నీవు భక్తుడవు కాబట్టి సనాతన వేద స్వరూపమైన దీనిని నీకు వినిపిస్తాను. దీనిని పూర్తిగా, సవిస్తరంగా చెప్పటం ఎవ్వరికీ వీలుకాదు. ఆ శివుని ఆదిమధ్యాంతాలను దేవతలు కూడా తెలిసికొనలేరు. అణిమాది విభూతులు కలవాడయినా, వంద సంవత్సరాలు చెప్పినా, ఆయన గుణాలను పూర్తిగా ఎవరు చెప్పగలరు ? మాధవా ! అయినా ఆ ధీమంతుని అనుగ్రహంతో ఆ మహాదేవుని చరితను యథాశక్తిగా సంక్షిప్తపదాలతో, సంక్షిప్తాక్షరాలతో, సంక్షిప్తార్థాలతో చెప్పబూనుతున్నాను. ఆయన అనుజ్ఞను పొందకుండా ఆ ఈశ్వరుని స్తుతించటం వలనుపడదు. ఆయన అనుమతించినప్పుడే నేను ఆయనను స్తుతించాను జగత్తుకు తాను కారణం. కానీ తనకు కారణమేదో వ్యక్తం కాదు. అద్యంతాలు లేని ఆ మహాత్ముని

నామాలను కొంత సంక్షేపంగా చెపుతాను.

కృష్ణా ! వరదుడు, వరేణ్యుడు, విశ్వరూపుడు, ధీమంతుడు అయిన శివుని గూర్చి బ్రహ్మ చెప్పిన నామ సముచ్చయాన్ని విను. బ్రహ్మ పదివేల నామాలను చెప్పాడు. వాటిని మథించి పెరుగులో నుండి నేతిని తీసినట్లు ఈ నామసహస్రం ఉద్ధరింపబడింది. పర్వత సారం బంగార మైనట్లు, పుష్పసారం మకరంద మైనట్లు, ఘృతసారం మండ (తరగ) మైనట్లు పదివేల నామాలసారం సహస్ర నామం. ఇది సర్వపాపాలను పోగొట్టగలది. చతుర్వేదాలతోనూ సమన్వయించేది. ప్రయత్న పూర్వకంగా దీనిని పొందాలి. నియమ పూర్వకంగా ధారణ చేయాలి. ఇది మంగళకరం, పుష్టికరం, రాక్షసవినాశకం, పరమ పావనం కూడా. శ్రద్ధ, ఆస్తికత్వం గల భక్తునకు దీని నుపదేశించాలి. శ్రద్ధలేనివానికి, నాస్తికునకు, మనో నిగ్రహం లేనివానికి ఉపదేశింపదగదు. కృష్ణా ! జగత్కారణరూపుడైన ఈశ్వరుని దోష దృష్టితో చూసేవాడు పూర్వీకులతో, కుమారులతో సహా నరకానికి వెళతాడు. ఇదియే ధ్యానం. ఇదియే యోగం. ధ్యానింపదగిన ఉత్తమధ్యేయ మిదియే. ఇదియే జపింపదగినది. ఇదియే జ్ఞానం. ఇదియే ఉత్తమ రహస్యం మరణ సమయంలో దీనిని గ్రహింపగలిగినా పరమ గతిని పొందవచ్చు. ఇది పరమ పవిత్రం, మంగళకరం మేధావర్ధకం, శుభకరం, ఉత్తమం. పూర్వకాలంలో సర్వలోకపితామహు డైన బ్రహ్మ దీనిని ప్రకటించి సమస్తదివ్యస్తోత్రాలకు దీనిని రాజుగా ప్రతిష్ఠించాడు. అప్పటినుండి మహాత్ముడైన ఈశ్వరుని ఈ సహస్రనామం దేవ పూజితమై లోకంలో స్తవరాజమని ప్రఖ్యాతినందినది. ఈ స్తవరాజం బ్రహ్మలోకం నుండి స్వర్గలోకానికి కొనిరాబడింది. దీనిని తండి ముందుగా పొందాడు. అందువలన తండి దీనికి కర్త అని లోకవ్యవహారం. మహాబాహూ ! స్వర్గలోకం నుండి తండి ఈ భూలోకానికి దానిని కొనితెచ్చాడు. సర్వకళ్యాణాలకు కళ్యాణ స్వరూపమై, సర్వపాప వినాశకమైన ఈ ఉత్తమ స్తవాన్ని నీకు చెపుతాను.

వేదాలకే వేదం పరాత్పరుడు. తేజస్సులకే తేజస్సు. తపస్సులకే తపస్సు. శాంత పురుషులకన్న శాంతుడు. కాంతికే కాంతి. శాంతికే శాంతి. జితేంద్రియులలో పరమ జితేంద్రియుడు. ధీమంతులకు కూడా బుద్ధి. దేవతలకే దైవం, ఋషులకే ఋషి. యజ్ఞాలకే యజ్ఞం. శుభాలకే శుభం. రుద్రులకే రుద్రుడు. ఈశ్వరునకే ఐశ్వర్యం. యోగులకు యోగి. కారణాలకు కారణం. ఆయన నుండియే లోకాలు పుడుతున్నాయి. మరల ఆయనలోనే లీనమవుతున్నాయి. ఆయన సర్వభూతాలకూ ఆత్మస్వరూపుడు. ఆ రీతిగా

అమితతేజస్వి అయిన శంకరభగవానుని అష్టోత్తర సహస్రనామాన్ని విను. దానిని విని, కోరిన వాటినన్నింటినీ పొందగలవు.

స్థిరమయినవాడు, ప్రపంచమంతా తనలో ఉన్నవాడు, ప్రభువు, భయంకరుడు, వరింపదగినవారిలో శ్రేష్ఠుడు, వరదుడు, విశ్వమంతా కప్పి ఉన్నవాడు, సర్వాత్ముడు, సర్వప్రసిద్ధుడు, అంతటా ఉన్నవాడు, అన్ని చేసేవాడు, విశ్వకర్త జటాజూటంగలవాడు, చర్మధారి, నెమలిపింఛం ధరించువాడు, సర్వాంగుడు, సర్వాన్ని భావించేవాడు, సంహరించేవాడు, హరిణనేత్రుడు, సర్వ ప్రాణులను హరించేవాడు, సర్వభోక్త. ప్రవృత్తి, నివృత్తి, ఇంద్రియాలను నిగ్రహించేవాడు, శాశ్వతుడు, ధ్రువుడు, శ్మశానంలో నివసించేవాడు, ఐశ్వర్యాదులు గలవాడు, ఆకాశమందు సంచరించేవాడు, ఇంద్రియాలలో చరించేవాడు, పాపులను పీడించేవాడు. నమస్కరింపదగినవాడు, మహాకర్మలు చేసేవాడు, తపస్వి, ప్రాణులను పోషించేవాడు, ఉన్మత్తవేషంతో రహస్యంగా ఉండేవాడు, సర్వలోక ప్రజాపతి. పెద్దరూపం గలవాడు, పెద్దశరీరం గలవాడు, ధర్మ స్వరూపుడు, మహాయశస్వి, మహాత్ముడు, సర్వప్రాణులకు ఆత్మ, విశ్వరూపుడు, పెద్ద దవడలు గలవాడు. లోకపాలుడు, అంతర్ముఖుడు, ఆనందస్వరూపుడు, కంచర గాడిదలు రథ వాహనాలుగా కలవాడు, పవిత్రుడు, సర్వోత్కృష్టుడు, నియమాలచే పొందదగినవాడు, నియమాల నాశ్రయించినవాడు. సర్వకర్మ, స్వయంభూతుడు, మొదటివాడు, హిరణ్యగర్భుని సృష్టించినవాడు, విధి స్వరూపుడు, సహస్రనయనుడు, విశాలనేత్రుడు, సోమలతా స్వరూపుడు, నక్షత్ర స్థితిని పొందటానికి సాధనం, చంద్ర స్వరూపుడు, సూర్య స్వరూపుడు, శనిస్వరూపుడు, కేతువు, రాహువు, గ్రహపతి (కుజుడు), వరింపదగినవాడు (బృహస్పతి), అత్రి (బుధుడు), అత్రి భార్యకు (అససూయకు) నమస్కరించినవాడు, మృగంపై బాణాన్ని వేసి అర్పించిన వాడు (కిరాతుడు), అనఘుడు.

మహాతపస్వి, ఘోరతపస్వి, దైన్యరహితుడు, దీనులకు సాధకుడు, సంవత్సర ప్రవర్తకుడు, మంత్రస్వరూపుడు, ప్రమాణ స్వరూపుడు, పరమ తపోరూపుడు. యోగి, పరబ్రహ్మ మందు లయం చేయదగినవాడు, మహాకారణ రూపుడు, మహావీర్యుడు, మహాబలుడు, సువర్ణ రేతస్వి, సర్వజ్ఞుడు, సత్కారణ స్వరూపుడు, జీవుల సంస్కారాన్ని వహించేవాడు. పదిబాహువులవాడు, రెప్పపాటు లేనివాడు, నీలకంఠుడు, ఉమాపతి, విశ్వరూపుడు, స్వయంశ్రేష్ఠుడు, బలవీరుడు, దుర్బల గణ(తత్త్వ) స్వరూపుడు. గణనియంత, గణపతి, దిగంబరుడు, కామస్వరూపుడు, మంత్రవేత్త, పరమ మంత్ర స్వరూపుడు, హరుడు. కమండలువు ధరించినవాడు. ధనుస్సుగలవాడు. బాణాన్ని చేతబట్టిన వాడు.

కపాలధారి. వజ్రాయుధధారి. శతఘ్నిగలవాడు. ఖడ్గధారి. పట్టిశధారి. శూలధారి. మహాత్ముడు. స్రువం చేతిలో గలవాడు. అందగాడు. తేజస్వి. తేజస్సుకలిగించే నిధి. తలపాగ దాల్చినవాడు. సువక్త్రుడు. ఓజస్వి. వినయశీలి. పాడవైనవాడు. త్రిమూర్తి స్వరూపుడు. మంచిగురువు. ఆనంద స్వరూపుడు. శృగాలరూపుడు. సిద్ధార్థుడు. సంన్యాసి. సర్వశుభకరుడు. అజుడు. బహురూపుడు. గంధధారి. కపర్దం గల వాడు. ఊర్ధ్వరేతసుడు. ఊర్ధ్వ లింగుడు. ఉత్తానశయుడు. శక్తినిలయుడు. త్రిజటలు ధరించినవాడు. నారబట్టలు ధరించినవాడు. రుద్రుడు. సేనాపతి. విభుడు. పగలు చరించువాడు. రాత్రి చరించు వాడు. తీవ్రకోపుడు చక్కని తేజస్సు గలవాడు. గజాసురుని చంపినవాడు. రాక్షసులను చంపినవాడు. కాలస్వరూపుడు. లోకసృష్టికర్త. గుణనిలయుడు. సింహశార్దూల రూపుడు. గజచర్మం బరధారి. కాలాన్ని జయింపగల యోగి. మహానాదస్వరూపుడు. సర్వ కామనిలయుడు. నాలుగు మార్గాలు గలవాడు. నిశాచరుడు. ప్రేతాలతో సంచరించేవాడు. మహేశ్వరుడు.

బహురూపాలు గలవాడు. ప్రపంచాన్ని ధరించినవాడు. రాహుస్వరూపుడు. అనంతుడు. గతి. నృత్య ప్రియుడు. నిత్యమూ నర్తించువాడు. నర్తకుడు అందరియందు ప్రేమగలవాడు. ఆకలి దప్పులు గలవాడు. మహాతపస్వి. బంధించువాడు. నిత్యుడు. పర్వతాన్ని అధిరోహించినవాడు. ఆకాశం వంటివాడు. వేల చేతులు గలవాడు. జయుడు. జయకారణుడు. అలసతలేనివాడు స్థిరుడు. భయరూపుడు. యజ్ఞధ్వంసకుడు. కామనాశకుడు. దక్షయాగ ధ్వంసం చేసిన వాడు. సౌమ్యుడు. మధ్యముడు తేజస్సుల సపహరించువాడు. బలాసుర సంహారకుడు. ఆనందరూపుడు. కోరదగినవాడు. వరింపదగినవాడు. గంభీర కంఠుడు. గంభీరుడు. వృషభవాహనుడు. అశ్వత్థ రూపుడు. దక్షిణామూర్తి స్వరూపుడు. వట పత్రశాయి. వివిధ రూపాలతో పుట్టువాడు. తీక్ష్ణదంతాలు గలవాడు. మహాకాయుడు. పెద్ద ముఖం గలవాడు. విష్వక్సేన స్వరూపుడు. హరి యజ్ఞరూపుడు వృషభ ధ్వజ వాహనుడు. తీక్షతాపుడు. సూర్య స్వరూపుడు సహాయుడు. కాలకర్మవేత్త. విష్ణురూపుడు – విష్ణువు ప్రసన్నం చేసికొనినవాడు. విష్ణురూపుడు. సముద్ర రూపుడు. బడబాగ్ని స్వరూపుడు. వాయుస్వరూపుడు. ప్రశాంతమైన ఆత్మ గలవాడు. అగ్ని స్వరూపుడు. ఉగ్రతేజుడు. మహాతేజుడు. యుద్ధమందు నేర్పరి. విజయసమయ మెరిగినవాడు. కాలస్వరూపుడు. జయస్వరూపుడు. సర్వమూ శరీరంగా కలవాడు. శిఖ గలవాడు. సంన్యాసి. జటలు గలవాడు. జ్వాలలు గలవాడు. శరీరం నుండి పుట్టువాడు. సహస్రార చక్రమందు తిరుగువాడు. బలశాలి. వేణుధారి. పనవధారి. తాలధారి. కళ్ళంగలవాడు. మాయావరణుడు. దైవజ్ఞుడు.

గుణాసక్తుడైన జీవుడు. లయారూపుడు. కూటస్థుడు. ప్రజాపతి. విశ్వబాహువు. విభాగరూపుడు. సమష్టి రూపుడు. ముఖరహితుడు. మోక్షమిచ్చువాడు. తేలికగా చేరదగినవాడు. శరీరం నుండి పుట్టినవాడు. మేఢ్రం నుండి పుట్టినవాడు. వనచరుడు. మహీచరుడు. అన్ని తావులకు వెళ్ళేవాడు. మంగళవాద్యాల నన్నింటినీ నివదింపజేయువాడు. పశుపతి. సర్పస్వరూపుడు. గుహలో (బుద్ధి) నివసించువాడు. గుహుడు. వనమాలా ధారి. తరంగ స్వరూప మెరిగినవాడు. జనన స్థితి మరణాలు కల్పించువాడు. త్రికాలధారి. కర్మలనుండి, బంధాలనుండి విముక్తి కలిగించువాడు. రాక్షస బంధనుడు. యుద్ధంలో శత్రువులను నశింపజేయువాడు.

జ్ఞానగమ్యుడు. దుర్వాసస్వరూపుడు. సర్వసజ్జన సేవితుడు. పూర్తిగా నశింపజేయువాడు. విభాగాల నెరిగినవాడు. సాటిలేనివాడు. యజ్ఞ భాగవేత్త. అందరిలో నివసించువాడు. అంతటా చరించువాడు. దుష్టవస్త్రధారి. వసువులు (రత్నాలు) గలవాడు. అమరుడు. హిమాలయ రూపుడు. సువర్ణ స్వరూపుడు. కర్మరహితుడు. సర్వధారి. భూమిని ధరించువానిలో శ్రేష్ఠుడు. రక్తాక్షుడు. గొప్ప ఇంద్రియాలు గలవాడు. విజయమిచ్చు రథం గలవాడు. విశారదుడు. సంగ్రహుడు. నిగ్రహుడు. కర్త. సర్పాలనే వస్త్రాలుగా నిలుపుకొన్నవాడు. ముఖ్యుడు. అముఖ్యుడు. పుష్టినందినవాడు. కాహాల (వాద్యవిశేషం) గలవాడు. సర్వకామ ప్రదుడు. సర్వకాల ప్రసన్నుడు. సుబలుడు. బలరూపధారి. మోక్షస్వరూపుడు. సర్వదుడు. సర్వతోముఖుడు. ఆకాశం వలె వివిధ రూపాల వెలువరించువాడు. పడగొట్టువాడు. అవశుడు. ఆకాశసంచారి. రౌద్రరూపుడు. వ్యాపనశీలుడు. బహుకిరణ వంతుడు. మంచి తేజస్సు గలవాడు. వసువేగుడు మహావేగుడు. మనోవేగుడు. నిశాచరుడు. సర్వనివాసి. శ్రీ విద్యతో కలిసి ఉండువాడు. ఉపదేశ కర్త. ఉపదేశం చేయనివాడు. ముని. జీవుని నుండి బయల్వెడలి ఆలోచించువాడు. చక్కగా సేవింపబడువాడు. సహస్రదాత పక్షిరూపుడు. శుక్లకృష్ణ పక్ష స్వరూపుడు. మిక్కిలిగా ప్రకాశించేవాడు. ప్రజాపతి. ఉన్మాదుడు. మదనుడు. కాముడు. నిత్య చేతనుడు. అర్థకరుడు. యశస్వి వామదేవుడు. వాముడు. ఆద్యుడు. దక్షిణుడు. దామనుడు. సిద్ధయోగి. మహర్షి. సిద్ధార్థుడు. సిద్ధసాధకుడు. హంసరూపుడు. పరమహంసరూపుడు. వ్యవహార రహితుడు. మృదువు అవ్యయుడు. మహాసేనుడు. విశాఖుడు. అరవైతత్వాలు గలవాడు. గోపతి.

వజ్రహస్తుడు. వ్యాపించువాడు. రాక్షససేనను స్తంభింపజేయువాడు. వృత్తావృత్తకరుడు. వసంతరూపుడు. తేనెవలె పింగళనయనాలు గలవాడు. వాచస్పత్య

స్వరూపుడు. వాజసన స్వరూపుడు. నిత్యమూ సర్వాశ్రమాల వారూ పూజించేవాడు. బ్రహ్మచారి. లోకచారి. సర్వచారి. విచార వేత్త. ఈశానుడు. ఈశ్వరుడు. కాలరూపుడు. నిశాచారి. పినాకవంతుడు. లక్ష్యాలలో వసించువాడు. నిమిత్త రూపుడు. నంది. సమృద్ధికరుడు. హరి. నందీశ్వరుడు. నందినందనుడు. నందివర్ధనుడు. ఐశ్వర్యహారి. చంపువాడు. మహాకాలరూపుడు. ప్రజలను వర్ధిల్లు జేయువాడు. విష్ణువునకు తండ్రి. చతుర్ముఖుడు. మహాలింగరూపుడు. రమణీయవేషధారి. ప్రమాణాలకు అధ్యక్షుడు. సురాధ్యక్షుడు. యోగాధ్యక్షుడు. యుగప్రవర్తకుడు. బీజాధ్యక్షుడు. బీజకర్త. అధ్యాత్మ ననుసరించువాడు. ఇతిహాసరూపుడు. కల్పసహితుడు. గౌతమరూపుడు నిశాకరుడు. దంభుడు. దంభరహితుడు. ధర్మవర్తనులకు ఆత్మీయుడు. వశ్యుడు. వశకరుడు. కలి. లోకకర్త. పశుపతి. మహాకర్త. ఔషధాలు అవసరం లేనివాడు. అక్షరుడు. పరమబ్రహ్మ. బలవంతుడు. సమర్థుడు. నీతి, అనీతి. శుద్ధాత్ముడు. శుద్ధుడు. మాన్యుడు. గతాగతుడు. బహుప్రసాదుడు. స్వప్నంలో సాక్షాత్కరించువాడు దర్పణరూపుడు. శత్రువిజేత. వేదకర్త. మంత్ర కర్త. విద్వాంసుడు. సమరంలో శత్రుమర్దనం చేసేవాడు. ప్రళయకాల మేఘనివాసి. మహాభయంకరుడు. వశి. లయకర్త. అగ్నిజ్వాలుడు. మహాజ్వాలుడు. అతిధూమ్ర వర్ణుడు. హోమంతో ప్రీతి చెందువాడు. హవి స్స్వరూపుడు. కర్మ ఫలాలను వర్షించువాడు. శంకరుడు. నిత్యుడు. వర్చస్వి, ధూమకేతనుడు నీలుడు. లింగంలో నిత్యమూ ఉండేవాడు. శోభనుడు. ఆటంకాలు లేనివాడు. స్వస్తి కలిగించువాడు. స్వస్తి భావనుడు. యజ్ఞభాగం కలవాడు. భాగాలను పెట్టువాడు. నేర్పరి. సంగరహితుడు. మహాంగం కలవాడు. విశ్వగర్భ పరాయణుడు. కృష్ణవర్ణుడు సువర్ణుడు సర్వశరీరధారులకు ఇంద్రియ రూపుడు. మహాపాదుడు. మహాహస్తుడు. మహాకాయుడు. మహాయశస్వి. గొప్ప శిరస్సుగలవాడు. పెద్ద ప్రమాణం గలవాడు. మహా నేత్రుడు. అవిద్యానాశకుడు. మృత్యువునకు మృత్యువు. మహాకర్ణుడు. పెద్ద పెదవులు కలవాడు. పెద్ద దవడలు కలవాడు. పెద్ద ముక్కు గలవాడు. పెద్ద శంఖంవంటి కంఠం గలవాడు. పెద్ద కంఠం గలవాడు. శరీరాన్ని కృశింపజేయువాడు. పెద్ద వక్షస్థలం గలవాడు. పెద్ద రొమ్ములు గలవాడు. అంతరాత్మ. మృగాలయుడు.

బ్రహ్మాండాలు తనలో వ్రేలాడువాడు. వ్రేలాడే పెదవులు గలవాడు. మహామాయుడు. క్షీరసాగరుడు మహాదంతుడు. మహా దంష్ట్రుడు. మహాజిహ్వగలవాడు. మహాముఖం గలవాడు. పెద్ద గోళ్ళు గలవాడు. గట్టి వెంట్రుకలు గలవాడు. (వరాహరూపుడు). మహాకోశరూపుడు. మహాజటలు గలవాడు ప్రసన్నుడు. ప్రసాదరూపుడు. ప్రజ్ఞానరూపుడు.

యుద్ధంలో మేరు పర్వతాన్ని సాధనంగా గ్రహించినవాడు. ప్రజలపై వాత్సల్యం గలవాడు. తనపై వాత్సల్యం లేనివాడు. జయింపబడనివాడు. మహాముని. సంసార వృక్షరూపుడు. వృక్ష కేతువు. అగ్ని రూపుడు. వాయువాహనుడు. పెద్ద పర్వతంవంటివాడు. మేరునివాసి. దేవాధిపతి. అధర్వశీర్షుడు. సామముఖుడు. ఋగ్వేదనయనుడు. యజుర్వేదం పాదాలుగా భుజాలుగా ఉన్నవాడు. గుహ్యుడు. ప్రకాశుడు. జంగమరూపుడు. ఆది భిక్షువు. దయాశీలుడు. చేర దగినవాడు. చూడదగినవాడు. ఉపకారరూపుడు. ప్రీతి పాత్రుడు. అన్నియు తెలిసినవాడు. కనక స్వరూపుడు. కనక కాంతి గలవాడు. భువన నాభి. నందికరుడు. భావన గలవాడు. బ్రహ్మాండ శిల్పి. స్థావర రూపుడు. ద్వాదశావస్థా (మోక్ష) స్వరూపుడు. భయపెట్టువాడు. ఆద్యుడు. యజ్ఞుడు. యజ్ఞసాద్యుడు. మహాయోగ స్వరూపుడు. కలిరూపుడు. కాలస్వరూపుడు మకర (శింశుమారచక్ర) రూపుడు. మృత్యువుచే పూజింప బడువాడు. గణసహితుడు. గణనిర్మాత. భూతవాహనుడైన బ్రహ్మ సారధి అయినవాడు. భస్మశాయి. భస్మరక్షకుడు. భస్మమయదేహుడు. కల్పతరు రూపుడు. గణరూపుడు. లోకపాలుడు. లోకాతీతుడు. మహాత్ముడు. సర్వ పూజితుడు. శుద్ధుడు. మనోవాక్కాయాల మూడింట స్వచ్ఛమయిన వాడు. సంపన్నుడు. అసంగుడు. భూతసేవితుడు. ఆశ్రమస్థుడు క్రియావస్థుడు. విశ్వకర్మ. కౌశలరూపుడు. వరించువాడు. విశాలబాహుడు. ఎర్రని పెదవి కలవాడు. జల సముదాయం (సాగర రూపుడు). నిశ్చల పర్వతరూపుడు. కపిల వర్ణుడు. కపిశ (ఎరుపు + తెలుపు) వర్ణుడు, తెల్లనివాడు. ఆయుస్స్వరూపుడు. ప్రాచీనుడు. అర్వాచీనుడు. గంధర్వరూపుడు. అదితి స్వరూపుడు. గరుడరూపుడు. చక్కగా తెలియదగినవాడు. చక్కగా మాటాడువాడు.

గొడ్డలి ఆయుధమైనవాడు. జయశీలుడు. అనుకరించువాడు. మంచిబంధువులు గలవాడు. రుద్రవీణ గలవాడు. మహాక్రోధుడు. ఊర్ధ్వ రేతసుడు. జలశాయి. ఉగ్రుడు. వంశకరుడు. యాచింపబడువాడు. మురళీనాదలోలుడు. అనిందితుడు. సర్వాంగ సుందరుడు. స్నేహితుడు. అనిలుడు. అనలుడు. బంధన రూపుడు. బంధకర్త. బంధవిమోచనుడు. రాక్షసులతో కలిసి వసించేవాడు. యోగులతో కలిసి ఉండేవాడు. మహాదంష్ట్రుడు. మహాయుధుడు. అనేక రీతుల నిందింపబడేవాడు. శర్వుడు. శంకరుడు. సంశయచ్ఛేదకుడు. ధనహీనుడు. అమరేశుడు. మహాదేవుడు. విశ్వదేవుడు దానవసంహారకుడు. శేషనాగస్వరూపుడు. వాయుసమానుడు. చేకితానుడు (బాగా తెలిసికొనువాడు). హవిస్స్వరూపుడు ఏకాదశ రుద్రులలో ఒకడు. కాపాలి. సర్వజీవరూపుడు. జయింపబడనివాడు శివుడు. ధన్వంతరిస్వరూపుడు. ధూమకేతువు. స్కందుడు (అమృత రూపుడై తిరుగువాడు).

కుబేరరూపుడు. ధాత. ఇంద్రుడు. విష్ణువు. స్నేహితుడు. త్వష్ట. శాశ్వతుడు. విశ్వధరుడు. ప్రభావశాలి. సర్వవ్యాపి. వాయువు. సూర్యుడు. సవిత. రవి. దమించే కిరణాలు గలవాడు. విధాత. మాంధాత (జీవుని పోషించువాడు). ప్రాణి పోషకుడు. విభువు. వివిధవర్ణాలను భావింపజేయువాడు. సర్వ కామగుణాలను కలిగించువాడు. పద్మనాభుడు. మహాగర్భుడు. చంద్రవదనుడు. అనిలుడు. అనలుడు. బలవంతుడు. ఉపశమించువాడు. ప్రాచీనుడు. పుణ్యంచే తెలియబడువాడు. దయామయుడు. అవిముక్త (కాశి, కురుక్షేత్రం) కర్త. కురుక్షేత్రనివాసి. కురు క్షేత్రరూపుడు. గుణ వర్ధకుడు. అందరూ నిదురించు స్థానం. దర్భలను (హవిస్యులను) తినువాడు. సర్వప్రాణిపతి. దేవదేవుడు. సుఖాసక్తుడు. కార్యరూపుడు. కారణ రూపుడు. రత్నాలను (శ్రేష్ఠ వస్తువులను) పొందువాడు. కైలాస గిరివాసి. హిమగిరిపై శయనించువాడు. ప్రవాహ రూపుడు. కూల నిర్మాత. అనేక విద్యల నెరిగినవాడు. బహుప్రదాత వణి క్స్వరూపుడు. వంద్రంగి (చెట్లను నరికినట్లు జీవులను భేదించువాడు). వృక్ష స్వరూపుడు. పుట్టుక అనురోగాన్ని పోగొట్టువాడు. ఆనందింపజేయువాడు. ఆచ్ఛాదనరూపుడు. సారగ్రీవుడు మహా జత్రువు. అలోలుడు. మహౌషధుడు. జీవుల కోరికలు తీర్చువాడు. వేదవ్యాఖ్యానం నుండి పుట్టిన సిద్ధాంతం కలవాడు. సింహనాదుడు. సింహదంష్ట్రుడు. సింహ గమనుడు. సింహవాహనుడు. శక్తి స్వరూపుడు. జగత్కాలుడు (యముడు) భోజన పాత్రగా గలవాడు. లోకహిత కరుడు. తరుసమానుడు. సారంగ స్వరూపుడు. మయూర స్వరూపుడు. సభారక్షకుడు.

భూతనివాసుడు. భూతపతి. అహోరాత్ర స్వరూపుడు. నిందకు గురికానివాడు. సర్వప్రాణి వాహకుడు. సర్వప్రాణి నిలయుడు. వ్యాపనశీలుడు. సర్వం తానే అయినవాడు. సత్యసంకల్పుడు నిగ్రహశీలి. అశ్వరూపుడు. అన్నదాత. ప్రాణధారణుడు. ధృతిమంతుడు. మతిమంతుడు. సమర్థుడు. సత్కరింపబడినవాడు. ధర్మాధిపతి. ఇంద్రియ పాలకుడు. గో(కిరణ) పతి. దిగంబరుడు. హరి. హిరణ్య బాహువు. యోగులకు శరీర రక్షకుడు. ఉత్తమ సాధకుడు. మహాహర్షుడు జితకాముడు. జితేంద్రియుడు. గాంధార రూపుడు. మంచి నివాసం గలవాడు. తపస్సుపై ఆసక్తి గలవాడు. ప్రీతి స్వరూపుడు. విరాడ్రూపుడు. వేదాదులలో కీర్తింపబడినవాడు. మహానృత్యం చేయువాడు. అప్సరో గణ సేవితుడు. మహా కేతువు. మేరుపర్వతరూపుడు. అనేక సానువులలో సంచరించువాడు. చంచలుడు. తెలియజేయ వలసినవాడు. ఉపదేశ రూపుడు. సర్వవిషయ సుఖాలను కలిగించువాడు. యుక్తిద్వారానికి తోరణం. తరింపజేయువాడు. వాయురూపుడు. దుర్గ స్వరూపుడు. గరుత్మత్ స్వరూపుడు. సంయోగవర్ధనుడు. వృద్ధుడు. అతి వృద్ధుడు. గుణాధికుడు. నిత్యాత్మసహాయుడు.

దేవాసురపతి. సర్వపతి. సన్నద్ధుడు. యుక్తబాహువు. ఇంద్రునిచే ఆరాధింపదగినవాడు. అన్నింటినీ సహించే శక్తినిచ్చువాడు. సహనశీలుడు. ధ్రువుడు. శుద్ధుడు. హరించువాడు (శూలి). స్వర్గం నుండి మరలివచ్చువారికి శరీర దాత. వసువులలో శ్రేష్ఠుడు. మహామార్గ స్వరూపుడు. బ్రహ్మ శిరస్సును ఛేదించినవాడు. సర్వలక్షణ లక్షితుడు. రధాక్ష స్వరూపుడు. సర్వయోగి. మహాబలుడు. వేదరూపుడు. ఆగమాది రూపుడు. తీర్థదేవుడు. మహారథుడు. నిర్జీవుడు. జీవింపజేయువాడు. మంత్రరూపుడు. శాంత దృష్టి గలవాడు. బహుకర్కశుడు. శ్రేష్ఠరత్నాలు గలవాడు. రత్నాంగుడు. మహాసముద్రాలను తొట్లుగా చేయగలవాడు. జగత్తుకు మూలం. అమృతుడు. వ్యక్తా వ్యక్తుడు. తపోనిధి. పరమ పదనేత. పరమ పదాన్ని అధిరోహించినవాడు. శీలధారి. మహాయశస్వి. సేనకు ఆభరణం. దివ్యాభరణధారి. యోగ రూపుడు. యుగకర్త హరి.

యుగరూపుడు. మహారూపుడు. గజాసుర సంహారకుడు. మృత్యుంజయుడు. న్యాయదాత. శరణ్యుడు. పండితుడు. కొండవంటివాడు. బహుపుష్పమాలాధారి. మహాపుష్పమాలాధరుడు. శశినయనుడు. లవణ సముద్ర స్వరూపుడు. త్రియుగరూపుడు. సార్థక జన్ముడు. త్రిలోచనుడు. నిరాకారుడు. కుండలధారి. జటాధారి. అనుస్వారస్వరూపుడు. విసర్గ స్వరూపుడు. సుముఖుడు. శరరూపుడు. సర్వాయుధుడు. సహనశీలి. నిత్యముక్తుడు. సుఖంగా ఉద్భవించేవాడు. ఉత్తమ గంధధారి. మహాధనువు. వాసనామయుడు. సర్వకర్మోత్థాపకుడు. ప్రళయకాలవాయువు. కళాసహితుడు. సర్వలోచనుడు. అరచేయి తాళంగా గలవాడు. చేతులే భోజన పాత్రలైన వాడు. ఎత్తయిన శరీరంగలవాడు. మహాత్ముడు. గొడుగువంటివాడు ఉత్తమచ్ఛత్ర స్వరూపుడు. ప్రసిద్ధ లోకస్వరూపుడు. త్రివిక్రమ రూపుడు. యతీశ్వరరూపుడు. వికట రూపుడు. లయకారి. దండధారి. కుండధారి. కర్మలకందనివాడు. సింహస్వరూపుడు. దిక్స్వరూపుడు. వజ్రధారి. అనేక జ్వాలు గలవాడు. వేలపాదాలు వేలతలలు గలవాడు. దేవేంద్రుడు. సర్వ దేవమయుడు. గురువు. సహస్రబాహువు. సర్వాంగుడు. శరణ్యుడు. సర్వలోక కర్త. పవిత్రుడు. బీజశక్తి. కీలక మంత్ర స్వరూపుడు. కనిష్ఠుడు. హరిహర మూర్తి. బ్రహ్మదండనిర్మాత. శతఘ్నిపాశశక్తులు ధరించినవాడు. పద్మగర్భుడు. మహాగర్భుడు. బ్రహ్మగర్భుడు. జలజోద్భవుడు. సూర్య స్వరూపుడు. వేదావిష్కర్త. వేదాధ్యాయి. వేదజ్ఞాని. బ్రహ్మనిష్ఠుడు. బ్రహ్మనిష్ఠులకు గతి. అనంతరూపుడు. అనేక శరీరధారి. బ్రహ్మదృష్టిలో తీక్ష్ణతేజుడు. ఉపాధులనతిక్రమించిన ఆత్మ స్వరూపుడు. పశుపతి. వాయువేగుడు. మనోవేగుడు. చందనం కలవాడు. పద్మనాళం చివర గలవాడు. కామధేనువును

ఊర్ధ్వస్థానం నుండి దింపినవాడు. నరుడు. కర్ణికార పుష్పమాల దాల్చినవాడు. ఇంద్రనీలమణి కిరీటధారి. పినాక ధారి. బ్రహ్మవిద్యాపతి. ఉమాకాంతుడు. గంగాధరుడు. ఉమాధవుడు. యజ్ఞవరాహమూర్తి. వరదుడు. వరేణ్యుడు. గొప్పగా గర్జించువాడు (హయగ్రీవస్వరూపుడు). మహాప్రసాదుడు. దమనుడు. శత్రుహంత శ్వేత పింగల వర్ణుడు. బంగారు వన్నెవాడు. పరమాత్మ. నియతాత్మ. ప్రధాన (జగత్కారణ) ధారి. అన్ని ప్రక్కల ముఖాలుగలవాడు. త్రినేత్రుడు ధర్మాను గుణవరదాత.

చరాచరప్రాణుడు. సూక్ష్మరూపుడు. నిష్కామునకు మోక్షమిచ్చువాడు. సాధ్యులకు గురువు. వసుస్వరూపుడు. సూర్యచంద్ర స్వరూపుడు. వ్యాసుడు (విస్తార రూపుడు). పురాణ రూపుడు. వైశ్వానర రూపుడు. సంవత్సర స్వరూపుడు. మాసరూపుడు. పక్షరూపుడు. సంఖ్యాసమాప్తి స్వరూపుడు. కలలు, కష్ఠలు లవాలు, మాత్రలు ముహూర్తాలు. పగలు, రేయి - ఏతత్స్వరూపుడు. విశ్వక్షేత్రుడు. అవ్యక్తుడు. మహత్తత్త్వం. అందరికన్న ముందు వెలువడినవాడు సత్తు. అసత్తు. వ్యక్తం. అవ్యక్తం. తండ్రి. తల్లి. తాత. స్వర్గద్వారం. ప్రజాద్వారం. మోక్షద్వారం. స్వర్గసాధనమైన ధర్మస్వరూపుడు. మోక్షరూపుడు. ఆనందపరచువాడు. సత్యలోకరూపుడు. ఉత్తమగతి. దేవాసుర నిర్మాత. దేవాసుర పరాయణుడు. దేవాసుర గురువు. దేవుడు. దేవాసుర నమస్కృతుడు. దేవాసుర శ్రేష్ఠుడు. దేవాసుర గణాశ్రయుడు. దేవాసురగణాధ్యక్షుడు. దేవాసురగణ నాయకుడు. దేవాతిదేవుడు. దేవర్షి. దేవాసురవరదాత. దేవసురేశ్వరుడు, జగద్గర్భంలో శయనించువాడు. దేవాసురమహేశ్వరుడు. సర్వదేవమయుడు. అచింత్యుడు. ప్రత్యగ్రూపుడు. తనకుతానే కారణమైనవాడు. ఫలరూపుడు. త్రివిక్రముడు. వైద్యుడు. నిర్మలుడు. రజోగుణహీనుడు. అమరుడు. స్తుతింపదగినవాడు. వాయులింగ స్వరూపుడు. వ్యాఘ్రలింగ స్వరూపుడు. దేవశ్రేష్ఠుడు. నరశ్రేష్ఠుడు. సర్వజ్ఞుడు. అగ్రస్థాయి. సూక్ష్మరూపుడు. సర్వదేవస్వరూపుడు. తపోమయుడు. సర్వసన్నద్ధుడు. శోభనుడు. వజ్రి. ప్రాసాదులకు ఉత్పత్తిస్థానం అవ్యయుడు. కుమార స్వరూపుడు. ఆనందపరాకాష్ఠ. ఆత్మభావుడు. పవి (వజ్రాయుధం) నుండి రక్షించువాడు. సర్వపావనుడు. శృంగి. శృంగప్రియుడు. బభ్రువు. రాజరాజు (కుబేరుడు). దోష రహితుడు. అభిరాముడు. సురగణస్వరూపుడు. ప్రశాంతుడు. సర్వ సాధనుడు. లలాటనేత్రుడు. విశ్వదేవుడు. మృగరూపుడు. బ్రహ్మ వర్చస్వి. స్థావరపతి. నియమాలతో ఇంద్రియాలను క్షీణింప జేయువాడు సిద్ధార్థుడు. సిద్ధభూతార్థుడు. అచింత్యుడు. సత్య ప్రతిజ్ఞుడు. నిర్మల హృదయుడు. వ్రతాలకు అధిపతి. చివరివాడు (విశ్వ, తేజస, ప్రాజ్ఞ, శివులు నలుగురు బ్రహ్మలు). బ్రహ్మ భక్తులకు

పరమగతి. విముక్తుడు ముక్తతేజుడు. శ్రీమంతుడు. శ్రీవర్ధనుడు. విశ్వరూపుడు.

ఈ విధంగా ప్రాధాన్యాన్ని అనుసరించి భగవానుని నేను భక్తితో స్తుతించాను. శివతత్త్వాన్ని యథాతథంగా ఋషులే గాదు బ్రహ్మాది దేవతలు కూడా తెలియలేరు. ఆయన స్తుతింపదగినవాడు, పూజింపదగినవాడు, నమస్కరింపదగినవాడు కూడా. ఆ జగత్పతిని ఎవరు సంతోషపెట్టగలరు ? ఈ రీతిగా భక్తితో ఆయన ఎదుట నిలిచి, ఆయన అనుమతిని తీసికొని, యజ్ఞపతి, సర్వవ్యాపి అయిన ఆ ధీమంతుని స్తుతించాను. నిత్య సమాహితుడై, పవిత్రుడైన, భక్తుడు పుష్టి వర్ధకాలైన ఈ నామాలతో శివదేవుని స్తుతించి, తాను పరమాత్మను పొందగలడు. ఈ స్తోత్రమే పరబ్రహ్మ స్వరూపం. దీనితో పరబ్రహ్మను పొందుతారు. ఋషులు దేవతలు కూడా ఈ స్తోత్రంతోనే ఆ పరమాత్మను స్తుతిస్తారు. నియతమనస్కులచే నుతింప బడుతూ, మహాదేవుడు సంతుష్టినందుతాడు. సర్వవ్యాప్తకుడైన ఆ భగవానుడు భక్తులపై దయచూపి మోక్షప్రదాత అవుతాడు. అదే విధంగా మనుష్యులలో కూడా ముఖ్యంగా ఆస్తికులు, శ్రద్ధాపరులు అయినవారు ఎన్నో జన్మల నుండి అనన్య భక్తితో నూతనుడు, పరమాత్మ అయిన ఈశానుని కర్మణా మనసా వాచా ప్రేమ భావంతో స్తుతించి, అమిత తేజస్సులు కాగలుగుతున్నారు. నిద్రించినా, మెలకువలో ఉన్నా, నడుస్తున్నా, కూర్చున్నా, కనులు తెరచినా, మూసినా ఆ శంకరునే మాటిమాటికీ తలచుకొంటూ, వింటూ, వినిపిస్తూ, వ్యాఖ్యానిస్తూ, స్తుతిస్తున్న వారు అందరి మన్ననలను అందుకొని ఆనందిస్తారు, వినోదిస్తారు. కోటి సహస్ర జన్మలవరకు వివిధ ప్రపంచ జాతులలో పరిభ్రమిస్తూ, పాప విముక్తుడైన జీవునకు శివునిపై భక్తి పుడుతుంది. భాగ్యవశాన సర్వసంపన్నుడైన వానికి జగత్కారకుడైన శంకరునిపై పరిపూర్ణభావంతో సర్వవిధాలా అనన్యభక్తి కుదురుతుంది. రుద్రునిపై నిర్విఘ్నంగా, నిశ్చలంగా అనన్య భక్తి కుదరటం దేవతలకు కూడా దుర్లభం. మనుష్యులలో కూడా దొరికేది కాదు. ఆయన అనుగ్రహంతోనే మనుష్యులలో భక్తి జనిస్తుంది. దానితో మనస్సులను ఆయన మీదనే లగ్నంచేసి, పరమ సిద్ధిని (మోక్షాన్ని) పొందగలరు. సర్వకాల సర్వావస్థలయందు శివుని శరణుకోరిన వానిని భక్తవత్సలుడైన ఆ మహాదేవుడు సంసారం నుండి సముద్ధరిస్తాడు. సంసారం నుండి సముద్ధరింపగల మహాదేవుడు తప్ప ఇతర దేవతలు మనుష్యుల తపోబలాన్ని నశింపజేసేవారే ! వారికి మరొక శక్తి లేదు. కృష్ణా ! ఈ రీతిగా ఇంద్రసమానుడై, శుభసంకల్పం గల తండిచే సదసత్పతి అయిన ఆ శంకరభగవానుడు స్తుతింపబడ్డాడు.

ఈ భగవత్ స్తవాన్ని బ్రహ్మ స్వయంగా రచించాడు. శంకరుని సన్నిధిలో

గానంచేశాడు. బ్రహ్మవేత్త దీనిని గ్రహించాలి. ఈ స్తోత్రం పుణ్యప్రదం. పవిత్రం. సర్వదా పాపవినాశకం. యోగదాయకం. మోక్షదాయకం. స్వర్గదాయకం. ఆనంద దాయకం కూడా. ఈ రీతిగా అనన్య భక్తితో ఈశంకర స్తోత్రాన్ని పఠించిన వాడు సాంఖ్యుడు యోగులు పొందే స్థితిని (మోక్షాన్ని) పొందగలడు. ప్రయత్న పూర్వకంగా రుద్రసన్నిధిలో ఈ స్తోత్రాన్ని నిరంతరంగా సంవత్సరకాలంపాటు పఠించిన వాడు కోరిన ఫలితాన్ని పొందగలడు. ఇది పరమరహస్యం. బ్రహ్మ హృదయ గతం. బ్రహ్మ ఇంద్రునకు చెప్పాడు. ఇంద్రుడు మృత్యువుకు చెప్పాడు. మృత్యువు ఏకాదశరుద్రులకు చెప్పాడు. రుద్రులనుండి తండికి లభించింది. మహాతపస్సుతో తండి బ్రహ్మసదనంలో దీనిని పొందాడు. మాధవా ! తండి శుక్రునకు, ఆ శుక్రుడు గౌతమునకు, గౌతముడు వైవస్వత మనువుకు చెప్పారు. వైవస్వతమనువు ధీమంతుడై, సమాధిస్థితిలో నున్న నారాయణుడనే సాధ్యునకు చెప్పాడు. అచ్యుతుడైన ఆ సాధ్యుడు - నారాయణుడు యమునికి చెప్పాడు. సూర్యసుతుడైన యముడు నాచికేతునకు, ఆ నాచికేతుడు మార్కండేయునకు చెప్పారు. జనార్దనా ! మార్కండేయుని నుండి నియమ బద్ధంగా నేను పొందాను. పరమ రహస్యమైన స్తోత్రాన్ని నేను నీకు ఉపదేశిస్తాను. ఈ స్తోత్రం స్వర్గాన్ని, ఆరోగ్యాన్ని, ఆయుస్సును, ధనాన్ని ఇవ్వగలది. వేద సమ్మతమైనది. దానవులు కానీ, యక్షులు కానీ, రాక్షసులు కానీ, పిశాచాలు కానీ, యాతు ధానులు కానీ, గుహ్యకులు కానీ, నాగులు కానీ దీనిని ఆటంకపరచలేరు." (కృష్ణుడు చెప్తున్నాడు) పార్థా ! పవిత్రుడై, బ్రహ్మచారియై, జితేంద్రియుడై సంవత్సరంపాటు నిరాటంకంగా దీనిని పఠించినవాడు అశ్వమేధ యాగఫలితాన్ని పొందగలడు.

18. శివసహస్రనామస్తోత్ర మహిమ

వైశంపాయనుడు చెప్తున్నాడు. "ఆ తరువాత మహాయోగి అయిన కృష్ణ ద్వైపాయన ముని యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. 'కుమారా ! నీకు మేలు కలుగుతుంది. ఈ స్తోత్రాన్ని చదువు. మహేశ్వరుడు నీకు ప్రసన్నుడవుతాడు. మహారాజా ! గతంలో నేను పుత్రప్రాప్తికై మేరు పర్వతంపై తీవ్రతపస్సు చేస్తూ ఈ స్తోత్రాన్ని చాలాసార్లు పఠించాను. దానితో నేను కోరిన కోరికలను పొందాను. అదే రీతిగా నీవు కూడా శివుని ద్వారా సర్వకామనలను పొందగలవు ఆ తరువాత సాంఖ్యమతప్రవర్తకుడు, దేవ సమ్మతుడైన కపిలమహర్షి ఇలా అన్నాడు. 'నేను అనేక జన్మల వరకు భక్తితో భవుని ఆరాధించాను. దానితో ప్రసన్నుడైన భగవానుడే భవభయాన్ని పోగొట్టే జ్ఞానాన్ని నాకిచ్చాడు.' ఆ తరువాత

ఆలంబాయనుడని ప్రసిద్ధిచెందినవాడు, దయాళువు, ఇంద్రుని ప్రియమిత్రుడు అయిన చారుశీర్షుడు ఇలా అన్నాడు. 'పాండునందనా ! గతంలో నేను గోకర్ణానికి పోయి, వందసంవత్సరాలు తపస్సు చేసి, శివుని ద్వారా నూర్గురు కొడుకులను పొందాను. వారు అయోనిజులు. జితేంద్రియులు. ధర్మజ్ఞులు. మహాతేజస్వులు, ముసలితనం లేనివారు, దుఃఖరహితులు. లక్షసంవత్సరాల ఆయుర్దాయం గలవారు.'

పూజ్యుడైన వాల్మీకి కూడా యుధిష్ఠిరునితో ఈ మాట చెప్పాడు 'భారతా ! ఒకప్పుడు అగ్నిహోత్రులయిన మునులతో నాకు వివాదం కలిగింది. వారు కోపంతో బ్రహ్మహత్యాపాపాన్ని పొందుదువుగాక అని నన్ను శపించారు.' క్షణకాలంలోనే ఆ అధర్మం నాలో ప్రవేశించింది నేను అనఘుడు, అమోఘుడు అయిన ఈశ్వరుని శరణు కోరాను. ఆపై పాపవిముక్తిని పొందాను. అప్పుడు దుఃఖనాశకుడైన త్రిపురారి 'నీలో ఘనకీర్తి కలుగుతుంది'.' అని నాతో అన్నాడు. ధర్మాత్ములలో మేటి అయిన పరశురాముడు ఋషులమధ్య నిలిచి సూర్యునివలె జ్వలిస్తూ ధర్మజునితో ఇలా అన్నాడు. 'పాండవాగ్రజా ! పితృతుల్యులయిన సోదరులను చంపి, నేను పితృవధ, బ్రాహ్మణవధ చేశాను. దానితో దుఃఖానికి లోనయ్యాను రాజా ! పవిత్రుడనై మహాదేవుని శరణుచొచ్చాను. సహస్ర నామాలతో ఆయనను స్తుతించాను కూడా. దానితో భవుడు తుష్టిచెందాడు. ఆపై ఆ దేవుడు పరశువును దివ్యాస్త్రాలను నాకిచ్చాడు. నీకు పాపమంటదు. నీవు అజేయుడవు కాగలవు. నీకు మరణముండదు. ముసలితనం నీకు కలుగదు. అని అనుగ్రహించాడు. కళ్యాణ శరీరుడు, జటాధారి అయిన శంకర భగవానుడు నాతో చెప్పినవన్నీ ఆధీమంతుని అనుగ్రహం వలన నేను పొందగలిగాను.'

అప్పుడు విశ్వామిత్రుడిలా అన్నాడు "అప్పుడు నేను క్షత్రియుడను, బ్రాహ్మణుడను కావాలని భవుని ఆరాధించాను. ఆయన అనుగ్రహంతో పరమదుర్లభమైన బ్రాహ్మణత్వం నాకు లభించింది.' ఆపై అసితదేవలుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. 'కాంతేయా ! రాజా ! ఇంద్రుని శాపం వలన ఒకప్పుడు నా ధర్మం నశించింది. అప్పుడు ఆ శివుడే నాకు ధర్మాన్ని ఘనకీర్తిని ఆయుర్దాయాన్ని అనుగ్రహించాడు.' ఆపై ఇంద్రుని ప్రియమిత్రుడు, బృహస్పతితో సమానుడైన తేజస్వి, పూజ్యుడు అయిన గృత్సమదముని యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. 'పూజ్యుడైన చాక్షుషమనుకుమారుడు వరిష్ఠుడన్న పేర ఉండేవాడు. ఒకప్పుడు అచింత్యశక్తిమంతుడైన ఇంద్రుడు వేయి సంవత్సరాలపాటు యజ్ఞం చేశాడు. ఆయాగం జరుగు తున్నప్పుడు నేను సామగానం చేస్తుండగా వరిష్ఠుడు 'ద్విజశ్రేష్ఠ ! రథంతరసామను

నీవు సరిగా పఠించలేదు. ద్విజోత్తమా ! మరల మనస్సుపెట్టి సమీక్షించుకో ! పాపహేతువైన ఆగ్రహం వద్దు. సుదుర్మతీ ! యజ్ఞం నిష్పల మయ్యే పాపాన్ని నీవు చేశావు.' అలా పలికి మహాక్రోధంతో ఆ వరిష్ఠుడు శివునివైపు చూసి 'మరలా ఇలా అన్నాడు' నీవు పదుకొండువేల ఎనిమిది వందల సంవత్సరాలపాటు నీరు గాలి లేకుండా రురువులు, సింహాలు తప్ప మరే ఇతర వన్య మృగాలు తిరగని తావున, యాగాని కుపయోగపడిన చెట్లు పెరిగిన ప్రదేశంలో, బుద్ధిహీనుడవై దుఃఖశీలుడవై, నిత్యమూ భయపడుతూ, మహా దుఃఖ సమన్వితుడవై, వనేచరుడవై, తీవ్ర దుఃఖానికి లోనవుతూ, క్రూరజంతువుగా బ్రతుకుతావు. ఆయన వాక్యం పూర్తికాగానే ధర్మజా ! నేను మృగాన్ని అయ్యాను. అప్పుడునేను శరణుకోరగా యోగి అయిన మహేశ్వరుడు ఇలా అనుగ్రహించాడు. "నీవు అజరుడవు, అమరుడవు. దుఃఖ రహితుడవు కాగలవు. నీకు సౌఖ్యమూ, నాతో సమానత్వమూ లభిస్తాయి. మీ ఇరువురి క్రతువు వర్ధిల్లుగాక" ఈ రీతిగా సర్వవ్యాపి అయిన శంకర భగవానుడు అందరినీ అనుగ్రహిస్తాడు. అందరికీ పరమధాత, సర్వదా సుఖదుఃఖవిధాత కూడా ఈయనయే. అచింత్యుడైన ఈ శంకర భగవానుడు కర్మణా, మనసా, వాచా ఆరాధనీయుడు. ఆరాధనా ఫలితంగా నేను విద్యలో నాతో నాటిలేని పండితుడనయ్యాను.

అప్పుడు ధీమంతులలో శ్రేష్ఠుడైన వాసుదేవుడిలా అన్నాడు "సువర్ణనేత్రుడైన మహాదేవుని నేను తపస్సుతో ఆనందింపజేశాను. యుధిష్ఠిరా ! దానితో ప్రసన్నుడైన శంకరభగవానుడు నాతో ఇలా అన్నాడు. 'కృష్ణా ! నా అనుగ్రహం వలన ప్రియవస్తువులకన్న ప్రియతరుడ వవుతావు. యుద్ధంలో ఓటమినందవు. నీ తేజస్సు అగ్ని సమాన మవుతుంది. ఇలా ఇంకా వేల వరాలను మహాదేవు డిచ్చాడు. గతంలో అవతారాంతరాల్లో మణిమంథ పర్వతంపై నేను లక్షల కోట్ల సంవత్సరాలు ఆయనను ఆరాధించాను. దానితో ఆ శంకర భగవానుడు ప్రసన్నుడై ఈ మాట అన్నాడు. "నీకు మేలు కలుగుగాక ! నీ మనస్సులో నున్న వరాన్ని కోరుకో" ఆపై శిరసా నమస్కరించి, ఈ మాట పలికాను. "నా పరమ భక్తితో ప్రభువైన మహాదేవుడు ప్రసన్నుడైతే ఈశానా ! నాకు నీపై నిత్యమూ నిరంతరంగా శాశ్వత భక్తి నిలవాలి" అని కోరాను. అలాగే జరుగుతుందని పలికి శంకరభగవానుడు అక్కడే అదృశ్యమయ్యాడు.' జైగీషవ్యుడు చెప్తున్నాడు. 'యుధిష్ఠిరా ! పూర్వకాలంలో వారాణసిలో మరొక ప్రబల ప్రయత్నంతో శంకర భగవానుడు నాకు అష్టసిద్ధులను అనుగ్రహించాడు.' గర్గుడు చెప్తున్నాడు. "పాండవా ! సరస్వతీతీరంలో నా మనో యజ్ఞంతో తుష్టుడై అరువైనాలుగు కళల అద్భుత జ్ఞానాన్ని నాకు ఇచ్చాడు. నావలె బ్రాహ్మవాదులైన కొడుకులను వేయిమందిని

ఇచ్చాడు. పుత్రులతోపాటు నాకు పదిలక్షల సంవత్సరాల ఆయుర్దాయ మిచ్చాడు.' పరాశరుడిలా చెప్పాడు. 'రాజా ! పూర్వకాలంలో నేను ఇక్కడే శంకరుని ప్రసన్నుని చేసికొని, మనసా చింతించ నారంభించాను. మహేశ్వరుని అనుగ్రహంతో మహాతపస్వి, మహాతేజస్వి, మహాయోగి, మహాయశస్వి, దయామయుడు, శ్రీసంపన్నుడు, బ్రహ్మనిష్ఠుడై వేదాలను విభజింపగల పుత్రుని పొందాలన్నదే నా మనోభీష్టం. నా మనస్సులోని ఆ అభిమతాన్ని తెలిసికొని సురశ్రేష్ఠుడైన శంకరుడిలా అన్నాడు. 'మునీ ! నానుండి నీవు కోరదలచిన వరానికి అనుగుణంగా కృష్ణుడనే కుమారుని పొందగలవు. సావర్ణిక మన్వంతరంలోని సృష్టిలో నీ ఈ కొడుకు సప్తర్షిస్థానాన్ని పొందగలడు. వేదాలకు వక్త తానే కాగలడు. కురువంశాన్ని ప్రవర్తింపజేయగలడు. ఇతిహాసకర్తయై లోకహితాన్ని కోరగలడు ఆ మహాముని మహేంద్రునకు ఇష్టుడు కాగలడు. పరాశరా ! నీ కుమారుడు అజరుడు, అమరుడు కాగలడు' అలా చెప్పి యుధిష్ఠిరా ! ఆ భగవానుడు అక్కడే అంతర్ధానమయ్యాడు.'

మాండవ్యుడు చెప్పాడు. 'ఆ రోజుల్లో నన్ను నేను దొంగను కాకపోయినా దొంగ అనే అనుమానంతో శూలంపైకి ఎక్కించారు. నేను శూలం మీదనే ఉండి శంకరదేవుని స్తుతించాను. నరేశ్వరా ! ఆయన నాతో ఇలా అన్నాడు "నీవు మోక్షాన్ని పొందుతావు. శూలం మీదనే పదికోట్ల సంవత్సరాలపాటు జీవించగలవు. విప్రా ! శూలంవలన నీకు బాధకలుగదు. నీవు ఆధివ్యాధులనుండి కూడా విముక్తి నందగలవు. మునీ ! ఈ నీ శరీరం ధర్మం యొక్క నాలుగవ పాదం నుండి పుట్టింది. నీవు సాటిలేని సత్యవాదివి కాగలవు. వెళ్ళి, జన్మను సఫలం చేసికో. నీవు నిర్విఘ్నంగా సకల తీర్థాలలో స్నానం చేసిన ఫలితాన్ని పొందగలవు. నీకు అక్షయమై, తేజస్సంపన్నమైన స్వర్గాన్ని అనుగ్రహిస్తున్నాను." మహేశ్వరుడు గణాలతో సహా అక్కడే అదృశ్యుడయ్యాడు.' గాలవుడు చెప్తున్నాడు 'విశ్వామిత్రుని అనుమతి తీసికొని నేను తండ్రిని చూడటానికి వచ్చాను. అప్పుడు తీవ్రంగా దుఃఖిస్తూ మా అమ్మ ఇలా అన్నది ! 'అనఘా ! నాయనా ! కౌశికుని అనుమతితో నీవు ఇంటికివచ్చావు. కానీ వేద విభూషితుడవై, జితేంద్రియుడవైన నిన్ను నీ తండ్రి చూడలేడు !' తల్లి మాట విని, తండ్రి దర్శనం లేకపోవటంతో నిరాశపడి, నేను నియత మనస్కుడనై మహాదేవుని దర్శించాను. ఆయన నాతో ఇల్లా అన్నాడు. "కుమారా ! నీవు, నీతండ్రి, నీతల్లి మృత్యురహితులవుతారు. వేగంగా ఇంటికి వెళ్లు. ఇంటిలో తండ్రిని చూడగలవు !' యుధిష్ఠిరా ! భగవంతుని అనుమతితో నేను ఇంటికి వెళ్ళి, యాగం చేసి వెలుపలికి వస్తున్న తండ్రిని చూశాను. అప్పుడు ఆయన సమిధలను, దర్భలను రాలిన పండ్లను చేతబట్టి ఉన్నాడు.

వెంటనే ఆయన పాదాలపై పడ్డాను. పాండవా ! ఆయన చేతిలోని పదార్థాలను విడిచి నమస్కరిస్తున్న నన్ను కౌగిలించుకొని, శిరస్సును ఆఘ్రాణించి కంటినుండి నీరు కార్చుతూ 'కుమారా ! భాగ్యం కొద్దీ చదువు ముగించుకొని ఇంటికి వచ్చావు. నిన్ను చూడగలిగాను' అన్నాడు."

వైశంపాయనుడు చెప్తున్నాడు "మహాత్ముడైన ఆ శివునకు సంబంధించి మునులు చెప్పిన ఈ అత్యద్భుత కర్మలను విని, యుధిష్ఠిరుడు ఆశ్చర్య పడ్డాడు. ఆ తరువాత కృష్ణుడు విష్ణువు ఇంద్రునకు ఉపదేశించినట్లు ధర్మ నిధి అయిన యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. 'ప్రజ్వలిస్తున్న సూర్యునివలె ఉన్న ఉపమన్యువు నాతో ఇలా అన్నాడు. పాపకర్మలు చేసి అపవిత్రులై, తమోగుణ రజోగుణప్రవృత్తి గల నరులు తమ అశుభకర్మల కారణంగా మహేశుని శరణు కోరారు. పవిత్రాంతఃకరణం గల బ్రాహ్మణులు ఈశ్వరుని శరణుకోరుతారు. పరమేశ్వర భక్తుడు సాధారణవ్యవహారమంతా కొనసాగిస్తున్నా పవిత్ర హృదయులై, అరణ్యంలో నివసించే మునులతో సమానుడు. రుద్రుడు సంతుష్టుడైతే బ్రహ్మత్వమైనా, కేశవత్వమైనా దేవతలతో కూడిన దేవేంద్రత్వమైనా, త్రిలోకాధిపత్యమైనా ఇవ్వగలడు. నాయనా ! మనసా శివుని శరణుకోరిన మానవులు సర్వపాపవిముక్తులై, దేవతలతో కూడి నివసింపగలరు. ఒడ్డుల నన్నింటిని కూల్చి కూల్చి, ఈ జగత్తు నంతటినీ అగ్నికి ఆహుతి చేసి, విరూపాక్షుని ఆరాధించినవానిని పాపమంటదు. శివుని మనసా భావించినవాడు సర్వలక్షణహీనుడైనా సర్వపాతకాలతో కూడి ఉన్నా, ఆ పాపాన్ని పూర్తిగా తొలగించుకొనగలడు. కేశవా కీటకాలకయినా, పక్షులకయినా పతంగాలకయినా, జంతువులకయినా మహాదేవుని శరణుచొచ్చితే ఎక్కడా భయముండదు. అదే రీతిగా ఈ లోకంలో మహాదేవ భక్తులైన మానవులు సంసార బంధాలకు లోనుకారు. ఇది నా నిశ్చితాభిప్రాయం !'

ఆపై కృష్ణుడు ధర్మపుత్రుడైన యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "ఆదిత్యుడు చంద్రుడు, గాలి, అగ్ని, స్వర్గం, భూమి, నీళ్లు, వసువులు, విశ్వేదేవులు, ధాత, అర్యముడు, శుక్రుడు, బృహస్పతి, రుద్రులు, సాధ్యులు, వరుణుడు, బ్రహ్మ, ఇంద్రుడు వాయుదేవుడు, ఓంకారం, సత్యం, వేదాలు, యజ్ఞాలు, దక్షిణలు, వేదపారకులైన బ్రాహ్మణులు, సోమరసం, యజమాని, హవ్యం, హవిస్సు, రక్ష, దీక్ష, సర్వనియంత్రణలు, స్వాహావషట్కారాలు, బ్రాహ్మణులు, ఆవు, శ్రేష్ఠధర్మం, కాలచక్రం, బలం, యశస్సు, దమం, బుద్ధిమంతుల స్థితి, శుభకర్మ, అశుభకర్మ, సప్తర్షులు, మంచి బుద్ధి, మనస్సు, దర్శనం, మంచి స్పర్శ, కర్మసిద్ధి; ఊష్మప, సోమప, లేఖ, యామ, తుషితాది దేవగణాలు; బ్రాహ్మణశరీరం,

గంధప ధూమపమునులు, వాగ్విరుద్ధభావాలు, మనోవిరుద్ధభావాలు, శుద్ధభావులు, నిర్మాణతత్పరులైన దేవతలు, స్పర్శమాత్ర భోజనులు, దర్శన మాత్రపానీయులు, ఆజ్యపానం చేసేవారు, భావించినదాన్ని సాక్షాత్కరించుకొనగలవారు దేవతాముఖ్యులు, ఇతర దేవతలు, సువర్ణులు, గంధర్వులు, పిశాచాలు, దానవులు, యక్షులు, చారణులు, నాగులు, స్థూలం, సూక్ష్మం, మృదువు, అసూక్ష్మం, సుఖం, ఇహపరదుఃఖాలు, సాంఖ్యం, యోగం, పురుషార్ధశ్రేష్ఠమైన మోక్షం నేను చెప్తున్న ఇదంతా శంకరుని నుండి పుట్టినదని గ్రహించు. ఈ లోకంలో పుట్టి పురాతనమైన ఆ మహాదేవుని సృష్టిని సంరక్షించే వారు, ఈ భువన రక్షకులు, విభిన్న ప్రాణులను సృష్టించే శ్రేష్ఠులు ఈ దేవతలందరూ శివుని నుండి వెలువడినవారే.

తపస్సుతో మహర్షులు అన్వేషించే ఆ స్థిరమై, అనిర్వచనీయమైన తత్త్వ స్వరూపుడైన పరమ శివునకు ప్రాణరక్షణకై నమస్కరిస్తున్నాను. అవ్యయుడైన ఆ ప్రభువు - శంకరుడు నాచే సదా స్తుతింపబడి అభీష్టవరాల నిచ్చును గాక ! నియతేంద్రియుడై, పవిత్రుడై ఈ సహస్ర నామస్తోత్రాన్ని ఒక నెలపాటు నియమబద్ధంగా, యోగభంగం లేకుండా పఠించిన పురుషుడు అశ్వమేధయాగం చేసిన ఫలితాన్ని పొందుతాడు. యుధిష్ఠిరా ! బ్రాహ్మణుడు సమస్తవేద జ్ఞానాన్ని పొందుతాడు. క్షత్రియుడు భూమినంతా జయించగలడు. వైశ్యుడు లాభాన్ని, నైపుణ్యాన్ని పొందగలడు. శూద్రుడు ఇహలోకంలో సుఖాన్ని, మరణానంతరం సద్గతిని పొందగలడు. సర్వదోషాలను అపహరించేది, పుణ్యప్రదం, పవిత్రం అయిన ఈ స్తవరాజాన్ని పఠించి, రుద్రునిపై మనస్సు నిలిపినవారు కీర్తిమంతులు కాగలరు. భారతా ! తన శరీరంలో ఎన్ని రోమకూపాలుంటాయో అన్ని వేల సంవత్సరాలపాటు మనిషి స్వర్గంలో నివసిస్తాడు.

19. అష్టావక్ర దిక్సంవాదము - 1.

యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. "భరతర్షభా ! వివాహ సమయంలో స్త్రీలకు సహధర్మాన్ని గురించి చెపుతారు. గదా ! ఆ సహధర్మమెటువంటిది ? మహర్షులు పూర్వకాలంలో స్త్రీలకై చెప్పిన ఈ సహధర్మం ఆర్షమా ? ప్రాజాపత్యమా ? ఆసురమా ? ఈ పెద్ద సందేహం నా మనస్సులో ఉంది. ఈ సహధర్మాన్ని గురించి చెప్పటం విరుద్ధమని నాకనిపిస్తోంది. ఈ సహధర్మం మరణానంతరం ఎక్కడ విధింపబడుతుంది ? పితామహా ! మరణించిన వారు స్వర్గానికి వెళతారు. భార్యాభర్తలలో ఒకరు ముందు చనిపోతారు. మరొకరు బ్రతికి ఉంటారు. అప్పుడు సహధర్మమేమవుతుంది ? చెప్పు. చాలామంది

మనుష్యులు నానా ధర్మఫలాలతో కూడి ఉంటారు. నానా కర్మల కారణంగా విభిన్న ప్రాంతాలలో నివసిస్తారు. కర్మఫలాన్ని బట్టి నరకస్వర్గాదులలో పడతారు. అప్పుడు సహధర్మమెలా కుదురుతుంది ? స్త్రీలు అసత్య పరాయణులని సూత్రకారుడంటాడు. తాతా ! స్త్రీలు అసత్యవాదినులయితే వారితో కలిసి సహధర్మమెలా వీలవుతుంది ? వేదాలలో స్త్రీలు అసత్య భాషిణులని చెప్పబడుతోంది. అప్పుడు అసత్యం కూడా సహధర్మంలో భాగమవుతుంది. కాబట్టి సహధర్మమన్నది అప్రధాన ప్రయోగమే. కలిసి జీవించటాన్ని ఔపచారికంగా సహధర్మమంటారు. పితామహా ! ఎప్పుడూ దీనిని గురించి ఆలోచిస్తుంటాను. అయినా ఇది తేలికగా తెలియదని నాకనిపిస్తోంది. వేదవిధిని అనుసరించి సందేహం తొలగిపోయేటట్లు దీనిని పూర్తిగా చెప్పవలసినది. మహాప్రాజ్ఞా ! ఈ సహధర్మభావం ఎప్పుడు ప్రారంభమైంది ? ఎటువంటిది ? ఎలా అది ప్రవర్తించింది ? దీనిని సంపూర్ణంగా నీవు నాకు చెప్పాలి". భీష్ముడు చెప్తున్నాడు. "భారతా ! ఈ విషయమై అష్టావక్రునకు, దిశకు మధ్య జరిగిన సంవాద రూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. గతంలో మహాతపస్వి అయిన అష్టావక్రుడు వివాహమాడదలచి, మహాత్ముడైన వదాన్యముని పుత్రికను వరించాడు. ఆమె పేరు సుప్రభ. లోకంలో సాటిలేని రూపవతి, గుణం, ప్రభావం, శీలం, చరిత్రలతో అందమైనది. వసంత ఋతువులో పూవులు, రంగురంగుల వనశ్రేణి మనుజుల మనస్సులను హరించినట్లు, చక్కని కన్నులు గల ఆ సుప్రభ దర్శనమాత్రంతో అష్టావక్రుని మనస్సును దోచింది. అష్టావక్రుడు వరించగానే వదాన్యుడు ఇలా అన్నాడు.

"ఏకపత్నీవ్రతుడు, పరదేశంలో ఉండనివాడు, ప్రియంవదుడు, అందగాడు, లోకసమ్మతుడు, వీరుడు, శీలవంతుడు, భోగానుభవ సమర్థుడు, కాంతిమంతుడు అయిన వానితోనే కూతురి పెళ్ళి జరిపించాలి. భార్యానుమతితో యజించేవాడు. మంచి నక్షత్రంలో పుట్టిన దానిని పెళ్ళి చేసికొనేవాడు తన భార్యతో, ఆటువంటి భార్య తన భర్తతో కలిసి ఇహపరసుఖాల నందగలదు. మా అమ్మాయిని నీకిస్తాను. ఒక మాట విను.

ఇక్కడ నుండి పవిత్రమైన ఉత్తర దిక్కుకు వెళ్ళు. అక్కడ ఆమె కనిపిస్తుంది. అష్టావక్రుడడిగాడు. "అక్కడకు వెళ్ళి నేను ఏం చూడాలి ? అని కూడా తమరు చెప్పండి ? వెళ్ళిన తరువాత నేను ఎలా పనిచేయాలో కూడా తమరు చెప్పండి". వదాన్యుడు చెప్తున్నాడు. "కుబేరుని (నగరాన్ని) దాటి, హిమవత్పర్వతాన్ని దాటిన తరువాత సిద్ధులు, చారణులు సేవించే రుద్ర నివాసాన్ని (కైలాసగిరిని) చూస్తావు. అక్కడ వివిధ ముఖాలు గలిగి, దివ్యగంధాలు పూసికొని, అనేక పిశాచాలు, ఇతర భూత ప్రేతాదులు, పార్షదగణాలు పరమోల్లాసంతో నృత్యం చేస్తుంటారు. వారు చేతితో తాళం వేస్తూ కొందరు, కొందరు,

మెరుపు తాళాలతో కొందరు సమభావంతో హర్షనిర్భరులై నృత్యం చేస్తూ శివుని సేవిస్తుంటారు. ఆ పర్వతం మీది ఆ దివ్య ప్రదేశం పరమేశ్వరునకు ఇష్టమైనదని వింటుంటాం. అక్కడ మహాదేవుడు, ఆయన పార్షదగణాలు నిత్యమూ నివసిస్తుంటారు. అక్కడ పార్వతి శంకరునికై పరమ దుష్కరమైన తపస్సు చేసింది. అందువలన శంకరునకు, ఉమా దేవికి కూడా అది ఇష్టమైన ప్రదేశమని వింటుంటాం. అక్కడ మహాదేవునకు తూర్పున, ఉత్తరాన మహాపార్శ్వమనే పర్వతముంటుంది. అక్కడ ఋతువులు, కాలరాత్రి, దివ్యమానుష భావాలు అన్నీ ఆకృతి ధరించి మహాదేవుని సేవిస్తుంటాయి. ఆ భవనాన్ని కూడా నీవు దాటి వెళ్ళాలి. ఆ తరువాత మేఘ సమూహంవలె నల్లగా, అందంగా, మనోహరంగా ఉన్న వనప్రాంతాన్ని చూస్తావు. అక్కడ ఒక స్త్రీ కనిపిస్తుంది. ఆమె తపస్విని, సౌభాగ్యవతి, వృద్ధురాలు, దీక్షాపరాయణ. నీవు అక్కడ ఆమెను చూడాలి. సప్రయత్నంగా సమర్పించాలి. ఆమెను చూసి మరలి వచ్చిన తరువాత నీవు నా కుమార్తెను పెండ్లి చేసికొనగలవు. ఈ నియమమంతా నీకిష్టమైతే వెళ్ళు. సాధించే పని ప్రారంభించు". అష్టావక్రుడన్నాడు. "అలాగే ! సాధిస్తాను. నిస్సంశయంగా నీవు చెప్పిన ప్రదేశానికి వెళతాను. నీవు మాట తప్పకూడదు".

భీష్ముడు చెప్తున్నాడు. "ఆపై పూజ్యుడైన ఆ అష్టావక్రుడు ఉత్తర దిశగా బయలుదేరాడు. ఆ ద్విజోత్తముడు సిద్ధచారణ సేవితమైన మహా పర్వత శ్రేష్ఠమైన హిమగిరికి చేరాడు. అక్కడ ధర్మశాలిని అయిన బాహుదానది ఒడ్డుకు చేరాడు. అక్కడ నిర్మలమైన అశోక తీర్థంలో స్నానం చేసి, దేవతలకై తర్పణాలు చేసి, ఆ రాత్రి అక్కడ గడపదలచి దర్భలతో చేసిన చాపపై సుఖంగా శయనించాడు. రాత్రి గడచిపోయింది. ఆ బ్రాహ్మణుడు అష్టావక్రుడు ప్రొద్దుటే లేచాడు. స్నానం చేసి నిప్పు పుట్టించాడు. ప్రధాన మంత్రాలతో అగ్నిహోత్రస్తుతిని ముగించి, 'రుద్రాణీ రుద్ర'మనే తీర్థానికి వచ్చి అక్కడ విశ్రాంతి తీసికొని లేచి కైలాసగిరివైపు బయలుదేరాడు. కొంత నడిచిన తరువాత అష్టావక్రుడు దివ్యకాంతితో వెలుగొందుతున్న అలకాపురీ ద్వారాన్ని చూశాడు. అది సువర్ణమయం మహాత్ముడైన కుబేరుడు దానికి రాజు. అక్కడ కమలాలతో శోభించే దిగుడు బావి కనిపించింది. దానిపేరు మందాకిని. ఆపై కమలశోభితమైన ఆ పుష్కరిణిని రక్షిస్తున్న మణిభద్రుడు మొదలయిన రాక్షసులందరూ అష్టావక్రునకు స్వాగతం చెప్పటానికి లేచి వచ్చారు. భీకరపరాక్రములైన ఆ రాక్షసులను అష్టావక్రుడు కూడా సత్కరించాడు. 'నారాకను వెంటనే కుబేరునకు తెలియజేయండి' అన్నాడు. రాజా ! అప్పుడు ఆ రాక్షసులు పూజ్యుడైన అష్టావక్రునితో ఇలా అన్నారు. "ఇదిగో ! యక్షరాజైన కుబేరుడు స్వయంగా నీ దగ్గరకు

వస్తున్నాడు. తమరాక, తమరాకలోని ఆంతర్యం అంతా ఆయనకు తెలుసు. అదిగో ! ఆ మహాభాగుని చూడు. తేజస్సుతో మండుతున్నట్లున్నాడు. వస్తున్నాడు. అంతలోనే కుబేరుడు వచ్చి అనిందితుడైన అష్టావక్రుని యథావిధిగా క్షేమమడిగి ఆపై ఆ బ్రహ్మర్షితో ఇలా అన్నాడు. "ద్విజా సుఖంగా రాగలిగారు కదా ! నా ద్వారా ఏ పనిని కోరుతున్నారు ? చెప్పండి. నాకు చెప్పినదంతా చేస్తాను. ద్విజోత్తమా ! మీరు స్వేచ్ఛగా నా భవనంలోనికి ప్రవేశించండి. మా సత్కారాలను పొంది, మీ పనిని నిర్విఘ్నంగా పూర్తి చేసికొని ఆ తరువాత వెళ్ళవచ్చు". కుబేరుడు ఆ ద్విజోత్తముని తీసికొని తన భవనానికి వెళ్ళాడు. ఆ మునికి ఆసనాన్ని, అర్ఘ్య పాద్యాలను అర్పించాడు. వారిద్దరూ అక్కడ కూర్చున్న తరువాత మణిభద్రుడు మొదలుగా గల కుబేర సేవకులు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు అక్కడ కూర్చున్నారు. వారు అలా కూర్చున్న తరువాత కుబేరుడు "మీకిష్టమైతే అప్సరసలు నృత్యం చేస్తారు. మీకు మంచి ఆతిథ్యమివ్వాలి. అలాగే మీ ద్వారా మంచిమాటలు వినాలి" అని అష్టావక్రునితో అన్నాడు. "కానివ్వండి" అని మధురవచనంతో అష్టావక్రుడు అన్నాడు.

ఆపై ఉర్వర, మిశ్రకేశి, రంభ, ఊర్వశి, అలంబుష, ఘృతాచి, చిత్ర, చిత్రాంగద, రుచి, మనోహర, సుకేశి, సుముఖి, హాసిని, ప్రభ, విద్యుత, ప్రశమి, దాంత, విద్యోత, రతి – వీరు, ఇంకా ఎందరో అప్సరసలు శుభంగా నృత్యం చేయసాగారు. గంధర్వులు వివిధ వాద్యాలను మ్రోగింపసాగారు. అలా దివ్య నృత్య గీతాలు ప్రారంభం కాగానే అష్టావక్రముని కూడా అక్కడే కూర్చున్నాడు. ఆ మహాతపస్వి ఒక దివ్య సంవత్సరకాలం అక్కడే వినోదించాడు. ఆ తరువాత యక్షరాజు – వైశ్రవణుడు అష్టావక్రునితో ఇలా అన్నాడు. "ద్విజోత్తమా ! ఇక్కడ నృత్యంచూస్తూ సంవత్సర కాలం గడిపివేశారు. బ్రాహ్మణా ! గాంధర్వమన్న పేరుగల ఈ నృత్య గీత విషయం మనోహరం. స్వేచ్ఛగా కొనసాగనివ్వండి. లేదా మీరెలా చెపితే అలా ! తమరు అతిథులు. పూజింపదగినవారు. ఇది మీ ఇల్లే. ఏం చేయమంటారో వెంటనే చెప్పండి. మేము తమ సేవకులం". అప్పుడు వైశ్రవణుని మాటలకు ప్రసన్నుడై అష్టావక్రుడిలా అన్నాడు. "ధనేశ్వరా ! యధోచితంగా సేవలను పొందాను. ఇక వెళతాను. ధనాధిపా ! ప్రసన్నుడనయ్యాను. ఈ అతిథి జనపూజ నీకు తగినదే. భగవంతుడా ! నీ అనుగ్రహం వలన, మహోత్ముడైన ఆ వదాన్యముని ఆదేశాన్ని అనుసరించి ముందుకు వెళతాను. నీవు అభ్యుదయాన్నీ, సమృద్ధినీ పొందు". అలా పలికి ఆ పూజ్యుడైన ఆ అష్టావక్రుడు ఉత్తరాభిముఖంగా వెళ్ళిపోయాడు. ఇలా కైలాస, మందర, హిమాలయాలపై చరించసాగాడు. ఆ మహా పర్వతాలను దాటి అష్టావక్రుడు నియత మనస్కుడై శంకరుడు

కిరాత వేషంతో పరాక్రమించిన ఉత్తమ స్థానానికి ప్రదక్షిణం చేసి, శిరస్సు వంచి నమస్కరించి, ఆ తరువాత క్రిందకు దిగి, తత్క్షేత్ర ప్రభావంతో పవిత్ర హృదయుడయ్యాడు. మూడుసార్లు ఆ పర్వతానికి ప్రదక్షిణం చేసి, ప్రీతిని పొంది, ఉత్తరాభిముఖుడై సమతల భూమిపై బయలుదేరాడు. తరువాత అందమైన మరో వనప్రాంతం కనిపించింది. సర్వ ఋతువులలోని ఫలమూలాలతో, పక్షులతో కూడి ఉంది. అక్కడక్కడ అందమైన తావులు దానికి ఆభరణాలవలె ఉన్నాయి. అక్కడ భగవానుడైన అష్టావక్రుడు ఒక దివ్యాశ్రమ స్థానాన్ని చూశాడు. దాని చుట్టుప్రక్కల బంగారంతో, రత్నాలతో వెలుగొందుతూ వివిధాకారాలతో ఉన్న పర్వతాలున్నాయి. అక్కడి నేలలు కూడా మణిమయాలు. అక్కడక్కడ అందమైన పుష్కరిణులు ఉన్నాయి. ఇంకా ఎన్నో బాగా అందమైన ప్రదేశాలను చూచిన పవిత్ర హృదయుడైన ఆ మహర్షి మనస్సు ఎంతో ఆనందించింది.

అక్కడ సర్వరత్నమయమై, సువర్ణమయమైన ఒక దివ్య గృహం కనిపించింది. అది కుబేరుని ఇంటికన్న అద్భుతంగా, గొప్పగా ఉన్నది. అక్కడ అక్కడక్కడ పెద్ద పెద్ద మణికాంచన పర్వతాలు, అందమైన విమానాలు, వివిధ రత్నాలు కనిపించాయి. మందార పుష్పాలతో నిండి ఉన్న మందాకినీ నదిని చూశాడు. అక్కడ స్వయంగా ప్రకాశించే మణులు కాంతులు వెదజల్లుతున్నాయి. వజ్రాలతో భూమి పొదగబడి ఉంది. ఆ ఆశ్రమంలో నాలుగు వైపుల విచిత్రమణి తోరణాలు, ముత్యాల మూలలు, మణి రత్నాలతో అలంకరించిన వివిధ భవనాలు ఉన్నాయి. అవి మనస్సులను, చూపులను ఆకట్టుకొంటున్నాయి. ఆ మంగళకర భవనాలతో ఆవరింపబడి, ఋషులతో నిండి ఉన్న ఆ మనోహరమైనది ఆ ఆశ్రమపదం. అది చూడగానే ఎక్కడ ఉండాలన్న చింత అష్టావక్రునకు కలిగింది. ఆపై ద్వారం దగ్గరకు వెళ్ళి, నిలిచి, ఇలా పలికాడు. "ఇక్కడెవరున్నారు ? నేను అతిథిని వచ్చాను. గమనించండి". ఆ మాటవిని ఆ ఇంటి నుండి ఏడుగురు కన్యలు ఒకేసారి బయటకు వచ్చారు. వారు నానా రూపాలతో ఉన్నారు. కానీ ఆ కన్యలందరూ అందగత్తెలే. అష్టావక్రుడు ఏ కన్యను చూస్తే ఆకన్య వైపే మనస్సు మొగ్గుతోంది. తాను మనస్సును నిరోధించలేకపోయాడు. అది శిథిలం కాసాగింది. అంతలోనే ధీమంతుడైన ఆ విప్రునకు (అష్టావక్రునకు) ధైర్యం వచ్చింది. అప్పుడు ఆ కాంతలు "భగవన్ ! ప్రవేశించండి" అన్నారు. ఆ అందగత్తెల మీదా, ఆ భవనం మీదా ఆసక్తితో ఆ ద్విజుడు కుతూహలానికి లోనై భవనంలోనికి ప్రవేశించాడు. ఆ భవనంలో ఆయన ఒక వృద్ధురాలిని చూశాడు. ఆమె నిర్మల వస్త్రాలను ధరించి ఉంది. సర్వాభరణాలనూ అలంకరించుకొని పర్యంకంపై పడుకొని ఉంది. అష్టావక్రుడు 'స్వస్తి' అని ఆమెను ఆశీర్వదించాడు. అప్పుడు ఆమె లేచి

ఎదురు వచ్చి 'కూర్చోండి' అని బదులు పలికింది. అష్టావక్రుడిలా అన్నాడు. 'అందరూ మీరు భవనాలకు వెళ్ళండి. నా దగ్గర ఒక్కరే ఉండండి. తెలివితేటలు, ప్రశాంతత గల వ్యక్తి ఒక్కరే చాలు. మిగిలిన వారు స్వేచ్ఛగా వెళ్ళండి. అప్పుడు ఆ కన్యలు అందరూ ఆ ఋషికి ప్రదక్షిణం చేసి వెళ్ళిపోయారు. వృద్ధురాలు మాత్రమే అక్కడ నిలిచింది.

ఆపై తళతళలాడుతున్న పక్కపై తాను శయనిస్తూ అష్టావక్రుడు "కళ్యాణీ ! నీవు కూడా నిదురపో ! చాలా రాత్రి గడిచిపోయింది" అన్నాడు. మాటల ప్రస్తావనతో ఆ విప్రుడు అలా మాటాడగానే ఆమె మహాకాంతిమంతమై, దివ్యమైన రెండవ పక్కపై పడుకొన్నది. ఆ తరువాత ఆమె చలి అనే సాకుతో వణికిపోతూ ఆ అష్టావక్రుని పక్కమీదకు చేరింది. అష్టావక్రుడు కూడా ఆమెను 'స్వాగతం' అని పలుకుతూ సమాదరించాడు. నరశ్రేష్ఠా ! ఆమె ప్రేమతో రెండు చేతులతో ఆ ఋషిని కౌగిలించుకొన్నది. కానీ అప్పుడు ఆ ఋషి నిర్వికారంగా కట్టెవలె, గోడవలె ఉన్నాడు. అష్టావక్రుని ఆ స్థితిని చూసి ఆ వృద్ధురాలు దుఃఖిస్తూ ఇలా అన్నది. 'బ్రాహ్మణా ! స్త్రీలకు పురుషుని దగ్గర కామ వ్యవహారాన్ని కాదని మరే వ్యవహారం వలనా ధైర్యం కలుగదు. నేను కామ మోహితనై నీ దగ్గరకు వచ్చాను. బ్రహ్మర్షీ ! ఉల్లాసంగా నాతో సంగమించు. విప్రా ! నన్ను కౌగిలించుకో, నేను నీపై తీవ్రకామంతో ఆర్తినందుతున్నాను. ధర్మాత్మా ! ఇది నీ తపస్సుకు ప్రశస్త ఫలితం. నిన్ను చూసినప్పుడే మనసు పడ్డాను. నిన్ను సేవించే నన్ను సేవికగా స్వీకరించు. ఈ నా ధనమంతా, నీవు చూస్తున్న ఈ వైభవమంతా నీదే. దీనికి, నాకూ కూడా నీవే నిస్సంశయంగా ప్రభువువు. కోరికల నన్నింటినీ తీరుస్తాను. నాతో కూడి క్రీడించు. విప్రా ! సర్వకామఫలాలనిచ్చే ఈ రమణీయవనంలో నేను నీ దాన నవుతున్నాను. నాతో కలిసి క్రీడించగలవు. దివ్యమానుషకామాల నన్నింటినీ అనుభవిద్దాం. పురుష సంసర్గం కన్న గోప్పదేదీ ఎప్పుడూ స్త్రీకి ఉండదు. మాకు అదే పరమ ఫలం. మన్మథుడు ప్రేరేపించిన స్త్రీలు తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తారు. కామ సంతాపానికి లోనైన వారు కాలిపోతున్న ధూళిమీద అయినా నడువగలుగుతారు. కాళ్ళు కాలవు". అష్టావక్రుడిలా అన్నాడు. "కళ్యాణీ ! నేను ఏ రీతిగానూ పరదారలతో సంగమించను. పరదారా సమాగమాన్ని ధర్మశాస్త్రవేత్తలు నిందించారు. కళ్యాణీ ! సత్యప్రమాణంగా చెపుతున్నాను. నేను పెండ్లాడదలచి ఉన్నాను. తెలిసికో, నాకు విషయానురక్తత తెలియదు. సంతానం ధర్మం కోసమే. అలా జరిగితే పుత్రుల ద్వారా అభీష్టలోకాలకు నిస్సంశయంగా వెళ్ళవచ్చు. భద్రా ! ధర్మాన్ని గ్రహించు. నీ ఆలోచనను విరమించుకో". స్త్రీ ఇలా అన్నది. "ద్విజా ! స్త్రీలకు మన్మథుడంటే

ఉన్నంత ఇష్టం వాయుదేవుడన్నా, అగ్ని అన్నా, వరుణుడన్నా, మరే దేవత అన్నా కూడా ఉండదు. స్త్రీలు రత్యాసక్తులు. రతిమీద ఆసక్తి లేని స్త్రీ వేలలో ఒకరై ఉంటుందేమో ! అలాగే లక్షమందిలో ఒక స్త్రీ పతివ్రతగా ఉంటుందేమో ! స్త్రీలు తండ్రిని కానీ, తల్లిని కానీ, వంశాన్ని కానీ, సోదరులను కానీ, భర్తను కానీ, పుత్రులను కానీ, మరదులను కానీ లెక్కచేయరు. రతి మీద ఆసక్తితో మర్యాదలనతిక్రమించి నదులు తటాలను కూలగొట్టినట్లు వంశ మర్యాదను నాశనం చేస్తారు. ఈ దోషాలను అన్నింటిని గ్రహించియే బ్రహ్మ వైన చెప్పిన మాట అన్నాడు".

భీష్ముడు చెప్తున్నాడు. "అప్పుడు ఆ అష్టావక్రముని ఏకాగ్రతతో ఆ స్త్రీతో ఇలా అన్నాడు. నీకు స్వేచ్ఛమీద అభిరుచి ఉంటే ఉండనీ ! నాతో మరేదైనా పని ఉంటే చెప్పు". ఆ స్త్రీ ఇలా అన్నది. "భగవంతుడా ! దేశ కాలాలను బట్టి నీవు గ్రహించగలవు. ఇక్కడే ఉండు. కృతకృత్యుడవు కాగలవు". యుధిష్ఠిరా ! అప్పుడు ఆ బ్రహ్మర్షి ఆమెతో "అలాగే ! నేను ఉండదలచినంతకాలం నీతో కలిసి ఇక్కడ ఉంటాను. అనుమానపడవద్దు" అన్నాడు. ఆపై ఆ అష్టావక్రుడు ముసలితనంతో బాధపడుతున్న ఆమెను చూసి ఎంతో చింతించాడు. ఎంతో తపించాడు. అప్పుడు ఆ విప్రర్షి ఆమె శరీరంలోని ఏయే అవయవాన్ని చూసినా వాటిపై దృష్టి నిలవటం లేదు. ఆనందించటం లేదు. దృష్టికి రూప వైరాగ్య మేర్పడుతోంది. "ఈ గృహ దేవత ఏ శాపంవలననో ఇలా వికృత రూపాన్ని పొందిందా ? దీనికి కారణం తెలిసికొనటానికి వెంటనే నేను ప్రయత్నించటం నాకు తగదేమో !" అని కలతపడి అదేపనిగా ఆలోచించసాగాడు. ఆ కారణాన్ని తెలిసికోవాలన్న వ్యాకుల చిత్తంతోనే ఆ పగలంతా గడిపాడు. ఆపై ఆ కాంత ఇలా అన్నది. "భగవంతుడా ! చూడు. సూర్యస్వరూపం సంధ్యాకాశలాలనతో ఎర్రబడింది. ఇప్పుడు నీకై ఏం సమకూర్చాలి ?" అప్పుడు ఆ అష్టావక్రుడు ఆమెతో "స్నానానికై నీళ్ళు తీసికొనిరా ! ఆ తరువాత మౌనంగా, నియతేంద్రియుడనై సంధ్యోపాసన చేస్తాను".

20. అష్టావక్ర దిక్సంవాదము - 2.

భీష్ముడు చెప్తున్నాడు. ఆపై ఆమె "సరే ! అలాగే కానీ" అంటూ దివ్యతైలాన్ని, స్నానానికి తుండుగుడ్డను తెచ్చి ఇచ్చింది. ఆ స్త్రీ మహోత్ముడైన ఆ ముని అనుమతి తీసికొని ఆ తైలంతో ఆయన శరీరాంగాల నన్నింటినీ మర్దన చేసింది. ఆ తరువాత మెల్లగా ఆయనను లేవదీసింది. ఆయన స్నానశాలలోకి వెళ్ళాడు. ఆ ఋషికి అక్కడ

చిత్రమైన నూతన భద్రాసనం ప్రాప్తించింది. అప్పుడు ఆ భద్రాసనంపై కూర్చున్నాడు. ఆమె మెల్లగా సుఖస్పర్శతో ఆయనకు స్నానం చేయించింది. అప్పుడు యథావిధిగా ఆ మునికి దివ్యోపచారాలు చేసింది. ఆ ముని ఆ వెచ్చని నీటితో, ఆమె కరస్పర్శతో ఆనందంలో మునిగిపోయాడు. ఆ మహా వ్రతునకు రాత్రి గడచిపోవటం కూడా తెలియలేదు. ఆ తరువాత ఆ అష్టావక్రముని అప్పుడు పరమాశ్చర్యానికి లోనై లేచాడు. తూర్పు దిక్కున సూర్యుడు ఉదయించటాన్ని ఆయన చూడగలిగాడు. నేను భ్రాంతికి లోనయ్యానా ? లేక నిజంగా సూర్యుడు ఉదయించాడా ? అని ఆలోచింపసాగాడు. ఆపై సూర్యోపాసన చేసి 'నేనేం చేయాలి' అని ఆమెను అడిగాడు. ఆమె అమృతం వంటి రుచిగల అన్నాన్ని ఆ ఋషికోసం తెచ్చింది. ఆ అన్నం ఎంత రుచిగా ఉందంటే ఆయన చాలు అని చెప్పలేకపోయాడు. రోజంతా గడచిపోయింది. మరల సంజవేళ అయింది. ఆపై ఆ స్త్రీ 'నిదురపోండి' అని ఆ భగవానునితో అంది. అక్కడ ఆమె తనకు, ఆ మునికి దివ్యశయనాలను కల్పించింది. అప్పుడు ఆమె ఆ ముని విడివిడిగానే నిదురించారు. అలా అర్ధరాత్రి వరకు గడచిన తరువాత ఆ స్త్రీ ముని పక్క మీదకు వచ్చింది. అష్టావక్రుడన్నాడు. "కళ్యాణీ ! పరకాంతలపై నా మనస్సు ఆసక్తమవదులే ! నీకు మేలు జరుగుతుంది. ఈ పాపకర్మ నుండి విరమించుకో".

భీష్ముడు చెప్తున్నాడు. "ఆ బ్రాహ్మణుడు ఆ రీతిగా మరలించగా ఆమె ఆ ఋషితో "నేను స్వతంత్రురాలను. కాబట్టి నాతో సంగమించటంతో నీకు ధర్మవంచన ఉండదు" అన్నది. "స్త్రీలకు స్వాతంత్ర్యం లేదు. స్త్రీలు అస్వతంత్రులు. ఇది ప్రజాపతి అభిప్రాయం. స్త్రీ స్వాతంత్ర్యానికి తగదు". స్త్రీ ఇలా అన్నది. "బ్రాహ్మణా ! నన్ను సంగమేచ్ఛ బాధిస్తోంది. నా భక్తిని గమనించు. నీవు నన్ను ఆదరించకపోతే నీవు అధర్మం చేసినట్లే". అష్టావక్రుడన్నాడు. "స్వేచ్ఛగా చరించే నరుని అనేక దోషాలు తమ వైపు లాగుతాయి. నేను ధైర్యంతో సదా నియంత్రణలో నిలువగలను కళ్యాణీ ! నీ పక్క మీదకు వెళ్ళు స్త్రీ ఇలా అన్నది. "బ్రాహ్మణా ! శిరసా నమస్కరిస్తున్నాను. అనఘా ! అనుగ్రహించాలి. నేలగూలుతున్న నాకు శరణు కావాలి. ద్విజా ! పరదారాసమాగమం దోషమని ఒకవేళ నీవు భావిస్తున్నట్లయితే నన్ను నేను సమర్పించుకొంటున్నాను. పాణిగ్రహణం చేయండి. నీ దోషమేమీ ఉండదు. నేను సత్యం చెపుతున్నాను. నేను స్వతంత్రురాలను. అధర్మమేమయినా ఉంటే అది నాలోనే ఉండనీ. నీమీద మనస్సు పెట్టినదానను. స్వతంత్రను. నన్ను స్వీకరించు". అష్టావక్రుడన్నాడు. "కళ్యాణీ ! నీవెలా స్వతంత్రురాలవు ? దానికి

కారణం చెప్పు. మూడులోకాలలోను స్వాతంత్ర్యానికి అర్హమైన స్త్రీ లేదు. **కౌమారంలో తండ్రి రక్షిస్తాడు. యౌవనంలో భర్త రక్షిస్తాడు. వార్ధక్యవేళ పుత్రులు రక్షిస్తారు. స్త్రీకి స్వాతంత్ర్యం లేదు".*** స్త్రీ ఇలా అన్నది. "నేను కౌమారంలో బ్రహ్మచారిణిని. అందువలన నేను కన్యగానే ఉన్నాను. సంశయం లేదు. బ్రాహ్మణా ! నన్ను భార్యగా చేసికో. నా శ్రద్ధను నశింపజేయవద్దు". అష్టావక్రుడన్నాడు. "నా దశ వంటిదే నీ దశ. నీ దశ వంటిదే నా దశ. ఇది ఆ వదాన్యముని పరీక్షయే. ఇది సత్యంగా విఘ్నం కాదు కదా ! పరమాశ్చర్యంగా ఉంది ఇది. ఇది నాకు శ్రేయోదాయక మవుతుందా ? వృద్ధురాలుగా ఉన్న ఈమె దివ్యాభరణ వస్త్రధారిణియైన కన్యయై నన్ను సేవిస్తోంది. ఈ పరమ సుందరరూపం ముందు వార్ధక్యంశిథిల మెలా అయింది ? ఇప్పుడు కన్యారూపాన్ని ఎలా పొందింది ? ఇప్పుడేమి సమాధానం చెప్పాలి ? నాకు ధైర్యంగా నిలువగల శక్తి ఉన్నది. ఈ శక్తి ధైర్యాల సహకారంతో ఏ రీతిగానూ చలింపను. ధర్మోల్లంఘన నాకు నచ్చదు. నేను సత్య మార్గంలోనే పత్నిని పొందుతాను' అని ఆలోచించాడు.

21. అష్టావక్ర వివాహము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "పరమ తేజస్వి అయిన ఆ ముని శాపానికి ఆ స్త్రీ ఎందుకు భయపడలేదు ? పూజ్యుడైన ఆ ముని ఎలా మరలగలిగాడు. నాకు చెప్పవలసినది'. భీష్ముడు చెప్తున్నాడు. "రూపాన్ని ఎలా మార్చుకొనగలుగుతున్నావు ? నావంటి బ్రాహ్మణుని మన్నన పొందాలంటే అసత్యమాడకుండా చెప్పు' అని అష్టావక్రుడు ఆమె నడిగాడు. స్త్రీ చెప్తోంది. "బ్రాహ్మణోత్తమా ! భూలోకంలో కానీ, స్వర్గలోకంలో కానీ ఈ కోరిక సర్వసాధారణమే. సత్యవిక్రమా ! ఇదంతా సావధానంగా విను. అనఘా ! నిన్ను స్థిరపరచటానికే నేనిలా పరీక్షించాను. సత్యపరాక్రమా ! నీవు ధర్మం నుండి చలించకుండా ఉత్తమ లోకాలను జయింపగలిగావు. నేను ఉత్తర దిశనని తెలిసికో. స్త్రీ చాపలం ఎటువంటిదో నీవు ప్రత్యక్షంగా చూశావు. ముదుసలులయిన స్త్రీలను కూడా సంగమచింత బాధిస్తుంది. ఈనాడు నీ ప్రవర్తనతో పితామహుడు, ఇంద్రునితో సహా దేవతలందరూ ఆనందించారు. పూజ్యుడవైన నీవు ఏ పనిమీద ఇక్కడకు వచ్చావు ? అది సఫలమవుతుంది. ద్విజశ్రేష్ఠా ! ఆ కన్యతండ్రి అయిన బ్రాహ్మణుడు నిన్ను పంపించాడు.

---

* పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే ।
పుత్రాశ్చ స్థావిరే కాలే నాస్తి స్త్రీణాం స్వతంత్రతా ॥ 21

నీకు ఉపదేశ మందించటానికే నా దగ్గరకు పంపాడు. అదంతా నేను చేశాను. క్షేమంగా ఇంటికి చేరగలవు. నీకు శ్రమ కూడా కలుగదు. బ్రాహ్మణా ! ఆ కన్యను పెండ్లాడగలవు. నీ ద్వారా ఆమె పుత్రుని పొందగలదు కూడా. తెలియగోరి నీవు నన్ను అడిగావు. దానితో అంతా చక్కగా చెప్పాను. త్రిలోకాలలో నివసించే వారెవరైనా ఎప్పుడూ బ్రాహ్మణ వచనాన్ని అతిక్రమింపరాదు. బ్రహ్మర్షి ! అష్టావక్రా ! నీవు పుణ్యాన్ని సంపాదించుకొన్నావు. ఇంకా ఏమి వినగోరుతున్నావు ? చెప్పు. యథాతథంగా అంతా చెపుతాను. ద్విజశ్రేష్ఠా ! వదాన్యముని నీకోసం నన్ను ప్రసన్నురాలిని చేసికొన్నాడు. ఆయన మీది గౌరవంతో నీకీవిషయం చెప్పాను".

భీష్ముడు చెప్తున్నాడు. 'ఆమె మాట విని ఆ విప్రుడు చేతులు జోడించి నిలిచి, ఆమె అనుమతి తీసికొని తిరిగి ఇంటికి వచ్చాడు. కురునందనా ! ఇంటికి వచ్చి, విశ్రమించి, తన వారిని అడిగి, న్యాయబద్ధంగా ఆ వదాన్యముని దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు (వదాన్యుడు) తన యాత్ర గురించి అడుగగా అష్టావక్రుడు ప్రసన్న చిత్తుడై తాను చూసినదంతా ఇలా చెప్పాడు. "నీ అనుమతితో గంధమాదన పర్వతం దగ్గరకు బయలుదేరాను. దానికి ఉత్తరంగా ఉన్న ప్రదేశంలో ఒక మహాదేవి కనిపించింది. ఆమె నన్ను పరీక్షించి, మీ గురించి కూడా చెప్పింది. తన విషయాన్ని కూడా చెప్పింది. ప్రభూ ! ఆమె అనుమతితో మరలా ఇంటికి వచ్చాను. అప్పుడు ఆ బ్రాహ్మణుడు (వదాన్యుడు) 'నీవు మంచి నక్షత్రంలో నా కుమార్తెను స్వీకరించు. నీవు దానికి పరమయోగ్యుడవు' అన్నాడు. "రాజా ! పరమ ధర్మాత్ముడైన అష్టావక్రుడు 'అలాగే' అని చెప్పి, కన్యను చేతబట్టి ప్రీతిని పొందాడు. పరమ సౌందర్యవతి అయిన ఆ కన్యను భార్యగా పొంది, చింతకు దూరమై తన ఆశ్రమంలో ఆనందంగా నివసింపసాగాడు.

22. మార్కండేయ నారద సంవాదము - బహుప్రాశ్నికము.

యుధిష్ఠిరుడడిగాడు. "మహారాజా ! పుత్రుల ద్వారా పురుషుడు ఎలా ఉద్ధరింపబడతాడు ? పుత్రులు కలిగేంతవరకు పురుషుని జీవితం నిరర్థకమని ఎందుకు భావిస్తారు" ? భీష్ముడు చెప్తున్నాడు. "ఈ విషయమై గతంలో మార్కండేయుడడిగినప్పుడు నారదుడు ఉపదేశించిన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు". ఒకప్పుడు గంగాయమునల మధ్య భోగవతి కలిసే చోట పర్వతుడు, నారదుడు, అసితుడు, దేవలుడు, అరుణేయుడు, రైభ్యుడు ఒక్కసారి కలిశారు. అక్కడ చేరిన వారిని చూసి మార్కండేయుడు కూడా వెళ్ళాడు. ఋషులు మార్కండేయుని చూసి, లేచి, ఆయన ఎదుట నిలిచారు. ఆ విప్రుని (మార్కండేయుని) తగిన రీతిగా పూజించి, "మేము తమకై ఏం చేయాలి" అని అడిగారు.

మార్కండేయుడు చెప్తున్నాడు. "నేను ఎంతో ప్రయత్నంతో ఈ సజ్జనసమాగమాన్ని పొందగలిగాను. ఇక్కడ ధర్మాచార నిర్ణయాన్ని గ్రహించగలనని భావిస్తున్నాను. కృతయుగంలో ధర్మం సరళంగా ఉంటుంది. ఆ కృతయుగం ముగియగానే ధర్మస్వరూప జ్ఞానంలో మనిషి మోహానికి లోనవుతాడు. కాబట్టి ప్రతియుగంలోనూ పాటించవలసిన ధర్మాన్ని మహర్షుల నుండి తెలియగోరుతున్నాను". భీష్ముడు చెప్తున్నాడు. "అప్పుడు ఋషులు నారదునితో తత్త్వజ్ఞా ! ఈ మార్కండేయ మహర్షికి కలిగిన సంశయాన్ని నీవే తీర్చాలి. నీవు ధర్మాధర్మతత్త్వ మెరిగిన వాడవు. సంశయాలను విచ్ఛిన్నం చేయగలవు" అన్నారు. ఋషుల ఆదేశం మేరకు వారి అనుమతి తీసికొని నారదుడు ధర్మాధర్మతత్త్వజ్ఞుడైన మార్కండేయుని ఇలా అడిగాడు. "దీర్ఘాయూ ! బ్రహ్మ స్వరూపా ! నీకు ఏ విషయమై సంశయం కలిగిందో చెప్పు మహా తపస్వీ ! ధర్మాన్ని గురించియా . లోకోపకారాన్ని గురించియా ? మరేదైనా వినగోరుతున్నావా ? చెప్పు. దానిని నేను స్పష్టం చేస్తాను". మార్కండేయుడు అడిగాడు. "యుగమూ, యుగమూ గడిచేకొద్దీ ధర్మసేతువు నశిస్తుంది. ఒకవేళ నేను ధర్మమే అనుకొని అధర్మమాచరిస్తే ఎటువంటి ఫలితం వస్తుందో అని నా సంశయం". నారదుడు చెప్తున్నాడు "బ్రాహ్మణా ! గతంలో కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలతో నిలిచింది. ఆ తరువాత కాలానుగుణంగా అధర్మం వీర్పడి కొంచెం తలెత్తింది ఆ తరువాత ధర్మదూషణ చేసే త్రేతాయుగం ప్రవర్తించింది. అదీ గడచిపోగానే మూడవదైన ద్వాపరయుగం వచ్చింది. అప్పుడు ధర్మానికి రెండే పాదాలు. మిగిలిన రెండు పాదాలను అధర్మం నశింపజేస్తుంది. ద్వాపరం గడచిపోయిన తరువాత కలియుగం వచ్చింది. ఇప్పటి లోకప్రవర్తనను, ధర్మాన్ని గూర్చి చెపుతాను విను. నాలుగవ యుగం వేరు నందికం. ఆ యుగంలో ధర్మం ఒకే పాదంతో నిలిచి ఉంటుంది. అప్పటినుండి మందబుద్ధులు, అల్పాయుష్కులు పుడతారు. ప్రాణశక్తి తక్కువై పోతుంది ధనముండదు. ధర్మాచారాలకు దూరమవుతారు".

మార్కండేయుడు అడిగాడు. "ఈ రీతిగా ధర్మంలోపిస్తే, లోకమంతా అధర్మంతో కూడి ఉంటే నాలుగు వర్ణాల వారికి వీర్పరచిన హవ్యకవ్యాలు నశించవా ?" నారదుడు చెప్తున్నాడు. "హవ్యకవ్యాలు సర్వదా వేదమంత్ర పవిత్రాలు. కాబట్టి అవి నశింపవు. దాత న్యాయబద్ధంగా ఇస్తే దేవతలు, పితరులు వాటిని స్వీకరిస్తారు. సత్త్వగుణంతో కూడిన దాత కోరిన వాటి నన్నింటినీ పొందగలుగుతాడు కోరికలను తీర్చుకొని స్వర్గంలో తన ఇచ్ఛ వచ్చినట్లు వెలుగొందుతాడు." మార్కండేయుడు అడిగాడు. "ఒకవేళ నాలుగు వర్ణాలవారు మంత్రరహితంగా, వరిహోసాస్పదంగా హవ్యకవ్య ప్రదానం చేస్తే, ఆ హవ్యకవ్యాలు ఎక్కడకు వెళ్తాయి ?" హవ్యకవ్యాలను ఆ రీతిగా బ్రాహ్మణుడు సమర్పిస్తే అవి అసురులకు చెందుతాయి క్షత్రియుడు సమర్పిస్తే రాక్షసులకు చెందుతాయి. వైశ్యులు సమర్పిస్తే ప్రేతాలకు చెందుతాయి. శూద్రులు సమర్పిస్తే భూతాలకు చెందుతాయి." మార్కండేయుడు అడిగాడు. "హీనవర్ణంలో పుట్టినవాడు నాలుగు వర్ణాల వారికి ఉపదేశాలు చేస్తూ హవ్యకవ్యాలను సమర్పిస్తే ఆ దానం ఎవరికి చెందుతుంది ?" నారదుడు చెప్తున్నాడు. "హీనజాతివారు సమర్పించిన హవ్యకవ్యాలను దేవతలు కానీ పితరులు కానీ స్వయంగా స్వీకరింపరు. యాతుధానులు, పిశాచులు, భూతాలు, రాక్షసులకు అటువంటి హవ్యకవ్య స్వీకారం వృత్తిగా వీర్పరచబడింది. పితరులు, దేవతలు ఆ వృత్తిని మానివేశారు. సర్వస్వాన్ని ఇవ్వటానికైనా సిద్ధపడి, దానికి తగినవారై, సావధానంగా,

విధి పూర్వకంగా ఇచ్చిన హవ్యకవ్యాలనే దేవతలు, (పితరులు) భుజిస్తారు". మార్కండేయుడు అడిగాడు "నారదా ! హీనజాతివారు సమర్పించిన హవ్యకవ్యాలు ఏమవుతాయో తెలిసింది. కొడుకులు, కూతుళ్ళ విషయంలో, వారి సంయోగ విషయంలో నాకు ఏమైనా చెప్పాలి". నారదుడు చెప్తున్నాడు. "కన్యాదాన విషయంలో పుత్రులు, పుత్రికలు వీరి సంయోగ విషయంలో యథాక్రమంగా చెపుతాను, మిమ్ము కన్యను పుట్టిన వెంటనే తగిన వరునకు దానం చేయాలి. తగిన సమయంలో కన్యాదానం చేస్తే తండ్రి ధర్మపాలన ఫలాన్ని పొందుతాడు. రజస్వల అయిన తరువాత కన్యను దానం చేయకపోతే దానికి కర్తృత్వాన్ని వహించవలసిన వారు ప్రతిమాసం గడిచే కొద్దీ భ్రూణహత్యా పాపఫలాన్ని పొందుతారు. కన్యను విషయోపభోగాలకు దూరంగా ఇంటనే నిర్బంధంగా ఉంచితే, దానికి బాధ్యత వహించవలసినవాడు ఆమె అశుభాన్ని ఆలోచించనందువలన భ్రూణహత్యాపాపఫలాన్ని పొందుతాడు".

మార్కండేయుడు అడిగాడు. "మహామునీ ! మంగళ కార్యక్రమాలలో కన్యలను ఎందుకు నియోగిస్తారు ? దీనిని యథాతథంగా తెలిసికొన గోరుతున్నాను". "కన్యకలలో లక్ష్మి నిత్యనివాసం చేస్తుంది. కన్యకలలో ఆమె ప్రతిష్ఠింపబడింది. కాబట్టి కన్య శోభాసంపన్నయై శుభకర్మలలో, మంగళ కర్మలలో పూజింపదగినది గనిలో ఉన్న రత్నం సర్వకామ ఫలాలనూ అందించగలిగినట్లు మహాలక్ష్మి స్వరూప అయిన కన్య కూడా సర్వలోకానికి మంగళకారిణి అవుతుంది. ఈ రీతిగా కన్య లక్ష్మి యొక్క ఉత్కృష్ట స్వరూపం. ప్రాణులకు సుఖసంతోషాలను కలిగిస్తుంది. తన సదాచారంతో ఉన్నత వంశస్థుల చరిత్రకు ఒరిపిడిరాయి వలె ఉంటుంది. తన కులంనుండియే కన్యకను స్వీకరించి వివాహం చేసికొన్నవాడు ఆమె ద్వారా హవ్యకవ్యాలు సమర్పించే పుత్రుని పొందుతాడు. పతివ్రత కులాన్ని వర్ధిల్లజేస్తుంది. సాధ్వియే ఇంటికి పరమపుష్టి. పతివ్రతయే గృహలక్ష్మి, గృహరతి, రూపుదాల్చిన గృహప్రతిష్ఠ వంశపరంపరకు ఆధారం కూడా. మార్కండేయుడు అడిగాడు. "భగవంతుడా ! మనుష్యుల శరీరాలలో ఏయే తీర్థాలున్నాయి ? వాటి నడుగుతున్నాను. యథాతథంగా చెప్పవలసినది". నారదుడు చెప్తున్నాడు. "మనిషి చేతులో అయిదు తీర్థాలున్నాయని చెపుతుంటారు. (వేళ్ళ చివరన) దేవ తీర్థం (చిటికెన వ్రేలు ఉంగరపు వ్రేళ్ళ మధ్య) ఋషితీర్థం. (బొటన వ్రేలు, చూపుడు వేళ్ళమధ్య) పితృ తీర్థం. (బొటన వ్రేలి క్రింది భాగాన) బ్రాహ్మ తీర్థం. (అరచేతిలో) వైష్ణవ తీర్థం. వైష్ణవ తీర్థం అరచేతిలోనే సర్వతీర్థాలలోనూ ప్రధానం అక్కడ నీటిని నిలిపి ఆచమనం చేస్తే నాలుగు కులాల వారికీ వంశవృద్ధి జరుగుతుంది. ఇహపరలోకాలలో పిత్కకార్యాలు, దైవకార్యాలు వర్ధిల్లుతాయి. మార్కండేయుడడిగాడు. "ధర్మాధికారులకు కూడా అప్పుడప్పుడు మనస్సు వ్యామోహానికి లోనవుతుంది. ధర్మాచరణం భంగపడకుండా ఉండాలంటే ఏంచేయాలి ? దీనిని తెలియగోరుతున్నా". నారదుడు చెప్తున్నాడు. "ధనమూ, స్త్రీలు సమానం. పురుషుని మోహానికి గురిచేసి శ్రేయస్సులను భంగపరుస్తారు. రతిసుఖంతో స్త్రీలు మనస్సును, భోగాలతో ధనాన్ని, ధర్మాన్ని కూడా అపహరిస్తారు. ధర్మాత్ముడైన శ్రోత్రియుడు హవ్యకవ్యాలను స్వీకరించటానికి యోగ్యుడు. సజ్జనుడైన శ్రోత్రియునకిచ్చిన హవ్యకవ్యాలు మండుతున్న అగ్నికి సమర్పించిన ఆహుతులవలె ఫలిస్తాయి. భీష్ముడు చెప్తున్నాడు. "మహా తపస్వి అయిన మార్కండేయుడు ఋషులతో అలా మాటాడి, నారదుని సత్కరించి, ఆయనచే సత్కరింపబడ్డాడు. ఋషుల దగ్గర సెలవు తీసికొని ఆశ్రమానికి వెళ్ళిపోయాడు ఋషులు కూడా తీర్థపరిచర్యను ప్రారంభించారు

యుధిష్ఠిరుడు అడిగాడు. "భరతశ్రేష్ఠా ! ప్రాచీనులు దానానికి తగిన వానిగా ఎవరిని చెప్పారు ? దండాది లక్షణాలు గల బ్రహ్మచారి అయిన బ్రాహ్మణుడా ? లేక లక్షణాలు లేని గృహస్థ బ్రాహ్మణుడా ?" భీష్ముడు చెప్తున్నాడు. "మహారాజా ! జీవనం కోసం తనకు తగిన (ఆశ్రమోచిత) వృత్తిని స్వీకరించినవాడు బ్రహ్మచారి అయినా, గృహస్థుడైనా ఇద్దరూ తపస్సులే. ఇద్దరూ దానానికి అర్హులే". యుధిష్ఠిరుడడిగాడు. "పితామహా ! పరమశ్రద్ధతో మాత్రమే పవిత్రుడైన బ్రాహ్మణునకు హవ్యకవ్యాలను, దానాన్ని ఇస్తే దోషమేమి ?" భీష్ముడు చెప్తున్నాడు. "నాయనా ! మనిషి ఇంద్రియాలను గెలవకపోయినా శ్రద్ధవలననే పవిత్రుడు కావచ్చు. మహాతేజస్వీ ! శ్రద్ధమాత్రంతోనే అంతటా పవిత్రుడు కావచ్చు. ఇక నీ వంటివారి విషయంలో సంశయమే లేదు". యుధిష్ఠిరుడు అడిగాడు. "దైవ కార్యాలలో బ్రాహ్మణుని ఎప్పుడూ పరీక్షింపవలదనీ, శ్రాద్ధకాలంలో మాత్రం పండితులు బ్రాహ్మణుని పరీక్షించియే గ్రహించాలని అంటున్నారు. కారణమేమిటి ?" భీష్ముడు చెప్తున్నాడు. "దైవకార్యాలలో బ్రాహ్మణుడు సిద్ధిదాత కాడు. దైవం వలననే అది సిద్ధిస్తుంది. యజమానులు దైవానుగ్రహంతోనే దేవతలకై యాగాలు చేస్తున్నారు, సంశయం లేదు. భరతశ్రేష్ఠా ! లోకంలో బుద్ధిమంతుడైన నరుడు వేదవేత్తలైన బ్రాహ్మణులనే ఎప్పుడైనా శ్రాద్ధవేళ నియంత్రించాలని మార్కండేయుడెప్పుడో చెప్పాడు". యుధిష్ఠిరుడడిగాడు. "అపరిచిత పండితుడు, సంబంధి, తపస్వి, యజ్ఞశీలుడు – వీరిలో ఎవరు ఎలా దాన స్వీకారానికి యోగ్యులవుతారు ?" భీష్ముడు చెప్తున్నాడు. "కులీనుడు, కర్మశీలుడు, వేదపండితుడు, దయామయుడు, బిడియపడేవాడు, సరళుడు, సత్యవాది – ఈ లక్షణాలు గలవారు పై వారిలో మొదటి ముగ్గురు ఉంటే వారు పూర్తిగా యోగ్యులు. యుధిష్ఠిరా ! ఈ విషయమై పృథివి, కాశ్యపుడు, అగ్ని, మార్కండేయుడు – ఈ నలుగురు తేజస్సుల అభిప్రాయాలు విను.

పృథివి ఇలా అన్నది. "మహా సముద్రంలోనికి విసిరిన రాయి మునిగిపోయినట్టు యాజన, అధ్యాపన, ప్రతిగ్రహాలతో జీవించే బ్రాహ్మణులలో సర్వదుష్కర్మలు లయమవుతాయి." కాశ్యపుడన్నాడు. "రాజా ! బ్రాహ్మణుడు శీలరహితుడైతే సర్వవేదాలు, ఆరు వేదాంగాలు, సాంఖ్యం, పురాణాలు ఉత్తమ వంశ జన్మ – ఇవన్నీ కలిసి కూడా సద్గతిని కలిగించలేవు." అగ్ని ఇలా అన్నాడు. "అధ్యయనం చేసి, తనను తాను పండితునిగా భావించుకొంటూ, పాండిత్యబలంతో ఇతరుల కీర్తికి భంగం కలిగిస్తూ, ధర్మభ్రష్టుడై, సత్యపాలన చేయకపోతే ఆ బ్రాహ్మణుడు అశాశ్వతలోకాలనే పొందుతాడు." మార్కండేయుడిలా

అన్నాడు. "వేయి అశ్వమేధయాగాల ఫలాన్నీ, ఒక సత్యాన్ని త్రాసులో పెట్టి తూస్తే అశ్వమేధ ఫలం సత్యఫలంలో సగం కూడా కాదు". భీష్ముడు చెప్తున్నాడు. "భారతా ! అమిత తేజస్వులైన ఆ నలుగురు పృథివి, కాశ్యపుడు, అగ్ని, మార్కండేయుడు వెంటనే వెళ్ళిపోయారు. యుధిష్ఠిరుడడిగాడు. "బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించే బ్రాహ్మణులు శ్రాద్ధంలో హవిస్సును భుజిస్తే శ్రేష్ఠ బ్రాహ్మణ భావంతో వారికిచ్చిన దానం ఎలా సఫలమవుతుంది ?" భీష్ముడు చెప్తున్నాడు. "రాజేంద్రా ! బ్రహ్మచర్యపాలనకై గురువుచే ఆదేశింపబడిన బ్రాహ్మణులు వేదపారంగతులై, దానం చేయదలచిన యజమాని కోరిక తీర్చటానికి శ్రాద్ధ భోజనం చేస్తే వారి వ్రతం నష్టమవుతుంది". యుధిష్ఠిరు డడిగాడు. "పితామహా ! ధర్మానికి అనేక సాధనాలు, అనేక ఫలాలు ఉన్నాయని మనీషులంటారు. దానికి దానం తీసికొనే వానిలోని ఎ గుణం దానయోగ్యతను కలిగిస్తుందో చెప్పు". భీష్ముడు చెప్తున్నాడు. **అహింస, సత్యం, అక్రోధం, కోమలత్వం, ఇంద్రియ నియంత్రణం, సరళత - ఇవన్నీ నిశ్చితంగా ధర్మ లక్షణాలు.*** ధర్మాన్ని పాటించకుండా, కేవలం ధర్మాన్ని ప్రశంసిస్తూ లోకంలో తిరిగేవారు మోసగాళ్ళు. ధర్మసాంకర్యాన్ని కల్పించటంలో వారు ఆసక్తి చూపుతారు. వారికి బంగారాన్ని కానీ, రత్నాన్ని కానీ, గోవును కానీ, గుర్రాన్ని కానీ దానం చేసినవాడు నరకంలో పడి పది సంవత్సరాల పాటు పెంట తింటాడు. రాగ మోహాలకు లోనై తాను చేసిన లేదా చేయని శుభకర్మను గురించి పదిమంది మధ్య వర్ణించి చెప్పేవాడు మేదులతో, పుల్కసులతో, కడజాతి వానితో సమానంగా చూడబడతాడు. రాజేంద్రా ! మూఢులయిన మానవులు బ్రహ్మచారి అయిన బ్రాహ్మణునకు వైశ్వదేవాన్నాన్ని పెట్టకపోతే వారు అశుభలోకాలను పొందుతారు'.

యుధిష్ఠిరుడడిగాడు. "ఉత్తమ బ్రహ్మచర్యమేది ? ధర్మానికి ఉత్తమ లక్షణమేది ? పరమ శౌచమేది ? పితామహా ! నాకు చెప్పవలసినది". భీష్ముడు చెప్తున్నాడు. "నాయనా ! మద్య మాంసాలను విడనాడటం బ్రహ్మచర్యం కన్న గొప్పది. వేదోక్తమయిన హద్దులో నిలవటం ఉత్తమధర్మం. ఇంద్రియ సంయమనమే శమం". యుధిష్ఠిరుడడిగాడు. "ఏ సమయంలో ధర్మాన్ని ఆచరించాలి ? ఏ సమయంలో అర్థంపై దృష్టిపెట్టాలి ? ఏ వేళలో సుఖించాలి ? పితామహా ! నాకు చెప్పవలసింది". భీష్ముడు చెప్తున్నాడు. "ఉదయం పుట అర్థాన్ని సేవించాలి. ఆపై ధర్మాన్ని పాటించాలి. ఆపై కామాన్ని సేవించాలి. కానీ కామంలో

---

* **అహింసా సత్యమక్రోధః ఆనృశంస్యం దమస్తథా ।**
ఆర్జవం చైవ రాజేంద్ర నిశ్చితం ధర్మలక్షణమ్ ॥ 19

తగుల్కొనరాదు. బ్రాహ్మణులను సమ్మానించాలి. గురువులను పూజించాలి. సర్వప్రాణులకూ అనుకూలంగా ప్రవర్తించాలి. వినయంగా ప్రవర్తించాలి. ప్రియంగా మాటాడాలి. న్యాయాధికారియై అసత్యమాడటం, రాజులదగ్గర చాడీలు చెప్పటం, గురువుల కడ కపటంగా ప్రవర్తించటం బ్రహ్మహత్యతో సమానం. రాజులపై దాడి చేయదగదు. గోవును చంపగూడదు. ఈ రెండింటినీ చేసినవాడు భ్రూణహత్య చేసినట్లే. అగ్నిని ఎప్పుడూ విడిచిపెట్టగూడదు. వేదాలను పరిత్యజించగూడదు. బ్రాహ్మణుని నిందింపదగదు. అవి బ్రహ్మహత్యతో సమానం".

యుధిష్ఠిరుడడిగాడు. "ఎటువంటి బ్రాహ్మణులు సాధువులు ? ఎవరికిచ్చిన దానం మహాఫల మిస్తుంది ? ఎటువంటి బ్రాహ్మణులను భోక్తలను చేయాలి ? పితామహా ! నాకు చెప్పవలసినది". భీష్ముడు చెప్తున్నాడు. 'క్రోధరహితులు, ధర్మాసక్తులు, నిత్య సత్యవాదులు, ఇంద్రియ నియంత్రణలో తత్పరులు అయిన విప్రులు సాధువులు. వారికిచ్చిన దానం మహాఫల ప్రదమవుతుంది. అభిమానహీనులు, సర్వసహులు, దృఢవిచారులు, విజితేంద్రియులు, సర్వభూతహితకారులు, మైత్రీ భావన గలవారు – ఇటువంటి బ్రాహ్మణులకు చేసిన దానం మహాఫలప్రదమవుతుంది. లోభహీనులు, పవిత్రులు, వేదపండితులు, బిడియపడేవారు, సత్యవాదులు, స్వకర్మాసక్తులు అయిన వారికి చేసిన దానం మహాఫల ప్రదమవుతుంది. నాలుగు వేదాలను, వేదాంగాలనూ అధ్యయనం చేసి, ఆరు కర్మలను (అధ్యయన, అధ్యాపన, దాన, ప్రతిగ్రహ, యజన, యాజనాలు) పాటించే ద్విజశ్రేష్ఠుడు దానయోగ్యుడని ఋషులన్నారు. ఇటువంటి గుణాలు గలవానికి ఇచ్చిన దానం మహాఫల ప్రదమవుతుంది. గుణాలతో తగిన వానికి దానమిచ్చినవాడు వేయిరెట్లు ఫలాన్ని పొందగలడు. బుద్ధి, పాండిత్యం, సదాచారం, సౌశీల్యం – వీటిని కూడిన ద్విజోత్తముడు ఒక్కడైనా దానాన్ని స్వీకరిస్తే దాత వంశమంతా ఉద్ధరింపబడుతుంది. అటువంటి గుణవంతునకు ఆవును కానీ, గుర్రాన్ని కానీ, ధనాన్ని కానీ, అన్నాన్ని కానీ, ఇతర ద్రవ్యాలను కానీ ఇస్తే దాతకు మరణానంతరం దుఃఖం కలుగదు. ఇటువంటి ద్విజోత్తముడు ఒక్కడైనా వంశాన్ని మొత్తాన్ని తరింపజేయగలడు. చాలామంది దొరికితే ఇక చెప్పేదేముంది ? కాబట్టి యోగ్యునకై అన్వేషించాలి. బ్రాహ్మణుడు తృప్తి చెందితే సర్వదేవతలు పితరులు, మునులు తృప్తిపడతారు. ఇటువంటి గుణాలు గలిగి, సజ్జన సమ్మతుడైన బ్రాహ్మణుని గురించి విని, దూరం నుండి అయినా రప్పించి, సత్కరించి, సర్వవిధాల అర్చించాలి."

23. నిమంత్రణార్హులు - స్వర్గనరకగాముల లక్షణాలు.

యుధిష్ఠిరుడడిగాడు. "పితామహా ! శ్రాద్ధకాలంలో, దైవ పిత్కకర్మలలో దేవతలు, ఋషులు విధించిన కర్మలను గురించి నీవు చెపితే వినాలనుకొంటున్నాను". భీష్ముడు చెప్తున్నాడు. "మనుష్యుడు శుభాచార సంపన్నుడై, స్నానాదికం చేసి పవిత్రుడై, ప్రయత్నవంతుడై పూర్వాహ్ణంలో దేవ సంబంధ దానాలను, అపరాహ్ణంలో పిత్రసంబంధ దానాలను, మధ్యాహ్న కాలంలో మనుష్య సంబంధ దానాలను చేయాలి. వేళ పాటింపక చేసిన దానం రాక్షస భాగమవుతుందంటారు. ఎవరైనా దాటి వెళ్ళినా, రుచి చూసినా, గొడవపడి తయారు చేసినదైనా, రజస్వల చూసినా ఆ వస్తువు రాక్షసభాగమవుతుందంటారు. భారతా ! లోకులలో ప్రకటించినదైనా, వ్రతహీనునిచే భుజింపబడినా, గుక్కమూచూసినా దానిని కూడా రాక్షస భాగమంటారు. వెంట్రుకలు, కీటకాలు పడినా, తుమ్ముతో దూషితమైనా, కుక్కలు చూసినా, రోదిస్తూ లేదా తిరస్కార పూర్వకంగా ఇచ్చినా దానిని రాక్షసభాగమంటారు. భారతా ! అనుమతి లేకుండా భుజించినా, లేదా ఓంకారోపాసన లేనివారు భుజించినా, శస్త్రాన్ని ధరించి భుజించినా, దురాత్ముడు భుజించినా ఆ అన్నం కూడా రాక్షసభాగమవుతుందంటారు.

దైవకర్మ పిత్కకర్మలలో ఇతరుల ఎంగిలి తిన్నా, ఇతరులు తినగా మిగిలిన దానిని తిన్నా అది రాక్షసభాగమవుతుందంటారు.

నరోత్తమా ! మూడు వర్ణాలవారూ మంత్రహీనమై, క్రియాహీనమైన శ్రాద్ధానికి పరివేషణ చేస్తే అది రాక్షసభాగ మవుతుందంటారు. అభిషారం చేయని ఏ పదార్థానికైనా ఔపాసనపట్టినా, దురాచారులు భుజించినా అది రాక్షసభాగమవుతుందంటారు. భరతర్షభా ! రాక్షసులకు చెందే భాగాలను గురించి చెప్పాను.

ఇకమీద దాన, భోజనాలకై బ్రాహ్మణుని పరీక్షించటాన్ని గురించి విను. రాజా ! పతితులు, జడులు, ఉన్మత్తులు అయిన బ్రాహ్మణులు దైవ కార్యాలలో కానీ, పిత్రకార్యాలలో కానీ నిమంత్రింపబడటానికి యోగ్యులు కారు. రాజా ! బొల్లి, కుష్ఠురోగాలున్నవాడు, నపుంసకుడు, క్షయతో కృశించినవాడు, అపస్మారకుడు, గ్రుడ్డివాడు శ్రాద్ధ నిమంత్రణకు యోగ్యులు కారు. రాజా ! వైద్యుడు, దేవాలయంలో పూజారి, వ్యర్థంగా నియమాలను ధరించేవాడు, సోమరసాన్ని అమ్మేవాడు శ్రాద్ధ నిమంత్రణకు యోగ్యులు కారు. రాజా ! గాయకులు, నర్తకులు, గంతులు వేసేవారు, వాద్యగాళ్ళు, వ్యర్థ ప్రసంగాలు చేసేవారు, కుస్తీలు పట్టేవారు శ్రాద్ధ నిమంత్రణకు యోగ్యులు కారు. రాజా ! శూద్రులచే యాగం

చేయించేవారు, శూద్రులకు చదువు చెప్పేవారు, శూద్రుల శిష్యరికం చేసేవాడు శ్రాద్ధ – నిమంత్రణకు యోగ్యులు కారు. భారతా ! వేతనం తీసికొని చదువు చెప్పేవాడు లేదా వేతనమిచ్చి చదువుకొనే విప్రుడు వారు కూడా శ్రాద్ధ నియంత్రణకు తగరు. ఆ ఇరువురూ వేదాన్ని అమ్ముకొనేవారు. రాజా ! ముందు బ్రాహ్మణ శ్రేష్ముడై కూడా తరువాత శూద్ర స్త్రీని పెండ్లాడిన బ్రాహ్మణుడు సర్వవిద్యల నెరిగిన వాడైనా శ్రాద్ధ – నిమంత్రణకు తగడు. రాజా ! అగ్నిహోత్రం లేని బ్రాహ్మణులు, శవాలను మోసేవారు, దొంగలు, పతితులు శ్రాద్ధ నిమంత్రణకు తగరు. భారతా ! పూర్వ పరిచయం లేనివారు, గ్రామ నాయకులు, పుత్రికా ధర్మం మేరకు పెండ్లాడిన స్త్రీకి జన్మించి, తాత ఇంట పెరుగుతున్నవాడు – వీరు శ్రాద్ధ నిమంత్రణకు యోగ్యులు కారు. రాజా ! అప్పులు చేసేవాడు, వడ్డికి అప్పులు ఇచ్చే నరుడు, ప్రాణులను అమ్ముతూ జీవించేవాడు – వీరు శ్రాద్ధ నిమంత్రణకు యోగ్యులు కారు. భరతర్షభా ! స్త్రీ సొమ్ము మీద బ్రతికేవాడు. వేశ్యల సంబంధం గలవాడు, జపసంధ్యావందనాలు లేనివారు – ఈ బ్రాహ్మణులు శ్రాద్ధనియంత్రణకు యోగ్యులుకారు.

భరతర్షభా ! శ్రాద్ధ క్రియలలో, దైవ క్రియలలో విడువదగిన బ్రాహ్మణుని గురించి చెప్పాను. నిషేధింపబడినా, విశిష్ట కారణాల వలన అనుగ్రహింపదగిన దాతలను, స్వీకర్తలను గురించి విను. రాజా ! వ్రతాలను పాటించేవారు, గుణవంతులు, క్రియాశీలురు, సావిత్రీ జపతత్పరులు – ఇటువంటివారు కర్షకులయినా శ్రాద్ధనిమంత్రణకు తగినవారే. కులీనుడైన బ్రాహ్మణుడు యుద్ధంలో క్షత్రధర్మాన్ని పాటిస్తున్నా నిమంత్రణకు యోగ్యుడే. కానీ నాయనా ! వ్యాపారం చేసే బ్రాహ్మణుని శ్రాద్ధంలో నిమంత్రించరాదు. రాజా ! అగ్నిహోత్రియై, గ్రామవాసియై, దొంగతనాలు చేయక, అతిథిసేవన చేసే విప్రుడు నిమంత్రణకు యోగ్యుడు. భరతర్షభా ! త్రికాలాలలో గాయత్రీజపం చేస్తూ, భిక్షా వృత్తిని స్వీకరించి కర్మ నిష్ముడైన బ్రాహ్మణుడు శ్రాద్ధ నిమంత్రణకు యోగ్యుడు. రాజా ! బ్రతికి చెడ్డవాడు, చెడి బ్రతుకుతున్నవాడు, ఎవ్వరినీ హింసించనివాడు – ఇటువంటి బ్రాహ్మణునిలో స్వల్ప దోషాలున్న నిమంత్రణకు యోగ్యుడే. దంభరహితుడు, వృధావాదాలు చేయనివాడు, సాంగత్యానికి తగినవాడు, భిక్షావృత్తిని ఆశ్రయించినవాడు. ఈ లక్షణాలుగల బ్రాహ్మణుడు నిమంత్రణకు యోగ్యుడు. రాజా ! వ్రతనిష్ఠలేనివాడు, వంచకుడు, దొంగ, జీవులనమ్మి జీవించేవాడు, వ్యాపారి. కానీ తరువాత యాగం చేసి సోమరసం త్రాగాడు. అటువంటి బ్రాహ్మణుడు నిమంత్రణకు తగినవాడే. రాజా ! ముందు దారుణ కర్మలతో ధనాన్ని సంపాదించినా, ఆ తరువాత సర్వవిధాలా అతిథులను సేవించేవాడు. శ్రాద్ధ నిమంత్రణకు

యోగ్యుడు. వేదాన్ని అమ్ముకొని సంపాదించిన ధనాన్ని గానీ, స్త్రీ సంపాదించిన ధనాన్ని కానీ, దీనత్వాన్ని ప్రదర్శించి సంపాదించిన ధనాన్ని గానీ శ్రాద్ధంలో బ్రాహ్మణుల కివ్వరాదు భరతర్షభా ! శ్రాద్ధం ముగిసిన తర్వాత "అస్తుస్వధా" వంటి తత్కాలోచిత వచనాలు పలుకని బ్రాహ్మణుడు గోవు మీద అసత్య ప్రమాణం చేసేవాడు పొందే ఫలాన్ని పొందగలడు. సద్బ్రాహ్మణుడు, పెరుగు, నేయి, అమావాస్య, ఆటవికాలైన కందమూలాలు, ఫలరసం దొరికిన రోజే శ్రాద్ధానికి మంచివేళ.

రోజులోని మొదటి మూడు ముహూర్తాలను ప్రాతఃకాలమంటారు ఆ సమయంలో బ్రాహ్మణులు జపధ్యానాదుల ద్వారా శుభవ్రతాల నాచరించాలి. ఆ తర్వాత మూడు ముహూర్తాలు సంగవం. ఆ తర్వాత మూడు ముహూర్తాలు మధ్యాహ్నం. సంగవకాలంలో లౌకిక కర్మలు, మధ్యాహ్నకాలంలో స్నాన సంధ్యాదులు చేయాలి. మధ్యాహ్నం తర్వాత మూడు ముహూర్తాలు అపరాహ్ణం. ఈ చతుర్దభాగం పితృకార్యాలకు తగినది. తరువాత మూడు ముహూర్తాలు సాయంకాలం. ఇది దివారాత్రుల సంధికాలం.

బ్రాహ్మణశ్రాద్ధం ముగిసిన తరువాత "స్వధా సంపద్యంతామ్' అని చెపితే పితరులు సంతోషిస్తారు. క్షత్రియశ్రాద్ధం ముగిసిన తరువాత 'పితఃప్రీయంతామ్' అని చెప్పాలి. భారతా ! వైశ్యశ్రాద్ధం ముగిసిన తరువాత "అక్షయ్యమస్తు" అని పలికాలి. శూద్రశ్రాద్ధం ముగిసిన తరువాత 'స్వస్తి' అని చెప్పాలి. బ్రాహ్మణుని ఇంట దైవకార్యం జరుగుతున్నప్పుడు ఓంకార సహితంగా పుణ్యాహవాచనం విధి. క్షత్రియుని ఇంట ఓంకార రహితంగా పుణ్యాహవాచనం విధి. వైశ్యుని ఇంట దైవకార్యం జరుగుతుంటే 'ప్రీయంతా దేవతాఃʼ అని పలకాలి. యథాక్రమంగా మూడు వర్ణాల వారికి కర్మానుష్ఠాన విధానాన్ని విను. భారతా ! యుధిష్ఠిరా ! మూడు వర్ణాల వారికి జాతకర్మాది సంస్కారాలు విధింపబడ్డాయి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు ముగ్గురికీ ఇవి మంత్రపూర్వకంగా జరిపించాలి. యుధిష్ఠిరా ! ఉపనయనవేళలో బ్రాహ్మణునకు ముంజెత్రాడు, క్షత్రియునకు అల్లె త్రాడు, వైశ్యునకు మొదవ గడ్డి త్రాడు ధరింపజేయాలి. ఇది ధర్మం.

ద్విజులకు పాలాశ దండం. క్షత్రియునకు అశ్వత్థ దండం. వైశ్యునకు ఔదుంబర దండం వాడాలి. యుధిష్ఠిరా ! ఇది ధర్మం.

దాతకు, ప్రతి గ్రహీతకు సంబంధించిన ధర్మాధర్మాలను విను. అసత్యమాడితే బ్రాహ్మణునకు అధర్మమనీ, పాపమని చెప్పబడినది. అదే క్షత్రియునకు నాలుగురెట్లు, వైశ్యునకు ఎనిమిది రెట్లు పాతకం. ముందే బ్రాహ్మణునిచే నిమంత్రింపబడిన బ్రాహ్మణుడు మరెక్కడా భుజించరాదు. అలా చేస్తే ఆయన కించపడవలసి వస్తుంది. పశుహింసతో సమానమైన పాపమంటుతుంది. అదే రీతిగా క్షత్రియులు గానీ, వైశ్యులుగానీ నిమంత్రించినపుడు

అన్యత్ర భుజిస్తే కించపడటంతో పాటు పశుహింసా పాపంలో అర్ధభాగాన్ని పొందవలసి వస్తుంది. రాజా ! బ్రాహ్మణుడు బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల ఇండ్లలో దేవయజ్ఞ పితృకార్యాల వేళలో స్నానం చేయకుండా భుజిస్తే గోవు మీద అసత్య ప్రమాణం చేస్తే వచ్చే ఫలితాన్ని పొందుతాడు. రాజా ! బ్రాహ్మణుడు తన ఇంట అశౌచంతో ఉండి, అది తెలిసి కూడా బ్రాహ్మణుల ఇళ్ళలో, లోభంతో శ్రాద్ధ భోజనం చేస్తే గోవుమీద అసత్య ప్రమాణం చేస్తే వచ్చే ఫలాన్ని పొందుతాడు. ఏదో ప్రయోజనాన్ని సాకుగా చూపి, తన జీవికకై ఇతరుల దగ్గర నుండి ధనం గ్రహించిన వాడు అసత్య పాపాన్ని పొందుతాడు. యుధిష్ఠిరా ! వేదవ్రతపాలన చేయని బ్రాహ్మణుడు కానీ, క్షత్రియుడు కానీ, వైశ్యుడు కానీ బ్రాహ్మణుని ఇంట మంత్రాలు పలికి, ఔపాసన పట్టి శ్రాద్ధ భోజనం చేస్తే గోవుమీద అసత్య ప్రమాణం చేసిన ఫలితాన్ని పొందుతాడు."

యుధిష్ఠిరుడడిగాడు. "పితామహా ! దైవకర్మలు కానీ, పితృకర్మలు కానీ దానాలు చేస్తుంటాం. ఎవరికి దానం చేస్తే మహా ఫలితం కలుగుతుందో ? దీనిని తెలిసి కోవాలనుకొంటున్నాను". భీష్ముడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరా ! వ్యవసాయదారులు వానకై ఎదురుచూసినట్లు, ఎవని ఇంట స్త్రీలు భర్తగా తినగా మిగిలిన అన్నంకోసం ఎదురు చూస్తుంటారో అటువంటి వారికి భోజనం పెట్టు. రాజా ! సదాచార పరాయణులై, జీవికను పోగొట్టుకొని, కృశించి, యాచకులై వచ్చిన వారికి ఇచ్చిన దానం మహాఫలాన్ని ఇస్తుంది. రాజా ! సదాచార భక్తులై, సదాచారమే పాటిస్తూ, సదాచారమే బలంగా, సదాచారాన్నే ఆశ్రయించిన వారు యాచకులై వస్తే వారికిచ్చిన దానం మహాఫలాన్ని ఇస్తుంది. యుధిష్ఠిరా ! దొంగలవలన కానీ, శత్రువుల వలన కానీ భయపీడితులై, యాచకులై భుజించాలన్న కోరికతో వచ్చిన వారికి ఇచ్చిన దానం మహాఫలాన్నిస్తుంది. మనస్సులో ఏ విధమైన కపటత్వమూ లేనివాడు, కటిక దారిద్ర్యం వలన దొరికిన అన్నం చేతిలో ఉండగానే "నాకు నాకు" అంటూ పిల్లలను తీసికొనిపోయేవాడు - ఇటువంటి దరిద్ర బ్రాహ్మణునకు, ఆ పిల్లలకు ఇచ్చిన దానం మహాఫలాన్ని ఇస్తుంది. దేశంలో ఉపద్రవం కలిగినప్పుడు ధనాన్ని, భార్యను కోలుపోయి ధనాన్ని యాచిస్తూ వచ్చిన బ్రాహ్మణులకు చేసిన దానం మహాఫలాన్ని ఇస్తుంది. వేద సమ్మతమైన రీతిలో నియమబద్ధంగా వ్రతపాలన చేస్తూ, ఆవ్రత సమాప్తికై అర్థాన్ని కోరుతూ వచ్చిన బ్రాహ్మణులకు ఇచ్చిన దానం మహాఫలాన్ని ఇస్తుంది. పాషండ ధర్మాలకు బాగా దూరంగా ఉంటూ ధనం, అన్నం లేనందువలన కృశించి ఉన్న బ్రాహ్మణులకు ఇచ్చిన దానం మహాఫలాన్ని ఇస్తుంది.

పండితుల వ్రతపారణకై, గురుదక్షిణకై, యజ్ఞ దక్షిణకై, వివాహానికై ధనాన్ని కోరినప్పుడు వారికిచ్చే దానం మహాఫలాన్ని ఇస్తుంది. తల్లిదండ్రుల సంరక్షణకై, భార్యాపుత్రుల కోసమై, మహారోగ విముక్తికై ధనాన్ని కోరినప్పుడు వారికిచ్చిన దానం మహాఫలాన్ని ఇస్తుంది. బాలురు, స్త్రీలు ఏ సాధనాలూ లేకపోయినా, మంచి అన్నాన్ని కోరినప్పుడు వారికై దానం చేస్తే దాత స్వర్గానికి వెళతాడు. నరకంలో పడడు.

శక్తిమంతులైన దొంగలు ఏ అపరాధమూ చేయని మనుష్యుల సర్వస్వాన్ని అపహరించినపుడు అన్నార్థులై వచ్చిన వారికి చేసిన దానం మహాఫలాన్ని ఇస్తుంది. తపస్సులై, తపోనిష్ఠులై, బిచ్చమెత్తుకొని జీవించేవారు ఆ జనుల కోసమై యాచకులై ఏదైనా కోరినప్పుడు వారికిచ్చిన దానం మహాఫలాన్ని ఇస్తుంది.

భరతర్షభా ! మహాఫలాన్ని అందించే దాన విధిని గూర్చి చెప్పాను. ఇక ఏ పనుల వలన నరకానికో, స్వర్గానికో వెళతారో వాటిని గురించి చెపుతా, విను. యుధిష్ఠిరా ! గురువు కోసమో, అభయదానం కోసమో తప్ప ఇతరత్ర అసత్యమాడేవారు తప్పక నరకానికి వెళతారు. పరదారలను అపహరించేవారు, పరదారలను చెరిచేవారు, పరదారలను అన్య స్త్రీలకై వినియోగించుకొనేవారు తప్పక నరకానికి వెళతారు. పరుల సొమ్మును అపహరించే వారు, పరుల సొమ్మును నాశనం చేసేవారు, పరులపై చాడీలు చెప్పేవారు తప్పక నరకానికి వెళతారు. భారతా ! చలివేంద్రాలను, సభలను, వంతెనలను, ఇతరుల ఇండ్లను కూలగొట్టేవారు తప్పక నరకానికి వెళ్తారు. అనాథలు, బాలలు, వృద్ధులు, తపస్వినులు, పిరికివారు అయిన స్త్రీలను వంచించే నరులు తప్పక నరకానికి పోతారు. భారతా ! ఇతరుల వృత్తిని, ఇంటిని, దాంపత్యాన్ని, మైత్రిని, ఆశను భంగపరచేవారు తప్పక నరకానికి వెళతారు. చాడీలు చెప్పేవారు, వంతెనలను కూలగొట్టేవారు, ఇతరుల వృత్తిపై ఆధారపడి బ్రతికేవారు, మిత్రులు చేసిన మేలు మరచేవారు తప్పక నరకానికి వెళతారు. పాషండులు, ఇతరులను నిందించేవారు, నియమాలతో విరోధించేవారు, సంన్యాసం తీసికొని మరలా గృహస్థాశ్రమంలో ప్రవేశించినవారు తప్పక నరకానికి పోతారు. అందరితో సమానంగా వ్యవహరించని వారు, ఎదుగుతున్నప్పుడు సమదృష్టిని ప్రదర్శించనివారు, లాభాలను పొందినప్పుడు సమంగా పంచనివారు తప్పక నరకానికి వెళతారు. ఇతరులను పరీక్షించటానికి శక్తిలేకపోయినా, దూతగా వ్యవహరించటానికి సిద్ధపడే మానవులు, ప్రాణిహింస చేసేవారు తప్పక నరకానికి వెళతారు. సేవకులకు ఏదో ఇస్తామని ఆశపెట్టి, పనిని చెప్పి, శ్రమపడి పనిచేసిన తరువాత భత్యాన్ని ఇవ్వవలసినప్పుడు భేదనీతితో పని నుండి తొలగింపజేసేవారు తప్పక నరకానికి పోతారు. పితృయాగాలను, దేవయాగాలను విడనాడి, అగ్నికి ఆహుతి

నివ్వకుండా, అతిథులకు, సేవకులకు, భార్యకు, బిడ్డలకు అన్నం పెట్టకుండానే తాము తినేవారు తప్పక నరకానికి వెళతారు. వేదాన్ని అమ్ముకొనేవారు, వేదాలను నిందించేవారు, వేదాలను లిఖించేవారు తప్పక నరకానికి పోతారు. నాలుగు ఆశ్రమాలకూ, వేదమర్యాదలకు దూరంగా నిలిచి శాస్త్ర విరుద్ధ కర్మలతో జీవించే నరులు తప్పక నరకానికి వెళతారు. రాజా ! వెంట్రుకలను విక్రయించేవారు, విషాన్ని అమ్మేవారు, పాలను అమ్మేవారు తప్పక నరకానికి పోతారు. యుధిష్ఠిరా ! బ్రాహ్మణులకు, గోవులకు, కన్యలకు హితాన్ని కలిగించే కార్యాలలో, మధ్యలో చొరబడి భంగపరచేవారు తప్పక నరకానికి వెళతారు. యుధిష్ఠిరా ! శస్త్రాలను విక్రయించేవారు, ధనుర్బాణాలను తయారుచేసే బ్రాహ్మణులు తప్పక నరకానికి పోతారు. భరతర్షభా ! రాళ్ళతో కానీ, శంకువులతో (ముళ్ళతో) కానీ, గుంటలు త్రవ్వికానీ దారుల నడ్డగించేవారు తప్పక నరకానికి వెళతారు. భరతర్షభా ! ఉపాధ్యాయులు, సేవకులు, భక్తులు ఈ ముగ్గురిలో ఏ మార్పులేకపోయినా వీరిని విడనాడేవారు నరకానికి పోతారు. లొంగని వాటిని లొంగదీస్తూ, ముక్కులు కుట్టి ముకుత్రాడు వేస్తూ, పశువులను బంధించేవారు తప్పక నరకానికి వెళతారు. బలులను, ఆదాయంలో ఆరవ భాగాన్ని తస్కరిస్తూ కూడా ప్రజలను రక్షించని రాజు, ఇవ్వగలిగి కూడా ఇవ్వనివారు తప్పక నరకానికి పోతారు.

మాట ఇచ్చి దానమివ్వనివారు, దరిద్రులను నిందించేవారు, వినీతులై విశేషించి దరిద్రులై, సహన శీలురైన శ్రోత్రియులను నిందించేవారు తప్పక నరకానికి వెళతారు

సహనశీలురు, జితేంద్రియులు అయిన ప్రాజ్ఞులతో చాలాకాలం కలిసి నివసించి, పని ముగిసిన పిమ్మట పరిత్యజించే వారు తప్పక నరకానికి వెళతారు. బాలురకు, వృద్ధులకు, సేవకులకు ఇవ్వకుండా ముందుగా తామే భుజించే నరులు తప్పక నరకానికి పోతారు. భరతర్షభా ! ముందు చెప్పినట్లుగా ముందుగా నరకానికి వెళ్ళేవారిని గురించి చెప్పాను. స్వర్గానికి వెళ్ళే వారిని గురించి చెపుతాను విను. భారతా ! ముందుగా దేవతలను పూజించే సర్వకార్యాలలోను బ్రాహ్మణులకు అవమానం జరిగితే, అవమానం దానికి కారకుడైన వాని పుత్రులను, పశువులను పూర్తిగా నాశనం చేస్తుంది.

యుధిష్ఠిరా ! దానంతో, తపస్సుతో, సత్యంతో ధర్మాన్ని అనుసరించే నరులు స్వర్గానికి వెళతారు. భారతా ! శుశ్రూష ద్వారా, తపస్సు ద్వారా విద్యను పొంది, ప్రతిగ్రహం (దానం పట్టడం) మీద ఆసక్తి లేని నరులు స్వర్గానికి వెళతారు. ప్రయత్నించి ఇతరులకు భయం నుండి, పతనం నుండి, బాధ నుండి, దారిద్ర్యం నుండి, వ్యాధి పీడనుండి విముక్తి కలిగించిన వారు స్వర్గానికి వెళతారు. క్షమాశీలులై ధీరులై, ధర్మకార్యాలకై

ఉద్యమిస్తూ, మంగళా చార సంపన్నులైన పురుషులు స్వర్గానికి వెళతారు. మధువును, మాంసాన్ని విడిచిపెట్టినవారు, పరదారాసక్తి లేనివారు, మద్యపానం నుండి మరలిన నరులు స్వర్గానికి వెళతారు. భారతా ! ఆశ్రమాలను, వంశాలను, దేశాలను, నగరాలను నిర్మించిన నరులు స్వర్గానికి వెళతారు. వస్త్రాలను, ఆభరణాలను దానం చేసేవారు, బత్తెమును, అన్న పానాలను ఇచ్చేవారు, ఇతరుల కుటుంబాల అభివృద్ధికి సహకరించే పురుషులు స్వర్గానికి వెళతారు. సర్వహింస నుండి మరలి, అన్నింటినీ సహిస్తూ, అందరికీ ఆశ్రయంగా ఉన్న నరులు స్వర్గానికి వెళతారు. జితేంద్రియులై, తల్లిదండ్రుల శుశ్రూష చేస్తూ, సోదరులతో స్నేహంతో ప్రవర్తించే నరులు స్వర్గానికి వెళతారు. భారతా ! సంపన్నులై, బలశాలులై, యౌవనస్థులై కూడా జితేంద్రియులైన ధీరనరులు స్వర్గానికి వెళతారు. తప్పు చేసిన వారితో స్నేహంతో, మృదు స్వభావంతో, మృదు స్వభావులపై వాత్సల్యంతో, ఇతరులను ఆరాధించటంలో సుఖ భావనతో ప్రవర్తించే పురుషులు స్వర్గానికి వెళతారు. తన చుట్టూ వేలమంది ఉన్నవారు, వేలకొలదిగా దానం చేసేవారు, వేలమందిని కాపాడేవారు. ఇటువంటి నరులు స్వర్గానికి వెళతారు. భరతర్షభా ! సువర్ణదానం, గోదానం, పల్లకీదానం, వాహన దానం చేసే నరులు స్వర్గానికి వెళతారు. యుధిష్ఠిరా ! సేవకులకు వివాహానికి అవసరమైన ద్రవ్యాలను, వస్త్రాలను దానం చేసే నరులు స్వర్గానికి వెళతారు. విప్రుల కోసం ఆశ్రమాలను, ఇళ్ళను, ఉద్యానవనాలను, బావులను, తోటలను, సభలను, చలివేంద్రాలను ఏర్పాటు చేసే నరులు స్వర్గానికి వెళతారు. భారతా ! యాచకుల కోరికననుసరించి నివాస గృహాలను, పాలాలను, గోవులను దానం చేసే నరులు స్వర్గానికి వెళతారు. యుధిష్ఠిరా ! రసాలను, గింజలను, ధాన్యాలను స్వయంగా పండించి ఇచ్చిన పురుషులు స్వర్గానికి వెళతారు. ఏ వంశంలో (కులంలో) పుట్టినా అనేక పుత్రులను పొంది, కోపాన్ని జయించి, దయాపూర్వకంగా నూరేళ్ళు బ్రతికిన పురుషులు స్వర్గానికి వెళతారు. భారతా ! పరలోకంలో శుభాన్ని కలిగించే దైవపితృ కార్యాలను గురించి ప్రాచీన మునులు చెప్పిన దానధర్మాల గురించి, దాన ఫలాన్ని గురించి చెప్పాను."

24. బ్రహ్మహత్యతో సమానమైన పాపాలు.

యుధిష్ఠిరుడడిగాడు. "రాజా ! భారతా ! ఈ విషయం నాకు యథాతథంగా చెప్పు. బ్రాహ్మణుని హింసించకపోయినా బ్రహ్మహత్యా పాపం ఎలా వస్తుంది". భీష్ముడు చెప్తున్నాడు. "రాజేంద్రా ! గతంలో వ్యాసుని పిలిపించి నేను ఇలాగే అడిగాను. ఆయన

నాకు చెప్పినది నీకు చెప్తాను. సావధానంగా విను. నేనిలా అడిగాను. "మునీ ! నీవు వసిష్ఠని వంశంలో నాలుగవ తరం వాడివి. యథాతథంగా చెప్పు. హింసింపక పోయినా బ్రహ్మహత్యా పాతకం ఏ కారణంతో వస్తుంది." రాజా ! నేనలా అడగగానే పరాశరసుతుడైన ధర్మ నిష్ణాతుడైన వ్యాసుడు నిస్సంశయంగా ఈ గొప్ప విషయాన్ని చెప్పాడు. "వృత్తి నశించి, భిక్షార్థియై ఉన్న బ్రాహ్మణుని స్వయంగా పిలిపించి, ఆపై 'లేదు' అని చెప్పిన వానిని బ్రహ్మహత్య చేసినవానిగా తెలిసికోవాలి. భారతా ! అనూచానంగా తటస్థంగా ఉన్న బ్రాహ్మణుని వృత్తితో, దుర్బుద్ధితో హరించినవాడు బ్రహ్మఘాతి అని గ్రహించాలి. రాజా ! దప్పికతో గోవుల మంద నీరుత్రాగబోతుంటే దానికి విఘ్నాన్ని కలిగించినవాడు బ్రహ్మఘాతి అని గ్రహించాలి. ఉత్తమ కర్మను విధించే శ్రుతిని, మునులు రచించిన శాస్త్రాన్ని అవగాహన చేసికోలేక దూషించిన వాడు బ్రహ్మహత్య చేసినట్లు భావించాలి. గొప్ప రూప సంపదగల పుత్రికను తగినవరునికి ఇచ్చి కన్యాదానం చేయనివాడు బ్రహ్మఘాతి అని గ్రహించాలి. అధర్మాసక్తుడైన మూఢుడు నిష్కారణంగా బ్రాహ్మణులకు మర్మచ్ఛేదకమైన శోకాన్ని కలిగించినవాడు బ్రహ్మఘాతి అని గ్రహించాలి. గ్రుడ్డివాడు, కుంటివాడు, మూగవాడు - వీరి సర్వస్వాన్ని అపహరించినవాడు బ్రహ్మఘాతి అని తెలిసికోవాలి. మోహానికి లోనై ఆశ్రమంలో కానీ, వనంలో కానీ, గ్రామంలో కానీ, నగరంలోకానీ నిప్పంటించినవాడు బ్రహ్మఘాతి అని గ్రహించాలి."

25. వివిధ తీర్థ మహిమలు.

యుధిష్ఠిరు డడిగాడు. "భరతర్షభా ! తీర్థదర్శనం, తీర్థస్నానం, తీర్థశ్రవణం కూడా శ్రేయోదాయకం. మహాప్రాజ్ఞా ! యథాతథంగా తీర్థవర్ణన వినాలనుకొంటున్నాను. భరతర్షభా ! రాజా ! భూమిపై నున్న పుణ్యతీర్థాలన్నిటి గురించి చెప్పవలసినది. నియమ పూర్వకంగా వాటిని గురించి వింటాను". భీష్ముడు చెప్తున్నాడు. "మహాతేజస్వీ ! గతంలో అంగిరసుడు ఈ తీర్థ సముదాయాన్ని గురించి చెప్పాడు. విను ! నీకు మేలు జరుగుతుంది. ఉత్తమ ధర్మఫలాన్ని పొందగలవు.

ఒకప్పుడు ధీరుడు, మహాముని అయిన అంగిరసుడు తన తపోవనంలో ఉండగా దృఢవ్రతశీలుడైన గౌతముడు ఆయనను సమీపించి ఇలా అడిగాడు. "భగవంతుడా ! తీర్థాలకు సంబంధించి నాకొక ధర్మ సందేహమున్నది. దానినంతా వినగోరుతున్నాను. మహామునీ ! నాకు చెప్పవలసినది. మునీ ! ఆ తీర్థాలలో స్నానం చేసినందువలన

మరణానంతరం ఎటువంటి ఫలం లభిస్తుంది. మహాప్రాజ్ఞా ! దానిని ఉన్నదున్నట్లు చెప్పవలసింది. అంగిరసుడు చెప్తున్నాడు ! మనిషి ఉపవాసముండి చంద్ర భాగలో, తరంగమాలిని అయిన వితస్తలో ఏడు రోజుల పాటు స్నానం చేస్తే మునివలె నిర్మలుడవుతాడు. కాశ్మీర మండలంలో ఎన్నో నదులు వచ్చి మహానదియైన సింధువులో కలుస్తాయి. ఆ నదులలోనూ, సింధువులోనూ స్నానం చేసినవాడు శీలవంతుడై మరణానంతరం స్వర్గాన్ని పొందుతాడు. పుష్కరం, ప్రభాసం, నైమిశారణ్యం, సాగరోదకం, దేవిక, ఇంద్రమార్గ, స్వర్ణ బిందువు - వీటిలో స్నానం చేసినవాడు విమానంలో స్వర్గానికి వెళతాడు. అక్కడ అచ్చరల స్తుతులతో మేల్కొంటాడు. మనస్సును, ఇంద్రియాలను నియంత్రించి, హిరణ్య బిందువులో స్నానమాడి, అక్కడున్న కుశేశయ దేవునకు నమస్కరించిన వాడు పాపవిముక్తుడు అవుతాడు. గంధమాదనం దగ్గరున్న ఇంద్రతోయలో, కురంగ క్షేత్రంలోని కరతోయలో నియతమనస్కుడై, పవిత్రుడై మూడు రోజుల పాటు ఉపవాసం చేసి, స్నానం చేసిన నరుడు అశ్వమేధయాగ ఫలాన్ని పొందుతాడు. గంగా ద్వారంలో, కుశావర్తంలో, బిల్వకంలో, నీల పర్వతంలో, కనఖలలో స్నానం చేసినవాడు పాప విముక్తుడై స్వర్గానికి వెళతాడు. బ్రహ్మచారియై, సత్యసంధుడై, క్రోధాన్ని జయించి, హింసకు దూరంగా ఉన్నవాడు. సలిలహ్రదంలో స్నానం చేసి అశ్వమేధయాగ ఫలితాన్ని పొందగలడు.

ఉత్తర దిక్కున గంగానది మూడు పాయలుగా నేలకు దిగే చోటు మహేశ్వర త్రిస్థానం. అక్కడ ఉపవాసం చేస్తూ నెల రోజులపాటు గంగాస్నానం చేసిన నరుడు దేవతలను దర్శించ గలుగుతాడు. సప్త గంగలో, త్రిగంగలో, ఇంద్రమార్గంలో పితరులకు తర్పణం చేసినవాడు మరుసటి జన్మలో అమృతాన్ని భోజనంగా పొందుతాడు. అగ్నిహోత్ర తత్పరుడై, శుచియై, నెల రోజులపాటు నిరాహారంగా మహాశ్రమ తీర్థంలో స్నానం చేసినవాడు నెల రోజులలోనే సిద్ధిని పొందుతారు. మూడు రాత్రులు ఉపవాసం చేసి, లోభరహితుడై భృంగుతుంగ క్షేత్రంలోని మహాహ్రదంలో స్నానం చేసినవాడు బ్రహ్మహత్యాపాతకం నుండి విముక్తినందగలడు. కన్యాకూపంలో స్నానం చేసి, బలాకా తీర్థంలో తర్పణం చేసిన నరుడు దేవతలలో కీర్తిని పొందుతాడు. యశస్సుతో ప్రకాశిస్తాడు. దేవికలో స్నానం చేసి, ఆపై సుందరికా కుండంలో అశ్వినీ తీర్థంలో స్నానమాడినవాడు మరుసటి జన్మలో మంచి రూపాన్ని తేజస్సును పొందగలడు. పది రోజులపాటు ఉపవాసం చేసి మహాగంగలోనూ, కృత్తికాంగారక తీర్థంలోనూ స్నానం చేసినవాడు పాపరహితుడై స్వర్గాన్ని చేరగలడు. వైమానిక తీర్థంలోనూ, కింకిణికాశ్రమ తీర్థంలోనూ స్నానం చేసినవాడు అప్సరసలు

సేవించే దివ్యనివాసంలో కామచారియై వెలుగొందగలడు. బ్రహ్మచారియై, క్రోధరహితుడై కాలికా శ్రమంలో స్నానం చేసి, విపాశలో తర్పణమిచ్చి, మూడు రాత్రులు అక్కడే వసించిన వాడు సంసారబంధ విముక్తుడవుతాడు. కృత్తికాశ్రమంలో స్నానం చేసి, పితరులకు తర్పణం చేసి, మహాదేవుని తృప్తిపరచినవాడు పాపవిముక్తుడై స్వర్గాన్ని చేరగలడు. మూడు రాత్రులు ఉపవాసం చేసి, పవిత్రుడై మహాపుర తీర్థంలో స్నానంచేసిన వాడు చరాచర ప్రాణుల నుండి, మనుష్యుల నుండి భయాన్ని విడువగలుగుతాడు. ఏడు రాత్రులు ఉపవాసం చేసి, పవిత్రుడై దేవదారువనంలో స్నానం చేసి, తర్పణం చేసినవాడు పాపవిముక్తుడై దేవలోకాన్ని చేరగలడు. శరస్తంబం, కుశస్తంబం, ద్రోణశర్మ పదం - ఈ మూడు జలపాతాల్లో స్నానం చేసినవాడు అప్సరోగణాల సేవలను పొందగలడు. నిరాహారుడై చిత్రకూటంలోని మందాకినీ జలంలో, జనస్థానంలోని గోదావరీ నదిలో స్నానం చేసినవాడు రాజ్యలక్ష్మీ సేవలను పొందుతాడు. శ్యామాశ్రమానికి వెళ్ళి అక్కడే నివసిస్తూ, స్నానం చేస్తూ, నిరాహారంగా పక్షం రోజులపాటు గడిపినవాడు అంతర్ధాన ఫలాన్ని పొందగలడు. కౌశికీ తీర్థాన్ని చేరి, స్నానం చేసి, గాలిమాత్రమే భుజిస్తూ, లోభరహితుడై ఇరవై యొక్క రాత్రులు గడిపిన నరుడు స్వర్గాన్ని చేరుతాడు.

మతంగవాసిలో స్నానం చేసినవాడు ఒక్క రాత్రిలో సిద్ధిని పొందుతాడు. అనాలంబ తీర్థంలో, అంధకతీర్థంలో, సనాతన తీర్థంలో స్నానం చేసి, నైమిషారణ్యంలోని స్వర్గతీర్థంలో స్నానం చేసి, జితేంద్రియుడై నెలరోజులపాటు పితృతర్పణం చేసినవాడు నరమేధయాగఫలాన్ని పొందగలడు. గంగాహ్రదంలోనూ, ఉత్పలావనంలోనూ స్నానం చేసి, అక్కడ నెలరోజులుపాటు పితృతర్పణం చేసినవాడు అశ్వమేధ యాగఫలాన్ని పొందుతాడు. గంగాయమునల సంగమ తీర్థంలో, కాలంజరగిరి తీర్థంలో స్నానం చేసి, నెల రోజులపాటు పితృతర్పణం చేసినవాడు పది అశ్వమేధయాగాల ఫలితాన్ని పొందగలడు. షష్టిహ్రద తీర్థంలో స్నానం చేస్తే అన్నదాన ఫలంకన్న విశేషఫలం లభిస్తుంది. భరతర్షభా ! మాఘమాసంలో అమావాస్యనాడు ప్రయాగలో మూడు కోట్ల పదివేల సంఖ్యలో ఇతర తీర్థాలు కూడా సంగమిస్తాయి. కాబట్టి నియమబద్ధంగా, కఠిన వ్రత దీక్షతో మాఘమాసంలో ప్రయాగలో స్నానం చేసినవాడు పాప విముక్తుడై స్వర్గాన్ని చేరగలడు. పవిత్రుడై మరుద్గణ తీర్థంలో, పితరుల ఆశ్రమంలో, వైవస్వత తీర్థంలో స్నానం చేసినవాడు తాను తీర్థరూపాన్ని పొందగలడు. అలాగే బ్రహ్మ సరోవరం (పుష్కరతీర్థం)లోనూ, గంగలోనూ స్నానం చేసి, పితృతర్పణం చేస్తూ, నిరాహారంగా, నెల రోజులపాటు అక్కడ గడిపినవాడు చంద్రలోకాన్ని చేరగలడు. ఉత్పాతకతీర్థంలో స్నానం చేసి, అష్టావక్ర తీర్థంలో తర్పణం చేస్తూ, పన్నెండు రోజులపాటు

అక్కడే నిరాహారంగా ఉన్నవాడు నరమేధయాగఫలాన్ని పొందగలడు. గయలో అశ్మ పృష్ఠంలో, నిరవింద పర్వతంపై, క్రౌంచ పదీతీర్థంలో పితరులకు పిండ ప్రదానం చేస్తే వరుసగా మూడు బ్రహ్మహత్యా పాతకాల నుండి ముక్తిని పొంది పరిశుద్ధుడవుతాడు. కలవింక తీర్థంలో స్నానం చేస్తే పుష్కలంగా నీటిని పొందుతాడు. అగ్నిపుర తీర్థంలో స్నానం చేసిన నరుడు అగ్ని కన్యాపురంలో నివసిస్తాడు. కరవీరపురతీర్థంలో స్నానం చేసి, విశాలలో తర్పణం చేసి, దేవహ్రదంలో స్నానం చేసినవాడు బ్రహ్మస్వరూపుడవుతాడు.

జితేంద్రియుడై, హింసకు దూరంగా నిలిచి ఆవర్తనందలో మహానందా తీర్థంలో స్నానం చేసిన వానిని నందనవనంలో అప్సరసలు సేవిస్తారు. కార్తీక మాసంలో పూర్ణిమా, కృత్తికానక్షత్రాలు కలిసినప్పుడు ఏకాగ్రతతో, యథావిధిగా ఉర్వశీ తీర్థంలో, లౌహిత్య తీర్థంలో స్నానం చేసినవాడు పుండరీక యాగఫలాన్ని పొందగలడు. రామహ్రదంలో స్నానం చేసి, విపాశం నదిలో తర్పణం చేసి, పన్నెండు రోజులపాటు ఉపవాసంతో గడిపినవాడు పాపం నుండి విముక్తినందగలడు. మహాహ్రదంలో స్నానం చేసి, పవిత్ర హృదయంతో అక్కడ నెలరోజులపాటు ఉపవాసంతో గడిపినవాడు జమదగ్ని పొందిన గతిని పొందగలడు. హింసను వీడి, సత్యసంధుడై, వింధ్య పర్వతంపై శరీరాన్ని తపింపజేసికొంటూ వినయ భావంతో తపస్సు చేసిన వాడు నెలరోజులలో సిద్ధిని పొందగలడు. అలాగే నర్మదా నదిలోనూ, శూర్పారక క్షేత్రంలోని నీటిలోనూ స్నానం చేసి, పక్షం రోజులపాటు ఉపవాసం చేసిన వాడు రాజకుమారుడుగా జన్మించగలడు. జంబూమార్గంలో మూడు నెలల పాటు మామూలుగా స్నానం చేసినా, తీవ్ర సావధానంగా ఇంద్రియాలను నియంత్రించి ఒక్కరోజు స్నానం చేసినా సిద్ధిని పొందవచ్చు. కోకాముఖంలో స్నానం చేసి, ఆపై అంజలికాశ్రమంలో నారచీరలుదాల్చి, ఆకులు తింటూ గడిపినవాడు కన్యాకుమారీ తీర్థాన్ని పదిసార్లు సేవించిన పుణ్యాన్ని పొందగలడు. తానెప్పుడూ యమలోకానికి వెళ్లడు. కన్యాకుమారీ తీర్థంలో నివసించేవాడు దేవలోకానికి వెళతాడు. ఏకాగ్రచిత్తుడై, అమావాస్యనాడు ప్రభాస తీర్థంలో స్నానం చేస్తే ఆ నరుడు ఒక్క రాత్రిలోనే సిద్ధిని పొందగలడు. మరణానంతరం దేవత కాగలడు. ఉజ్జానక తీర్థంలో స్నానమాడి, ఆ తరువాత ఆర్టిషేణుని ఆశ్రమంలోనూ, పింగ యొక్క ఆశ్రమంలోనూ స్నానం చేసినవాడు సర్వపాప విముక్తిని పొందగలడు. కుల్యలో స్నానం చేసి, అఘమర్షణ మంత్రాన్ని జపించి, అక్కడ మూడురాత్రులు ఉపవసించిన నరుడు అశ్వమేధ యాగఫలాన్ని పొందగలడు. పిండారక తీర్థంలో స్నానం చేసి, ఒక్క రాత్రి ఉపవాసం చేసిన నరుడు తెల్లవారే సరికే పవిత్రుడై అగ్నిష్టోమయాగ ఫలాన్ని పొందగలడు. అదే రీతిగా ధర్మారణ్యంతో శోభించే బ్రహ్మ సరస్తీర్థంలో స్నానం చేసిన

నరుడు పవిత్రుడై పుండరీక యాగఫలాన్ని పొందగలడు. మైనాక పర్వతంపై నెలరోజుల పాటు స్నానం చేసి, సంధ్యోపాసన చేసినవాడు కామాన్ని జయించి, సర్వయజ్ఞాలు చేసిన ఫలితాన్ని పొందగలడు. నూరు యోజనాల దూరం నుండి వచ్చి అయినా కాలోదక తీర్థంలో, నంది కుండంలో, ఉత్తరమానస తీర్థంలో స్నానం చేసిన వాడు భ్రూణహత్య చేసినా విముక్తి నందగలడు. అక్కడ నందీశ్వరుని మూర్తిని దర్శించినంత మాత్రాననే పాపాలనుండి ముక్తి లభిస్తుంది. స్వర్గమార్గంలో స్నానం చేసిన వాడు బ్రహ్మలోకాన్ని చేరగలడు.

శంకరుని మామ హిమగిరి పరమ పవిత్రం, లోకవిఖ్యాతం కూడా. అది సర్వరత్న నిలయం. సిద్ధులు, చారణులు దానిని సేవిస్తుంటారు. వేదాంత వేత్త అయిన బ్రాహ్మణుడు జీవితం అశాశ్వతమని గ్రహించి, ఆ పర్వతంపై నివసిస్తూ, దేవతలను అర్చించి, మహర్షులకు నమస్కరించి, యథావిధిగా ఉపవాస పూర్వకంగా శరీరాన్ని విడిచిపెడితే, ఆయన సిద్ధిని పొంది ఊర్ధ్వలోకాలలోని సనాతన బ్రహ్మలోకాన్ని పొందగలడు. కామక్రోధ లోభాలను జయించి, తీర్థాలలో స్నానమాడుతూ నివసించిన వానికి ఆ తీర్థయాత్ర పుణ్యం వలన లభించినది అంటూ ఏదీ ఉండదు. సర్వతీర్థాలనూ సందర్శించాలని కోరిక ఉన్నా అవి దుర్గాలు, విషమాలు అయినందువలన పోలేకపోయినా, మనసా ఆ తీర్థయాత్రలు చేయవచ్చు. ఈ తీర్థసేవనం పవిత్రం, పుణ్యప్రదం, స్వర్గప్రాప్తికి ఉత్తమసాధనం. ఇది వేదరహస్యం. ప్రతి తీర్థమూ పవిత్రమే. అన్ని స్నానం చేయదగినవే. ఈ తీర్థ మాహాత్మ్యాన్ని బ్రాహ్మణులకు, ఆత్మహితాన్ని కోరుకొనే సజ్జనునకు, ఆప్తులకు, వెంటవచ్చే శిష్యులకూ చెవిలో చెప్పాలి. మహాతపస్వి అయిన అంగిరుడు దీనిని గౌతమునికి చెప్పాడు. ధీమంతుడైన కాశ్యపుని ద్వారా అంగిరునకీ విషయం తెలిసింది. ఈ తీర్థయాత్రా మాహాత్మ్యం పరమ పావనం. మహర్షులకు పఠనయోగ్యం, నిత్యమూ ఉత్సాహంతో దీనిని చదివిన వాడు పవిత్రుడై స్వర్గాన్ని చేరగలడు. రహస్యమైన ఈ అంగిరుని మతాన్ని విన్నవాడు ఉత్తమ వంశంలో జన్మిస్తాడు. గత జన్మస్మృతిని కూడా పొందుతాడు."

26. గంగామాహాత్మ్య వర్ణనము.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "బుద్ధిలో బృహస్పతితో, సహనంలో బ్రహ్మతో, పరాక్రమంలో ఇంద్రునితో, తేజస్సులో సూర్యునితో సమానుడై, తన హద్దుల నుండి ఎప్పుడూ చలింపని మహాతేజస్వి అయిన గంగాసుతుడు (భీష్ముడు) యుద్ధంలో అర్జునునిచే దెబ్బతిని, వీరశయ్యపై పడుకొని, కాలానికై ఎదురుచూస్తున్న సమయంలో యుధిష్ఠిరుడు

సోదరులతోనూ, ఇతర జనులతోనూ కలిసి వివిధ ప్రశ్నలు అడుగుతున్నాడు. ఆ సమయంలో మహర్షులు భారత శ్రేష్ఠుడైన భీష్ముని చూడటానికి వచ్చారు. అత్రి, వసిష్ఠుడు, భృగువు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అంగిరుడు, గౌతముడు, నియతచిత్తుడైన సుమతి, విశ్వామిత్రుడు, స్థూలశిరుడు, సంవర్తుడు, ప్రమతి, దముడు, బృహస్పతి, ఉశనుడు, వ్యాసుడు, చ్యవనుడు, కాశ్యపుడు, ధ్రువుడు, దుర్వాసుడు, జమదగ్ని, మార్కండేయుడు, గాలవుడు, భరద్వాజుడు, రైభ్యుడు, యవక్రీతుడు, త్రితుడు, స్థూలాక్షుడు, శబలాక్షుడు, కణ్వుడు, మేధాతిథి, కృశుడు, నారదుడు, పర్వతుడు, సుధన్వుడు, ఏకతుడు, నితంభువు, భువనుడు, ధౌమ్యుడు, శతానందుడు, అకృతవ్రణుడు, పరశురాముడు, కచుడు మొదలయిన మహర్షులు (వచ్చారు). మహాత్ములు అయిన ఈ మహర్షులు భీష్ముని చూడటానికి వచ్చారు. అక్కడకు వచ్చిన ఆ మహాత్ములను యుధిష్ఠిరుడు సోదరులతో కలిసి యధావిధిగా యథాక్రమంగా పూజించాడు. అలా పూజలనందుకొనిన ఆ మహర్షులు సుఖాసీనులై భీష్మునకు సంబంధించిన వివిధ కథలను చెప్పుకొనసాగారు. ఆ కథలు సర్వేంద్రియ మనోహరాలు, మధురాలు కూడా. పవిత్రాంతఃకరణాలుగల ఆ ఋషుల కథలను విని భీష్ముడు పరమానందపడి తాను స్వర్గంలో ఉన్నట్లు భావించుకొన్నాడు. ఆపై మహర్షులు భీష్ముని నుండి, పాండవుల నుండి సెలవు తీసికొని అందరూ చూస్తుండగానే అంతర్ధానమయ్యారు. మహాభాగ్యశాలులయిన ఆ ఋషులు కనిపించకుండా పోయినా పాండవులు వారిని స్తుతింపసాగారు. పదేపదే నమస్కరిస్తున్నారు. ఆపై మంత్రకోవిదులైన బ్రాహ్మణులు ఉదయిస్తున్న సూర్యుని దగ్గర చేరినట్లు ప్రసన్న మనస్కులైన సమస్త పాండవులు గురుసత్తముడైన భీష్ముని చుట్టూ చేరారు. ఆ మహర్షుల తపఃప్రభావంతో సర్వదిక్కులూ వెలుగొందడం చూసి పాండవులు పరమాశ్చర్యానికి లోనయ్యారు. ఆ మహర్షుల మహా సౌభాగ్యాన్ని గూర్చి ఆలోచిస్తూ పాండవులు భీష్మునితో కలిసి ఆ మహర్షులకు సంబంధించిన విషయాలు ముచ్చటించుకొనసాగారు. వైశంపాయనుడు చెప్తున్నాడు. ఆ సంభాషణ ముగియగానే ధర్మపుత్రుడు. పాండునందనుడు అయిన యుధిష్ఠిరుడు భీష్ముని ధర్మ సంబంధమైన ప్రశ్ననిలా అడిగాడు. "పితామహా ! ఏ దేశాలూ, ఏ జనపదాలు, ఏ ఆశ్రమాలు, ఏ పర్వతాలు, ఏ నదులు పుణ్య దృష్టితో సర్వశ్రేష్ఠాలుగా తెలిసికొనదగినవి ?" భీష్ముడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరా ! ఈ విషయంలో కూడా శిలోంఛ వృత్తికి, సిద్ధునకూ మధ్య జరిగిన సంవాద రూపమైన ప్రాచినేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు.

పర్వతాలు అలంకారాలుగా గల ఈ భూమిని అనేక పర్యాయాలు చుట్టి వస్తున్న ఒకానొక ద్విజశ్రేష్ఠుడు శిలోంఛ వృత్తితో జీవించే ఒక మంచి గృహస్థుని ఇంటికి వచ్చాడు. ఆ గృహస్థునిచే యథావిధిగా అర్చింపబడి ఆ రాత్రంతా సుఖంగా గడిపాడు. ఆ యజమానికి ఎంతో సుముఖుడయ్యాడు. శిలవృత్తి అయిన ఆ గృహస్థుడు శుచియై ప్రాతఃకాల కర్మలను ముగించాడు. ఆపై అప్పటికే కాలిక కర్మలు పూర్తి చేసిన ఆ అతిథిని సేవించటానికి సిద్ధమయ్యాడు. ఆ మహాత్ములిద్దరూ కలిసి సుఖంగా కూర్చొని వేదవేదాంతాలకు సంబంధించిన శుభచర్చలు చేయసాగారు. సంభాషణ ముగిసే సమయంలో మేధావి, శిలావృత్తి అయిన ఆ గృహస్థుడు ప్రయత్న పూర్వకంగా నీవిప్పుడు నన్ను అడిగినట్లే ఆ సిద్ధుని అడిగాడు. "ఏ దేశాలూ, ఏ జనపదాలూ, ఏ ఆశ్రమాలూ, ఏ పర్వతాలూ, ఏ నదులు పుణ్య దృష్టితో సర్వశ్రేష్ఠాదులుగా తెలిసికొనదగినవో చెప్పండి". సిద్ధుడిలా చెప్పాడు. "ఏ దేశాలు, ఏ జనపదాలు, ఏ ఆశ్రమాలు, ఏ పర్వతాల మధ్యగుండా నదీమతల్లి అయిన భాగీరథి - గంగ ప్రవహిస్తుందో అవి శ్రేష్ఠాలు. ప్రాణి గంగను సేవించి పొందగలిగిన గతిని తపస్సుతో కానీ, బ్రహ్మచర్యంతో కానీ, యజ్ఞాలతో కానీ త్యాగంతో కానీ పొందలేడు. ఏ ప్రాణి శరీరం గంగాజలంతో తడుస్తుందో, మరణానంతరం ఏ ప్రాణి ఎముకలు గంగలో కలుపబడతాయో ఆ ప్రాణి స్వర్గం కన్న తక్కువ స్థితిని పొందదు. విప్రా ! సర్వ కార్యాలనూ గంగాజలంతోనే చేయగలిగిన దేహధారులు - మానవులు మరణానంతరం భూమిని వీడి స్వర్గంలోనే విరాజిల్లుతారు. నరులు జీవితపు తొలి దశలో పాపాలు చేసినా, తరువాత దశలో గంగను సేవిస్తే ఉత్తమగతిని పొందుతారు. పవిత్రమైన గంగాజలంతో స్నానం చేసి, అంతఃకరణాన్ని శుద్ధి చేసికొన్న పురుషులు వందలు యాగాలు చేసినా లభించనంత పుణ్యాన్ని పొందగలరు. **మనుష్యుని ఎముక ఎన్ని వేల సంవత్సరాల పాటు గంగాజలంలో ఉంటుందో అన్ని వేల సంవత్సరాలపాటు ఆ మనిషి స్వర్గలోకంలో విరాజిల్లుతాడు.*** ఉదయవేళ సూర్యుడు గాఢాంధకారాన్ని బ్రద్దలు చేసి ప్రకాశించినట్లు, గంగాజలంలో స్నానం చేసినవాడు తన పాపాన్ని బ్రద్దలు చేసి విరాజిల్లుతాడు. పవిత్రమైన గంగాజలం లేని దేశాలు కానీ దిక్కులు కానీ చంద్రుడు లేని రాత్రులవంటివి. పూలులేని చెట్ల వంటివి. ధర్మజ్ఞానాలు దూరమైన సర్వ వర్ణాశ్రమాలు శోభించినట్లు, సోమరసహీనమైన యాగాలు శోభించనట్లు గంగలేని జగత్తు కూడా శోభించదు.

* **యావదస్థి మనుష్యస్య గంగాతోయేషు తిష్ఠతి ।**
తావద్వర్షసహస్రాణి స్వర్గలోకే మహీయతే ॥ 32

సూర్యుడు లేని ఆకాశం, పర్వతాలు లేని భూమి, గాలి లేని అంతరిక్షం వెలువలేని వయినట్లు గంగాహీనాలయిన దేశాలు కానీ, దిక్కులు కానీ వెలువ లేనివి. సంశయం లేదు. మూడు లోకాలలోను నివసిస్తున్న ఎటువంటి ప్రాణులయినా, పవిత్ర గంగాజలంతో తర్పణాలనందుకొంటే పరమ తృప్తిని పొందుతారు.

సూర్య కిరణాలతో వేడెక్కిన గంగాజలాన్ని త్రాగినవాడు, ఆవు పేడనుండి వెలుపలకు వచ్చి యవలజావను త్రాగిన వాని కన్న పవిత్రతరు డవుతాడు. శరీరాన్ని శుద్ధంచేసే చాంద్రాయణ వ్రతాలను వేయిసార్లు అనుష్ఠించినా, గంగాజలాన్ని త్రాగినా రెండూ సమానమే. లేదా కావు. (గంగా జలపానమే విశిష్టం). వేయి యుగాలపాటు ఒంటికాలిపై నిలిచిన పురుషుడూ, ఒకనెలపాటు గంగా తీరంలో నిలిచిన వాడూ సమానమే. లేదా సమానం కాకపోవచ్చు. ఒకడు పదివేల యుగాలపాటు తలక్రిందులుగా వ్రేలాడవచ్చు. ఒకడు గంగాతీరంలో యథేష్టంగా నివసించవచ్చు. వీరిలో రెండవవాడే విశిష్టుడు. ద్విజోత్తమా ! అగ్నిలో విసరబడిన దూది వెంటనే తగలబడినట్లు గంగలో స్నానం చేసిన వాని పాపం వెంటనే దగ్ధమై పోతుంది. ఈ లోకంలో దుఃఖోపహతమనస్కులై, దిక్కు వెతుకుకొంటున్న వారికందరికీ గంగతో సమానమైన గతి లేదు. గరుడుని చూడగానే పాములు విషాన్ని కోల్పోయినట్లు గంగా దర్శనంతో సర్వపాపాల నుండి విముక్తి లభిస్తుంది. ఏ ఆధారమూ లేనివారికీ, ఏ ధర్మాన్ని ఆశ్రయించని వారికీ గంగయే శరణం. అదే వారికి సంపద. అదే వారికి కవచం. అశుభకరాలైన పెద్ద పెద్ద పాపాలను ఎన్నింటినో చేసిన పురుషాధములు నరకంలో పడబోతూ కూడా, గంగను శరణు కోరితే మరణానంతరం గంగ వారిని ఉద్ధరిస్తుంది.

సంతతమూ గంగాయాత్ర చేసే వారిపై ఇంద్రాది సర్వదేవతలు, మునులు విడివిడిగా తప్పక అనుగ్రహాన్ని ప్రదర్శిస్తారు. బ్రాహ్మణా ! వినయం, సదాచారం లేనివారైనా, అశుభ కర్మలు చేసే నరాధములైనా, గంగను శరణు చొచ్చితే పవిత్రులు అవుతారు (శుభ స్వరూపు లవుతారు). దేవతలకు అమృతం, పితరులకు స్వధ, నాగులకు సుధ ఎటువంటివో మనుష్యులకు గంగాజలం అటువంటిది. ఆకలితో బాధపడే బాలురు తల్లి దగ్గరకు వెళ్ళినట్లు ఈ లోకంలో శ్రేయస్కాములైన ప్రాణులు గంగను ఉపాసిస్తారు. బ్రహ్మలోకం సర్వలోకాలలోనూ శ్రేష్ఠస్థానమైనట్లు, స్నానం చేసే వారికై గంగ సర్వనదీ శ్రేష్ఠ అని చెప్పబడుతోంది. ధేను స్వరూప అయిన భూమి దాని నాశ్రయించి బ్రతికే దేవతలకు ఎటువంటిదో, ఈ లోకంలో తనను ఆశ్రయించి బ్రతుకుతున్న సర్వప్రాణులకు

గంగ అటువంటిది. దేవతలు సత్రయాగం మొదలయిన యాగాల ద్వారా చంద్రునిలో, సూర్యునిలో ఉన్న అమృతంతో జీవించినట్లు నరులు గంగాజలంతో జీవిస్తారు. గంగాతీరంలో పైకెగసిన ఇసుక రేణువులు శరీరం మీద పడితే, లోకులు తమ శరీరం స్వర్గలోకంలో నిలిచి శోభిస్తున్నట్లు భావిస్తారు. గంగాతీరంలోని మట్టిని తన తలదాల్చినవాడు అంధకారాన్ని నాశనం చేసే సూర్యుని రూపంవంటి నిర్మలరూపాన్ని ధరిస్తాడు. గంగానదిలోని అలలచే తడిసి ప్రసరించే గాలి మనుష్యుని శరీరాన్ని తాకితే వెంటనే ఆ మనుష్యునిలోని పాపాన్ని తొలగించి వేస్తుంది.

వ్యసనాలతో తపించిపోతూ, వినాశనానికి దగ్గర అయిన నరునకు గంగా దర్శనం వలన కలిగిన ప్రీతి ఆ వ్యసనాల నుండి అతనిని తప్పిస్తుంది. తనలో ఉన్న హంసల మధుర స్వనాలతో, చక్రవాక పక్షుల కూజితాలతో, ఇతర పక్షుల కిలకిలా రావాలతో గంగ గంధర్వులతో పోటీ పడుతోంది. ఇసుక తిన్నెలతో, పర్వతాలతో పోటీ పడుతుంది. లెక్కకు మిక్కిలిగా ఉన్న హంసలు మొదలయిన వివిధ జాతుల పక్షులతో, గోవుల సమూహాలతో ఆవరింపబడిన గంగను చూస్తే స్వర్గం కూడా గుర్తుకురాదు. గంగాతీరంలోని ఇసుకలో మనుష్యులకు పరమ ప్రీతి కలుగుతుంది. అటువంటి ఆనందం స్వర్గంలో అన్ని కోరికలను అనుభవిస్తున్న వానికి కూడా కలుగదు. వాక్కుతో, మనస్సుతో, కర్మలతో చేసిన పనుల పాపాలలో చిక్కుకొన్న పురుషుడైనా గంగను చూస్తే పవిత్రుడవుతాడు. ఈ విషయంలో నాకు సంశయం లేదు. గంగను చూసి, తాకి, స్నానం చేసిన పురుషుడు గడచిన ఏడు తరాలను, రాబోయే ఏడు తరాలను, అంతకన్న పైనున్న పితరులను కూడా తరింపజేస్తాడు. గంగా మాహాత్మ్యాన్ని విన్నా, గంగ దగ్గరకు వెళ్ళాలని కోరినా, జలంత్రాగినా, స్పృశించినా, చూసినా, స్నానం చేసినా పురుషునికి సంబంధించిన ఉభయ వంశాలను గంగ విశేషంగా ఉద్ధరిస్తుంది. వందలు, వేలకొలదిగ ఉన్న పాపాత్ములనైనా గంగ తనను చూసినా, తాకినా, త్రాగినా, గంగా అంటూ కీర్తించినా పవిత్రులను చేస్తుంది. తన పుట్టుకను, జీవితాన్ని, వేదాధ్యయనాన్ని సఫలం చేసికొనదలచిన మానవుడు గంగ దగ్గరకుపోయి ఆ నీటితో దేవతలకు, పితరులకు తర్పణం విడవాలి. పురుషుడు గంగా స్నానంతో అక్షయ ఫలితాన్ని పొందగలడు. అటువంటి ఫలితాన్ని పుత్రుల ద్వారా కానీ, ధనంతో కానీ, పుణ్యకర్మలతో కానీ పొందలేడు. పుణ్యజలం కలిగి, శుభకరమైన గంగను సమర్థులై కూడా చూడనివారు పుట్టు గ్రుడ్డివారితో, మృతులతో, కుంటివారితో సమానులు. గంగను భూతభవిష్య ద్వర్తమానాలు తెలిసిన మహర్షులు, ఇంద్ర సహితంగా దేవతలు

కూడా ఉపాసిస్తారు. అటువంటి గంగను ఏ మనిషి సేవింపడు ? వాన ప్రస్థులు, గృహస్థులు, సంన్యాసులు, బ్రహ్మచారులు, విద్యావంతులు కూడా గంగను ఆశ్రయిస్తారు. అటువంటి దానిని ఏ పురుషుడు ఆశ్రయింపడు ? సజ్జన సమ్మతుడై, నియతచిత్తుడైన మనిషి ప్రాణాలు పోయే సమయంలో మనసా గంగను స్మరిస్తే పరమగతిని పొందగలడు. జీవితాంతం గంగను ఉపాసించిన పురుషునకు భయాల వలన భయం లేదు. పాపం వలనగానీ, రాజు వలనగానీ భయం లేదు.

మహేశ్వరుడు ఆకాశం నుండి పడుతున్న పరమ పవిత్ర అయిన గంగానదిని శిరసాధరించాడు. దానినే స్వర్గంలో ఆరాధిస్తారు. నిర్మలాలయిన మూడు మార్గాలతో మూడు లోకాలను (ఆకాశం, భూలోకం, పాతాళం) గంగ శోభింపజేసింది. ఆ గంగాజలం త్రాగిన పురుషుడు కృతకృత్యుడు కాగలడు. స్వర్గంలోని దేవతలలో సూర్యునివలె, పితరులలో చంద్రునివలె, మనుష్యులలో రాజువలె నదులలో గంగ శ్రేష్ఠం. తల్లికి, తండ్రికి, పుత్రులకు, భార్యకు, ధనానికి దూరమైన వాడు దుఃఖపడతాడు. కానీ ఆ దుఃఖం గంగా వియోగం వలన కలిగే దుఃఖమంతకాదు. గంగానదిని చూస్తే కలిగినంత ఆనందం వనాలవలన గానీ, ఇష్ట విషయాల వలన గానీ, పుత్రుల వలన గానీ, ధనాగమం వలనగానీ కలుగదు. పూర్ణచంద్రుని చూసి నరుల దృష్టి ప్రసన్నమైనట్లు, గంగానదిని చూసి నరుల దృష్టి ప్రసన్నమవుతుంది. దాని మీదనే శ్రద్ధ పెట్టి, మనస్సును దానిమీదనే పెట్టి, దాని దగ్గరనే ఉండి, దానిమీదనే ఆసక్తిగొని గంగను భక్తితో అనుసరించినవాడు ఆమెకు ఇష్టుడవుతాడు. భూ నివాసులైనా, ఆకాశచారులైనా, స్వర్గలోకంలో ఉన్నవారైనా చిన్న - పెద్ద ఎవరయినా సరే సర్వదా గంగలో స్నానం చేయాలి. సత్కార్యాలలో అదే గొప్పది. బూడిదై పడి ఉన్న సగరసుతులను ఇక్కడ నుండి స్వర్గానికి నడిపించింది గంగయే. అందువలననే పరమ పవిత్రమైనదని ప్రపంచ లోకాలలో గంగ కీర్తి విస్తరించింది. గాలి తాకిడితో వేగంగా, అందంగా, పైకి ఎగుస్తున్న, కాంతిమంతాలయిన గంగ అలలో స్నానం చేసి ప్రకాశించేవారు మరణానంతరం సూర్యకిరణ సమానులవుతారు. గంగానది పాలవంటి నీటితో, నేతి వంటి స్నిగ్ధతతో కూడి పరమోదార. సమృద్ధిశాలిని. వేగవతి. అగాధమైనది. అటువంటి గంగ దగ్గరకు వెళ్ళి శరీర త్యాగం చేసిన ధీరులు దేవతా సమత్వాన్ని పొందుతారు.

గంగానది కీర్తిమతి. విశాలమైనది. విశ్వరూపం గలది. ఇంద్రాది దేవతలు, మునులు, మానవులు సేవించేది. ఆ గంగ అంధులను, జడులను దరిద్రులను కూడా సర్వకామ సంపన్నులను చేస్తుంది. తేజస్విని, మహాపుణ్య స్వరూప, మధురజలపూర్ణ,

త్రిపథగామిని, త్రిలోక రక్షకురాలు అయిన గంగను ఆశ్రయించిన వారు స్వర్గలోకానికి వెళతారు. గంగాతీరంలో నివసించినా, చూసినా ఆ మనిషికి దేవతలు సుఖాలు కల్పిస్తారు. స్పర్శతో, దర్శనంతో పవిత్రులైన వారికి గంగ ద్వారా మహత్త్వాన్ని పొంది ఉన్న దేవతలు మనోభీష్టాలను నెరవేరుస్తారు. గంగ సమర్థురాలు. పృశ్నితో సమానమైనది. విశాలమైనది. ఉత్కృష్టయైనది. మంగళకారిణి. సమృద్ధురాలు, భాగ్యవతి, సుప్రసన్న, పాపవినాశనంలో కాలరాత్రివంటిది. సర్వప్రాణి ప్రతిష్ఠ. అటువంటి గంగను చేరినవారు స్వర్గాన్ని చేరినట్లే. ఆకాశంలో, స్వర్గంలో, భూలోకంలో, దిక్కులలో, మూలలలో కూడా గంగ ప్రఖ్యాతినందినది. నదీమతల్లి అయిన గంగానది నీటిని త్రాగిన మర్త్యులు అందరు కృతకృత్యులవుతారు. 'ఇది గంగ' అని చెపుతూ ఇతరులకు చూపించిన వారికి గంగ అక్షయ స్థానాన్ని ఇస్తుంది. కార్తికేయుని, బంగారాన్ని తాను గర్భంలో ధరించింది. పవిత్ర జలంతో ప్రవహించే గంగ పాపాలను పోగొడుతుంది. ఆకాశం నుండి నేలకు దిగిన ఆ గంగాజలం విశ్వమంతా త్రాగదగినది. ప్రాతఃకాలంలో గంగా.స్నానం ద్వారా ధర్మార్థకామాలను పొందవచ్చు.

గంగానది తొలుత అక్షయుడైన నారాయణుని నుండి వెలువడింది. విష్ణుపాదం, శంఖుమారచక్రం, ధ్రువుడు, సోముడు, సూర్యుడు, మేరుస్వరూపుడైన విష్ణువుల నుండి క్రమంగా వచ్చి శివునిమస్తకాన్ని ఆశ్రయించింది. అక్కడ నుండి హిమాద్రిని చేరింది.

గంగ హిమాలయ పర్వత పుత్రి. హరుని భార్య. స్వర్గానికీ, భూమికీ శోభను కలిగించింది. రాజా ! భూలోకవాసులకు శుభాన్ని కలిగింపగలది. సౌభాగ్యశాలిని మూడు లోకాలను పుణ్యప్రదానం చేసేది. గంగ మధువును స్రవించేది. జల ధారలతో ప్రవహించేది. జ్వలించే నేతివంటి కాంతి గలది. పెద్ద అలలతో, బ్రాహ్మణులతో వెలుగొందేది. ఆకాశం నుండి జారి శివునిచే శిరసా వహింపబడినది. హిమాద్రి నుండి నేలకు వచ్చింది. ఆ గంగ స్వర్గలోక జనని. గంగ సర్వకారణం. సర్వశ్రేష్ఠం. రజోరహితం. పరమసూక్ష్మం. మరణించిన వారికి సుఖశయ్య. నీటిని మోసేది. కీర్తికారకం. జగద్రక్షకం. సదాకృతి, అభీష్టదాయిని. తనలో స్నానం చేసినవారి స్వర్గమార్గం. సహనంలో, రక్షణలో, ధారణలో భూమి వంటిది. వెలుగులో అగ్నిసూర్యుల వంటిది. బ్రాహ్మణులు మెచ్చినది. బ్రాహ్మణులపై అనుగ్రహం కలది కాబట్టి గుహునకు, బ్రాహ్మణులకూ నిత్యమూ ఇష్టమైనది. ఋషులచే స్తుతింపబడినది, విష్ణుపాదోద్భవ, ప్రాచీన, పుణ్యజల అయిన గంగను ఈ లోకంలోని వారు సర్వాత్మనా మనసా శరణు కోరితే వారు బ్రహ్మలోకానికి వెళ్ళినట్లే.

గంగ తల్లి బిడ్డలను చూసినట్లు చూస్తుంది. సర్వాత్మనా తన శరణుకోరిన సర్వగుణ సంపన్నులైన లోకులను అనుగ్రహిస్తుంది. కాబట్టి బ్రహ్మలోకాన్ని పొందగోరినవారు

నియతాత్ములై సర్వదా ఆ గంగను ఉపాసించాలి. గంగ గోవువంటిది. పుష్టిని కలిగించేది. అంతా చూడగలది. అందరూ ఆస్వాదింపదగినది. అన్నదాత్రి పర్వతాలను ధరించేది. సజ్జనులకు ఆశ్రయమైనది. బ్రహ్మ కూడా పొందగోరేది. అమృత స్వరూప సిద్ధిని కోరినవాడు మనస్సును నియంత్రించి ఆ గంగను ఆశ్రయించాలి. భగీరథుడు తీవ్ర తపస్సుతో సమస్త దేవతలను, దేవేంద్రుని ప్రసన్నులను చేసికొని గంగను భూమికి అవతరింపజేశాడు. నిత్యమూ ఆ గంగను శరణుచొచ్చిన మనుషులకు ఇహపరలోక భయముండదు. బుద్ధిపెట్టి, సర్వవిధాలా బాగా ఆలోచించి గంగ గుణాలలోని కొన్నింటిని మాత్రమే ఉదాహరణ ప్రాయంగా చెప్పాను. సర్వగుణాలను పరిగణించటానికి కానీ అలాగే చెప్పటానికి కానీ నాకు కొంచెం కూడా శక్తిలేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా, మేరు పర్వతం మీది రాళ్ళను, సముద్రంలోని నీళ్ళను లెక్కించి చెప్పటం సాధ్యం కాదు. అలాగే గంగాజల గుణాలను లెక్కించటం కానీ, చెప్పటం కానీ కుదరదు. కాబట్టి నేను పరమ శ్రద్ధతో చెప్పిన ఈ గంగానదీ గుణాలను అన్నింటినీ విశ్వసించి మనస్సుతో, మాటతో, కర్మతో, భక్తితో, శ్రద్ధతో సదా శ్రద్ధాళువువై గంగను ఆరాధించాలి. ఈ గంగను ఆరాధిస్తే పరమ దుర్లభమైన ఉత్తమ సిద్ధిని పొందగలవు. నీ కీర్తి ఈ మూడు లోకాలలోనూ వ్యాపిస్తుంది. అచిర కాలంలోనే గంగానుగ్రహం వలన ఇష్టలోకాలను పొంది, యథేచ్ఛగా నీవు అక్కడ విహరింపగలవు. మహానుభావురాలైన ఆ గంగ నీ, నా బుద్ధిని సతతమూ స్వధర్మానుకూలగుణాలతో నింపును గాక ! తన నిష్టపడే జనంపై వాత్సల్యం గల గంగ తన భక్తులను సుఖాలతో జతపరుస్తుంది". భీష్ముడు చెప్తున్నాడు. "ఈ రీతిగా పరమధీశాలి, తేజశ్శాలి అయిన సిద్ధుడు గంగకు సంబంధించిన యథార్థ గుణాలను అన్నింటినీ శిలోంఛవృత్తి అయిన ఆ బ్రాహ్మణునకు అనేక విధాలుగా చెప్పి గగనతలంలో ప్రవేశించాడు. అప్పుడు సిద్ధ వాక్య ప్రబోధంతో శిలవృత్తి యథావిధిగా గంగను ఉపాసించి పరమ దుర్లభమైన సిద్ధిని పొందాడు. కౌంతేయా ! అలాగే నీవు కూడా పరమభక్తి సంపన్నుడవై సతతమూ గంగను ఉపాసించు. ఉత్తమ స్థితిని పొందగలవు".

వైశంపాయనుడు చెప్తున్నాడు. "గంగాస్తవంతో కూడిన ఈ భీష్ముడు చెప్పిన ఇతిహాసాన్ని విని, యుధిష్ఠిరుడు సోదరులతో సహా పరమానందాన్ని పొందాడు. గంగాస్తవంతో కూడి, పుణ్యప్రదమైన ఈ ఇతిహాసాన్ని చదివిన వాడైనా, విన్నవాడైనా సర్వపాప విముక్తిని పొందగలడు."

27. ఇంద్ర మతంగ సంవాదము.

యుధిష్ఠిరుడడిగాడు. "రాజా ! నీవు ప్రజ్ఞ, పాండిత్యం, సదాచారం, శీలం – ఇలా వివిధ సర్వసద్గుణాలతోనూ, వయస్సుతోనూ కూడినవాడవు. బుద్ధిలోనూ, ప్రజ్ఞలోనూ, తపస్సులోనూ నీవు విశిష్టుడవు. కాబట్టి ధర్మవిషయాలను నిన్నే అడుగుతున్నాను. జనులలో ఇలా అడుగదగినవాడు నీవు తప్ప మరొకరు లేరు. రాజసత్తమా ! క్షత్రియుడు కానీ, వైశ్యుడు కానీ, శూద్రుడు కానీ ఏ పని ద్వారా బ్రాహ్మణ్యాన్ని పొందగలరు ? దానికి నాకు వివరంగా చెప్పవలసినది. పితామహా ! బ్రాహ్మణ్యాన్ని కోరేవాడు తపస్సుతోనా ? మహాకర్మ ద్వారానా ? లేక వేదాధ్యయనం ద్వారానా ? ఏ ఉపాయంతో దాన్ని పొందగలడు ?" భీష్ముడు చెప్తున్నాడు. "నాయనా ! యుధిష్ఠిరా ! క్షత్రాదులయిన మూడు వర్ణాల వారు బ్రాహ్మణత్వం పొందటం చాలా కష్టం. ఎందుకంటే ఇది సర్వప్రాణులకూ సర్వోత్తమ స్థానం. నాయనా ! అనేక జాతులలో సంచరిస్తూ, మరలా మరలా జన్మిస్తూ, ఆ క్రమంలో ఎప్పుడో ఒకసారి బ్రాహ్మణుడుగా పుడతాడు. యుధిష్ఠిరా ! ఈ విషయమై కూడా మతంగునకు, గర్దభికి (ఆడగాడిద) మధ్య జరిగిన సంవాద రూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు.

నాయనా ! ఒకానొక బ్రాహ్మణునకు మతంగుడనే కొడుకు ఉండేవాడు. (అతడు అన్యజాతి పురుషునకు పుట్టిన వాడైనా) తండ్రి కులంతోనే స్వీకరింపబడ్డాడు. సర్వగుణ సంపన్నుడతడు. ఆ మతంగుడు తండ్రిపంపగా ఒక యజమాని యాగం చేయించటానికి గాడిదలు పూన్చిన వేగవంతమైన రథంపై బయలుదేరాడు. రాజా ! ఒక పిల్లగాడిద కూడా రథాన్ని లాగుతోంది. దాన్ని ఆ మతంగుడు తల్లి ఎదురుగానే కొరడాతో పదేపదే కొట్టి ముక్కుపై గాయం చేశాడు. ఆ గర్దభి (తల్లి) ఆ తీవ్రమైన గాయాన్ని చూసి పుత్రవాత్సల్యంతో ఇలా అన్నది. "కుమారా ! బాధపడవద్దు. ఒక చండాలుడు రథమెక్కి ఉన్నాడు. బ్రాహ్మణుడు దారుణంగా ప్రవర్తించాడు. బ్రాహ్మణుడు అందరితో స్నేహంగానే ఉంటాడు. సర్వప్రాణులకూ ఉపదేశమిచ్చే ఆచార్యుడు ఎలా కొడతాడు ? ఇతడు స్వభావంతోనే పాపాత్ముడు. బాలునిపై దయ చూపలేడు. తన ప్రవర్తనతో తన జాతిని సమ్మానిస్తున్నాడు. ఇతని స్వభావం ఇతని మనోభావాన్ని నియంత్రిస్తోంది". దారుణంగా ఉన్న గర్దభి మాటను విని మతంగుడు వెంటనే రథం నుండి దిగి ఆ గర్దభితో ఇలా పలికాడు. "కళ్యాణి ! గర్దభి ! చెప్పు. నా తల్లి ఎవని వలన కళంకిత అయింది. నేను చండాలుడ నని నీకెలా తెలుసు. వెంటనే చెప్పు." మహామతీ ! నేను చండాలుడనని

నీకెలా తెలుసు. ఏ కారణంగా నా బ్రాహ్మణ్యం నశించింది ? దీనిని యథాతథంగా పూర్తిగా నాకు చెప్పు. గర్దభి ఇలా అన్నది. "యౌవనమదంతో ఉన్న ఒక బ్రాహ్మణ స్త్రీకి శూద్ర జాతికి చెందిన మంగలిద్వారా పుట్టిన చండాలుడవు నీవు. అందువలన బ్రాహ్మణత్వం నశించింది".

గర్దభి అలా చెప్పగానే మతంగుడు ఇంటికి మరలాడు. మరలివచ్చిన అతనిని చూసి తండ్రి ఇలా అన్నాడు. "నేను నిన్ను యజ్ఞాన్ని చేయించే పెద్ద పనిలో నియోగించాను. మరలివచ్చావెందుకు ? ఒంట్లో బాగానే ఉన్నది గదా !" మతంగుడిలా అడిగాడు. "చండాలునకో, ఇంకా హీనునకో పుట్టిన వాడను. కుశలంగా ఎలా ఉంటాను. తండ్రీ ! ఇటువంటి తల్లికి పుట్టిన వానికి కుశలమెలా ఉంటుంది ? తండ్రీ ! వృషలుని ద్వారా బ్రాహ్మణ స్త్రీకి పుట్టానని మానవ జాతికి చెందని గాడిద నాకు తెలియజేసింది. అందువలన ఇప్పుడు మహా తపస్సు చేస్తాను". తండ్రితో అలా పలికి ఆ మతంగుడు కృతనిశ్చయుడై బయలుదేరాడు. ఆపై మహారణ్యానికి వెళ్ళి తీవ్ర తపస్సు చేశాడు. అతడు తీవ్ర తపస్సుతో దేవతలను కూడా తపింపజేశాడు. ఆ మతంగుడు చక్కగా తపస్సు చేసి, సుఖంగా బ్రాహ్మణ స్థానాన్ని పొందగోరాడు. ఆ రీతిగా తపోలగ్నుడై ఉన్న మతంగునితో ఇంద్రుడిలా అన్నాడు. "మతంగా ! మానుషభోగాలను విడిచిపెట్టి నీవెందుకు తపస్సు చేస్తున్నావు ? అయ్యో ! నీకు వరమిస్తాను. ఏది కావాలంటే అది కోరుకో ! దేనిని పొందాలని నీ మనస్సులో ఉందో అదంతా చెప్పు. జాగుసేయవద్దు". మతంగుడిలా అన్నాడు. "బ్రాహ్మణ్యాన్ని అభిలషిస్తూ నేను ఈ తపస్సును ప్రారంభించాను. దానిని పొందిన తరువాతనే వెళతాను. నేను కోరుతున్న వరమిదే". భీష్ముడు చెప్తున్నాడు. "ఆ మాటవిని ఇంద్రుడు అతనితో ఇలా అన్నాడు". మతంగా ! నీవు కోరుతున్న ఈ బ్రాహ్మణత్వం దుర్లభం. **అంతఃకరణ పవిత్రత లేనివారు బ్రాహ్మణ్యాన్ని పొందలేరు.** నీవు దానిని కోరుతున్నావు. దుర్మతీ ! నశించిపోతావు. ఆలస్యం చేయవద్దు. వెంటనే విరమించుకో ! సర్వప్రాణులలోనూ శ్రేష్ఠమైన బ్రాహ్మణత్వాన్ని నీవు కోరుతున్నావు. కానీ ఈ తపస్సు దానిని సాధించలేదు. కాబట్టి ఈ శ్రేష్ఠ స్థానాన్ని కోరుతున్న నీవు త్వరలోనే నశిస్తావు. దేవతలలో, అసురులలో, మానవులలో పరమ పవిత్రంగా భావింపబడే బ్రాహ్మణ్యాన్ని చండాలజాతిలో పుట్టిన నీవు కోరుతున్నావు. ఏ రీతిగానూ నీకది లభించదు."

28. ఇంద్రుడు మతంగునకు హితబోధ చేయుట.

భీష్ముడు చెప్తున్నాడు. "ఇంద్రుడు అలా అనగానే మతంగుడు ఆత్మ నిగ్రహంతో, దృఢదీక్షతో, అచ్యుతుడై వంద సంవత్సరాలపాటు ఒంటికాలిపై నిలిచి తపస్సు చేశాడు. ఆ తరువాత మహాయశస్వి అయిన ఇంద్రుడు మరలా అతనితో ఇలా అన్నాడు. "నాయనా ! బ్రాహ్మణత్వం దుర్లభం. నీవు ప్రార్థించినా పొందలేవు. మతంగా ! పరమ పదాన్ని కోరుతున్నావు. ఇలా కోరుతూనే నశింపగలవు. కుమారా ! సాహసం చేయవద్దు. ఇది నీకు ధర్మ మార్గంకాదు. దుర్మతీ ! ఈ లోకంలో బ్రాహ్మణత్వాన్ని పొందటం నీకు శక్యం కాదు. పొందలేని దానిని కోరుతున్నావు. త్వరలోనే నశిస్తావు. మతంగా ! నేను పదే పదే వారిస్తున్నా కూడా తపస్సుతో ఉత్తమ స్థానాన్నే పొందగోరుతున్నావు. సర్వవిధాలా నష్టపోతావు. జంతు జన్మలోనుండి మానవ జన్మకు వచ్చినప్పుడు అందరూ కూడా పుల్కసులుగానో, చండాలురుగానో పుట్టవలసినదే. సంశయం లేదు. మతంగా ! పుల్కసుడైనా, మరే పాపజాతి వాడయినా ఈ లోకంలో పుడితే ఆ జాతిలో చిరకాలం పరిభ్రమింపవలసి వస్తుంది. ఆపై వేయి జన్మల తరువాత శూద్రత్వాన్ని పొందుతాడు. ఆపై ఆశూద్రజాతిలోనే అనేక పర్యాయాలు తిరుగుతూ ఉంటాడు. ఆ తరువాత దానికి ముప్పయి రెట్లు కాలంగడిచిన తర్వాత వైశ్య జన్మను పొందుతాడు. వైశ్యజాతిలో కూడా చిరకాలం తిరుగుతూనేఉంటాడు. ఆపై దానికి అరవైరెట్లు కాలం గడిచిన తరువాత క్షత్రియుడుగా పుడతాడు. ఆపై దానికి అరవై రెట్లు కాలం తర్వాత భ్రష్టబ్రాహ్మణుని ఇంట పుడతాడు. చాలాకాలం బ్రహ్మ బంధువుగానే పరిభ్రమిస్తుంటాడు ఆపై మూడు వందల సంవత్సరాలు గడచిన తరువాత కాండపృష్ఠుడు (శస్త్రాలతో జీవించే బ్రాహ్మణుడు)గా పుడతాడు. కాండ పృష్ఠుడుగానే చాలాకాలం పరిభ్రమిస్తుంటాడు. ఆ పైన మూడు వందల సంవత్సరాలకు గాయత్రీమంత్ర జపం చేసే బ్రాహ్మణుని ఇంటపుడతాడు. ఆ జన్మను పొంది దానిలోనే చిరకాలం పరిభ్రమిస్తుంటాడు. తరువాత నాలుగు వందల సంవత్సరాలకు శ్రోత్రియుడుగా పుడతాడు. చాలాకాలం వరకు శ్రోత్రియుడుగానే పరిభ్రమిస్తుంటాడు. నాయనా ! ఈ రీతిగా శోకహర్షాలు, రాగద్వేషాలు, అతిమానం, అతివాదం వంటి దోషాలు ద్విజాధమునిలో ప్రవేశిస్తాయి. అప్పుడు ఆ శత్రువులను జయింపగలిగితే సద్గతిని పొందగలడు. ఆ దోషాలే ఇతనిపై గెలిస్తే తాటిచెట్టు నుండి పండు రాలిపడినట్లు ఈ ద్విజాధముడు పతనం చెందుతాడు. మతంగా ! ఇదంతా నేను ఆలోచించియే నేను నిన్ను ఒత్తిడి చేస్తున్నాను. మరేదైనా వరం కోరుకో. బ్రాహ్మణత్వం పరమ దుర్లభం".

29. మతంగుడు వరములు పొందుట.

భీష్ముడు చెప్తున్నాడు. "ఇంద్రుడలా చెప్పగానే మతంగుడు ఆత్మ నిగ్రహంతో దృఢ దీక్షతో వేయి సంవత్సరాలు ఒంటికాలిపై ధ్యానంలో నిలిచాడు. వేయి సంవత్సరాలు ముగియటానికి కొంచెం ముందుగా ఇంద్రుడు మతంగుని చూడటానికి వచ్చాడు. తాను ముందు చెప్పిన మాటనే మరలా చెప్పాడు ఇంద్రుడు. మతంగుడిలా అన్నాడు. "ఈ వేయి సంవత్సరాల పాటు బ్రహ్మచారినై ఏకాగ్రతతో ఒంటికాలిపై నిలిచాను. బ్రాహ్మణత్వాన్ని పొందగలనా ?" ఇంద్రుడిలా అన్నాడు. "చండాలుడుగా పుట్టినవాడు ఏ రీతిగానూ బ్రాహ్మణత్వాన్ని పొందలేడు. మరేదైనా వరం కోరుకో. నీకు ఈ వ్యర్థ శ్రమ ఎందుకు" ? ఇంద్రుడిలా చెప్పగానే మతంగుడు తీవ్ర శోకానికి లోనయి, గయకు వెళ్ళి అక్కడ బొటనవ్రేలిపై వంద సంవత్సరాలపాటు నిలిచాడు. ఆచరింపరాని యోగాన్ని అనుష్ఠించాడు. చిక్కిపోయాడు. నరాలు ఉబికాయి. చర్మం, ఎముకలు మాత్రమే మిగిలాయి. ఆ స్థితిలో ఆ ధర్మాత్ముడు నిలువలేక పడిపోయాడని విన్నాం. అతడు పడబోతున్న సమయంలో సర్వభూతహిత రతుడు, వరదాన సమర్థుడు అయిన ఇంద్రుడు వేగంగా వచ్చి పట్టుకొన్నాడు. ఇంద్రుడిల్లా అన్నాడు. "మతంగా ! ఈ జన్మలో నీవు బ్రాహ్మణత్వాన్ని పొందటం విరుద్ధంగా కనిపిస్తోంది. బ్రాహ్మణత్వం పరమ దుర్లభం. కామాది శత్రువులు దాని చుట్టూ ఉంటారు. బ్రాహ్మణుని పూజిస్తే సుఖాలు పొందవచ్చు. తిరస్కరిస్తే దుఃఖపడవలసి వస్తుంది. సర్వప్రాణులకు యోగ క్షేమాలను కలిగించగలవాడు బ్రాహ్మణుడే. బ్రాహ్మణుడు తృప్తిపడినప్పుడే దేవతలు, పితరులు తృప్తిపడతారు. మతంగా ! బ్రాహ్మణుడు సర్వ ప్రాణులలో విశిష్టుడు. తాను దేనినెలా చేయదలచుకొంటే దానినలా చేయగలవాడు బ్రాహ్మణుడు. నాయనా ! అనేక జాతులలో ప్రవేశిస్తూ, మరలా మరలా జన్మిస్తూ, ఆ క్రమంలో ఎప్పుడో ఒకసారి బ్రాహ్మణుడుగా పుడతాడు. అంతఃకరణ పవిత్రత లేనివారు బ్రాహ్మణ్యాన్ని పొందలేరు. కాబట్టి దానిని వదలిపెట్టి మరేదైనా వరం కోరుకో ! ఈ వరం నీకు దుర్లభం".

మతంగుడిలా అన్నాడు. "దుఃఖార్తుడనైన నన్ను ఎందుకు రెచ్చగొడతావు ? చచ్చిన వానిని చంపుతున్నావు. బ్రాహ్మణత్వాన్ని పొంది కూడా దానికి వన్నె కూర్చలేని నిన్ను చూసి జాలిపడుతున్నాను. ఇంద్రా ! క్షత్రియాదులయిన మూడు వర్ణాల వారికి బ్రాహ్మణత్వం దుర్లభమయితే, అంతగా సుదుర్లభమయిన దానిని పొంది కూడా మనుష్యులు దానిని సదా అనుష్ఠించటం లేదు. ఇది బాధాకరం. దుర్లభమైన ధనాన్ని పొంది కూడా,

దాని విలువ నెరుగని వానివలె, బ్రాహ్మణత్వాన్ని పొందికూడా, దాని గొప్పతనాన్ని గ్రహించనివాడు పాపులలో పాపుడు, వారిలోనూ అధముడు. బ్రాహ్మణత్వాన్ని పొందటం కష్టం. పొందినా దానిని రక్షించు కోవటం కష్టం. పొందలేని దాన్ని పొంది కూడా మానవులు దానికి తగ్గట్లు ఆచరించటం లేదు. ఇంద్రా ! నాలో ద్వంద్వాలు లేవు. నేను ప్రతిగ్రహానికి దూరంగా ఉన్నాను. ఆత్మారాముడను నేను. అహింసను, ఇంద్రియ నిగ్రహాన్ని పాటిస్తున్నవాడిని. బ్రాహ్మణత్వాన్ని పొందటానికి ఎందుకు అర్హత లేదు ? పురందరా ! నేను ధర్మజ్ఞుడనై కూడా తల్లి చేసిన తప్పు వలన ఈ స్థితిని పొందవలసి వచ్చింది. ఇది నా దౌర్భాగ్యం. ప్రభూ ! పురుషకారాన్ని, దైవాన్ని అతిక్రమించటం కష్టమన్నది నిశ్చయం. అందుకే దేనికై ప్రయత్నిస్తున్నానో ఆ విప్రత్వాన్ని పొందలేకపోతున్నాను. ఈ పరిస్థితులలో ధర్మజ్ఞా ! నా స్థితిలో నేను నీ అనుగ్రహానికి తగినవాడనయితే, నేను చేసిన సుకృతమేదైనా ఉంటే నాకు వరమీయవచ్చు." వైశంపాయనుడిలా అన్నాడు. "అప్పుడు ఇంద్రుడు 'వరాన్ని కోరుకో' అన్నాడు. ఇంద్రుడు ప్రేరణ చేయగా మతంగుడు ఇలా అడిగాడు". "ఇంద్రా ! నేను స్వేచ్ఛగా విహరింపగలగాలి. ఇష్టమైన రూపం ధరించగలగాలి. ఈ లక్షణాలతో ఆకాశ దేవతను కావాలి. బ్రాహ్మణ క్షత్రియులతో వైరుధ్యం లేకుండా అన్నిచోట్ల పూజను పొందగలగాలి. అక్షయకీర్తి నాకు దక్కాలి. దేవా ! తలవంచి నీ ప్రసన్నతను కోరుతున్నాను. నా కోరికను నెరవేర్చాలి". శక్రుడన్నాడు. "నీవు స్త్రీల సత్కారాలను పొందుతావు. ఛందో దేవుడని ప్రసిద్ధికెక్కగలవు. నాయనా ! మూడు లోకాలలోనూ ఎనలేని కీర్తి నీకు దక్కుతుంది". ఈ రీతిగా మతంగునకు వరమిచ్చి ఇంద్రుడు అంతర్ధానమయ్యాడు. మతంగుడు కూడా ప్రాణపరిత్యాగం చేసి ఉత్తమ స్థానానికి (బ్రహ్మలోకానికి) వెళ్ళాడు. భారతా ! ఈ రీతిగా ఈ బ్రాహ్మణత్వమన్నది పరమపదం. దేవేంద్ర వచనాన్ని బట్టి మూడు వర్ణాల వారు దానిని పొందటం చాలా కష్టం".

30. వీతహవ్యోపాఖ్యానము

యుధిష్ఠిరుడడిగాడు. "కురుకులోద్వహా ! వాగ్మిశ్రేష్ఠా ! బ్రాహ్మణత్వాన్ని పొందటం చాలా కష్టమంటూ నీవు చెప్పిన గొప్ప ఉపాఖ్యానాన్ని విన్నాను. సత్తమా ! విశ్వామిత్రుడు గతంలో బ్రాహ్మణత్వాన్ని పొందాడని వింటున్నాం. కానీ అది పొందలేనిదని నీవు చెప్తున్నావు. రాజా ! వీతహవ్యుడనే రాజు కూడా బ్రాహ్మణత్వాన్ని పొందాడని విన్నాను. గాంగేయా ! ఇప్పుడు ఆ విషయాన్ని వినగోరుతున్నాను. రాజశ్రేష్ఠుడైన వీతహవ్యుడు ఏ కర్మ ద్వారా

బ్రాహ్మణత్వాన్ని పొందగలిగాడు ? లేదా వరం ద్వారానా ? తపస్సు ద్వారానా ? దానిని నాకు చెప్పవలసింది". భీష్ముడు చెప్తున్నాడు. "రాజా ! మహాయశస్వి, రాజర్షి అయిన వీతహవ్యనరపాలుడు లోకసత్కృతమైన బ్రాహ్మణత్వాన్ని ఎలా పొందగలిగాడో చెపుతాను విను. నాయనా ! ధర్మబద్ధంగా ప్రజాపాలన చేస్తున్న మహాత్ముడైన మనువుకు ఒక కొడుకు పుట్టాడు. అతని పేరు శర్యాతి. విజయిశ్రేష్ఠా ! రాజా ! ఆయన వంశంలోని వత్సరాజుకు ఇద్దరు కొడుకులు పుట్టారు. వారు హైహయుడు, తాళజంఘుడు. వారు కూడా గొప్ప పేరు తెచ్చుకొన్న రాజులే. హైహయునకు పదిమంది భార్యలు. వారికి వందమంది కొడుకులు పుట్టారు. వారు శూరులు, యుద్ధంలో వెనుదిరగనివారు. వారంతా రూపంలోనూ, ప్రభావంలోనూ సమానులే. బలశాలురే. రణరంగానికి వన్నె తెచ్చేవారే. ధనుర్వేద, వేదాలకు సంబంధించి సర్వ విషయాలలో కృషి చేసినవారు. రాజా ! ఆ రోజుల్లోనే కాశీ ప్రాంతంలో హర్యశ్వుడనే రాజు ఉండేవాడు. ఆయన దివోదాసునకు పితామహుడు. జయ శీలురలో శ్రేష్ఠుడు. పురుషశ్రేష్ఠా ! వీతహవ్యుని కొడుకులు వచ్చి గంగా యమునల మధ్య ప్రాంతంలో యద్ధంలో హర్యశ్వుని సంహరించారు. ఆ హర్యశ్వనరపాలుని చంపి మహారథులైన హైహయులు నిర్భయులై వత్సవంశీయుల రమ్యనగరానికి తిరిగి వచ్చారు. హర్యశ్వుని కొడుకు సుదేవుడు కాశి రాజుగా పట్టాభిషిక్తు డయ్యాడు. ఆయన దేవ సమానుడు. సాక్షాత్తు మరొక యమధర్మ రాజువంటివాడు. ధర్మాత్ముడైన ఆ కాశిరాజ కుమారుడు రాజ్యపాలన చేస్తున్న సమయంలో వీతహవ్యుని కుమారులందరూ వచ్చి, యుద్ధంలో సుదేవుని ఓడించారు.

ఆ సుదేవుని యుద్ధంలో పడగొట్టి వచ్చినట్లే వెళ్ళిపోయారు. ఆ తరువాత సుదేవుని కొడుకైన దివోదాసుడు కాశిరాజుగా పట్టాభిషిక్తుడయ్యాడు. మహాతేజస్వి అయిన దివోదాసుడు నియత మనస్కులైన హైహయరాజకుమారుల పరాక్రమాన్ని గమనించి, ఇంద్రుని ఆదేశం మేరకు కాశీ నగరాన్ని నిర్మించాడు. ఆ నగరం విప్రులతో, క్షత్రియులతో, వైశ్యులతో, శూద్రులతో నిండి ఉంది. వివిధ ద్రవ్య సముచ్చయంతో కూడినది. పెద్ద పెద్ద దుకాణాలు, అంగళ్ళు అక్కడుంటాయి. రాజసత్తమా ! ఆ నగర ప్రాకారం గంగానదికి ఉత్తర తటం నుండి గోమతీ నదికి దక్షిణ తటం వరకు వ్యాపించి ఉంది. అది ఇంద్రుని అమరావతి వలె శోభిస్తోంది. భారతా ! అక్కడ నివసిస్తున్న రాజశ్రేష్ఠుడైన ఆ మహారాజు మీదికి హైహయులు వచ్చి మరలా దాడిచేశారు. మహాతేజస్వి, మహాబలుడు అయిన ఆ దివోదాస నరపాలుడు నగరం నుండి వెలుపలికి వచ్చి, వారితో యుద్ధం చేశాడు.

దేవాసుర సంగ్రామం వలె ఘోర యుద్ధం జరిగింది. మహారాజా ! కాశిరాజు వేయి రోజులపాటు యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో దివోదాసుని సైనికులు, ఏనుగులు, గుర్రాలు చనిపోయాయి. ధనాగారం నిండుకొన్నది. ఆ దివోదాసరాజు దైన్యాన్ని పొందాడు. నగరాన్ని విడిచి పారిపోయాడు. ఆ రాజు ధీమంతుడైన భరద్వాజుని రమణీయాశ్రమానికి వెళ్ళి, చేతులు జోడించి ఆయన శరణు కోరారు. బృహస్పతి పెద్ద కొడుకు అయిన భరద్వాజుడు శీలసంపన్నుడు. దివోదాస నరపాలునకు పురోహితుడు. ఆయన దివోదాసరాజును ఇలా అడిగాడు. "రాజా ! నీవు వచ్చిన పని ఏమిటి ? అంతా చెప్పు. నీకు నేను ఏం ప్రియం చేయగలను ? ఈ విషయంలో నేను అన్యధా ఆలోచించను". రాజు చెప్తున్నాడు. "స్వామీ ! వీతహవ్యుని కుమారులు యుద్ధంలో నా వంశాన్ని నాశనం చేశారు. నేను ఒక్కడనే మిగిలి ఎంతో దుఃఖంతో నీ శరణు కోరి వచ్చాను. శిష్యవాత్సల్యంతో నీవు నన్ను రక్షించాలి. ఆ పాపకర్ములు నా వంశంలో నన్ను ఒక్కడినే మిగిల్చారు". భాగ్యశాలి, ప్రతాపవంతుడైన భరద్వాజుడు ఆయనతో ఇలా అన్నాడు. "దివోదాసా ! సుదేవకుమారా ! భయపడవద్దు. భయపడవద్దు. నీ భయాన్ని పోగొట్టుకో ! రాజా ! నీవు పుత్రుని పొందటానికై నేను యాగం చేస్తాను. అతని సహకారంతో నీవు వేలమంది వీతహవ్యులనైనా సంహరించగలవు". ఆ తరువాత ఆ ఋషి దివోదాసునకు పుత్రుని కలిగించటానికై యాగం చేశాడు. దానితో దివోదాసునకు కొడుకు పుట్టాడు. అతని పేరు ప్రతర్దనుడు.

ఆ బాలుడు పుట్టిన వెంటనే పదమూడేండ్ల వాడుగా ఎదిగాడు. భారతా ! అప్పుడే అతడు తన నోటి నుండి వేదాన్ని, ధనుర్వేదాన్ని పూర్తిగా ఉచ్చరించాడు. ధీమంతుడైన భరద్వాజుడు అతని యోగశక్తి సంపన్నుని చేశాడు. లోకంలోని తేజస్సునంతా సంగ్రహించి, అతని శరీరంలో ప్రవేశపెట్టాడు. ఆపై ఆ ప్రతర్దనుడు కవచాన్ని, వింటినీ ధరించి, దేవర్షుల స్తుతుల నందుకొంటూ, వందుల అభివాదనల నందుకొంటూ ఉదయించిన సూర్యునివలె ప్రకాశించాడు. ఆ ప్రతర్దనుడు కత్తిని కట్టుకొని, రథాన్ని ఎక్కి, ప్రజ్వలించే అగ్నివలె ప్రకాశించాడు. కవచాన్ని దాల్చి, కత్తిని పట్టి, వింటిని పట్టి, ధనుష్టంకారం చేస్తూ బయలుదేరాడు. అతనిని చూసి సుదేవసుతుడు (దివోదాసుడు) పరమహర్షాన్ని పొందాడు. వీతహవ్యుని కుమారులందరూ తగులబడినట్లే ఆ రాజు మనసా భావించాడు. ఆ తరువాత దివోదాసుడు ప్రతర్దనుని యువరాజుగా అభిషేకించాడు. అప్పుడు తనను కృతకృత్యునిగా భావించుకొని ఆ రాజు అభినందించుకొన్నాడు. ఆపై ఆ రాజు వీతహవ్యుని కుమారులను సంహరించటానికి ప్రతర్దనుని పంపించాడు. పరపురంజయుడు, పరాక్రమశాలి అయిన

ఆ ప్రతర్దనుడు వేగంగా రథంతో పాటు గంగను దాటి, వీతహవ్యుల రాజధానీ నగరం వైపు బయలుదేరాడు. వీతహవ్యుని కొడుకులు ఉద్ధతంగా వినిపిస్తున్న రథఘోషను విని, శత్రురధాలను విరగదీయగల కొండలవంటి రధాలనెక్కి, నగరం బయటకు వచ్చారు. చిత్రంగా పోరాడగల ఆ నరోత్తములు కవచాలు ధరించి వెలుపలికి వచ్చి, ఆయుధాలనెత్తి పట్టి శరవృష్టిని కురిపిస్తూ ప్రతర్దనుని మీదకు వచ్చారు. యుధిష్ఠిరా ! హిమవంతునిపై మేఘాలు కురిసినట్టు రథసమూహాల మీద నుండి వివిధాకారాలు గల ఆయుధాలను ఆ రాజుపై కురిపించారు. మహాతేజస్వి అయిన ప్రతర్దన మహారాజు తన అస్త్రాలతో వారి అస్త్రాలను నివారించి, వజ్రంతో, అగ్నితో సమానాలయిన బాణాలతో వారిని సంహరించాడు. భల్లాలతో వందలు, వేల తలలు తెగిపడ్డాయి. అవి నెత్తుటితో తడిసి, త్రుంచిన కింశుకకుసుమాల వలె కూలాయి. ఆపై ఆ కుమారులందరూ చనిపోగానే వీతహవ్యుడు నగరాన్ని విడిచి, భృగుమహర్షి ఆశ్రమం వైపు పరుగెత్తాడు.

వీతహవ్య నరాధిపుడు భృగువును శరణుకోరాడు. రాజా ! అప్పుడు భృగువు ఆ రాజుకు అభయమిచ్చాడు. ఆపై వీతహవ్యుని వెంటనే ప్రతర్దనుడు కూడా ఆ ఆశ్రమానికి వచ్చాడు. దివోదాసుని కొడుకు (ప్రతార్దనుడు) ఆశ్రమపదానికి వచ్చి ఇలా అన్నాడు. "ఇదిగో ! ఆశ్రమంలో భృగుశిష్యులైన మహాత్ము లెవరున్నారు ? నేను ఆ మునిని చూడగోరుతున్నాను. నేను వచ్చినట్లు ఆయనకు చెప్పండి". ప్రతర్దనుడు వచ్చినట్లు తెలిసికొని అప్పుడు భృగువు ఆశ్రమం నుండి బయటకు వచ్చాడు. యధావిధిగా ఆ రాజశ్రేష్ఠుని సత్కరించాడు. 'రాజా ! పని ఏమిటో చెప్పు' అని ప్రతర్దనుని అడిగాడు. ఆ ప్రతర్దన రాజు తన రాకకు కారణాన్ని ఇలా చెప్పాడు. "బ్రాహ్మణా ! వీతహవ్యరాజును మీ ఆశ్రమం నుండి బయటకు పంపండి. ఆయన కొడుకులు నా వంశాన్ని పూర్తిగా నాశనం చేశారు. అంతేగాక కాశీ ప్రాంతాలనన్నింటినీ పాడు చేశాడు. రత్న సమూహాలను దోచుకొన్నారు. పరాక్రమంతో గర్వించిన ఇతని కొడుకులను వందమందినీ నేను చంపాను. ఇప్పుడు ఇతనిని కూడా చంపి, పితృఋణ విముక్తి నందుతాను". ధర్మధారులలో శ్రేష్ఠుడైన భృగువు దయతో ప్రతర్దనునితో "ఇక్కడ క్షత్రియుడొక్కడూ లేడు. ఉన్నవారంతా బ్రాహ్మణులే" అన్నాడు. భృగువు చెప్పిన ఈ వాస్తవ వచనాన్ని విని, ప్రతర్దనుడు భృగువు పాదాలను మెల్లగా తాకి, ఆనందంతో ఇలా అన్నాడు. "భగవానుడా ! అలా అయితే నేను కృతకృత్యుడనైనట్లే. సంశయం లేదు. బ్రాహ్మణా ! ఈ రాజును నేను నా పరాక్రమంతో తన కులాన్ని వదలుకొనేటట్లు చేయగలిగాను. నన్ను వెళ్ళటానికి అనుమతించు. నా

శుభాన్ని ఆకాంక్షించు. భృగూద్వహా ! నేను ఈ రాజును తన జాతిని వదలుకొనేటట్లు చేశాను". మహారాజా ! ఆపై ఆ మహర్షి అనుమతితో ప్రతర్దన మహారాజు విషం క్రక్కి పాము వెళ్ళిపోయినట్లు వచ్చిన రీతిగానే మరలిపోయాడు.

మహారాజా ! భృగువు పలికినంత మాత్రాననే వీతహవ్యుడు బ్రహర్షిత్వాన్ని, బ్రహ్మవాదిత్వాన్ని పొందాడు. ఆయన కొడుకు గృత్సమదుడు. అతడు రూపంతో ఇంద్రసమానుడు. దైత్యులు ఒకప్పుడు ఆయనను చూసి "నీవే ఇంద్రుడ" వంటూ బంధించారు కూడా. ఋగ్వేదంలో మహాత్ముడైన గృత్సమదుని గొప్ప శ్రుతి కూడా ఉంది. అక్కడ బ్రాహ్మణులు గృత్సమదుని గొప్పగా ఆదరించే వారు. బ్రహ్మర్షి అయిన గృత్సమదుడు మహాతేజస్వి, బ్రహ్మచారి కూడా. గృత్సమదుని కుమారుడు సుచేతుడు కూడా బ్రాహ్మణు డయ్యాడు. సుచేతుని కొడుకు వర్చుడు. ఆయన కొడుకు విహవ్యుడు. విహవ్యుని కొడుకు వితత్యుడు. వితత్యుని కొడుకు సత్యుడు. సత్యుని కొడుకు సంతుడు. సంతుని కొడుకు శ్రవుడు. శ్రవుని కొడుకు తముడు, తముని కొడుకు ప్రకాశుడు. ఆయన ద్విజసత్తముడు. ప్రకాశుని కొడుకు వాగింద్రుడు. ఆయన విజయశీలురలో శ్రేష్ముడు. వాగింద్రుని కొడుకు ప్రమితి. ఆయన వేదవేదాంగ పారంగతుడు. ప్రమితికి, ఘృతాచి అనే అప్సరకు రురువు కొడుకుగా పుట్టాడు. రురువుకు ప్రమద్వరయందు ఒక కొడుకు పుట్టాడు. ఆయన పేరు శునకుడు. ఆ శునకుని కొడుకే బ్రహ్మర్షి అయిన శౌనకుడు. ఈ రీతిగా నరాధిపుడైన వీతహవ్యుడు క్షత్రియుడు, క్షత్రియ శ్రేష్ముడై కూడా భృగువు అనుగ్రహంతో బ్రాహ్మణత్వాన్ని పొందాడు. మహారాజా ! ఇలా గృత్సమదుని వంశాన్ని గురించి విస్తరంగా చెప్పాను. ఇంకా ఏమి అడుగదలచుకొన్నావు ?"

31. కృష్ణనారద సంవాదము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "భరతర్షభా ! మూడు లోకాలలోనూ పూజింపదగిన మానవులెవరు ? సవిస్తరంగా చెప్పు. ఎంత చెప్పినా తృప్తి కలగటం లేదు". భీష్ముడు చెప్తున్నాడు. "ఈ విషయమై కూడా శ్రీ కృష్ణ నారద సంవాద రూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. నారదుడు చేతులు జోడించి, ద్విజశ్రేష్ములను పూజించు చుండగా చూసిన కౌశవుడు ఇలా అడిగాడు. "భగవానుడా ! ఎవరికి నమస్కరిస్తున్నావు ? భగవంతుడా ! ధర్మవత్తమా ! వారిపై ఎంతో ఆదరాన్ని ప్రదర్శిస్తూ, నీవు కూడా నమస్కరిస్తున్నావు. మేము వినగలిగిన దయితే చెప్పవలసినది".

నారదుడు చెప్తున్నాడు. "గోవిందా ! నేను ఎవరిని పూజిస్తున్నానో చెపుతా విను. దీనిని వినటానికి లోకంలో నీవు తప్ప యోగ్యుడు మరెవరున్నారు ? వరుణుని, వాయువును, ఆదిత్యుని, పర్జన్యుని, అగ్నిని, స్థాణువును, స్కందుని, లక్ష్మిని, విష్ణువును, బ్రహ్మను, బృహస్పతిని, చంద్రుని, భూమిని, సరస్వతిని నిత్యమూ నమస్కరించే వారికి నేను నమస్కరిస్తున్నాను. వృష్ణి వంశ శ్రేష్ఠా ! తపోధనులై, వేదవేత్తలై, నిత్యమూ వేదపారాయణం చేస్తున్న మహనీయులకు నేను సదా నమస్కరిస్తున్నాను. రాజా ! భోజనానికి ముందు దేవకార్యాలను చేస్తూ, ప్రగల్భాలు పలుకకుండా, సంతుష్టులై, క్షమాశీలురై ఉన్నవారికి నమస్కరిస్తున్నాను. చక్కగా యాగాలు చేస్తూ క్షమాశీలురై, జితేంద్రియులై, మనస్సును అదుపు చేసికొని సత్యాన్ని, ధర్మాన్ని, భూమిని, గోవులను పూజించేవారికి నమస్కరిస్తున్నాను. యాదవా ! వనవాసం చేస్తూ ఫలమూలాలను తింటూ తపోనిష్ఠులై, దేనినీ ప్రోగుచేసికొనకుండా కర్మ నిష్ఠులైన వారికి నమస్కరిస్తున్నాను. భృత్యులను పోషించటంలో సమర్థులై, నిత్యమూ అతిధిసేవా తత్పరులై, దేవతలకు నివేదించి, మిగిలినదాన్నే భక్షించే వారికి నమస్కరిస్తున్నాను. వేదాధ్యయనం చేసి, ఎవరికీ ఎదరింపరానివారై, ప్రవచన చతురులై, బ్రహ్మచారులై, నిత్యమూ యాగాలు చేయించటంలో, అధ్యాపనలో ఆసక్తులైనవారికి నమస్కరిస్తున్నాను. నిత్యమూ సర్వప్రాణులయందూ ప్రసన్న హృదయులై ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వేదాధ్యయన తత్పరులై ఉన్న వారికి నమస్కరిస్తున్నాను. యాదవా ! గురుప్రసాదాన్ని పొందటంలోనూ, స్వాధ్యాయంలోనూ ప్రయత్న శీలురై, స్థిరవ్రతులై, గురుశుశ్రూష చేస్తూ ఎవరినీ తప్పుపట్టని వారికి నమస్కరిస్తున్నాను. ఉత్తమ వ్రతాలను పాటిస్తూ, మననశీలురై, సత్యప్రతిజ్ఞులై, హవ్య కవ్యాలను యథానియమంగా వహించే బ్రాహ్మణులకు నమస్కరిస్తున్నాను. గురుకులాన్ని ఆశ్రయించి, భిక్షతో జీవితాన్ని గడుపుతూ, తపోనిరతిచే కృశించి, సుఖాపేక్షను వీడి, ధన సంపాదనకై దృష్టిపెట్టని వారికి నమస్కరిస్తున్నాను.

మమకారాన్ని వీడి, శత్రురహితులై, బిడియపడనివారై, ఎక్కడా ఏ ప్రయోజనాన్ని ఆశింపనివారై, వేదజ్ఞానంలో ఎదురులేనివారై, వాగ్ములై, వేదవాదులై, అహింసా నిరతులై, సత్యవ్రతులై ? ఇంద్రియ నిగ్రహం, మనోనియంత్రణలపై ఆసక్తులైన నరులకు నమస్కరిస్తున్నాను. నిత్యమూ కపోతవృత్తితో జీవిస్తూ, దేవతాతిధి పూజలయందు ఆసక్తి గల గృహస్థులకు నమస్కరిస్తున్నాను. ఎవరి పనులలో ధర్మార్థకామాలు ఏ ఒక్కటీ మరొక దానిని నష్టపరచకుండా ప్రవర్తిస్తాయో, అటువంటి శిష్టాచార ప్రవర్తకులకు సదా నమస్కరిస్తున్నాను. కేశవా ! వేదశాస్త్ర జ్ఞాన సంపన్నులై, ధర్మార్థకామాలను సేవిస్తూ,

లోలుపత్వం లేకుండా పవిత్ర శీలంతో ప్రవర్తించే వారికి నమస్కరిస్తున్నాను. మాధవా ! వివిధ వ్రతాలను పాటిస్తూ నీటినో, గాలినో, యజ్ఞశేషాన్నో ఆహారంగా స్వీకరించే వారికి నమస్కరిస్తున్నాను. బ్రహ్మచర్యాన్ని పాటించేవారు, అగ్నిహోత్ర సహితులు, వేదాన్ని ధరించేవారు, సర్వప్రాణులను ఆత్మ స్వరూపంగా భావించేవారు - అటువంటి వారికి సర్వదా నమస్కరిస్తున్నాను. కృష్ణా !-లోకకర్తలయిన ఋషులు, లోకంలో సర్వశ్రేష్ఠులు, ఉత్తమ వంశ సంజాతులు, అజ్ఞానాంధకారాన్ని భంగపరచేవారు, సూర్యునివలె లోకాలకు వెలుగునిచ్చేవారు - అటువంటి వారికి నిత్యమూ నమస్కరిస్తున్నాను.

కాబట్టి వార్ష్ణేయా ! నీవు కూడా నిత్యమూ బ్రాహ్మణులను పూజించు. పూజనీయులను పూజిస్తే వారు నీకు సుఖాన్ని ప్రసాదిస్తారు. ఈ బ్రాహ్మణులు ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సుఖాన్ని దానం చేయగలవారు. వారు సత్కరింపబడితే నీకు తప్పక సుఖాన్ని కలిగిస్తారు. సర్వదా అతిథులనందరినీ ఆదరించేవారు, నిత్యమూ గోవులపై, బ్రాహ్మణులపై, సత్యంపై ఆసక్తిగలవారు సంకటాలను దాటిపోగలరు. నిత్యమూ మనస్సును నియంత్రించుకొన్నవారు, అసూయలేనివారు, నిత్య స్వాధ్యాయ తత్పరులు కష్టాల నుండి బయట పడగలరు. వేదాన్ని మాత్రమే ఆశ్రయించి, సర్వ దేవతలకూ నమస్కరిస్తూ, శ్రద్ధధానులై, ఇంద్రియాలను వశపరచుకొన్నవారు ఇబ్బందులను అతిక్రమించగలరు. అదే రీతిగా బ్రాహ్మణ శ్రేష్ఠులకు నమస్కరిస్తూ, నియమ పూర్వకంగా వ్రతాలను పాటిస్తూ, దాన పరాయణులైన వారు కష్టాలను అతిక్రమింపగలరు. తపస్సులు, ఆజన్మ బ్రహ్మచారులు, తపస్సుతో పవిత్రమైన అంతఃకరణం గలవారు సంకటాల నుండి బయట పడగలరు. దేవతలను, అతిథులను, భృత్యులను, పితరులను పూజించుటయందు ఆసక్తి గలిగి, యజ్ఞశేషమైన అన్నాన్ని భుజించేవారు ఇబ్బందులను దాటిపోగలరు. యథావిధిగా అగ్నిని స్థాపించి, దానికి నమస్కరిస్తూ, దానిని రక్షిస్తూ సోమరసాన్ని ఆహుతి చేసినవారు క్లేశాల నుండి బయటపడగలరు. సదా తల్లి, తండ్రి, గురువు - వీరితో యథోచితంగా నీవలె ప్రవర్తిస్తున్నవారు సంకటాల నుండి తప్పించుకొనగలరు" అని చెప్పి నారదుడు విరమించాడు. కాబట్టి కౌంతేయా ! నీవు కూడా పితరులను, దేవతలను, బ్రాహ్మణులను, అతిథులను, నిత్యమూ చక్కగా పూజించు ! ఇష్టగతిని పొందగలవు.

32. శ్యేనకపోత సంవాదము.

యుధిష్ఠిరుడడిగాడు. "పితామహా ! మహాప్రాజ్ఞా ! నీ నుండి నేను ధర్మాన్ని వినగోరుతున్నాను. శరణుకోరి వచ్చిన నాలుగు విధాల ప్రాణులను (అండజ, పిండజ, స్వేదజ, ఉద్భిజాలు) రక్షించిన వానికి ఏ ఫలం లభిస్తుందో ఉన్నదున్నట్లు చెప్పాలి". భీష్ముడు చెప్తున్నాడు. "ధర్మపుత్రా ! శరణాగతరక్షణంతో పొందే మహాఫలానికి సంబంధించి గతంలో జరిగిన ఒక ఇతిహాసాన్ని చెపుతాను విను.

అందమైన ఒక పావురం తన మీద డేగపడుతుండటంతో మహాభాగుడైన వృషదర్భ రాజును శరణుచొచ్చింది. పవిత్ర హృదయుడైన ఆ రాజు భయంతో తన ఒడిలో చేరిన ఆ పావురాన్ని ఊరడించి ఇలా అన్నాడు. "పక్షీ ! ఊరడిల్లు. నీకు భయం లేదు. దేనివలన నీవింతగా భయపడుతున్నావు ? నీవు ఎక్కడ, ఏం చేశావు ? ఇలా బుద్ధి చలించి, చైతన్యాన్ని కోల్పోతున్నట్లుగా నా దగ్గరకు ఎందుకు వచ్చావు ? క్రొత్త నల్లకలువల హారం వలె అందమైన రంగు నీది. చూడముచ్చటగా ఉన్నావు. నీ కన్నులు దానిమ్మ, అశోక పుష్పాలవలె ఉన్నాయి. భయపడవలదు. నీకు అభయమిస్తున్నాను. నా దగ్గరకు వచ్చిన నిన్ను పట్టుకోవటానికి మనసా కూడా ఎవ్వడూ సాహసం చేయడు. నీవు రక్షాధ్యక్షుని దగ్గర ఉన్నావు. నీ కోసం ఇప్పుడే కాశీ రాజ్యాన్ని అయినా, అలాగే నా జీవితాన్ని అయినా పరిత్యజిస్తాను. నమ్మి నిశ్చింతగా ఉండు. నీకు భయం లేదు".

డేగ ఇలా అన్నది. "రాజా ! ఇది నాకు ఆహారంగా విధింప బడినది. నీకు రక్షింపదగదు. నాకు చిక్కి, ఇక ఇది మరణించినట్లే. నేను ఎంతో ప్రయత్నించి దీనిని పొందాను. నాకు దీని మాంసం, నెత్తురు, మజ్జ, క్రొవ్వు హితకరాలు. నా ఆకలి తీర్చి, నాకు ఆనందాన్ని కలిగించేది ఇది. నీవు దీని ముందు నిలిచి నాకు అడ్డు రావద్దు. నాకు చాలా దప్పికగా ఉంది. ఆకలి నన్ను దహించి వేస్తోంది. రాజా ! దీనిని విడిచిపెట్టు. నా ఆకలిని నేను తగ్గించుకోలేను. నేను దీనిని తరిమాను. నా రెక్కలతో, గోళ్ళతో దీన్ని గాయపరిచాను. రాజా ! ఇప్పుడిది కొన ఊపిరితో ఉంది. దీన్ని రక్షింపదగదు. నీ రాజ్యంలోని ప్రజలను రక్షించటానికే నీవు రాజువు. ఆకలి దప్పులతో ఉన్న పక్షి విషయంలో నీవు రాజువు కావు. నీకు పరాక్రమశక్తి ఉంటే నీ శత్రువులపై, సేవకులపై, బంధువులపై, వ్యవహారాలలో, ఇంద్రియ విషయాలపై దానిని ప్రదర్శించు. ఆకాశచారులమైన మాపై పరాక్రమించవద్దు. నీ మాటను కాదని శత్రు పక్షంలో చేరిన వారిపై నీవు పరాక్రమించి నీ ప్రభుత్వాన్ని చక్కగా ప్రదర్శించవచ్చు. నీవు ధర్మదృష్టితోనే ఈ పక్షిని రక్షింపదలచుకొంటే

ఆకలితో ఉన్న నన్ను కూడా గమనించాలి".

భీష్ముడు చెప్తున్నాడు. "డేగ చెప్పిన ఆ మాటలు విని ఆ రాజర్షి ఆశ్చర్యపడ్డాడు. దాని మాటను మన్నించి, దాని కోసమై ఇలా బదులు పలికాడు". "ఎద్దును కానీ, పందిని కానీ, జింకను కానీ, దున్నపోతును కానీ నీ ఆకలి తీరటానికి ఇప్పుడే నేను నీకు ఇస్తాను. శరణాగతుని విడువను అని నేను వ్రతాన్ని పూనాను. ఈ పక్షిని చూడు. పక్షీ ! ఇది నా శరీరాన్ని విడువటం లేదు." డేగ ఇలా అన్నది. "మహారాజా ! పందిని కానీ, ఎద్దును కానీ, మరే ఇతర పక్షులనైనా కానీ నేను తినను. ఇతరుల భోజనాన్ని తీసికొని నేనేం చేసేది. దేవతలు అనాదిగా నాకు ఆహారంగా విధించిన దానినే నేను తింటాను. డేగలు పావురాలను తింటాయి. ఇది సనాతన స్థితి. అనఘా ! ఉశీనరా ! నీకు అంతగా దానిపై స్నేహముంటే, దానికై నేడు త్రాసులో తూచి నీ మాంసాన్ని నాకిమ్ము." రాజు ఇలా అన్నాడు. "నీవు నాతో ఇలా అనటం ఈనాడు నాపై ఎంతో అనుగ్రహాన్ని చూపినట్లు. అలాగే చేస్తాను" అని ఆ రాజశ్రేష్ఠుడు తన శరీరంలోని మాంసాన్ని ముక్కలు ముక్కలుగా కోసి, త్రాసులో వేసి, తూచసాగాడు.

అప్పుడు రత్నాభరణాలు ధరించి అంతఃపురంలో నున్న అతని భార్యలు ఆ విషయం విని, హాహాకారాలు చేస్తూ బయటకు వచ్చారు. వారి రోధన ధ్వనితో, మంత్రులు, సేవకులు, ఇతర జనుల హాహాకారాలతో మేఘ గంభీర ధ్వని వంటి మహానాదం అక్కడ చెలరేగింది. ఆ మహారాజు చేస్తున్న సత్యకర్మతో ఆకాశమంతా, అన్ని వైపులా మేఘాలు స్తంభించాయి. భూమి కదలసాగింది. ఆ రాజు ప్రక్కల నుండి, బాహువుల నుండి, తొడల నుండి ఆపకుండా మాంసాన్ని కోసి త్రాసులో వేస్తూనే ఉన్నాడు. అయినా అవి ఆ పావురంతో తులతూగలేదు. అప్పుడు ఆ రాజు నెత్తురోడుతూ మాంసమేమీ లేకుండా ఎముకలతో మిగిలాడు. ఆపై మాంసాన్ని కోయటాన్ని ఆపి, తానే స్వయంగా త్రాసులో కూర్చున్నాడు. అప్పుడు మూడు లోకాలలోని జనులు ఇంద్రునితో సహా ఆ రాజు దగ్గరకు వచ్చారు. ఆకాశంలో భేరులు మ్రోగాయి. దేవతలు దుందుభులు మ్రోగించసాగారు. వృషదర్భ రాజును అమృతంతో అభిషేకించారు. సుఖాన్ని కలిగించే దివ్య పుష్పవృష్టిని పదే పదే కురిపించారు. దేవగంధర్వ సమూహాలు, అప్సరసలు అన్నివైపులా నిలిచి, నృత్య గీతాలతో ప్రభువయిన పితామహునివలె ఆయనను సేవించారు.

అంతలోనే దివ్యవిమానం అక్కడకు వచ్చింది. దానిపై బంగారు మహళ్ళు, మణికాంచన తోరణాలు, వైడూర్యమణి స్తంభాలున్నాయి. యుధిష్ఠిరా ! నీవు కూడా

శరణాగతుల విషయంలో ఇలాగే ప్రవర్తించు. భక్తులను, అనురక్తులను, ఆశ్రితులను రక్షించు, సర్వప్రాణులపై దయకలిగి ఉండు. పరలోకంలో సుఖంతో వర్ధిల్లుతావు. రాజు సదాచారియై, సరిగా ప్రవర్తిస్తే తన నిష్కపట కర్మతో తాను పొందలేనిది ఉండదు. సత్యపరాక్రముడు, పవిత్ర హృదయుడు, ధీరుడు, కాశీదేశాధిపతి అయిన ఆ రాజర్షి తన పుణ్యకర్మ ద్వారా మూడులోకాలలోను విఖ్యాతిని పొందాడు. భరతసత్తమా ! మరే ఇతర రాజయినా సరే ! ఇలా శరణాగతులను రక్షిస్తే తాను కూడా ఇటువంటి స్థితినే పొందగలడు. రాజర్షి అయిన వృషదర్భుని ఈ వృత్తాంతాన్ని నిత్యమూ కీర్తించినా, విన్నా ఆ వ్యక్తి లోకంలో పుణ్యాత్ముడవుతాడు."

33. బ్రాహ్మణ మాహాత్మ్యవర్ణనము.

యుధిష్ఠిరుడడిగాడు. "పితామహా ! రాజులకు పనులన్నింటిలోనూ ఏ పని గొప్పది ? రాజు ఏ పని చేస్తే ఇహపరలోకాలలో సుఖించగలడు ?" భీష్ముడు చెప్తున్నాడు. "భారతా ! పట్టాభిషిక్తుడైన రాజునకు బ్రాహ్మణుల సేవించుటయే పరమ కృత్యం. భరతర్షభా ! పరమ సుఖాన్ని కోరుకొనే రాజశ్రేష్ఠులకు ఇదియే కర్తవ్యం.

వేద పండితులైన బ్రాహ్మణులను, వృద్ధులను నిత్యమూ పూజించాలి. నగరాలలో అయినా జనపదాలలో అయినా నివసిస్తూ పండితులై ఉన్న బ్రాహ్మణులను అనునయ వచనాలతో, భోగ ప్రదానాలతో, నమస్కారాలతో అర్చించాలి. రాజునకు ఇదే పరమ కృత్యమని ఎల్లప్పుడూ గుర్తించాలి. తనను, తన బిడ్డలను కాపాడుకొన్నట్లు ఈ బ్రాహ్మణులను రక్షించాలి. ఈ బ్రాహ్మణులు కూడా పూజింపదగినవారిని కూడా గట్టిగా పూజించాలి. వారు శాంతంగా ఉంటే ఆ రాజ్యమంతా విరాజిల్లుతుంది. తల్లితండ్రులను పూజించినట్లు వారిని పూజించాలి. వారికి నమస్కరించాలి. ప్రాణుల జీవనం ఇంద్రునిపై ఆధారపడి ఉన్నట్లు, లోకయాత్ర కూడా వారి మీదనే ఆధారపడి ఉంటుంది. సత్యపరాక్రములైన బ్రాహ్మణులు కోపంతో ఉగ్రరూపం ధరిస్తే, అభిచారోపాయాలతో మనస్సంకల్పం చేతనే దహిస్తారు. సర్వనాశనం చేస్తారు. వారికి హద్దు అనేది ఉండదు. దిక్కులు కూడా వారికై తలుపులు మూయవు. వారు కోపిస్తే, దావాన్ని జ్వాలల వలె చూస్తూ దహింపగలరు. సాహసికులు కూడా వీరిని చూసి భయపడతారు. వారి గుణాలకు మితిలేదు. వారిలో కొందరు గడ్డికప్పిన బావుల వంటివారు. కొందరు నిర్మలాకాశం వంటివారు. కొందరు మొండివాళ్ళు. కొందరు దూదివలె మృదు స్వభావులు. వారిలో సాధువులను గౌరవించాలి.

అసాధువులను నిందించగూడదు. వీరిలో కొందరు వంచకులు, కొందరు తపస్వులు. కొందరు వ్యవసాయాన్ని, కొందరు పశుపాలనను వృత్తిగా స్వీకరిస్తారు. కొందరు భిక్షాటనను పాటిస్తారు. కొందరు దొంగలు. కొందరు అబద్దాలకోరులు. అలాగే మరికొందరు నటులు, నర్తకులు. భరతర్షభా ! కొందరు రాజుల దగ్గరయినా, ఇతరుల దగ్గరయినా అన్ని పనులను చేయగలవారు. బ్రాహ్మణులు వివిధాకారాలు ధరించి ఉంటారు. వివిధ కర్మానురక్తులై, వివిధ వృత్తులతో జీవితాన్ని గడుపుతూ, ధర్మజ్ఞులైన ఆ సత్పురుషులను నిత్యమూ కీర్తించాలి. రాజా ! అనాదిగా పితరులకు, దేవతలకు, మనుష్యులకు, నాగులకు, రాక్షసులకు కూడా మహాభాగులైన ఈ బ్రాహ్మణులు పూజింపదగినవారు.

ఈ బ్రాహ్మణులను దేవతలు కానీ, పితరులు కానీ, గంధర్వులు కానీ, రాక్షసులు కానీ, అసురులు కానీ, పిశాచులు కానీ గెలవలేరు. వారు దేవతకాని వానిని దేవతను చేయగలరు. దేవతను దేవత కాకుండా చేయగలరు. వారు ఇష్టపడినవాడే రాజు. వారి కిష్టం లేకపోతే పరాభవం తప్పదు. రాజా ! బుద్ధి మందగించి బ్రాహ్మణులను నిందిస్తే నిస్సంశయంగా నశించిపోతారు. నీకు సత్యం చెపుతున్నాను. రాజా ! నిందించటంలో, ప్రశంసించటంలో నేర్పరులై, కీర్తి - అపకీర్తి పరాయణులై బ్రాహ్మణులు తమను ద్వేషించే వారిపై కోపిస్తారు. బ్రాహ్మణులు ప్రశంసించినవాడు వృద్ధి పొందుతాడు. బ్రాహ్మణులు శపించిన వారు క్షణకాలంలో పరాభవాలకు గురి అవుతారు. శకులు, యవనులు, కాంబోజులు తొలుత క్షత్రియ జాతికి చెందినవారే కానీ బ్రాహ్మణుల అనుగ్రహం లేనందువలన శూద్రులయ్యారు. ద్రావిడులు, కలింగులు, పులిందులు, ఉశీనరులు, కోలిసర్పులు, మాహిషకులు ముందు క్షత్రియజాతికి చెందినవారే. కానీ బ్రాహ్మణుల అనుగ్రహం లేనందువలన శూద్రులయ్యారు. విజయిశ్రేష్ఠా ! వారిని గెలవటం కన్నా, వారి ద్వారా పరాజయాన్ని పొందటమే శ్రేయస్కరం. జగత్తునంతటినీ చంపినా, ఒక్క బ్రాహ్మణుని చంపిన ఫలంతో సమానం కాదు. బ్రహ్మహత్య మహాదోషమని పరమ మునులు పలికారు. బ్రాహ్మణ నిందను ఏ రీతిగానూ వినదగదు. వినవలసిన సందర్భంలో తలవాల్చి మౌనంగా కూర్చోవాలి. లేదా లేచి అక్కడ నుండి వెళ్ళిపోవాలి. ఈ లోకంలో బ్రాహ్మణులతో విరోధించి సుఖంగా జీవించటానికి సాహసించిన వాడు ఇంతవరకు పుట్టలేదు. ఇక పుట్టబోడు. రాజా . గాలిని పిడికిలితో పట్టలేము. చంద్రుని చేతితో తాకలేము. పృధివిని తలపై మోయలేము. లోకంలో బ్రాహ్మణులను గెలవలేము."

34. శ్రేష్ఠ బ్రాహ్మణ ప్రశంస.

భీష్ముడు చెప్తున్నాడు. "బ్రాహ్మణులనెప్పుడూ చక్కగా పూజించాలి. చంద్రుడు వీరికి రాజు. సుఖ దుఃఖాలను కలిగించటానికి వీరు సమర్థులు. రాజులు వీరిని తల్లిదండ్రులను వలె రక్షించాలి. భోగాలతో, అలంకారాలతో, ఏం కావాలో అడిగి వారు కోరిన ఇతర పదార్థాలతో పూజించి, సదా నమస్కరించాలి. అప్పుడే ఇంద్రుని ద్వారా ప్రాణులకు శాంతి కలిగినట్లు రాజ్యానికి శాంతి. రాజ్యంలో బ్రహ్మ వర్చస్వి, పవిత్రుడు అయిన బ్రాహ్మణుడు, శత్రువులను తపింజేసే మహారథుడైన క్షత్రియుడు పుట్టాలని అందరూ కోరుకోవాలి. రాజా ! పవిత్ర వంశంలో పుట్టి, ధర్మజ్ఞుడై, దృఢ వ్రతాలను ఆచరించే బ్రాహ్మణుని ఇంటిలో నిలుపుకోవాలి. అంతకన్నా గొప్పదేదీ లేదు. బ్రాహ్మణులకిచ్చిన హవిస్సును దేవతలు, పితరులు స్వీకరిస్తారు. సర్వప్రాణులలోనూ వీరికన్న విశిష్టుడు లేడు. ఆదిత్యుడు, చంద్రుడు, వాయువు, జలం, పృథివి, ఆకాశం, దిక్కులు అన్నీ బ్రాహ్మణునిలో ప్రవేశించి సదా అన్నాన్ని భుజిస్తారు. ఎవని అన్నాన్ని బ్రాహ్మణులు తినరో అతని అన్నాన్ని పితరులు స్వీకరింపరు. బ్రాహ్మణ ద్వేషియై, పాపాత్ముడైన అతని అన్నాన్ని దేవతలు కూడా స్వీకరింపరు. రాజా ! బ్రాహ్మణులు ఆనందిస్తే పితరులు, అలాగే దేవతలూ సదా ప్రసన్నులవుతారు. దీని విషయమై ఆలోచన అవసరం లేదు. అలాగే తానిచ్చిన హవిస్సు బ్రాహ్మణుల కుపయోగపడితే ఆ యజమాని కూడా ఆనందిస్తాడు, మరణానంతరం వారు నశించరు. పరమగతిని పొందగలరు. నరుడు ఏయే హవిస్సులతో బ్రాహ్మణులను తృప్తి పరుస్తారో, ఆయా హవిస్సులలోనే పితరులు, దేవతలు తృప్తిపడతారు.

యజ్ఞాదికర్మల ద్వారా సమస్త ప్రజలు పుడతారు. ఆ యజ్ఞం బ్రాహ్మణుని ద్వారానే సంపన్నమవుతుంది. ప్రాణి ఎక్కడ నుండి పుడుతుందో, మరణానంతరం ఎక్కడకు వెళుతుందో అదంతా బ్రాహ్మణునకు తెలుసు. స్వర్గానికీ, నరకానికీ పోయే మార్గం బ్రాహ్మణునకు తెలుసు. మనుష్యులలో శ్రేష్ఠుడైన బ్రాహ్మణునకు భూత భవిష్యత్తులు తెలుసు. భరతశ్రేష్ఠా ! స్వధర్మం కూడా చక్కగా తెలిసినవాడు బ్రాహ్మణుడే. ఆ బ్రాహ్మణుని అనుసరించినవారు పరాభావాన్ని పొందరు. మరణానంతరం నశించరు. పరాభావాన్ని పొందరు. సర్వప్రాణులను ఆత్మ స్వరూపంగా భావిస్తూ, బ్రాహ్మణుని నోటినుండి వచ్చిన మాటను శిరసా వహించే మహాత్ములు పరాభవాన్ని పొందరు. తేజస్సుతో, బలంతో తపించిపోయే క్షత్రియుల తేజస్సులు, బలాలు బ్రాహ్మణుని దగ్గర శాంతిస్తాయి. భరతర్షభా ! భృగువంశీయులు తాలజంఘులను, అంగిరోవంశీయులు నీపాన క్షత్రియులను, భరద్వాజుడు వైహతవ్యులను జయించారు. ఈ క్షత్రియులు విచిత్రాయుధాలు కలవారైనా కృష్ణాజినాన్నే

ధ్వజంగా గల బ్రాహ్మణులు ఓడించారు. క్షత్రియులు బ్రాహ్మణులకు కలశదానం చేసి, పారలౌకిక కార్యాల నారంభించాలి. లోకంలో చెప్పబడేది, వినబడేది, చదువబడేది ఏదైనా అదంతా కట్టెలో నిప్పులాగా బ్రాహ్మణులలోనే దాగి ఉంటుంది. భరతర్షభా ! ఈ విషయమై కూడా వాసుదేవునకు, పృథివికి మధ్య జరిగిన సంవారూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు.

వాసుదేవుడడిగాడు. "కళ్యాణీ ! సర్వప్రాణులకూ తల్లివయిన నిన్ను అడుగుతున్నాను. గృహస్థుడైన నరుడు ఏ కర్మ ద్వారా పాపాన్ని తొలగించుకొనగలడు" ? పృథివి అన్నది. "బ్రాహ్మణులను సేవించాలి. ఈ పని పవిత్రమూ, ఉత్తమమూ. బ్రాహ్మణుని సేవించే వానిలోని రజోగుణమంతా నశిస్తుంది. దానితో ఐశ్వర్యం, దానితో కీర్తి, దానితో సద్బుద్ధి కలుగుతాయి. సర్వదా సర్వవిధ సమృద్ధి కోసం శత్రుసంతాపకుడై, మహారథుడైన క్షత్రియుడు పుట్టాలని కోరుకోవాలని నారదుడు నాతో అన్నాడు. పవిత్ర వంశ సంపన్నుడై, ధర్మజ్ఞుడై, దృఢ వ్రతాలను ఆచరించే బ్రాహ్మణుని కోరుకోవాలి. చిన్న పెద్ద అందరిలో పెద్దవారికన్న పెద్దవాడు బ్రాహ్మణుడు. బ్రాహ్మణుడు ప్రశంసించిన మనుష్యుడు వృద్ధినందుతాడు. బ్రాహ్మణులను నిందించేవాడు త్వరలోనే పరాభవానికి లోనవుతాడు. మహాసాగరంలో విసిరిన మట్టిముద్ద నశించిపోయినట్లు బ్రాహ్మణ సాహచర్యంతో దుష్కర్మ అంతా పరాభవానికి లోనవుతుంది. చూడు ! బ్రాహ్మణ శాపం వలననే చంద్రునిలో కలంకముంది. సముద్రంలోని నీళ్ళు ఉప్పులు. మహేంద్రుడు వేయి భగాల చిహ్నాలు గలవాడు. మరల వారి ప్రభావంతోనే ఆ భగాలు నేత్రాలుగా మారిపోయాయి. శతక్రతువు సహస్రనయనుడయ్యాడు. మాధవా ! ఆ ప్రభావ మెంతటిదో చూడు. మధుసూదనా ! కీర్తిని, ఐశ్వర్యాలను, ఉత్తమ లోకాలనూ కోరుకొనే పురుషుడు పవిత్రుడై, మనస్సునదుపు చేసుకొని బ్రాహ్మణుల అదుపులో ఉండాలి". భీష్ముడు చెప్తున్నాడు. కౌరవ్యా ! పృథివి అలా పలుకగా విని, మధుసూదనుడు "బాగు ! బాగు !" అంటూ పృథివిని పూజించాడు. పార్థా ! ఈ దృష్టాంతాన్ని విని, నీవు సతతమూ పవిత్ర భావంతో బ్రాహ్మణోత్తములను పూజించు, దానితో శ్రేయస్సు నందగలవు.'

35. బ్రాహ్మణ ప్రశంస

భీష్ముడు చెప్తున్నాడు. "మహాభాగా ! బ్రాహ్మణుడు పుట్టుకతోనే మహాభాగ్యశాలి, సమస్త ప్రాణులకు నమస్కరింప దగినవాడు, ప్రథమ భోజనానికి అధికారి కాగలడు. నాయనా ! బ్రాహ్మణులు సర్వార్థాలను సమకూర్చగలవారు. దేవతా ముఖులు. వారిని

పూజిస్తే మంగళప్రదాలయిన మాటలతో ఆశీర్వదిస్తారు. శుభచింతన చేస్తారు. నాయనా ! మన శత్రువులు వారిని పూజింపకపోతే కోపించి, దారుణవచనాలతో కూడిన మాటలతో వారిని సంహరింపగలరు కూడా. ఈ విషయమై పురాణ పురుషులు కీర్తించిన ప్రాచీన గాథలిలా ఉన్నాయి. బ్రహ్మ యథాపూర్వకంగా బ్రాహ్మణ, క్షత్రియ వైశ్యులను సృష్టించి వారికిలా తెలిపాడు. 'మీకు యథావిధిగా స్వధర్మపాలన, బ్రాహ్మణ సేవ తప్ప మరొక కర్తవ్యం లేదు. బ్రాహ్మణుని మీరు రక్షిస్తే తాను మిమ్ము రక్షిస్తాడు. దానితో మీకు పరమ శ్రేయస్సు కలుగుతుంది. (బ్రాహ్మణ సంరక్షణాత్మకమైన) మీ కర్మను మీరు నిర్వహిస్తే మీకు బ్రహ్మశ్రీ లభిస్తుంది. మీరు ప్రాణులకు ఆదర్శమవుతారు. అందరినీ వశపరచుకొంటారు. పండితుడైన బ్రాహ్మణుడు శూద్రకర్మ చేయరాదు. అలా శూద్రకర్మ చేస్తే ధర్మ భంగమవుతుంది. స్వధర్మపాలనతో శ్రీ, బుద్ధి, తేజస్సు, ప్రతాపశాలి అయిన ఐశ్వర్యం పొందగలరు. అంతేగాక స్వాధ్యాయం వలన విపులమైన మహత్త్వాన్ని కూడా పొందుతారు. బ్రాహ్మణులు ఆహవనీయాగ్నిలో ఉన్న దేవతాగణానికి ఆహుతులనిచ్చి, మహాభాగ్య స్థానంలో ప్రతిష్ఠింపబడతారు. బ్రహ్మ విద్య వలన ఉత్తములై పుట్టిన వాటినుండి అగ్రభోజ్య లవుతారు.

'ద్విజులారా ! మీరు ఎవ్వరికీ హాని తలపెట్టకుండా, దానితో లభించిన పరమశ్రద్ధతో కూడి నిగ్రహ స్వాధ్యాయ పరాయణులై కోరికలనన్నింటినీ సఫలం చేసికోండి ! మానుషలోకంలోనూ, దేవలోకంలోనూ లభించే భోగమంతా తపస్సుతో, జ్ఞానంతో, నియమపాలనంతో సాధించవచ్చు.

మిమ్ములను సత్కరించినందువలన పవిత్రులైన క్షత్రియ వైశ్యశూద్రులు ఇహపరలోకాలలో ఆనందాన్నీ, సంపదను పొందగలరు. మీరు వారిని రక్షింపక పోయినా, వారిపై ద్వేషాన్ని పెంచుకొన్నా వినాశాన్ని పొందుతారు. మీ తేజస్సుతోనే మూడు లోకాలు నిలుస్తాయి కాబట్టి లోకాలను రక్షించండి.'

అనఘా ! ఈ రీతిగా ఉన్న బ్రహ్మ గీతాలను నీకు చెప్పాను. విప్రుల మీది అనుగ్రహంతో ధీమంతుడైన ఆ బ్రహ్మ ఇవి చెప్పాడు. రాజుల బలంవలె తపస్సులైన బ్రాహ్మణుల బలం కూడా ఎక్కువని నేను భావిస్తాను. వారు దుర్భయులు, ప్రచండులు, వేగం గలవారు. వేగంగా పనిచేయగలవారు. వీరిలో కొందరు సింహబలులు, మరికొందరు వ్యాఘ్రబలులు. వారహం, మృగం వంటి బలంగలవారు కొందరు. మరికొందరు జలజంతువుల వలె బలిష్ఠులు. కొందరి స్పర్శ సర్పస్పర్శ వంటిది. కొందరిని తాకితే మొసలిని తాకినట్లుంది. శాపంతో చంపగలవారు కొందరు. చూపుతోనే చంపగలవారు మరికొందరు. పాముల వంటి వారున్నారు. బుద్ధిహీనులూ మరికొందరున్నారు. యుధిష్ఠిరా ! ఈ రీతిగా బ్రాహ్మణుల ప్రవర్తనలు రకరకాలు ఉంటాయి. మేకలులు, ద్రావిడులు, లాటులు, పౌండ్రులు, కాన్వశిరులు,

శౌండికులు, దరదులు, దార్వులు, చౌరులు, శబరులు, బర్బరులు, కిరాతులు, యవనులు - వారంతా మొదట క్షత్రియ జాతికి చెందినవారే. కానీ బ్రాహ్మణులపై ఈర్ష్యతో వారు శూద్రులయ్యారు. బ్రాహ్మణులను పరాభవించినందువలన అసురులు నీటిలో నివసింపవలసి వచ్చింది. బ్రాహ్మణుల అనుగ్రహంతో దేవతలు స్వర్గంలో నివసిస్తున్నారు. ఆకాశాన్ని తాకలేము. హిమగిరిని కదిలించలేము. ఆనకట్ట కట్టి గంగను ఆపలేము. లోకంలో బ్రాహ్మణులను గెలువలేము. బ్రాహ్మణులతో విరోధించి, భూమండల రాజ్యపాలన సాధ్యం కాదు. బ్రాహ్మణులు మహాత్ములు. వారు దేవతలకు కూడా దేవతలు. సాగరమేఖల అయిన ఈ రాజ్యాన్ని పాలించాలనే కోరిక ఉంటే సర్వదా దానాలతో, పరిచర్యలతో బ్రాహ్మణులను పూజించు. అనఘా ! ప్రతిగ్రహంతో (దానం పట్టడంతో) బ్రాహ్మణుల తేజస్సు శమిస్తుంది. రాజా ! ప్రతిగ్రహాన్ని ఇష్టపడని బ్రాహ్మణుల నుండి నిన్ను రక్షించుకో !'

36. ఇంద్రశంబరాసుర సంవాదము.

భీష్ముడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరా ! ఈ విషయమై కూడా ఇంద్రశంబర సంవాద రూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. దానిని విను. ఒకప్పుడు ఇంద్రుడు అజ్ఞాతరూపంతో, రజోగుణ సంపన్నుడైన జటాధారియై, వంకరటింకరగా ఉన్న రథాన్ని ఎక్కి, శంబరాసురుని దగ్గరకు వచ్చి ఇలా అడిగాడు. "శంబరా ! ఏ నడవడితో నీవు నీ సాటివారిపై ఆధిపత్యాన్ని పొందగలిగావు ? నిన్ను ఎందువలన శ్రేష్ఠుడనుకొంటున్నారు. అది యథాతథంగా, వివరంగా చెప్పు". శంబరుడు చెప్తున్నాడు. "విప్రులలో తప్పు పట్టను. వారి మతాన్ని నా మతంగా భావిస్తాను. శాస్త్రాలను చెప్పే బ్రాహ్మణులను యథాసుఖంగా సత్కరిస్తాను. వారు చెప్పినది వింటాను. హేళన చేయను. వారి విషయంలో ఎప్పుడూ అపరాధం చేయను. వారిని పూజించి, వారి కుశలమడుగుతాను. బుద్ధిమంతుల పాదాలు పడతాను. వారు పూర్తి విశ్వాసంతో నాతో మాటాడుతారు. సదా నా కుశలమడుగుతారు. ప్రమత్తుల దగ్గర అప్రమత్తంగా ఉంటాను. నిదురబోతున్నా కూడా సదా మేల్కొని ఉంటాను. శాస్త్రమార్గంలో సంచరిస్తూ, బ్రాహ్మణ భక్తుడనై, దోషదృష్టి లేని నన్ను ఉపదేశదాత లయిన వారు తేనెటీగలు తేనె తుట్టెను తేనెతో నింపినట్లు నన్ను ఉపదేశాలతో తడుపుతారు. వారు సంతుష్టులై చెప్పిన దానిని నేను నా బుద్ధితో గ్రహిస్తాను. బ్రాహ్మణుల మీద నిష్ఠను నిలుపుతాను. సతతమూ వారికనుకూలంగా ఆలోచిస్తాను. బ్రాహ్మణుల వాక్కుల నుండి వెలువడే ఉపదేశరసాలను ఆస్వాదిస్తాను. నక్షత్రాలను చంద్రుడు శాసించినట్లు నా జాతి వారిని శాసిస్తాను. బ్రాహ్మణుని వదనం నుండి శాస్త్రాన్ని విని, ఆ విధంగా

ప్రవర్తించటం భూలోకంలో అమృతం వంటిది. ఉత్తమమైన దృష్టి వంటిది. ఈ విషయాన్ని చక్కగా తెలిసి పూర్వకాలంలో దేవాసుర సంగ్రామాన్ని చూసి, ఆనందించి నా తండ్రి ఆశ్చర్యానికి లోనయ్యాడు.

మహాత్ములైన బ్రాహ్మణుల ఈ మహిమను చూసి నా తండ్రి "ఈ బ్రాహ్మణులెలా సిద్ధి పొందా"రని చంద్రుని అడిగాడు. చంద్రుడిలా చెప్పాడు. "బ్రాహ్మణులు అందరూ తపస్సు ద్వారా సిద్ధి పొందుతారు. వారి బలం ఎప్పుడూ మాటలలో ఉంటుంది. రాజులకు వారి భుజాలే బలం. బ్రాహ్మణులకు వారి మాటలే అస్త్రాలు. బ్రహ్మచర్యదశలో కష్టాలననుభవిస్తూ ఓంకార సహితంగా వేదాల నభ్యసించాలి. చివరలో క్రోధాన్ని వీడి సంన్యసించాలి. సంన్యసిస్తే సమదృష్టి కలుగుతుంది. తండ్రి ఇంటనే ఉండి, ప్రశంసనీయంగా సర్వ వేదాలనూ అభ్యసించి, జ్ఞాన సంపన్నుడైనా అతనిని గ్రామ్యుడనే జనం భావిస్తారు (గురుకులంలో చదవటమే గొప్ప). బలంలో ఉన్న చిన్న ప్రాణులను సర్పం బయటకు గెంటినట్లు భూమి కూడా, యుద్ధం చేయని రాజును, ప్రవాస మెరుగని బ్రాహ్మణుని బయటకు నెడుతుంది. అల్పబుద్ధిగల పురుషుని అభిమానం అతని లక్ష్మిని నశింపజేస్తుంది. గర్భధారణతో కన్య కలంకాన్ని పొందుతుంది. ఇల్లుదాటి వెళ్ళని బ్రాహ్మణుడు నిందింపబడతాడు.

ఇహపరలోకాలను కోరేవారు విద్యావేత్తలు, లోకవేత్తలు, తపోబల సమన్వితులు అయిన బ్రాహ్మణులను నిత్యమూ పూజించాలి, నమస్కరించాలి".

అద్భుత దర్శనం గల సోముని నుండి ఈ రీతిగా విని నా తండ్రి మహావ్రతులైన బ్రాహ్మణులను పూజించాడు. నేను కూడా అలాగే పూజిస్తున్నాను." భీష్ముడు చెప్తున్నాడు. "దానవేంద్రుడైన శంబరుని నోటి నుండి వెలువడిన ఈ మాటను విని, ఇంద్రుడు బ్రాహ్మణులను పూజించి, మహేంద్రత్వాన్ని పొందాడు.

37. దానయోగ్యతా పరీక్ష.

యుధిష్ఠిరు డడిగాడు. "దానయోగ్యుడెవడు ? అపరిచితుడా ? లేక చిరపరిచితుడా ? లేదా దూర ప్రాంతం నుండి వచ్చినవాడా ? వీరిలో ఉత్తమ దానయోగ్యుడెవడు" ? భీష్ముడు చెప్తున్నాడు. "కొందరు ఏదో పని బడి యాచిస్తారు. కొందరు మౌనవ్రతంతో నిర్వహించుకొంటుంటారు. ఏ యాచకుడు ఏది కోరితే దాని నంతటినీ మనమివ్వాలి. కానీ దాత తనపై ఆధారపడిన భృత్యాదిజనులను బాధించకుండా దానం చేయాలని విన్నాం. భృత్యవర్గాన్ని ఇబ్బంది పెడుతూ, ఇతరులకు దానం చేస్తే

దాత తనను తాను క్రిందుచేసి కోవటమే. ఆ స్థితిలో అపరిచితుడైనా దాన యోగ్యుడే. చిరకాలం సహవాసం చేసిన వాడయినా యోగ్యుడే. దూరప్రాంతం నుండి వచ్చిన వాడయినా యోగ్యుడే అని పండితుల అభిప్రాయం".

యుధిష్ఠిరుడడిగాడు. "ప్రాణులను బాధపెట్టకుండా, ధర్మానికి బాధ కలిగించకుండా దానం చేయాలి. కాని దానయోగ్యతను తెలిసికొనేదెలా ? ఎటువంటివానికిస్తే పశ్చాత్తాప పడవలసిన అవసరముండదు" ? భీష్ముడు చెప్తున్నాడు. "ఋత్విక్కులు, పురోహితులు, ఆచార్యులు, శిష్యులు,, సంబంధులు, బంధువులు, పండితులు, అసూయా రహితులు అందరూ పూజింపదగినవారు, గౌరవింప దగినవారు. వీరికి భిన్నంగా ఉండేవారు, ప్రవర్తించేవారు సత్కారాలకు తగరు. కాబట్టి నిత్యమూ మనస్సుపెట్టి, దాన యోగ్యులను పరీక్షించాలి. భారతా ! క్రోధం లేకపోవటం, సత్యవచనం, అహింస, దమం, ఋజుత్వం, ద్రోహచింత లేకపోవటం, అభిమానం, సిగ్గు, సహనశీలం, జితేంద్రియత్వం, మనోనిగ్రహం - ఈ లక్షణాలు స్వాభావికంగా కనిపింపజేస్తూ, ధర్మవిరుద్ధ కార్యాలను చేయనివారు సమ్మానానికి యోగ్యులు. ఆ రీతిగా ఉన్నవాడు చిరకాలం సహవాసం చేసినవాడైనా, అప్పుడే ఎక్కడనుండియో వచ్చిన వాడైనా, పరిచితుడైనా, అపరిచితుడైనా సమ్మానానికి యోగ్యుడే. వేదాలను అప్రమాణాలుగా భావించటం, శాస్త్రమర్యాదలను అతిక్రమించటం, అన్నింటా అవ్యవస్తగా ఉండటం - ఇవి ఆత్మ నాశన హేతువులు. తనను తాను పండితునిగా భావించుకొంటూ వేద నింద చేసే బ్రాహ్మణుడు, రాజనీతిశాస్త్రంపై, నిరర్థకమైన తర్కశాస్త్రంపై అనురాగం గలవాడు, సత్సభలలో హేతువాదాలు చేస్తూ విజయం సాధించేవాడు, యుక్తిబద్ధంగా మాటాడనివాడు, ఆక్రోశిస్తూ బ్రాహ్మణులతో అతిప్రసంగం చేసేవాడు, అందరినీ అనుమానించేవాడు, మూఢుడు, బాలుడు, పరుష భాషణుడు - ఇటువంటి వారినందరినీ అస్పృశ్యులుగా భావించాలి. నాయనా ! అటువంటి నరుని పండితులు శునకంగా భావిస్తారు. కుక్క మొరగటానికి కానీ, కరవటానికి కానీ దగ్గరకు వచ్చినట్లు కేవలం వదరటానికో, సర్వశాస్త్రఖండనకో పరిభ్రమించే వాడు దానయోగ్యుడు కాదు. మనిషి లోక వ్యవహారాన్ని కూడా గమనించాలి. ధర్మాన్ని గురించి, ఆత్మహితాన్ని గురించి కూడా ఆలోచించాలి. ఇలా ప్రవర్తించే నరుడు చిరకాలం వర్ధిల్లుతాడు. యాగాదుల ద్వారా దేవ ఋణాన్ని, అధ్యయనంతో ఋషిఋణాన్ని, పుత్రోత్పాదనతో పితృ ఋణాన్ని, దానాదులతో బ్రాహ్మణ ఋణాన్ని, ఆతిథ్యంతో అతిథి ఋణాన్ని తీర్చికొని క్రమంగా పవిత్రంగా, వినయంతో సప్రయత్నంగా కర్మల నాచరించిన గృహస్థుడు ఎప్పుడూ ధర్మహీనుడు కాడు.'

38. పంచచూడానారద సంవాదము.

యుధిష్ఠిరుడడిగాడు. "భరతసత్తమా ! స్త్రీ స్వభావాన్ని తెలిసికొనగోరుతున్నాను. దోషాలకు మూలం స్త్రీలే. వారు తేలిక మనస్సుగలవారు". భీష్ముడు చెప్తున్నాడు. "ఈ విషయమై కూడా నారదునకు, పంచచూడ అనే అప్సరసకు మధ్య జరిగిన సంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. గతంలో దేవర్షి అయిన నారదుడు సర్వలోకాలలోనూ సంచరిస్తూ, బ్రహ్మలోకానికి చెందిన పంచచూడ అనే అందమైన అప్సరసను చూశాడు. సర్వావయవ సుందరి అయిన ఆ అప్సరసను చూసి నారదముని "సుమధ్యమా ! నా మనస్సులో ఒక సందేహమున్నది. దానిని నీవు తీర్చాలి" అని అడిగాడు. భీష్ముడు చెప్తున్నాడు. "నారదుడు అలా అడగగానే ఆ పంచచూడ నారదునితో ' సమాధానం చెప్పే యోగ్యత నాకుంటే, చెప్పగల సామర్థ్యం నాకుందని నీవు భావిస్తే చెప్తాను' అని అన్నది." నారదుడన్నాడు. "కళ్యాణీ ! నీకు యోగ్యత లేని దానిని, నీకు తగని దానిని ఏ రీతిగాను నిన్నడగను. వరాననా ! నీ నుండి స్త్రీ స్వభావాన్ని యథాతథంగా వినగోరుతున్నాను". భీష్ముడు చెప్తున్నాడు. "ఆ దేవర్షి పలికిన ఆ మాట విని, ఆ అప్సరోత్తమ 'స్త్రీనై ఉండి స్త్రీలను నిందించే శక్తి నాకు లేదు" అని బదులిచ్చింది. లోకంలో ఎటువంటి స్త్రీలున్నారో, వారి స్వభావమెటువంటిదో నీకు తెలుసు. దేవర్షీ ! ఇటువంటి పనికి నీవు నన్ను నియోగించకూడదు". అప్పుడు ఆ దేవర్షి "సుమధ్యమా ! సత్యం చెప్పు. అబద్ధం చెపితే దోషమవుతుంది. సత్యం చెపితే తప్పు లేదు" అన్నాడు. నారదుడు అలా అనగానే అందంగా నవ్వగల ఆ అప్సరస చెప్పటానికి నిశ్చయించుకొని అనాదిగా, యథార్థంగా స్త్రీలలో ఉన్న దోషాలను చెప్పనారంభించింది.

పంచచూడ ఇలా అన్నది. "నారదా ! సద్వంశంలో పుట్టి, అందగత్తెలై సనాథలయిన స్త్రీలు కూడా హద్దులలో ఉండరు. అది స్త్రీలలోని దోషం. స్త్రీలకన్న పాపిష్ఠులు మరెవ్వరూ లేరు. దోషాల కన్నింటికీ స్త్రీలే మూలం. ఆ విషయం నీకు కూడా తెలుసు. స్త్రీలకు ఇతరులతో కలిసే అవకాశం దొరికితే సద్గుణ విఖ్యాతులై, సంపన్నులై, రూపవంతులై, తమ అదుపులో నున్న భర్తలను గురించి అయినా ఎదురుచూడరు. ప్రభూ ! మా స్త్రీలలో ఈ అధర్మముంటుంది. ఏమిటంటే పాపాత్ములైన నరులను కూడా సిగ్గు విడిచి సేవిస్తాం. తమను కోరిన వానిని, దగ్గరగా ఉన్నవారిని, కొద్ది పాటి సేవ చేసిన వానిని స్త్రీలు కోరుతారు. ఇతరులు అడగనందువలన, పరిజన భయం వలన, భర్త దగ్గరనే

ఉన్నందువలన మాత్రమే మర్యాదలెరుగని స్త్రీలు హద్దులలో ఉంటారు. వీరికి పొందరానివారంటూ ఎవ్వరూ ఉండరు. వీరికి వయస్సు గురించి పట్టింపు లేదు. అందగాడైనా, కురూపి అయినా మగవాడయితే చాలు అని వారిని సేవిస్తారు. భయంవలన కానీ, దయతో కానీ, డబ్బుకోసం కానీ, దాయాదుల వలనకానీ, వంశసంబంధం వలన కానీ స్త్రీలు ఏ విధంగానూ భర్తల దగ్గరుండరు (ఉండటానికి ఇవేవీ కారణాలు కాలేవు). యువతులై, అందమైన ఆభరణాలు, వస్త్రాలు ధరించి, స్వేచ్ఛా చారిణులై ఉన్న స్త్రీలను చూసి, ఎందరో కులస్త్రీలు కూడా అలాగే ఉండాలనుకొంటారు. సర్వదా చక్కగా గౌరవింపబడుతూ, భర్తకు ప్రియలై, రక్షింపబడుతున్న స్త్రీలు కూడా ఎందరో గూనివారితో, గ్రుడ్డి వారితో, మూగవారితో, పొట్టివారితో సంచరిస్తూనే ఉంటారు. దేవర్షీ ! మహామునీ ! కుంటివారి మీద, జుగుప్స కలిగించే వారి మీద కూడా స్త్రీలకు ఆసక్తి కలుగుతుంది. లోకంలో స్త్రీలకు పొందరాని వారంటూ ఎవరూ ఉండరు. బ్రహ్మ స్వరూపా ! స్త్రీలకు ఏ రీతిగానూ పురుషుడు లభించకపోతే, భర్త కూడా దగ్గర లేకపోతే వారిలో వారే కోరికల కనుగుణంగా ప్రవర్తిస్తారు. పురుషులు దొరకనందువలన, పరిజన భయం వలన, వధబంధ భయంవలన స్త్రీలు చాటుగా ఉంటారు.

స్త్రీలు చంచల స్వభావంగలవారు. వారిని సేవించటం కష్టం. భావం కూడా సరిగా తెలియదు. పండితుల మాటలవలె స్త్రీల భావాలు కూడా తేలికగా తెలియవు. అగ్నికి కట్టెలతో తృప్తి లేదు. సముద్రం నదులతో నిండదు. సర్వభూతాలనూ కబళించినా మృత్యువు ఊరుకోదు. అలాగే స్త్రీలు కూడా పురుషులతో తృప్తిపడరు. దేవర్షీ ! సర్వస్త్రీలకు సంబంధించి ఇది మరో రహస్యం. అందమైన పురుషుని చూడగానే స్త్రీలకు యోని చెమ్మగిల్లుతుంది. కోరికలను తీరుస్తున్నా, మనస్సునకు నచ్చినవి చేస్తున్నా, తమను రక్షిస్తున్నా కూడా స్త్రీలు భర్తల శాసనాన్ని కూడా సహింపలేరు. విపుల కామభోగ వస్తువులను, అలంకారాలను, ఉత్తమ గృహాలను కూడా రతిలో ప్రదర్శించే అనుగ్రహం కన్న మిన్నగా వారు భావింపరు. యముడు, వాయువు, మృత్యువు, పాతాలం, బడబాగ్ని కత్తివాదర, విషం, పాము, అగ్ని - ఇవన్నీ కలిసి ఒకటి. స్త్రీ ఒక్కతే ఒకటి. నారదా ! దేనినుండి పంచ మహాభూతాలు పుట్టాయో, దేని నుండి బ్రహ్మ సర్వలోకాలనూ సృష్టించాడో, దేని నుండి స్త్రీలు, పురుషులు పుట్టారో దాని నుండియే స్త్రీలోని దోషాలు కూడా పుట్టాయి."

39. స్త్రీరక్షణ విషయమై యుధిష్ఠిరుని ప్రశ్న.

యుధిష్ఠిరుడడిగాడు. "రాజా ! మానవలోకంలోని ఈ పురుషులు బ్రహ్మ కల్పించిన తీవ్ర మోహానికి లోనై సర్వదా స్త్రీలపై ఆసక్తి పడుతున్నారు. స్త్రీలు పురుషులపై ఆసక్తులవుతున్నారు. ఇది కళ్ళకు కనిపిస్తూనే ఉంది. లోకమంతా దీనికి సాక్షి. ఈ విషయమై నా హృదయంలో తీవ్ర సంశయం నిలిచి ఉంది. కురునందనా ! పురుషులు ఈ స్త్రీలతో ఎందుకు సంగమిస్తున్నారు ? స్త్రీలు కూడా ఎందుకు పురుషులపై అనురక్తిని కొంటున్నారు ? మరలా ఎందుకు విరక్తులగుతున్నారు ? పురుషోత్తమా ! యౌవనంతో మదించిన స్త్రీలను పురుషులెలా రక్షించుకోవాలి ? ఇది నాకు చెప్పవలసినది. ఈ స్త్రీలు పురుషులతో క్రీడిస్తూ కూడా వారిని వంచిస్తున్నారు. వారి చేతిలో బడిన మగవాడు ఒక్కడూ బయట పడలేకపోతున్నాడు. ఆవులు క్రొత్త గడ్డిని (పచ్చి గడ్డిని) తిన్నట్లు, వీరు క్రొత్త క్రొత్త పురుషులు సంగమాన్ని కోరుతున్నారు. శంబరాసురుని మాయ, నముచిమాయ, బలిమాయ, కుంభీనసుని మాయ – ఈ మాయలన్నీ యువతులకు తెలుసు. పురుషులు నవ్వుతుంటే వీరు హేళన చేస్తారు. ఏడుస్తుంటే మరీ ఏడిపిస్తారు. అవసరపడితే ఇష్టం లేని వ్యక్తిని కూడా ప్రియవచనాలతో సాంతం చేసికొంటారు. శుక్రాచార్యునకు తెలిసిన శాస్త్రనీతి, బృహస్పతికి తెలిసిన శాస్త్రనీతి కూడా స్త్రీ బుద్ధికన్న గొప్పవికావు. నరులు వారినెలా రక్షించుకోవాలి ? వీరా ! అసత్యాన్ని సత్యమంటారు. సత్యాన్ని అసత్యమంటారు. అటువంటి స్త్రీలను పురుషులెలా కాపాడు కోవాలి ? శత్రుసూదనా ! స్త్రీల బుద్ధిలో ఉన్న అర్ధ నిశ్చయాలను స్వీకరించియే బృహస్పతి మొదలయిన సత్పురుషులు నీతి శాస్త్రాలను రచించి ఉంటారని నేను అనుకొంటున్నాను. రాజా ! పురుషులు ఆదరించినా స్త్రీలు వారి మనస్సులను కలతపెడతారు. పురుషులు తిరస్కరించినా స్త్రీలు వారి మనస్సులను కష్టపెడతారు. మహాబాహూ ! స్త్రీ రూపంలోని ఈ ప్రజలు ధార్మిక వర్తన కలవారని మేము వింటుంటాం. అయినా స్త్రీలను ఆదరించినా, నిరాకరించినా కూడా పురుషుల మనస్సులను కలచివేస్తారు. వారిని ఎవరు కాపాడుకొనగలరు ? ఇది నాలోని మహా సంశయం. కురుశ్రేష్ఠా ! ఏ రీతిగానైనా, ఎప్పుడైనా వారిని కాపాడుకొనగలగటం సాధ్యమా ! గతంలో ఎవరైనా అలా చేయగలిగారా ? దానిని నాకు వివరంగా చెప్పాలి".

40. విపులోపాఖ్యానము.

భీష్ముడు చెప్తున్నాడు. "మహాబాహూ ! కురునందనా ! ఇది ఇంతే. స్త్రీలను గురించి నీవు చెప్పినదానిలో కొంచెం కూడా అవాస్తవం కాదు. గతంలో మహాత్ముడైన విపులుడు స్త్రీని రక్షించిన తీరును పురాతనేతిహాసాన్ని నీకు చెపుతాను. రాజా ! బ్రహ్మ స్త్రీల నెలా సృష్టించాడో, ఎందుకోసం సృష్టించాడో అదంతా నీకు చెపుతాను. కుమారా ! స్త్రీలకన్నా పాపిష్ఠం మరొకటి లేదు. ప్రమదలు జ్వలించే అగ్నివంటివారు. వారు మయుని మాయలు. కత్తివాదర, విషం, పాము, అగ్ని - ఇవన్నీ ఒక ఎత్తు. స్త్రీ ఒక ఎత్తు. మహాబాహూ ! తొలుత ప్రజలందరూ ధార్మికులే అని విన్నాను. మానవులే స్వయంగా దివ్యత్వాన్ని పొందేవారు. దానితో దేవతలు భయపడ్డారు. అరిందమా ! అప్పుడు దేవతలు బ్రహ్మ దగ్గరకు వెళ్ళారు. తమ మనస్సులోని భావాన్ని తెలిపి, తలలు వాల్చి, మౌనంగా నిలిచారు. ఆ దేవతల మనస్సులను గ్రహించి, ఆ బ్రహ్మ మానవులను మోహింపజేయటానికి కృత్యారూపంతో ఉన్న స్త్రీలను సృష్టించాడు. కౌంతేయా ! సృష్టి ప్రారంభంలో ఈ లోకంలో స్త్రీలు పతివ్రతలే. కానీ కృత్యారూపంలోని ఈ స్త్రీలు బ్రహ్మ చేసిన నూతన సృష్టి. వారికి వారి ఇష్టాన్ని అనుసరించి బ్రహ్మ కామ భావాన్ని ప్రసాదించాడు. కామ లోభంగల ఆ స్త్రీలు సర్వదా నరులను బాధిస్తున్నారు. ప్రభువైన బ్రహ్మ కామానికి తోడుగా క్రోధాన్ని సృష్టించాడు. దీనితో కామక్రోధాలకు లోనై ప్రజలందరూ పరస్పరాసక్తిని పెంచుకొన్నారు.

బ్రాహ్మణులు, గురువులు, మహాగురువులు, రాజులు మొదలయిన వారు అందరు స్త్రీ యొక్క క్షణిక సుఖంతో నిరంతరమూ కామయాతనలు పడుతున్నారు. ఆసక్తి లేక నిత్యబ్రహ్మచర్యంతో మనుష్యులను పవిత్రం చేసికొని తపోదమధ్యాన పూజాసక్తులైనవారు నిర్మలంగా ఉన్నారు

స్త్రీలకై కర్మలేవీ విధింపబడలేదు. అది ధర్మశాస్త్ర వ్యవస్థ. స్త్రీలు అదుపులేని వారనీ, శాస్త్రజ్ఞాన రహితలనీ, అసత్య స్వరూపాలనీ శ్రుతి వచనం. ప్రజాపతి స్త్రీలకై శయ్య, ఆసనం, అలంకారం, అన్నం, పానం, అగౌరవం, దుర్వచనం, ఆసక్తి, రతి - వీటిని ఇచ్చాడు. నాయనా ! పురుషుడు ఏ రీతిగానూ వారిని రక్షించుకొనలేడు. అది బ్రహ్మకు కూడా వీలుకాదు. ఇక మామూలు మనుషులకేలా కుదురుతుంది ? మాటలతో కానీ, వధబంధనాల ద్వారాగానీ, వివిధ కష్టాలను కలిగించటం ద్వారా కానీ స్త్రీలను కాపాడుకొనటం సాధ్యం కాదు. వారు ఎప్పుడూ అదుపులేనివారే.

పురుషోత్తమా ! పూర్వకాలంలో విపులుడు గురుపత్నిని కాపాడాడని నేను విన్నాను. అది ఎలా జరిగిందో చెపుతాను. గతంలో దేవశర్మ అని ప్రసిద్ధికెక్కిన మహాభాగుడైన

ఋషి ఉండేవాడు. ఆయన భార్య రుచి. లోకంలో ఆమె సాటిలేని అందగత్తె. రాజేంద్రా ! దేవతలు, గంధర్వులు, దానవులు ఆమె రూపం వలన మోహానికి లోనయ్యారు. ప్రత్యేకించి వృత్ర సంహారకుడైన ఇంద్రుడు. మహాముని అయిన దేవశర్మ స్త్రీల నడవడి నెరిగినవాడు. అందువలన యథాశక్తిగా యథోత్సాహంగా ఆ భార్యను కాపాడు కొనేవాడు. ఇంద్రుడు పరస్త్రీకాముకుడు అని కూడా ఆయనకు తెలుసు. అందువలన తన భార్యను ప్రయత్న పూర్వకంగా కాపాడుకొనేవాడు. నాయనా ! ఆ దేవశర్మ ఒకానొక సమయంలో యజ్ఞం చేయాలని మనసు పడ్డాడు. 'భార్యను సంరక్షించటమెలా' అని ఆలోచించాడు. ఆ మహా తపస్వి ఆమెను రక్షించుకొనే విధానాన్ని మనసా బాగా ఆలోచించి, ప్రియ శిష్యుడు, భృగువంశీయుడైన విపులుని పిలిచి, ఇలా అన్నాడు. దేవశర్మ అంటున్నాడు. "నేను యజ్ఞం చేయాలని వెళ్తున్నాను. దేవేంద్రుడు ఈ రుచిని ఎల్లప్పుడూ కోరుతున్నాడు. కాబట్టి యథాశక్తిగా ఈమెను రక్షించాలి. ఇంద్రుని విషయంలో నీవు సర్వదా ఏమరుపాటు లేకుండా ఉండాలి. భృగూత్తమా ! ఆ ఇంద్రుడు వివిధ రూపాలను ధరిస్తాడు".

భీష్ముడు చెప్తున్నాడు. "రాజా ! దేవశర్మ అలా చెప్పగా నియతేంద్రియుడు, ఉగ్రతపస్వి, ధర్మజ్ఞుడు, సత్యవచనుడు, సూర్యాగ్నుల వంటి తేజస్సు గలవాడు అయిన విపులుడు 'అలాగే' అన్నాడు. మహారాజా ! బయలు దేరబోతున్న గురువును మరలా ఇలా అడిగాడు. "మునీ ! ఇంద్రుడు ఇక్కడకు వస్తే ఏయే రూపాలతో వస్తాడు. ఆయన శరీరం, తేజస్సు ఎటువంటివి ? అది నాకు వివరంగా చెప్పవలసినది". భీష్ముడు చెప్తున్నాడు. "భారతా ! అప్పుడు ఆ భగవానుడు (దేవశర్మ) మహాత్ముడైన విపులునకు ఇంద్ర మాయను గురించి ఉన్నదున్నట్లు చెప్పాడు". దేవశర్మ ఇలా అన్నాడు. "బ్రహ్మర్షీ ! పాకశాసనభగవానుడు అనేక మాయలు గలవాడు. మాటిమాటికీ రకరకాలుగా రూపాలను మారుస్తుంటాడు. ఒక్కొక్కసారి కిరీటాన్ని, వజ్రాన్ని, వింటిని, కుండలాలను ధరించి వస్తాడు. ముహూర్త కాలంలోనే మారిపోయి చండాలునివలె కనిపిస్తాడు. నాయనా ! ఇంతలోనే శిఖలను, జడలను, నార చీరలను ధరించి ఋషిగా మారిపోతాడు. పెద్ద శరీరంతో (లావుగా) కనిపిస్తాడు. ఇంతలోనే కృశించి నార చీరలలో కనిపిస్తాడు. తెల్లగా, చామన చాయతో, నల్లగా - ఇలా రంగులు మారుస్తుంటాడు. అందగాడుగా కనిపిస్తాడు. విరూపంగానూ కనిపిస్తాడు. యువకుడు, వృద్ధుడు ఎట్లైనా కావచ్చు. బ్రాహ్మణుడుగా, క్షత్రియుడుగా, వైశ్యుడుగా, శూద్రుడుగా ఎలాగైనా రావచ్చు. అంతేకాదు. ఆ ఇంద్రుడు జుట్టు పెంచుకొని ఉంటాడు. జుట్టు లేకుండానూ ఉంటాడు. చిలుక, కాకి, హంస,

కోకిల - ఇలా ఏ రూపంతో నయినా వస్తాడు. ఇంతలో సింహం, పులి, ఏనుగుల రూపాన్ని ధరిస్తాడు. దేవతారూపాన్ని, రాక్షసుల రూపాన్ని, రాజుల రూపాన్ని కూడా ధరిస్తాడు. పుష్టిగా ఉంటాడు. వాత రోగంతో భంగమైన శరీరంతోనూ ఉంటాడు. పక్షిగా రాగలడు. వికారంగానూ ఉండగలడు. నాలుగు కాళ్ళ జంతువుగా రాగలడు. ఒక్కొక్కసారి అనేక రూపాలతో, ఒక్కొక్కసారి గ్రామీణుడుగా రాగలడు. ఈగ, దోమ మొదలయిన రూపాలూ ధరిస్తాడు. విపులా ! ఆయనను గ్రహించటం ఎవరికీ శక్యం కాదు. నాయనా ! ఈ జగత్తునంతా సృష్టించిన బ్రహ్మకు కూడా అది సాధ్యం కాదు. కానీ అదృశ్యంగా ఉన్న ఆ ఇంద్రుని జ్ఞాననేత్రంతో మాత్రం చూడగలం. ఆ దేవరాజు ఒక్కొక్కసారి వాయు రూపంలో కూడా ఉంటాడు. ఈ రీతిగా ఇంద్రుడు ఎప్పుడూ వివిధ రూపాలు ధరిస్తుంటాడు. కాబట్టి విపులా ! ప్రయత్న పూర్వకంగా ఈ రుచిని కాపాడాలి. భృగుసత్తమా ! క్రతువుకోసం సిద్ధం చేసిన హవిస్సును కుక్క ముట్టినట్లు దురాత్ముడైన ఆ దేవేంద్రుడు ఈ రుచిని తాకకుండా రక్షించాలి". ఇలా చెప్పి మహాభాగుడైన ఆ ముని దేవశర్మ యజ్ఞం చేయటానికి వెళ్ళిపోయాడు.

విపులుడు గురువు చెప్పిన మాట విని, ఎంతో ఆలోచించాడు. మహాబలుడైన ఇంద్రుని నుండి ఆమెకు పూర్తిగా రక్షణ కల్పించాడు. ఇంకా ఆలోచింపసాగాడు. "గురుపత్నిని రక్షించటానికి నేను ఎమి చేయగలను ? ఆ ఇంద్రుడు మాయావీ, శక్తిమంతుడు. ఆయనను ఎదుర్కొనటం చాలా కష్టం. ఆశ్రమ ద్వారాలను మూసివేసినంత మాత్రాన పాకశాసనుని రాకను నిరోధింపలేము. ఎందుకంటే ఆయన అనేక రూపాలను ధరించగలడు. వాయురూపంలో అయినా వచ్చి గురుపత్నిని కళంక పరచవచ్చు. కాబట్టి నేను ఈ రుచి శరీరంలోనికి ప్రవేశించి ఇప్పుడు నిలిచి ఉంటాను. పౌరుషాన్ని ప్రదర్శించి నేను ఈమెను కాపాడలేను. ఆ ఇంద్రుడు వివిధ రూపాలు గలవాడని విన్నాను గదా ! కాబట్టి నేను యోగబలంతో ఇంద్రుని నుండి ఈమెను కాపాడుతాను. ఈమెను రక్షించటానికై నా శరీరంతో తన శరీరంలో ప్రవేశిస్తాను. తన పత్ని అయిన ఈమె ఎంగిలిపడినట్లు గురువు గారు గ్రహిస్తే కోపంతో నన్ను తప్పక శపిస్తాడు. ఆ మహాతపస్వి దివ్యజ్ఞాని. నరులు ఇతర కాంతలను రక్షించినట్లు ఈమెను రక్షించటం సాధ్యం కాదు. ఆ దేవేంద్రుడు మాయావి. అయ్యో ! ధర్మసందేహమేర్పడింది. గురువుగారి శాసనాన్ని ఇప్పుడు తప్పక పాటించాలి. నేను దీనిని చేయగలిగితే ఆశ్చర్యకరమైన పనిని నేను చేసినట్లే. కాబట్టి యోగంతో గురుపత్ని శరీరంలో ప్రవేశించటమే తగిన పని. ఈ రీతిగా తామరాకు మీదపడిన నీటి బొట్టు

నిశ్చలంగా ఉన్నట్లు ఆమె శరీరంలోనే అనాసక్తంగా, ఏకాగ్రతతో ఉంటాను. రజోగుణం నుండి విముక్తి నందియున్న నావలన ఏతప్పూ జరగదు. ప్రయాణం చేస్తున్న బాటసారి మార్గ మధ్యంలో ఖాళీగా ఉన్న ఏదో ఒక సత్రంలో ప్రవేశించినట్లు నేను గురుపత్ని శరీరంలో నివసిస్తాను. ఈ రీతిగా నేను ఈమె శరీరంలో సావధానంగా ఉంటాను.'

ఈ రీతిగా ధర్మదృష్టితో ఆలోచించి, వేద శాస్త్రాలను అన్ని విధాలుగా పర్యాలోచన చేసి, తన గురువుగారి విశాల తపస్సును గమనించి, గురుపత్ని రక్షణను గూర్చి మనస్సులో అలా నిశ్చయించుకొని, దానికై తీవ్ర ప్రయత్నం చేశాడు. రాజా ! దానిని చెపుతాను విను. మహాతపస్వి అయిన ఆ విపులుడు గురుపత్ని దగ్గరక కూర్చొని, తన దగ్గరనే కూర్చొన ఉన్న ఆ సుందరిని కథలతో ప్రలోభపెట్టాడు. తన కళ్ళతో ఆమె కళ్ళలోనికే చూస్తూ, తన కంటికిరణాలతో ఆమెకంటి కిరణాలను పెనవేసి, ఆకాశంలో ప్రవేశించే గాలివలె విపులుడు ఆమె శరీరంలో ప్రవేశించాడు. తన లక్షణాలతో ఆమె లక్షణంలోనికి, తన ముఖంతో ఆమె ముఖంలోనికి ప్రవేశించి, చేష్టారహితంగా నిలిచాడు. అప్పుడు అదృశ్యంగా ఉన్న ఆ ముని ఆమె నీడలా కనిపించాడు. ఆపై విపులుడు గురుపత్ని శరీరాన్ని స్తంభింపజేసి, ఆమె రక్షణలో సంలగ్నుడై నిలిచాడు. కానీ ఆమె ఆ విషయాన్ని తెలిసికొనలేదు. రాజా ! మహాత్ముడైన తన గురువు యజ్ఞాన్ని పూర్తిచేసికొని తన ఇంటికి తిరిగి వచ్చేదాకా ఆ విపులుడు రుచిని కాపాడాడు."

41. విపులుడు ఇంద్రుని నుండి గురుపత్నిని రక్షించుట.

భీష్ముడు చెప్తున్నాడు. "ఆపై ఒకానొక సమయంలో దేవేంద్రుడు దివ్య రూపంతో కూడిన శరీరాన్ని ధరించి ఇదే అవకాశమని భావించి, ఆ ఆశ్రమానికి వచ్చాడు. జనాధిపా ! స్త్రీలను ప్రలోభపెట్టగల సాటిలేని అందమైన రూపాన్ని ధరించి, మరీ చూడదగినవాడై ఆ ఆశ్రమంలో ప్రవేశించాడు. అప్పుడు ఇంద్రుడు రుచి శరీరంలో నిలిచి ఉన్న విపులుని కళేవరాన్ని చూశాడు. ఆయన కళ్ళు మూసి, నిశ్చేష్టంగా బొమ్మ గీచినట్లు ఉన్నాడు. అందమైన కనుకొనలు, బలిసిన పిరుదులు, స్తనాలు కలిగి, తామర రేకుల వంటి విశాలనేత్రాలు, పూర్ణచంద్రుని వంటి ముఖంతో ఉన్న రుచిని చూశాడు. ఆమె ఇంద్రుని చూడగానే ఆ రూపం కారణంగా ఆశ్చర్యానికి లోనై "ఎవరు" అంటూ పలుకరింపదలచి లేవగోరింది. రాజా ! లేవదలచిన ఆ రుచిని విపులుడు నిలిపివేశాడు. విపులునకు పట్టుబడి ఆమె లేవలేకపోయింది.

దేవేంద్రుడు పరమ మధుర వచనాలతో ఆమెను అనునయిస్తూ ఇలా అన్నాడు. 'తెలినవ్వుదానా ! నీ కోసం వచ్చిన దేవేంద్రుడను నేను. గ్రహించుకో. నీ మీద కలిగిన కోరికతో మదనునిచే కష్టపెట్టబడుతూ నీ దగ్గరకు వచ్చాను. సుభ్రూ ! కాలం గడచిపోతోంది.' ఇలా మాటాడుతున్న ఆ ఇంద్రుని మాటలను విన్నాడు విపులుడు. గురుపత్ని శరీరంలోనే ఉండి దేవేంద్రుని చూశాడు. రాజా ! నిష్కలంక అయిన ఆ రుచి లేవలేకపోయింది. విపులుడు నలువరించటంతో మాటాడలేకపోయింది. రాజా ! భృగువంశతిలకుడు, మహాతేజస్వి అయిన విపులుడు గురుపత్ని కవళికలను తెలిసికొని, యోగశక్తితో బలపూర్వకంగా ఆమెను బంధించాడు. రాజా ! యోగబంధాలతో ఆమె ఇంద్రియాల నన్నింటినీ బంధించాడు. నిర్వకారంగా ఉన్న ఆమెను చూసి, ఇంద్రుడు సిగ్గుపడి, యోగబల మోహంలో ఉన్న ఆమెను మరలా "రా ! రా !" అని పిలిచాడు. ఆమె ఆ ఇంద్రునకు బదులు పలుకదలచింది. కానీ ఆ విపులుడు గురుపత్ని మాటలను కూడా మార్చి వేశాడు. "ఓయీ ! ఏ పనిమీద వచ్చావు" అన్న మాట ఆమె నుండి వెలువడింది. చంద్రుని వంటి ఆ ముఖం నుండి సంస్కార భూషితమైన ఆ మాట వెలువడింది. అప్పుడు ఆమె పరాధీనతతో ఆ మాట పలికి సిగ్గుపడింది. అక్కడున్న ఇంద్రుడు కూడా తీవ్రంగా విమనస్కుడయ్యాడు. ఆమెలోని ఆ వికృతిని గుర్తించి ఇంద్రుడు దివ్య దృష్టితో చూశాడు. అప్పుడు ఆమె శరీరంలోపల ఉన్న ఆ మునిని చూశాడు. అద్దంలో ప్రతిబింబంవలె గురుపత్ని శరీరంలో ఘోర తపస్సుతో కూడి, నిలిచి ఉన్న ఆ విపులుని చూశాడు ఇంద్రుడు. రాజా ! అప్పుడు తీవ్రంగా బెదిరి, ఇంద్రుడు శాపభయంతో వణికిపోయాడు. మహాతపస్వి అయిన విపులుడు గురుపత్నిని వీడి, తన శరీరంలో ప్రవేశించి భయపడుతున్న ఇంద్రునితో ఇలా అన్నాడు.

"దుర్మతీ ! పాపాత్ముడా ! ఇంద్రియాలపై అదుపు లేనివాడా ! ఇంద్రా ! దేవతలు, అలాగే మానవులు ఇంక ఎంతో కాలం నిన్ను పూజించరు. ఇంద్రా ! అది మరచిపోయావా ? నీ మనస్సులో అది నిలువలేదా ? గౌతమమహర్షి నీ శరీరంతా భగచిహ్నితం చేసి ప్రాణాలతో విడిచిపెట్టాడుగదా ! మూఢ ! పాపాత్ముడా ! నీవు మూర్ఖుడవు. నీ మనస్సు చంచలం. అదుపులో ఉండదు. ఈమెను నేను రక్షిస్తున్నాను. వచ్చినట్లే వెళ్ళు. మూఢాత్మా ! ఇంద్రా ! నేను నా తేజస్సుతో నిన్ను దహింపగలను. కానీ దయదలచి ఇప్పుడు దహించటం లేదు. ధీమంతుడైన నా గురువు మహాభయంకరుడు. పాపబుద్ధి వయిన నిన్ను చూసి, కోపంతో మండిపడే కంటితో నిన్ను దహించగలడు. శక్రా ! మరలా ఇలా చేయవద్దు. ద్విజులను నీవు పూజించాలి. బ్రాహ్మణశక్తిచే పీడనకు

గురి అయి పుత్రులతో, అమాత్యులతో సహా నశించిపోవద్దు. నేను అమరుడను అన్న ఆలోచనలో నిలిచి ఇలా ప్రవర్తిస్తున్నావు. తపస్సులను అవమానించవద్దు. తపస్సుతో సాధింపరానిది ఏదీ లేదు".

భీష్ముడు చెప్తున్నాడు. "మహాత్ముడైన విపులుడు అలా అనగానే ఆ మాటలు విని, ఇంద్రుడు బదులేమీ చెప్పకుండా సిగ్గుపడుతూ, అక్కడే అంతర్ధానమయ్యాడు. ఇంద్రుడు వెళ్ళి ముహూర్తకాలం గడవగానే మహాతపస్వి అయిన దేవశర్మ తన యజ్ఞాన్ని ముగించుకొని స్వేచ్ఛగా తన ఆశ్రమానికి వచ్చాడు. రాజా ! గురువుగారు రాగానే గురువుకు ప్రియమైన పని చేసిపెట్టిన విపులుడు నిష్కలంక అయిన గురుపత్నిని తాను రక్షించినట్లు నివేదించాడు. గురువు వాత్సల్యాన్ని పొంది, శాంత స్వరూపుడై ఉన్న ఆ విపులుడు ఏ శంకా లేకుండా అంతకు ముందువలెనే గురువును సేవించాడు. ఆపై దేవశర్మ విశ్రాంతి తీసికొని భార్యతో సహా ఆసీనుడై ఉండగా, అప్పుడు విపులుడు ఇంద్రుడు చేసిన పనిని ఆయనకు తెలియజేశాడు. ప్రతాపవంతుడైన దేవశర్మ అది విని, విపులుని స్వభావంతో, నడవడితో, తపస్సుతో, నియమంతో ఎంతో ఆనందించాడు. సమర్థుడైన ఆ దేవశర్మ విపులుని సేవావృత్తిని, గురుభక్తిని, ధర్మ స్థిరత్వాన్ని చూసి "బాగు బాగు" అని అతనిని అభినందించాడు. మహామతి, ధర్మాత్ముడు అయిన దేవశర్మ ధర్మ పరాయణుడైన శిష్యుని పొంది, (ఆనందించి), వరం కోరుకొమ్మని చెప్పాడు. గురువత్సలుడైన విపులుడు ధర్మంలో నిరంతర స్థితిని గురువు నుండి కోరుకొన్నాడు. ఆపై గురువు అనుమతితో ఉత్తమ తపస్సు నాచరించాడు. అదే రీతిగా మహాతపస్వి అయిన ఆ దేవశర్మ కూడా ఇంద్రభయాన్ని వీడి, నిర్భయంగా భార్యతో సహా ఆ నిర్జనారణ్యంలో చరింపసాగాడు."

42. విపులుడు దివ్యపుష్పముల కొనితెచ్చుట.

భీష్ముడు చెప్తున్నాడు. "విపులుడు గురువచనం మేరకు తీవ్రమైన తపస్సు చేశాడు. దానితో తపశ్శక్తి పెరిగింది. ఆ పరాక్రమశాలి తనను తాను మహాతపస్విగా భావించాడు. రాజా ! విపులుడు ఆ తపశ్శక్తితో గర్వానికి లోనై ఇతరులతో ఘర్షణ పడసాగాడు. గురువు ద్వారా కీర్తిని, వరాలను పొందిన ఆ విపులుడు ఆనందంగా, నిర్భయంగా భూమిపై సంచరింపసాగాడు. కౌరవ్యా ! శక్తిమంతుడైన ఆ విపులుడు గురుపత్నీ సంరక్షణరూపమైన ఆ కర్మ ద్వారా, తన తపస్సు ద్వారా ఇహపర లోకాలను

రెండింటినీ గెలుచుకొన్నట్లు భావించుకొన్నాడు.

ఆపై కొంతకాలం గడచిన తరువాత రుచియొక్క సోదరి వివాహ మహోత్సవం సంఘటించింది. ఎంతో ధనం, ధాన్యం ఖర్చు అవుతున్నాయి. అదే సమయంలో ఒక దివ్య కాంత పరమ మనోహర రూపాన్ని ధరించి, గగన మార్గంలో వెళ్ళసాగింది. ఆమె శరీరం నుండి పూలు నేలకు రాలాయి. దివ్య పరిమళం గల ఆ పూలు దేవశర్మ ఆశ్రమానికి దగ్గరలోనే పడ్డాయి. అప్పుడు అందమైన కన్నులుగల రుచి ఆ పూలను స్వీకరించింది. అంతలోనే అంగదేశం నుండి వేగంగా రమ్మని పిలుపు వచ్చింది. నాయనా ! ఆమె అక్క ప్రభావతి. ఆమె అంగరాజైన చిత్రరథుని భార్య. ఆ పూలను తలలో తురుముకొని, అందగత్తె అయిన ఆ రుచి, తన కందిన పిలుపు మేరకు అంగరాజ భవనానికి వెళ్ళింది. అంగరాజు భార్య అయిన ప్రభావతి ఆ పూలను చూసింది. ఆచారునయన అటువంటి పూలే తనకూ కావాలని అక్కను ఒత్తిడి చేసింది. అందమైన వదనం గల ఆ రుచి తన సోదరి మాటాడినదంతా భర్తకు చెప్పింది. ఋషి దానిని అభినందించాడు. ఆపై మహాతపస్వి అయిన దేవశర్మ విపులుని పిలిపించి, ఆ పూలు తెమ్మని ఆదేశించాడు. 'వెళ్ళు ! వెళ్ళు !' అని తొందరచేశాడు. మహాతపస్వి అయిన విపులుడు గురు వాక్యాన్ని విని, మరేమి ఆలోచించకుండా 'అలాగే' అని పలికి ఆకాశం నుండి ఆ పూలు రాలిన ప్రదేశానికి వెళ్ళాడు. అక్కడ అవే పూలు మరికొన్ని ఇంకా వాడకుండా ఉన్నాయి. ఆపై విపులుడు తన తపస్సు ద్వారా లభించిన దివ్య సుగంధ భరితాలయిన ఆ దివ్య పుష్పాలను తీసికొన్నాడు. ఆ పూలను తీసికొని, ప్రీతమనస్కుడై, గురు వచనాన్ని పాటిస్తున్న ఆ విపులుడు అప్పుడు వేగంగా చంపకవృక్షాలు చుట్టి ఉన్న చంపానగరం వైపు బయలుదేరాడు.

నిర్జనవనంలో ఆ విపులుడు మానవుల జంటను చూశాడు. వారు ఒకరి చేయి మరొకరు పట్టుకొని చక్రంవలె తిరుగుతున్నారు. రాజా ! వారిలో ఒకడు కాళ్లను మారుస్తూ త్వరత్వరగా తిరుగుతున్నాడు. మరొకడు అలా చేయలేకపోయాడు. దానితో గొడవ పడసాగారు. 'నీవు వేగంగా తిరుగుతున్నావు' అన్నాడొకడు. మరొకడు 'లేదు' అన్నాడు. రాజా ! 'లేదు లేదు' అంటూ వారు ఒకరితో ఒకరు అనసాగారు. అలా ఘర్షణ పడుతున్న వారిద్దరిలో అప్పుడు శపథం చేయవలసి వచ్చింది. వారు వేగంగా విపులుని ఉద్దేశించి ఇలా పలికారు. "మనలో ఎవరు అసత్యమాడితే వాడు ద్విజుడైన ఈ విపులుడు పరలోకంలో పొందేగతిని పొందుతాడు". ఇది విని విపులుడు విషణ్ణవదను డయ్యాడు". నేను ఇంత తీవ్రతపస్సు చేసిన వాడను అయినా ఆ పరిశ్రమ కష్టదాయక మయింది. నేనేం పాపం

చేశాను. దానితో నాకెలాంటి దుర్గతి కలుగుతుంది. దుర్గతి సర్వప్రాణులకూ ఇష్టం లేనిదే. ఈ జంట ఈనాడు నా సమక్షంలో పలికినట్లు నేను పొందే దుర్గతి ఏమిటి ?' రాజసత్తమా ! అలా ఆలోచిస్తూనే విపులుడు తలవాల్చి, దీనమనస్కుడై, తాను చేసిన దుష్కర్మను గూర్చి ఆలోచించాడు. ఆపై విపులుడు మరో ఆరుగురు పురుషులను చూశాడు. వారు బంగారంతో, వెండితో చేసిన పాచికలతో ఆడుతున్నారు. లోభంతో, ఆనందంతో కూడి ఉన్నారు. వారు కూడా ఆ జంట శపథం చేసినట్లే విపులుని ఉద్దేశించి ఇలా అనుకొన్నారు. "మనలో ఎవరైనా లోభాన్ని పొంది విశ్వాసద్రోహం చేయటానికి సాహసిస్తే వారు పరలోకంలో విపులుడు పొందేగతిని పొందుతారు". కౌరవ్యా ! అది విని కూడా విపులుడు పుట్టిన నాటి నుండి అప్పటి వరకు తాను చేసిన పనుల నన్నింటినీ తలచుకొన్నాడు. కానీ ఎక్కడా ధర్మం పాపంతో సంకరమైన స్థితి కనిపించలేదు. రాజా ! తనకు సంబంధించినట్లుగా వారు శపథాలు చేయటం విని, జ్వలించే అగ్నిలో మరొక అగ్ని పడినట్లు విపులుని హృదయం దహించుకొని పోసాగింది. అప్పుడు తాను చేసిన పనులను గురించి తీవ్రంగా ఆలోచించాడు. విపులుడు అలా ఆలోచిస్తుండగానే ఎన్నో పగళ్ళు, రాత్రులు గడచిపోయాయి. చివరకు రుచిని రక్షించిన తీరు కారణంగా విపులుని మనసులో నిలిచింది. "లక్షణంతో, లక్షణాన్ని, వదనంతో వదనాన్ని నేను సంయోగించాను. కానీ ఈ సత్యాన్ని నేను గురువుగారికి చెప్పలేదు". కౌరవ్యా ! అప్పుడు మహాభాగుడైన విపులుడు తనలో దీనినే దుష్కృతంగా భావించాడు. అది నిజంగా దోషమే. సంశయం లేదు. ఆ విపులుడు చంపా నగరానికి పోయి ఆ పూలను గురువుగారికిచ్చాడు. గురు ప్రియుడైన ఆ విపులుడు యథావిధిగా గురువును పూజించాడు.

43. దేవశర్మ విపులుని అనునయించుట.

భీష్ముడు చెప్తున్నాడు. "రాజా ! తన దగ్గరకు వచ్చిన శిష్యుని చూసి, మహాతేజస్వి అయిన దేవశర్మ ఏమన్నాడో. అది విను. దేవశర్మ ఇలా పలికాడు. "శిష్యా ! విపులా ! ఆ మహావనంలో నీవేం చూశావు ? వారు నిన్నెరుగుదురు. నీ అంతరాత్మను గురించి, రుచిని గురించి కూడా వారికి తెలుసు". విపులుడిలా అడిగాడు. "బ్రహ్మర్షీ ? ఆ జంట ఎవరు ? ఆ పురుషులెవరు ? స్వామీ ! వారికి నా గురించి ఎలా తెలుసు ? వారి గురించి మీరు కూడా నన్ను అడుగుతున్నారు గదా".

దేవశర్మ ఇలా చెప్పాడు. "బ్రహ్మ స్వరూపా ! ఆ మిథునం అహోరాత్రాలని

గ్రహించు. చక్రంలాగా తిరుగుతుంటుంది. నీ దుష్కృతం ఆ జంటకు తెలుసు. విప్రా ! ఆనందంగా పాచికలాడుతున్న ఆ పురుషులు ఋతువులని గ్రహించు. వారికి కూడా నీ పాపకర్మ తెలుసు. ద్విజా ! పాపాత్ముడైన నరుడు ఏకాంతంలో పాప కర్మ చేస్తూ నన్ను ఎవ్వరూ తెలిసికొనలేరని విశ్వసించకూడదు. ఏకాంతంలో పాపకర్మను చేస్తున్న నరుని సర్వదా ఋతువులు, అహోరాత్రాలు చూస్తూనే ఉంటాయి. నీవు నా భార్యను రక్షించే సమయంలో పాపకర్మ చేసి, కూడా నాకు చెప్పలేదు. అందువలన నీవు కూడా పాపకృత్యాలు చేసినవారు పొందే లోకాలను పొందవలసి వచ్చింది. చేసిన పాపకర్మను గురువుకు చెప్పకుండా ఆనందంగా నవ్వుతూ బ్రతుకుతున్న నిన్ను చూసి, వారు నీకు దానిని గుర్తు చేస్తూ అలా అన్నారు. అది నీవు విన్నావు గదా ! పాపాత్ముడు చేసే పాపకర్మనైనా, పుణ్యాత్ములు చేసే శుభకీర్తినయినా అహోరాత్రాలు, ఋతువులు ఎప్పుడూ చూస్తుంటాయి. బ్రాహ్మణా ! వ్యభిచార దోషం కారణంగా భయాత్మకమైన పని నీవు చేసి కూడా నాకు చెప్పలేదు. చెప్పలేదని తెలిసినవారు కాబట్టి నీ గురించి అలా అన్నారు. పాపకృత్యం చేసి చెప్పనివారు పాపకర్మలు చేసినవారు పొందే లోకాలను పొందుతారు. నీవు నా విషయంలో అలాగే చేసిన పని చెప్పలేదు. ద్విజా ! దుష్ప్రవర్తన గల ఆ స్త్రీని రక్షించటం నీకు శక్యమైన విషయం కాదు. కాబట్టి నీవు ఏ తప్పు చేయలేదు. కాబట్టి నేను నీపై ప్రసన్నుడనై ఉన్నాను. ద్విజసత్తమా ! ఒకవేళ ఈ పని నాకు తప్పు అనిపించి ఉంటే, కోపంతో నిన్ను శపించి ఉండేవాడిని. దానిని గురించి మరొకవిధంగా ఆలోచించే వాడను కూడా కాదు. స్త్రీలు పురుషులపై ఆసక్తిపడతారు. పురుషులకు కూడా ఆ భావం పుష్కలంగా ఉంటుంది. మరొక భావంతో నీవు ఆమెను రక్షించి ఉంటే తప్పక శపించే వాడను. శపించాలనే నిర్ణయించేవాడను. కుమారా ! నీవు నా భార్యను రక్షించావు. అంతవరకు నాకు చెప్పావు. నాయనా ! నీపై నేను ప్రసన్నుడనయ్యాను. సుఖంగా ఉండి స్వర్గానికి వెళ్ళగలవు." విపులునితో అలా పలికి ప్రీతి చెందిన దేవశర్మ భార్యతో, శిష్యులలో కలిసి స్వర్గానికి చేరి, ఆనందించాడు.

రాజా ! గతంలో గంగా తీరంలో మాటల సందర్భంలో మార్కండేయ మహాముని ఈ ఆఖ్యానాన్ని నాకు చెప్పాడు. పార్థా ! అందువలన నీకు చెప్తున్నాను. స్త్రీలను సదా కాపాడాలి. వారిలో ఎప్పుడూ మంచీ, చెడూ రెండూ కనిపిస్తాయి. స్త్రీలు పతివ్రతలయితే సౌభాగ్యవతులు కాగలరు. ఆదరాన్ని పొంది జగన్మాతలు కాగలరు. వనాలతో, కాననాలతో సహా ఈ భూమండలాన్ని నిలుపగలరు. దురాచారిణులై పాతివ్రత్యాన్ని కోల్పోయిన

స్త్రీలు వంశాన్ని నాశనం చేస్తారు. పాపకర్మల మీదనే మనసు పెడతారు. శరీరంతోపాటు పుట్టిన అవలక్షణాల ద్వారా అటువంటి వారిని తెలిసికొనవచ్చు. ఈ రీతిగా మహాత్ములు ఈ స్త్రీలను రక్షించవచ్చు. లేకపోతే స్త్రీలను రక్షించటం కష్టం. మనుజశ్రేష్ఠా ! ఈ స్త్రీలు తీవ్ర స్వభావంతో, తీవ్ర శక్తితో ఉంటారు. వారికి ప్రియమైన వారంటూ ఎవ్వరూ ఉండరు. మైథున సమయంలో వారితో ఉన్నవారే వారికి ప్రియులు. భరతర్షభా ! ఈ స్త్రీలు కృత్యలవలె ప్రాణాంతకలు. ముందు ఒకరు స్వీకరించినా ఇతరులచే స్వీకరింపబడేవారు (పుంశ్చలులు). పాండవా ! ఒక్క పురుషుని మీదనే సదా అనురాగ ముండదు స్త్రీలకు. రాజా ! నరులు స్త్రీలపై ప్రత్యేకాసక్తితో ఉండకూడదు. అలా అని ఈర్ష్యకు పడకూడదు. వైరాగ్య పూర్వకంగా, ధర్మబద్ధంగా, ఋతుస్నానాంతరం, పవిత్ర దినాలను పరిహరించి, వారితో భోగించాలి. కౌరవనందనా ! దానికి భిన్నంగా ప్రవర్తించిన నరుడు నాశనమవుతాడు. సర్వవిధాల సర్వత్ర ముక్తియే ఆదరింపదగినది. రాజా ! విపులుడొక్కడే స్త్రీని రక్షించగలిగాడు. మూడు లోకాలలోనూ స్త్రీని రక్షింపగలవాడు మరొకడు లేడు.

44. కన్యావివాహ విషయమై వరయోగ్యతావిచారణ.

యుధిష్ఠిరు డడిగాడు. "పితామహా ! సర్వధర్మాలకూ, కుటుంబీకులకు, ఇంటికి, పితరులకు, దేవతలకూ కూడా మూలమైనదానిని (కన్యాదానాన్ని) గురించి నాకు చెప్పు. సర్వధర్మాలలోనూ బాగుగా ఆలోచింపదగిన ధర్మంగా భావింపబడుతుంది. రాజా ! కన్యను ఎవరికివ్వాలన్నదే ఆ ఆలోచన". భీష్ముడు చెప్తున్నాడు. "వరుని శీలాన్ని, స్వభావాన్ని, విద్యను, వంశాన్ని, కర్మను గురించి తెలిసికొని గుణవంతుడైన వరునికి సత్పురుషులు కన్యాదానం చేయాలి. యుధిష్ఠిరా ! అటువంటి వరుని పిలిపించి కన్యాదానం చేయటం ఉత్తమ బ్రాహ్మణుల ధర్మం. ఇది బ్రాహ్మ వివాహం. ధనాదులతో వరునిపక్షాన్ని అనుకూలం చేసికొని కన్యాదానం చేయటం శిష్ట బ్రాహ్మణులకు, క్షత్రియులకు సనాతన ధర్మం. (ఇది ప్రజాపత్య వివాహం). యుధిష్ఠిరా ! తాము ఇష్టపడిన వానిని విడిచిపెట్టి, కన్య ఇష్టపడిన వానిని, అతనికి కూడా కన్య ఇష్టమయితే, ఇచ్చి వివాహం చేయటం గాంధర్వ ధర్మ వివాహమని వేదవేత్తలైన జనులంటారు. రాజా ! కన్యా బంధువులను ప్రలోభపెట్టి, పుష్కలంగా ధనమిచ్చి, కన్యను కొని, తీసికొని వెళ్ళటాన్ని మనీషులు ఆసురధర్మమంటారు (ఇది ఆసురవివాహం). నాయనా ! ఇలాగే కన్యకై ఏడుస్తున్న సోదరాదులను చంపి, తలలు ఖండించి, ఏడుస్తున్న కన్యను బలవంతంగా అపహరించటం రాక్షసవిధి అంటారు

(ఇది రాక్షస వివాహం). యుధిష్ఠిరా ! పైన చెప్పిన అయిదింటిలో మొదటి మూడు ధర్మబద్ధాలు మిగిలిన రెండు ధర్మప్రతికూలాలు. పైశాచ, ఆసుర వివాహాలను ఏ రీతిగానూ పాటించగూడదు. నరోత్తమా ! బ్రాహ్మం, క్షాత్రం (ప్రాజాసత్యం), గాంధర్వం - ఇవి మూడు ధర్మానుకూలాలు. విడివిడిగా అయినా, మిశ్రరూపంలో అయినా చెప్పవచ్చు. ఈ విషయంలో సంశయం లేదు.

బ్రాహ్మణునకు ముగ్గురు భార్యలుండవచ్చు. క్షత్రియునకు ఇద్దరు భార్యలుండవచ్చు. వైశ్యునకు తన జాతికి చెందిన దొక్క భార్యయే ఉండాలి. అయితే వారి సంతతి సమానంగా తండ్రికులాన్నే పొందుతుంది. బ్రాహ్మణునకు బ్రాహ్మణ స్త్రీయే పెద్ద భార్య కావాలి. క్షత్రియునకు క్షత్రియకాంతయే పెద్ద భార్య కావాలి. రతికోసం శూద్ర స్త్రీ కూడా ఉండవచ్చునని కొందరు, ఉండకూడదని మరికొందరు అంటారు. శూద్రస్త్రీలో సంతానం పొందటాన్ని సజ్జనులు ప్రశంసించరు. విప్రుడు శూద్ర స్త్రీ ద్వారా పిల్లలను కంటే ప్రాయశ్చిత్తం చేసికోవాలి. ముప్పది సంవత్సరాల పురుషుడు, పది సంవత్సరాల స్త్రీని వివాహమాడాలి. ఆమె రజస్వలయై ఉండకూడదు. ఇరవై యొక్కసంవత్సరాల వరుడు ఏడు సంవత్సరాల స్త్రీని పెండ్లాడాలి. భరతర్షభా ! తండ్రి కానీ, సోదరుడు కానీ లేని స్త్రీని ఎప్పుడు వివాహ మాడరాదు. ఆమెను పుత్రికాధర్మిణి అంటారు. స్త్రీ ఋతుమతి అయిన తరువాత మూడు సంవత్సరాల పాటు తనవారు పెండ్లి చేస్తారని ఎదురు చూడాలి. నాలుగవ సంవత్సరం వస్తే స్వయంగా భర్తను సంపాదించుకోవాలి. భరతర్షభా ! అలా చేసిన స్త్రీకి ఆ పురుషునితో కల సంబంధం కానీ, వారికి కలిగిన సంతానం కానీ తక్కువ చేసి చూడబడదు. దీనికి భిన్నంగా ప్రవర్తించిన స్త్రీ ప్రజాపతి దృష్టిలో నిందార్హురాలు అవుతుంది. కన్య తల్లికి సపిండం కారాదు. తండ్రికి సగోత్ర కారాదు. అటువంటి స్త్రీని పెండ్లాడటం ధర్మమని మనువు చెప్పాడు".

యుధిష్ఠిరు డడిగాడు. "పితామహా ! ఒకడు శుల్కాన్ని ఇచ్చాడు. మరొకడు ఇస్తానని మాట ఇచ్చాడు. ఒకడు బలపూర్వకంగా తీసికొని వెళ్ళటానికి మాటాడుతున్నాడు. మరొకడు ధనంతో ప్రలోభపెట్టాడు. వేరొకడు పాణి గ్రహణం చేశారు ఈ స్థితిలో ఆమె ఎవరి భార్య అవుతుంది ? తత్త్వం తెలిసికొనగోరుతున్న మాకు నీవే కంటివి కావాలి." భీష్ముడు చెప్తున్నాడు. "మనుష్యుల హితం కోసం ఏర్పడిన ఏ కర్మ అయినా వ్యవస్థ కోసమే ఏర్పడింది. అది ఆలోచన గల వారిచే చక్కగా విచారించిన తరువాతనే నిశ్చయింపబడుతుంది. అబద్ధమాడి వ్యవస్థను భంగపరచటం పాపం భార్య, భర్త, ఋత్విక్కు,

ఆచార్యుడు, శిష్యుడు, ఉపాధ్యాయుడు – వీరు వ్యవస్థకు విరుద్ధంగా మాటాడితే శిక్షార్హులు. కానీ కొందరు వీరిని దండార్హులు కాదంటారు. ఇష్టంలేని పురుషునితో ఇష్టమున్న స్త్రీ సహవాసం చేయటాన్ని మనువు అభినందించాడు. అందరి మధ్య నిశ్చయించిన వివాహాన్ని నిరర్థకం చేయటం అపకీర్తికీ, అధర్మానికీ కారణమవుతుంది. . ఆ ప్రయత్నం ధర్మ వినాశకం. భారతా ! ధర్మబద్ధంగా పాణిగ్రహణం చేయించి దానం చేసినా, కన్యాశుల్కాన్ని చెల్లించి కొనిపోయినా అప్పుడు వరునిలో ఏ దోషమూ ఉండదు. ఆ స్థితిలో దోష మే కారణంగా కలుగుతుంది ? కన్యాబంధువుల అంగీకారంతో పెళ్లి జరుగుతున్నప్పుడు మంత్రాలను, హోమాలను ప్రయోగించాలి. అప్పుడే మంత్రాలు సఫలమవుతాయి. పెద్దలు కన్యాదానం చేయకపోతే మంత్రాలు నిరర్థకాలు. భార్యాభర్తలు ఇద్దరూ పరస్పరం మంత్ర పూర్వకంగా ప్రతిజ్ఞలు చేస్తే అది శ్రేష్ఠం. అది బంధువుల అంగీకారంతోనే జరిగితే పరమ శ్రేష్ఠం.

ధర్మ శాస్త్రాలకు అనుగుణంగా భార్యను పొందితే భర్త ఆమెను దేవుడిచ్చిన భార్యగా భావిస్తాడు. అలా దైవయోగంతో లభించిన భార్యను వరుడు గ్రహిస్తాడు. అక్కడ మనుష్యుల అసత్య వచనానికి అవకాశముండదు." యుధిష్ఠిరుడు అడిగాడు. "ఒక వరుని ద్వారా కన్యాశుల్కాన్ని స్వీకరించిన తరువాత ధర్మార్థకామ సంపన్నుడై, అంతకన్న గొప్ప వరుడు లభిస్తే అప్పుడు అక్కడ మాట తప్పవచ్చా ? తప్పకూడదా ? అక్కడ రెండు రకాల దోషం. మరొకవరుని స్వీకరిస్తే మాట తప్పిన దోషం. తిరస్కరిస్తే శ్రేష్ఠవరుని తిరస్కరించిన దోషం. అప్పుడు ఏం చేస్తే శ్రేయస్కరమవుతుంది ? అన్ని ధర్మాలకన్నా తీవ్రంగా ఆలోచింపవలసిన ధర్మంగా ఇది నా కనిపిస్తోంది. తత్త్వాన్ని తెలియగోరుతున్న మాకు నీవే కన్నువు కావాలి. ఇదంతా వివరంగా చెప్పు. నీవెంత చెప్పినా నాకు తృప్తి కలగటం లేదు". భీష్ముడు చెప్తున్నాడు. "శుల్కమిచ్చినంత మాత్రాన అది తుది నిర్ణయం కాదు. అది తెలిసియే తాను శుల్కమిస్తాడు. సజ్జనులు కన్యాశుల్కాన్ని తీసికొని కూడా ఏదో ప్రత్యేక కారణం వలన అప్పుడప్పుడు కన్యాదానం చేయరు. విపరీత గుణాలు గల వరుని నుండియే, బాంధవులు కన్యాశుల్కాన్ని తీసికొంటారు. వరుని పిలిపించి 'కన్యను అలంకరించి పెండ్లి చేసికొమ్మంటే అది ధర్మానుకూలమైన కన్యాదానమే'. ఈ రీతిగా అలంకరింపబడిన కన్యను దానం చేస్తే అది కన్యాశుల్కం క్రిందికీ రాదు, కన్యా విక్రయం క్రిందికీ రాదు. అసలు ఏదో ఒకటి తీసికొని కన్యాదానం చేయటం సనాతన ధర్మం. ఎవరెవిరితోనో 'నీకు మా అమ్మాయిన ఇస్తాను అన్నా,

ఇవ్వను' అన్నా 'తప్పక ఇస్తాను' అన్నా, ఇవన్నీ కన్యాదానానికి ముందు మాటాడిన వాటి క్రిందనే లెక్క. కాబట్టి పాణిగ్రహణమయ్యేంత వరకు స్త్రీలు, పురుషులు కూడా ఒకరినొకరు కోరుకొంటూనే ఉండవచ్చు. కన్యలకై మరుద్గణాలు ఇటువంటి వరమిచ్చారని నేను విన్నాను. ఇష్టంలేని వానికి (అయోగ్యునకు) కన్యాదానం చేయగూడదని ఋషుల అభిప్రాయం. ఎందుకంటే కామ సుఖప్రాప్తికి, సంతానోత్పత్తికి అదే గదా కారణం. ఇది నా అభిప్రాయం. కన్యాక్రయ విక్రయంలో ఎన్నో దోషాలుంటాయి. బాగా ఆలోచిస్తే నీవే గ్రహించగలవు. శుల్కమిచ్చినంత మాత్రాన అది అంతిమ నిర్ణయం కాదు. గతంలో ఎప్పుడూ అలా జరగలేదు. ఇంకా విను. నేను సర్వమాగధులను, కాశీరాజులను, కోసలులను ఓడించి విచిత్ర వీర్యునికై ఇద్దరు కన్యలను తెచ్చాను.

వారిలో ఒకర్తెకు మనసా పాణిగ్రహణం జరిగింది. మరొకర్తె అప్పటికే కన్యాశుల్కం స్వీకరించింది. అప్పుడు మా తండ్రి బాహ్లీకుడు పాణిగృహీతను విడిచిపెట్టమన్నాడు. మరొక కన్యను పెండ్లాడవచ్చునన్నాడు. నేను నా తండ్రి మాటను శంకిస్తూ, ఇతరులను కూడా ఆ విషయమై ప్రశ్నించాను. ఆ నా తండ్రికి ధర్మాభిలాష మరీ ఎక్కువ. అప్పుడు నేను ఆచారాన్ని తెలిసికోవాలని తండ్రినిలా అడిగాను. "ఆచారాన్ని గురించి నాకు యథాతథంగా తెలిసికోవాలనుకొంటున్నాను. పరంపరంగా వస్తున్న ఆచారమేమిటి ?" మహారాజా ! ఆపై నేను అలా అడగగానే ధర్మవేత్తలలో శ్రేష్ఠుడైన నా పినతండ్రి - బాహ్లీకుడు ఇలా అన్నాడు. 'కన్యాశుల్కమిచ్చినంత మాత్రాన వివాహం నిశ్చయమైనట్లే పాణిగ్రహణంతో కాదు' అని నిర్ణయిస్తే "కన్యాశుల్కం తీసికొన్న తరువాత అయినా కన్యపిత మరొక గుణవంతుని వరునిగా ఆశ్రయించవచ్చు"నన్న స్మృతి వచనం వ్యర్థమవుతుంది. 'కన్యాశుల్క స్వీకారంతోనే వివాహ నిశ్చయమైనట్లు కానీ పాణిగ్రహణంతో కాదు' అనే వారి మాటలను ధర్మవేత్తలు ప్రమాణంగా అంగీకరించటం లేదు. కన్యాదానాన్నే వివాహంగా భావించటం లోక ప్రసిద్ధం. అందరూ అలాగే అంటారు. శుల్క స్వీకారామే నిశ్చయ మనటానికి ప్రమాణ వచనమేదీ లేదు. శుల్కాన్ని లేక క్రయాన్ని నిశ్చతంగా భావించే నరులు ధర్మవేత్తలు కారు. ఇటువంటి వారికి కన్యాదానం చేయకూడదు. అటువంటి కన్యను వివాహమాడరాదు కూడా. ఎందుకంటే భార్య ఏ రీతిగానూ కొనే వస్తువో, అమ్మే వస్తువో కాదు. కొందరు దాసీజనాన్ని కొంటుంటారు. అమ్ముతుంటారు. వారు లుబ్ధులు, పాపాత్ములు. భార్యా విషయాన్ని కూడా వారు అలాగే నిశ్చయించుకొంటారు. ఒకప్పుడు ఈ విషయంలో జనులు సత్యవంతుని ఇలా అడిగారు. 'మహాప్రాజ్ఞా ! కన్యాశుల్క

మిచ్చిన తరువాత ఆ శుల్క మిచ్చినవాడు మరణించాడు. ఆమెను మరొకరు పెండ్లాడవచ్చునా ? లేదా ? ఇది మాకున్న ధర్మ సంశయం. నీవు ప్రాజ్ఞులు మెచ్చేవాడివి. ఈ సంశయాన్ని తొలగించు. తత్త్వాన్ని తెలియగోరుతున్న మాకు నీవే కన్నువు కావాలి". అలా అడిగిన వారందరితో సత్యవంతుడిలా చెప్పాడు. "ఆ సందర్భంలో స్వేచ్ఛగా ఆమెను మరొకరికి ఇవ్వవచ్చు. ఇక్కడ ఆలోచించవలసిన అవసరం లేదు. శుల్కమిచ్చిన వాడు బ్రతికియే ఉన్నా మరో మంచివరుడు దొరికితే ఇలా చేయవచ్చు. ఇక మరణిస్తే సంశయింపవలసిన పనియే లేదు. శుల్కదాత మరణిస్తే ఆ కన్య అతని సోదరుని పెండ్లాడవచ్చు. లేదా మరో జన్మలో అయినా అతనితో పాణిగ్రహణం జరగాలన్న కోరికతో మనసా అతనినే అనుసరిస్తూ తపస్సు చేయవచ్చు. కొందరి మతంలో సంభోగం జరగని కన్యను మరొకరు పెండ్లాడవచ్చు. మరికొందరి దృష్టిలో ఇది ధర్మవిరుద్ధం. ఇలా వాదవివాదాలు చేసేవారంతా కడకిలా నిశ్చయిస్తారు. పాణిగ్రహణానికి ముందు మంగళ మంత్రాలన్నీ పూర్తి అయినా కూడా అవకాశముంటే మరొక యోగ్యవరునకిచ్చి చేయవచ్చు. అప్పుడు కన్యాదాతకు అసత్యమాడిన పాతకం మాత్రమే. సప్తపదిలోని ఏడవ అడుగుపడినప్పుడే పాణిగ్రహణ మంత్రాలు నిశ్చితాలవుతాయి. జలపూర్వకంగా కన్యాదానం చేసినప్పుడే పాణిగ్రహీత భర్త అవుతాడు. ఈ రీతిగా కన్యాదానాన్ని విధించారు, నిశ్చయించారు. తనకు అనుకూలమై, తన వంశానికి తగినదై, సోదరునిచే ఇవ్వబడి, అగ్నుల దగ్గర కూర్చున్న స్త్రీని బ్రాహ్మణోత్తముడు తన అగ్నులకు ప్రదక్షిణం చేసి యథావిధిగా భార్యగా పొందాలి."

45. కన్యాదౌహిత్రుల ఉత్తరాధికార నిర్ణయము.

యుధిష్ఠిరు డడిగాడు. "కూతురునివ్వటానికి శుల్కం తీసికొన్న తరువాత శుల్కమిచ్చినవారు రాలేదు. మరెవరూ పెండ్లాడటానికి సిద్ధపడలేదు. అప్పుడు ఆ తండ్రి ఏం చేయాలి ? పితామహా" నాకిది చెప్పు". భీష్ముడు చెప్తున్నాడు. "సంతానహీనుడైన సంపన్నుని నుండి ధనం తీసికొన్న తరువాత అతడు వచ్చేదాకా కన్యను రక్షించాలి. తీసికొన్న ధనాన్ని తిరిగి ఇచ్చేదాకా ఆ కన్య అతనిదిగానే భావించబడుతుంది. వీలయితే న్యాయబద్ధమైన మార్గంలో అతనికై సంతానాన్ని పొందవచ్చు. కాబట్టి మరొక మగవాడెవ్వడూ మంత్ర విధితో కూడిన ఏ పనినీ, ఏ పాటీ పాటించగూడదు. సావిత్రి తండ్రి అనుమతితో తనంత తాను ఎన్నుకొన్న భర్తతో సంబంధాన్ని కొనసాగించింది. ధర్మజ్ఞులు ఆమె చేసిన

పనిని ప్రశంసించారు. ఇతరులు అంగీకరింపలేదు. ఇతర సత్పురుషులెవ్వరూ ఇలా చేయలేదని కొందరంటారు. అప్పుడప్పుడు కొందరు చేశారని ఇతరులంటారు. కాబట్టి సజ్జనుల ఆచారమే ధర్మానికి శ్రేష్ఠ లక్షణం. ఈ సందర్భానికి సంబంధించియే జనకుని ముని మనుమడైన సుక్రతుడు ఇలా చెప్పాడు. "అసత్పురుషులు ఆచరిస్తున్న మార్గాన్ని ఎలా ప్రశంసింపగలం. ఆ మార్గాన్ని గురించి ప్రశ్నను కానీ, సంశయాన్ని కానీ సత్పురుషుల దగ్గర ఎలా ప్రస్తావించగలం ? ఆసురధర్మంతో వివాహం జరిపించటం అసద్ధర్మం. పూర్వకాలంలో ఎప్పుడూ వివాహ సందర్భంలో ఆసురధర్మాన్ని పాటించినట్లు వినలేదు. భార్యాభర్తల మధ్య లేదా స్త్రీ పురుషుల మధ్య ఉన్న సంబంధం చాలా స్వల్పం. రతి వారికున్న సమానధర్మం". అని కూడా ఆ రాజు చెప్పాడు.

యుధిష్ఠిరు డడిగాడు. "తండ్రికి కూతురు కూడా కుమారునితో సమానమే. అటువంటప్పుడు ఏ ప్రమాణంతో కేవలం కొడుకుకే ధనంపై అధికారముంటోంది" ? భీష్ముడు చెప్తున్నాడు. "తానెంతో కొడుకూ అంతే. కూతురు కొడుకుతో సమానం. ఆత్మ స్వరూప అయిన ఆమె ఉండగా ఇతరులు (సోదరులు) ధనాన్ని ఎలా అపహరింపగలరు ? తల్లి వైపు నుండి వరకట్నంగా వచ్చినదంతా పుత్రికల భాగమే. ఏ పుత్రులు లేని తండ్రి ఆస్తికి దౌహిత్రుడే వారసుడు. దౌహిత్రుడే తండ్రికి, మాతామహునికి పిండ ప్రదానం చేస్తాడు. ధర్మాన్ని బట్టి కుమారునికి, దౌహిత్రునకు తేడా లేదు. ముందు కూతురు పుడితే, ఆమెను పుత్రునిగా స్వీకరించినా ఆ తర్వాత పుట్టిన కొడుకుకు కూడా కూతురితో సమానంగా హక్కు ఉంటుంది. ఆ తండ్రి మరొకని దత్తు చేసికొంటే ఆ పుత్రుని కన్న పుత్రికకు విశేషాధికార ముంటుంది. ధనాన్ని తీసికొని కన్యలను అమ్మితే ఆమె పుత్రులు తండ్రి ఆస్తికే వారసులు అవుతారు. దౌహిత్రక ధర్మంతో తాత ఆస్తికి ఆ బాలుడు వారసుడు కావటానికి కారణం కనిపించదు. ఆసుర వివాహం ద్వారా పుట్టిన పిల్లలు తప్పులెన్నేవారు, అధర్మపరులు, పరుల సొమ్ము కాజేసేవారు, వంచకులు అయి ధర్మానికి విషమ స్థితిని కల్పిస్తారు. ఈ విషయమై ప్రాచీన కాల వ్యవహార మెరిగి, ధర్మజ్ఞులై, ధర్మశాస్త్రానికి కట్టుబడి, ధర్మసేతువులవలె ఉన్నవారు యముడు చెప్పిన ప్రాచీన గాధలను ఇలా కీర్తిస్తారు. 'తన కుమారుని అమ్మటం ద్వారా ధనాన్ని ఆశించేవాడు, తన బ్రతుకు తెరువుకై శుల్కం తీసికొని కన్యనిచ్చే మూఢుడు కుంభీపాకం మొదలయిన ఎడు నరకాల కన్నా కూడా హీనమైన కలమనే పేరుగల నరకంలో పడి స్వేదమూత్ర పురీషాలను ఆహారంగా స్వీకరిస్తాడు.' ఆర్ష వివాహ సందర్భంలో గోవుల జంటను (ఎద్దు-ఆవు)

శుల్కంగా కొందరంటారు. కానీ అది కూడా అసంబద్ధమే. రాజా ! శుల్కం తక్కువయినా, ఎక్కువయినా అమ్మకం అమ్మకమే. కొందరు ఆ రీతిగా ఆచరించినా అది సనాతన ధర్మం కాదు. ఇతరులలో కూడా లోకాచారమంటూ ఎన్నో రకాల ప్రవృత్తులు కనిపిస్తాయి. ఏ కన్యనయినా బలపూర్వకంగా లొంగదీసికొని, ఆమెను అనుభవిస్తే ఆ పాపకర్మలు అంధకారబంధురమైన నరకంలో పడతారు. ఏ మనుష్యనీ అమ్మకూడదంటుంటే ఇక సంతానాన్నీ అమ్ముకొంటే ఎలా ? అధర్మ కారణంగా వచ్చిన ధనంతో ఏ ధర్మకార్యమూ తగదు".

46. స్త్రీ ప్రశంస.

భీష్ముడు చెప్తున్నాడు. "ప్రాచీనేతిహాసాన్ని ఎరిగిన పండితులు దక్ష ప్రజాపతివచనాన్ని ఇలా ఉదాహరిస్తుంటారు. "కన్యాబంధువులు కన్యకోసమై ధనాన్ని తీసికొని, దాని నుండి తామేమీ స్వీకరింపకపోతే అది విక్రయం కాదు. అది కన్యలను సత్కరించటమే. అది దయాళుత్వమే. అలా తీసికొన్న దానిని అంతా నిశ్శేషంగా కన్యకే ఇవ్వాలి. అనేక శుభాలను కోరుకొనే తల్లిదండ్రులు, సోదరులు, అత్తమామలు, మరదులు అందరూ వధువును గౌరవించాలి, అలంకరించాలి కూడా. రాజా ! స్త్రీకి ఇష్టం లేకపోతే తన భర్తను ఆనందింపజేయలేదు. పురుషుడు ఆనందంగా లేకపోతే సంతాన వృద్ధి ఉండదు. అందువలన స్త్రీలనెప్పుడూ గౌరవించాలి, లాలించాలి. స్త్రీలు పూజింపబడిన చోట దేవతలు సంచరిస్తారు. వారు నిరాదరణకు గురి అయితే అక్కడ అన్ని పనులూ విఫలమవుతాయి. కోడళ్ళు, కూతుళ్ళు దుఃఖానికి లోనైన చోట వంశ నాశనం కలుగుతుంది. వారి శాపానికి గురి అయిన ఇళ్ళు కృత్యచే నష్ట పరచబడిన వాటితో సమానం. రాజా ! లక్ష్మి లేని ఇళ్ళు ప్రకాశించవు, వర్ధిల్లవు కూడా. మనువు స్వర్గానికి వెళ్తున్నప్పుడు స్త్రీలను పురుషుల చేతులలో పెట్టి ఇలా అన్నాడు. "స్త్రీలు అబలలు, స్వల్ప వస్త్రాలతో తృప్తి పడేవారు. మంచి మనస్సుగలవారు. సత్య లోకాన్ని గెలువగోరేవారు. ఈర్ష్యాలువులు, అభిమానాన్ని కోరేవారు, కోపపరవశలు, పురుషులకు ఆత్మీయులు. భోళా మనుషులు. వారు గౌరవింపదగినవారు. వారిని ఆదరించండి. ధర్మసిద్ధికి స్త్రీ జాతియే మూలం. మీ రతిసుఖాలు, పరిచర్యలు, నమస్కారాలు స్త్రీల అదుపులో ఉంటాయి. పిల్లలను కనటం, పుట్టినవారి ఆలనా - పాలనా చూడటం, లోకయాత్రను ప్రసన్నంగా నిర్వహించటం - ఇవన్నీ స్త్రీ విధి. మీరు కూడా స్త్రీలను సత్కరిస్తుంటే సర్వకార్యాలు సిద్ధిస్తాయి. ఈ విషయమై విదేహ రాజకుమారి

ఒక శ్లోకాన్ని చెప్పింది. 'స్త్రీలకు ఏదో యజ్ఞ క్రియకానీ, శ్రాద్ధంకానీ, ఉపవాసం కానీ అవసరం లేదు. తన భర్తను సేవించుటయే స్త్రీకి ధర్మం. ఆ ధర్మంతో స్వర్గాన్ని జయింపవచ్చు.' కౌమారంలో తండ్రి రక్షిస్తాడు. యౌవనంలో భర్త రక్షిస్తాడు. వార్ధక్యంలో పుత్రులు రక్షిస్తారు. స్త్రీకి స్వాతంత్ర్యమవసరం లేదు. స్త్రీలంటే శ్రీలే. ఐశ్వర్యాన్ని కోరేవాడు వీరిని సత్కరించాలి. భారతా ! వశం చేసికొని పాలిస్తే స్త్రీ శ్రీగా నిలుస్తుంది."

47. బ్రాహ్మణాదివర్ణాల ఆస్తి పంపకాల పద్ధతి.

యుధిష్ఠిరుడడిగాడు. "లోకంలోని అన్ని సంశయాలనూ తొలగింప గలవాడుగా నీకు ప్రసిద్ధి. పితామహా ! నాకొకానొక సంశయముంది. దాన్ని నివారించాలి. రాజా ! నాలో పుట్టిన ఈ సంశయాన్ని గురించి మరొకరినెవ్వరినీ అడగను. ధర్మమార్గంలో నడిచేవానికి ఈ విషయంలో ఏది కర్తవ్యం ? మహాబాహూ ! దీనిని తమరు పూర్తిగా వ్యాఖ్యానించి చెప్పాలి. బ్రాహ్మణులకు నలుగురు భార్యలు బ్రాహ్మణి, క్షత్రియ, వైశ్య, శూద్రురాలు అన్నారు. రత్యాసక్తి ఉన్నవారి కోసమే శూద్ర స్త్రీ విధానం. కురుసత్తమా ! వారికి అందరికీ పుట్టిన పిల్లలో ఎవరు క్రమంగా పిత్రార్జితానికి అధికారి కాగలడు ? పితామహా ! తండ్రి ధనంలో నుండి ఎవరు ఎంత తీసికొనవచ్చు. వారికి చేసిన విభాగమేదైనా ఉంటే దానిని చెప్తే వినాలనుకొంటున్నాను".

భీష్ముడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరా ! బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు వీరు రెండు జన్మలు గలవారు. ఈ మూడింటికి చెందిన కన్యలను బ్రాహ్మణుడు వివాహ మాడవచ్చు. అది విహిత ధర్మం. పరంతపా ! అన్యాయంగానీ, లోభంతో కానీ, కామంతో కానీ శూద్రకాంత బ్రాహ్మణునకు భార్య కావచ్చు. కానీ శాస్త్రాలు దాన్ని విధించినట్లు కనిపించదు. యుధిష్ఠిరా ! శూద్ర స్త్రీని తన పక్కమీదికి పిలిచిన బ్రాహ్మణుడు అధోగతిని పొందుతాడు. శాస్త్రోక్తమైన పద్ధతిలో ప్రాయశ్చిత్తం చేసికోవాలి కూడా. ఆమెకు పిల్లలు పుడితే ఆ దోషం రెట్టింపు అవుతుంది. భారతా ! బ్రాహ్మణాది కన్యలలో పుట్టిన పిల్లలకు వచ్చే పితృ ధన విభాగాన్ని గూర్చి చెపుతాను. బ్రాహ్మణ స్త్రీకి పుట్టినవాడు ఉత్తమ లక్షణాలు గల ఇల్లు, ఆవులు, ఎద్దులు, వాహనాలు ఇటువంటి ప్రధాన వస్తువులలో ప్రధానాంశం మీద అధికారాన్ని పొందుతాడు. బ్రాహ్మణుని ఆస్తిలో మిగిలిన దానిని పది భాగాలు చేయాలి. ఆ పితృధనంలో నాలుగు భాగాలు తానే స్వీకరించాలి. క్షత్రియ స్త్రీకి పుట్టినవాడు కూడా నిస్సంశయంగా బ్రాహ్మణుడే. తల్లి యొక్క ప్రత్యేకత వలన అతడు

మూడు భాగాలు పొందవచ్చు. యుధిష్ఠిరా ! మూడవ వర్ణానికి చెందిన వైశ్యకాంతకు బ్రాహ్మణుని ద్వారా పుట్టినవాడు బ్రాహ్మణుని ధనంలో రెండు భాగాలు పొందవచ్చు. భారతా ! శూద్రకాంత బ్రాహ్మణునకు పుట్టిన వానికి ఎప్పుడూ ఇవ్వకూడదన్నది శాస్త్రం. అయినా శూద్రా పుత్రునకు కూడా కొంచెమైన భాగమివ్వాలి. పది భాగాలుగా చేసిన ఆస్తిని పంచుకొనే క్రమమిది. సమాన వర్ణానికి చెందిన స్త్రీలకు పుట్టినవారికి సమానంగానే వాటాలు కల్పించాలి. బ్రాహ్మణుని ద్వారా శూద్రస్త్రీకి పుట్టిన వానిని అబ్రాహ్మణుడుగానే భావిస్తారు. అతనికి బ్రాహ్మణునకు తగ్గ నైపుణ్యముండదు. మిగిలిన మూడు వర్ణాల స్త్రీలకు ఆబ్రాహ్మణుని వలన పుట్టినవారు బ్రాహ్మణులే. నాలుగు వర్ణాలే శాస్త్ర విహితాలు. అయిదవ వర్ణం లేదు. శూద్రాపుత్రుడు తండ్రి ఆస్తిలో పదవ భాగాన్ని తీసికొనవచ్చు. భారతా ! అది కూడా తండ్రి ఇస్తేనే తీసికొనవచ్చు. లేకపోతే లేదు. కానీ శూద్రాపుత్రునకు కూడా తప్పక ధనమివ్వాలి. దయాళుత్వం పరమ ధర్మమని భావించి అతనికి ధనమివ్వాలి. దయ ఎక్కడ పుట్టినా అది గుణకారకమే అవుతుంది. భారతా ! శూద్రాపుత్రునకు పిల్లలున్నా, లేకపోయినా పదవభాగం కన్న ఎక్కువ ఇవ్వనవసరం లేదు.

బ్రాహ్మణుని దగ్గర మూడు సంవత్సరాలకు సరిపడిన దానికన్న ఎక్కువ ఉంటే ఆ ద్రవ్యంతో యాగం చేయాలి. నిరర్థకంగా ధనాన్ని ప్రోగు చేయరాదు. ధనంలో స్త్రీకి మూడువేల కన్న ఎక్కువగా భాగం పంచిపెట్టరాదు. ఆ ధనాన్ని కూడా భర్త ఇస్తేనే అర్హతను బట్టి అనుభవించవచ్చు. స్త్రీలకు భర్త ఆస్తిలో నుండి వచ్చే భాగాన్ని అనుభవించటమే ఫలితం. కాబట్టి తన భర్త ఇచ్చిన స్త్రీ ధనాన్ని బిడ్డలు మొదలయిన వారు ఏ రీతిగాను తీసికొనగూడదు యుధిష్ఠిరా ! స్త్రీకి తండ్రి ద్వారా సంక్రమించినది ఏదైనా ఉంటే, దాన్ని ఆమె కుమార్తెలు తీసికొనవచ్చు. కొడుకు వంటిదే కూతురు కూడా. రాజా ! కూతురు కూడా కొడుకు వంటిదే అని శాస్త్రవిధి. ధర్మమిలాగే విధించింది. ఈ రీతిగా ధర్మాన్ని తలచుకొంటూ ధనోపార్జన చేయాలి. అంతేకాని వ్యర్థంగా ధనాన్ని సంగ్రహించి పెట్టకూడదు".

యుధిష్ఠిరుడడిగాడు. "బ్రాహ్మణుని వలన శూద్ర స్త్రీకి పుట్టినవానికి ఏమీ ఇవ్వనవసరం లేదన్నారు ముందు. కానీ ఏ విశేషం వలన దశమ భాగమయినా ఇవ్వవలసి వస్తోంది ? బ్రాహ్మణునకు బ్రాహ్మణ స్త్రీ యందు పుట్టినవాడు బ్రాహ్మణుడే అనుమానం లేదు. అలాగే క్షత్రియ కాంతకు, వైశ్యకాంతకు పుట్టినవాడు కూడా బ్రాహ్మణుడే. కానీ రాజశ్రేష్ఠా ! వీరికి బ్రాహ్మణీ పుత్రునితో సమానంగా భాగాలు ఎందుకు లేవు ? మూడు వర్ణాల స్త్రీకు పుట్టినవారు బ్రాహ్మణులే అన్నావు గదా !" భీష్ముడు చెప్తున్నాడు. "పరంతపా !

లోకంలో 'భార్య' అన్న ఒకే పదంతో అందరినీ వ్యవహరిస్తారు. ఒకే పేరుతో వ్యవహరించినా వారిలో ఎంతో తేడా ఉన్నది. బ్రాహ్మణుడు ముందుగా మిగిలిన మూడు వర్ణాల వారినీ పెండ్లాడి, ఆ తరువాత బ్రాహ్మణ స్త్రీని వివాహ మాడినా ఆమెయే పెద్ద భార్య అవుతుంది. ఆమెయే పూజింపదగినది. ఆమెయే విశేష గౌరవానికి తగినది. యుధిష్ఠిరా ! భర్తకు స్నానం చేయించటం, అలంకరించటం, దంత ధావనానికై ఏర్పాటు, కాటుక పెట్టడం, హవ్యకవ్యాల సామగ్రిని సమకూర్చటం, గృహంలో జరిగే ధర్మకార్య నిర్వహణలో సహకరించటం – ఇవన్నీ చేసే అధికారం పెద్ద భార్య ఉన్నప్పుడు మరొక భార్యకు లేదు. బ్రాహ్మణునికి బ్రాహ్మణియే సహకరించాలి. భర్తకు అన్నపానాలు, మాలలు, వస్త్రాలు, ఆభరణాలు – ఇవన్నీ బ్రాహ్మణియే సమకూర్చాలి. ఆమెయే ఆ గౌరవానికి తగినది. మహారాజా ! మనువు చెప్పిన శాస్త్రంలో కూడా ఈ సనాతన ధర్మమే కనిపిస్తుంది. అలాకాకుండా కామానికి లోనై విపరీతంగా ప్రవర్తిస్తే ఇంతకు ముందే చెప్పినట్లు తాను బ్రాహ్మణ చండాలుడు అవుతాడు. రాజా ! బ్రాహ్మణికి వలెనే క్షత్రియకాంతకు కూడా కొడుకు పుట్టినా ఈ రెండు వర్ణాలకు సంబంధించిన విశేషముండనే ఉంటుంది. లోకలో క్షత్రియకాంత తన జాతి ద్వారా బ్రాహ్మణ కాంతతో సమానం కాదు. రాజసత్తమా ! బ్రాహ్మణీ పుత్రుడు క్షత్రియా పుత్రుని కన్న జ్యేష్ఠుడవుతాడు. అందువలన పితృధనంలో ఎక్కువ భాగాన్ని తీసికొనగలడు.

క్షత్రియకాంత బ్రాహ్మణ కాంతతో సమానం కానట్లే వైశ్య కాంత క్షత్రియ కాంతతో ఎప్పుడూ సమానం కాదు. యుధిష్ఠిరా ! లక్ష్మి, రాజ్యమూ, కోశమూ – ఇవన్నీ శాస్త్రాలలో క్షత్రియులకే విధింపబడ్డాయి. క్షత్రియుడు తన క్షేత్ర ధర్మంతో సముద్ర పర్యంతమూ ఉన్న భూమినీ, సంపదనూ పొందగలుగుతాడు. క్షత్రియుడు దండధారి కూడా. క్షత్రియునకన్న మరొకడు రక్షణ చేయలేడు. మహాభాగులైన బ్రాహ్మణులు దేవతలకు కూడా దేవతలు. వారిని విధి పూర్వకంగా పూజిస్తూనే వారితో వ్యవహరించాలి. ఋషులు ప్రతిపాదించిన అవ్యయమైన సనాతన ధర్మాన్ని గ్రహించి, అది లోపిస్తుంటే గమనించి ఈ క్షత్రియుడు దీనిని రక్షిస్తాడు. దొంగలు అపహరిస్తుంటే సర్వ వర్ణాలవారి ధనాన్ని, స్త్రీలను, అన్ని వైపుల నుండి కాపాడుతూ రాజు సర్వవర్ణాలకు రక్షకుడవుతాడు. యుధిష్ఠిరా ! వైశ్యాపుత్రునికన్న క్షత్రియాపుత్రుడు శ్రేష్ఠుడు. సంశయం లేదు. కాబట్టి పితృధనంలో క్షత్రియాపుత్రుడు, వైశ్యాపుత్రుని కన్న ఎక్కువ తీసికొనవచ్చు". యుధిష్ఠిరుడడిగాడు. "పితామహా ! బ్రాహ్మణుని ఆస్తిని పంచుకోవటాన్ని యథావిధిగా చెప్పావు. ఇతర వర్ణాలవారి

ఆస్తి పంపకాలలో ఎటువంటి నియమముంది ?"

భీష్ముడు చెప్తున్నాడు. "కురునందనా ! క్షత్రియునకు కూడా ఇద్దరు భార్యలు శాస్త్ర విహితాలు కదా ! శూద్ర స్త్రీ కూడా మూడవ భార్య కావచ్చు. కానీ శాస్త్ర విధి కనిపించదు. క్షత్రియుల ఆస్తి పంపకంలో కూడా ఇదే పద్ధతి. క్షత్రియుని సొమ్మును ఎనిమిది భాగాలుగా విభజించాలి. ఆ తండ్రి ధనంలో నుండి క్షత్రియాపుత్రుడు నాలుగు భాగాలను తీసికొనవచ్చు. అలాగే తండ్రికి చెందిన యుద్ధ సామగ్రిని కూడా అతడు తీసికొనవచ్చు. వైశ్యాపుత్రుడు మూడు భాగాలను, అలాగే శూద్రాపుత్రుడు ఒక భాగాన్ని తీసికొనవచ్చు. తండ్రి ఇస్తేనే శూద్రాపుత్రునకు భాగం. లేకపోతే లేదు. కురునందనా ! వైశ్యునకు ఒకే భార్య శాస్త్రవిహిత. శూద్రకాంత రెండవ భార్య కావచ్చు. కానీ దానికి శాస్త్ర విధి లేదు. వైశ్యునకు వైశ్యకాంతయందు, శూద్రకాంతయందు కూడా సంతానం కలిగితే వారికీ ఇదే నియమం. వైశ్యుని సొమ్మును అయిదు భాగాలు చేయాలి. రాజా ! వైశ్యా, శూద్రా స్త్రీ పుత్రులు దానినెలా పంచుకోవాలో చెపుతాను. పితృధనంలో నుండి నాలుగు భాగాలు వైశ్యాపుత్రుడు తీసికొనవచ్చు. అయిదవ భాగం శూద్రాపుత్రునకు చెందుతోంది. ఆ శూద్రాపుత్రుడు తండ్రి ఇస్తేనే దాన్ని పొందవచ్చు. లేకపోతే తీసుకొనలేడు. మూడు వర్ణాలలో ఏ వర్ణం ద్వారా పుట్టినా శూద్రునకు ఆస్తిలో వాటా పంచుకొనే హక్కు లేదు.

శూద్రునకు సవర్ణానికి చెందిన భార్యయే ఉంటుంది. మరొక భార్య ఉండదు. వారికి వందమంది కొడుకులున్నా అందరికీ సమాన భాగాలే. సర్వవర్ణాలలోనూ, సమవర్ణ అయిన స్త్రీలకు పుట్టిన పిల్లలందరికీ ఏ తేడా లేకుండా ఆస్తిలో సమాన భాగాలని స్మృతి వచనం. పార్థా ! జ్యేష్ఠ పుత్రుని భాగం జ్యేష్ఠునకుంటుంది. ప్రధానంగా అతనికి ఒక వాటా ఎక్కువ వస్తుంది. గతంలో బ్రహ్మయే ఈ ఆస్తి పంపకాల పద్ధతిని చెప్పాడు. సమాన వర్ణానికి చెందిన స్త్రీలకు పుట్టిన పిల్లలో మరొక విశేషముంది. వివాహ విశిష్టత వలన ముందు పెళ్ళాడిన స్త్రీకి పుట్టినవాడు శ్రేష్ఠుడు. ఆపై రెండవవాడు. సమాన వర్ణాల వారికందరికీ పుట్టిన పిల్లల్లో కూడా జ్యేష్ఠుడు జ్యేష్ఠాంశాన్ని, మధ్యముడు మధ్యమాంశాన్ని, కనిష్ఠుడు కనిష్ఠాంశాన్ని తీసికోవాలి. ఈ రీతిగా సర్వజాతులలోనూ సవర్ణులు శ్రేష్ఠులవుతున్నారు. మరీచి కుమారుడైన కశ్యపమహర్షి కూడా ఈ రీతిగానే చెప్పాడు."

48. వర్ణసంకర సంతానము.

యుధిష్ఠిరు డడిగాడు. "అర్థలోభంవలన, లేదా అర్థాన్ని తీసికొని, కామం వలన, వర్ణ నిశ్చయం లేనందువలన, అజ్ఞానం వలన వర్ణ సంకరం జరుగుతుంది. ఈ రీతిగా వర్ణసాంకర్యం వలన పుట్టిన వారికి ఏది ధర్మం ? ఆచరింపదగిన కర్మలేవి ? పితామహా ! అది నాకు చెప్పవలసినది". భీష్ముడు చెప్తున్నాడు. "చాతుర్వర్ణ్య ధర్మాలను, చాతుర్వర్ణ్యాలను గతంలో బ్రహ్మ కేవలం యజ్ఞం కోసం సృష్టించాడు. విప్రునకు నలుగురు భార్యలు. అందులో ఇద్దరిలో బ్రాహ్మణ క్షత్రియ కాంతలలో బ్రాహ్మణుడే పుడతాడు. మిగిలిన వైశ్య శూద్ర స్త్రీలకు పుట్టిన పిల్లలు క్రమంగా బ్రాహ్మణత్వాన్ని కోలుపోయి తల్లి కులానికే చెందుతారు. శూద్ర స్త్రీకి పుట్టిన బ్రాహ్మణ కుమారుడు శూద్రుని కన్న ఉన్నతుడు. అందువలన అతనిని పారశవుడు అంటారు. అతడు తన కులాన్ని సేవించాలి. సేవారూపమయిన తన ఆచారాన్ని ఎప్పుడూ విడువగూడదు. శూద్రాపుత్రుడు సర్వోపాయాలను గమనించి, తన కుల పరంపరను ఉద్ధరించాలి. అతడు జ్యేష్ఠుడయినా ఇతరుల కన్న చిన్నవాడి క్రింద లెక్క. కాబట్టి అతడు త్రివర్ణ శుశ్రూష చేస్తూ దానపరాయణుడు కావాలి.

క్షత్రియునకు క్షత్రియ, వైశ్య, శూద్ర స్త్రీలు ముగ్గురు భార్యలు. క్షత్రియ, వైశ్య కాంతలకు పుట్టినవారు క్షత్రియులే. శూద్ర స్త్రీ కడుపున శూద్రుడే పుడతాడు. ఆ శూద్రుని 'ఉగ్రు'డని ధర్మశాస్త్రమంటుంది. వైశ్యునకు వైశ్య, శూద్రస్త్రీలు ఇద్దరు భార్యలు. వైశ్య కాంత కడుపున పుట్టినవాడు వైశ్యుడు. శూద్రునకు ఒక్కతెయే భార్య. ఆమె కడుపున పుట్టినవాడు శూద్రుడే అవుతాడు. అందువలన వర్ణాలలో క్రింది స్థాయికి చెందిన శూద్రుడు గురుజనులయిన బ్రాహ్మణాదుల స్త్రీలతో సంగమిస్తే నాలుగు వర్ణాల వారు నిందించే బాహ్య వర్ణానికి జన్మనిస్తాడు. బ్రాహ్మణ స్త్రీకి క్షత్రియుని ద్వారా పుట్టినవాడు సూతుడు. వర్ణ బహిష్కృతుడై రథకారుడవుతాడు. బ్రాహ్మణ స్త్రీకి వైశ్యుని ద్వారా పుట్టినవాడు వైదేహకుడు, లేదా మౌద్గల్యుడు. అంతఃపుర రక్షణం వంటిది ఇతని పని. రాజా ! శూద్రుడు బ్రాహ్మణ స్త్రీ సమాగమంతో అత్యంత భయంకరుడైన చండాలునకు జన్మనిస్తాడు. అతడు ఊరి వెలుపల నివసిస్తూ తలారి పని చేస్తుంటాడు. ఈ రీతిగా బ్రాహ్మణ స్త్రీకి తక్కువ వారి సమాగమం వలన కుల వినాశకులు పుడతారు. వారు వర్ణ సంకరులు. వైశ్యుని ద్వారా క్షత్రియ స్త్రీ కడుపున పుట్టినవాడు వంది లేదా మాగధుడు. వారు మాటలతో బ్రతుకుతారు. శూద్రుని ద్వారా క్షత్రియకాంతకు పుట్టినవాడు నిషాదుడు.

చేపలను పట్టి బ్రతికేవాడతడు. శూద్రుడు వైశ్యకాంతతో సంగమిస్తే పుట్టేవాడు ఆయోగవుడు. అతడు వండ్రంగం పనిచేస్తూ ఆ డబ్బుతో బ్రతుకుతాడు. బ్రాహ్మణులు అతని నుండి దానం తీసికొనగూడదు. వీరందరు కూడా తమ తమ జాతి స్త్రీలలో తమ వర్ణానికి చెందిన వారినే కంటారు. హీనజాతి స్త్రీలకు పుట్టినవారు తల్లి కులానికి చెందినవారికే జన్మిస్తారు.

నాలుగు వర్ణాలలోనూ సవర్ణ స్త్రీయందు, ఒక స్థాయి తక్కువయిన స్త్రీ యందు పుట్టినవారు ఆ వర్ణానికే చెందుతారు. ఒక్కొక్క వర్ణం వ్యవధానంతో నీచ వర్ణంలో పుట్టినవారు ప్రధాన వర్ణాన్ని కోలుపోయి మాతృవర్ణాన్ని పొందుతారు. ఆ రీతిగా పుట్టినవారు తొమ్మిది మంది – అంబష్ఠులు, పారశవులు, ఉగ్రులు, సూతులు, వైదేహకులు, చాండాలురు, మాగధులు, నిషాదులు, ఆయోగవులు. వీరిలో సవర్ణంలోనూ, తమ కన్న ఒక వర్ణం తక్కువ స్త్రీలలోనూ పుట్టిన వారు పితృకులానికే చెందుతారు. ఒక వర్ణాన్ని తప్పించి తమ జాతి వర్ణానికి చెందిన స్త్రీకి పుట్టినవారు తల్లి కులానికి చెందుతారు. వీరు కూడా తమ తమ కులానికి చెందిన స్త్రీలలో తమ తమ కులానికి చెందిన పిల్లలనే కంటారు. పరస్పరం విభిన్న జాతుల స్త్రీలతో సంగమిస్తే ఇంకా నిందిపదగిన సంతానాన్ని పొందుతారు. శూద్రుడు బ్రాహ్మణ స్త్రీ యందు వర్ణబహిష్కృతుని కన్నట్లు, ఆ వర్ణబహిష్కృతుడు నాలుగు వర్ణాల స్త్రీలతో సంగమిస్తే, ఇంకా ఇంకా బాహ్యతర జాతి వారిని కంటాడు. ఈ రీతిగా బాహ్య, బాహ్యతర జాతి స్త్రీలతో సమాగమం ద్వారా ప్రతిలోమ వర్ణ సంకర సృష్టి పెరుగుతుంది. క్రమంగా హీనాతిహీనులు పుడతారు. ఇటువంటి సంకరజాతి సంఖ్య దాదాపు పదిహేను. పొందరాని వారిని పొందడం ద్వారా వర్ణ సంకర మేర్పడుతుంది. మాగధజాతికి చెందిన సైరంధ్రీ స్త్రీలతో బాహ్యజాతి పురుషులు కలిస్తే పుట్టే పుత్రులు రాజులకు అలంకరణలు, ఉపచారాలు చేస్తూ బ్రతుకుతారు. దాసులు కాకపోయినా దాసులవలె జీవిస్తారు. ఆ సైరంధ్రి జాతి స్త్రీతో ఆయోగవుడు సంగమిస్తే పుట్టే పుత్రుడు అడవిలో వలపన్ని పశువులను, పక్షులను పట్టుకొంటూ జీవిస్తాడు. సైరంధ్రికి వైదేహుని ద్వారా పుట్టినవాడు మదిర తయారుచేసి జీవించే మైరేయకుడు అవుతాడు. సైరంధ్రికి నిషాదునకు పుట్టినవాడు మద్గురుడు లేదా దాసుడు. నావనడుపుకొంటూ బ్రతుకుతాడు. సైరంధ్రి చాండాలుర కలయికతో శ్వపాకుడు పుడతాడు. అతడు శవాలను రక్షిస్తూ జీవిస్తాడు. ఈ రీతిగా సైరంధ్రి నాలుగు రకాల వారిని కంటుంది. వారు క్రూరులు. మాయతో బ్రతికేవారు. వీరుకాక మరో నాలుగు రకాలవారు సైరంధ్రికి పుడతారు. వారు సజాతీయులు. మాంసులు, స్వాదుకరులు, క్షౌద్రులు, సౌగంధులు అని వారికి

పేర్లు. ఆయోగవ జాతికి చెందిన పాపిష్ఠ వైదేహ జాతికి చెందిన పురుషునితో కలిసి, క్రూరులై మాయ చేసి బ్రతికే పిల్లలను కంటుంది. ఆమెకే నిషాదుని ద్వారా పుట్టిన వానికి మద్రనాభుడని పేరు. అతడు గాడిదల బండిని తోలుతూ బ్రతుకుతాడు. ఆయోగవజాతి స్త్రీ చండాలుని ద్వారా కనేవాడు పుల్కసుడు. అతడు గాడిదలను, గుర్రాలను, ఏనుగులను తింటూ బ్రతుకుతాడు. శవాల మీద పరచిన గుడ్డలను కట్టుకొంటాడు. పగిలిన కుండలలో భుజిస్తాడు.

ఈ రీతిగా హీనవర్ణులైన ఈ ముగ్గురు ఆయోగవ సంతానం నిషాద జాతి స్త్రీకి వైదహకుని వలన క్షుద్రుడు, ఆంధ్రుడు, కారావరుడు అనే జాతివారు పుడతారు. మొదటి ఇద్దరూ గ్రామం వెలుపల పశుహింసతో జీవిస్తాడు. కారావరుడు చర్మకారుడు. వైదేహ జాతి స్త్రీకి చాండాలుని ద్వారా పుట్టేవాడు పాండు సొపాకుడు. ఈ జాతి వెదురు బుట్టలు అల్లి జీవిస్తుంది. వైదేహ జాతి స్త్రీకి నిషాద సంగమంతో ఆహిండకుడు పుడతాడు. ఆమెయే చాండాలునితో కలిస్తే పుట్టేవాడు సొపాకుడు. సొపాకుని వృత్తి చాండాలుని వృత్తి వంటిదే. నిషాద స్త్రీకి చండాలుని ద్వారా పుట్టిన కొడుకు అంతేవసాయి. అతడు శ్మశానంలో సంచరిస్తుంటాడు. బాహ్య జాతివారు కూడా అతనిని బహిష్కరిస్తారు. ఈ రీతిగా తల్లిదండ్రుల సాంకర్యం వలన సంకర జాతులు ఉద్భవిస్తాయి. కొన్ని జాతులు పైకి కనిపిస్తాయి. కొన్ని కనిపించవు. వారి కర్మల ద్వారానే వారిని తెలిసికోవాలి.

శాస్త్రాలు నాలుగు వర్ణాల వారికే ధర్మాలను విధించాయి. ఇతరులకు విధించలేదు. ధర్మహీనమైన సంకర జాతుల సంఖ్యకు కూడా హద్దు లేదు. జాతిని గురించి ఆలోచించకుండా స్వేచ్ఛగా ఇతర వర్ణ స్త్రీలతో సంగమించేవారు, యజ్ఞాధికారం నుండి, సజ్జన సమాజం నుండి బహిష్కరింపబడినవారు – ఇటువంటి వర్ణ బాహ్యుల ద్వారానే వర్ణసంకరం జరుగుతుంది. వారు విభిన్న వృత్తులను, విభిన్నాశ్రయాలను అనుసరించి, సాగుతారు. ఇటువంటివారు ఎప్పుడూ లోహాభరణాలను ధరించి కూడళ్లలో, శ్మశానాలలో, కొండలపై, చెట్ల క్రింద నివసిస్తుంటారు. వీరు ఆభరణాలను, ఇతరోపకరణాలను తయారుచేస్తూ తమతమ కర్మలతో జీవనాన్ని గడుపుతూ బాహాటంగా నివసిస్తుంటారు. వీరు గోబ్రాహ్మణులకు సహాయం చేస్తూ, క్రౌర్యాన్ని విడనాడి, దయామయులై, సత్యవచనాన్నీ, సహనాన్నీ, పాటిస్తూ తమ శరీరాలను కష్టపెట్టి అయినా ఇతరులను రక్షిస్తూ ఉంటే ఆ ఫలం బాహ్యులయిన వీరి ఉన్నతికి కారణమవుతుంది. ఆ విషయంలో నాకు సంశయం లేదు. శాస్త్రోపదేశాన్ని అనుసరించి, ఇంతవరకు చెప్పిన వర్ణ బాహ్యజాతి స్త్రీలతో ధీమంతుడు బాగా ఆలోచించి సంతానాన్ని పొందాలి. నీచ జాతిలో పుట్టిన కొడుకు మెడకు కట్టిన రాయిలాగా సంసార

సాగరాన్ని తరింపబోతున్న తండ్రిని లోపలికి లాగుతాడు. లోకంలో మూర్ఖుడైనా, పండితుడైనా, నిర్మలుడైనా మలినుడైనా, కామక్రోధాలకు లోనైన మనుష్యుని స్త్రీలు అపమార్గంలో నడిపిస్తారు. పురుషులను కళంకితులను చేయటం లోకంలో స్త్రీల స్వభావం. కాబట్టి పండితులు ప్రమదలపై ఎక్కువ ఆసక్తిని చూపరాదు".

"వర్ణ బహిష్కృతుడై, వర్ణ సాంకర్యంతో పుట్టి, అనార్యుడై కూడా ఆర్యునివలె కనిపించే నరుని మేమెలా గ్రహించగలం ?" భీష్ముడు చెప్తున్నాడు. "కలుషిత యోనిలో పుట్టి, నానా చేష్టలతో కూడి ఉన్నవానిని తన కర్మల ద్వారానే గ్రహించగలగాలి. సజ్జనులకు తగిన కర్మల ద్వారా అతని జన్మ శుద్ధిని గ్రహించగలగాలి. లోకంలో అనార్యత్వం, అనాచారం, క్రూరత్వం, అకర్మణ్యత - ఇటువంటి దోషాలు వర్ణసంకరుడైన పురుషుని తెలియజేస్తాయి. వర్ణ సాంకర్యం గలవాడు. తండ్రి లక్షణాలనో, తల్లి లక్షణాలనో, ఉభయుల స్వభావాన్నో అనుసరిస్తాడు. సంకీర్ణుడు తన స్వభావాన్ని ఏ రీతిగానూ నియంత్రించుకొనలేడు. పులి చిత్ర రూపంతో, తన తల్లిదండ్రుల రూపంతో సమానమైన రూపంతోనే పుట్టినట్టు పురుషుడు కూడా తన కారణాన్నే అనుసరిస్తాడు. కులమూ, వీర్యమూ చాటుగా ఉన్నా వర్ణ సాంకర్యమున్న నరుడు కొద్దో, గొప్పో ఆ తల్లిదండ్రుల శీలాన్ని అనుసరించి తీరుతాడు. కృత్రిమ మార్గంలో గొప్పవారికి తగినట్లుగా నడుస్తున్నా బంగారమా ? ఇతర లోహమా ? అని నిశ్చయింపవలసి వస్తే స్వభావమే అంతా చెప్తుంది.

లోకంలో ప్రాణులు నానా విధాలుగా ఆచార వ్యవహారాలు కలిగి ఉంటారు. వివిధ కర్మలలో ఆసక్తులై ఉంటారు. అయినా క్లిష్టమైన జన్మ రహస్యాన్ని బయటపెట్టగలది నడవడియే. అటువంటిది మరొకటి లేదు. బుద్ధి పదునెక్కినా అది శరీరాన్ని స్వభావం నుండి బయటకు లాగలేదు. ఉత్తమ - మధ్యమ - అధమ స్వభావాలతో దేనితో శరీర నిర్మాణం జరిగితే ఆ స్వభావంతోనే అది ఆనందిస్తుంది. ఉత్తమ జాతి వాడయినా శీల విహీనుడయితే పూజింప నవసరం లేదు. శూద్రుడయినా ధర్మజ్ఞుడై, మంచినడవడి కలవాడైతే విశేషించి ఆదరించాలి. నరుడు తన శుభాశుభకర్మలతో, శీల సదాచార వంశాలతో తనను తాను ప్రకటించుకొంటాడు. తన వంశం ఏదో కారణంగా నశించినా తన కర్మ ద్వారా వేగంగా మరలా వెలుగొందజేస్తాడు. ఇప్పుడు చెప్పిన ఈ నీచ జాతులలో, ఇతర సంకీర్ణ జాతులలోగానీ వివేకి సంతానోత్పత్తి చేయరాదు. దీనిని సర్వథా పరిత్యజించటమే యుక్తం."

49. నానావిధ పుత్రుల వర్ణనము.

యుధిష్ఠిరుడడిగాడు. "కురుశ్రేష్ఠా ! వర్ణాలకు సంబంధించి ఎటువంటి స్త్రీ కడుపున ఎటువంటి కొడుకు పుడతాడు ? ఎటువంటి కొడుకు లెవరికి పుడతారు ? ఇది నాకు చెప్పు. రాజా ! పుత్రులకు సంబంధించి అభిప్రాయ భేదాలు ఎన్నో ఉన్నాయి. మోహం వలన ఏ నిర్ణయానికీ రాలేకపోతున్నాం. మా సంశయాన్ని తీర్చాలి." భీష్ముడు చెప్తున్నాడు. "భర్త వీర్యంతో పుట్టినవాడు అనంతరజుడు. అతడే ఔరసపుత్రుడు. అతడు తండ్రి వంటివాడే. రెండవవాడు నిరుక్తజుడు. మూడవవాడు ప్రసృతజుడు. భర్త పతితుడై తన భార్య ద్వారానే కన్న కొడుకు నాలుగవ వాడు. వీరుకాక దత్తుడు, క్రీతుడు కూడా పుత్రులే. ఏడవవాడు అధ్యూఢజుడు (గర్భవతిని పెండ్లాడగా పుట్టిన కొడుకు). భారతా ! వీరు కాక కానీనుడు ఒకడు. అపధ్వంసజులు (అనులోమ) ఆర్గురు. అపసదులు (ప్రతిలోమ) ఆర్గురు. ఇలా మొత్తం ఇరవై రకాల కొడుకులు".

యుధిష్ఠిరుడడిగాడు. "అపధ్వంసజులు ఎవరు ? అలాగే అపసదులు ఎవరు ? ఇదంతా ఉన్నదున్నట్లుగా నాకు నీవు చెప్పాలి ?" భీష్ముడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరా ! బ్రాహ్మణునికి క్షత్రియ, వైశ్య, శూద్ర కాంతలయందు పుట్టినవారు ముగ్గురు, క్షత్రియునకు వైశ్య శూద్రకాంతల యందు పుట్టినవారు ఇద్దరూ, వైశ్యునకు శూద్ర స్త్రీ యందు పుట్టినవాడు ఒకడు. వీరు ఆరుగురు అపధ్వంసజులు. భారతా ! ఇది సూక్ష్మంగా చెప్పాను. ఇలాగే అపసదులను గురించి విను. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కాంతలకు శూద్రుని ద్వారా పుట్టిన వారు క్రమంగా చాండాలుడు, వ్రాత్యుడు, వైద్యుడు - వీరు ముగ్గురు అపసదులు. బ్రాహ్మణ క్షత్రియ కాంతలకు వైశ్యుని ద్వారా పుట్టినవారు ఇద్దరు. వారు మాగధుడు, వామకుడు. క్షత్రియునకు బ్రాహ్మణ స్త్రీ యందు పుట్టినవాడు ఒకడు. అతడు సూతుడు. ఈ ఆరుగురు అపసదులు. రాజా ! ఈ కుమారుల నెవ్వరినీ కుమారులు కాదనటం కుదరదు". యుధిష్ఠిరు డడిగాడు. "పితామహా ! కొందరు తన భార్యకు ఎవరి ద్వారా పుట్టినా తన కొడుకులే అంటారు. కొందరు తనకెవరియందు పుట్టినా కొడుకులే అంటారు. వారిద్దరూ సమానులా ? వాస్తవంగా ఎవరి పిల్లలు ? చెప్పవలసినది". భీష్ముడు చెప్తున్నాడు. "తన వీర్యం నుండి పుట్టినవాడు ఔరసుడు. గర్భాధానం చేసినవాడు తన అధికారాన్ని వదలుకొంటే అతడు కూడా తనకు క్షేత్రజ్ఞుడైన కొడుకు. అలాగే అధ్యూడుని విషయం చెప్తున్నాను. గ్రహించు". యుధిష్ఠిరుడడిగాడు. "మేము ఔరసపుత్రుడినే పుత్రుడను కొంటున్నాం. వీర్యం లేకపోతే క్షేత్రం నుండి కొడుకెలా పుడతాడు ? నియమభంగం

ద్వారా అధ్యూఢుని కూడా ఎలా కొడుకుగా భావింపగలం ?" భీష్ముడు చెప్తున్నాడు. "తన వీర్యం ద్వారా కొడుకును కని, వేరే కారణాలతో అతనిని విడిచిపెడితే కేవలం గర్భాధాన కారణంగా అతడు అధికారి కాలేడు. ఆ బిడ్డ ఆ క్షేత్రయజమానిదే. రాజా ! పుత్రకాముడై కేవలం పుత్రులను పొందాలన్న దృష్టితోనే గర్భవతిని వివాహమాడితే పుట్టిన బిడ్డ క్షేత్రజుడై ఆమె భర్తకే చెందుతాడు కానీ గర్భాధానం చేసిన వానికి కాదు. భరతర్షభా ! ఇతరుల క్షేత్రాలలో పుట్టే పిల్లలు లక్షణాలను బట్టి ఎవరి పిల్లలో తెలుస్తూనే ఉంటుంది. కళ్ళకు కనిపించే పోలికలను ఎవరూ కప్పి పుచ్చలేరు. కొన్ని తావులలో కృత్రిమ పుత్రులు కూడా ఉంటారు. అక్కడ ఆ రీతిగా చేరదీయటమే కారణం కానీ, వీర్యం కానీ, క్షేత్రం కానీ పుత్రత్వ నిర్ణయంలో కారణాలు కావు.

యుధిష్ఠిరుడడిగాడు. "భారతా ! వీర్యమూ, క్షేత్రమూ రెండూ స్పష్టంగా తెలియనిచోట, కేవలం దగ్గర తీసి పుత్రునిగా భావిస్తే ఆ కృతకపుత్రు డెటువంటివాడు" ? భీష్ముడు చెప్తున్నాడు. "తల్లిదండ్రులు దారిలో విడిచిపెట్టి వెళ్లారు. విచారించినా వారి జాడ తెలియలేదు. అప్పుడెవరో ఆ శిశువును చేరదీశారు. ఆ శిశువు కృతక పుత్రుడు. తాను యజమాని కాకపోయినా ఆ సమయంలో యజమానిగా నిలిచి పోషిస్తున్న వాని కులమే బాలునకు కూడా కుల మవుతుంది. యుధిష్ఠిరుడడిగాడు. "ఇటువంటి బాలునికి ఏ వర్ణాన్ని అనుసరించి ఎలా సంస్కారం జరిపించాలి ? ఏ జాతి కన్యతో పెండ్లి జరిపించాలి ? పితామహా ! అది నాకు చెప్పు". భీష్ముడు చెప్తున్నాడు. "తల్లిదండ్రులు పరిత్యజించినందు వలన ఆ బాలుడు తనను పోషిస్తున్న వాని కులాన్నే పొందుతాడు, కాబట్టి అతనికి రక్షకుడుగా ఉన్నవాడు తన కులాచారాన్ని బట్టి అతనికి సంస్కారం జరిపించాలి. అచ్యుతా ! యుధిష్ఠిరా ! పాలకుడైన తండ్రి సగోత్ర బంధువులకు వలె అతనికి కూడా సంస్కారాలు జరిపించాలి. ఆ కులానికి చెందిన కన్యతోనే వివాహం జరిపించాలి. ఒకవేళ ఆ బాలుని తల్లికి చెందిన కులగోత్రాలు నిశ్చితంగా తెలిస్తే, వాటి ననుసరించి సంస్కారాలు జరిపించాలి. కుమారా ! కానీనుడు, అధ్యూఢజుడు - ఈ ఇద్దరూ కూడా కళంకితులనే భావించాలి. ఈ ఇద్దరు పుత్రులకు కూడా తన పుత్రులకు వలెనే సంస్కారాలు జరిపించాలని శాస్త్ర నిశ్చయం. బ్రాహ్మణాదులు క్షేత్రజ్ఞునకైనా, అపసదునకైనా, అధ్యూఢునకైనా తన పుత్రులకు వలెనే సంస్కారాలు జరిపించాలి. వర్ణ సంస్కార విషయంలో ధర్మశాస్త్రాలు ఇలాగే నిశ్చయిస్తున్నాయి. ఇలా నీకు ఈ విషయమంతా చెప్పాను. ఇంకా ఏం వినాలనుకొంటున్నావు ?"

50. చ్యవనోపాఖ్యాన ప్రారంభము.

యుధిష్ఠిరుడడిగాడు. "పితామహా ! ఎవరినైనా చూసినా, వారితో కలసి ఉన్నా ఎటువంటి స్నేహం కలుగుతుంది ? గోవుల మాహాత్మ్య మెటువంటిది ? అది నాకు చెప్పవలసింది." భీష్ముడు చెప్తున్నాడు. 'మహాతేజస్వీ ! గతంలో నహుషునకు, చ్యవన మహర్షికి మధ్య జరిగిన సంవాదాన్ని నీకు చెపుతాను. ఒకప్పుడు భృగువంశీయుడైన చ్యవన మహర్షి ఉండేవాడు. ఆయన మహావ్రతాన్ని స్వీకరించి నీటిలోపల నుండ నారంభించాడు. ఆ చ్యవనముని అభిమానాన్ని, క్రోధాన్ని, హర్షాన్ని, శోకాన్ని త్యజించి, వ్రతధారణతో పండ్రెండు సంవత్సరాలు నీటిలోనే నివసించాడు. చల్లని కిరణాలు గల చంద్రునివలె ఆ ముని సర్వప్రాణులపై విశేషించి సర్వజలచరాలపై శుభకరమైన పరిపూర్ణ విశ్వాసాన్ని ధరించాడు. పవిత్రుడై దేవతలకు నమస్కరించి గంగా యమునల మధ్య నీటిలో ప్రవేశించి స్థాణువువలె కూర్చున్నాడు. గంగాయమునల వేగం పరమభయంకరమైనది. భీకర ధ్వని చేస్తోంది. ఆ వేగం వాయువేగం వంటిది. అయినా ఆ ముని ఆ తాకిడిని శిరసా స్వీకరించాడు. గంగ, యమున, నదులు, సరస్సులు ఋషికి ప్రదక్షిణం చేశాయి కానీ ఆయనను బాధించలేదు. కట్టెవలె నిశ్చలంగా ఉన్న ఆ మహాముని నీటిలోనే నిదురించాడు. అప్పుడప్పుడు నీటిమీదనే నిలిచియుంటాడు ఆ ధీమంతుడు. నీటిలో నివసించే జంతువులకు ఆయన ప్రియదర్శను డయ్యాడు. అవి ప్రసన్న హృదయాలతో ఆయన పైపెదవిని వాసన చూసేవి. ఆయన అలా నీటిలో నివసిస్తూండగానే చాలాకాలం గడచిపోయింది. ఆపై ఒకానొకసమయంలో చేపలు పట్టి జీవించే మత్స్యకారులు చాలామంది ఆ ప్రదేశానికి వచ్చారు. వారు చేపలు పట్టాలన్న నిశ్చయంతో వలలు చేతబట్టి వచ్చారు. ఆ మత్స్యకారులు వ్యాయామం చేసేవారు. బలిష్ఠులు శూరులు. నీటిని చూసి వెనుదిరగనివారు. వల విసరాలన్న నిశ్చయంతో వారు ఆ ప్రదేశానికి వచ్చారు.

చేపలుండే లోతు నీటిలోనికి వెళ్ళి వలను పూర్తిగా పరిచారు. ఆపై చేపలను దక్కించుకోవాలన్న కాంక్షతో ఆ మత్స్యకారులు అనేకోపాయాలతో గంగా యమునల నీటిని వలలతో కప్పివేశారు. వారు విసిరిన ఆ వల క్రొత్తదారాలతో అల్లినది. చాలాపెద్దది. దాని వైశాల్యం కూడా ఎక్కువే. చక్కగా తయారు చేసినది. బలిష్ఠమైనది. దానిని నీటిపై పరిచారు వారు. కొంత తడవు ఆగి, ఆపై అందరూ నీటిలోనికి దిగి ఒకరి అదుపులో ఒకరు ఉంటూ, నిర్భయంగా, ఉత్సాహంగా దానిని మడుస్తూ చేపలను, ఇతర జలజంతువులను దానిలో బంధించారు. అలా వలను లాగేటప్పుడు ఆ మత్స్యకారులు అనుకోకుండా

చుట్టూ చేపలు నిలిచియున్న భృగునందనుడైన ఆ చ్యవనుని కూడా వలతో లాగారు. ఆ చ్యవనుని శరీరమంతా నదిలోని నాచు అంటుకొని ఉంది. గడ్డం, జడలు పచ్చగా ఉన్నాయి. శరీరంలో చిన్న చిన్న శంఖాలు గ్రుచ్చుకొని ఉన్నాయి. పంది వెంట్రుకలు తగుల్కొన్నట్లు ఆయన చిత్రంగా ఉన్నాడు. వేదపారగుడైన ఆ చ్యవనుడు వలలో పైకి రావటం చూసి మత్స్యకారులు అందరు చేతులు జోడించి తలలు వంచి నేలపై వ్రాలారు. వలలో ఈడ్చినందువలన కలిగిన బాధ, భయాల వలన, నేలను తాకటం వలన ఎన్నో చేపలు చనిపోయాయి. ఈ చేపల సంహారాన్ని చూసి, ఆ మునికి జాలి కలిగింది. పదే పదే నిట్టూర్పులు విడువసాగాడు. నిషాదులిలా అన్నారు. "మహామునీ! అజ్ఞానంతో పాపం చేశాం. మమ్ము అనుగ్రహించాలి. నీకిష్టమైనది చేస్తాము. మాకు చెప్పండి." వారలా అనగానే చేపల మధ్యనున్న చ్యవనుడు ఇలా అన్నాడు. "నాకిప్పుడు బాగా ఇష్టమైనది చెపుతాను. సావధానంగా వినండి. చావో, బ్రతుకో నేను చేపలతోనే వెళతాను. వీటితో కలిసి నీటిలో జీవించాను కాబట్టి ఇప్పుడు వదలలేను." చ్యవనుడిలా అనగానే ఆ మత్స్యకారులు భయంతో బాగా వణికిపోయారు. పాలిపోయిన వదనాలతో వారు నహుషుని (దగ్గరకుపోయి) ఆ విషయం నివేదించారు.

51. చేపలు, మత్స్యకారులు సద్గతినందుట.

భీష్ముడు చెప్తున్నాడు. "నహుషుడు ఆ రీతిగా వచ్చిన చ్యవనుని చూసి అమాత్యపురోహిత సహితుడై త్వరగా ఎదురువెళ్ళాడు. యథావిధిగా అర్ఘ్యపాద్యాదులిచ్చి నియమపూర్వకంగా చేతులు జోడించి ఆ రాజు మహాత్ముడైన చ్యవనునకు తనను పరిచయం చేసికొన్నాడు. రాజా! ఆ నహుషుని పురోహితుడు సత్యవ్రతుడు, మహాత్ముడు, దేవసమానుడూ అయిన చ్యవనుని పూజించాడు. నహుషుడిలా అడిగాడు. "ద్విజోత్తమా! నీకేం ప్రియం చేయగలనో చెప్పు. భగవన్! అది ఎంత దుష్కరమైనా పూర్తిగా చేస్తాను." చ్యవనుడిలా అన్నాడు. "చేపలు పట్టి బ్రతికే ఈ మత్స్యకారులు ఎంతో శ్రమపడి ఉన్నారు. కాబట్టి వీరికి చేపలు కొనటంతో పాటు నా వెలను కూడా చెల్లించు." నహుషుడిలా అన్నాడు. "పురోహితా! భృగునందనుడు చెప్పినట్లుగా పూజ్యుడైన ఆయనను విడిపించటానికి ఈ నిషాదులకు వేయి నాణేల మూల్యాన్ని ఇవ్వు". చ్యవనుడన్నాడు. "నృపా! వేయినాణేలు నాకు తగవు. నీవెలా భావిస్తున్నావో! నీ బుద్ధితో ఆలోచించి తగిన మూల్యాన్ని ఇవ్వు". నహుషుడన్నాడు. "బ్రాహ్మణా! ఈ నిషాదులకు లక్షనాణేల నివ్వు. స్వామీ! ఇది తగిన

మూల్యమే. తమరేమంటారు?" చ్యవనుడన్నాడు. "రాజశ్రేష్ఠా! నన్ను లక్షనాణేలతో కొలవవద్దు. తగిన మూల్యాన్ని ఇవ్వు. మంత్రులతో ఆలోచించు". నహుషుడన్నాడు. "పురోహితా! ఈ నిషాదులకు కోటినాణేలు మూల్యంగా చెల్లించు. అదికూడా సరిపోకపోతే ఇంకా ఎక్కువ ఇవ్వండి". చ్యవనుడన్నాడు. "రాజా! మహాతేజస్వీ! కోటినాణేలు నాకు తగవు. నాకు తగిన మూల్యాన్ని ఇవ్వు. బ్రాహ్మణులతో కలసి ఆలోచించు".

నహుషుడన్నాడు. "అర్ధరాజ్యాన్నో, పూర్తిరాజ్యాన్నో మత్స్యకారులకివ్వండి. అదే మూల్యమని నేననుకుంటున్నాను. బ్రాహ్మణా! తమరేమనుకొంటున్నారు?" రాజా! అర్ధరాజ్యమో, మొత్తం రాజ్యమో నాకు తగిన మూల్యం కాదు. తగిన వెల ఇవ్వు. ఋషులతో కలిసి ఆలోచించు". భీష్ముడిలా చెపుతున్నాడు. "మహర్షి వచనాన్ని విని దుఃఖాతురుడైన నహుషుడు అమాత్యపురోహితులతో కలిసి ఆలోచించాడు. అంతలో ఫలాలు, మూలాలు తినే ఒక వనచరుడైన ముని, నహుషుని దగ్గరకు వచ్చాడు. ఆయన గోవునుండి పుట్టినవాడు. ఆ ద్విజసత్తముడు రాజుతో మాటాడుతూ ఇలా అన్నాడు. ఈ మునిని నేను సంతోషపెట్టగలను. ఎలా తృప్తి పడతాడో నాకు తెలుసు. పరిహాసానికి కూడా నేను అసత్యాలు పలుకను. ఇక ఇటువంటి సమయంలో చెప్పేదేముంది? నేను తమకు చెప్పినదానిని సందేహించకుండా చేయాలి. నహుషుడిలా అన్నాడు. "స్వామీ! భృగుపుత్రుడైన చ్యవనునకు తగిన మూల్యాన్ని చెప్పు. ఈ సంకటస్థితి నుండి నా రాజ్యాన్నీ వంశాన్నీ రక్షించు. ఈ పూజ్యుడు కోపిస్తే మూడులోకాలను కూడా ఒంటరిగా దహించగలడు. బాహు పరాక్రమాన్ని మాత్రమే ఆశ్రయిస్తూ తపోహీనుడైన నా గురించి చెప్పేదేముంది ? మహర్షీ! అమాత్యులతో, ఋత్విక్కులతో పాటు అగాధమైన నీటిలో మునిగిన మమ్ము నీవే తెప్పవలె రక్షించు. చ్యవనుని మూల్యాన్ని నిశ్చయించు.

భీష్ముడు చెప్తున్నాడు. నహుషుని మాట విని ప్రతాపవంతుడైన గవిజాతుడు ఆ రాజును, మంత్రులను ఉల్లాసపరుస్తూ ఇలా అన్నాడు.

బ్రాహ్మణులు, గోవులు ఒకేజాతికి చెందిన రెండు భాగాలు. బ్రాహ్మణులలో మంత్రాలు, గోవులలో హవిస్సు ఉంది.

మహారాజా! ద్విజులు వర్ణాలలో ఉత్తములు. వెలకట్టలేము. గోవులూ అంతే, పురుషోత్తమా! గోవులతో ఆయనను వెలకట్టు. రాజా! మహర్షివచనం విని, ఆపై నహుషుడు అమాత్యపురోహితులతో పాటు మహానందాన్ని పొందాడు. రాజా! దృఢవ్రతశీలుడైన భృగుకుమారుని – చ్యవనుని సమీపించి మాటలతో సంతర్పణ చేస్తున్నట్లు ఇలా అన్నాడు.

నహుషుడు చెప్తున్నాడు. "బ్రహ్మర్షీ! భార్గవా! లే! నిన్ను గోవుతో కొంటున్నాను. ధర్మధారులలో శ్రేష్ఠుడవు నీవు. గోవునే నీ వెలగా భావిస్తున్నాను" చ్యవనుడిలా అన్నాడు. "రాజేంద్రా! లేస్తున్నాను. నన్ను సరిగానే కొన్నావు. ఈ లోకంలో గోవులకు సాటి అయిన ధనం లేదు. రాజా! గోవులను కీర్తించటం, వాటిని గురించి వినటం, దానం చేయటం, దర్శించటం ప్రశంసింపదగినది. సర్వపాపాలనూ పోగొట్టి శుభాలు కల్పింపగలది. గోవులు లక్ష్మికి మూలం. గోవులలో పాపముండదు. గోవులెప్పుడూ మానవులకు అన్నం. దేవతలకు హవిస్సు. గోవులలో నిత్యమూ స్వాహాకార వషట్కారాలు ఉంటాయి. గోవులే యజ్ఞానికి నాయికలు. యజ్ఞాలకు గోవులే ముఖం. గోవులు దివ్యమూ, అవ్యయమూ అయిన అమృతాన్ని ధరిస్తాయి. క్షీరరూపంలో ఇస్తాయి. గోవులే అమృతానికి ఆధారం. సర్వలోకాలూ గోవులకు నమస్కరిస్తాయి. లోకంలో తేజస్సుతో తనువుతో గోవులు అగ్నితో సమానం. గోవులే మహాతేజస్సు. ప్రాణులకు గోవులే సుఖప్రదాలు. గోవులున్నచోట నిర్భయంగా ఊపిరి పీల్చుకోవచ్చు. గోవులు తామున్న చోటును ప్రకాశింపజేస్తాయి. పాపాలను లాగివేస్తాయి. గోవులే స్వర్గానికి సోపానం. స్వర్గంలో కూడా గోవులు పూజింపబడతాయి. గోవులు పాలిచ్చే దేవతలు, గోవులను మించినది ఏదీ లేదు. భరతర్షభా! ఈ రీతిగా గోవుల మాహాత్మ్యాన్ని వివరించాను. ఇది గుణాలలో కొంతభాగాన్ని చెప్పటమే. పూర్తిగా చెప్పటం వీలుకానిది.

నిషాదులిలా అన్నారు. "మునీ! సజ్జనులకు ఏడడుగులతో మైత్రి ఏర్పడుతుంది. తమను దర్శించాము. ఇంతసేపు మాటాడగలిగాం. స్వామీ! మమ్ము అనుగ్రహించండి. అగ్ని హవిస్సుల నన్నింటిని స్వీకరించి అనుభవిస్తాడు. ధర్మాత్మా! ప్రతాపవంతుడవైన నీవు కూడా మా గుణదోషాలను అంగీకరించాలి. విద్వాంసుడా! మేము తలలు వాల్చి తమను ప్రసన్నులను చేసికొంటాం. మమ్ములను అనుగ్రహిస్తూ ఈ గోవును స్వీకరించాలి.

తీవ్రమైన ఆపదలో మునిగిన వారిని రక్షించేవారు ఎటువంటి గతిని పొందుతారో తమకు తెలుసు. ఇప్పుడు నరకంలో పడబోతున్న మాకు నీవే శరణు"

చ్యవనుడిలా అన్నాడు. "కృపణుడైన మహర్షి నేత్రమూ, పాము రోషదృష్టి ఈ రెండూ అగ్ని చెత్తాచెదారాన్ని తగులబెట్టినట్లు మనిషిని సమూలంగా దహిస్తాయి. నిషాదులారా! మీ ధేనువును స్వీకరిస్తున్నాను. పాప విముక్తులై వీటబుట్టిన చేపలతో పాటు వెంటనే స్వర్గానికి వెళ్ళండి". భీష్ముడిలా చెప్తున్నాడు. ఆపై పవిత్రహృదయం గల ఆ మహర్షి ప్రభావంతో, ఆయన మాటతో ఆ నిషాదులు చేపలతోపాటు స్వర్గానికి వెళ్ళారు. భరతర్షభా! ఆపై ఆ నహుషమహారాజు స్వర్గం వైపు వెళ్తున్న ధీవరులను, చేపలను చూసి ఆశ్చర్యానికి

లోనయ్యాడు. భృగుకులదీపకుడైన ఆ చ్యవనుడు, గవిజాతుడు - ఆ మహర్షులిద్దరూ తగినవరాలతో నహుషమహారాజును అనుగ్రహించారు. భరతసత్తమా! మహాపరాక్రమశాలి అయిన ఆ నహుషమహారాజు ఆనందంతో 'మీ అనుగ్రహమే చాలు" అన్నాడు. ఆ తరువాత ఇంద్రసమానుడైన ఆ నహుషరాజు ధర్మస్థితినే వరంగా కోరుకొన్నాడు. వారు అలాగే అనగానే ఆనందించి, ఆ ఋషులనిద్దరినీ పూజించాడు. చ్యవనుడు తన దీక్షను ముగించి తన ఆశ్రమానికి వెళ్ళాడు. మహాతేజస్వి అయిన గవిజాత మహర్షి కూడా తన ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ నిషాదులు, ఆ చేపలు స్వర్గానికి వెళ్ళాయి. నహుషుడు కూడా వరాన్ని పొంది తన నగరంలోనికి ప్రవేశించాడు. నాయనా! యుధిష్ఠిరా! నీవు నన్ను అడిగినట్లుగా దర్శనంతో సహవాసంతో కలిగే స్నేహాన్ని గురించి నీకు చెప్పాను. గోవుల మహాభాగ్యాన్ని గురించి, ధర్మనిశ్చయాన్ని గురించి చెప్పాను. ఇంకా ఏం చెప్పాలి? నీవేం వినగోరుతున్నావు?

52. చ్యవన కుశిక సంవాదము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "మహాప్రాజ్ఞా! నాకు సముద్రమంత సందేహముంది. మహాబాహూ! చెపుతాను విను. విని వ్యాఖ్యానించాలి. ప్రభూ! ధర్మవేత్తలలో శ్రేష్ఠుడు జమదగ్ని కుమారుడు అయిన పరశురాముని గూర్చి నాకెంతో కుతూహలంగా ఉంది. నాకు వివరంగా చెప్పాలి. సత్యపరాక్రముడైన పరశురాముడు ఎలా ఉద్భవించాడు? బ్రహ్మర్షి వంశంలో పుట్టిన ఆయన క్షాత్రధర్మాన్ని ఎలా స్వీకరించాడు ? రాజా! ఆయన పుట్టుకను గూర్చి పూర్తిగా చెప్పు. కుశిక వంశం క్షత్రవంశం గదా! దానినుండి బ్రాహ్మణజాతి ఎలా పుట్టింది ? మహాత్ముడైన పరశురాముడు, విశ్వామిత్రుడు - ఈ ఇద్దరి ప్రభావం ఆశ్చర్యజనకం. కుశికుని కొడుకు గాధి. గాధిసుతుడు విశ్వామిత్రుడు, ఋచీకుని కొడుకు జమదగ్ని. ఆయన కొడుకు పరశురాముడు. కొడుకులలో లేని ఈ విజాతీయతాదోషం మనుమళ్ళలో ఎలా వచ్చింది ? వాస్తవాన్ని విశదంగా చెప్పాలి".

భీష్ముడు చెప్తున్నాడు. "ఈ విషయంలో కూడా చ్యవనకుశిక సంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. భృగుపుత్రుడు అయిన చ్యవనుడు తనవంశంలో సంభవించబోయే ఈ దోషాన్ని ముందుగానే గ్రహించాడు. అలా గ్రహించి మహాబుద్ధిమంతుడైన ఆ తపోధనుడు గుణదోషాలను, బలాబలాలను మనసా పూర్తిగా ఆలోచించి నిర్ణయించి, కుశికవంశాన్ని పూర్తిగా దహించివేయా లనుకొన్నాడు. ఆపై చ్యవనుడు కుశికుని దగ్గరకు

వచ్చి" అనఘా! నీతో కలిసి జీవించాలని నాకు కోరిక కలిగింది" అని కుశికునితో అన్నాడు. కుశికుడిలా అన్నాడు. "స్వామీ! ఈ సహధర్మాన్ని పండితులు పాటిస్తూనే ఉంటారు. కన్యావివాహ సమయంలో ఎప్పుడూ బుధులు దీనిని బోధిస్తూనే ఉంటారు. తపోధనా! ఈ ధర్మమార్గాన్ని పాటించక కాలం గడచిపోయింది. ఇప్పుడు దానిని పాటిస్తాను. నన్ను ఆదేశించండి". భీష్ముడు చెప్తున్నాడు. "ఆపై చ్యవనమహాముునికి ఆసనాన్ని సమకూర్చి కుశికుడు భార్యతో సహా ముని దగ్గరకు వచ్చాడు. రాజు కొమ్ము చెంబును తీసికొని చ్యవనునికి పాద్యాన్ని ఇచ్చాడు. ఆ మహాత్మునకు అర్ఘ్యప్రదానం వంటి సమస్త కార్యాలను చేయించాడు. ఆ తరువాత నియతవ్రతుడు, మహాత్ముడు అయిన ఆ రాజు సావధానంగా, యథావిధిగా చ్యవనునకు మధుపర్కాన్ని అందజేశాడు. ఆయనను రీతిగా యథావిధిగా సత్కరించి ఆ రాజు మరలా ఇలా అన్నాడు. "స్వామీ! మేము నీ ఆజ్ఞకు లోబడినవాళ్ళం చెప్పండి. ఏం చేయమంటారు ?

దృఢవ్రతా! రాజ్యమా? ధనమా? గోవులా! యజ్ఞ నిర్వహణకై దానమా? చెప్పండి. అవన్నీ ఇస్తాను. ఇదిగో ఇల్లు. ఇదిగో రాజ్యం ఇది ధర్మాసనం. అన్నీ తమరివే. రాజు కూడా తమరే. భూమిని పాలించండి. మీ ముందు నేను పరతంత్రుడను. నేను మీ ఆజ్ఞకు లోబడిన వాడను. కుశికుడలా అనగానే భృగుపుత్రుడైన చ్యవనుడు పరమానందంతో కూడి కుశికునకు ఇలా బదులిచ్చాడు. "రాజా! రాజ్యం మీద కోరికలేదు. ధనం కానీ, స్త్రీలు కానీ, గోవులు కానీ, దేశాలు కానీ, యజ్ఞానికై ధనం కానీ అవసరం లేదు. చెప్పేది విను. మీకిద్దరికీ ఇష్టమైతే ఒక నియమాన్ని మొదలుపెట్టబోతున్నాను. మీరు నిశ్శంకగా నాకు సేవలు చేయాలి". భారతా! చ్యవనుడలా అనగానే ఆ దంపతులు ఆనందించారు. అలాగే జరుగుతుంది' అని ఆ ఋషికి బదులిచ్చారు. ఆపై కుశికరాజు హర్షంతో అందమైన తన అంతఃపురంలోనికి తీసికొని వెళ్ళాడు. అక్కడ అందమైన ఒక గదిని ఆయనకై చూపాడు. ఆపై 'తపోధనా! ఇది మీ శయ్య. స్వేచ్ఛగా ఇక్కడ ఉండండి. తమకు ప్రీతిని కలిగించే ప్రయత్నం చేస్తాము" అని చెప్పాడు. ఆపై వారు అలా మాటాడుకొంటుండగానే సూర్యుడు అస్తమించాడు. ఆ తరువాత మహర్షి అన్నపానాలు స్వీకరించటానికి రాజుకు అనుమతిచ్చాడు. ఆపై కుశికరాజు మునికి నమస్కరించి "మీకు ఇష్టమైన ఆహారమేది ? ఏం సమకూర్చమంటారు ?" అని అడిగాడు. ఆ తరువాత పరమప్రీతితో చ్యవనుడు "అందుబాటులోనున్న ఆహారాన్నే సమకూర్చు"మని రాజును ఆదేశించాడు. రాజా! ఆ మునిమాటను మన్నించి ఆ రాజు అలాగే అన్నాడు. అప్పటికే

సిద్ధమైన ఆహారాన్ని ఆ మునికి అందించాడు. ఆ తరువాత చ్యవనుడు భుజించి "రాజా! నన్ను నిద్ర బాధిస్తోంది. నిద్రించదలచుకొన్నాను" అని ఆ దంపతులతో అన్నాడు.

ఆపై ఋషిశ్రేష్ఠుడైన ఆ చ్యవన భగవానుడు శయ్యాగృహానికి చేరి లోనికి ప్రవేశించాడు. రాజు భార్యతోపాటు అలాగే నిలిచియున్నాడు. "నేను నిదురించిన తరువాత లేపకూడదు. నా పాద సంవాహనం చేస్తూ నిరంతరాయంగా మేలుకొనే ఉండాలి. అని చ్యవనుడు రాజుతో అన్నాడు. ధర్మవేత్త అయిన కుశికుడు నిస్సంశయంగా 'అలాగే'నని అంగీకరించాడు. తెల్లవారింది. అయినా ఆ దంపతులు ఆ మునిని లేపలేదు. మహారాజా! అప్పుడు ఆ మహర్షి ఆదేశం మేరకు నియమపూర్వకంగా ఆ దంపతులు ముని శుశ్రూషమీదనే లగ్నమైయున్నారు. ఆపై రాజును అలా ఆదేశించి పూజ్యుడైన ఆ విప్రుడు ఒకే వైపు తిరిగి ఇరవై యొక్క రోజులు నిద్రించాడు. ఆ రాజు మాత్రం భార్యతో సహా నిరాహారుడై చ్యవనుని ఆరాధించటంలోనే ఆసక్తితో ఆనందంగా ఆయనను సేవించాడు. తపోధనుడైన చ్యవనుడు ఆపై స్వయంగానే మేల్కొన్నాడు. ఆ మహాతపస్వి ఏమీ మాటాడకుండా ఇంటినుండి వెళ్ళిపోయాడు. ఆకలిపీడతో శ్రమతో కృశించిన ఆ రాజదంపతులు ఆయనను అనుసరించారు. కానీ ముని శ్రేష్ఠుడు ఆ దంపతుల వైపు చూడలేదు. రాజేంద్రా! ఆ రాజ దంపతులు చూస్తుండగానే భార్గవకులోద్ధారకుడైన ఆ చ్యవనుడు అంతర్ధానమయ్యాడు. ఆపై రాజు నేలపై పడిపోయాడు. మహాతేజస్వి అయిన ఆ రాజు ముహూర్తకాలంలో ఊరట చెంది, భార్యతో సహా మరల ఆ మునిని వెతకటంలో తీవ్రప్రయత్నం చేయసాగాడు.

53. చ్యవనుడు రాజదంపతుల నాశీర్వదించుట.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "పితామహా! ఆ విప్రుడు అదృశ్యంకాగానే రాజు ఏం చేశాడు? పూజ్యురాలైన ఆయన భార్య ఏం చేసింది? అది చెప్పు." భీష్ముడిలా చెప్తున్నాడు. "ఆ ఋషి కనిపించకపోవటంతో ఆ రాజు సిగ్గుపడి, అలసటతో, శక్తిని కోలుపోయి వెనుదిరిగాడు. ఆ రాజు దీనంగా నగరంలో ప్రవేశించాడు. ఏమీ మాటాడలేదు. ఆ చ్యవనుని ప్రవర్తనను గురించియే ఆలోచిస్తున్నాడు. ఆపై శూన్య హృదయుడై తన అంతఃపురంలో ప్రవేశించిన రాజు పక్కపై పడుకొనియున్న చ్యవన మహర్షిని చూశాడు. ఆ ఋషిని చూసి విస్మయానికి లోనై, ఎంతో ఆశ్చర్యంగా దానిని గురించి ఆలోచిస్తూ, ఆయన దర్శనమైనందున అప్పుడు విశ్రాంతిని పొందారు. వారు యథాస్థానంలో నిలిచి మరల పాదసంవాహనం చేయసాగారు. ఆ తరువాత ఆ మహాముని మరొకవైపుకు

తిరిగి నిదురించసాగాడు. ఆ వీర్యవంతుడు మరల అదే సమయానికి (ఇరవై యొక్క రోజులకు) మేల్కొన్నాడు. భయశంకితులై ఆ దంపతులు ఎటువంటి వికారాన్ని ప్రదర్శించలేదు. భారతా! ఆ ముని మేల్కొని ఆ రాజ దంపతులతో "రాజా! నేను స్నానం చేయాలి. నూనెతో అభ్యంగాన్ని కల్పించండి" అని ఆదేశించాడు. శ్రమతో, ఆకలితో కృశించియున్న వారు" అలాగే అని అంగీకరించి. వందసార్లు వండి తయారుచేసిన విలువైన నూనెతో సేవకు సిద్ధమై నిలిచారు. ఆపై ఆ ఋషి సుఖాసీనుడయ్యాడు. వారు మౌనంగా తైలాన్ని అంటుతున్నారు. కానీ ఆ మహాతపస్వి అయిన చ్యవనుడు "చాలు' అని ఎప్పటికీ అనలేదు.

చ్యవనుడు ఆ రాజదంపతులు నిర్వికారంగా ఉండటం చూసి, ఆపై లేచి, వెంటనే స్నానశాలలో ప్రవేశించాడు. అక్కడ రాజులకు తగిన రీతిగా స్నానానికి ఏర్పాట్లు జరిగి ఉన్నాయి. కాని ఆ ముని మరల దానిని నిరాకరించి రాజు చూస్తుండగానే అక్కడే అంతర్ధానమయ్యాడు. అయినా ఆ రాజదంపతులు కోపానికి లోనుకాలేదు. ఆ పై సమర్థుడైన ఆ చ్యవన భగవానుడు స్నానం చేసి, సింహాసనంపై కూర్చొని ఆ కుశిక దంపతులకు కన్పించాడు. రాజు తన భార్యతో కలిసి సంతుష్టముఖుడై నిర్వికారంగా వినయంతో అన్నం సిద్ధమైనదని ఆ మునికి నివేదించాడు. "తీసికొనిరండి" అని ముని రాజుతో అన్నాడు. అప్పుడురాజు భార్యతో సహా అన్నాన్ని తీసికొనివచ్చాడు. వివిధ మాంసపదార్థాలను, వివిధశాకాలను, రకరకాల సాధకాలను, లఘుపానీయాలను, రుచికరమైన తీపిరొట్టెలను, లడ్డూలను, పానకాలను, రకరకాల రసాలను, మునులకు తగిన ఆటవిక భోజనపదార్థాలను, విచిత్రఫలాలను, రాజుల ఆహారపదార్థాలను, రేగుపండ్లు, ఇంగుదఫలాలు, కాశ్మీరదేశఫలాలు, జీడి మామిడిపండ్లు ఎన్నో సమకూర్చారు. శాపభయంతో ఆ రాజు గృహస్థులకు తగిన భోజ్యపదార్థాలను, వనవాసుల భోజ్యపదార్థాలను మొత్తం సమకూర్చాడు. అవన్నీ చ్యవనుని ముందుంచారు. ఆ చ్యవనమహర్షి అదంతా తీసికొని ఆ భోజనపదార్థాలను శయ్యాసనాలను నిర్మలవస్త్రాలతో కప్పి, మొత్తం తగలబెట్టాడు. అయినా మహాబుద్ధిగల ఆ దంపతులు కోపాన్ని ప్రదర్శించలేదు. వారు చూస్తుండగానే ఆ ముని మాయమయ్యాడు. అప్పుడు శ్రీమంతుడైన ఆ రాజర్షి భార్యతో కలిసి మౌనంగా ఆ రాత్రి అంతా అలాగే నిలిచియున్నాడు. రాజభవనంలో ప్రతిదినమూ ఆ మునికి తగినట్లుగా ఆహారం సిద్ధం చేసేవారు. మంచి శయ్యలను, స్నానానికై ఎన్నో పాత్రల జలాలను సిద్ధం చేసేవారు. నిత్యమూ రకరకాల వస్త్రాలను తెచ్చి ఉంచేవారు. అప్పుడు చ్యవనునకు ఆ ఏర్పాట్లలో ఏ లోపమూ కనిపించలేదు. మరలా ఆ విప్రర్షి "భార్యతో కలిసి రథంపై నేను చెప్తున్న చోటికి వేగంగా తీసికొని

వెళ్ళు" అని ఆ కుశికరాజును ఆదేశించాడు.

ఆ రాజు నిర్విశంకంగా అంగీకరించి "స్వామీ! క్రీడా రథంపై వెళదామా? యుద్ధ రథంపై వెళదామా? అని ఆ తపోధనుని అడిగాడు. రాజు అలా అనగానే ఆ చ్యవన ముని ఆనందించి, దానికి సమాధానంగా ఆ రాజుతో ఇలా అన్నాడు. "నీకిష్టమైన యుద్ధరథాన్ని వెంటనే సిద్ధం చేయి. దానిలో ఆయుధాలు, పతాకలు, శక్తులు, సువర్ణదండాలు ఉండాలి. మువ్వల చప్పుళ్ళు అంతటా వినిపించాలి. తోరణాలు కల్పించాలి. దానికి బంగారు తాపటముండాలి. వందల కొలదిగా బాణాలు ఉండాలి. ఆపై ఆ రాజు 'అలాగే'నని మహారథాన్ని సిద్ధంచేసి ఎడమవైపు తన భార్య, కుడివైపు తాను రథాన్ని లాగటానికి సిద్ధపడ్డారు. ఆ రథంపై కొనలోమూడు దండాలుగల బెత్తాన్ని కూడా ఉంచాడు. దాని కొనలు వజ్రపు సూదులవలె ఉన్నాయి. అదంతా సిద్ధంచేసి రాజు చ్యవనునితో ఇలా అన్నాడు. "స్వామీ! భృగునందనా! రథం ఎక్కడకు వెళ్ళాలో చెప్పండి. విప్రర్షీ! ఎక్కడకు వెళ్ళాలంటే అక్కడకు వెళ్తుంది రథం". అలా అనగానే ఆ స్వామి రాజుతో ఇలా అన్నాడు. "ఇక్కడనుండి మెల్లగా ఒక్కొక్క అడుగువేయండి. నాకు శ్రమ కలుగని రీతిగా, నా ఇష్టం వచ్చినట్లు కదలండి. బాగా సుఖంగా ఉండేటట్లు మోయాలి. జనులందరూ చూడాలి. బాటసారుల నెవ్వరినీ తొలగించకూడదు. వారికి నేను ధనదానం చేయాలి. మార్గంలో బ్రాహ్మణులు నన్ను కోరిన కోరికలను తీర్చాలి. ధనమైనా, రత్నాలయినా నిశ్శేషంగా అన్నీ ఇస్తాను. ఇదంతా చేస్తాను. రాజా! విచారించవద్దు" ఆ ముని మాట విని రాజు "ముని అడిగినది ఏదయినా ఏ శంకా లేకుండా ఇవ్వండి" అని సేవకులను ఆదేశించాడు. ఆపై అనేకరత్నాలు, స్త్రీలు, వాహనాలు, మేకలు, గొర్రెలు, బంగారం, బంగారునగలు, కొండలవంటి ఏనుగులు ఆ ఋషివెంట కదిలాయి. మంత్రులందరూ ఆయనను అనుసరించారు. ఆ సమయంలో నగరమంతా బాధతో హాహాకారాలు చేస్తున్నట్లయింది. ముని ఆ రాజదంపతులను తీక్ష్ణమైన కొనలుగల ఆ బెత్తంతో వేగంగా అదిలిస్తున్నాడు. వీపుమీద నడుముమీద గాయాలయ్యాయి. అయినా నిర్వికారంగా వారు రథాన్ని మోస్తూనే ఉన్నారు.

ఆ దంపతులు ఏబది రాత్రులు నిరాహారంగా ఉన్నందువలన కృశించి ఉన్నారు. వణికిపోతూ కూడా ఏదో రీతిగా ఆ మేటిరథాన్ని మోయసాగారు. అనేకపర్యాయాలు తీవ్రంగా గాయపడి, గాయాలనుండి నెత్తురు కారుతుండగా పుష్పించిన మోదుగచెట్లవలె వారు కనిపిస్తున్నారు. ఆ రాజదంపతులను చూసి పౌర సమూహం ఎంతో బాధపడి,

కలతచెందింది. అయినా శాపానికి భయపడి ఏమీ అనలేదు. ప్రజలు ఇద్దరిద్దరుగా కూడి ఇలా అనుకోసాగారు. "తపోబలాన్ని గమనించండి. మనకు కోపం వచ్చినా ఆ మునివర్యుని తేరిచూడలేకపోతున్నాం. పవిత్రహృదయంగల ఆ పూజ్య మహర్షి శక్తి ఎంతటిదో! ఆశ్చర్యకరంగా ఉంది. ఆ రాజదంపతులు ఎంత ధైర్యశాలులో చూడండి. అలసిపోయి కూడా కష్టంమీద రథాన్ని మోస్తున్నారు. భృగునందనుడు మాత్రం వీరిలోని మార్పును అసలు చూడటం లేదు". "ఆపై భృగుకులతిలకుడైన చ్యవనుడు నిర్వికారంగా ఉన్న రాజదంపతులను చూసి కుబేరుని వలె వీరి ధనాన్ని ఖర్చు చేయించసాగాడు. అప్పుడు కూడా రాజు ప్రసన్న హృదయంతో ఆయన చెప్పినట్టు చేయసాగాడు. దానితో ఆ మునిసత్తముడు రాజుపై ప్రీతిచెందాడు. ఆ శ్రేష్ఠ రథం నుండి దిగి దంపతులను విడిపించాడు. వారిని విడిపించి ఆ పై యథావిధిగా వారితో మాటాడసాగాడు. ప్రీతితో, స్నేహభావంతో గంభీరమైన వాక్కుతో "మీకు గొప్ప వరాలనిస్తాను. అడగండి" అని వారితో అన్నాడు. ఆ మునివరుడు అమృతకల్పాలయిన తన చేతులతో, గాయపడి ఉన్న ఆ సుకుమారులను స్నేహభావంతో స్పృశించాడు. అప్పుడు రాజు "మాకు ఇప్పుడు శ్రమలేదు. తమ ప్రభావంతో శ్రమ తొలగిపోయింది" అని ఆ భృగునందనునితో అన్నాడు. అప్పుడు ఆనందంతో పూజ్యుడైన ఆ చ్యవనుడు రాజుతో ఇలా పలికాడు. "నేనింతవరకు వ్యర్థంగా ఏదీ మాటాడలేదు. నేను చెప్పినది జరిగి తీరుతుంది. రాజా! శుభప్రదమైన ఈ గంగాతీరం ఎంతో అందమైన ప్రదేశం. వ్రతతత్పరుడనై కొంతసేపు ఇక్కడే ఉంటాను. నాయనా! రాజా! నీవు నగరానికి వెళ్ళు. విశ్రాంతి తీసికొని మరల రా. నేనిక్కడే ఉంటాను. నీవు రేపు భార్యతో సహా వచ్చి నన్ను చూడు. నీవు కోపానికి గురికావద్దు. మేలు జరిగే సమయం వచ్చింది. నీ మనస్సులో ఏ కోరిక ఉన్నా అదంతా తీరుతుంది".

చ్యవనుడు అలా చెప్పగానే కుశికరాజు మనసా హర్షాన్ని పొంది ఆ మునివరునితో అర్థయుక్తంగా ఇలా అన్నాడు. "మహాభాగా! నాకు కోపంలేదు. నీవలన పవిత్రులమయ్యాం. మేము మళ్ళీ యౌవనాన్ని చక్కని శరీరాన్నీ, బలాన్నీ పొందాం. తమరు నన్నూ, నా భార్యనూ బెత్తంతో గాయపరిచారు. ఇప్పుడు ఆ గాయాలు శరీరంపై కనిపించటం లేదు. నా భార్యా, నేను స్వస్థులమయ్యాం. ఈ నా రాణికూడా అప్సరసవలె పరమశోభతో అందంగా కనిపిస్తోంది. అంతకుముందు కనిపించినట్లే ఇప్పుడూ ఉంది. మహామునీ! ఇదంతా తమ అనుగ్రహంవలన జరిగినదే. సత్యపరాక్రమా! స్వామీ! తమ విషయంలో ఇది ఆశ్చర్యజనక మేమీకాదు. కుశికుడా రీతిగా పలకగానే చ్యవనముని "రాజా! నీవు

భార్యతోకూడా రేపు ఇక్కడకు రా!" అని కుశికునితో పలికి అనుమతించగానే ఆ రాజర్షి ఆయనకు నమస్కరించి ఇంద్రునివలె తేజోవంతమైన శరీరంతో నగరానికి వెళ్ళాడు. ఆపై అమాత్యులు, పురోహితులు, సేనాపతులు, నర్తకులు, సమస్తప్రజలు ఆ కుశికుని అనుసరించారు. వారందరితో కూడి, పరమశోభతో ప్రకాశిస్తూ, వందుల స్తుతుల నందుకొంటూ కుశికరాజు హర్షంతో నగరంలో ప్రవేశించాడు. ఆపై నగరంలో ప్రవేశించి పూర్వాహ్ణకాలంలో చేయవలసిన పనులను ముగించి, భార్యతో కలిసి భుజించి ఆ మహాతేజస్వి ఆ రాత్రి గడిపాడు. ఆ రాజదంపతులు రోగరహితులైన దేవతలవలె, తమ శరీరాలలో ప్రవేశించిన నూతన యౌవనాన్ని ఇద్దరూ గమనించి, శయ్యపై శయినించి ఆనందించారు. ఆ ద్విజవరు డనుగ్రహించిన ఆ నూతన సుందరతనువులతో మురిశారు. ఆపై భృగుకుల కీర్తి వర్ధనుడు, తపోధనుడు అయిన ఆ మహర్షి అక్కడ తన సంకల్పంతో బహువిధ రత్నాలతో అలంకరింపబడి సంపన్నమై అందమైన వనాన్ని సృష్టించాడు. అంతటి తోట ఇంద్రుని అమరావతిలో కూడా లేదు.

54. చ్యవనుడు కుశికునితో వరములు కోరుకొనుమని పలుకుట.

భీష్ముడిలా చెప్తున్నాడు. ఆపై మహామనస్వి అయిన ఆ కుశికరాజు తెలవారగానే మేల్కొని ప్రాతఃకాలకృత్యాలను ముగించి భార్యతో కలిసి వనానికి వెళ్ళాడు. అక్కడ రాజు గంధర్వనగరంవలె నున్న భవనాన్ని చూశాడు. అది పూర్తిగా సువర్ణమయం. సహస్రమణిస్తంభశోభితం. అప్పుడు అక్కడ కుశికుడు శిల్పుల అభిప్రాయం మేరకు నిర్మించిన దివ్యపదార్థాలను చూశాడు. వెండి సానువులతో కూర్చిన పర్వతాలు, పద్మాలతో కూడిన కొలనులు, వివిధ చిత్రశాలలు, తోరణాలు, బంగారు అరుగులు, పచ్చని పచ్చిక తిన్నెలు శోభిస్తున్నాయి. పూచిన మామిడిచెట్లు, గొప్ప మొగలిచెట్లు, అడవి ఆళ్లచెట్లు, అశోక వృక్షాలు, మొల్లతీగలు వికసించిన గురివింద తీగలు, చంపకవృక్షాలు, మరువపు తరువులు, పనస చెట్లు, వంజులవృక్షాలు, వికసించిన గన్నేరు చెట్లు అక్కడక్కడ చూశాడు ఆ రాజు. ఆయా ప్రదేశాలలో నల్లని కానుగ చెట్లను, వారణపుష్ప లతలను, నాగమల్లెతీగలను కూడా చూశాడు. అక్కడక్కడ తామరలతో, కలువలతో అందమైన సరోవరాలు, విమానాకారంలో కొండలవలె ఎత్తైన భవనాలు కనిపిస్తున్నాయి. సర్వఋతువులలోని పూలు అక్కడున్నాయి. భారతా! కొన్ని తావుల చల్లటినీరు, కొన్ని చోట్ల వెచ్చని నీరు, విచిత్రాసనాలు, శ్రేష్ఠమైన శయ్యలు అక్కడున్నాయి. బంగారంతో చేసి రత్నాలు పొదిగిన శయ్యలపై విలువైన దుప్పట్లు పరిచియున్నారు. అక్కడక్కడ లెక్కలేనన్ని భక్ష్యభోజ్యాలను

సమకూర్చారు. ఆ రాజు మాటాడే చిలుకలను, సారికలను, తుమ్మెదలను, కోకిలలను, సారసపక్షులను, చీకు కొక్కెరలను, అడవికోళ్ళను నెమళ్ళను, కోళ్ళను, వానకోయిలలను, జీవంజీవకాలను, చకోరాలను, వానరాలను, హంసలను, బెగ్గురుపక్షులను, చకోరాలను అన్నివైపులా చూశాడు. అవన్నీ అందంగా ఆనందంగా ఉన్నాయి. రాజా! కొన్నిచోట్ల అప్సరస్సమూహాలను, కొన్నితావుల గంధర్వుల సంఘాలను చూశాడు. ఆ గంధర్వులు కాంతలను కౌగిలించుకొని యున్నారు. వారు ఒకసారి కనిపిస్తున్నారు. మరొకసారి అదృశ్యమవుతున్నారు. ఆ రాజు మధురగీతధ్వనులను, అదే రీతిగా మనోహరవేదనాదాలను, సుమధుర హంసధ్వనులను విన్నాడు.

అప్పుడు ఆ అద్భుతాన్ని చూసి రాజు మనస్సులో ఇలా అనుకొన్నాడు. 'ఇది కలయా? చిత్తభ్రాంతియా? లేక సత్యమా?' ఆహా! శరీరంతోపాటు పరమగతిని పొందానా? లేక పవిత్రమైన ఉత్తరకురుప్రాంతానికి చేరానా? కాక అమరావతికి వచ్చానా? లేక మహాశ్చర్యకరమైన దేదైనా చూస్తున్నానా?' అని ఆలోచించాడు. అలా ఆలోచిస్తూనే మునిపుంగవుడైన ఆ చ్యవనుని చూశాడు. ఆ భృగునందనుడు మణి స్తంభాలతో కూడిన ఆ సువర్ణ విమానంలో గొప్పవారికి తగిన దివ్యశయనంపై శయనించియున్నాడు. కుశికరాజు భార్యతో సహా ఆనందంతో ఆ చ్యవనుని దగ్గరకు వచ్చాడు. అంతలో మరల ఆ చ్యవనుడు, ఆ శయనం కూడా కనిపించకుండాపోయాయి. ఆపై మరొక వనప్రాంతంలో ఆయనను మరలచూశాడు. ఆయన దర్భాసనంపై మహావ్రత దీక్షతో జపిస్తూ కనిపించాడు. ఈ రీతిగా యోగబలంతో ఆ విప్రుడు రాజును మోహింపజేశాడు. క్షణకాలంలో ఆ వనమూ, ఆ అప్సర స్సమూహాలు, గంధర్వులు, చెట్లు అన్నీ అదృశ్యమయ్యాయి. రాజా! మరలా ఆ గంగాతీరమంతా నిశ్శబ్దమై పోయింది. అంతకుముందున్నట్లు దర్భలతో, పుట్టలతో నిండి కనిపించింది. ఆపై ఆ కుశికరాజు, ఆయన భార్య చ్యవనుని ఆ మహాద్భుతకర్మను చూసి మరల పరమాశ్చర్యానికి లోనయ్యాడు. ఆ తరువాత హర్షసమన్వితుడై భార్యతో ఇలా అన్నాడు.

"కళ్యాణీ! సుదుర్లభాలైన విచిత్ర భావాలను చూశాం. ఇదంతా చ్యవనుని అనుగ్రహం. తపోబలాన్ని మించినదేముంది? **మనోరథాలతో పొందలేని దానిని తపస్సుతో పొందవచ్చు.** త్రిలోకాధిపత్యం కన్నా తపస్సే గొప్పది.* చక్కగా తపస్సు చేస్తే ఆ

---

* **తపసా యదవాప్యం హి యత్ తు శక్యం మనోరథైః ।**
త్రైలోక్యరాజ్యాదపి హి తప ఏవ విశిష్యతే ॥ 27

తపోబలంతో మోక్షాన్ని అయినా పొందవచ్చు. ఆహా! మహాత్ముడు, బ్రహ్మర్షి అయిన ఆ చ్యవనుని ప్రభావమెంతగొప్పది. సంకల్పమాత్రంతో ఈ చ్యవనుడు తపశ్శక్తితో లోకాంతరాలను, సృష్టించగలడు. బ్రాహ్మణుడు పవిత్రవాక్కు బుద్ధి, కర్మలతో పుడతాడు. చ్యవనమహర్షి తప్ప మరెవ్వడు ఇటువంటి పనులు చేయగలడు? లోకంలో నరులు రాజ్యాన్ని తేలికగా పొందవచ్చు కానీ బ్రాహ్మణత్వం మాత్రం దుర్లభం. బ్రాహ్మణత్వ ప్రభావంవలననే చ్యవనుడు మనలను తన వాహనాలవలె రథానికి పూన్చగలిగాడు" ఆ రాజు అలా ఆలోచిస్తుంటే అది చ్యవనునకు తెలిసింది. చ్యవనుడు మరల రాజును చూసి "త్వరగా రా!" అని ఆదేశించాడు. అలా అనగానే కుశికుడు భార్యతోపాటు చ్యవనమహాముని వైపు వచ్చాడు. వందనీయుడైన ఆ మునిని తలవాల్చి నమస్కరించాడు ఆ రాజు. ఆపై ఆ రాజును ఆశీర్వదించి పురుషశ్రేష్ఠుడు, ధీమంతుడు అయిన ఆ ముని "కూర్చో" అన్నాడు. ఆ తరువాత సాధారణస్థితికి వచ్చిన ఆ చ్యవనుడు మధురవాక్కులతో ఆనందాన్ని కలిగిస్తూ రాజుతో ఇలా అన్నాడు. "రాజా! నీవు అయిదు కర్మేంద్రియాలను, అయిదు జ్ఞానేంద్రియాలను, మనస్సును చక్కగా జయించావు. దానితో సంకటంలో నుండి బయటపడ్డావు. నాయనా! వాగ్మీ! నీవు నన్ను చక్కగా ఆరాధించావు. చిన్న తప్పు కూడా నీవు చేయలేదు. రాజేంద్రా! నాకు అనుమతి నివ్వు. వచ్చినట్లే వెళ్తాను. నీపై ప్రసన్నుడనయ్యాను. వరాన్ని కోరుకో!" కుశికుడిలా అన్నాడు. "భృగుశార్దూలా! స్వామీ! తమ సన్నిధిలో నేను అగ్నిమధ్యలో ఉన్నట్లుగానే భావించాను. అయినా దహింపబడలేదు. అదే ఎక్కువ. అదే నాకు గొప్పవరం. దాన్ని పొందగలిగాను. బ్రాహ్మణా! తమరు ప్రసన్నులై నా వంశం నశించకుండా కాపాడారు. ఇదే నాపై అనుగ్రహం. ఇదే నా జీవితానికి గొప్ప ప్రయోజనం. భృగునందనా! ఇది యే నాకు రాజ్యఫలం. నా తపఃఫలం కూడా. నా పై ప్రసన్నత ఉంటే, నాకొక సందేహముంది. దానికి సమాధానం చెప్పాలి"

55. చ్యవనుడు కుశికునకు వరములనిచ్చుట.

చ్యవనుడు ఇలా అన్నాడు. "నరోత్తమా! నా నుండి వరాన్ని పొందు. నీ మనస్సులో నున్న సందేహాన్ని అడుగు. నీ పని పూర్తిగా నెరవేరుస్తాను. కుశికుడడిగాడు. "స్వామీ! భార్గవా! ప్రసన్నుడవైతే నాకొక విషయం చెప్పు. నా గృహంలో నివసించటానికి కారణం తెలిసికోవా లనుకుంటున్నాను. మునిపుంగవా! ఇరవైయొక్క రోజులు ఒకేవైపు శయనించటం, ఏమీ చెప్పకుండా బయటకు వెళ్ళటం, హఠాత్తుగా అదృశ్యమైపోవటం,

మరలా కనిపించటం, మరల మరొకవైపు తిరిగి ఇరవైయొక్క రోజులు శయనించటం, నూనెతో మర్దనా చేయించుకోవటం, వెంటనే వెళ్ళిపోవటం, నా ఇంటి వివిధాహార పదార్థాలను సమీకరించటం వాటిని అగ్ని ముట్టించి దహించటం, మరలా వెంటనే గుర్రమెక్కి వెళ్ళిపోవటం, ధనాన్ని దుబారాగా ఖర్చుచేయించటం వనాన్ని చూపించటం, అనేక సువర్ణభవనాలను, మణులతో పగడాలతో చేసిన కోళ్ళుగల మంచాలను ప్రదర్శించటం, మరలా అన్నింటినీ మాయం చేయటం ఇవన్నీ చేయటానికి కారణం వినాలనుకొంటున్నాను. మహామునీ! భృగునందనా! ఈవిషయం ఆలోచించే కొద్దీ మోహానికి లోనవుతున్నాను. తపోధనా! ఈ విషయాన్నంతా ఎంత ఆలోచించినా నిర్ణయానికి రాలేకున్నాను. ఈ యధార్థాన్ని పూర్తిగా వినగోరుతున్నాను". చ్యవనుడిలా చెప్పాడు. "రాజా! ఇదంతా ఏ కారణంగా చేశానో పూర్తిగా చెపుతాను విను. ఇలా అడిగిన తరువాత చెప్పకుండా ఊరుకోలేను. రాజా! పూర్వకాలంలో దేవతల సభలో బ్రహ్మ చెప్పగా విన్నదానిని నేను చెప్తున్నాను, విను. రాజా! బ్రాహ్మణ క్షత్రియుల విరోధం వలన కులసాంకర్యం కలుగబోతోంది. తేజస్సూ, పరాక్రమమూ గల ఒక మనుమడు నీకు కలుగుతాడు. అదివిని నీ వంశాన్ని నాశనం చేద్దామని నేను నీదగ్గరకు వచ్చాను. కుశికవంశాన్ని నశింపజేద్దా మనుకొన్నాను. నీ వంశాన్ని దహించా లనుకొన్నాను. రాజా! అందువలన నీ నగరానికి వచ్చి "ఒక వ్రతాన్ని ప్రారంభించబోతున్నాను. శుశ్రూష చేయా"లని నీతో అన్నాను. రాజర్షీ! నీ ఇంటిలో నుండి కూడా నీలో ఏ తప్పును చూడలేకపోయాను. అందువలననే నీవు బ్రతికి ఉన్నావు. లేకపోతే నీవు ఉండేవాడవు కాదు. రాజా! ఇంత ఆలోచన మనస్సులో పెట్టుకొనే నన్ను ఎవరైనా మేల్కొల్పకపోతారా అని ఇరవై యొక్కరోజులు నిదురించాను. రాజసత్తమా! నీవు కానీ, నీ భార్య కానీ నన్ను మేల్కొలుపలేదు. అప్పుడు నేను నీపై మనసా ప్రసన్నుడనయ్యాను.

రాజా! నిదురలేచి బయలుదేరాను. "ఎక్కడికి?" అని నీవడిగితే నిన్ను శపించాలన్న భావంతో. మరలా నేను మాయమై తిరిగి నీ ఇంటికి వచ్చి, యోగాన్ని ఆశ్రయించి ఇరవైయొక్క రోజులు నిదురించాను. రాజా! ఆకలిగొంటే లేదా అలసిపోతే నాపై కోపిస్తారని భావించి మిమ్ములను ఆకలితో కృశింపజేశాను. రాజా! కానీ నీకు కానీ నీ భార్యకు కానీ మనస్సులో ఇసుమంత కూడా కోపం కలుగలేదు. భోజనాన్ని తెప్పించి దానినంతా తగులబెట్టాను. మాత్సర్యంతో నాపై కోపిస్తావని, కానీ నేను చేసినదంతా నీవు సహించావు. రాజా! ఆపై నేను రథమెక్కి నిన్ను, నీభార్యనూ రథాన్ని లాగమన్నాను. నీవు నిశ్శంకంగా

ఆ పని కూడా అలాగే పూర్తిచేశావు. దానితో కూడా నేను ప్రసన్నుడ నయ్యాను. నేను డబ్బు దుబారాగా ఖర్చు చేశాను. అయినా నిన్ను క్రోధం లొంగదీయలేదు. రాజా! దానితో నేను నీపై ప్రసన్నుడ నయ్యాను. రాజా! అందువలన నీకూ, నీ భార్యకూ ఆనందం కలిగించాలని వనంలో స్వర్గాన్ని ప్రదర్శింపజేశాను. ఇదంతా నీ ప్రీతికొరకే అని గ్రహించు. రాజా! ఈ వనంలో నీకు కనిపించిన దివ్యదృశ్యం స్వర్గలోకంలోని ఒక ప్రాంతం. నృపోత్తమా! రాజా! నీవూ, నీ భార్య కొద్దిసేపు సశరీరంగా ఆ స్వర్గసుఖాన్ని అనుభవించారు. రాజా! తపస్సూ, ధర్మం - వీటి ప్రభావాన్ని నీకు తెలియజేయాలనే ఇదంతా చేశాను. ఇప్పుడు నీ మనస్సులో ఉన్న కోరిక కూడా నాకు తెలుసు. రాజా! నీవు నరేంద్రత్వాన్నీ, అమరేంద్రత్వాన్నీ కూడా హేళన చేసి బ్రాహ్మణత్వాన్నీ, తపస్సునూ కోరుతున్నావు. నాయనా! బ్రాహ్మణత్వానికి సంబంధించి నీవు చెప్పినది నిజమే. బ్రాహ్మణత్వం దుర్లభం. బ్రాహ్మణత్వం లభించినా ఋషిత్వం, ఋషిత్వం దొరికినా తపస్విత్వం పొందటం కష్టం. ఈ నీకోరిక తీరుతుంది. కుశికుని ద్వారా కౌశికవంశమన్న బ్రాహ్మణవంశమవుతుంది. నీ వంశంలో మూడవతరం బ్రాహ్మణత్వాన్ని పొందుతుంది. రాజశ్రేష్ఠా! భృగువంశీయుల తేజస్సుతోనే నీ వంశం బ్రాహ్మణవంశమవుతుంది. నీ మనుమడు అగ్నితేజస్సుగల బ్రాహ్మణుడవుతాడు. ఆ నీ మనుమడు దేవతలకు, మనుష్యులకు, మూడులోకాలకూ కూడా భయాన్ని కల్గిస్తాడు. నీకు సత్యం చెప్తున్నాను. రాజా! నీ మనస్సులోని కోరికను చెప్పు. వరం తీసికో. నేను తీర్థయాత్రకు వెళ్ళబోతున్నాను. ఆలస్యమవుతోంది. కుశికుడిలా అన్నాడు. "మహామునీ! నీవు నాపై ప్రసన్నుడవయ్యావు. అదే నాకు వరం. అనఘా! నీవు చెప్పినది యథార్థం కావాలి. నా మనుమడు బ్రాహ్మణుడు కావాలి. స్వామీ! నా వంశం బ్రాహ్మణవంశం కావాలి. అదే నాకు వరం. ఈ విషయాన్ని వివరంగా మరలా వినగోరుతున్నాను. భృగునందనా! నా వంశం విప్రత్వాన్ని ఎలా పొందుతుంది ? నా బంధువు, ఆ గొప్ప మనుమడు ఎవడు ?

56. చ్యవనుడు తీర్థయాత్రకు బయలుదేరుట

చ్యవనుడిలా చెప్తున్నాడు. "నరోత్తమా! రాజా! నేను నిన్ను సమూలంగా నాశనం చేయటానికి వచ్చిన విషయాన్ని నీకు తప్పక చెప్పాలి. క్షత్రియులు నిత్యమూ భృగువంశీయులకు యజమానులు. అయితే దైవికమైన కారణంగా వారిలో భేదాలేర్పడుతాయి. రాజా! క్షత్రియులు భృగువంశీయుల నందరినీ చంపుతారు. దైవదండపీడితులై గర్భస్థశిశువులవరకూ అందరినీ

సంహరిస్తారు. ఆపై మా వంశంలో అగ్నివలె, సూర్యునివలె కాంతిమంతుడై మహాతేజస్వి అయిన ఊర్వుడు పుడతాడు. అతడు వంశవర్ధకుడవుతాడు. అతడు మూడులోకాలనూ నశింపజేయగల కోపాగ్నిని సృష్టిస్తాడు. పర్వతాలు, వనాలతో సహా భూమిని బూడిదగా చేస్తాడు. కొంచెం కాలంతర్వాత ఆ మునిసత్తముడే సముద్రంలోని బడబాగ్నిలో దాని నిలిపి శమింపజేస్తాడు. మహారాజా! ఆయన కుమారుడు భృగునందనుడైన ఋచీకుడు. ధనుర్వేదమంతా ఆయనదగ్గర మూర్తీభూతమై ఉంటుంది. క్షత్రియసంహారం కోసం దైవికమైన కారణంతో అతడు ధనుర్వేదాన్ని గ్రహించి, తపస్సుచే శుద్ధమైన అంతఃకరణంగల మహానుభావుడైన జమదగ్నికి దానిని సంక్రమింపజేస్తాడు. భృగూత్తముడైన ఆ జమదగ్ని ఆ ధనుర్వేదాన్ని ధారణ చేస్తాడు. నృపోత్తమా! ధర్మాత్మా! ఆ ఋచీకుడు నీ వంశాన్ని గొప్ప చేయటానికై నీ వంశానికి చెందిన అమ్మాయిని పెండ్లి చేసికొంటాడు. మహాతపస్వి అయిన ఆ ఋచీకుడు నీ మనుమరాలిని – గాధి కూతురిని పొంది, క్షాత్రధర్మంగల బ్రాహ్మణకుమారుని కంటాడు. ఆ ఋచీకుడు నీ వంశంలోని గాధికి ఒక కుమారుని అనుగ్రహిస్తాడు. ఆ బిడ్డ మహా తపస్వి, పరమధార్మికుడు కాగలడు. తేజస్సులో బృహస్పతి సమానుడు. క్షత్రియుడైనా బ్రాహ్మణకర్మలను పాటించేవాడు. అతనిపేరు విశ్వామిత్రుడు. బ్రహ్మప్రేరణతో ఆ పరివర్తనకు ఇద్దరు స్త్రీలు కారణమవుతారు. ఇది మరొకరీతిగా జరగదు". మీ వంశంలో మూడవతరంలో నీకు బ్రాహ్మణత్వం లభిస్తుంది. పవిత్రహృదయులైన భృగువంశీయులతో నీకు వియ్యమేర్పడుతుంది.

భరతసత్తమా! మహాత్ముడైన చ్యవనుని మాట విని కుశిక నరపాలుడు ఆనందించాడు. ధర్మాత్ముడైన ఆ రాజు 'అలాగే జరగాలి' అని చ్యవనునితో అన్నాడు. మహాతేజస్వి అయిన చ్యవనుడు మరలా ఆ రాజును వరం కోరుకొమ్మని ఒత్తిడి చేశాడు. ఆ రాజు చ్యవనునితో ఇలా అన్నాడు. "మహామునీ! మంచిది. నేను నా కోరికను చెపుతాను. 'నా వంశం బ్రాహ్మణత్వాన్ని పొందాలి. దాని మనస్సు ఎప్పుడూ ధర్మంమీదనే నిలవాలి'. కుశికుడలా పలుకగానే "అలాగే జరుగుతుంది' అని బదులు పలికి చ్యవనముని, రాజుదగ్గర వీడ్కోలు తీసికొని అప్పుడే తీర్థయాత్రకు వెళ్ళాడు. రాజా! భృగువులకూ, కుశికులకూ గల సంబంధ కారణాన్ని నీకు నేను పూర్తిగా, ఏమీ మిగల్చకుండా చెప్పాను. రాజా! అప్పుడు చ్యవన మహర్షి చెప్పినట్లు ఆ తరువాత భృగువంశంలో పరశురాముడు, కుశిక వంశంలో విశ్వామిత్రుడు జన్మించారు.

57. వివిధతపస్సులు, దానములు - ఫలితము

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "సంపన్నులైన రాజసమూహాలను కోలుపోయిన ఈ భూమండలాన్ని గమనించి, మరల మరల ఆలోచిస్తూ నేను చైతన్యాన్ని కోల్పోతున్నట్లుంది. నేను ఈ భూమిని జయించి వందలకొలది రాజ్యాలను పొందాను. దీనికై కోట్లమందిని చంపాను. దానికి తపించిపోతున్నాను. భర్తలను, పుత్రులనూ, మేనమామలను, సోదరులను పోగొట్టుకొన్న ఈ ఉత్తమ స్త్రీల పరిస్థితి ఏమవుతుంది? మేము మా దాయాదులైన కౌరవులను, ఇతర మిత్రులను చంపి తలక్రిందులుగా నరకంలో పడిపోతాం. ఈ విషయంలో సంశయం లేదు. తీవ్రతపస్సుతో శరీరాన్ని సంయోజింపదలచుకొన్నాను. నీ నుండి నేను వాస్తవికమైన ఉపదేశాన్ని కోరుతున్నాను". వైశంపాయనుడిలా చెప్తున్నాడు. మహామనస్వి అయిన భీష్ముడు యుధిష్ఠిరుని ఆ వాక్యాన్ని విని, దానిపై బుద్ధిని నిలిపి, నిపుణంగా పరిశీలించి యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. రాజా! నేను నీకు అద్భుతరహస్య మొకటి చెప్తాను. ఏ పనిచేసి మరణించినవాడు ఏ గతిని పొందుతాడో చెపుతా విను. **రాజా! తపస్సుతో స్వర్గాన్ని పొందవచ్చు. తపస్సుతో కీర్తిని పొందవచ్చు. తపస్సుతోనే ఆయుస్సు, ఉన్నతి, భోగాలు లభిస్తాయి. భరతర్షభా! తపస్సుతోనే జ్ఞానం, విజ్ఞానం ఆరోగ్యం, రూపం, సంపద, సౌభాగ్యం పొందవచ్చు. తపస్సుతో ధనాన్ని పొందవచ్చు. మౌనంతో ఆదేశాలను పాటింపజేయవచ్చు. దానంతో భోగాలను పొందవచ్చు. బ్రహ్మచర్యంతో ఆయుస్సును పొందవచ్చు. అహింసకు ఫలం మంచిరూపం. మౌనదీక్షకు ఫలం ఉత్తమవంశంలో జన్మ. పండ్లు, మూలాలు తినటానికి ఫలం రాజ్యప్రాప్తి, ఆకులు తిని బ్రతికేవారికి స్వర్గప్రాప్తి ఫలం.** పాలు ఆహారమైతే స్వర్గానికి వెళతాడు. దానంతో ఎక్కువ ధనం సంపాదిస్తాడు. గురుశుశ్రూషతో విద్య, నిత్యశ్రాద్ధంతో సంతానప్రాప్తి ఫలితాలు. శాకాహార దీక్ష గొన్నవాడు గోసంపదను పొందుతాడు. తృణధాన్యాలు తిని బ్రతికేవారికి స్వర్గం లభిస్తుంది. మూడుపూటలా స్నానం చేస్తే ఎక్కువమంది భార్యలు లభిస్తారు. వాయుభక్షణతో యజ్ఞఫలం వస్తుంది.

రాజా! నిత్యమూ స్నానమాచరిస్తూ ఉభయ సంధ్యలను ఉపాసిస్తూ జపించినవాడు సమర్థుడవుతాడు. నీటిని పరిత్యజించినవాడూ, ఆహారాన్ని వదలిపెట్టినవాడు స్వర్గలోకానికి వెళ్తాడు. దర్భలుపరిచిన వేదికపై నిదురించినవారు ఇంటిని, శయ్యలను పొందుతారు. నారచీరలు, చెట్టుబెరళ్ళు ధరించినవారు మేలివస్త్రాలను, ఆభరణాలను పొందుతారు. యోగయుక్తుడైన తపోధనుడు శయ్యలను, ఆసనాలను, వాహనాలను పొందుతాడు.

నియమపూర్వకంగా అగ్నిప్రవేశం చేసినవాడు బ్రహ్మలోకంలో మన్ననలు పొందుతాడు. రసాలను పరిత్యజించటంవలన ఇహలోకంలో సౌభాగ్యాన్ని పొందవచ్చు. మాంసాన్ని పరిత్యజించటం ద్వారా ఆయుస్సును, సంతానాన్ని పొందవచ్చు. నరోత్తమా! నీటిలో నివసించినవాడు రాజు కాగలడు. సత్యవాది దేవతలతో కలిసి స్వర్గంలో ఆనందిస్తాడు. దానంతో కీర్తి కలుగుతుంది. అలాగే అహింసతో ఆరోగ్యం కలుగుతుంది. ద్విజసేవ ద్వారా రాజ్యమూ, పుష్కలమైన ద్విజత్వమూ లభిస్తుంది. జలదానంతో శాశ్వతకీర్తిని పొందవచ్చు. అన్నదానంతో కామభోగాలను అనుభవించి, తృప్తి పొందవచ్చు. సర్వప్రాణులనూ ఓదార్చేవాడు సర్వశోకాలనుండి విముక్తి పొందుతాడు. దేవశుశ్రూషవలన రాజ్యాన్నీ, దివ్య రూపాన్నీ పొందవచ్చు. దీపకాంతిని దానం చేసిన నరుడు నేత్రవ్యాధిని పొందడు. అందమైన వస్తువులు దానం చేసినవాడు జ్ఞాపకశక్తిని, మేధను పొందవచ్చు. గంధమాల్యాలను దానం చేస్తే పుష్కలంగా కీర్తిని పొందవచ్చు. తలవెంట్రుకలను, గడ్డాన్నీ ధరించినవానికి సత్సంతానం కలుగుతుంది. రాజా! పండ్రెండు సంవత్సరాలపాటు ఉపవాసం (భోగపరిత్యాగం) వ్రత దీక్ష, త్రికాలస్నానం చేసినవాడు వీరుల కన్నా ఉత్తమస్థానాన్ని పొందగలడు. మనుజశ్రేష్ఠా! కుమార్తెను బ్రాహ్మపద్ధతిలో దానమిచ్చినవాడు దాసదాసీజనాన్నీ, అలంకారాలనూ, క్షేత్రాలనూ, గృహాలనూ పొందగలడు. భారతా! క్రతువులతో, ఉపవాసాలతో స్వర్గానికి వెళతాడు. ఫలపుష్పాల నిచ్చిన నరుడు శుభకరమైన మోక్ష జ్ఞానాన్ని పొందుతాడు.

బంగారు కొమ్ములతో ప్రకాశించే వేయిగోవులను దానం చేసిన నరుడు స్వర్గంలో పుణ్యదేవలోకాలను పొందుతాడని స్వర్గనివాసులైన దేవతలు చెప్పారు. కొమ్ములచివరల బంగారు తొడుగులు కలిగిన కపిలగోవును దూడతో, కంచుపాత్రతో సహా దానం చేస్తే ఆగోవు ఆయాగుణాలతో కలిసి కామధేనువుగా అతనిదగ్గరకు వస్తుంది. గోదానం వలన ఆ గోవు శరీరంపై ఎన్ని రోమాలు ఉంటాయో అన్ని సంవత్సరాలపాటు స్వర్గసుఖాలు పొందుతాడు. అంతే కాదు. ఆ గోవు పుత్రులను, మనుమలను ఏడుతరాలపాటు ఆ వంశాన్ని పరలోకంలో ఉద్ధరిస్తుంది. అందమైన బంగారుకొమ్ములు గల తిలల గోవును, డబ్బు కొంగునకట్టిన ఉత్తరీయంతో, కంచుపాత్రతో సదక్షిణంగా బ్రాహ్మణునకు దానంచేసినవాడు వసులోకాలను తేలికగా పొందగలడు. మహాసముద్రంలో చిక్కుకొన్న నావ గాలివాటంతో ఒడ్డుకు చేరినట్టు, తనకర్మలచే బంధింపబడి గాఢాంధకారనరకంలో పడుతున్న వానిని గోదానం పరలోకంలో తరింపజేస్తుంది. బ్రాహ్మవిధితో కన్యాదానం చేసినవాడు, విప్రునకు భూదానం చేసినవాడు, యథాశాస్త్రంగా అన్నదానం చేసినవాడు

ఇంద్రలోకాన్ని పొందుతాడు. స్వాధ్యాయం, సత్ప్రవర్తన గల బ్రాహ్మణునకు సర్వగుణ సంపన్నమైన నివాసగృహాన్ని, దానం చేసిన నరుడు ఉత్తరకురుదేశాలను చేరుతాడు.

భారాన్ని మోయగల ఎద్దులను దానం చేసిన నరుడు వసులోకాలను పొందుతాడు. సువర్ణాభరణాల దానం స్వర్గాన్ని కలిగిస్తుంది. మేలిమి బంగారు దానం అంతకన్నా విశిష్టం. గొడుగును దానం చేస్తే గొప్ప ఇంటిని, చెప్పులు దానం చేస్తే మంచి వాహనాన్ని, వస్త్రదానం ద్వారా అందమైన రూపాన్ని, గంధదానం ద్వారా పరిమిళిత శరీరాన్ని పొందవచ్చు. పూలతో లేదా పండ్లతో నిండిన చెట్టును బ్రాహ్మణునకు దానం చేస్తే అప్రయత్నంగా బహురత్నపూర్ణమై ధనసహితమై సమృద్ధమైన ఇంటిని పొందవచ్చు. భక్ష్యాలనూ, అన్నపానీయాలనూ, రసాలనూ దానం చేసినవాడు ఎన్నో రసాలను పొందుతాడు. ఇంటినీ, వస్త్రాలను దానం చేసినవాడు వాటినే పొందగలడు. సందేహం లేదు. రాజా! పూలమాలలను, ధూపగంధాలను, చందనాలను, స్నానానికి జలాన్ని, పూలనూ బ్రాహ్మణులకు దానం చేసిన మనిషి లోకంలో అటువంటివానినే పొందుతాడు. రాజా! ఆహారపదార్థాలు, శయ్యలు గల ఇంటిని బ్రాహ్మణునకు దానం చేసిన పురుషుడు పుణ్యమూ, పవిత్రమూ, బహురత్నపూర్ణమూ అయిన గొప్ప ఇంటిని పొందుతాడు. సుగంధయుక్తమైన విచిత్రకంబలాలు, తలగడలు గల శయనాన్ని బ్రాహ్మణునకు దానమిచ్చినవాడు అందగత్తెయై, అనురాగవతియై మనోరంజని అయిన భార్యను అప్రయత్నంగా పొందుతాడు. వీరశయ్యపై మరణించిన నరుడు బ్రహ్మతో సమానమవుతాడు. అంతకుమించిన స్థానమేదీ లేదని మహర్షులు చెపుతారు.

వైశంపాయనుడు చెప్తున్నాడు. భీష్ముని ఆ మాటను విని కురునందనుడైన యుధిష్ఠిరుడు ప్రసన్నహృదయుడయ్యాడు. వీర మార్గాన్నే ఆకాంక్షిస్తూ ఆశ్రమవాసంపై మక్కువ వీడాడు. పురుషర్షభా! సమర్థుడైన యుధిష్ఠిరుడు "పితామహుని మాటను మీరు కూడా ఇష్టపడాలి" అని పాండవులతో అన్నాడు. సర్వపాండవులు, యశస్విని అయిన ద్రౌపది 'అలాగే' అని యుధిష్ఠిరుని మాటను గౌరవించారు.

58. ఆరామ తటాకాది నిర్మాణము - ఫలితము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "కురుపుంగవా! భరతశ్రేష్ఠా ! తోటలు, చెరువులు నిర్మించటంవలన ఎటువంటి ఫలితం లభిస్తుంది? ఇప్పుడు నీనుండి నేను ఆ విషయం వినగోరుతున్నాను". భీష్ముడు చెప్తున్నాడు. "అందంగా, సారవంతంగా, చిత్రంగా, ఉండి,

ధాతుసహితమై, సర్వప్రాణులతో కూడిన భూమి శ్రేష్ఠమైనదని చెప్పబడుతోంది. ఆ భూమికి సంబంధించిన విశేషాలనూ, తటాకాలను, ఇతర జలాశయాలను నిర్మించటాన్ని గూర్చి క్రమంగా వివరంగా చెప్తాను. తటాకాలను నిర్మించటం వలన కలిగే లాభాలను వివరిస్తాను. తటాకాలను త్రవ్వించిన వ్యక్తి మూడు లోకాలలోనూ అన్నిచోట్లా పూజనీయుడు. అంతేగాక తటాకనిర్మాణం మిత్రుని ఇంటివంటిది. మైత్రికి హేతువు, మిత్రులను పెంపొందింపజేస్తుంది. కీర్తిని విస్తరింపజేస్తుంది. ఒక ప్రదేశంలో తటాకాన్ని నిర్మించటం ధర్మార్థ కామాల ఫలితాన్ని ఇస్తుందని బుద్ధిమంతులంటారు. తటాక మున్న తావు ప్రాణులకు గొప్ప నెలవు. నాలుగు విధాలయిన ప్రాణులకు తటాకమే ఆధారం. తటాకాలన్నీ గొప్ప సంపదలను అందిస్తాయి. దేవతలు, మనుష్యులు, గంధర్వులు, పితరులు, నాగులు, రాక్షసులు, సమస్త స్థావర ప్రాణులు జలాశయాన్ని ఆశ్రయిస్తాయి. కాబట్టి నీకు తటాక నిర్మాణంలోని లాభాలను, దాని వలన పొందే ఫలితాలను చెపుతాను. అవి ఋషులు చెప్పిన విషయాలు.

ఎవని తటాకంలో వర్షాకాలంలో నీళ్ళు నిలుస్తాయో వాడు అగ్నిహోత్రఫలితాన్ని పొందుతాడని మనుషులంటారు. ఎవని తటాకంలో శరత్కాలంలో నీళ్ళు ఉంటాయో వాడు మరణానంతరం వేయి ఆవులను దానం చేసిన ఫలితాన్ని పొందుతాడు. ఎవని తటాకంలో హేమంతఋతువులో నీళ్ళుంటాయో వాడు విరివిగా బంగారు దక్షిణగా ఇచ్చి యాగం చేసిన ఫలితాన్ని పొందుతాడు. ఎవని తటాకంలో శిశిరఋతువులో నీరు నిలిచి ఉంటుందో వాడు అగ్నిష్టోమయాగాన్ని చేసిన ఫలితాన్ని పొందుతాడని బుద్ధిమంతులంటారు. ఎవని తటాకం వసంతఋతువులో నీటితో నిండి దప్పికగొన్నవారికి ఆశ్రయమవుతుందో వాడు అతిరాత్రయజ్ఞఫలాన్ని అనుభవిస్తాడు. ఎవని తటాకంలో వేసవికాలంలో నీరు నిలిచి ఉంటుందో వాడు అశ్వమేధయాగ ఫలితాన్ని పొందుతాడని మునులంటారు. ఎవడు త్రవ్వించిన జలాశయంలో ఎప్పుడూ గోవులు, సత్పురుషులు నీరు త్రాగుతుంటారో వాడు వంశాన్ని అంతటినీ ఉద్ధరిస్తారు. ఎవని తటాకంలో దప్పిక గొన్న ఆవులు, మృగాలు, పక్షులు, మనుష్యులు నీరు త్రాగుతారో వాడు అశ్వమేధ యాగఫలాన్ని పొందుతాడు. ఎవడు త్రవ్వించిన తటాకంలో ప్రజలు స్నానం చేసి, విశ్రమిస్తారో ఆ పుణ్యఫలం మరణానంతరం అతనికి అనంతసుఖాలను కల్పిస్తుంది. నాయనా! నీరు దుర్లభమైనది. విశేషించి పరలోకంలో కాబట్టి జలదానం చేసినవానికి శాశ్వతానందం

లభిస్తుంది. నువ్వులు దానం చేసినా, జలదానం చేసినా, దీపదానం చేసినా, ధర్మరక్షణకై మేల్కొన్నా దాయాదులతో కలిసి సుఖంగా జీవించవచ్చు. మరణానంతరం మరీ దుర్లభమైన ఫలితాన్ని పొందవచ్చు. నరోత్తమా! జలదానం అన్నిదానాల కన్నా గొప్పది. అన్నిదానాల కన్నా విశిష్టమైనది. అందువలన జలదానం చేసితీరాలి.

ఇంతవరకు చెరువులను త్రవ్వించటం వలన కలిగే ఉత్తమ ఫలితాన్ని చెప్పాను. ఇక చెట్లునాటడం వలన కలిగే ఫలితం చెపుతాను. వృక్షజాతులు ఆరురకాలు. చెట్లు పొదలు, లతలు, తీగలు (నేలపై ప్రాకేవి), త్వక్సారాలు (వెదురు వంటివి), తృణజాతులు. ఇవి వృక్షజాతులు. వాటిని నాటితే లాభాలివి. మానుషలోకంలో కీర్తి, మరణానంతరం శుభఫలప్రాప్తి. చెట్లు నాటినవాడు లోకంలో పేరు పొందుతాడు. పరలోకంలో పితరుల సమ్మానాన్ని పొందుతాడు. దేవలోకానికి వెళ్ళినా కూడా అతనిపేరు నశించదు. చెట్లు నాటినవాడు చనిపోయిన పూర్వీకులను, పుట్టబోయేవారినీ, పితృవంశాన్నీ ఉద్ధరిస్తాడు. కాబట్టి చెట్లు నాటాలి. చెట్లు తమను నాటిన వారికి పుత్రుల వంటివి. ఈ విషయంలో సంశయం లేదు. అందువలన పరలోకానికి వెళ్ళినప్పుడు స్వర్గాన్ని అక్షయలోకాలనూ పొందుతాడు. నాయనా! చెట్లు పూలతో దేవతలనూ, పండ్లతో పితరులను, నీడతో అతిథులను పూజిస్తాయి. కిన్నరులు, నాగులు, రాక్షసులు, దేవతలు, గంధర్వులు, మానవులు, ఋషిగణాలు, చెట్లను ఆశ్రయిస్తారు. చెట్లు పుష్పించి, ఫలించి మానవులను తృప్తిపరుస్తాయి. చెట్లు నాటినవానిని చెట్లు పుత్రులవలె పరలోకంలో తరింపజేస్తాయి. కాబట్టి శ్రేయస్కాముడు ఎప్పుడూ తాను త్రవ్వించిన తటాకాల ఒడ్డున చెట్లు నాటాలి. పిల్లలను కాపాడినట్లు రక్షించాలి. ధర్మదృష్టిలో చెట్లు పుత్రులతో సమానం. చెరువులు త్రవ్వించినవాడు, చెట్లునాటినవాడు, యాగాలను అనుష్ఠించినవాడు, సత్యవాది - ఈ బ్రాహ్మణులందరూ స్వర్గలోకంలో సత్కృతి నందుతారు. కాబట్టి చెరువులు త్రవ్వించాలి. చెట్లు నాటాలి. వివిధ యాగాలనూ అనుష్ఠించాలి. ఎప్పుడూ సత్యాన్నే పలకాలి.

59. ఉత్తమదాన - ఉత్తమ బ్రాహ్మణ ప్రశంస.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "కురుపుంగవా! యజ్ఞవేదికకు వెలుపల చేయవలసిన దానాల నెన్నింటినో చెప్పావు. నీ అభిప్రాయంలో వాటిలో గొప్పదానమేది ? రాజా! ఈ విషయంలో నాకు పరమకుతూహలంగా ఉంది. ఏ దానం చేస్తే ఆ పుణ్యఫలం దాతను

అనుసరిస్తుందో నాకు చెప్పు". భీష్ముడిలా చెప్తున్నాడు. **"సర్వప్రాణులకూ అభయదానం, కష్టాలలో ఉన్నవానిపై అనుగ్రహం, యాచకునకు అభీష్ట వస్తుదానం, దప్పికగొన్న వానికి నీటినివ్వటం ఉత్తమదానం. ఇచ్చిన తరువాత దానిపై దృష్టి లేకపోతే అది శ్రేష్ఠదానం భరతర్షభా! అటువంటి దానఫలం దాతను అనుసరిస్తుంది.*** సువర్ణదానమూ, గోదానమూ, భూదానమూ ఇవి పవిత్రమైనవి. ఇవి పాపాన్ని కూడా పోగొట్టగలవు. పురుషోత్తమా! సజ్జనులకు నిత్యమైన ఈ దానాల నివ్వు. ఈ దానాలు నరుని పాపంనుండి కూడా విడిపించగలవు. సందేహం లేదు. లోకంలోని అత్యంత ప్రియవస్తువులనూ, ఇంటిలో వాడటానికి ఇష్టపడే వస్తువులను గుణవంతులకివ్వాలి. చేసినదానం అక్షయఫలితాన్ని ఇవ్వా లనుకొనేవాడు అటువంటి దానాలు తప్పక చేయాలి. ప్రియమైనదిచ్చి, ప్రియమైన పని చేసేవాడు ఎప్పుడూ ప్రియాలనే పొందుతాడు. ప్రాణులకూ ఇహపరలోకాలలో ఇష్ట డవుతాడు. యుధిష్ఠిరా! ఏమీ లేనివాడు అనాసక్తిగా యాచించినపుడు అహంకారంవలన యథాశక్తిగా దానం చేయనివాడు క్రూరుడు. శత్రువైనా సరే కష్టాలలో పడి దీనుడై శరణుగోరి వచ్చినవానిని అనుగ్రహించినవాడే పురుషశ్రేష్ఠుడు. పండితుడై కూడా జీవికను కోల్పోయి కృశించి, దుఃఖంతో ఉన్నవాని ఆకలితీర్చిన వాడితో సమానమైన పుణ్యపురుష డుండడు. కౌంతేయా! భార్యాపుత్రుల పోషణతో కృశించిపోతూ కూడా యాచనకు దిగక, సత్కర్మలలో తననుతాను నియంత్రించుకొన్న వారికి ఏదో ఒక రీతిగా సహాయం చేసే ఏర్పాట్లు చేయాలి. దేవతల నుండి కానీ, మానవుల నుండి కానీ దేనినీ ఆశించక, నిత్యసంతుష్టులై, దొరికినదానితోనే జీవనాన్ని గడుపుతూ పూజార్హులైన బ్రాహ్మణశ్రేష్ఠులను గూఢచారుల ద్వారా గుర్తించి వారిని నియంత్రించాలి. వారు కోపిస్తే విషసర్పాలవంటివారు. వారినుండి నిన్ను రక్షించుకోవాలి. కురునందనా! సేవకులతో, అవసరపదార్థాలతో కూడి, సర్వకామసుఖాలనూ తీర్చగల గృహాలను వారికి ఏర్పరచి నిత్యమూ వారిని సత్కరించాలి.

యుధిష్ఠిరా! నీవు చేసిన దానం శ్రద్ధతో పవిత్రమై, కర్తవ్యభావనతో ఉంటే పుణ్యకర్మాచరణ శీలురు, ధార్మికులు అయిన వారు దానిని స్వీకరిస్తారు. కొందరు బ్రాహ్మణులు విద్వాంసులు, వ్రతాచరణ శీలురు, ధనాన్ని ఆశ్రయింపక జీవించేవారు,

---

* అభయం సర్వభూతేభ్యః వ్యసనే చాప్యనుగ్రహః ।
యచ్చాభిలషితం దద్యాత్ తృషితాయాభియాచతే ॥ 3
దత్తం మన్యేత యద్ దత్త్వా తద్ దానం శ్రేష్ఠముచ్యతే ।
దత్తం దాతారమన్వేతి యద్ దానం భరతవర్షభ ॥ 4

స్వాధ్యాయాన్నీ తపస్సును గూఢంగా నిర్వహించుకొనేవారు, కఠినవ్రతతత్పరులు ఉంటారు. వారు పవిత్రులు, జితేంద్రియులు, తమ భార్యలయందే తృప్తి పడేవారు. రాజా! అటువంటివారికై చేసిన శుభకర్మ లోకకల్యాణ కారకమవుతుంది. బ్రాహ్మణుడు ప్రాతఃకాలంలో, సంధ్యాకాలంలో చక్కగా అగ్నిహోత్రహోమం చేసి పొందే ఫలితాన్ని, జితేంద్రియులయిన ఆ బ్రాహ్మణులకు దానం చేయటం ద్వారా పొందవచ్చు. శ్రద్ధతో పవిత్రమై సదక్షిణాకంగా నీవు చేసే విశాలదానయజ్ఞం సర్వయజ్ఞాలకన్నా విశిష్టమైనది. నాయనా! అలా దానం చేస్తూనే ఉండు. యుధిష్ఠిరా! ఆ బ్రాహ్మణులు పితరులకై చేసే తర్పణాలవలె, దానరూపజలంతో వారిని తృప్తిపరిచి నివాసాన్ని కల్పించి, పూజించు. దానితో దేవతాది ఋణవిముక్తి కలుగుతుంది. ఎప్పుడూ కోపించక, గడ్డిపరకకై కూడా ఆశపడక, ప్రియంగా మాటాడే బ్రాహ్మణులు మనకు మిక్కిలిగా పూజింపదగినవారు. అటువంటి బ్రాహ్మణులు దాతలపై గొప్పగా ఆదరాన్ని చూపరు. కొందరు సంపాదనకై ప్రవర్తించరు. అటువంటివారిని పుత్రులవలె కాపాడాలి. వారికి నమస్కరించాలి. వారివలన భయముండదు. ఋత్విక్కులు, పురోహితులు, ఆచార్యులు సహజంగా మృదు స్వభావం గలవారు. వేదాలను ధరించేవారు. క్షాత్రతేజస్సు బ్రహ్మతేజస్సుదగ్గర చేరగానే శాంతిస్తుంది. నేను కలవాడను, బలవంతుడను, రాజును అని భావిస్తూ బ్రాహ్మణులను నిరాదరించి అన్నవస్త్రాలను నీవు అనుభవించకూడదు. శోభకోసమో, బలంకోసమో నీ దగ్గరున్న ధనంతో నీవు స్వధర్మాన్ని పాటిస్తూ ఆ బ్రాహ్మణులను పూజించాలి. ఆ బ్రాహ్మణుల కెప్పుడూ నమస్కరించాలి. వారు తమ ఇచ్ఛానుసారం ప్రవర్తించగలగాలి. వారు పుత్రులవలె యథాసుఖంగా, యథోత్సాహంగా నీ దగ్గర ఆనందంగా జీవించగలగాలి. వారు అల్పసంతోషులు, హితాభిలాషులు, వారి అనుగ్రహం అక్షయం. అటువంటి వారికి నీవు తప్ప మరెవ్వరూ జీవికను కల్పించలేరు. లోకంలో భర్తను ఆశ్రయించి ఉండటమే స్త్రీలకు సనాతనధర్మమైనట్లు బ్రాహ్మణులు కూడా మనకు ఆశ్రయమైన వారు. మనకు అది తప్ప మరొక మార్గంలేదు. నాయనా! నిత్యమూ క్షత్రియునిలో నున్న దారుణకర్మను చూసి, బ్రాహ్మణులు, క్షత్రియులు నిరాదరణకు గురియై వారిని పరిత్యజిస్తే క్షత్రియులు వేదాలకు, యజ్ఞాలకు, ఉత్తమలోకాలకు, జీవికకు కూడా దూరమవుతారు. ఆ స్థితిలో బ్రాహ్మణులకు ఆశ్రయమిచ్చే నీవు తప్ప మిగిలిన క్షత్రియులు బ్రతికి ఏం లాభం ?

రాజా! ఈ విషయంలో సనాతనధర్మమెలా ఉండేదో నీకు చెపుతాను. పూర్వకాలంలో క్షత్రియులు బ్రాహ్మణులను, వైశ్యులు క్షత్రియులను, శూద్రులు వైశ్యులను

సేవించేవారట. బ్రాహ్మణుడు అగ్నివలె జ్వలిస్తాడు. శూద్రుడు దూరంనుండియే పరిచర్య చేయాలి. వైశ్యుడు, క్షత్రియుడు స్పృశించి పరిచర్య చేయవచ్చు. ద్విజులు మృదుస్వభావులు, సత్యశీలురు. సత్యధర్మాలను పాటించేవారు. కోపిస్తే వారు సర్పాలవంటివారు. కాబట్టి వారిని నీవు సేవించాలి. చిన్నవాళ్ళు, పెద్దవాళ్ళు, పెద్దవాళ్ల కన్నా పెద్దవాళ్ళు అయిన క్షత్రియులు తేజస్సుతో, బలంతో తపస్సు చేయవచ్చు. కానీ వారి తేజస్సులు, తపస్సులు అన్ని బ్రాహ్మణుల దగ్గర శాంతిస్తాయి. నాయనా! నాకు బ్రాహ్మణులకన్నా నా తండ్రి కానీ, నీవు కానీ, నా తాతకానీ, నా శరీరం కానీ, నా జీవితం కానీ ఎక్కువ కావు. నీకన్నా ఇష్టమైనవాడు లోకంలో నాకెవ్వడూ లేడు. భరతర్షభా! కానీ నీ కన్నా నాకు బ్రాహ్మణులు ఇష్టమైనవారు. నేను ఈ యథార్థాన్ని చెప్తున్నాను. ఈ సత్యప్రభావంతో నేను నా తండ్రి శాంతనుడు చేరిన లోకాలకు చేరుతాను. ఈ సత్యప్రభావంతో సత్పురుషులు చేరే పవిత్రలోకాలకు నేను వెళ్తాను. అక్కడ బ్రాహ్మణులకే ప్రాధాన్యం. నాయనా! నేను వేగంగా వెళ్ళి శాశ్వతంగా అక్కడ ఉంటాను. బ్రాహ్మణులను నేను సేవించినదాని ఫలితంగా అటువంటి పుణ్యలోకాలను చూడగలుగుతాను. మరే పుణ్యమూ చేయలేదని బాధపడను.

60. యాచింపని ధర్మాత్ముడు, నిర్ధనుడైన సద్గుణవంతునకు చేసిన దానము యొక్క ఫలము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "సదాచారం, విద్య, వంశం – ఈ మూడింటిలో సమానమైన స్థాయి గల ఇద్దరు బ్రాహ్మణులలో ఎవరికి దానమివ్వటం మంచిది? అడగనివానికా? అడిగినవానికా? భీష్ముడు చెప్తున్నాడు. "పార్థా! అడిగినవానికివ్వటం కన్నా అడగనివానికివ్వటమే ఉత్తమదానం శ్రేయస్కరం. ధైర్యం లేని దీనుని కన్నా ధైర్యం గలవాడే పూజకు యోగ్యుడు. అన్యరక్షణకై ధైర్యం ప్రదర్శించే క్షత్రియుడు, యాచనకు దిగకుండా ధైర్యంగా ఉండే బ్రాహ్మణులు శ్రేష్ఠులు. ధృతి, పాండిత్యం, తృప్తిగల బ్రాహ్మణుడు దేవతలను సంతోషపెట్టగలడు. భారతా! దరిద్రుడు యాచించటం అతనిని తిరస్కరించటానికి కారణమవుతుంది. యాచకులు దొంగలవలె ఎప్పుడూ ప్రజలను ఉద్వేగానికి లోనుచేస్తారు. **యాచకుడు మరణిస్తాడు. కానీ దాత ఎప్పుడూ మరణించడు. దాత యాచకునీ, తననూ కూడా బ్రతికిస్తాడు.** యాచకునకు దానం చేయటమంటే అది దయ అనే శ్రేష్ఠధర్మం. బాధలుపడుతూ కూడా యాచింపనివారిని ఏదో ఒక ఉపాయంతో రప్పించి దానం చేయాలి. అటువంటి బ్రాహ్మణోత్తములు నీ రాజ్యంలో ఉంటే నివురుగప్పిన నిప్పు

వంటి ఆ బ్రాహ్మణులను గూర్చి ప్రయత్నపూర్వకంగా తెలిసికోవాలి. కౌరవ్యా! తపస్సుతో ప్రజ్వలించే ఆ బ్రాహ్మణులను పూజించకపోతే వారు తలచుకొంటే పృథివిని మొత్తం దహించగలరు. అటువంటివారు పూజింపదగినవారు. పరంతపా! జ్ఞానం, విజ్ఞానం, తపస్సు, యోగాలతో కూడిన బ్రాహ్మణులు పూజనీయులు. అటువంటివారిని నీవెప్పుడూ పూజించాలి. యాచింపనివారి దగ్గరకు నీవే వెళ్ళి అనేక విధాలైన పదార్థాలనివ్వాలి. ఉదయమూ, సాయంకాలమూ కూడా చక్కగా అగ్నిహోత్రాన్ని అనుష్ఠిస్తే లభించే ఫలితం, వేదపండితులు, వ్రతశీలురు అయిన బ్రాహ్మణులకు దానం చేయటం ద్వారా లభిస్తుంది.

కౌరవ్యా! విద్యావేదవ్రతనిష్ణాతులై, కఠోర వ్రతశీలురై, స్వాధ్యాయాన్నీ తపస్సునూ రహస్యంగా అనుష్ఠిస్తూ, ఇతరులను ఆశ్రయించకుండా జీవించే బ్రాహ్మణులు ఉత్తములు. వారిని నీ దగ్గరకు పిలిపించి వారికై సేవకులతో, అవసర పదార్థాలతో, భోగ్య వస్తువులతో సహా అందమైన ఇళ్ళను నిర్మించి ఇవ్వాలి. యుధిష్ఠిరా! ధర్మవేత్తలు, సూక్ష్మదర్శనులు అయిన ఆ బ్రాహ్మణులు శ్రద్ధాపూర్వకంగా నీవిచ్చినదాన్ని కర్తవ్యంగా భావించి స్వీకరిస్తారు. కర్షకులు వర్షానికై ఎదురుచూసినట్లు బ్రాహ్మణుల భార్యలు భర్తరాకకై ఎదురుచూస్తూ, ఆకలిగొన్న బిడ్డలను మరిపిస్తుంటారు. అటువంటి బ్రాహ్మణులు నీ ఇంట భుజించి తమ ఇళ్ళకు వెళ్తున్నారా? నాయనా! నియమపూర్వకంగా బ్రహ్మచర్యాన్ని పాటించే బ్రాహ్మణులు ప్రాతఃకాలంలో ఇంటిలో భోజనం చేస్తే మూడు అగ్నులనూ తృప్తిపరుస్తారు. నాయనా! మధ్యాహ్నకాలంలో బ్రాహ్మణులను భుజింపజేసి, గోవులనూ, బంగారాన్ని, వస్త్రాలనూ దానం చెయ్యి. దానితో ఇంద్రుడు నీకు ప్రసన్నుడు కాగలడు. యుధిష్ఠిరా! మూడవవేళలో దేవతలను, పితరులను, బ్రాహ్మణులను ఉద్దేశించి దానం చేస్తే అది నీవు చేసిన వైశ్వదేవం వంటిది. సర్వప్రాణులనూ హింసింపకుండుట, తగినరీతిగా అందరికీ పంచి పెట్టుట, దమం, త్యాగం, ధైర్యం, సత్యం – ఇవన్నీ నీకు అవభృథస్నానఫలితాన్ని ఇస్తాయి. శ్రద్ధతో పవిత్రమై, సదక్షిణాకంగా నీవు చేసే విశాల దాన యజ్ఞం సర్వయజ్ఞాలకన్నా విశిష్టమైనది. నాయనా! ఎప్పుడూ అలాగే ప్రవర్తించు.

61. యజ్ఞదాన బ్రాహ్మణాదులను రక్షించుట - రాజ కర్తవ్యము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "దానం, యజ్ఞకర్మ – ఈ రెండింటిలో మరణానంతరం మహాఫలితాన్ని ఇచ్చేది ఏది? దేని ఫలం శ్రేష్ఠం? ఎటువంటి బ్రాహ్మణులకు ఎప్పుడు దానం చేయాలి? ఎప్పుడు ఎలా యజ్ఞం చేయాలి? భారతా! ఇది యథాతథంగా తెలిసికోవాలని

ఉంది. పండితా! తెలియగోరిన నాకు దానధర్మాన్ని గురించి వివరంగా చెప్పు. పితామహా! యజ్ఞవేది దగ్గర శ్రద్ధాపూర్వకంగా చేసిన దానం, దూరంగా దయాభావంతో చేసిన దానం - ఈ రెండింటిలో ఎక్కువగా శ్రేయస్కరమైనదేదో నాకు చెప్పు. భీష్ముడు చెప్తున్నాడు. "నాయనా! క్షత్రియునదెప్పుడూ రౌద్రకర్మయే. దానిని పవిత్రం చేసే కర్మలు యజ్ఞం, దానం. పాపకృత్యాలు చేసే రాజులనుండి సజ్జనులు ఏదీ తీసికోరు. ఆ కారణం వలననే రాజు ఇష్టదక్షిణలతో యాగాలు చేయాలి. ఒకవేళ సజ్జనులు దానాలు స్వీకరించేటట్లయితే రాజు పరమశ్రద్ధను పూని ప్రతిదినమూ దానాలు చేయాలి. శ్రద్ధతో చేసిన ఆ దానమే ఆత్మశుద్ధికి ఉత్తమమార్గం. నీవు నియమపూర్వకంగా యజ్ఞంలో సౌశీల్యం, సదాచారం, తపస్సు, వేదజ్ఞానం, సర్వమైత్రి, సాధుస్వభావం గల బ్రాహ్మణులకు ధనమిచ్చి తృప్తిపరచాలి. వారు దానాలు స్వీకరింపకపోతే నీకు పుణ్యం లభించదు. కాబట్టి సాధువుల కొరకై చక్కని ఆహారం, భూరిదక్షిణలు గల యాగాల ననుష్ఠించు. దానకర్మచేతనే నీవు యజ్ఞాలు చేసినట్లు, దానపుణ్యాన్ని పొందినట్లు భావించుకో ! యజ్ఞాలు చేసే వారిని పూజించు. నీకు కూడా యజ్ఞఫలంలో భాగం లభిస్తుంది.

పండితులకు దానం చేయటం వలన, వారిని పూజించటం వలన యజ్ఞఫలంలో భాగం దొరుకుతుంది యజ్ఞ కర్తలకూ, పండితులకూ చేసిన దానం పుణ్యలోకాలను కలిగిస్తుంది. జ్ఞానదాతలకు దానం చేస్తే జ్ఞానదాన ఫలంలో భాగం లభిస్తుంది.

అందరికీ ఉపకారం చేసేవారూ సంతానవంతులు అయిన బ్రాహ్మణులను పోషిస్తే, దాని ఫలంతో ప్రజాపతివలె సంతానవంతుడు అవుతాడు. సమస్త సద్ధర్మాలను వర్ధిల్లజేసే సత్పురుషులను సర్వస్వాన్నీ అర్పించి అయినా భరించాలి. ఆ నరులే రాజుకు ఎంతో ఉపకరించేవారు. యుధిష్ఠిరా! నీవు సమృద్ధి గలవాడవు. కాబట్టి బ్రాహ్మణులకు ఆవులను, ఎద్దులను, అన్నాన్ని, గొడుగును, వస్త్రాలను చెప్పులను దానం చెయ్యి. భారతా ! యాగాలను అనుష్ఠించేవారికి నేయి, అన్నం, గుర్రాలతో పాటు రథాలు, ఇళ్ళు, శయనాలు - కల్పించు. ఇవి రాజుకు తేలికయిన విషయాలు. పైగా సమృద్ధిని పెంచేవి. నిందింపదగిన ఆచరణలేని బ్రాహ్మణులు జరుగుబాటు లేక కష్టాలు పడుతుంటే వారిని గురించి తెలిసికొని రహస్యంగా అయినా బహిరంగంగా అయినా జరుగుబాటు కల్పించి రక్షించాలి. క్షత్రియులు ఆ పనిని రాజసూయ - అశ్వమేధ యాగాల ద్వారా చేయుటయే శ్రేయస్కరం. అలా చేసి పాపవిముక్తిని పొంది నీవు పవిత్రుడవై స్వర్గాన్ని పొందగలవు. కోశాన్ని సమీకరించి దానితో నీవు రాజ్యాన్ని రక్షిస్తే మరుసటి జన్మలో ధనాలు, బ్రాహ్మణత్వం లభిస్తాయి. భారతా! నీ వృత్తినీ, ఇతరుల వృత్తినీ సంరక్షించు. నీ సేవకులను, ప్రజలను కన్నబిడ్డలలె

పరిపాలించు. భారతా! బ్రాహ్మణులకు లేనిదానిని కల్పించటం, ఉన్నదానిని కాపాడటం నీ నిత్య కర్తవ్యం. వారికోసమే నీ జీవితం నడవాలి. వారినెప్పుడూ నిర్లక్ష్యం చేయవద్దు. బ్రాహ్మణుల దగ్గర చాలా ధనం ప్రోగుపడటం వారికి అనర్థహేతువే. లక్ష్మితో నిరంతర సహవాసం వారిలో దర్పాన్ని, మోహాన్ని పెంచుతుంది. బ్రాహ్మణులు మోహానికి లోనయితే ధర్మనాశనం తప్పక జరుగుతుంది. ధర్మం నశిస్తే ప్రాణులన్నీ నశిస్తాయి. సంశయం లేదు.

ప్రజల నుండి పన్నులరూపంలో వసూలుచేసిన ధనాన్ని కోశాగార రక్షకులకిచ్చి దాచుకొని, యజ్ఞంకోసం రాజ్యప్రజలనుండి ధనాన్ని తెమ్మని ఆదేశించి, రాజ్యాన్ని దోచుకున్నా ఆయన ఆదేశాన్ని అనుసరించి ప్రజలు తీవ్రంగా భయపడి ధనమిస్తే దానితో రాజు యాగాలు అనుష్ఠించినా, సజ్జనులు దానిని ప్రశంసించరు. అధికధనవంతులు ఏ ఒత్తిడి లేకుండా, సానుకూలదృష్టితో ఇచ్చిన డబ్బుతో కానీ, మరేదైనా అటువంటి మృదువైన ఉపాయంతో సమకూర్చిన ధనంతో కానీ యాగం చేయాలి. పీడించి తెచ్చిన డబ్బుతో కాదు. రాజు యధావిధిగా పట్టాభిషేకాన్ని పొంది, రాజసింహాసనంపై కూర్చున్న తరువాత భూరిదక్షిణలతో మహాయజ్ఞాలు చేయాలి. వృద్ధులు, బాలురు, గ్రుడ్డివారు, దీనుల ధనాన్ని రాజు కాపాడాలి. చెలమలతో బ్రతుకు వెళ్లదీస్తుంటే వారి నుండి పన్ను తీసికొనరాదు. కష్టాలలో ఉన్న స్త్రీ ధనాన్ని గ్రహించరాదు. దీనుల ధనాన్ని అపహరిస్తే ఆ పాపం రాజ్యాన్నీ, రాజ సంపదను నశింపజేస్తుంది. అందువలన రాజు దీనులకు మంచి భోగాలు కల్పించాలి. సజ్జనుల ఆకలిభయాన్ని పోగొట్టాలి. ఎవరో ఒకరి రుచికరాలైన భోజ్యాలవైపు పిల్లలు ఆశగా చూస్తుంటారు. కాని ధర్మబద్ధంగా తినటానికి వారికి వీలు లేదు. అంతకన్నా పాపం ఆ యజమానికేముంటుంది ? ఒకవేళ నీ రాజ్యంలో పండితుడైన బ్రాహ్మణుడు ఆ రీతిగా ఆకలితో బాధపడితే భ్రూణహత్యాపాపాన్ని పొందుతావు. అంతేగాక మహాపాపం చేసినవారు పొందే గతులు పొందుతావు. శిబి చక్రవర్తి చెప్పాడు - ఏ రాజు రాజ్యంలో బ్రాహ్మణుడు కానీ మరో మనుష్యుడు కానీ ఆకలితో బాధపడితే ఆ రాజు జీవితం అసహ్యించుకొనదగినది.

ఏ రాజురాజ్యంలో స్నాతకుడైన బ్రాహ్మణుడు ఆకలితో బాధపడతాడో ఆ రాజ్యంలో అభివృద్ధి ఆగిపోతుంది. అంతేగాక అది శత్రువుల చేతిలోనికి వెళుతుంది. ఏ రాజు రాజ్యంలో బలపూర్వకంగా ఆడవాళ్ళను - వారు ఏడుస్తున్నా పట్టించుకోకుండా అపహరిస్తుంటే, ఆమె భర్త కుమారులు ఆక్రోశిస్తుంటే ఆ రాజే జీవన్మృతుడు. ప్రజలను

రక్షించకుండా, వారిని దోచుకొంటూ నడిపించే మంత్రులు కూడా లేని రాజు రాజరూపంలో ఉన్న కలిపురుషుడు. అటువంటి క్రూరుని ప్రజలు బంధించి చంపుతారు. **నేను మీకు రక్షకుడను. అని మాట ఇచ్చి కూడా ప్రజలను రక్షించని రాజును అందరూ కలిసి రోగిష్ఠియై పిచ్చెక్కిన కుక్కను చంపినట్టు చంపాలి. రాజరక్షణ లేని ప్రజలు కొంచెం పాపం చేసినా దానిలో నాలుగవ భాగం ఆ రాజుకు చెందుతుంది.** కొందరు పాపం మొత్తం రాజుకే చెందుతుంది అన్నారు. కొందరు అర్ధభాగం రాజుది అన్నారు. మనువు అనుశాసనాన్ని అనుసరించి నాలుగో భాగమే రాజుకు చెందుతుందని నా అభిప్రాయం. రాజరక్షణలో ఉన్న ప్రజలు శుభకర్మలు చేసినా వాటి పుణ్యంలోని నాలుగవ భాగం రాజుకు చెందుతుంది. పరంతపా! యుధిష్ఠిరా! ప్రాణులన్నీ మేఘాల అండతో జీవించినట్టు, పక్షులు, పెద్దచెట్టు నీడలో జీవించినట్లు రాక్షసులు కుబేరుని, దేవతలు ఇంద్రుని ఆశ్రయించి జీవించినట్లు ప్రజలందరూ, మిత్రులు, దాయాదులు నీవు జీవించి ఉండగా నీ అండలో జీవించగలగాలి.

62. ఇంద్ర బృహస్పతి సంవాదము

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "ఇది దానం చేయాలి. ఇది దానం చేయాలి. అంటూ ఆదరపూర్వకంగా శ్రుతివాక్యాలు రాజు లివ్వవలసిన దానాలనెన్నింటినో చెప్తున్నాయి. వాటిలో ఏ దానముత్తమం ? భీష్ముడు చెప్తున్నాడు. అన్నిదానాల కన్నా పృథివీదానం గొప్పది. భూమి అచలం, అక్షయం. అది ఈ లోకంలో ఉత్తమభోగాల నన్నింటినీ ఇస్తుంది. భూమి వస్త్రాలను, రత్నాలను, పశువులను, ధాన్యాన్ని, యవలను ఇస్తుంది. భూదానం చేసిన మనిషి సదా సమస్త ప్రాణులను మించి వర్ధిల్లుతాడు. భూమి ఉన్నతకాలం భూదానం చేసినవాడు వృద్ధినందుతాడు. యుధిష్ఠిరా! భూదానాన్ని మించిన గొప్పదానమేదీ ఉండదు. పృథివిని స్వల్పంగా నైనా దానం చేసిన జనులందరూ భూదాన ఫలాన్ని పూర్తిగా పొంది, అనుభవిస్తారని విన్నాను. నరులు ఇహపరాలలో తాము చేసిన కర్మఫలాన్నే అనుభవిస్తారు. భూమి ఐశ్వర్యరూపమైన మహాదేవి. దాతను తన కిష్టునిగా చేసికొంటుంది. రాజసత్తమా! అక్షయమైన ఈ భూమిని దానం చేసినవాడు మరుజన్మలో మనుష్యుడుగా పుట్టి భూపతి కాగలడు. దానాన్ని బట్టి భోగముంటుందని ధర్మశాస్త్ర నిర్ణయం. రణభూమిలో శరీరాన్ని విడవటం, ఈ భూమిని దానం చేయటం - ఈ రెండు క్షత్రియులకు పరమ సంపదలను కల్గిస్తాయంటారు. దానరూపంగా ఇవ్వబడిన పృథివి దాతను పవిత్రుని

చేస్తుందని విన్నాం. ఎంత పాపపుపనులు చేసినా - బ్రహ్మహత్య అసత్యవాదనమైనా సరే - ఆ భూమియే పాపప్రక్షాళన చేసి, పాపవిముక్తి కలిగిస్తుంది. **పాపకర్మలు చేసిన రాజులనుండీ అయినా సాధువులు భూదానాన్ని స్వీకరిస్తారు. మరే దానమూ తీసికొనరు. భూమి తల్లివలె పవిత్రమైనది కావటమే దానికి కారణం. ఈ పృథివీ దేవికి సనాతనమైన రహస్యనామం 'ప్రియదత్త', భూదానమివ్వటమైనా, తీసికోవటమైనా దాతకు, ప్రతిగ్రహీతకు ఇష్టమైన పని, అందుకే ఆమె మొదటిపేరు ప్రియదత్త.** ఈ భూమిని విద్వాంసునకు దానం చేసిన పృథివీపతి ఆ దాన ప్రభావంతో మరలా రాజ్యాన్ని పొందుతాడు. లోకంలో అందరికీ భూదానమంటే ఇష్టం. భూదాత పునర్జన్మలో రాజు అంతటివాడు అవుతాడు. సంశయం లేదు. కాబట్టి రాజు రాజ్యపాలన చేస్తూనే బ్రాహ్మణులకు కొంత దానమివ్వాలి. భూమికి యజమాని కానివాడు దానిపై ఎటువంటి అధికారాన్నీ ప్రదర్శించగూడదు. అయోగ్యుని నుండి భూదానం స్వీకరించగూడదు. దానం చేసిన భూమిని తాను ఉపయోగించరాదు. రాబోవు జన్మలలో భూమిని ఆశించే ఇతరులు కూడా ఈ జన్మలో ఇలాగే భూదానం చేయాలి. సంశయం లేదు. సజ్జనుల భూమిని బలవంతంగా పొందినవాడు దానిని అనుభవించలేడు. సాధువులకు భూమిని దానం చేసిన ధర్మాత్ముడు ఇహపరలోకాలలో ఉత్తమ భూమిని పొందగలడు. మహాకీర్తిని కూడా పొందగలడు.

ఒక ఇంటిని నిర్మించటానికి సరిపడిన భూమిని దానం చేసినవాడు అరవైవేల సంవత్సరాలు ఊర్ధ్వలోకాలలో ఉంటాడు. అంతే భూమిని అపహరించినవాడు రెట్టింపు సంవత్సరాలు నరకంలో పడతాడు.

రాజా! సజ్జనులిచ్చిన భూమిని విప్రులు ఎప్పుడూ ప్రశంసిస్తూంటారు. ఆ రీతిగా ఆ భూపతి శత్రువులు భూమిని ప్రశంసించరు. ఏ పురుషుడైనా వృత్తిని కోల్పోయి పాపకర్మలు చేస్తే గోచర్మమంత భూదానం చేస్తే ఆ పాపం ప్రక్షాళితమవుతుంది. రౌద్రకర్మలు చేస్తూ పాపపరాయణులైన రాజులకు పవిత్రతను పొందటానికి భూదానాన్ని మించిన పవిత్రకర్మ లేదు. ప్రాచీనజనులు ఎప్పుడూ ఇలా భావించేవారు. అశ్వమేధయాగం చేసినా, సజ్జనునకు భూదానం చేసినా వీటిమధ్య తేడా స్వల్పమే. ఇతర పుణ్యకర్మలు చేసి ఫలవిషయంలో పండితులు కూడా శంకిస్తే శంకించవచ్చు. కానీ ఉత్తమమైన భూదానం చేస్తే మాత్రం ఫలవిషయంలో శంకింపనవసరం లేదు. మహాబుద్ధిమంతుడు, భూదానం చేస్తాడు. అది బంగారం, వెండి, వస్త్రాలు, మణులు, ముత్యాలు, ధనం ఇవన్నీ ఇచ్చినట్లే. భూదానం చేసినవానికి తపస్సు, యజ్ఞం, పాండిత్యం, శీలం, అలోభం, సత్యసంధత,

గురుపూజ, దైవపూజ, ఇవన్నీ చేసిన ఫలితం లభిస్తుంది. **యజమానికి మేలు చేయదలచి రణభూమిలో మరణించి శరీరత్యాగం చేసేవారు, సిద్ధులై బ్రహ్మలోకాన్ని చేరినవారు భూదానం చేసినవానిని మించిపోలేరు. తల్లి తన కుమారుని నిత్యమూ పాలనిచ్చి పాలించినట్లు, భూమి కూడా భూదానం చేసిన దానిని సర్వరసాలనూ ఇచ్చి అనుగ్రహిస్తుంది.** మృత్యువు కానీ, మృత్యుకింకరుడు కానీ, దండం కానీ, తపస్సు కానీ, బాగా తీవ్రమైన అగ్నికానీ, మహాభయంకర పాశాలు కానీ భూదాతను సమీపించవచ్చు. శాంతచిత్తుడై భూమిని దానం చేసినవాడు పితృలోకంలోని పితరులను, దేవలోకంలోని దేవతలను తృప్తిపరుస్తాడు. దుర్బలుడై, బ్రతుకుతెరువులేక దుఃఖిస్తూ ఆకలిబాధతో మరణిస్తున్న వానికి సాగుభూమిని దానం చేసిన మానవుడు యజ్ఞఫలాన్ని పొందుతాడు. మహాభాగా ! ఆవు వాత్సల్యంతో పొదుగునుండి పాలను స్రవిస్తూ దూడ దగ్గరకు పరుగెత్తినట్టుగానే భూదానం చేసినవాని దగ్గరకు భూమి పరుగెత్తి వస్తుంది. నాగటి కర్రతో దున్నబడి, గింజలు చల్లి, పైరుతో కూడిన భూమిని దానం చేసినవాడు, విశాలభవనాన్ని నిర్మించి ఇచ్చినవాడు కోరికలను పూర్తిచేసికొనగలడు. సత్ప్రవర్తనతో సంపన్నుడు, ఆహితాగ్ని, శుచివ్రతుడు, అయిన బ్రాహ్మణునకు భూదానం చేసిన నరుడు ఎప్పుడూ పెద్ద ఆపదలను పొందడు. చంద్రుడు ప్రతిదినమూ వృద్ధిచెందినట్లు దానం చేసిన భూమిలో ఎన్నిసార్లు పైరు పెరిగితే దాన ఫలంకూడా అన్ని రెట్లు పెరుగుతుంది.

ఈ విషయంలో ప్రాచీన గాథలనెరిగిన పండితులు భూమిగానం చేసిన గాథలను ప్రస్తుతిస్తారు. వాటిని వినియే పరశురాముడు కాశ్యపునకు భూమినంతా ఇచ్చాడు. **ఆగాధ ఇది. "నన్ను దానం చేయండి. నన్ను దానంగా తీసికోండి. నన్ను ఇచ్చి నన్నే పొందండి. ఇక్కడ దానం చేసిందే మరలా ఇహపరలోకాలలో ప్రాప్తిస్తుంది.*** వేదంతో సమానమైన ఈ గాథను శ్రాద్ధకాలంలో గానం చేసిన బ్రాహ్మణుడు బ్రహ్మఫలాన్ని పొందుతాడు. బలవంతమైన కృత్యాలను ప్రయోగించటంతో కలిగే భయాన్ని పోగొట్టగల మహాసాధనం భూదానమే. భూదానంతో ప్రాయశ్చిత్తం చేసికొన్నవాడు ముందు, వెనుకల పదితరాలను పవిత్రం చేయగలడు. అదే రీతిగా వేదవాక్కువంటి ఈ భూమి గాథను అవగతం చేసికొన్నవాడు పది తరాలను పవిత్రం చేయగలడు. సర్వప్రాణులకూ ఉత్పత్తి స్థానం భూమి. అగ్ని దీనికి అధిష్ఠానదేవత. **రాజుకు పట్టాభిషేకం జరగగానే ఈ**

---

* మామేవాదత్త మాం దత్త మాం దత్త్వా మామవాప్స్యథ ।
అస్మిల్లోకే పరే చైవ తద్ దత్తం జాయతే పునః ॥ 35

ఆగమాన్ని వినిపించాలి. దీనిని విని భూదానానికి సిద్ధపడతాడు. సాధువుల కిచ్చి ఉన్న భూమిని తిరిగి తీసికోడు. ఈ విషయమంతా బ్రాహ్మణులకోసం, క్షత్రియుల కోసం కూడా. రాజు ధర్మనిపుణుడు కావాలి. అదియే ప్రజావైభవానికి అవసరమైన ప్రథమలక్షణం. రాజు అధర్మజ్ఞుడు, నాస్తికుడు అయితే ఆ రాజ్యంలోని ప్రజలు సుఖంగా నిదురించలేరు. సుఖంగా మేల్కొనలేరు. ఆ రాజు చేసే దుశ్చర్యలవలన ఎప్పుడూ ఉద్వేగంతో జీవిస్తారు. యోగక్షేమాలు ఎన్నో ఆ రాజ్యంలో అడుగుపెట్టవు. ఆ ప్రజల రాజు ప్రాజ్ఞుడు, ధార్మికుడు అయితే ఆ ప్రజలు సుఖంగా నిదురిస్తారు. సుఖంగా మేల్కొంటారు.

ఆ రాజు శుభంగా రాజ్యం చేయటం వలన, శుభకర్మలు చేయటం వలన ప్రజలు ఆనందిస్తారు. యోగక్షేమాలతో, చక్కని వానలతో తమ శుభకర్మలతో ప్రజలు వర్ధిల్లుతారు. భూదానం చేసినవాడే కులీనుడు, పురుషుడు, బంధువు, పుణ్యాత్ముడు, దాత, పరాక్రమశాలి కూడా. వేదవేత్త అయిన బ్రాహ్మణునికి విశాలభూమిని దానం చేసిన మానవులు తమ తేజస్సుతో లోకంలో ఆదిత్యులవలె ప్రకాశిస్తారు. నేలపై చల్లిన గింజలు పైరుగా మొలకెత్తినట్లు భూదానంచేత ఆర్జించుకున్న పుణ్యంతో కోరికలు సఫలమవుతాయి. భూదానం చేసిన వానిని ఆదిత్యుడు, వరుణుడు, విష్ణువు, బ్రహ్మ, చంద్రుడు, అగ్ని, భగవంతుడైన మహేశుడు అభినందిస్తారు పురుషులు భూమినుండి పుడతారు. భూమిలోనే లయిస్తారు. అండజ, జరాయుజ, స్వేదజ, ఉద్భిజరూపమైన చతుర్విధ ప్రాణుల శరీరాలూ పృథివీకార్యాలే. రాజా! ఈ జగత్తుకు తల్లి తండ్రి భూమియే. దీనితో సమానమైన భూతం పంచభూతాలలో మరొకటి లేదు. ఈ విషయంలో కూడా ఇంద్ర బృహస్పతి సంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉటంకిస్తుంటారు.

భూరిదక్షిణలతో వందయాగాలను అనుష్ఠించిన ఇంద్రుడు వాగ్ములలో శ్రేష్ఠుడైన బృహస్పతిని ఇలా అడిగాడు. ఇంద్రుడు అడిగాడు. 'స్వామీ! ఏ దానం చేత దాత స్వర్గాన్ని మించిన ఫలితాన్ని పొందగలడు? అక్షయమై, ఎంతో విలువైన ఆ దానాన్ని గూర్చి చెప్పండి". దేవేంద్రుడు అలా అడగగా దేవపురోహితుడు, మహాతేజస్వి అయిన బృహస్పతి ఇంద్రునితో ఇలా అన్నాడు. "ఇంద్రా! సువర్ణ దానం, గోదానం, భూదానం, విద్యాదానం, కన్యాదానం - ఇవి పాపాన్ని హరించే మహాదానాలు ఈ దానాలు చేసిన మహాప్రాజ్ఞుడు సర్వపాపవిముక్తిని పొందుతాడు. ప్రభూ, దేవేంద్రా! భూదానం కన్నా విశిష్టమైనదీ, గొప్పదీ మరేదీ లేదని భావిస్తున్నాను. బుద్ధిమంతులు అలాగే చెప్పారు.

బ్రాహ్మణుల కోసం, గోవుల కోసం, రాజ్యవినాశనవేళ రాజుకోసం, కులస్త్రీలు అవమానానికి గురి అయినప్పుడు వారి రక్షణకై మరణించినవాడు భూదానం చేసినవాడితో సమానం.

దేవతాశ్రేష్ఠా! యుద్ధానికై ఉబలాటపడేశూరులు యుద్ధంలో మరణించి స్వర్గానికి వెళతారు. కానీ వారెవ్వరూ భూదానం చేసిన వానిని మించలేరు. యజమానికి మేలు చేయదలచి, రణభూమిలో మరణించి, శరీరత్యాగం చేసేవారు, ముక్తులై, బ్రహ్మలోకాన్ని చేరినవారు భూదానం చేసిన వానిని మించిపోలేరు. భూదానం చేసిన మానవుడు తనకుముందు గడచిపోయిన అయిదు తరాలను, భూమిపై పుట్టబోయే ఆరుతరాలను, మొత్తం పదకొండు తరాలనూ ఉద్ధరిస్తాడు. పురందరా! రత్నాలు పరిచిన నేలను దానం చేసిన వాడు సర్వపాపవిముక్తుడై స్వర్గలోకంలో విరాజిల్లుతాడు.

రాజా! సర్వకామగుణాలతో కూడిన విశాలభూమిని దానం చేసినవాడు. పై జన్మలో రాజాధిరాజు కాగలడు. భూదానమే ఉత్తమదానం. ఇంద్రా! సర్వకామాలతో కూడిన భూమిని దానం చేస్తే సర్వప్రాణులు తమను దానం చేస్తున్నట్లే దాతను గూర్చి అనుకొంటాయి. సహస్రాక్షా! కోరికల నన్నింటినీ తీర్చుతూ, మనోభీష్టాలన్నింటితో కూడిన కామధేనువు వంటి భూమిని దానం చేసిన మానవుడు స్వర్గానికి వెళ్ళగలడు. సురేంద్రా! భూదానం చేసిన వానిని పరలోకంలో తేనె, నేయి, పాలు, పెరుగులతో ప్రవహించే నదులు తృప్తిపరుస్తాయి. భూదానం చేసిన రాజు సర్వపాపవిముక్తిని పొందుతాడు. **భూదానాన్ని మించిన దానం మరేదీ లేదు.*** సముద్రపర్యంతమైన భూమిని ఆయుధాలతో జయించి, దానం చేసినవానిని గూర్చి ప్రజలు ఎంతకాలం చెప్పుకొంటారో అంతకాలం ఈ భూమి స్థిరంగా ఉంటుంది. పురందరా! పవిత్రమూ, రససమృద్ధమూ, అయిన భూమిని దానం చేసినవాడు భూదాన గుణాలతో కూడిన అక్షయలోకాలను పొందుతాడు. ఇంద్రా! సతతమూ ఐశ్వర్యాన్నీ, సుఖాన్నీ పొందగోరే రాజు ఎప్పుడూ యథావిధిగా యోగ్యులకు భూదానం చేస్తూనే ఉండాలి. నరుడు పాపం చేసినా బ్రాహ్మణులకు భూదానమిస్తే శిథిలమైన కుబుసాన్ని పాము విడిచినట్లు ఆ దాత పాపాన్ని విడిచిపెట్టగలడు. ఇంద్రా! భూమిని దానం చేసిన నరుడు సముద్రాలనూ, నదులనూ, పర్వతాలనూ, వనాలనూ పూర్తిగా దానం చేసినట్లే.

భూదానం చేసినవాడు చెరువులను, బావులను, సెలయేళ్ళను, సరస్సులను, స్నేహాలను (తైలాలను), సర్వ రసాలను దానం చేసినట్లే. భూమిని దానమిచ్చినవాడు శక్తిమంతాలయిన ఓషధులను, ఫలపుష్ప భరితాలైన వృక్షాలను, వనాలను, రాతినేలను,

* న హి భూమిప్రదానేన దానమన్యద్ విశిష్యతే ॥ 65

పర్వతాలను దానమిచ్చినట్లే. ఇష్టదక్షిణలతో అగ్నిష్టోమం మొదలయిన యాగాలు చేసినా, భూదానం వలన అనుభవించగల ఫలంవంటి ఫలాన్ని పొందలేడు. భూదానం చేసినవాడు పది తరాలను ఉద్ధరిస్తాడు. భూమిని లాక్కొన్న వాడు పదితరాలను పడగొడతాడు. పూర్వీకులిచ్చిన భూమిని తిరిగి తీసికొనేవాడు నరకానికి వెళతాడు. మాటిచ్చి దానమివ్వనివాడు, ఇచ్చి తీసికొన్న వాడు మృత్యుశాసనం వలన వరుణపాశాలకు చిక్కి బాధలు పడతాడు. ఆహితాగ్ని, నిత్యయజనశీలుడు, అతిథులను ప్రియంగా భావించేవాడు, జరుగుబాటు లేనివాడు అయిన బ్రాహ్మణునకు దానమిచ్చినవారు యముని దగ్గరకు చేరరు. ఇంద్రా! రాజు ఎప్పుడూ బ్రాహ్మణులకు ఋణపడి ఉండకూడదు. ఇతరవర్ణాలలో కూడా దీనులనూ, దుర్బలులనూ ఉద్ధరించాలి. సురశ్రేష్ఠా! జరుగుబాటు లేని బ్రాహ్మణునకు ఇతరులెవరైనా ఇచ్చిన భూమిని ఎప్పుడూ లాగుకొనరాదు. బ్రాహ్మణుల భూమిని అపహరిస్తే, వారు దీనులై దుఃఖిస్తుంటే జారిపడిన కన్నీటిబొట్లు అపహరించిన వాని వంశాన్ని మూడుతరాలవరకు నాశనం చేస్తాయి. సహస్రాక్షా! రాజ్యభ్రష్ఠుడైన రాజును మరల సింహాసనంపై నిలిపినవాడు స్వర్గలోకవాసాన్నీ, అక్కడ మన్ననలను పొందుతాడు. చెరుకు మొక్కలతో నిండి, యవలు, గోధుమల పైరు గలిగి, ఎద్దులు, గుర్రాలు మొదలయిన వాహనాలతో కూడి, లోపల నిధులున్న భూమిని తన బాహుబలంతో సంపాదించి వివిధ రత్నాలతో అలంకరించిన భూమి దానం చేస్తే అక్షయ లోకాలు లభిస్తాయి. ఆ దానాన్ని భూమియజ్ఞమంటారు. భూదానం చేసినవాడు తన పాపాలను పోగొట్టుకొని నిర్మలుడై, సజ్జనుల ఆదరణకు పాత్రుడు కాగలడు. సత్పురుషుల మన్ననలతో లోకంలో విరాజిల్లగలడు. ఇంద్రా! నీటిపై పడిన నూనెబొట్టు విస్తరించినట్లు, భూదానం కూడా పైరుపైరుతో పెరుగుతూ ఉంటుంది. ఇంద్రా! యుద్ధానికే వన్నె తెచ్చే శూరులైన రాజులు రణభూమిలో ముందు నిలిచి, ఎదురుపడి పోరాడుతూ మరణించినవారు బ్రహ్మలోకానికి వెళతారు. దేవేంద్రా! భూదానం చేసినవానిని స్వర్గలోకంలో నృత్యగీతాసక్తులై, దివ్యమాలల నలంకరించుకొన్న స్త్రీలు సేవిస్తారు. యథావిధిగా, చక్కగా బ్రాహ్మణునకు భూమిని దానం చేసినవాడు దేవతలు, గంధర్వుల పూజలందుకొంటూ స్వర్గంలో సుఖిస్తాడు. దేవేంద్రా! భూదానం చేసినవానిని బ్రహ్మలోకంలో దివ్యపుష్పమాలలు అలంకరించుకొన్న వందకొలది అప్సరసలు సేవిస్తారు. భూదానం చేసిన నరునకు పుణ్యఫలంగా శంఖాలు పొదిగిన సింహాసనాలు, గొడుగులు, గొప్ప గుర్రాలు, మంచి వాహనాలు అందుబాటులోనికి వస్తాయి. భూదానంవలన పూలు, సువర్ణనిధులు లభిస్తాయి. మాటకు తిరుగుండదు. జయశబ్దాలు, ధనరత్నాలు కూడా

లభిస్తాయి. ఇంద్రా! భూదానపుణ్యఫలంగా స్వర్గం, బంగారుపూలు పూచే ఓషధులు, బంగారు గడ్డి, దర్భలతో కూడిన భూమి లభిస్తుంది. భూదానం చేసిన పురుషుడు అమృతాన్ని పుట్టించే భూమిని పొందగలడు. భూదానంతో సమానమైన దానం లేదు. తల్లివంటి గురువు లేడు. సత్యతుల్యమైన ధర్మం లేదు. దానంతో సమానమైన నిధి లేదు."

భీష్ముడిలా చెప్తున్నాడు. "బృహస్పతిద్వారా ఆ మాటలు విని ఇంద్రుడు అప్పుడు ధనరత్నాలతో నిండిన భూమిని బృహస్పతికి దానం చేశాడు. శ్రాద్ధ సమయంలో ఈ భూదాన ఫలాన్ని వినిపిస్తే, ఆ శ్రాద్ధ భాగాలను రాక్షసులు కానీ అసురులు కానీ పొందలేరు. పితరుల నిమిత్తంగా చేసిన దానం అక్షయమవుతుంది. దానిలో సంశయంలేదు. కాబట్టి విద్వాంసుడు శ్రాద్ధకర్మలలో భుజించే సమయంలో భోక్తలకిది వినిపించాలి. అనఘా! భరతశార్దూలా! ఈ రీతిగా సర్వదానాలలో శ్రేష్ఠమైన భూదానాన్ని గూర్చి నీకు చెప్పాను. ఇంకా ఏం వినాలనుకొంటున్నావు ?"

63. అన్నదాన ప్రశంస.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. భరతసత్తమా ! గుణోన్నతులైన విప్రులకు దానాలు చేయదలచిన రాజు ఈ లోకంలో ఏ దానాలు చేయాలి? మహాబాహూ! ఏమిస్తే వారు వెంటనే ఆనందిస్తారు? ఆనందించి ఏమిస్తారు? దానంవలన కలిగే పుణ్యంతో ఏ మహాఫలాన్ని పొందవచ్చో నాకు చెప్పు. రాజా! ఇహపరలోకాలలో ఏ దానం ఫలవంతమవుతుంది? నీవు చెపితే వినాలనుకొంటున్నాను. నాకు వివరంగా చెప్పు."

భీష్ముడు చెప్తున్నాడు. "గతంలో నేను దేవదర్శనం గల నారదుని ఈ విషయమే అడిగాను. ఆయన నాకు చెప్పిన మాట చెపుతాను విను. "దేవతలు, ఋషిగణాలు అన్నదానాన్నే ప్రశంసిస్తారు. లోకతంత్రమూ, బుద్ధిచైతన్యమూ అంతా అన్నంలోనే ప్రతిష్ఠితమై ఉంది. అన్నదానంతో సమానమైనది గతంలో లేదు, ఇక ఉండబోదు కూడా. అందువలననే మానవులు విశేషంగా అన్నదానాన్నే చేయగోరుతుంటారు. లోకంలో అన్నమే బలవర్ధకం. ప్రాణాలు అన్నంమీదనే ఆధారపడి ఉంటాయి. ప్రభూ! ఈ జగత్తునంతటినీ అన్నమే ధరిస్తుంది. ఈ లోకంలో గృహస్థులైనా, వానప్రస్థులైనా, సన్యాసులైనా అన్నంతోనే జీవిస్తారు. అన్నంతోనే ప్రాణరక్షణ జరుగుతుంది. ఇది కంటికి కనిపించే విషయమే. సంశయం లేదు. ఐశ్వర్యవంతుడు కాగోరినవాడు అన్నంకోసం ఇబ్బంది పడుతున్న బ్రాహ్మణగృహస్థునకు,

మహాత్ముడైన సన్యాసికి అన్నదానం చేయాలి. అన్నార్థి అయిన యోగ్యబ్రాహ్మణునకు అన్నదానాన్ని చేసినవాడు పరలోకంలో తనకై శ్రేష్ఠనిధిని దాచుకొన్నట్లే. యోగ్యుడు, వృద్ధుడు అయిన బాటసారి దారిలో అలసిపోయి ఇంటికి వస్తే, సంపదలనాశించే గృహస్థుడు అతనిని ఆదరించాలి. రాజా! ఎగిసిపడేకోపాన్ని నిగ్రహించి, మాత్సర్యాన్ని పరిత్యజించి, మంచి నడవడితో అన్నదానం చేసినవాడు ఇహపరలోకాలలో సుఖిస్తాడు.

ఇంటికివచ్చినవానిని హేళన చేయగూడదు. ఎప్పుడూ దుర్భాషలాడరాదు. చండాలునకు, కుక్కకు ఇచ్చిన దానమైనా ఎప్పుడూ వ్యర్థంకాదు. ఆర్తుడైన బాటసారికి తాను అపరిచితుడైనా ప్రసన్నభావంతో అన్నదానం చేసినవాడు మహాధర్మఫలాన్ని పొందుతాడు. జనాధిపా! పితరులను, దేవతలను, ఋషులను, బ్రాహ్మణులను, అతిథులను అన్నంతో తృప్తిపరచిన నరుడు మహాపుణ్యఫలాన్ని పొందుతాడు. పరమ పాపకర్మ చేసి కూడా యాచకునకు, విశేషించి బ్రాహ్మణునకు అన్నదానం చేసినవాడు ఆ పాపకారణంగా మోహానికి లోనుగాడు. బ్రాహ్మణులకు అన్నదానం చేస్తే అక్షయఫలం ప్రాప్తిస్తుంది. శూద్రులకు చేసిన అన్నదానం మహాఫలాన్ని ఇస్తుంది. అన్నదానం బ్రాహ్మణునకైనా కావచ్చు. శూద్రునకైనా కావచ్చు. విశేష ఫలప్రదమే. బ్రాహ్మణుడు అన్నానికై యాచిస్తే గోత్రం, శాఖ, అధ్యయనం, – దేశం – ఇవేవీ అడగరాదు. ఆ యాచకునకు వెంటనే అన్నం పెట్టాలి. అన్నదానం చేసిన రాజుకు అన్నవృక్షాలు ఇహపరలోకాలలో మనస్సులో కోరిన ఫలితాలనన్నింటినీ ఇవ్వగలవు. ఈ విషయంలో సంశయం లేదు. కర్షకులు మంచివానలను ఆశించినట్లు పితరులు కూడా 'మన కుమారుడో, మనుమడో అన్నదానం చేయకపోతాడా' అని ఎదురుచూస్తుంటారు. బ్రాహ్మణుడు గొప్ప ప్రాణి. అటువంటివాడు "దేహి" అని స్వయంగా యాచిస్తే సకామంగా అయినా, నిష్కామంగా అయినా అన్నదానం చేస్తే పుణ్యాన్ని పొందుతాడు. బ్రాహ్మణుడు సర్వప్రాణులకూ అతిథి. అందరికన్నా ముందుగా భుజింపదగినవాడు. బ్రాహ్మణుడు నిత్యమూ ఏ ఇంటికి భిక్షకు వెళ్ళి, సత్కారాన్ని పొంది తిరిగి వెళతాడో ఆ ఇంట సంపత్తి అధికమవుతుంది. భారతా! మరణానంతరం మహాభాగుల వంశంలో జన్మిస్తాడు. ఈ లోకంలో అన్నం, ఉత్తమస్థానం, మిష్టాన్నం (తీపి అన్నం) నిత్యమూ దానం చేసినవాడు స్వర్గలోకంలో సత్కృతుల నందుతూ నివసిస్తాడు.

నరులకు అన్నమే ప్రాణం. అన్నింటి ప్రతిష్ఠ అన్నంలోనే ఉంది. అన్నదానం చేసినవాడు పశువులను, పుత్రులను, ధనాన్ని, భోగాలను, ప్రాణాలనూ పొందుతాడు. అలాగే రూపవంతుడవుతాడు. రాజా! ఈలోకంలో అన్నదానం చేసినవాడు ప్రాణదాత,

సర్వస్వదాత అవుతాడు. అతిథిగా వచ్చిన బ్రాహ్మణునకు యథావిధిగా అన్నదానం చేస్తే, దాత సుఖాన్ని పొందుతాడు. దేవతల పూజలు కూడా అందుకొంటాడు. యుధిష్ఠిరా! బ్రాహ్మణుడు గొప్ప ప్రాణి. ఉత్తమ క్షేత్రం. అక్కడ నాటిన గింజ మహా పుణ్యఫలాన్ని ఇస్తుంది. అన్నదానం భోక్తకు, దాతకు ప్రత్యక్షఫలంగా ఆనందాన్ని కలిగిస్తుంది. ఇతరదానాలన్నీ పరోక్షంగా ఫలితాల నిచ్చేవే! భారతా! అన్నం నుండియే సంతానోత్పత్తి. అన్నం నుండియే కామసిద్ధి. అన్నం నుండియే ధర్మార్థ సిద్ధి. అదేరీతిగా అన్నం ద్వారానే రోగనాశనం. పూర్వకాలంలో ప్రజాపతి అన్నమే అమృతమన్నాడు. అన్నమే భూమి, స్వర్గం, ఆకాశం కూడా. అన్నింటికీ అన్నమే ఆధారం. అన్నం లేకపోతే శరీరంలోని అయిదు ధాతువులు నశిస్తాయి. అన్న హానివలన బలవంతుల బలంకూడా నశిస్తుంది నరోత్తమా! అన్నం లేకపోతే విందులు, వివాహాలు, యజ్ఞాలు నిలిచిపోతాయి. వేదం కూడా నశిస్తుంది. స్థావర జంగమరూపమైన జగత్తు – ఇదంతా అన్నంమీదనే ఆధారపడి ఉంది. అందువలన మూడు లోకాలలోను ధర్మసిద్ధికై బుద్ధిమంతులు అన్నదానం చేయాలి.

రాజా! అన్నదానం చేసే మనుష్యునకు బలమూ, ఓజస్సు, యశస్సు, కీర్తి మూడులోకాలలోనూ ఎప్పుడూ వర్ధిల్లుతుంటాయి. భారతా! ప్రాణపతి అయిన పవనుడు మేఘాలపై భాగంలో ఉంటాడు. ఆ మేఘాలలోని జలాన్ని ఇంద్రుడు కురిపిస్తాడు. సూర్యుడు తన కిరణాలతో భూమిలోని రసాలను గ్రహిస్తాడు. వాయుదేవుడు సూర్యుని నుండి వాటిని గ్రహించి రసవృష్టి కురిపిస్తాడు. భారతా! మేఘం నుండి ఆ జలం నీటిపై పడినప్పుడు భూదేవి చెమ్మగిల్లుతుంది. దానితో పైరులు మొలకెత్తుతాయి. వాటితో జగత్తు నడుస్తుంది. ఆ అన్నం నుండియే మాంసం, మేదస్సు, ఎముకలు, వీర్యం ఉద్భవిస్తాయి. రాజా! ఆ వీర్యం నుండి ప్రాణులు పుడతాయి. ఈ రీతిగా అగ్ని, సోముడు ఆ శుక్రాన్ని సృష్టించి, వర్ధిల్లజేస్తారు. ఈ రీతిగా అన్నం నుండి పుట్టిన ఒకేరాశి సూర్యుడు, పవనుడు, వీర్యం, ఆ రాశినుండి జనిస్తాయి. భరతర్షభా! అర్థియై ఇంటికివచ్చిన అభాగ్యతునకు అన్నం పెట్టినవాడు ప్రాణులకు ప్రాణాలనూ, తేజస్సునూ దానమిచ్చినట్లే."

రాజా! నారదుడు అలా చెప్పగా నేను ఎప్పుడూ అన్నదానం చేస్తున్నాను. కాబట్టి నీవు కూడా అసూయనూ, చింతనూ వీడి అన్నదానం చేయి. రాజా! తగిన బ్రాహ్మణులకు యథావిధిగా అన్నదానం చేసి, తత్ఫలితంగా స్వర్గాన్ని పొందగలవు. అన్నదానంవలన పొందగల లోకాలను గురించి చెపుతా వినుము. స్వర్గంలో ఆ మహాత్ముల భవనాలు ఉజ్జ్వలంగా ఉంటాయి. ఆ భవనాలు అనేక స్తంభాలతో కూడి, తారలవలె

ఉజ్జ్వలంగా ఉంటాయి. చంద్రమండలం వలె శుభ్రంగా ఉంటాయి. చిరుగంటల జాలరులతో శోభిస్తాయి. అవి బాలసూర్యకాంతితో ప్రకాశిస్తాయి. కొన్ని భవనాలు, స్థావరాలు. కొన్ని విమానాలవలె చరాలు. వాటిలో వందల కొలది అంతస్తులుంటాయి. లోపల జలాశయాలు, వాటిలో జలచరాలు ఉంటాయి. ఆ భవనాలు వైడూర్యాలతో కూడిన సూర్యునివలె ప్రకాశిస్తుంటాయి. బంగారంతో, వెండితో వాటిని నిర్మిస్తారు. ఆ భవనాలలోని చెట్లు సర్వకామఫలాలను ఇస్తాయి. ఆ భవనాలలో బావులు, వీథులు, సభామండపాలు, బావులు, దిగుడు బావులు, చక్కని ధ్వని గలిగి గుర్రాలు పూన్చిన వేలకొలది రథాలు ఉంటాయి. భక్ష్యాలు, భోజ్యాలరాసులు, వస్త్రాలు, ఆభరణాలు, ఉంటాయి. అక్కడ నదులలో పాలు ప్రవహిస్తాయి. అక్కడ అన్న పర్వతాలు లభిస్తాయి. అక్కడ తెల్లటి మేఘాలవలె ప్రకాశించే భవనాల్లు, బంగారు పడకలు ఉంటాయి. అన్నదాతలు వాటిని పొందుతారు. కాబట్టి అన్నదానం చేయి. అన్నదానం చేసే మహాత్ములకు ఈ పుణ్యలోకాలన్నీ లభిస్తాయి. కాబట్టి ఈ లోకంలో మానవులు ప్రయత్నపూర్వకంగా **అన్నదానం** చేయాలి."

64. నక్షత్ర యోగదానము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "అన్నదాన విధికి సంబంధించిన తమ మాటను విన్నాను. ఇప్పుడు ఏ నక్షత్రవేళలో ఏ దానాలను చేయాలో నాకు చెప్పండి." భీష్ముడు చెప్తున్నాడు. "ఈ విషయంలో కూడా నారదమహర్షికి దేవకికి మధ్య జరిగిన సంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉటంకిస్తుంటారు. దేవదర్శనానికై నారదుడు ద్వారకకు వచ్చినప్పుడు ధర్మదృష్టిగల ఆయనను దేవకి ఈ విషయాన్నే అడిగింది. రాజా! ఆమె ఆ రీతిగా ప్రశ్నించగా దేవర్షి అయిన నారదుడు యథావిధిగా అంతా చెప్పాడు. దానిని విను.

నారదుడు చెప్తున్నాడు. "మహాభాగా! కృత్తికా నక్షత్రంలో నేతిపాయసంతో సజ్జనులైన బ్రాహ్మణులను తృప్తిపరచిన వాడు ఉత్తమలోకాలను పొందుతాడు. రోహిణీ నక్షత్రంలో పండిన పండ్ల గుజ్జును, అన్నాన్ని, నేతిని, పాలను, పానీయపదార్థాలను బ్రాహ్మణులకు దానం చేయాలి. దీనితో బ్రాహ్మణ ఋణం తీరుతుంది. మృగశిరా నక్షత్రకాలంలో పాడి ఆవును దూడతోపాటు దానం చేస్తే మరణానంతరం ఈ లోకంనుండి సర్వోత్తమమైన స్వర్గలోకానికి వెళతారు. ఆర్ద్రా నక్షత్రంలో ఉపవాసం చేసి, నువ్వులతో కలిపిన పొంగలిని దానం చేసిన నరుడు, దాటరాని కష్టాలను కత్తివాదరవంటి పర్వతాలను కూడా అతిక్రమించగలడు. పునర్వసు నక్షత్రంలో అప్పాలను, అన్నాలను దానంచేస్తే,

ఉత్తమ వంశంలో పుట్టి రూపసంపన్నుడై, కీర్తిమంతుడై విరివిగా అన్నాన్ని పొందుతాడు. పుష్యనక్షత్రంలో బంగారాన్ని కానీ, బంగారు ఆభరణాలను కానీ దానం చేసినవాడు వెలుగులేని లోకాలలో కూడా చంద్రునివలె విరాజిల్లగలడు. ఆశ్లేషా నక్షత్రంలో వెండిని కానీ, ఎద్దును కానీ దానం చేసినవాడు సర్వభయాల నుండి విముక్తిని పొంది రాబోయే జన్మలో ఉత్తమ వంశంలో పుడతాడు.

మఘా నక్షత్రంలో, నువ్వులతో నింపి మట్టి మూకుళ్ళు దానమిచ్చిన మానవుడు, ఇహలోకంలో పశుపుత్ర సంపన్నుడవుతాడు. మరణానంతరం ఆనందమనుభవిస్తాడు. పూర్వఫల్గునీ నక్షత్రంలో ఉపవాసముండి, బ్రాహ్మణులకు వెన్నతో భక్ష్యాలను దానం చేస్తే సౌభాగ్యవంతుడు కాగలడు. ఉత్తర ఫల్గునీ నక్షత్రంలో యథావిధిగా నేయి, పాలతో కూడిన సట్టికల (అరవై రోజులలో పండే వరి) అన్నాన్ని దానం చేసినవాడు స్వర్గలోకంలో సమాదరణ పొందగలడు. ఉత్తరానక్షత్రంలో నరులు ఏదానం చేసినా అది అనంతమైన మహాఫలాన్ని ఇస్తుందని శాస్త్ర నిశ్చయం. హస్తా నక్షత్రంలో ఉపవాసముండి ధ్వజమూ, పతాకమూ, చాందినీ, కింకిణులు గల ఏనుగురథాన్ని దానం చేసినవాడు పవిత్రకామనలతో కూడిన ఉత్తమలోకాలను పొందగలడు. భారతా! చిత్తా నక్షత్రంలో ఎద్దును, పుణ్యగంధాలను దానం చేసినవాడు అప్సరోలోకంలో చరిస్తాడు. అక్కడ క్రీడిస్తాడు, ఆనందిస్తాడు కూడా. స్వాతీ నక్షత్రంలో తనకు అత్యంతమూ ప్రియమైన ధనాన్ని దానం చేస్తే ఇహలోకంలో మహా కీర్తినీ, పరలోకంలో శుభలోకాలనూ పొందుతాడు. విశాఖానక్షత్రంలో ఎద్దును, పాలనిచ్చే ఆవును, ధాన్యంతో, వస్త్రాలతో, రెండవకాడితో కూడిన శకటాన్ని దానం చేస్తే పితరులను దేవతలను తృప్తిపరుస్తాడు. మరణానంతరం అక్షయ లోకాలను పొందుతాడు. బ్రతికి ఉన్నప్పుడు కష్టాలు పొందడు. చివరగా స్వర్గలోకానికి వెళతాడు. పైన చెప్పిన రీతిగా విప్రులకు దానం చేసినవాడు తన కిష్టమైన వృత్తిని పొందగలడు. లేశమాత్రంగా కూడా నరకాదులను పొందడని నిశ్చయం. అనురాధా నక్షత్రంలో ఉపవసించి, మంచి అన్నాన్ని, కంబళిని దానం చేసిన నరుడు వందల యుగాల వరకు స్వర్గలోకంలో విరాజిల్లుతాడు. జ్యేష్ఠానక్షత్రంలో బ్రాహ్మణులకు కాలానికి తగిన కూరగాయలను, ముల్లంగిని దానం చేసిన మనిషి, కోరిన సమృద్ధిని ఇష్టవృత్తిని పొందగలడు.

మూలా నక్షత్రంలో ఏకాగ్రచిత్తంతో విప్రులకు పనసపండును దానం చేసినవాడు పితరులను తృప్తిపరుస్తాడు. ఇష్టగతిని పొందుతాడు. పూర్వాషాఢా నక్షత్రంలో ఉపవసించి కులీనుడు, సదాచార సంపన్నుడు, వేద పారగుడు అయిన బ్రాహ్మణునకు పెరుగుపాత్రలనిచ్చిన

పురుషుడు మరుజన్మలో ఎంతో గోధనం గల వంశంలో జన్మిస్తాడు. ఉత్తరాషాఢా నక్షత్రంలో కలశంతో పానకద్రవ్యాన్ని, నేతిని, ఎక్కువ వెన్నను దానంచేసినవాడు అభీష్టాల నన్నింటిని పొందగలడు. అభిజిత్ నక్షత్రంలో ధర్మతత్పరుడైన మనిషి తేనెతో, నేతితో నిండిన పాలను పండితులకు దానం చేస్తే స్వర్గలోకంలో విరాజిల్లుతాడు. శ్రవణ నక్షత్రంలో వస్త్రంలో చుట్టిన కంబళిని దానం చేసినవాడు తెల్లని విమానంలో తెరచి ఉంచిన స్వర్గంలోనికి ప్రవేశిస్తాడు. ధనిష్ఠా నక్షత్రంలో ఏకాగ్రతతో ఎడ్లబండిని వస్త్రాల సమూహాలను, ధనాన్ని దానం చేసినవాడు మరణానంతరం (మరు జన్మలో) రాజ్యాన్ని పొందుతాడు. శతభిషా నక్షత్రంలో అగురు చందనాలతో పాటు గంధాలను దానం చేస్తే, మరణానంతరం అప్సరస్సాంగత్యాన్ని శాశ్వత గంధాలను పొందవచ్చు. పూర్వభాద్రపదా నక్షత్రంలో కారు మినుములు (లేదా అలచందలు) దానం చేసి, మరణానంతరం సర్వవిధ భక్ష్య పదార్థాలను పొంది సుఖించవచ్చు. ఉత్తరాభాద్రపదా నక్షత్రంలో ఔరభ్రఫలం (తగిరిస) గుజ్జును దానం చేసినవాడు పితరులను ఆనందింపజేస్తాడు. మరణానంతరం అక్షయ లోకాలను పొందుతాడు. రేవతీ నక్షత్రంలో కంచుపాత్రతో సహా ధేనువును దానం చేస్తే, ఆ ధేనువు దాతమరణానంతరం సర్వకామాలతో పరలోకంలో దాతను సేవిస్తుంది. ఆశ్వినీ నక్షత్రంలో గుర్రాలు పూన్చిన రథాన్ని దానం చేసిన నరోత్తముడు మరుసటి జన్మలో తేజస్వియై ఏనుగులతో, గుర్రాలతో, రథాలతో సంపన్నమైన వంశంలో పుడతాడు. భరణీ నక్షత్రంలో బ్రాహ్మణులకు తిలధేనువును ఇచ్చి, నరుడు ఈ లోకంలో ఎన్నో ఆవులను, మరణానంతరం కీర్తినీ పొందుతాడు". భీష్ముడు చెప్తున్నాడు. "ఈ రీతిగా ఆయా నక్షత్రాలలో చేయదగిన దాన లక్షణాన్ని, ఉద్దేశాన్ని నారదుడు దేవకికి చెప్పాడు. ఆమె దీనిని తన కోడళ్ళకు చెప్పింది."

65. సువర్ణాదిదాన మహిమ.

భీష్ముడు చెప్తున్నాడు. "సువర్ణదానం చేసినవారు అన్ని కోరికలను తీర్చినట్లే అని పితామహుకుమారుడైన అత్రిభగవానుడు చెప్పాడు. అంతేకాక సువర్ణదానం పవిత్రమూ, ఆయుర్వృద్ధి కరమూ, పితరులకూ అక్షయ సుఖకరమూ అని హరిశ్చంద్ర చక్రవర్తి శ్లాఘించాడు. జలదానమే మహాదానమని మనువు చెప్పాడు. కాబట్టి బావులను, దిగుడుబావులను, చెరువులను త్రవ్వించాలి. ఎల్లప్పుడూ మంచి ఊట కలిగి అందరికీ ఉపయోగపడే బావి పురుషుడు చేసిన పాపకర్మలో సగాన్ని హరిస్తుంది. తాను త్రవ్వించిన

చెరువు నీరు ఎప్పుడూ గోవులు, విప్రులు, సాధుజనులు త్రాగుతుంటే తన వంశమంతా తరిస్తుంది. ఎవని చెరువులో గ్రీష్మకాలంలో నీరు ఇంకకుండా నిలిచి ఉంటుందో వాడు ఎప్పుడూ తీవ్రమయిన సంకటస్థితిలో పడడు. నేతిని దానం చేస్తే పూజ్యుడైన బృహస్పతి, పూష, భగుడు, అశ్వినులు, అగ్ని తృప్తిపడతారు. ఈ నేయి ఉత్తమౌషధం. యజ్ఞ ద్రవ్యాలలో శ్రేష్ఠం. రసాలలో ఉత్తమం. ఫలాలలో ఉత్తమఫలం. నిత్యమూ ఫలాలను, కీర్తినీ, పుష్టినీ కోరుకొనేవాడు పవిత్రుడై, జితేంద్రియుడై బ్రాహ్మణులకు నేతిని దానం చేయాలి. ఆశ్వయుజ మాసంలో విప్రులకు నేతిని దానమిస్తే, తృప్తిపడిన అశ్వినీ దేవతలు ఆ దాతకు మంచిరూపాన్ని ఇస్తారు. నేతితో కలిసిన పాయసాన్ని ద్విజులకు దానం చేసిన వాని ఇంటిని ఏ రాక్షసులూ, ఎప్పుడూ ఆక్రమించలేరు. నీటితో నింపి కమండలాలను దానమిచ్చినవాడు ఎప్పుడూ దప్పికతో మరణించడు. అవసరసామగ్రి, అతని దగ్గర ఎప్పుడూ లోపించదు. కష్టాల నతడు పొందడు.

నిత్యమూ పరమశ్రద్ధతో వినయపూర్వకంగా బ్రాహ్మణుల ఎదుట నిలిచి వ్యవహరించిన పురుషుడు దానఫలంలో ఆరవభాగాన్ని పొందుతాడు. రాజేంద్రా! సదాచారవంతులైన బ్రాహ్మణులకు వంటకోసం, తపస్సు కోసం కట్టెలను నిత్యమూ దానమిచ్చిన నరుడు శత్రువుల పైచేయిగా ఉంటాడు. అతని పనులన్నీ ఎప్పుడూ సిద్ధిస్తాయి. మంచి శరీరంతో అతడు ప్రకాశిస్తాడు. అంతేగాక అగ్నిభగవానుడు కూడా నిత్యమూ అతనికి ప్రసన్నుడవుతాడు. అతని పశువులు ఎప్పుడూ అతనిని వీడవు. సంగ్రామంలో గెలుస్తారు కూడా. గొడుగును దానమిచ్చినవాడు పుత్రులను, సంపదను పొందుతాడు. ఎప్పుడు నేత్రవ్యాధి కలుగదు. యజ్ఞఫలాలలో కూడా భాగాన్ని అందుకొంటాడు. ఎండాకాలంలో నయినా, వర్షాకాలంలోనైనా గొడుగును దానమిచ్చిన వానికి మనసులో సంతాపం ఎప్పుడూ కలుగదు. మరీ తీవ్ర సంకటాలనుండి వేగంగా ముక్తిని పొందుతాడు. రాజా! మహాభాగుడు, పూజ్యుడు అయిన శాండిల్యముని 'శకటదానం అన్నిదానాలతో సమానమని చెప్పాడు."

66. అన్నదానాది మహిమ

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "పితామహా! ఎండలో తపిస్తున్న బ్రాహ్మణునకు పాదరక్షలను దానం చేసినవాడు ఎటువంటి ఫలితాన్ని పొందుతాడో నాకు చెప్పు. భీష్ముడు చెప్తున్నాడు. "ఏకాగ్రతతో బ్రాహ్మణులకు పాదరక్షలను దానం చేసినవాడు కంటకాలనన్నింటిని మర్దిస్తాడు. కష్టాలను దాటిపోతాడు. యుధిష్ఠిరా! శత్రువుల విషయంలో పైచేయిగా ఉంటాడు

కూడా. రాజా! అతనికి మరుజన్మలో కంచరగాడిదలు లాగే మంచి రథం కూడా లభిస్తుంది. కౌంతేయా! కోడెలు లాగే బండిని దానం చేసినవాడు వెండి, బంగారంతో అలంకరింపబడిన రథాన్ని పొందుతాడు." యుధిష్ఠిరుడిలా అడిగాడు. "కౌరవా! తిలదానం, భూదానం, గోదానం, అన్నదానం చేస్తే ఏ ఫలితం కలుగుతుందో నాకు మరలా చెప్పు."

భీష్ముడు చెప్తున్నాడు. "కౌరవ్యా కురుసత్తమా! తిలదాన ఫలాన్ని విను. విని, యథాన్యాయంగా తిలదానం చేయి. పితరులకు ఉత్తమభోజనంగా బ్రహ్మ నువ్వులను సృష్టించాడు. కాబట్టి తిలదానంతో పితరులు ఆనందిస్తారు. మాఘమాసంలో బ్రాహ్మణులకు నువ్వులను దానమిచ్చినవాడు సర్వప్రాణులతో నిండియున్న నరకాన్ని చూడనవసరంలేదు. తిలలతో పితరులను పూజించినవాడు సర్వయాగాలనూ అనుష్ఠించినట్లే. అనాసక్తంగా ఎప్పుడూ తిలశ్రాద్ధం పెట్టకూడదు. రాజా! కశ్యప మహర్షి శరీరంనుండి ఈ నువ్వులు పుట్టి వ్యాపించాయి. అందువలన దాన విషయంలో ఈ నువ్వులు దివ్యత్వాన్ని పొందాయి. తిలలు పుష్టిని కూర్చేవి. అందాన్ని ఇచ్చేవి. పాపాన్ని పోగొట్టేవి. అందువలన నువ్వులదానం సర్వదానాలలో శ్రేష్ఠం. మేధావి అయిన ఆపస్తంబుడు, శంఖుడు, లిఖితుడు, గౌతమమహర్షి అందరూ తిలదానంతోనే స్వర్గానికి వెళ్ళారు. ఈ బ్రాహ్మణులందరూ మిథున-ప్రసక్తిని మాని, తిలహోమాసక్తులై ఉంటారు. తిలలు ఆవునేతితో సమానం. అందువలన యజ్ఞకర్మలు, అన్నింటిలో వాటికి ప్రాధాన్యం. అన్ని దానాలలో తిలదానం విశిష్టం. సర్వదానాలలో తిలదానమే అక్షయ ఫలాల నివ్వగలది. గతంలో పరంతపుడైన కుశికముని హవిష్యం అయిపోతే తిలలతోనే త్రేతాగ్నులను అర్చించి ఉత్తమగతిని పొందాడు. కురుశ్రేష్ఠా! ఈ రీతిగా, ఏ విధంగా నువ్వుల దానం చేయటం ఉత్తమంగా పరిగణింపబడుతుందో ఆ విధానాన్ని గూర్చి చెప్పాను.

మహారాజా! ఇక యజ్ఞాలను ఇష్టపడే దేవతలు, స్వయంభువు అయిన బ్రహ్మను కలిసినప్పుడు జరిగిన సంవాదాన్ని చెపుతా విను. రాజా! భూలోకంలో యాగం చేయగోరిన దేవతలందరూ కలిసి "యాగం చేస్తాం. మంచి చోటు చెప్పండి" అని బ్రహ్మనడిగారు. దేవతలిలా అడిగారు. "భగవంతుడా! మహాభాగా! నీవే భూమికీ, స్వర్గలోకానికంతటికీ ప్రభువు. నీ అనుమతితో యాగాన్ని చేస్తాం. భూమి యజమాని అనుమతించని ప్రదేశంలో చేసిన యాగం ఫలించదు. స్థావర జంగమాత్మకమైన సమస్త జగత్తుకు నీవే ప్రభువువు. కాబట్టి మాకు అనుమతినివ్వాలి".

బ్రహ్మ పలికాడు. "కాశ్యపసుతులారా! దేవశ్రేష్ఠులారా! ఏ ప్రదేశంలో మీరు

యాగం చేయదలిస్తే ఆ భూభాగాన్ని మీకిస్తాను. దేవతలిలా అన్నారు. "భగవంతుడా! మా పని నెరవేరింది. భూరి దక్షిణలతో యాగం చేస్తాం. ఈ హిమాలయ ప్రదేశాన్ని మునులు నిత్యమూ సేవిస్తుంటారు." ఆపై అగస్త్యుడు, కణ్వుడు, భృగువు, అత్రి వృషాకపి, అసితుడు, దేవలుడు దేవతల యాగానికి విచ్చేశారు. ఆ తరువాత మహా మనస్వులయిన దేవతలు యజ్ఞపురుషుడైన అచ్యుతుని గూర్చి యాగమారంభించారు. అదే రీతిగా సురశ్రేష్ఠులు యథాకాలంగా దానిని ముగించారు. పర్వతశ్రేష్ఠమైన హిమాలయంలో వారు యాగాన్ని ముగించి, భూదానం చేశారు. ఆ యాగఫలంలో ఆరవవంతుతో సమానమైన పుణ్యం ఆ భూదానంతో వస్తుంది. గుంటలు లేని నేలను లొడితెడు దానం చేసినా దాత కష్టాల పాలు గాడు. విషమపరిస్థితులకు లోనుగాడు. చలి, గాలి, ఎండలను సహించగలరీతిగా సిద్ధంచేసి ఇళ్ళస్థలాన్ని దానం చేసినవాడు స్వర్గ లోకానికి వెళతాడు. పుణ్యం పూర్తి అయినా అక్కడ నుండి కదిలింపబడడు. రాజా! గృహదానం దానం చేసిన ప్రాజ్ఞుడు ఇంద్రునితో కూడి ఆనందంగా జీవిస్తాడు. స్వర్గలోకంలో గొప్పగా విరాజిల్లుతాడు. అధ్యాపక వంశంలో పుట్టిన జితేంద్రియుడైన శ్రోత్రియుడు, (ఎవడు దానం చేసిన)ఇంటిలో నివసిస్తే ఆ గృహదాత ఆనందంగా ఉత్తమలోకాలను పొందుతాడు. భరతసత్తమా! అదే రీతిగా గోవులకోసం చలినీ, వాననూ సహించగల దృఢమైన కోష్ఠాన్ని కట్టించియిస్తే, తన వంశాన్ని ఏడుతరాల వరకు తరింపజేయవచ్చు. వ్యవసాయ భూమిని దానంచేసి ఇహలోకంలో మంచి సంపదను పొందగలడు. రత్నగర్భను దానంచేసినవాడు వంశపరంపరను వర్ధిల్లచేయగలడు. ఊషరక్షేత్రాన్ని కానీ, తగులబడిన భూమిని కానీ, శ్మశానభూమిని కానీ, పాపులు నివసించే భూమిని కానీ, ఏ స్థితిలోనూ దానం చేయగూడదు. ఇతరుల భూమిలో పిత్ర్యశ్రాద్ధాన్ని నిర్వహించినా, దానం చేసినా ఆ శ్రాద్ధకర్మ కానీ, ఆదానం కానీ నిష్ఫలమవుతాయి. కాబట్టి విచక్షణజ్ఞానం గలవాడు భూమిని కొని దానం చేయాలి. అది స్వల్పమైనా సరే. ఆ భూమిలో పితరులకు పిండాలు పెడితే శాశ్వత ఫలం లభిస్తుంది. అడవులు, పర్వతాలు, నదులు, తీర్థాలు – ఇవి అందరివీ అన్నారు పెద్దలు. అక్కడ శ్రాద్ధకర్మకై భూమిని కొనవలసిన పని లేదు. రాజా! ఈ రీతిగా భూదాన ఫలాన్ని చెప్పాను.

అనఘా! ఇక గోదానఫలాన్ని వివరిస్తాను. గోవులు తాపసులందరి కన్నా గొప్పవి. అందుకే శంకరభగవానుడు గోవులతో సహవసించి తపస్సు చేశాడు. భారతా! ఈ గోవులు చంద్రునితో కలిసి బ్రహ్మ లోకంలో ఉంటాయి. అదే పరమగతి. దానినే బ్రహ్మర్షులు

కోరుకొంటారు. భారతా! గోవులు పాలతో, నేతితో ,పెరుగుతో పేడతో, చర్మంతో, ఎముకలతో, కొమ్ములతో, తోకలతో కూడా ఉపకరిస్తాయి. వీటికి చలి, ఎండ, వాన - వీటితో బాధలుండవు. ఎప్పుడూ తమ పని చేస్తూనే ఉంటాయి. అందుకే ఇవి బ్రాహ్మణులతో కలిసి పరమపదాన్ని చేరుతాయి. అందుకే బుద్ధిమంతులు గోవు, బ్రాహ్మణుడు ఒకటే అంటారు. రంతిదేవుని యజ్ఞంలో గోవులు యజ్ఞ పశువులుగా అంగీకరించబడ్డాయి. వాటి చర్మం నుండి కారిన నెత్తుటితో చర్మణ్వతీ నది ప్రవహించింది. ఆపై పశుత్వం నుండి అవి ముక్తినంది దానం చేయటానికై నియంత్రించబడ్డాయి. రాజా! అటువంటి గోవులను బ్రాహ్మణోత్తములకు దానమిచ్చినవాడు ఎంతక్లిష్టమైన ఆపదలనైనా దాటిపోగలుగుతాడు. రాజా! వేయి గోవులను దానమిచ్చినవాడు అన్నితావులా విజయాన్ని పొందుతాడు. మరణానంతరం నరకాన్ని పొందడు. దేవేంద్రుడు, "ఆవుపాలు అమృత"మన్నాడు. కాబట్టి గోదానం చేసినవాడు అమృతదానం చేసినట్లే. వేదవేత్తలు అగ్నిలో హోమం చేయదగిన అక్షయద్రవ్యం ఆవుపాలు అన్నారు. కాబట్టి గోదానం చేస్తే హోమద్రవ్యాన్ని దానమిచ్చినట్లే. ఎద్దు మూర్తీభవించిన స్వర్గం. కాబట్టి గోపతి అయిన ఎద్దును గుణవంతుడైన బ్రాహ్మణునకు దానమిచ్చినవాడు స్వర్గలోకంలో విరాజిల్లుతాడు. భరతర్షభా! ఆవులు ప్రాణులకు ప్రాణమంటారు. కాబట్టి ధేనువును దానమిచ్చినవాడు ప్రాణదానం చేసినట్లే. ప్రాణులకు గోవులే శరణు అని వేదవేత్తలు భావిస్తారు. కాబట్టి ధేనువును దానమిచ్చినవాడు శరణమిచ్చినట్లే. (గృహదానం చేసినట్లే). వధ చేసేవాడికి గోవు నివ్వకూడదు. కసాయికి కానీ, నాస్తికునకు కానీ, ఆవుతో బ్రతుకు గడిపేవానికి కానీ, గోరసాలను, అమ్మేవానికి కానీ, (పంచయజ్ఞాలు చేయనివానికి కానీ గోవు నివ్వకూడదు.) అటువంటి పాపకర్ములకు గోవును దానంచేసిన నరుడు అక్షయనరకాలకు వెళతాడని మహర్షులన్నారు. కృశించిన గోవును కానీ, దూడ చనిపోయిన ఆవును కానీ, గొడ్డుటావును కానీ, రోగిష్ఠి అవును కానీ, అంగహీనమైన ఆవును గానీ, ముసలి ఆవును కానీ బ్రాహ్మణులకు దానమివ్వరాదు. పదివేల ఆవులను దానం చేసినవాడు స్వర్గంలో ఇంద్రునితో కలిసి ఆనందిస్తాడు. లక్షగోవులను దానం చేసినవాడు అక్షయలోకాలను పొందుతాడు. భారతా! ఈ రీతిగా గోదాన, తిలదాన, భూమిదానాల మాహాత్మ్యాన్ని గూర్చి చెప్పాను. ఇతరదానాలను గురించి చెపుతా విను.

కుంతీనందనా! అన్నదానమే ప్రధానమంటారు. అన్నదానంతోనే రంతిదేవుడు స్వర్గానికి వెళ్ళాడు. నరాధిపా! అలసి ఆకలిగొన్న వానికి అన్నంపెట్టిన రాజు గొప్పదైన బ్రహ్మపదానికి వెళతాడు. భారతా! రాజా! నరులు సువర్ణదానం, వస్త్రదానం, మరే దానం

చేసినా అన్నదానంతో సమానంగా శ్రేయస్సును పొందలేరు. అన్నమే మొదటి పదార్థం. అన్నమే పరమసంపద. అన్నం నుండి ప్రాణం పుడుతుంది. అలాగే తేజస్సు, వీర్యం బలం అన్నంనుండే పుడతాయి. సదా ఏకాగ్రచిత్తుడై యాచకునకు వెంటనే అన్నదానం చేసిన నరుడు ఇబ్బందులను పొందడు. అని పరాశరుడు చెప్పాడు. దేవతలను యథావిధిగా అర్చించి అన్నాన్ని నివేదించాలి. రాజా! నరునకు ఏది అన్నమో అతడు అర్చించే దేవతలకూ అదే అన్నం. కార్తీకమాసంలో శుక్లపక్షంలో అన్నదానం చేసినవాడు కష్టాలను అధిగమిస్తాడు. మరణానంతరం అనంతసుఖాన్ని పొందుతాడు. భరతర్షభా! తాను పస్తు ఉండి కూడా ఏకాగ్రతతో అతిథికి అన్నం పెట్టినవాడు బ్రహ్మవేత్తలు పొందే లోకాలను పొందుతాడు. క్లిష్టమైన ఆపదలు కలిగినా అన్నదానం చేసే పురుషుడు తరించగలడు. ఇహలోకంలో పాపాన్ని తరిస్తాడు. రాబోయే దుష్కర్మలను కూడా పోగొట్టుకొనగలడు. ఈ రీతిగా అన్నదానం, నువ్వుల దానం, భూమి దానం, గోదానాల ఫలితాన్ని కీర్తించాను."

67. అన్నదాన జలదాన మహిమ.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "పితామహా! నీవు కీర్తించిన దాన ఫలాన్ని విన్నాను, విశేషించి అన్నదానాన్ని ప్రశంసించావు ఇప్పుడు జలదానం చేస్తే ఎటువంటి మహాఫలం కలుగుతుందో వివరంగా వినగోరుతున్నాను పితామహా"! భీష్ముడు చెప్తున్నాడు. "భరతర్షభా! ఆహా! నీకు యథార్థంగా అంతా చెపుతాను. సత్యపరాక్రమా! ఇప్పుడు నేను చెపుతున్నది విను. అనఘా! జలదానంతో ప్రారంభించి నీకంతా చెప్తాను. అన్నాన్నీ, జలాన్నీ దానం చేసిన నరుడు ఏ ఫలితం పొందుతాడో చెపుతా. నాయనా! ప్రాణులన్నీ అన్నంనుండి పుడతాయి. కాబట్టి దాన్ని మించిన గొప్పదాన మేదీ లేదని నా అభిప్రాయం. కాబట్టి లోకంలో మనుష్యులలో అన్నమే అన్నిటికన్నా గొప్పది. అన్నంద్వారానే ప్రాణులకెప్పుడూ బలమూ, తేజస్సూ వృద్ధిపొందుతాయి. అందువలననే బ్రహ్మ అన్నదానమే శ్రేష్ఠమన్నాడు. కౌంతేయా! సావిత్రి పలికిన శుభవచనాన్నికూడా నీవు వినియే ఉన్నావు. మహామతీ! దేవతలు యజ్ఞం చేస్తున్నప్పుడు సావిత్రి ఏ కారణంగా, దేనిని ఎలా చెప్పిందో విను. "నరుడు అన్నదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే. ఈలోకంలో ప్రాణదానాన్ని మించిన దానం మరేమీ లేదు". మహాబాహూ! ఈ విషయంలో లోమశుడు చెప్పిన మాట కూడా నీవు విని ఉన్నావు గదా! రాజా! గతంలో పావురానికి బదులు ప్రాణాల నిచ్చిన శిబిచక్రవర్తి పొందిన స్థానాన్నే బ్రాహ్మణునకు అన్నదానం చేసినవాడు పొందుతాడు. ప్రాణదానం

చేసినవాడు దానికన్నా విశిష్ట గతిని పొందుతాడని నేను విన్నాను.

కురుసత్తమా! అన్నం కూడా నీటినుండి పుడుతుంది. జలం నుండి పుట్టిన ధాన్యాదులు లేకపోతే ఏదీ నిలవలేదు. రాజా! గ్రహాధిపతి, పూజనీయుడు అయిన చంద్రుడు కూడా నీటినుండి పుట్టినవాడే, మహారాజా! అమృతం, సుధ, స్వాహా, స్వధ, అన్నం, ఓషధులు, లతలు అన్నీ నీటినుండి పుట్టినవే. వాటినుండియే సర్వప్రాణుల ప్రాణాలూ పుడుతున్నాయి. దేవతల అన్నం అమృతమే. అదే రీతిగా నాగుల అన్నం సుధ. పితరుల అన్నం స్వధ. పశువులకు లతలు (తృణ జాతులు) అన్నం. ధీమంతులు మనుష్యులకు అన్నమే ప్రాణాలు అన్నారు. నరోత్తమా! అన్నిరకాల అన్నమూ జలంనుండియే పుడుతుంది. కాబట్టి జలదానం కన్నా గొప్పది ఎక్కడా ఉండదు. తనకు సంపదలు కోరుకొనే నరుడు ప్రతిదినమూ జలదానం చెయ్యాలి. కొంతేయా! జలదానంవలన ధనమూ, కీర్తి, ఆయుస్సు పెరుగుతాయి. ఎప్పుడూ శత్రువులపై పై చేయిగానే ఉంటాడు జలదాత. జలదాతకు ఈలోకంలో కోరికలన్నీ తీరుతాయి. శాశ్వతకీర్తిని పొందుతాడు. పాపవిముక్తి లభిస్తుంది. మరణానంతరం అనంతసుఖాలను పొందుతాడు. మహాతేజస్వీ, మానవోత్తమా! జలదాత స్వర్గానికి వెళ్ళి అక్షయలోకాలను పొందుతాడని మనువు చెప్పాడు."

68. యమధర్మరాజ బ్రాహ్మణసంవాదము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "తిలదానం వలన ఫలితమేమిటి ? అలాగే దీపదాన ఫలమేమిటి ? అన్నదాన, వస్త్రదాన ఫలాన్ని మరలా నాకు చెప్పు." భీష్ముడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరా! ఈ విషయంలో కూడా బ్రాహ్మణ యమధర్మరాజ సంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు.

రాజా! భారతమధ్య దేశంలో, గంగాయమునల మధ్య భాగంలో యమున పర్వతపాదాల దగ్గర ఒక రమణీయ గ్రామ ముండేది. పర్ణశాల అని దానికి ప్రఖ్యాతి. అక్కడ చాలామంది బ్రాహ్మణపండితులు నివసించేవారు. ఒకసారి యముడు తన భటులలో ఒకనితో (అతడు నల్లని బట్టలు ధరించి ఎర్రని కన్నులతో, నిక్కబొడుచుకొన్న రోమాలతో, కాకివంటి పిక్కలు, కళ్ళు, ముక్కులతో ఉన్నాడు.) ఇలా అన్నాడు. నీవు ఆ బ్రాహ్మణ గ్రామానికి వెళ్ళు. వెళ్ళి శర్మి అనే పేరుగల బ్రాహ్మణుని తీసికొనిరా! ఆయన అగస్త్య గోత్రుడు. శమపరాయణుడు. విద్వాంసుడు, అధ్యాపకుడు. అతడు మూటకట్టినదేమీ ఉండదు. ఆయనకు దగ్గరలోనే ఆ గోత్రంతోనే ఆ పేరుతోనే మరొక బ్రాహ్మణుడుంటాడు.

గుణాలలో, అధ్యయనంలో, పుట్టుకలో, సంతానంలో, సదాచారంలో - అన్ని విషయాలలోనూ ఆయన కూడా ఈ ధీమంతునితో సమానుడే. ఆయనను తీసికొనిరావద్దు. నేను చెప్పిన ఆ శర్మినే తీసికొనిరా. నేను ఆయనను పూజించాలి." అయితే ఆ భటుడు వెళ్ళి యమశాసనానికి వ్యతిరేకంగా ప్రవర్తించాడు. యముడు తీసికొని రావద్దని నిషేధించిన వ్యక్తినే ఆక్రమించి, తీసికొని వచ్చాడు. శక్తిశాలి అయిన యముడు లేచి ఆయనను పూజించాడు. "ఈయనను, తీసికొనిపో" మరొకరిని తీసికొనిరా" అని ఆదేశించాడు. ధర్మరాజు భటుని అలా ఆదేశించగానే అధ్యయనంతో విరక్తిచెంది ఉన్న ఆ బ్రాహ్మణుడు "అచ్యుతా! నా ఆయుర్దాయంలో మిగిలి ఉన్న కాలాన్ని ఇక్కడే గడుపుతాను" అని యమునితో అన్నాడు. యముడిలా పలికాడు. "కాలవిధానమే రీతిగానూ నేనెరుగను. లోకంలో ధర్మాచరణ చేస్తున్నవానిని మాత్రమే నేనెరుగుదును. అచ్యుతా! బ్రాహ్మణా! నీవు ఇప్పుడే నీ ఇంటికివెళ్ళు! మహా తేజస్వీ! నీ అభీష్టాన్ని పూర్తిగా, స్వేచ్ఛగా చెప్పు. చేయగలను". బ్రాహ్మణుడిలా అన్నాడు. "లోకంలో ఏ పనిచేస్తే మహాపుణ్యం వస్తుందో నాకు చెప్పు. సజ్జనశ్రేష్ఠా! మూడు లోకాలలోని ధర్మానికంతటికీ నీవే ప్రమాణం గదా!"

యముడిలా చెప్పాడు. "బ్రహ్మర్షీ! ఉత్తమదానవిధిని గురించిన తత్త్వాన్ని విను. నువ్వులదానం ఉత్తమదానం. ఇక్కడ అది అక్షయపుణ్యదాయకం కూడా. బ్రాహ్మణోత్తమా! యథాశక్తిగా నువ్వులను దానం చేయాలి. నిత్యదానం వలన నువ్వులు దాతకోరికలనన్నింటినీ నెరవేరుస్తాయి. శ్రాద్ధవిధిలో నువ్వులను ప్రశంసిస్తారు. తిలదానమే ఉత్తమదానం. కాబట్టి శాస్త్రోక్తమైన విధి ప్రకారం బ్రాహ్మణులకు నువ్వులను దానం చేయి. వైశాఖమాసంలో పౌర్ణమి రోజు బ్రాహ్మణులకు నువ్వులను దానమివ్వాలి. నువ్వులను తినాలి. ఎప్పుడూ నువ్వులను పిండిచేయాలి. శ్రేయస్కాములు ఇంటిలో సర్వవిధాలా నువ్వులను వినియోగించాలి. అదే రీతిగా సర్వదా నీటిని దానమివ్వాలి. త్రాగాలి. సంశయం లేదు. ద్విజోత్తమా! కొలకులను, చెరువులను, బావులను త్రవ్వించాలి. ఈ జగత్తులో అత్యంతమూ దుర్లభమైన పుణ్యకర్మమిదియే. నిత్యమూ జలదానం చేయాలి. జలదానంకోసం నిత్యమూ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. ద్విజసత్తమా! భోజనం చేసిన వానికయినా జలదానం చేయాలి. విశేషించి అందరికీ జలాన్ని దానం చేయాలి"

భీష్ముడు చెప్తున్నాడు. "యముడలా చెప్పగానే అప్పుడు యమదూత ఆయనను ఆయన ఇంటికి చేర్చాడు. ఆయన యముని శాసనం మేరకు ఆ పనులు తాను చేస్తూ ఇతరులచే చేయించాడు. అప్పుడు యమదూత ఆ శర్మిని తీసికొని పోయి ధర్మరాజుకు

ఆ విషయాన్ని చెప్పాడు. ప్రతాపవంతుడైన ధర్మరాజు ధర్మజ్ఞుడైన ఆశర్మిని పూజించి, ఆయనతో సంభాషించి, రప్పించిన రీతిగా మరలా పంపించాడు. ఆయనకు కూడా యముడు అంతా ఉపదేశించాడు. పరలోకంనుండి తిరిగివచ్చిన తరువాత ఆయన యముడు ఉపదేశించిన దంతా పాటించాడు. పితరుల హితాన్ని అభిలషిస్తూ యముడు దీపదానాన్ని కూడా గట్టిగా చెప్పాడు. కాబట్టి నిత్యమూ దీపదానం చేసినవాడు పితరులను తరింపజేస్తాడు. అందువలన భరతసత్తమా! దేవతలనూ, పితరులనూ ఉద్దేశించి సతతమూ దీపదానం చేయాలి. రాజా! అది తన నేత్రతేజస్సును పెంచుతుంది. రాజా! రత్నదానం కూడా మహాపుణ్యకర్మగా చెప్పబడింది. ఎందుకంటే బ్రాహ్మణుడు వాటిని విక్రయించి యాగాలు చేస్తాడు. అందువలన ఆ దానంపట్టడం భయకారణం కాదు. బ్రాహ్మణుడు తాను దానం పట్టినదానిని ఇతర బ్రాహ్మణులకు దానమిస్తే, అది దాతకూ, స్వీకర్తకూ కూడా అక్షయపుణ్యఫలాన్ని ఇస్తుంది. తాను ధర్మమార్గంలో నిలిచి, తన వంటి ధర్మపరునకు తాను దానం పట్టిన దానిని దానం చేస్తే అది ఇద్దరికీ అక్షయ ధర్మఫలితాన్ని ఇస్తుందని ధర్మవేత్త అయిన మనువు చెప్పాడు. తన భార్యయందే అనురక్తిగల నరుడు వస్త్రదానం చేస్తే, మంచి వస్త్రాలు, మంచి వేషం కలవాడు కాగలడని వింటున్నాం. పురుషోత్తమా! గోదాన, సువర్ణదాన, తిలదానాలను గురించి వేదప్రామాణ్య దృష్టితో ఎన్నోరకాలుగా వివరించాను. కౌరవ్యా! పెళ్ళి చేసి కోవాలి. పిల్లలను కనాలి. పుత్రలాభం అన్ని లాభాలకన్న విశిష్టమైనది.

69. గోదాన మాహాత్మ్యము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "మహాప్రాజ్ఞా! కురుశ్రేష్ఠా! దానాలలో ఉత్తమవిధానాన్ని మరలా వివరించు. ప్రత్యేకించి భూదానాన్ని గురించి. క్షత్రియుడే యజ్ఞకర్మలు చేసే బ్రాహ్మణులకు భూమిదానం చేయాలి. బ్రాహ్మణుడు యధావిధిగా దానిని స్వీకరించాలి. ఇతరులకు దానంచేసే అర్హతలేదు. పుణ్యఫలాన్ని కోరుకొనే సర్వవర్ణాలవారూ ఏ దానం చేయవచ్చు. వేదం ఏం చెప్తోంది ? దానిని నాకు వివరించి చెప్పు."

భీష్ముడు చెప్తున్నాడు. "గోవు, భూమి, సరస్వతి (విద్య) - ఈ మూడింటి పేరూ ఒకటే. వీటిని దానం చేయాలి. ఈ మూడింటి ఫలితం కూడా సమానమే. ఇవి అన్ని కోరికలనూ తీర్చగలవి. శిష్యునకు ధర్మానుకూలమైన బ్రహ్మవిద్యను (వేదవిద్యను) ఉపదేశించినవాడు భూదాన గోదానాలతో సమానమైన ఫలితాన్ని అనుభవిస్తాడు. యుధిష్ఠిరా!

ఇదే విధంగా గోదానం కూడా ప్రశంసింపబడుతుంది. అంతకన్నా గొప్పదాన మేదీ లేదు. గోదానఫలం సమీప భవిష్యత్తులోనే లభిస్తుంది. గోవులు వేగంగా అర్థసిద్ధిని కలిగించగలవు. గోవులు సర్వప్రాణులకూ తల్లులు. అవి సర్వసుఖాలనూ ఇచ్చేవి. తన అభివృద్ధిని కోరుకొనే వాడు నిత్యమూ గోవులకు ప్రదక్షిణలు చేయాలి. గోవులను కాలితో తన్నరాదు. గోవుల మధ్యనుండి వెళ్ళరాదు. గోవులు శుభాలకు ఆధారమైన దేవతలు కాబట్టి నిత్యమూ వాటిని పూజించాలి. దేవతలు కూడా యజ్ఞంకోసం దున్నేటప్పుడే గోవులను అదిలించారు. కాబట్టి యజ్ఞవిధి కోసం గోవులను ముందు వినియోగించాలి. మరోపనికై వాటిని దండించటం నిందింపదగింది. పండితులు స్వేచ్ఛగా సంచరిస్తున్నప్పుడు కానీ, ప్రశాంతంగా పడుకొని ఉన్నప్పుడు కానీ వాటిని ఉద్వేగానికి గురిచేయకూడదు. అవి దప్పికతో చూస్తున్నప్పుడు, నీరు పెట్టకపోతే యజమానిని సబాంధవంగా నాశనం చేస్తాయి. దేవాలయాలను కానీ, పితరుల శ్రాద్ధకర్మను నిర్వహించే ప్రదేశాన్ని కానీ ఆవు పేడతోనే అలికి పవిత్రం చేస్తారు. అంతకన్నా పవిత్రమైన దేదీ లేదు. సంవత్సరకాలం ప్రతిరోజూ తాను భుజించే ముందు గోవుకు పిడికెడు గడ్డిని పెట్టినవాడు, సమస్తవాంఛలనూ తీర్చగల వ్రతాన్ని పాటించినట్టే. అది పుత్రులనూ, కీర్తినీ, ధనాన్నీ, సంపత్తినీ కలిగిస్తుంది. అశుభాన్నీ, పీడకలలనూ కూడా తొలగిస్తుంది.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "ఎటువంటి లక్షణాలు గల గోవులను దానమివ్వాలి? ఎటువంటి వాటిని పరిహరించాలి ? ఎటువంటివారికి దానమివ్వాలి? ఎటువంటివారికి దానమివ్వకూడదు ?" భీష్ముడు చెప్తున్నాడు. "సదాచారం లేనివానికీ, పాపాత్మునికీ, లుబ్ధునికీ, అసత్యవాదికీ, దేవయజ్ఞాలు, శ్రాద్ధకర్మలు పరిహరించినవానికీ ఎ రీతిగానూ గోవునివ్వకూడదు. చాలామంది పిల్లలు గలిగి, వేదవేత్తయై, ఆహితాగ్నియై, యాచించిన బ్రాహ్మణునకు పది గోవులను దానమిచ్చినదాత ఉత్తమలోకాలను పొందుతాడు. దానాన్ని స్వీకరించిన బ్రాహ్మణుడు చేసే ధర్మంలో, ఆధర్మ ఫలంలో దాత కూడా భాగస్వామి అవుతాడు. ఎందుకంటే గోదానం చేయటానికి కారణమదే. జన్మనిచ్చినవాడు. భయం నుండి రక్షించిన వాడు. జీవికను కల్పించినవాడు – వీరందరూ తండ్రులే. గురుసేవ పాపాలను పోగొడుతుంది. అభిమానం ఎంత కీర్తినయినా నశింపజేస్తుంది. ముగ్గురు కొడుకులు పుత్రులు లేని దోషాన్ని నివారిస్తారు. పది గోవులు బ్రతుకు తెరువలేకపోవటాన్ని పరిహరిస్తాయి. వేదాంతనిష్ఠుడు, బహుపండితుడు, జ్ఞానంతో తృప్తిపడేవాడు, జితేంద్రియుడు, శిష్టుడు, మనస్సును నిగ్రహించినవాడు, ప్రయత్నశీలుడు ప్రాణులతో ప్రియంగా మాటాడేవాడు.

ఆకలిబాధతో చెడ్డపని చేయనివాడు, మృదు స్వభావుడు, శాంతుడు, అతిథి ప్రియుడు, సమదృష్టిగలవాడు, భార్యాపుత్రులతో కూడి ఉన్నవాడు – ఈ లక్షణాలు గల బ్రాహ్మణునకు జీవికను కల్పించాలి. చక్కని యోగ్యునకు గోదానం చేస్తే ఎంత గుణమో, బ్రాహ్మణుని ధనాన్ని అపహరించటం అంత దోషం కాబట్టి ఏ స్థితిలోనూ బ్రాహ్మణుని ధనాన్ని అపహరించటానికీ, బ్రాహ్మణస్త్రీ సంసర్గానికీ దూరంగా ఉండాలి.

విప్రుని భార్య గానీ, విప్రధనం కానీ దోపిడీకి గురి అవుతుంటే, సమర్థులై రక్షించినవారికి నమస్సు, రక్షించకపోతే మృతప్రాయులే. సూర్యసుతుడైన యముడు అటువంటివారిని దండిస్తాడు. బెదిరిస్తాడు నరకం నుండి వారిని ఎప్పుడూ విడువడు. గోవులను రక్షించినా, వీడించినా శుభా శుభఫలాలు గలిగినట్లు, ప్రత్యేకించి విప్రగోవును కాపాడినా, చంపినా శుభాశుభాలు కలుగుతాయి.

70. నృగోపాఖ్యానము.

భీష్ముడు చెప్తున్నాడు. "కురుపుంగవా! ఈ విషయంలోనే సజ్జనులు నృగుని కథను చెప్తుంటారు. ఆయన బ్రాహ్మణుని ధనాన్ని అపహరించి ఎన్నో కష్టాలు పడ్డాడు. పార్థా! గతంలో ద్వారకావతి సమృద్ధంగా ఉన్నప్పుడు అక్కడగడ్డితో, లతలతో కప్పిన ఒక పెద్దబావి కనిపించింది. ఆ బావినుండి నీటిని కోరుతున్నవారు ఎంతో శ్రమతో ఆ గడ్డినీ, లతలను తొలగించే ప్రయత్నం చేశారు. ఇంతలో ఆ బావిలోని నీటిలో ఒక పెద్ద ఊసరవెల్లి కనిపించింది. వేలకొలదిగ ఉన్నవారు దానిని పైకి తీయటానికి ప్రయత్నించారు. తాళ్ళతో, తోలు పట్టాలతో పర్వతాకారం గల దానిని బంధించి పైకి తేవాలని చూశారు. కానీ వీలుకాలేదు. అప్పుడు జనార్దనుని దగ్గరకు వెళ్ళారు. బావిలో ఒక పెద్ద ఊసరవెల్లి ఉంది. అది బావిలోని ఖాళీనంతా ఆక్రమించింది. దానిని పైకి తీసేవాడు లేడు' అని కృష్ణునికి నివేదించారు. వాసుదేవుడు దానిని పైకితీశాడు. ఆ స్పర్శతో ఆ ఊసరవెల్లి నృగమహారాజుగా మారింది. అప్పుడు వాసుదేవుడు అడుగగా నృగుడు తనను గురించి చెప్పాడు. ఒకప్పుడు తాను వేయి యాగాలు చేసినట్లు చెప్పాడు. నృగుడు అలా చెప్తుంటే మాధవుడీరీతిగా అడిగాడు "నీవు శుభకర్మలు చేశావే కానీ పాపకర్మ చేయలేదు. రాజా! మరి ఈదుర్గతినెలా పొందావు? చెప్పు ఏమిటీస్థితి ? రాజా! గతంలో నీవు బ్రాహ్మణులకు ముందుగా లక్షగోవులను దానం చేశావు. ఆపై వేయి, ఆ తరువాత వంద ఆ తరువాత ఎనభై లక్షలు దానం చేశావని విన్నాను. ఆ దానఫలమంతా ఏమైంది ?"

నృగుడు కృష్ణునితో ఇలా చెప్పాడు. "నిత్యాగ్నిహోత్రి అయిన ఒక బ్రాహ్మణుడు

పరదేశానికి వెళ్ళాడు. ఆయన ఆవు ఒకటి తప్పిపోయి వచ్చి నా గోవుల మందలో కలిసింది. అప్పుడు నా గోపాలురు దానమివ్వటానికి తెచ్చిన వేయిగోవులతో దానిని కూడా కలిపారు. మరణానంతర ఫలకాంక్షతో నేను ఆ గోవును కూడా బ్రాహ్మణునకు దానమిచ్చాను. ఆ ద్విజుడు మరలివచ్చి తన గోవును వెదుకుతూ ఇతరుల ఇంటిలో దానిని చూశాడు. నా నుండి ఆ గోవును తీసికొన్న బ్రాహ్మణునితో ఆద్విజుడు" ఇది నాది" అన్నాడు. ఆ ఇద్దరూ ఘర్షణపడుతూ తీవ్రకోపంతో నా దగ్గరకు వచ్చారు. "నీవే నాకిచ్చావు" అన్నాడు నానుండి దానం తీసికొన్న బ్రాహ్మణుడు. "నీవే నా గోవును అపహరించావు" అని మొదటి బ్రాహ్మణుడన్నాడు. నానుండి దానం తీసికొన్న బ్రాహ్మణునికి ఆ గోవునిస్తే బదులుగా పదివేల గోవుల నిస్తానన్నాను. ఆయన నాతో ఇలా అన్నాడు. "ఇది దేశకాలాలననుసరించి పాలనిచ్చేది. శాంతంగా, ఎంతో వాత్సల్యాన్ని ప్రకటించేది. తీయని పాలనిచ్చేది. నా ఇంట ధన్యతనందింది. నిత్యమూ మా ఇంటనే ఉండాలి. తల్లిలేని నా కొడుకును ఈ ఆవు తనపాలతో పోషిస్తోంది. కాబట్టి దీనిని నేను తిరిగి ఇవ్వలేను" అని చెప్పి ఆ బ్రాహ్మణుడు వెళ్ళిపోయాడు. అప్పుడు మరొక బ్రాహ్మణుని యాచించాను. ఈ గోవు నిచ్చి దానికి బదులు లక్షగోవులను తీసికొమ్మన్నాను. మధుసూదనా! ఆ బ్రాహ్మణుడిలా అన్నాడు "రాజుల నుండి నేను దానం తీసికోను. నా బ్రతుకు తెరువును నేను వెదుకుకొనగలను. వెంటనే నా ఆవును నాకిమ్ము!" నేను బంగారాన్ని, గుర్రాలను, వెండి రథాలను ఇస్తానన్నా స్వీకరించలేదు. ఆ బ్రాహ్మణోత్తముడు, అలాగే వెళ్ళిపోయాడు కూడా.

అదే సమయంలో కాలధర్మప్రేరణతో నేను మరణించి, పితృలోకానికి పోయి, యమధర్మరాజును కలిశాను. యముడు నన్ను పూజించి నాతో ఇలా అన్నాడు "రాజా! నీ పుణ్యకర్మలను లెక్కిస్తుంటే ముగింపు కనిపించటం లేదు. కానీ నీవు అజ్ఞానంతో చేసిన పాపం కొంచెముంది. ఆ పాపాన్ని ముందు అనుభవిస్తావో, తరువాత అనుభవిస్తావో నీ ఇష్టం". ప్రజలను కాపాడుతానని రాజుగా నీవు ప్రతిజ్ఞ చేశావు. కానీ బ్రాహ్మణుని గోవును కాపాడలేక మాట తప్పావు. బ్రాహ్మణుని సొమ్మును అపహరించావు. ఇలా నీవు చేసిన తప్పు రెండు రకాలు. "ప్రభూ! ముందు పాపాన్ని అనుభవిస్తాను. ఆపై పుణ్యాన్ని" అని యమునితో అనగానే నేను భూతలంపై పడ్డాను. పడుతూ యమధర్మరాజు పెద్దగా పలికిన ఈ మాట విన్నాను. "వాసుదేవుడైన జనార్దనుడు నిన్ను రక్షిస్తాడు. వేయి సంవత్సరాలు నిండిన తరువాత నీ పాపకర్మఫలం క్షీణించిన తర్వాత నీ పుణ్యకర్మతో గెలుచుకొన్న

శాశ్వత లోకాలను పొందగలవు." బావిలో తలక్రిందులుగా పడిపోయాను. నేనది గమనించాను. జంతుజాతిని పొందినా నా స్మృతి మాత్రం నన్ను వీడలేదు. ఈ రోజు నీచే తరింపజేయబడ్డాను. నీ తపోబలం తప్ప దీనికి మరొక కారణం లేదు. కృష్ణా! నాకు అనుమతినిస్తే ఇప్పుడు స్వర్గానికి వెళతాను". "అరిందముడైన ఆ నృగుడు కృష్ణుని అనుమతిని పొంది, ఆ జనార్దనునకు నమస్కరించి దివ్యమార్గాన్ని ఆశ్రయించి స్వర్గానికి వెళ్ళాడు. భరతసత్తమా! కురునందనా! ఆపై అలా ఆ నృగుడు స్వర్గానికి వెళ్ళగానే వాసుదేవుడీశ్లోకాన్ని పలికాడు. **జ్ఞాని అయిన పురుషుడు బ్రాహ్మణుని ధనాన్ని అపహరింపరాదు. బ్రాహ్మణుని ధనాన్ని అపహరిస్తే బ్రాహ్మణుని గోవు నృగమహారాజును వలె ఆ పాపం దొంగను నాశనం చేస్తుంది. పార్థా! సజ్జనులకు సజ్జనులతోడి కలయిక వ్యర్థంకాదు. సజ్జన సమాగమంవలన నృగుడు నరకం నుండి ముక్తిని పొందాడు.** గమనించావా ? యుధిష్ఠిరా! దానానికి ఎంత ఫలముందో ద్రోహానికీ అంతే ఫలముంటుంది. కాబట్టి గోవులకు అపచారం చేయటం మానాలి."

71. యమధర్మరాజు నాచికేతునకు గోదానమహిమ చెప్పుట.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "అనఘా! గోదానం వలన కలిగే ఫలాన్ని నాకు విస్తరంగా చెప్పు. మహాబాహూ! నీవు చెప్పినదానితో నేను తృప్తిపడలేదు." భీష్ముడు చెప్తున్నాడు. "ఈ విషయంలో కూడా ఉద్దాలకమహర్షి, నాచికేతుడు - ఈ ఇద్దరి మధ్య జరిగిన సంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. ఉద్దాలకమహర్షి దీక్షతీసికొని ఆపై తన కొడుకైన నాచికేతునితో "నీవు నాకు సేవనందించు" అన్నాడు. నియమం ముగియగానే ఉద్దాలకముని కుమారునితో ఇలా అన్నాడు. "నదీతీరంలో సమిధలు, దర్భలు, పూలు, కలశం, విరివిగా భోజనసామగ్రి ఉంచి, స్నానవేద పారాలలో లగ్నమై వాటిని మరిచిపోయాను. నదీతీరం నుండి వాటిని ఇక్కడకు తీసికొనిరా." నదీ వేగంతో అవన్నీ మునిగిపోయాయి. అందువలన నాచికేతుడు అక్కడకు వెళ్లినా అవి దక్కలేదు. ఆ నాచికేతుడు తండ్రి దగ్గరకు వచ్చి "అవి కనిపించలేదు" అని చెప్పాడు. మహాతపస్వి అయిన ఆ ఉద్దాలకముని ఆ సమయంలో ఆకలిదప్పులతో ఆశ్రమంలో ఉన్నాడు. ధానితో "వెళ్ళి యమధర్మరాజును చూడు" అని కుమారుని శపించాడు. తండ్రి వజ్రం వంటి మాటను అలా అనగానే నాచికేతుడు చేతులు జోడించి "ప్రసన్నులుకండి" అంటూనే ప్రాణాలను కోలుపోయి నేలగూలాడు. పడిపోయిన నాచికేతుని చూసి, తండ్రి దుఃఖంతో

'నేనెంత పని చేశాను' అంటూ మూర్ఛిల్లి నేలపై పడిపోయాడు. తన కుమారుని గురించి శోకిస్తూ, దుఃఖం చుట్టుముట్టిన ఆ ముని మిగిలిన ఆ పగటి సమయాన్ని గడిపాడు. అప్పుడు ఆ రాత్రి భీకరంగా కనిపించింది. కురూద్వహా! దర్భశయనంపై పడిఉన్న నాచికేతుడు తండ్రి కార్చిన కన్నీటిలో మునిగి, వాననీటిలో మునిగిన సస్యంవలె అటు ఇటూ కదిలాడు. ఆ నాచికేతుడు మరణించి మరల నిదురించిన తరువాత లేచినట్లు లేచాడు. శరీరమంతా దివ్యగంధాలతో వ్యాపించిఉంది. ఉద్దాలకుడు కుమారునితో ఇలా అన్నాడు. "కుమారా! నీ కర్మఫలం ద్వారా శుభలోకాలను జయించావా? అదృష్టంకొద్దీ మరలా జీవించావు. ఈ నీ శరీరం మానుషశరీరంలా లేదు." మహాత్ముడైన తండ్రి అలా అడగగానే పరలోకంలోని సర్వవిషయాలనూ ప్రత్యక్షంగా చూసివచ్చిన నాచికేతుడు మహర్షుల మధ్యనున్న తండ్రితో ఆ వార్తను చెప్పనారంభించాడు.

"మీ శాసనాన్ని పాటిస్తూ నేను వెంటనే బయలుదేరాను. మనోహరమై, ప్రభావ సంపన్నమై. విశాలమైన యమపురిని చేరాను. వేలయోజనాల వరకు సువర్ణకాంతిని ప్రసరిస్తున్న యమసభను చూశాను. ఎదురుగా వస్తున్న నన్ను చూడగానే యముడు "ఆసనాన్ని ఇవ్వండి" అని భటులనాదేశించాడు. నీ కోసం అర్ఘ్యం మొదలయిన సత్కారాలతో నన్ను పూజించాడు. ఆపై సదస్యులందరూ నన్ను చుట్టుముట్టి పూజిస్తుండగా నేను "ధర్మరాజా! నీ రాజ్యంలోనికి వచ్చాను. నాకు తగిన లోకాలకు నన్ను పంపు' అని మెల్లగా అన్నాను. యముడు నాతో ఇలా అన్నాడు. "సౌమ్యా! నీవు మరణించలేదు. అగ్నివలె ప్రజ్వలించే తేజస్సు గల తపస్వి. నీ తండ్రి యముని చూడు! అని ఆదేశించాడు. బ్రాహ్మణా! దానిని అసత్యం చేయటం సాధ్యంకాదు. నీవు నన్ను చూశావు. నాయనా! తిరిగి వెళ్ళు. నీకు శరీరాన్ని ఇచ్చిన నీ తండ్రి శోకిస్తున్నాడు. నీవు నాకు ఇష్టమైన అతిథివి. నీ కోరికలను వేటిని తీర్చగలను ? కావలసినది కోరుకో. యముడలా అనగానే నేను "మరలి వెళ్ళరాని నీ రాజ్యానికి నేను వచ్చాను. వరంపొందటానికి నేను తగినవాడనయితే పుణ్యాత్ములు పొందే సమృద్ధలోకాలను నేను చూడగోరుతున్నాను" అని నేను ఆయనతో అన్నాను. ద్విజేంద్రా! ఆ యమధర్మరాజు గుర్రాలను పూన్చిన మంచి కాంతి, తేజస్సుగల రథంపై నన్ను ఎక్కించి, పుణ్యాత్ములు పొందే తన అదుపులోని లోకాలనన్నింటినీ చూపించాడు. అక్కడ మహాత్ములు పొందే తేజోమయభవనాలను చూశాను. వాటి ఆకృతులు అనేకవిధాలుగా ఉన్నాయి. అవి సర్వరత్నమయాలు. అవి చంద్రమండలంవలె నిర్మలంగా ఉన్నాయి. చిరుగంటల జాలరులు వాటికున్నాయి. వందలకొలదీ గదులు, లోపలనే జలాశయాలు,

వనాలు ఉన్నాయి. వైడూర్యమణులతో కూడిన సూర్యునివలె అవి ప్రకాశిస్తున్నాయి. బంగారంతో, వెండితో వాటి నిర్మాణం జరిగింది. తరుణాదిత్య వర్ణంతో అవి విరాజిల్లుతున్నాయి. ఆ భవనాలు స్థావరాలు, స్వేచ్ఛగా చరించేవి కూడా. భక్ష్యభోజ్యమయాలైన పర్వతాలనూ, వస్త్రాలనూ, శయనాలనూ, సర్వకామఫలాలనూ ఇచ్చే వృక్షాలను చూశాను. ఆచెట్లు ఆ భవనాల-ఆవరణలోనే ఉన్నాయి. ఆ లోకాలలో నదులు, వీధులు, సభలు, బావులు, దిగుడుబావులు అంతటా చూశాను. గుర్రాలను పూన్చిన, ధ్వనిస్తున్న రథాలను వేలకొలదిగ చూశాను. పాలనదులను, నేతి పర్వతాలను, నిర్మలజలాన్ని చూశాను. యమరాజు అనుమతితో అంతకుముందెన్నడూ చూడని అనేకదేశాలను చూశాను.

అవన్నీ చూసి నేను "నిరంతరంగా ప్రవహిస్తున్న ఈ క్షీరనదులు, ఘృతనదులు ఎవరికి ఆహారంగా నిర్దేశించారు? అని సమర్థుడు, సనాతనుడు అయిన యమధర్మరాజుతో అన్నాను. అది విని యముడిలా అన్నాడు. "గోరసాలను దానం చేసిన సాధుజనులకై ఇవన్నీ ఆహారపదార్థాలు. గోదానతత్పరులకై శాశ్వతలోకాలు ఇంకా ఉన్నాయి. శోకరహితులతో అవి నిండి ఉంటాయి. విప్రా! గోదానం చేయటం మాత్రం ప్రశస్తంకాదు స్వీకర్తయోగ్యత, కాలం, గోస్థితి, దానవిధి – ఇవన్నీ గమనించి గోదానం చేయాలి. గోవులలోని తేడాలను తెలిసికోవటం కష్టం. అగ్నివలె, సూర్యునివలె తేజస్వి అయిన బ్రాహ్మణుని ఎన్నుకోవటం కష్టం. స్వాధ్యాయపరుడు, మహాతపస్వి, యజ్ఞానుష్ఠాత అయిన బ్రాహ్మణుడు గోదానానికి అర్హుడు. కృచ్ఛ్రవ్రతాలనుండి విముక్తి పొంది, స్వజనపోషణకై గోదానాన్ని కోరిన బ్రాహ్మణుడు కూడా అర్హుడే. ఆటువంటి వారికి దానంగా ఇచ్చిన గోవులు ప్రశస్తమైనవి. మూడు రాత్రులు నీటిని త్రాగుతూ ఉపవసించి, భూమిపై శయనించి, తృప్తిగా ఉన్న గోవులను, భోజనాదులచే తృప్తిపరచబడిన విప్రులకు దానం చేయాలి. ఆ గోవులు దూడలతో కలిసి ఉండాలి. మంచి ఈతలు గలవై ఉండాలి. అవసర సామగ్రితో కూడి ఉండాలి. అటువంటి గోవులను దానం చేసి మూడు రాత్రులు గోరసాలచే భుజించాలి. మంచి స్వభావం కలిగి, మంచి దూడగలిగి, పారిపోయే లక్షణం లేని ఆవును కంచుపాత్రతో పాటు దానం చేస్తే, దానికి ఎన్ని రోమాలు ఉన్నాయో అన్ని సంవత్సరాలు స్వర్గలోకసుఖాలను పొందవచ్చు. అలాగే శిక్షణ పొంది, అదుపులో నుండి, భారాన్ని మోయగలిగి, బలిష్ఠమై, రైతు జీవితాన్ని బ్రతికింపగలిగి శక్తివంతమై, పెద్ద శరీరం గల కోడెదూడను దానం చేసినవాడు ఆవునిచ్చినవాడు పొందే లోకాలనే పొందుతాడు. గోవులయందు సహనశీలుడై, గోవులను రక్షింపగలిగి, కృతజ్ఞుడై, జరుగుబాటులేని బ్రాహ్మణుడు గోదానానికి అర్హుడు. వృద్ధుడు, బలహీనుడు,

తన స్థితిని తట్టుకోలేనివాడు, యాగం చేయదలచినవాడు, వ్యవసాయం, యజ్ఞ వేళ, పిల్లలు పుట్టినప్పుడు, గురుదక్షిణావసరం, శిశుపోషణ - ఇటువంటి వారికి ఇటువంటి సమయాలలో దేశకాలాలను ఆలోచింపనవసరం లేదు. కొన్నవి, జ్ఞానంతో సాధించినవి, ప్రాణాలతో కొన్నవి, గెలుచుకొన్నవి, వరకట్నంగా వచ్చినవి - ఈ రకాల గోవులు దానానికి తగినవి.

నాచికేతుడు చెప్తున్నాడు. "యముని మాటను విని, నేను మరల "ఒకవేళ గోదానం చేసేవారు లేకపోతే, గోదానంతో పొందే లోకాలను పొందగల మార్గమేది ? అప్పుడు ధీమంతుడైన యముడు గోదానం చేసేవారి గతిని, గోదానం వంటి ఫలాలను ఇవ్వగల దానాలను వివరించాడు. గోదానం చేయలేకపోయినా గోదాతలు కాగల అవకాశాలను చెప్పాడు. గోవులు లభించనప్పుడు వ్రతనియమాలతో నేతి ఆవును దానం చేసిన వానికై నేతినదులు వాత్సల్యం గలగోవుల వలె నేతిని ప్రవహిస్తాయి. నేయి కూడా దొరకకపోతే వ్రత నియమాలతో తిలధేనువును దానమివ్వవచ్చు. ఆ దాతను ఆ ధేనువు కష్టాలనుండి బయటపడవేస్తుంది. క్షీరనదిలో ఆనందింపజేస్తుంది. నువ్వులు కూడా దొరకనప్పుడు వ్రతనియమాలతో జలధేనువును దానమివ్వవచ్చు. ఆ దాత అభీష్టపదార్థాలను చల్లని నది దగ్గర సుఖాలననుభవిస్తాడు. అచ్యుతా! ఈ రీతిగా ఉన్న అవన్నీ యమధర్మరాజు నాకు చూపించాడు. చూసి నేను పరమానందాన్ని పొందాను. నాయనా! నీకు మరొకప్రియ వృత్తాంతాన్ని కూడా నివేదిస్తాను. తక్కువ ఖర్చుతో సిద్ధించే ఈ గోదానమనే మహాయజ్ఞాన్ని తెలుసుకొన్నాను. ఇది వేదవిధి ననుసరించి నాద్వారా ప్రవర్తించి వ్యాపిస్తుంది. నీవు పెట్టిన ఈ శాపం నా మీద చూపిన అనుగ్రహమే అయింది. దాని ద్వారానే నేను యమలోకానికి చేరి యముని చూడగలిగాను. అక్కడ దానఫలాలను సాక్షాత్తుగా చూశాను. నిస్సందేహంగా దానధర్మాలను పాటించగలను.

మహర్షీ! యమధర్మరాజు పరమహర్షంతో నాతో పదే పదే ఇలా అన్నాడు. "దానంతో నిత్యమూ పవిత్రంగా ఉండదలచినవాడు విశేషించి గోదానం చేయాలి. అర్థం పవిత్రం. ధర్మాన్ని హేళన చేయవద్దు. తగిన ప్రదేశంలో తగినవేళలో, తగినవానికి దానమిస్తూనే ఉండాలి. కాబట్టి నీవు నిత్యమూ గోదానమివ్వాలి. ఈ విషయంలో సందేహం వద్దు. పూర్వకాలంలో దానమార్గంలో నిలిచిన శాంత మనస్కులు నిత్యమూ గోవులను దానం చేసేవారు. తమ తీవ్ర తపస్సులపై సంశయం లేకపోయినా , యథాశక్తిగా దానం చేస్తూనే ఉండేవారు. శుద్ధమనస్కులై, పుణ్య స్వభావులై, మాత్సర్యం లేకుండా శ్రద్ధతో, తగినవేళలో

శక్తిని అనుసరించి గోవులను దానం చేసి, ఈ లోకాన్ని చేరి పుణ్యాత్ములు స్వర్గంలో విరాజిల్లుతున్నారు. న్యాయంగా పొందిన గోవును అర్హులయిన బ్రాహ్మణులకు పరీక్షించి, ఇచ్చి, దానిని వారి ఇంటికి చేర్చాలి. కామ్యాష్టమి (కార్తీకశుద్ధ అష్టమి) నుండి పదిరోజులపాటు గోరసాలతో కానీ గోమూత్రంతో కానీ ఆవుపేడతో కానీ జీవించాలి. ఒక గోవును దానం చేస్తే దేవతలను సేవించినట్లే. రెండు గోవులను దానం చేస్తే వేదవిద్య లభిస్తుంది. ఎడ్లబండిని దానం చేస్తే తీర్థయాత్రాఫలం లభిస్తుంది. కపిల గోవును దానం చేస్తే పాపవిముక్తి లభిస్తుంది. న్యాయంగా సంపాదించిన ఒక కపిలగోవును దానం చేసినా పాపవిముక్తి లభిస్తుంది. గోరసాలను మించినది ఏదీ లేదు. అందుకే గోదానం మహాదానమంటారు. ఆవులు పాలనిచ్చి సర్వలోకాలనూ తరింపజేస్తున్నాయి. గోవులే లోకంలో అన్నాన్ని పుట్టిస్తున్నాయి. ఈ విషయం తెలిసికూడా గోవులపై ఆప్యాయత చూపని పాపచిత్తుడు నరకానికి వెళ్తాడు. సజ్జనుడైన బ్రాహ్మణునకు దూడలతో సహా వేయికానీ, వందకానీ, పది కానీ, అయిదుకానీ, దానం చేసినా, కనీసం ఒక్క గోవునిచ్చినా అది పరలోకంలో దాతకు పుణ్యతీర్థమైన నదిగా మారుతుంది. ప్రాప్తిని, పుష్టిని, లోకరక్షణను కల్పించటంద్వారా లోకంలో గోవులు సూర్యకిరణాల వంటివి. గోపదం ధేనువునకు సూర్యునకు కూడా వాచకమే. గోవులవలననే సంతతి, ఉపభోగాలు లభిస్తాయి. కాబట్టి గోదాత సూర్యునివలె ప్రకాశిస్తాడు. గోదాన సమయంలో శిష్యుడు గురువును ఎన్నుకొని గురువుకు దానమిస్తే ఆ శిష్యుడు తప్పక స్వర్గాన్ని పొందుతాడు. విధినెరింగిన వారికి గోవునివ్వటం గొప్ప ధర్మం. ఇతర విధులన్నీ ఈ దానవిధిలో అంతర్భవిస్తాయి. న్యాయంగా పొందిన గోవును అర్హులయిన బ్రాహ్మణులను పరీక్షించి, ఇచ్చి దానిని వారిఇంటికి చేర్చాలి. నీవు పుణ్య కర్మలలో ప్రవర్తించే వాడివి. అందువలన దేవతలు, మానవులు, మేము కూడా నీ నుండి ధర్మాన్ని ఆశిస్తున్నాం." బ్రాహ్మణోత్తమా! యమధర్మరాజు అలా చెప్పగానే ఆ ధర్మాత్మునకు నేను తలవాల్చి. నమస్కరించి, ఆ సూర్యకుమారుని అనుమతిని పొంది తమపాద సన్నిధికి వచ్చాను.

72. ఇంద్ర యుధిష్ఠిర సంవాదము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. రాజా! నీవు యముడు నాచికేతమునికి చెప్పిన గోదాన విషయాలను చెప్పావు. గోవుల మాహాత్మ్యాన్ని గురించి కూడా చెప్పావు. మహామతీ! పితామహా! మహాత్ముడైన నృగుడు అజ్ఞానకారకంగా ఒకే తప్పు చేసినా చాలా దుఃఖాన్ని అనుభవించాడు. ఈ నృగుడు ద్వారవతిలో ఉన్నప్పుడు కృష్ణుడు ఈయనను ఉద్ధరించి

మోక్షప్రాప్తికి కారకుడైన విషయాన్ని నేను విని, గ్రహించాను. కానీ రాజా! గోలోకానికి సంబంధించి నాకొక సందేహముంది. గోదానం చేసినవారు నివసించే లోకాలను గురించి నీ ద్వారా వినగోరుతున్నాను." భీష్ముడు చెప్తున్నాడు. "ఈ విషయంలో కూడా దేవేంద్రుడు బ్రహ్మనడిగిన ప్రాచీన సంఘటనను ఉదాహరిస్తుంటారు.

ఇంద్రుడిలా అడిగాడు. గోలోక వాసులు తమ తేజస్సుతో స్వర్గనివాసులను అతిక్రమించి పోవటం నేను చూశాను. ఈ విషయంలో నాకొక సంశయముంది. ప్రభూ! అనఘా! 'గోలోకాలు ఎటువంటివి ? నాకు చెప్పండి. గోదాతలు ఎటువంటి లోకాలను పొందుతారో నేను తెలిసికోవా లనుకొంటున్నాను. ఆ లోకాలు ఎటువంటివి? అక్కడ లభించే ఫలమేమిటి ? అక్కడున్న గొప్పగుణమేమిటి ? గోదాతలు చింతలన్నీ వీడి అక్కడ కెలా చేరగలుగుతారు ? గోదాత గోదాన ఫలాన్ని ఎంతకాలమనుభవిస్తాడు ? వివిధ దానాలు ఎలా చేయాలి? అల్పదానం కూడా ఎటువంటి ఫలితాన్ని ఇస్తుంది? అనేక గోవుల దానమిస్తే ఫలమెటువంటిది? తక్కువ గోవుల దానఫలమెటువంటిది? గోదానం చేయకపోయినా గోదాతలతో ఎలా సమానులవుతారు ? అదినాకు చెప్పు. రాజా! అనేక గోవులను దానం చేసినవాడు తక్కువ గోవులనిచ్చినవానితో ఎలా సమానుడవుతాడు ? అల్పగోదాత బహుగోదాతతో సమానుడెలా అవుతాడు ? గోదానసమయంలో ఎటువంటి దక్షిణ శ్రేష్ఠం. భగవన్! దీనిని యథాతథంగా నాకు చెప్పాలి."

73. బ్రహ్మ గోలోక గోదాన మహిమ చెప్పుట.

బ్రహ్మ చెప్తున్నాడు. "ఇంద్రా! గోప్రదానాదులకు సంబంధించి నీవు ప్రశ్నించావు. లోకంలో ఈ ప్రశ్న అడిగేవాడు మరెవ్వడూ లేడు. ఇంద్రా! అనేకవిధాలైన లోకాలున్నాయి. వాటిని నీవు చూడలేదు. వాటిని నేను చూడగలను. పతివ్రతలయిన స్త్రీలు కూడా చూడగలరు. ఉత్తమ వ్రతాలను పాటించే ఋషులు, మంచి బుద్ధిగల బ్రాహ్మణులు తమ శుభకర్మల కారణంగా సశరీరంగా ఆ లోకాలను చేరుతారు. ఉత్తమ వ్రతాలను పాటించే యోగులు సమాధి స్థితిలోనూ, మరణవేళ శరీరాన్ని త్యజించే సమయంలోనూ నిర్మల మనస్సుతో స్వప్నప్రాయాలయిన ఆ లోకాలను ఇక్కడనుండియే చూడగలరు. ఇంద్రా! ఆ లోకాలు ఎటువంటి గుణాలతో కూడి ఉంటాయో విను. అక్కడ కాలంకానీ, వార్ధక్యం కానీ ఆక్రమించవు. అగ్ని కూడా తీవ్రంగా జ్వలించడు. ఇంద్రా! అక్కడ అశుభం కొంచెం కూడా ఉండదు. వ్యాధి కలుగదు. అలసట ఉండదు. అక్కడి గోవులు మనసా

కోరుకొన్న వన్నీ లభిస్తాయి. అది నేను ప్రత్యక్షంగా చూశాను. అవి కోరిన చోటికి వెళ్ళగలవు. కోరినట్లు సంచరింపగలవు. సంకల్పమాత్రంతో కోరినవన్నీ అనుభవించగలవు. అక్కడ బావులు, సరస్సులు, నదులు, వివిధ వనాలు, గృహాలు, పర్వతాలు మొదలయిన సమస్త పదార్థాలు దొరుకుతాయి. గోలోకం సర్వప్రాణులకూ మనోహరమైనది. అక్కడ అందరికీ సమనాధికారముంటుంది. గోలోక మంత విశాలలోకం మరొకటి లేదు. ఇంద్రా! అన్నింటినీ సహించగలవారు, క్షమాశీలురు, కృపాళువులు, గురువచనాలను పాటించేవారు, అహంకారరహితులు అయిన నరోత్తములు అక్కడకు చేరగలరు. సమస్త మాంసభోజనాన్ని పరిత్యజించి, సదా భగవద్ధ్యానంలో నిలిచి, ధర్మయుక్తుడై, తల్లిదండ్రులను సేవిస్తూ, బ్రాహ్మణ శుశ్రూష చేస్తూ, ఎవ్వరినీ నిందింపక గోబ్రాహ్మణులపై క్రోధాన్ని ప్రదర్శింపక, ధర్మరతుడై, గురుశుశ్రూషకుడై, జీవితాంతమూ సత్యప్రవర్తనలో ఆసక్తుడై, దానరతుడై, అపరాధులను క్షమిస్తూ, మృదుస్వభావుడై, జితేంద్రియుడై, దేవపరాయణుడై, అందరికీ ఆతిథ్యమిస్తూ, దయావంతుడైన మానవుడు సనాతనాలైన అవ్యయ గోలోకాలను చేరుతాడు. పరభార్యాసక్తుడు, గురుహంత, అసత్యవాది, సదా వితండవాది, బ్రాహ్మణద్వేషి, మిత్రద్రోహి, వంచకుడు, కృతఘ్నుడు, శరుడు, కుటిలుడు, ధర్మద్వేషి, బ్రహ్మహంత – ఇటువంటి దోషాలతో కూడిన మనుష్యుడు ఎప్పుడూ మనసా కూడా గోలోకాలను చూడలేడు. అది పుణ్యాత్ముల నిలయం.

సురేశ్వరా! ఇలా గోలోక మహిమనంతా నీకు నిపుణంగా చెప్పాను. ఇంద్రా! గోదానపరులు పొందే ఫలితాన్ని విను. పిత్రార్జితమైన ధనంతో, గోవులను కొని, దానం చేసినవాడు ధనంతో ధర్మంతో సంపాదించుకొన్న అక్షయలోకాలను పొందగలడు. ఇంద్రా! జూదంలో ధనాన్ని గెలిచి, గోవులను కొని, దానం చేసినవాడు పదివేల దివ్యసంవత్సరాలవరకు ఆ ఫలితాన్ని అనుభవిస్తాడు. పిత్రార్జితంద్వారా, న్యాయపూర్వకంగా సంపాదించిన గోవులను దానం చేసిన వారికి ఆ గోవులు అక్షయ ఫలితాలను అందిస్తాయి. ఇంద్రా! దానంగా స్వీకరించిన గోవులను నిర్మల హృదయంతో తిరిగి దానమిచ్చినవానికి కూడా అక్షయ స్థిరలోకాలు లభిస్తాయి. పుట్టిననాటి నుండి సత్యమే పలుకుతూ, జితేంద్రియుడై, గురువులు, బ్రాహ్మణుల ప్రవృత్తిని సహిస్తూ, క్షమా శీలుడై ఉన్నవాడు. గోలోకానికి వెళతాడు. ఇంద్రా! ఎప్పుడూ బ్రాహ్మణుల విషయంలో అనరాని మాట లనరాదు. మనస్సులో కూడా గోవులకు ద్రోహాన్ని తలపెట్టగూడదు. బ్రాహ్మణుడు గోవృత్తితో, గోవుల అవసరాలను తీర్చుతూ, సత్యధర్మ పరాయణుడై జీవించాలి. అటువంటి వాని ఫలితమిది. ఒక్క గోవును దానం

చేసినా సహస్ర గోదానఫలాన్ని పొందగలడు. ఇటువంటి గుణాలు గల క్షత్రియునకు కూడా బ్రాహ్మణునితో సమానమైన ఫలమే కలుగుతుంది. ఆ క్షత్రియుని గోదానం కూడా బ్రాహ్మణ గోదానం వంటిదే అవుతుందని నిర్ణయం. ఇటువంటి గుణాలుగల వైశ్యుడు ఒక గోవును దానమిస్తే అయిదు వందల గోవులను దానమిచ్చినట్లే. వినయశీలుడైన శూద్రుడు ఒక గోవును దానమిస్తే రెండువందల యాభై గోవులను దానమిచ్చిన ఫలం లభిస్తుంది. ఏకాగ్రతతో పైన చెప్పిన నియమాలను పాటిస్తూ సత్యపరాయణుడై, గురుశుశ్రూషాతత్పరుడై, సమర్థుడై, క్షమాశీలుడై, దేశభక్తుడై, ప్రశాంతుడై, శుచియై, జ్ఞానియై, ధర్మశీలుడై, అహంకారశూన్యుడై, యథావిధిగా పాడియావును బ్రాహ్మణునకు దానమిచ్చినవాడు మహాఫలాన్ని పొందగలడు.

ఇంద్రా! నిత్యమూ ఏకభుక్తంతో ఉండి గోదానం చేసినవాడు, సదా సత్య పరాయణుడు, గురుశుశ్రూషకుడు, వేదాధ్యాయి, గోభక్తుడు, గోదానం ద్వారా ఆనందించే వాడు, పుట్టిననాటి నుండి గోవులకు ప్రణమిల్లేవాడు కూడా ఇదే ఫలితాన్ని పొందుతాడని గ్రహించు. రాజసూయం చేస్తే ఏ ఫలితం లభిస్తుందో, భూరిసువర్ణదానాలతో యాగం చేస్తే ఏ ఫలం లభిస్తుందో, దానితో సమానమైన ఫలితాన్ని కూడా పొందగలడు. సజ్జనులు, ఋషులు, సిద్ధులు ఈ రీతిగా చెప్పారు. నిత్యమూ, గోవ్రతాన్ని పాటిస్తూ భోజనానికి ముందు గోవులకు గడ్డిపెడుతూ, సత్యవాదియై, ప్రశాంతుడై, లోభరహితుడై జీవించే సత్యశీలుడు ప్రతి సంవత్సరమూ వేయిగోవులను దానమిచ్చినంత పుణ్యాన్ని పొందగలడు. గోవులపై ప్రేమతో, తానొకపూట భుజించి, రెండవ పూటలోని తన ఆహారాన్ని గోవులకు ఇస్తూ, పదిసంవత్సరాలు గోవ్రతాన్ని పాటించినవాడు అనంతసుఖాలను పొందగలడు. ఇంద్రా! తానొకపూట భుజించి, రెండవపూట వ్యయంతో గోవునుకొని, దానం చేసినవాడు ఆ గోవు శరీరంపై ఎన్ని రోమాలుంటాయో అన్ని గోవులను దానం చేసిన అక్షయ ఫలాన్ని పొందుతాడు.

ఇది బ్రాహ్మణుడు పొందే ఫలం. ఇక క్షత్రియుడు పొందే ఫలాన్ని విను. క్షత్రియుడు అయిదు సంవత్సరాలపాటు ఈ రీతిగా గోవులను సేవిస్తే అతడు కూడా అటువంటి ఫలితాన్నే పొందగలడు. ఆ సమయంలో అర్ధభాగంతో వైశ్యుడు, దానిలో అర్ధభాగంతో శూద్రుడు కూడా అటువంటి ఫలితాన్నే పొందగలరు. తనను తాను అమ్ముకొని, ఆ సొమ్ముతో గోవులను కొని, దానమిచ్చినవాడు గోజాతి ఉన్నంతకాలం గోదాన ఫలితాన్ని అనుభవిస్తాడు. మహాభాగా! గోవుల రోమరోమంలోనూ అక్షయలోకాలుంటాయి. కౌశికా!

పోరి, సంపాదించి, గోవులను దానమిచ్చినవానికి, ఆత్మ విక్రయంతో గోవులను కొని ఇచ్చిన వానితో సమానంగా శాశ్వత లోకాలను పొందగలడు. గోవులను ఇవ్వలేనపుడు వ్రతశీలుడై తిలధేనువును దానమిచ్చినవాడు ఆ గోవు ద్వారా కష్టాలను అధిగమించి క్షీరనదీ తీరంలో ఆనందంగా జీవిస్తాడు.

గోవును దానమిచ్చాడనిపించు కోవటం గొప్పకాదు. తగిన వానికి, తగిన వేళలో, తగిన గోవును, తగిన రీతిగా ఇవ్వటం ముఖ్యం. విప్రా! గోవులలో భేదాన్ని కానీ, అగ్ని సూర్యసమానులై యోగ్యులయిన వారిని కానీ గ్రహించటం కష్టం. పవిత్ర వంశంలో పుట్టి, స్వాధ్యాయ సంపన్నుడై, ప్రశాంతుడై, యాగాసక్తుడై, పాపభీతి గలిగి, అనేక విషయాల నెరిగి, గోవుల విషయంలో సహనశీలుడై, మరీ తీవ్ర స్వభావం లేనివాడై, గోరక్షణ చేయకలిగి జరుగుబాటు లేని బ్రాహ్మణుడు గోదానానికి అర్హుడు. జరుగుబాటులేక కష్టాలు పడుతున్న బ్రాహ్మణునకు కానీ, వ్యవసాయం కోసంకానీ, హోమం కోసం కానీ, బాలింత కోసం కానీ, గురుదక్షిణకై కానీ, శిశుపోషణకు కానీ దేశకాలాలతో సంబంధం లేకుండా ధేనువును దానమివ్వాలి. చూడిది, కొన్నది, జ్ఞానంతో సంపాదించిందీ, మార్పిడితో పొందినదీ, పరాక్రమంలో గెలుచుకొన్నదీ, కట్నంగా పొందినదీ, పోషించలేక విడువబడినదీ, పోషణకై వచ్చి చేరినదీ – ఇటువంటి ఆవులు దానానికి యోగ్యమైనవి. బలిష్ఠాలై, సాధుస్వభావమూ, మంచి వాసన కలిగి వయస్సులో ఉన్న ఆవులు దానానికి యోగ్యమైనవని అందరూ అంటారు.

నదులలో గంగ గొప్పదైనట్లు ఆవులలో కపిల గోవు గొప్పది. తాను మూడు రాత్రులు నీటిని మాత్రమే త్రాగుతూ ఉపవసించి, భూమిపై నిదురించి, గోవులను తృప్తిపరిచి, తృప్తినందిన బ్రాహ్మణులకు దానమివ్వాలి. పాలుత్రాగుతూ పుష్టిగా ఉన్న దూడలతో పాటు పుష్టిగా ఉన్న గోవులను దానం చేసి ఆపై మూడురోజులు గోరసాలతోనే గడపాలి. మంచిలక్షణాలు, చక్కని దూడ కలిగి, బాగా పాలనిస్తూ, పారిపోయే స్వభావం లేని ధేనువును దానమిస్తే, దాని శరీరంపై ఎన్ని రోమాలుంటే అన్ని సంవత్సరాలు పరలోకంలో సుఖిస్తాడు. అదే విధంగా బలిష్ఠమై, బరువుమోయగలిగి, సాధువర్తన గలిగి, నాగలిని వహించగల శక్తివంతమైన కోడెదూడను బ్రాహ్మణునకు దానమిస్తే పది ఆవులను దానమిచ్చినవాడు పొందగల లోకాలను పొందుతాడు. ఇంద్రా! అరణ్యంలో బ్రాహ్మణులను గానీ, గోవులను కానీ కాపాడినవాడు క్షణకాలంలో పాపవిముక్తుడవుతాడు. అతడు పొందే పుణ్యఫలాన్ని విను. ఇంద్రా! అశ్వమేధయాగంతో సమానమైన శాశ్వత ఫలాన్ని పొందుతాడు. మృత్యుకాలంలో తాను కోరిన స్థితిని మరుసటి జన్మలో పొందగలడు. బహువిధ దివ్యలోకాలను

పొందగలడు. ఇటువంటి దానకర్మతో మానవుడు తన మనస్సులో భావించిన సమస్తాన్నీ పొందగలడు. గోవుల అనుగ్రహంతో అంతటా పూజల నందుకొనగలడు. ఇంద్రా! పైన చెప్పిన విధంగా అరణ్యాలలో ఉంటూ గోవులను అనుసరిస్తూ విషయాసక్తి లేనివాడై, నియమితుడై, శుచియై గడ్డిని, ఆకులను, గోమయాన్ని తింటూ ఏ కోరికలూ మనస్సులో పెట్టుకోక ఆనందంగా జీవించినవాడు దేవతలతో పాటు నా లోకంలో, లేదా తనకిష్టమైన లోకంలో నివసిస్తాడు."

74. గోదాన సువర్ణదాన మాహాత్మ్యము.

ఇంద్రుడిలా అడిగాడు. "తెలిసి తెలిసి గోవును అపహరించి, సొమ్ముకోసం దానిని అమ్మినవానికి ఎటువంటి గతి కలుగుతుందో తెలిసికోవా లనుకొంటున్నాను." పితామహుడు చెప్తున్నాడు. "ఆహారం కోసం లేదా అమ్మకం కోసం లేదా బ్రాహ్మణునకు దానమివ్వటం కోసం గోవును అపహరించేవాడు పొందే ఫలాన్ని విను. మాంసవిక్రయం కోసం కానీ, మాంసభక్షణకోసం కానీ నిరంకుశంగా, గోవును హింసించినవాడు, స్వార్థంతో గోహంతకునికి గోవును చంపమని అనుమతించే వాడు పాపానికి ఎర అవుతాడు. గోవును చంపేవాడూ, చంపటానికి అనుమతించేవాడూ, గోమాంసం తినేవాడూ ఆ గోవు శరీరంపై ఎన్ని రోమాలుంటాయో అన్ని సంవత్సరాలు నరకంలో మునుగుతాడు. రాజా! బ్రాహ్మణయజ్ఞాన్ని ధ్వంసం చేసిన వానిని ఏ దోషాలు ఎంతమేర సంక్రమిస్తాయో, ఆ దోషాలు అంతమేర గోవును అపహరించి విక్రయించినా సంక్రమిస్తాయి అంటారు. గోవును అపహరించి బ్రాహ్మణునకు దానమిస్తే ఆ గోదాన పుణ్యమెంతకాలం వర్తిస్తుందో అంతకాలం నరకాన్ని అనుభవిస్తాడు.

మహాతేజస్వీ! గోదాన సమయంలో కొంత బంగారాన్ని కూడా దానమివ్వాలి. దక్షిణకై బంగారం అన్నిటికన్న గొప్పదనటంలో సంశయం లేదు. గోదానం వలన ఆటు ఏడు తరాలు, ఇటు ఏడుతరాలు తరిస్తాయి. బంగారాన్ని దక్షిణగా దానితో కలిపి ఇస్తే రెట్టింపు ఫలితం లభిస్తుందంటారు. ఇంద్రా! సువర్ణదానమే ఉత్తమదానం. దక్షిణలలో సువర్ణమే మిన్న. పవిత్ర వస్తువులలో పరమపవిత్రమైనది బంగారమే అంటారు. మహాతేజస్వీ! ఇంద్రా! వర్ణాలనన్నింటినీ పవిత్రం చేయగలది బంగారం. ఈ రీతిగా దక్షిణలను గురించి నీకు సంక్షేపంగా చెప్పాను." భీష్ముడు చెప్తున్నాడు. "భరతర్షభా! ఇది పితామహుడు ఇంద్రునకు చెప్పినది. ఇంద్రుడు దశరథునకు, దశరథుడు రామునకు చెప్పారు. రాముడు

కూడా తనకు ప్రియసోదరుడు, కీర్తిమంతుడు అయిన లక్ష్మణునకు చెప్పాడు. రాజా! అరణ్య వాససమయంలో లక్ష్మణుడు ఋషులకు చెప్పాడు. పరంపరగా వచ్చిన ఈ క్లిష్టమైన ఉపదేశాన్ని వ్రతశీలురైన రాజులు, ధార్మికులు పాటించారు. యుధిష్ఠిరా! నా గురువు పరశురాముడు దీనిని నాకు చెప్పాడు. దీనిని బ్రాహ్మణసభలలో నిత్యమూ ప్రవచించేవాడు, యజ్ఞకాలంలో, గోదాన కాలంలో ఏ ఇద్దరు కలిసినా, దీనిని చర్చించేవాడు ఎప్పుడూ దేవతలతో పాటు అక్షయసుఖాలను పొందగలడు. ఈ విషయాన్ని పరమేశ్వరుడైన ఆ బ్రహ్మ ఇంద్రునితో చెప్పాడు."

75. దమ సత్య బ్రహ్మచర్యాదుల ఫలము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "ప్రభూ! నీవు ధర్మాలనుపదేశించి నాకెంతో విశ్వాసాన్ని కలిగించావు. పితామహా! మరొక సందేహాన్ని అడుగుతాను. నాకు చెప్పాలి. మహాతేజస్వీ! వ్రతాల ఫలితమేమిటి ? ఎటువంటిది ? నియమపాలన ఫలమేమిటి ? స్వాధ్యాయ ఫలితమేమిటి ? దానఫలమేమిటి? వేదధారణ ఫలమేది ? అధ్యాపన ఫలితమేమిటి ? ఇదంతా వినాలనుకొంటున్నాను. పితామహా! లోకంలో ఏ దానమూ పట్టనివాడు పొందే ఫలితమేమిటి ? వేదవిద్యను దానం చేసేవాడు పొందే ఫలమేది? స్వకర్మాసక్తులూ, శూరులూ పొందే ఫలమేమిటి ? శౌచాన్ని పాటించటం వలన ఫలమేది ? బ్రహ్మచర్య పాలన ఫలితమేమిటి ? పితృసేవవలన అదే రీతిగా మాతృసేవ వలన పొందే ఫలమేమిటి ? ఆచార్యులనూ, గురువులనూ సేవించినందువలనా, ఇతరులపై అనుగ్రహాన్నీ, దయనూ చూపించటం వలనా పొందే ఫలితమేమిటి ? పితామహా! దీనిని పూర్తిగా యథాతథంగా వినాలనుకొంటున్నాను. ధర్మజ్ఞా! నాకెంతో కుతూహలంగా ఉంది".

భీష్ముడు చెప్తున్నాడు. "ఏ వ్రతాన్ని అయినా యథావిధిగా చక్కగా ప్రారంభించి అవిచ్ఛిన్నంగా నిర్వహించగలవాడు సనాతనలోకాలను పొందగలడు. రాజా. నియమపాలన ఫలం కళ్ళెదుటే కనిపిస్తుంది. నియమాలనూ, యాగాలనూ పాటించటం వలననే నీవీ ఫలాన్ని పొందగలిగావు. స్వాధ్యాయ ఫలం ఇహలోకంలో, పరలోకంలో కూడా కనిపిస్తుంది. స్వాధ్యాయపరుడు ఈ లోకంలోనూ, బ్రహ్మలోకంలోనూ ఆనందాన్ని పొందగలడు. రాజా! ఇంద్రియనిగ్రహఫలాన్ని సవిస్తరంగా విను. జితేంద్రియులు అంతటా సుఖిస్తారు. అంతటా ఆనందిస్తారు. జితేంద్రియులు స్వేచ్ఛగా ఎక్కడికైనా వెళ్ళగలరు. కోరిన వన్నీ పొందగలరు. సర్వశత్రువులనూ జయించగలరు. దానిలో అనుమానం లేదు. పాండవా! జితేంద్రియులు

అన్ని తావులా కోరినవన్నీ పొందగలరు. తపస్సుతో, పరాక్రమంతో, దానాలతో, వివిధ యాగాలతో స్వర్గంలో ఆనందించగలిగినట్లు, క్షమాశీలురయిన జితేంద్రియులు కూడా స్వర్గంలో ఆనందించగలరు. దానం కన్నా దమం విశిష్టమైనది. బ్రాహ్మణులకు దానమిస్తూ ఎప్పుడైనా దాత కోపించే అవకాశముంది. కానీ జితేంద్రియుడు కోపించడు. కాబట్టి దానం కన్నా దమం గొప్పది. దానమిస్తూ కోపపడనివానికి సనాతనలోకాలు లభిస్తాయి. కోపం దానఫలాన్ని నశింపజేస్తుంది. కాబట్టి దానం కన్నా దమం శ్రేష్ఠం. మహారాజా! సర్వలోకాలలో నివసించే ఋషులకు స్వర్గలోకంలో వేలకొలదిగ అదృశ్యలోకాలున్నాయి. దమంతో మహాలోకాలను పొందగోరిన ఋషులు, దేవతలు ఇక్కడనుండి ఆ లోకాలను చేరగలరు. **కాబట్టి దానం కన్నా దమం విశిష్టం.**

రాజా! అధ్యాపకుడు బోధనలో క్లేశాలను అనుభవించినందువలన అక్షయఫలాన్ని అనుభవిస్తాడు. రాజా! యథావిధిగా అగ్నిలో హోమం చేసి బ్రహ్మలోకంలో వసించవచ్చు. వేదాధ్యయనం చేసి వేదాలను ధర్మపరాయణులకు అందించినవాడూ, గురువుల కర్మలను అభినందించినవాడు స్వర్గలోకంలో వెలుగొందుతాడు. వేదాధ్యయనంలో, యాగ కర్మలలో, దానంలో ఆసక్తిగలిగి యుద్ధంలో ఇతరులను రక్షించినవాడు కూడా స్వర్గంలో వెలుగొందుతాడు. స్వకర్మాసక్తుడైన వైశ్యుడు దానంతో మహా ఫలాన్ని పొందగలడు. స్వకర్మాసక్తుడైన శూద్రుడు సేవతో స్వర్గాన్ని చేరగలడు. శూరులు, రకరకాలుగా ఉంటారు. వారికి కలిగే లాభాలను చెపుతాను, విను. శూరులవంశంలో పుట్టినవారికి, శూరులకు నిర్దేశించిన ఫలితాన్ని విను. మానవులలో యజ్ఞశూరులు, దమశూరులు, అలాగే యుద్ధశూరులు, దానశూరులు ఉంటారు. అదేరీతిగా కొందరు బుద్ధిశూరులు, మరికొందరు క్షమాశూరులు. చాలామంది సాంఖ్యశూరులు. మరికొందరు యోగ శూరులు, కొందరు అరణ్య వాసశూరులు, కొందరు గృహవాస శూరులు. త్యాగశూరులు కొందరు. కొందరు ఋజువర్తనలో శూరులు, కొందరు మానవులు శమ శూరులు. ఇతరులెందరో వివిధ విషయాలలో శూరులై ఉంటారు. వేదాధ్యయన శూరులు, వేదాధ్యాపన శూరులు. కొందరు గురుశుశ్రూషలో, మరికొందరు పితృశుశ్రూషలో కొందరు మాతృసేవలో, మరికొందరు భిక్షాటనలో శూరులు. కొందరు వనవాసంలో, కొందరు గృహనివాసంలో, కొందరు అతిథి పూజలలో శూరులు, వారందరూ తమ కర్మఫలంతో గెలుచుకొన్న పరలోకాలకు వెళతారు.

సర్వవేదాలను ధారణ చేయటం, సర్వతీర్థాలలో మునగటం - వీటివలన కలిగే ఫలం నిత్యమూ సత్యాన్ని పలికే వాడు పొందే ఫలంతో సమానమవుతుందో?

కాదో? సందేహమే ! వేయి అశ్వమేధయాగాలనూ, ఒక్క సత్యవాక్యాన్నీ త్రాసులో పెట్టి తూస్తే వేయి అశ్వమేధయాగాలకన్నా సత్యమే మిగులుగా ఉంటుంది. సత్యంవలననే సూర్యుడు తపిస్తున్నాడు. అగ్ని సత్యంవలననే వెలుగుతుంది. సత్యంవలననే గాలులు వీస్తున్నాయి. అంతా సత్యంమీదనే ప్రతిష్ఠితమై ఉంది. దేవతలు, పితరులు, బ్రాహ్మణులు సత్యంతో ఆనందిస్తారు. సత్యమే పరమధర్మమంటారు. కాబట్టి సత్యాన్ని దాటిపోకూడదు. మునులు సత్యపరాయణులు, మునులు సత్యవిక్రములు, మునులు సత్యప్రతిజ్ఞలు. కాబట్టి సత్యం విశిష్టమైంది. భరతర్షభా! సత్యవంతులు స్వర్గలోకంలో సంతసిస్తారు. దమాన్ని గురించి, సత్యఫలప్రాప్తిని గురించి నేను పూర్తిగా చెప్పాను. వినయశీలుడు నిస్సందేహంగా స్వర్గంలో వెలుగొందుతాడు. రాజా! బ్రహ్మచర్యగుణాన్ని గురించి కూడా విను. రాజా! పుట్టిననాటినుండి మరణ పర్యంతమూ బ్రహ్మచారిగా ఉన్నవాడు పొందలేనిది ఏదీ లేదని గ్రహించు. ఇహలోకంలో సదా సత్యపరాయణులూ, జితేంద్రియులు, ఊర్ధ్వరేతస్కులు అయిన కోటానుకోట్ల ఋషులు బ్రహ్మలోకంలో నివసిస్తున్నారు. రాజా! బ్రహ్మచర్యాన్ని ఉపాసిస్తే సర్వపాపాలనూ దహిస్తుంది. ప్రత్యేకించి బ్రాహ్మణుని విషయంలో బ్రాహ్మణుని అగ్నిస్వరూపుడంటారు. తపస్వులైన బ్రాహ్మణులలో ఇది ప్రత్యక్షంగా కనిపిస్తుంది. బ్రహ్మచారి భయపెడితే ఇంద్రుడు కూడా భయపడతాడు. బ్రహ్మచర్యం యొక్క ఆ ఫలం ఇక్కడి ఋషులలో కనిపిస్తుంది. తల్లిదండ్రులను పూజించటంలోని ధర్మాన్ని గురించి కూడా విను. రాజా! తండ్రిని, తల్లిని, అన్నను, గురువును, ఆచార్యుని ఎప్పుడూ దోషదృష్టి లేకుండా సేవించినవానికి కలిగే ఫలాన్ని గ్రహించు. స్వర్గలోకంలో అందరి మన్ననలను పొందే స్థానమతనికి లభిస్తుంది. మనస్సునదుపులో నుంచుకొన్న అతడు గురుశుశ్రూషాఫలంగా నరకాన్ని కనీసం చూడడు."

76. గోదాన కథనము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "రాజా! అభిలషించే వారిని శాశ్వత లోకాలకు నడిపించగల గోదానానికి సంబంధించిన ఉత్తమ విధిని ఉన్నదున్నట్లుగా వినగోరుతున్నాను" భీష్ముడు చెప్తున్నాడు. "రాజా! గోదానాన్ని మించినది ఏదీ లేదు. న్యాయబద్ధంగా లభించిన గోవును దానం చేస్తే అది వెంటనే వంశాన్ని ఉద్ధరిస్తుంది. రాజా! సత్పురుషులకోసం ప్రాచీనులు ప్రకటించిన విధి ఈ ప్రజల కోసం కూడా చక్కగా కల్పించబడింది. కాబట్టి అనాదిగా ప్రవర్తిస్తున్న గోదానవిధిని నానుండి విను. ఒకప్పుడు గోవులను తన దగ్గరకు

తీసికొనిరాగా 'ఎటువంటి గోవును దానం చేయాలని సందేహించి, మాంధాత బృహస్పతి నడిగాడు. బృహస్పతి ఇలా చెప్పాడు. "నియమబద్ధంగా వ్రతాన్ని పాటించి, బ్రాహ్మణుని సత్కరించి, 'రేపు గోదానం చేస్తా'నని చెప్పి, ఆపై దానమివ్వటం కోసం ఎర్ర ఆవును ఎన్నుకొని 'సమంగే' బహులే' అని దానిని సంబోధించి, గోవుల మధ్య ప్రవేశించి, ఈ శ్రుతివచనాన్ని పలకాలి. "ఆవు నాకు తల్లి, ఎద్దు నాకు తండ్రి. అవే నాకు స్వర్గం అవే నాకు సుఖప్రదం. గోవే నాకు ఆధారం" అంటూ వాటిని శరణు కోరి గోవుల మధ్య ఆ రాత్రి మౌనంగా వసించి, ఉదయం గోదాన సమయంలో మరల మాటాడాలి. ఈ రీతిగా గోవులతోపాటు ఒక రాత్రి గడిపి వాటివలె వ్రతపాలన చేస్తూ, వాటితో పాటు ఏకాత్మభావంతో ఉండటం ద్వారా వెంటనే పాపంనుండి ముక్తినందుతాడు.

సూర్యోదయ వేళలో దూడతోపాటు ఆవును దానమివ్వాలి. దానితో స్వర్గప్రాప్తి కలుగుతుంది. అర్థవాదమంత్రాలలోని ఆశీస్సులు నీకు లభిస్తాయి. "గోవులు ఉత్సాహంగలవి. బలం, మేధ గలవి. యజ్ఞాని కుపకరించే అమృతస్వరూపమైన హవిస్సుకు జన్మస్థానాలు. ఈ జగత్తునకు ఆధారాలు. భూమిపై మొక్కలను మొలిపించేవి. సంసారప్రవాహాన్ని నడిపించేవి. గోవులు ప్రజాపతి సంతతి. ఇది గోప్రశంస. సూర్యచంద్రుల అంశల నుండి గోవులు నా పాపాన్ని పోగొట్టాలి. స్వర్గగమనానికి సాధనాలు కావాలి. తల్లివలె నాకు ఆశ్రయం కావాలి. అలాగే మంత్రం ద్వారా చెప్పిన ఆశీస్సులన్నీ కూడా నాకు దక్కాలి. గోవులారా! మిమ్ములను ఆరాధించటంలో ఆసక్తులైన వారి కర్మలచే క్షయాదివ్యాధులను తొలగించటంలో, దేహముక్తిని కలిగించటంలో మీ ప్రవృత్తి ఉంది. సరస్వతివలె శుభాలను కల్పించగలరు. మీరు ప్రసన్నతతో, సర్వపుణ్యాలతో పొందదగిన అభీష్టగతిని అందజేయండి. గోదాత స్వీకర్తకు కనిపించగానే యధావిధిగా "యావై.. ప్రదాతా" (గోవులారా! మీ రూపమే నా రూపం. భేదంలేదు. ఈరోజు మిమ్ములను దానంచేసి నన్ను నేనే దానమిచ్చినట్లయింది) అన్న శ్లోకార్థాన్ని పరించాలి. అప్పుడు గోదానవిధి నెరిగిన బ్రాహ్మణుడు గోవును స్వీకరిస్తూ మిగిలిన సగం శ్లోకాన్ని - "మనసా... రూపాసా" (సౌమ్యరూపమూ, ఉగ్రరూపమూ గల గోవులారా! దాత మనస్సు నుండి తొలగివచ్చారు. నా అదుపులోనికి వచ్చారు) అని చెప్పాలి.

గోవులకు బదులు వాటి మూల్యాన్నో, వస్త్రాలనో, బంగారాన్నో దానం చేసినా గోదాత అనియే అనాలి. ఆ రూపంలో వాటిపేర్లు ఊర్ధస్య, భవితవ్య, వైష్ణవి దానసంకల్పంలో ఆ పేర్లు చెపుతూనే దాత దానం చేయాలి. అలా దానం చేసిన వాటి ఫలమిది. గోవుల

మూల్యాన్ని ధనరూపంలో చెల్లించినవాడు ముప్పయి ఆరు సంవత్సరాలు, వస్త్రరూపంలో ఇచ్చినవాడు ఎనిమిది సంవత్సరాలు, సువర్ణరూపంలో ఇచ్చినవాడు ఇరవై సంవత్సరాలు. పరలోకంలో సుఖిస్తాడు. నిష్క్రయరూపమైన గోదాన ఫలాన్ని క్రమంగా చెప్పాను. ఈ ఫలితాలను చక్కగా గ్రహించాలి. గోవు స్వీకర్త వెంటవెళ్తూ ఎనిమిది అడుగులు వేయగానే గోదాత ఆ ఫలాలను పొందుతాడు. గోదాత శీలవంతుడవుతాడు. గోవుల మూల్యాన్ని ధనరూపంలో ఇచ్చినవాడు నిర్భయుడవుతాడు. ఇష్టానుసారం సువర్ణరూపంలో ఇచ్చినవాడు ఎప్పుడూ దుఃఖానికి లోనుగాడు. ఉదయమే లేచి అనుష్ఠానం చేసేవాడు, మహాభారత పండితుడు, వైష్ణవుడు - అందరూ చంద్రలోకాన్ని పొందుతారు. గోవును దానం చేసి మూడు రాత్రులు గోవ్రతాన్ని పాటించాలి. వాటితో కలిసి ఒకరాత్రి నిదురించాలి. కామాష్టమినుండి మూడు రాత్రులు గోమయాన్ని కానీ, గోరసాలను కానీ, ఆవుపాలను కానీ ఆహారంగా స్వీకరించాలి. ఒక ఎద్దును దానం చేస్తే దేవవ్రతి (సూర్యమండలాన్ని ఛేదించి వెళ్ళగల బ్రహ్మచారి) అవుతాడు. గోవుల జంటను దానమిస్తే వేదవిద్యను పొందుతాడు. అలాగే విధినెరిగి గోదాన యజ్ఞం చేస్తే ఉత్తమలోకాలు లభిస్తాయి. విధి నెరుగని వానికి ఫలప్రాప్తి లేదు. ఒక పాడి ఆవును దానమిస్తే ఇహలోకభోగాలను అన్నింటినీ దానమిచ్చినంతఫలం. ఇక హవ్యకవ్యరాసులతో కూడిన అనేక గోవులను సరిగా దానమిస్తే చెప్పేదేముంది ? గిత్తను దానమివ్వటం ఆవును దానం చేయటం కన్న శ్రేష్ఠం. తన శిష్యుడు కాని వానికీ, వ్రతపాలన చేయనివానికీ, శ్రద్ధలేనివానికీ, వక్రబుద్ధికీ గోదానవిధిని ఉపదేశింపదగదు. ఇది అందరూ రహస్యంగా ఉంచవలసిన ధర్మం. ఎక్కడపడితే అక్కడ దీనిని చెప్పదగదు. లోకంలో శ్రద్ధలేని మనుష్యులున్నారు. రాక్షస స్వభావం గల మనుష్యులలో ఎందరో క్షుద్రులున్నారు. పుణ్యహీనులెందరో నాస్తికులై ఉన్నారు. అటువంటివారికి దీనినుపదేశించటం అనిష్టహేతువే.

రాజా! బృహస్పతి చెప్పిన ఈ మాట విని, గోవులను దానమిచ్చి, రాజులెందరో ఉత్తమలోకాలు పొందారు. సదా పుణ్యశీలురై సత్కర్మల నాచరించారు. వారిపేర్లు చెపుతా విను. ఉశీనరుడు, విష్వగశ్వుడు, నృగుడు, భగీరథుడు, విశ్రుతుడు, యౌవనాశ్వుడు, మాంధాత, ముచుకుందుడు, భూరిద్యుమ్నుడు, నైషధుడు, సోమకుడు, పురూరవుడు, భరతచక్రవర్తి, ఆ వంశంలోని (భారతులు) వారందరూ, వీరుడైన దశరథరాముడు, ప్రఖ్యాతులైన ఇతరులెందరో రాజులు, పృథుకర్ముడు, దిలీపుడు - వీరంతా గోదాన విధి నెరిగి స్వర్గానికి చేరారు. మాంధాత యజ్ఞాలు, దానాలు, తపస్సు, రాజధర్మాలు, గోదానం

మొదలైన ఉత్తమగుణాలతో కూడినవాడు. కాబట్టి యుధిష్ఠిరా! నీవు కూడా నేను చెప్పిన ఈ బృహస్పతి వచనాన్ని అవధరించి, కురురాజ్యాన్ని పొంది, ప్రసన్నుడవై బ్రాహ్మణ శ్రేష్ఠులకు పవిత్రగోవులను దానమివ్వు". వైశంపాయనుడు చెప్పాడు. "ఆ రీతిగా యథావిధిగా గోదానం చేయమని భీష్ముడు ఆదేశించగా అదంతా చేశాడు ధర్మరాజు. దేవదేవుడైన బృహస్పతి మాంధాతకు చేసిన ఉత్తమధర్మోపదేశాన్ని కూడా చక్కగా గ్రహించాడు. రాజా! ఈ రీతిగా రాజశ్రేష్ఠుడైన ధర్మరాజు నిత్యమూ గోదానాసక్తుడై, గోమయంతో పాటు యవల నూకలను ఆహారంగా తీసికొంటూ జితేంద్రియుడై, నేలపై శయనించేవాడు. జటలను దాల్చి ధర్మస్వరూపుడై భాసించాడు. రాజా ! యుధిష్ఠిరరాజు సదా గోవుల విషయంలో వినీతచిత్తుడై, వాటిని ప్రస్తుతిస్తూ ఉండేవాడు. ఎప్పుడూ గోవులను వాహనాలుగా వాడలేదు. మేలుజాతి గుర్రాలద్వారానే ప్రయాణాలు చేసేవాడు."

77. కపిలగోవుల ఉత్పత్తి మాహాత్మ్యాలు.

ఆ తరువాత యుధిష్ఠిర నరపాలుడు మరల భీష్మనరేంద్రుని వినయంగా గోదానధర్మానికి సంబంధించి విస్తారంగా చెప్పమని ఇలా అడిగాడు. "భారతా! గోదానంలోని గుణాలను నాకు చక్కగా మరలా చెప్పవలసింది. వీరా! ఇటువంటి అమృత విషయాలు ఎంత విన్నా తృప్తిచెందలేకున్నాను." వైశంపాయనుడిలా అన్నాడు. "అప్పుడు ధర్మరాజు అలా అడగగానే భీష్మనరపాలుడు గోదానానికి సంబంధించిన శుద్ధగుణాలను ఆయనకు చక్కగా ఇలా చెప్పాడు.

"వాత్సల్యమూ, గుణసంపదా, యౌవనమూ గల గోవును వస్త్రాలతో కప్పి విప్రునకు దానమిస్తే సర్వపాప విముక్తి కలుగుతుంది. అటువంటి గోవును దానమిస్తే అసుర్య నామకమైన నరకంలో పడడు. నీరు త్రాగటం, గడ్డి తినటం కూడా మందగించి, వట్టిపోయి, ఈతలు మాని, ముసలితనంతో, రోగాలతో, కూడి పాడుబడిన బావివలె శిథిలమైన గోవును దానం చేసి విప్రునకు కష్టాలు కలిగిస్తే దాత తమోమయనరకంలో పడతాడు. కోప స్వభావం, దుష్ప్రవృత్తి, రోగాలు, బలహీనత గల ఆవును డబ్బిచ్చి కొనకుండా దానం చేయదగదు. ఈ దానం విప్రుని (స్వీకర్తను) ఇబ్బంది పెడుతుంది. దాతకు దుర్బల నిష్ఫల లోకాలే ప్రాప్తిస్తాయి. బలిష్ఠాలై, సాధుస్వభావమూ, మంచివాసన గలిగి వయస్సులో ఉన్న ఆవులు దానానికియోగ్యమైనవని అందరూ అంటారు. నదులలో గంగ గొప్పదైనట్లు ఆవులలో కపిలగోవు గొప్పది."

యుధిష్ఠిరుడడిగాడు. "ఏ రంగు ఆవును దానమిచ్చినా ఒకటేగదా! కపిల గోదానాన్ని సజ్జనులెందుకు ప్రశస్తమన్నారు? కపిలగోదాన ప్రభావవిశేషాన్ని వినగోరుతున్నాను. నేను వినగలవాడను, తమరు చెప్పగలవారు." భీష్ముడు చెప్తున్నాడు. "నాయనా! పెద్దలు చెప్తుండగా కపిలగోవుల ఉత్పత్తిని గూర్చిన పురాతన వృత్తాంతాన్ని విన్నాను. దానినంతా నీకు చెప్తాను. ప్రజలను సృష్టించు అని సృష్ట్యారంభంలో బ్రహ్మ దక్షుని ఆదేశించాడు. ప్రజలహితాన్ని కోరుతూ ఆయన ముందుగా జీవికనే సృష్టించాడు. రాజా! దేవతలు అమృతాన్ని ఆశ్రయించి బ్రతుకుతున్నట్లు ప్రజలు బ్రతుకుతెరువు నాశ్రయించి జీవిస్తుంటారు. స్థావర ప్రాణులకన్నా జంగమ ప్రాణులు శ్రేష్ఠం. వాటిలో మనుష్యులు, వారిలో బ్రాహ్మణులు ఎప్పుడూ శ్రేష్ఠం. యజ్ఞ ప్రతిష్ఠ వారిలోనే ఉంది. యజ్ఞాలద్వారా చంద్రుని చేరవచ్చు. ఆ యజ్ఞం గోవుల మీద ప్రతిష్ఠింపబడి ఉంది. ఆ యజ్ఞంతో దేవతలు ఆనందిస్తారు. కాబట్టి ముందు బ్రతుకు తెరువు, ఆపై ప్రజలు (సంతతి). పుట్టినవెంటనే ప్రాణులు వృత్తికోసం ఆక్రోశించాయి. దప్పికగొన్న శిశువు తల్లిదండ్రులను సమీపించినట్లు, ప్రాణులు వృత్తిదాత అయిన దక్షుని దగ్గరకు వెళ్ళారు. ప్రజల ఈ స్థితిని గురించి మనసా చింతించి పూజ్యుడైన ప్రజాపతి ప్రజల బ్రతుకుతెరువుకై అప్పుడు అమృతాన్ని త్రాగాడు. అమృతాన్ని త్రాగి తాను తృప్తినందిన తరువాత, నోటినుండి దివ్య పరిమళం వెలువడింది. దానితో పాటు సురభి పేర గోవు వెలువడింది. అది ఆయన నోటినుండి పుట్టిన కుమార్తె. ఆ సురభి లోకమాతృకలయిన సౌరభేయులను సృష్టించింది. అవి బంగారువన్నెగలవి. ఆ కపిల గోవులు ప్రజల బ్రతుకుతెరువుకై పాలనిచ్చేవి.

నదుల అలలనుండి నురుగు వెలువడిన రీతిగా, నాలుగునైపుల స్రవిస్తున్న ఆ కపిలగోవుల తెల్లని పాలనుండి నురుగు వెలువడింది. ఒకసారి శివుడు నేలపై నిలిచి ఉండగా ఒక దూడనోటి నుండి ఆ నురుగు ఆయన తలపై పడ్డది. దానితో ఆయన కోపించి నుదుటికంటితో ఆ కపిల ఆవుదూడను దహిస్తున్నట్లుగా చూశాడు. రాజా! సూర్యుడు మేఘాలలో వివిధవర్ణాలను కలిగించినట్లు ఆ రుద్ర తేజస్సు ఆ కపిల గోవులలో నానావర్ణాలను కల్పించింది. అయితే ఆ ప్రదేశం నుండి పారిపోయి చంద్రుని ఆశ్రయించిన గోవులు తాము పుట్టినప్పటి రంగులోనే నిలిచిపోయాయి. వాటి రంగు మారలేదు. అప్పుడు కోపపూర్ణుడైన మహాదేవుడు దక్షునితో ఇలా అన్నాడు. "నీవు! అమృతంతో తడిశావు. దూడ ఆవుపాలు త్రాగితే అది ఎంగిలికాదు. చంద్రుడు అమృతాన్ని స్వీకరించి మరల స్రవింపజేసినట్లు. ఈ కపిలగోవులు అమృతం నుండి పుట్టిన పాలనిస్తాయి. "వాయువు,

అగ్ని బంగారం, సముద్రం, అమృతం ఎంగిలికానట్లు దూడలు పాలుత్రాగితే ఆ దూడలపై వాత్సల్యం గల గోవు ఎంగిలికాదు. గోవులు తమ పాలతో, నేతితో ఈ లోకాలను భరిస్తాయి. లోకులందరూ గోవుల దగ్గర నుండి మంగళకరమై, అమృతమయమైన క్షీరసంపదను కోరుతారు." అలాపలికి ప్రజాపతి పరమశివునకు అనేక గోవులతో పాటు ఒక ఎద్దును కూడా బహూకరించాడు. భారతా! దానితో రుద్రుని మనస్సు ప్రసన్నమైంది. ప్రసన్నుడైన మహాదేవుడు ఆ వృషభాన్ని వాహనంగా, తన ధ్వజచిహ్నంగా చేసికొన్నాడు. అందువలన ఆయన వృషధ్వజుడయ్యాడు. ఆపై దేవతలు ఆ మహాదేవుని పశుపతిని చేశారు. ఆ గోవుల మధ్య ఈశ్వరుడు వృషభాంకుడుగా పేరు పొందాడు. ఈ రీతిగా కపిలగోవులు మహాతేజస్సు గలవి. వాటి రంగు శాంతరూపం. అందువలన గోదానంలో కపిలగోదానం ప్రథమకల్పం.

గోవులు లోకంలో అన్నింటికన్నా శ్రేష్ఠమైనవి. లోకానికి బ్రతుకుతెరువును కల్పించేవి. రుద్రసాహచర్యం గలవి. చంద్రునినుండి స్రవించే అమృతం నుండి పుట్టినవి. శాంత పుణ్యస్వరూపాలు. కోరికలనిచ్చేవి, ప్రాణదానం చేసేవి. అటువంటి గోవులను దానమిచ్చినవాడు కోరికల నన్నిటినీ తీర్చినట్లే. గోవుల పుట్టుకకు సంబంధించిన ఈ ఉత్తమ కథను నిత్యమూ పరించేవాడు అపవిత్రుడైనా మంగళప్రియుడు కాగలడు. కలియుగ దోషాల నుండి విముక్తుడై ఆ మానవుడు సంపదను. సంతతిని, ధనాన్ని, పశువులను ఎప్పుడూ పొందుతాడు. గోదానం చేసినవాడు హవ్యకవ్యాలను, తర్పణను, శాంతికర్మలను చేసిన ఫలాన్ని, వాహనాలను, వస్త్రాలను, బాలవృద్ధుల సంతోషాన్ని పొందుతాడు. రాజా! ఇవి గోదాన గుణాలు, గోదాత ఇవన్నీ ఎప్పుడూ పొందగలడు." వైశంపాయనుడిలా చెప్పాడు. పితామహుని వాక్యాన్ని విని, అజమీఢవంశీయుడైన ధర్మరాజు సోదరులతో కలిసి, ఉత్తమ బ్రాహ్మణులకు బంగారువన్నె గల ఎద్దులను, ఆవులను దానం చేశాడు. అలాగే యజ్ఞదక్షిణలకోసం, పుణ్యలోకాలను జయించటం కోసం, ఉత్తమకీర్తిని పొందటం కోసం ధర్మరాజు ఆ బ్రాహ్మణులకు వందల, వేల గోవులను దానం చేశాడు."

78. వసిష్ఠుడు సౌదాసునకు గోదానమహిమ చెప్పుట.

భీష్ముడు చెప్తున్నాడు. "వసిష్ఠుడు సర్వలోకచరుడు. వైదిక జ్ఞాననిధి. సనాతనముని, ఇక్ష్వాకుల పురోహితుడు. ఒకానొక సమయంలో ఇక్ష్వాకువంశరాజు అయిన సౌదాసుడు వసిష్ఠునకు నమస్కరించి. ఇలా అడుగ నారంభించాడు. సౌదాసుడడిగాడు. "అనఘా!

స్వామీ! ముల్లోకాలలోనూ పవిత్రమైన దేది? దానిని కీర్తిస్తేనే చాలు మానవుడు ఎప్పుడూ ఉత్తమ పుణ్యాన్ని పొందగలగాలి." భీష్ముడు చెప్తున్నాడు. "రాజా! తనకు వినయంగా నమస్కరించిన ఆ సౌదాసునకు, గవోపనిషద్వేత్త అయిన వసిష్ఠుడు, గోవులకు నమస్కరించి, శుచియై, ఇలా చెప్పనారంభించాడు.

గోవులు సురభి గంధులు. గోవులు గుగ్గులు (గుగ్గిలం) గంధులు, ప్రాణులకు గోవులే ప్రతిష్ఠాస్థానం, గోవులు ప్రాణులకు మంగలనిధులు. భూతమూ, భవిష్యత్తూ గోవులే, సనాతనమైన పుష్టికీ, లక్ష్మికీ గోవులే కారణం. గోవులకు పెట్టిన పుణ్యం నశించదు. మనుష్యులకు పరమాన్నం గోవులే. దేవతలకు ఉత్తమ హవిస్సు గోవులే. స్వాహాకారవషట్కారాలు (దేవయజ్ఞం, ఇంద్రయాగం) ఎప్పుడూ గోవుల నాశ్రయించి ఉంటాయి. గోవులు యజ్ఞఫలాలనిస్తాయి. గోవులలోనే యజ్ఞాలు ప్రతిష్ఠింపబడి ఉంటాయి. భూతభవిష్యత్తులు గోవులే, యజ్ఞాలు గోవులమీదనే ఆధారపడతాయి. మహాతేజస్వీ ! పురుషోత్తమా! నిత్యమూ ప్రాతస్సాయం కాలాలలో గోవులు ఋషులకు హోమానికి అవసరమైన పదార్థాల నిస్తాయి. రాజా! అప్పుడే ఈనిన ఆవును దానం చేసినవారు, దుర్గమసంకటాల నుండి, దుష్కర్మల నుండి, సమస్తపాపాల నుండి తరిస్తారు (దాటి పోగలరు). పది ఆవులున్నవాడు ఒక ఆవును, వంద ఆవులున్నవాడు పది ఆవులను, వేయి ఆవులున్నవాడు వంద ఆవులను దానం చేయాలి. అందరికీ ఫలితం సమానమే. వంద ఆవులున్నా అగ్ని కార్యం చేయనివాడు, వేయి ఆవులున్నా యజ్ఞం చేయనివాడు, ధనవంతుడై కూడా కృపణుడు ఈ ముగ్గురు అర్ఘ్యానికి అర్హులు కారు. దూడతో, కంచు పాత్రతో పాటు ఉత్తమలక్షణాలు గల ఆవును వస్త్రాలతో అలంకరించి, దానమిచ్చినవారు ఇహపరలోకాలను గెలువగలరు. పరంతపా! పెద్దకొమ్ములు, ఇంద్రియసామర్థ్యమూ గలిగి, వంద ఆవులకు అధిపతి అయి కోడె వయస్సు గల ఆబోతును చక్కగా అలంకరించి, బ్రాహ్మణోత్తమునకు దానమిచ్చిన వారు మరల మరల ఈ లోకంలో జన్మిస్తూ ఐశ్వర్యాన్ని పొందుతారు

గోవును ప్రస్తుతించకుండా నిదురించరాదు. వాటిని స్మరిస్తూనే నిదురలేవాలి. ఉదయమూ, సాయంకాలమూ వాటికి నమస్కరించాలి. దానితో పుష్టిని పొందవచ్చు. గోవుల మలమూత్రాలను ఏ రీతిగానూ అసహ్యించు కొనరాదు. గోమాంసం తినరాదు. దానితో గోవులవలె పుష్టిని పొందవచ్చు. నిత్యమూ గోవులను కీర్తించాలి. అలాగే ఎప్పుడూ అవమానించరాదు. పీడకల వచ్చినప్పుడు నరుడు గోవును కీర్తించాలి. ఆవుపేడతో ఎప్పుడూ స్నానం చేయాలి. ఆవుపేడ పిడకలపై కూర్చొనాలి. వాటిపై ఉమ్మి వేయదగదు. మలమూత్ర

విసర్జన తగదు. వాటిని తిరస్కరించటం మానాలి. తడిసిన గోచర్మంపై కూర్చొని భుజించాలి. పశ్చిమం వైపు చూస్తూ మౌనంగా నేలపై కూర్చొని ఆవునేతిని తినాలి. దానితో నిత్యమూ గోపుష్టిని పొందగలడు. ఆవు నేతితో అగ్నిలో హోమం చేయాలి. ఆవునేతితో స్వస్తివాచనం జరిపించాలి. నేతిని దానం చేయాలి. నేతిని తినాలి. దానితో ఎప్పుడూ గోపుష్టిని పొందగలడు. సర్వరత్నమయమైన తిలధేనువును గోమతీ మంత్రంతో (గోమా అగ్నేవిమా అశ్వి) అభిమంత్రించి, దానం చేసినవాడు తాను చేసిన శుభాశుభకర్మలతో శోకాన్ని పొందడు. "బంగారు కొమ్ములు గలిగి పాలనిచ్చే సురభులు, సౌరభేయులు నదులు సముద్రాన్ని చేరినట్టు నన్ను చేరును గాక" "నేను నిత్యమూ గోవులను చూస్తున్నాను. నన్నెప్పుడూ గోవులు చూడాలి. మాకు గోవులు. గోవులకు మేము గోవులెక్కడుంటే మేము అక్కడుంటాం." ఈ రీతిగా పగలు రేయి, సమస్థితిలో, విషమస్థితిలో, మహాభయ సందర్భాలలో కీర్తించిన నరుడు భయంనుండి ముక్తి పొందగలడు.

79. విభిన్న గోదానాలు - విభిన్నలోకప్రాప్తి.

వసిష్ఠుడు చెప్తున్నాడు. "మానదా! పరంతపా! తొలుత గోసృష్టి జరిగినపుడు "గోవులు లక్షల సంవత్సరాల పాటు, మరీ కఠినమైన తపస్సు చేశాయి. వాటి సంకల్పమిది, మేము అన్నింటికన్న శ్రేష్ఠతను పొందాలి. ఈ లోకంలో సర్వదక్షిణలలో గోదక్షిణయే ఉత్తమం కావాలి. ఏ దోషమూ మమ్ము అంటగూడదు. మా పేడతో స్నానం చేసిన జనం సర్వదా పవిత్రం కావాలి. దేవతలు, మానవులు పవిత్రతకై మా పేడనే వినియోగించాలి. అదేరీతిగా స్థావరజంగమాత్మకాలైన సర్వప్రాణులు మా పేడతో పవిత్రం కావాలి. గోదానం చేసినవారు గోలోకాలను పొందాలి." ఆ తపస్సు ముగియగానే ప్రభువైన బ్రహ్మ స్వయంగా "అలాగే జరుగుతుంది. లోకాలను తరింపజేయండి" అని వాటికి వరమిచ్చాడు. తమ కోరిక సిద్ధించగానే భూతభవిష్యత్తులకు తల్లులైన అవి తపస్సును విరమించాయి. ఆ గోవులకు ప్రాతఃకాలంలో నమస్కరించాలి. దానితో పుష్టిని పొందాలి. మహారాజా! తపస్సు ముగియగానే అవి సర్వలోకాలకు ఆశ్రయమయ్యాయి. కాబట్టి మహాభాగా! గోవులు పరమ పవిత్రాలు. అలాగే అవి సర్వప్రాణుల శిరస్సులపై నిలిచాయి. (సర్వశ్రేష్ఠాలయ్యాయి). పాలనిచ్చే సులక్షణమైన కపిలగోవును, వస్త్రాలతో అలంకరించి, అదే వన్నె గల దూడతో పాటు దానమిచ్చినవాడు, బ్రహ్మలోకంలో సత్కృతి నందగలడు. మంచిలక్షణాలు గలిగి పాలనిచ్చే కపిలగోవును వస్త్రాలతో అలంకరించి, అదే వన్నెగల దూడతోపాటు దానమిస్తే

దాత సూర్యలోకంలో సత్కృతినందగలడు. మంచి లక్షణాలు కలిగి పాలనిచ్చే చిత్రవర్ణగోవును వస్త్రాలతో అలంకరించి, అదే వన్నెగల దూడతోపాటు దానమిచ్చినవాడు చంద్రలోకంలో సత్కృతి నందగలడు. మంచి లక్షణాలు కలిగి పాలనిచ్చే తెల్ల ఆవును వస్త్రాలతో అలంకరించి, అదే వన్నెగల దూడతోపాటు దానమిచ్చినవాడు ఇంద్రలోకంలో సత్కారం పొందగలడు. మంచిలక్షణాలు గలిగి పాలనిచ్చే నల్లఆవును వస్త్రాలతో అలంకరించి, అదే వన్నెగల దూడతోపాటు దానమిచ్చినవాడు అగ్నిలోకంలో సత్కృతినందగలడు. మంచి లక్షణాలు గలిగి పాలనిచ్చే పాగరంగు ఆవును వస్త్రాలతో అలంకరించి, అదే వన్నెగల దూడతోపాటు దానమిచ్చినవాడు యమలోకంలో సత్కృతినందగలడు.

నీటి నురుగు రంగు ఆవును వస్త్రాలతో అలంకరించి, దూడతో, కంచుపాలగిన్నెతోపాటు దానమిచ్చినవాడు వరుణ లోకాన్ని చేరగలడు. గాలికెగసిన దుమ్మువంటి రంగుగల ఆవును వస్త్రాలతో అలంకరించి, దూడతో, కంచుపాలగిన్నెతో పాటు దానమిచ్చినవాడు వాయులోకంలో సత్కృతినందగలడు. బంగారు రంగు శరీరం, పింగళవర్ణనేత్రాలు గల ఆవును వస్త్రాలతో అలంకరించి, దూడతో, కంచుపాత్రతో పాటు దానమిచ్చినవాడు కుబేరలోకాన్ని పొందుతాడు. పొట్టుపాగరంగు ఆవును వస్త్రాలతో అలంకరించి, దూడతో, కంచుపాలగిన్నెతో పాటు దానమిచ్చినవాడు పితృ లోకాలలో సత్కృతినందగలడు. వ్రేలాడే గంగడోలు గలిగి బలిసిన ఆవును అలంకరించి, దూడతోపాటు దానమిస్తే ఏ బాధలూ లేకుండా విశ్వేదేవుల ఉత్తమస్థానాన్ని పొందవచ్చు. మంచి లక్షణాలు గలిగి గౌరవర్ణంగల పాడిఆవును వస్త్రాలతో అలంకరించి, అదే రంగుగల దూడతోపాటు దానమిస్తే వసువుల లోకాన్ని చేరవచ్చు. తెల్లటి కంబళివంటి రంగుగల ఆవును వస్త్రాలతో అలంకరించి, దూడతో, కంచుపాలగిన్నెతో పాటు దానమిచ్చి, సాధ్యుల లోకాన్ని పొందవచ్చు. రాజా! విశాలమైన వెనుక భాగంగల ఎద్దును సర్వరత్నాలతో అలంకరించి, దానమిచ్చి, మరుత్తుల లోకాలను చేరవచ్చు. వయస్సులో ఉండి, పొందికయిన శరీరాంగాలు గల ఎద్దును సర్వరత్నాలతో కలిపి దానమిచ్చిన మానవుడు గంధర్వాప్సరసల లోకాలను పొందుతాడు. వ్రేలాడే గంగడోలు గల ఎద్దును సర్వరత్నాలతో అలంకరించి, దానమిచ్చి, శోకరహితుడై ప్రజాపతిలోకాలను పొందగలడు. రాజా! గోదానతత్పరుడు సూర్యవర్ణం గల విమానంలో కూర్చొన, మేఘసమూహాలను చీల్చుతూ, స్వర్గాన్ని చేరి విరాజిల్లుతాడు. గోదానతత్పరుడు, నరోత్తముడు అయిన నరుని మనోహర వేషం, అందమైన నితంబాలు గల వేయిమంది దేవతా స్త్రీలు ఆనందింపజేస్తారు. ఆ నరుడు వీణావల్లకుల మధురధ్వనులను నూపుర

ధ్వనులను, మృగనేత్రల పరిహాసవచనాలను వింటూ నిదురనుండి మేల్కొలుపబడతాడు. దానమిచ్చిన గోవు శరీరంపై ఎన్ని రోమాలుంటే అన్ని సంవత్సరాల పాటు ఆ దాత స్వర్గంలో వెలుగొందుతాడు. స్వర్గభ్రష్టుడై కూడా భూలోకంలో విశాలమైన ఇంటిలోనే జన్మిస్తాడు."

80. గోదాన మహిమ.

వసిష్ఠుడిలా అన్నాడు. "రాజా! మనిషి ఉదయమూ, సాయంకాలమూ ఆచమించి, ఇలా జపించాలి. "నేతినీ, పాలనూ ఇచ్చేవి, నేతికి జన్మస్థానాలు, నేతిని కల్గించేవి. నేతినదులు, నేతి సుళ్ళు అయిన గోవులు సదా నా ఇంట నిలవాలి. నా హృదయంలో, నానాభిలో నేయి ఎప్పుడూ నిలవాలి. నా శరీరంలోని సర్వావయవాలలోనూ, మనస్సులోనూ నేయి ఉండాలి. గోవులు ఎప్పుడూ నాముందుండాలి. నా వెనుక ఉండాలి. నాకు అన్నివైపులా గోవులుండాలి. వాటి మధ్యలో నేను వసించాలి". ఈ రీతిగా జపించినవాడు పగలు చేసిన పాపం నుండి విముక్తినందగలడు. వేయి గోవులను దానమిచ్చినవారు బంగారు మేడలూ, గంగా ప్రవాహమూ, గంధర్వాప్సరసలు గల స్వర్గలోకానికి వెళతారు. వేయి గోవులను దానమిచ్చినవారు విశిష్టనదులు ప్రవహించే చోటికి వెళతారు. ఆ నదులలో పారే ప్రవాహం వెన్న బురద. పెరుగు చుట్టుకొన్న నాచు. యథావిధిగా లక్షగోవులను దానమిచ్చినవాడు పరమవృద్ధిని పొంది, ఆపై స్వర్గలోకంలో వెలుగొందుతాడు. అటువంటి నరుడు మాతృపక్ష, పితృపక్షాలలోని పదితరాల పూర్వీకులను పవిత్రం చేసి, వారికి పుణ్యలోకాలను కలిగిస్తాడు. తన వంశాన్ని పవిత్రం చేస్తాడు. ధేనువంత ప్రమాణం గల నువ్వుల ఆవును దానం చేసినా జలగోవును దానం చేసినా దాత యమలోకంలో ఎటువంటి యాతననూ పొందడు. గోవు పవిత్రవస్తువులలో మొదటిది. జగత్తునకు ప్రతిష్ఠాస్థానం దేవతలకు తల్లి, లెక్కకందని మహిమ గలది. దానిని స్పృశించి, దానికి ప్రదక్షిణంగా వెళ్ళాలి. తగిన వేళలో తగినవానికి దానమివ్వాలి.

పెద్దకొమ్ములు గల కపిలగోవును ఉత్తరీయ వస్త్రం కప్పి, దూడతో, కంచు పాలగిన్నెతో పాటు దానమిచ్చిన మనుష్యుడు దుర్గమమైన యమధర్మరాజు సభలోనికి నిర్భయంగా ప్రవేశించగలడు. సుందరరూపాలు, వివిధవర్ణాలు గలిగి విశ్వరూపాలయిన గోమాతలు నా దగ్గరకు రావాలి అని నిత్యమూ కీర్తించాలి. గోదానం కన్నా పుణ్యతరమైన దానం కానీ, దాని కన్నా పవిత్రతరమైన ఫలం కానీ, లోకంలో దానికన్నా విశిష్టమైనది

కానీ, ఇంతవరకూ లేదు, ఇకపై ఉండబోదు. చర్మం, రోమాలు, కొమ్ములు, తోకలు, పాలు మేదస్సు వీటన్నిటితో కలిసి గోవు యజ్ఞాన్ని నిర్వహిస్తుంది. కాబట్టి దీనికన్నా గొప్పదేముంది ? స్థావరజంగమాత్మకమైన ఈ సమస్త విశ్వమూ దేనితోనిండి ఉన్నదో, ఆ ధేనువును శిరసా నమస్కరిస్తున్నాను. అది భూతానికీ, భవిష్యత్తుకూ తల్లి. రాజా! గోవుల గుణవచనాలకు సంబంధించిన రాశిలో నుండి ఒక్కపాలే నేను నీకు చెప్పగలిగాను. గోదానాన్ని మించింది. లోకంలో లేదు. గోవు కన్నా ఆశ్రయింపదగినది మరేదీ లేదు. భీష్ముడిలా అన్నాడు. వసిష్ఠుని మాట విని, భూదాత, నియతాత్ముడు, మహాత్ముడు అయిన సౌదాసుడు గోదానాన్ని ఉత్తమంగా భావించి, విప్రులకు ఎంతో గోధనాన్ని దానం చేశాడు. ఉత్తమలోకాలను పొందాడు.

81. వ్యాసుడు శుకునకు గోదాన మాహాత్మ్యమును చెప్పుట.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "పితామహా! లోకంలోని సర్వపవిత్రవస్తువులకన్నా పవిత్రమై, శిష్టసమ్మతమై, పరమ పవిత్రమైన దానిని గురించి నాకు చెప్పు." భీష్ముడు చెప్తున్నాడు. "గోవులు గొప్ప ప్రయోజనం కల్గించగలవి. పరమ పవిత్రమైనవి, మానవులను తరింపజేసేవి. ఇవి పాలతో నేతితో ప్రజలను బ్రతికించగలవి. భరతసత్తమా! గోవులను మించి పరమపవిత్రమైనది మరొకటి లేదు. మూడు లోకాలలోనూ ఇవియే పుణ్యప్రదాలు, పవిత్రాలు, సర్వశ్రేష్ఠాలు. గోవులు దేవతలకన్నా ఉన్నతలోకాలలో నివసిస్తాయి. వాటిని దానం చేసిన మనీషులు తమనుతాము తరింపజేసికొని స్వర్గానికి వెళతారు. మాంధాత, యౌవనాశ్వుడు, యయాతి, నహుషుడు ఎప్పుడూ లక్షల కొలది గోవులను దానం చేసేవారు. దానితో దేవతలకు కూడా దుర్లభమైన పరమోత్తమ స్థానాన్ని పొందారు.

అనఘా! ఈ విషయానికి సంబంధించిన ఒక ప్రాచీన వృత్తాంతాన్ని నీకు చెపుతాను. ఒకసారి ధీమంతుడైన శుకుడు నిత్యానుష్ఠానాన్ని ముగించి, పవిత్రుడై, నియతమనస్కుడై, లోకాల భూతభవిష్యత్తులనెరిగిన ఉత్తమముని అయిన తన తండ్రికి నమస్కరించి, ఇలా అడిగాడు. "యజ్ఞాలన్నింటిలోనూ గొప్పగా భావింపబడే యజ్ఞమేది ? ధీమంతులు ఏ పనిచేస్తే పరమస్థానాన్ని పొందగలరు ? ప్రభూ! దేవతలు ఏ పవిత్రకర్మతో స్వర్గఫలాలను అనుభవిస్తున్నారు ? యజ్ఞానికి యజ్ఞత్వం ఎలా సిద్ధిస్తుంది ? యజ్ఞ ప్రతిష్ఠ ఎక్కడ ? దేవతలకై ఉత్తమ పదార్థమేది ? దీనికన్నా గొప్ప యజ్ఞమేది ? జనకా! పవిత్రవస్తువులలో పవిత్రమైనదేది? నాకు చెప్పు." భరతర్షభా! పరమధర్మవేత్త అయిన

వ్యాసుడు ఈ మాట విని, కుమారునకు విషయమంతా యథాతథంగా చెప్పాడు.

వ్యాసుడు చెప్తున్నాడు. "ప్రాణులకు ప్రతిష్ఠానం గోవులు ఆశ్రయింపదగినవి గోవులు, గోవులు పుణ్యప్రదాలు, పవిత్రాలు, గోధనం పవిత్రమైనది. మొదట్లో గోవులకు కొమ్ములు లేవని విన్నాం. కొమ్ములకోసం అవి అవ్యయుడైన బ్రహ్మను సేవించాయి. ఆపై ప్రాయోపవేశం చేసిన ఆ గోవులను గమనించి, బ్రహ్మ విడివిడిగా వాటి కోరికలను తీర్చాడు. వాటికి కొమ్ములు మొలిచాయి. వాటి మనోగతాన్ని బట్టి అవి రూపొందాయి. కుమారా! అప్పటినుండి వివిధవర్ణాలతో పాటు కొమ్ములతో కూడా శోభించసాగాయి. బ్రహ్మ ద్వారా వరాన్ని పొంది అవి హవ్యకవ్య ప్రదాలు, మంగళకరాలు, పుణ్యప్రదాలు, పవిత్రాలు, సౌభాగ్యవతులై దివ్యశరీరాలతో, లక్షణాలతో సంపన్నలయ్యాయి. గోవులు దివ్యమైన మహాతేజస్సు. గోదానం ప్రశస్తం. సజ్జనులు మాత్సర్యాన్ని వీడి, గోవులను దానం చేస్తే వారు పుణ్యాత్ములనబడతారు. వారు అన్ని దానాలనూ చేసినట్లే లెక్క. అనఘా! వారు పుణ్యమయమైన గోలోకాన్ని పొందుతారు. ద్విజోత్తమా! గోలోకంలో చెట్లు తీయని పండ్లనిస్తాయి. దివ్య పుష్పఫలాలనిస్తాయి. ఆ పూలు దివ్యపరిమళాలు గలవి. భూమి అంతా మణిమయమై ఉంటుంది. ఇసుక అంతా బంగారు పొడియే. ఆ భూమి అన్ని ఋతువులలోనూ సుఖస్పర్శ గలది. బురద ఉండదు. దుమ్ము ఉండదు. అంతా శుభాస్పదం. అక్కడి జలాశయాలు ఎర్రకలువల వనాలతో, లేత సూర్యుని కిరణాలవలె ప్రకాశించే మణులు పొదిగిన బంగారు మెట్లతో శోభిస్తాయి. అక్కడి సరస్సులలో ఎర్రకలువలు కలిసిన కమలాలు పూస్తాయి. వాటి ఆకులు ఎంతో విలువైన మణిస్వరూపాలు. వాటి కేసరాలు సువర్ణ ప్రభ గలవి.

అక్కడి నదీతీరాల్లో వికసించిన గన్నేరుతోటలు, వికసించిన సంతానవనాలు, ఇంకా ఇతర చెట్లు శోభను కలిగిస్తాయి. ఆ వనాలు, చెట్లు మొదళ్ళలో వేల సుళ్ళు వాటిని చుట్టి ఉంటాయి. ఆ నదీ తీరాలలో నిర్మలమైన ముత్యాలు, గొప్ప కాంతిగల మణులు, బంగారు ఇసుక తిన్నెలు కనిపిస్తాయి. గొప్పగొప్ప చెట్ల మొదళ్ళు, అక్కడి నదులలోనికి చొచ్చుకొనిపోయి ఉంటాయి. అవి సర్వరత్నమయాలు, సువర్ణమయాలు కొన్ని అగ్నివంటి కాంతిగలవి. అక్కడ బంగారు కొండలు, మణిరత్నమయాలైన శిలాసమూహాలు కనిపిస్తాయి. వాటి ఉన్నత శిఖరాలు సర్వరత్నమయాలై అందంగా వెలుగొందుతాయి. అక్కడి చెట్లు ఎల్లప్పుడూ పుష్పఫలభరితాలు, పక్షులు వాటిపై సందడి చేస్తుంటాయి. ఆ పుష్పాలు దివ్య పరిమళాలతో, ఆ ఫలాలు దివ్యరసాలతో కూడి ఉంటాయి. యుధిష్ఠిరా!

పుణ్యకర్మలు చేసినవారు నిత్యమూ క్రీడిస్తుంటారు. శోకక్రోధరహితులై, పూర్ణకాములై, సఫల మనోరథులై ఉంటారు. భారతా! పుణ్యకర్మలు చేసిన కీర్తిశాలులు అక్కడ విచిత్రరమణీయ విమానాలలో విహరిస్తూ ఆనందిస్తారు. రాజా! వారితోపాటు శుభాస్పదాలయిన అప్సరస్సమూహాలు క్రీడిస్తుంటారు. గోదానం చేసినవాడు ఆ లోకాలను పొందుతాడు. ఆ లోకాలకు బలశాలి అయిన సూర్యుడు, బలవంతుడైన వాయువు అధిపతులు. వరుణుడు అక్కడి ఐశ్వర్యానికి అధిపతి, గోవులు యుగంధరాలు, సురూపాలు. బహురూపాలు, విశ్వరూపాలు, లోకాలకు తల్లులు, బ్రాహ్మణా! నరుడు యతవ్రతుడై నిత్యమూ ప్రజాపతి ప్రకటించిన ఈ నామాలను జపించాలి.

గోవులను సేవిస్తూ, సర్వవిధాలుగా వాటిని అనుసరించినవారికి అవి సంతసించి, దుర్లభవరాలను కూడా ఇస్తాయి. మనసా కూడా గోవులకు ద్రోహం చేయదగదు. వాటికి నిత్యమూ సుఖాన్ని కలిగించాలి. సదా అర్చించాలి. నమస్కారాలతో పూజించాలి. మనిషి జితేంద్రియుడై, ప్రసన్నహృదయుడై నిత్యమూ గోవులను సేవించాలి. అప్పుడు సమృద్ధిని పొందగలడు. మూడురోజులు వేడిగా ఉన్న గోమూత్రాన్ని, మూడురోజులు వేడి ఆవుపాలను త్రాగాలి. ఆవుపాలను వేడిగా త్రాగి, మూడురోజులు ఆవునేతిని వేడిగా త్రాగాలి. మూడురోజులు అలా వేడినేతిని త్రాగి, మూడురోజులు వాయుభక్షణ చేయాలి. ఈ పవిత్రగోఘృతప్రభావంతో దేవతలు ఉత్తమ లోకాలను అనుభవిస్తున్నారు. పవిత్రవస్తువులనే పవిత్రమైనవిగా శిరసావహించాలి. ఆవు నేతితో అగ్నికి ఆహుతులివ్వాలి. ఆవు నేతి నిచ్చి స్వస్తివచనాలు పలికించాలి. నేతిని త్రాగాలి. నేతిని దానమివ్వాలి. అప్పుడు గోసమృద్ధిని, తన వృద్ధిని అనుభవించవచ్చు. ఆవుపేడలో మొలిచిన యవలగంజిని నెలరోజులు త్రాగాలి. దానితో బ్రహ్మహత్యా పాపం వంటి పాపం నుండి కూడా మనిషి ముక్తి నంది శుద్ధుడు కాగలడు. దైత్యులు పరాభవించినప్పుడు దేవతలు ఈ ప్రాయశ్చిత్తాన్ని పాటించారు. దానితో వారు దేవత్వాన్ని మరల పొంది, మహాబలులై సిద్ధిని పొందారు.

గోవులు, పవిత్రాలు, పుణ్యప్రదాలు, అవి పవిత్రమైన పరమమహత్స్వరూపాలు. బ్రాహ్మణులకు వాటిని దానమిచ్చి నరుడు స్వర్గాన్ని అనుభవించగలడు. పవిత్రజలంతో ఆచమించి, పవిత్రుడై, గోవుల మధ్య నిలిచి గోమతీ మంత్రాన్ని మనసా జపించాలి. దానితో పవిత్రుడు పాపవిముక్తుడు కాగలడు. విద్యావేదవ్రతనిష్ణాతులు, పుణ్యకర్ములు అయిన బ్రాహ్మణులు అగ్నిమధ్యంలో, గోమధ్యంలో, బ్రాహ్మణసభలో శిష్యులకు యజ్ఞసమానమైన గోమతీ మంత్రాన్ని నేర్పించాలి. మూడు రాత్రులు ఉపవసించి, గోమతిని

జపించినవాడు గోవులనుండి వరాలను పొందగలడు. పుత్రకాముడు పుత్రుని, ధనాభిలాషి ధనాన్ని, భర్తృకామిని భర్తను – ఇలా మానవుడు కోరికలన్నింటినీ సఫలంచేసి కొనవచ్చు. సేవలనందిన గోవులు ఆనందించి, అన్నింటినీ ఇస్తాయి. సంశయం లేదు. ఈ రీతిగా మహాభాగలయిన గోవులు యాగానికి ప్రధానాధారాలు. సర్వకామనలను తీర్చేవి. ఇవి రోహిణులని గ్రహించు. వీటిని మించినదేదీ లేదు." మహాత్ముడైన తండ్రి అలా చెప్పగా మహాతేజస్వి అయిన శుకుడు నిత్యము గోవును పూజించాడు. కాబట్టి నీవు కూడా గోవును పూజించు.

82. లక్ష్మీగోసంవాదము.

యుధిష్ఠిరుడడిగాడు. "పితామహా! ఆవుపేడ లక్ష్మీనివాసమని నేను విన్నాను. దానివిషయమై సంశయముంది. వినగోరుతున్నాను" భీష్ముడు చెప్తున్నాడు. "భరతసత్తమా! ఈ విషయమై కూడా లక్ష్మికి, ఆవులకు మధ్య జరిగిన సంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు.

లక్ష్మి కాంతిమంతమైన శరీరాన్ని ధరించి గోవులమధ్య ప్రవేశించింది. అప్పుడు ఆమె రూపసంపదను చూసి గోవులు విస్మయానికి లోనయ్యాయి. గోవులిలా అన్నాయి. "దేవీ! నీవెవర్తెవు? ఎక్కడనుండి వచ్చావు? లోకంలో, రూపంలో నీవు సాటిలేనిదానవు. మహాభాగా! నీ రూపసంపదతో మేము విస్మయానికి లోనయ్యాము. నీ గురించి మేము తెలిసికొనగోరుతున్నాం. నీవెవర్తెవు? ఎక్కడికి వెళ్తున్నావు? వరవర్ణా! ఇదంతా మాకు ఉన్నదున్నట్లు చెప్పు." శ్రీ ఇలా అన్నది. "మీకు శుభమగుగాక! నన్ను శ్రీ అంటారు. లోకంలో అందరూ నన్ను కోరుతారు. నేను దైత్యులను వీడాను. దానితో వారు శాశ్వతంగా నశించారు. నా ఆశ్రయంలో నిలిచి ఇంద్రుడు, సూర్యుడు, చంద్రుడు, విష్ణువు, వరుణుడు, అగ్ని, ఇతర దేవతలు శాశ్వతంగా ఆనందిస్తున్నారు. నా ఆశ్రయంలోనే ఋషులు, దేవతలు సిద్ధినందుతున్నారు. గోవులారా! నేను శరీరంలో ప్రవేశించనివారు అన్నివిధాలా వినాశాన్ని పొందుతారు. ధర్మమూ, అర్థమూ, కామమూ, నాతోకలిసినప్పుడే సుఖప్రదాలవుతాయి. గోవులారా! నన్ను ఈ ప్రభావం గలదానినిగా గ్రహించండి. మీరు శుభాస్పదలు. నిత్యమూ మీ అందరిలో నిలవాలని కోరుతున్నాను. మీ దగ్గరకు వచ్చి అడుగుతున్నాను. మీరు నన్ను ఆశ్రయించి శ్రీ సంపన్నలు కండి." గోవులిలా అన్నాయి. "నీవు స్థిరత్వం లేనిదానివి. చంచలవు. అనేకులతో సమానసంబంధం గలదానవు. కాబట్టినీవు మాకు అవసరం లేదు.

నీకు శుభంగలుగుగాక! ఎక్కడ ఆనందంగా ఉండగలవో అక్కడకే వెళ్ళు. మేము ఇప్పటికే చక్కని శరీరాలు గలవారం. నీతో మాకు పని ఏమిటి ? స్వేచ్ఛగా వెళ్ళు. నీ దర్శనంతోనే మేము కృతార్థలమయ్యాం". శ్రీ అన్నది "గోవులారా! మీ కిది తగినదేనా? నన్ను అభినందించకపోవటం యుక్తమేనా ? నేను దుర్లభను. సాధ్విని, నన్నెందుకు స్వీకరించరు ? సువ్రతా ! లోకంలోని ఈ నానుడి సత్యమే అనిపిస్తోంది. పిలవని పేరంటానికి వెళితే పరాభవం తప్పదన్నది నిశ్చయమే. మానవులు, దేవతలు, దానవులు, గంధర్వులు, పిశాచాలు, నాగులు, రాక్షసులు ఎంతో తీవ్రంగా తపస్సు చేసి, నన్ను సేవిస్తుంటారు. సాధుస్వభావులారా ! నేనే మీదగ్గరకు రావటం మీ గొప్పతనమే! నన్ను పరిగ్రహించండి. స్థావరజంగమాత్మకమైన ఈ లోకంలో ఎక్కడా నేను పరాభవింపదగను" గోవులిలా అన్నాయి. "దేవి! నిన్ను అవమానించటం లేదు. నిరాదరించటం లేదు. నీవు స్థిరత్వం లేనిదానివి. చంచలవు. అందువలన నిన్ను పరిత్యజిస్తున్నాం. ఇన్నిమాటలెందుకు ? ఎక్కడకు వెళ్ళదలచుకొంటే అక్కడకు వెళ్ళు. మాకు మంచి శరీరాలున్నాయి. అనఘా! నీతో మాకు పని ఏమిటి ?" శ్రీ ఇలా అన్నది. "ఇతరులను గౌరవించగల మీరు తిరస్కరిస్తే లోకమంతా నన్ను హేళన చేస్తుంది. నాపై దయ చూపండి. మీరు సౌభాగ్యవతులు లోకశరణ్యులు, శరణుకోరి వచ్చాను. నిత్యమూ మిమ్ము సేవించే దానను. దోషరహితను నన్ను రక్షించండి. మీనుండి గౌరవాన్ని కోరుతున్నాను. మీరు సతతమూ శుభప్రదాలు. మీ శరీరాలలోని ఏదో ఒక అంగంలో - అది నీచమైనదైనా సరే నివసించాలని కోరుతున్నాను. కానీ అనఘులారా! మీ శరీరాలలో కుత్సితమైన అంగమంటూ ఒక్కటీ లేదు. మీరు పుణ్యశీలలు, పవిత్రలు, సుభగలు నన్ను ఆదేశించండి. మీ శరీరాలలో ఎక్కడ నేను నివసించవచ్చునో తేల్చిచెప్పండి."

రాజా! లక్ష్మి అలా అనగానే కరుణావాత్సల్యభరితలూ, శుభస్వరూపలూ అయిన గోవులు అన్నీ కలిసి ఆలోచించి, శ్రీతో ఇలా అన్నాయి. "యశస్విని, మేము నిన్ను తప్పనిసరిగా గౌరవించాలి. కళ్యాణీ! మా మలమూత్రాలలో నివసించు. మా కదే పుణ్యం" శ్రీ అన్నది. "మీరు నన్ను దయతో అనుగ్రహించారు. అది నా భాగ్యం. అలాగే జరుగుగాక! మీకు మేలు జరుగుతుంది. సుఖప్రదలారా! మీరు నన్ను గౌరవించారు." భారతా! లక్ష్మి ఆవులతో అలా ఒప్పందం చేపికొని, అవి చూస్తుండగానే అక్కడే అంతర్ధానమయింది. పుత్రా! ఈ రీతిగా నేను ఆవుపేడ మాహాత్మ్యాన్ని వర్ణించాను. మరలా గోవుల మాహాత్మ్యాన్ని చెపుతాను విను."

83. గోలోక వర్ణనము.

భీష్ముడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరా! యజ్ఞశిష్టమైన ఆహారాన్ని భక్షించేవారు, గోవును దానమిచ్చేవారు నిత్యమూ అన్నదానం, యజ్ఞం చేసేవారు పొందే ఫలాన్ని పొందుతారు. పెరుగు, నేయి లేకుండా యజ్ఞం జరగదు. వాటితోనే యజ్ఞానికి యజ్ఞత్వం, కాబట్టి గోవు యజ్ఞమూల మనబడుతుంది. సమస్తదానాలలో గోదానం ప్రశస్తమవుతుంది. గోవులు శ్రేష్ఠాలు, పవిత్రాలు, పరమపావనాలు కూడా. పుష్టికోసం, శాంతికోసం గోవులను సేవించాలి. ఆవుపాలు, ఆవుపెరుగు, ఆవునేయి సర్వపాపాలనుండి విముక్తి కలిగిస్తాయి. ఇహపరలోకాలలో గోవులే పరమతేజస్సులని చెప్పబడింది. భరతర్షభా! గోవులకన్నా పవిత్రమైనది ఏదీ లేదు. యుధిష్ఠిరా! ఈ సందర్భంలో కూడా ఇంద్ర బ్రహ్మసంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. దైత్యులు పరాభవానికి గురికాగా, ఇంద్రుడు త్రిలోకాధిపతి కాగా, ప్రజలందరూ ఆనందించి, సత్య ధర్మాసక్తులయ్యారు.

ఒకప్పుడు బ్రహ్మను సేవించారు. అప్పుడు నారదుడు, పర్వతుడు, విశ్వావసువు, హాహాహూహులు దివ్యతానంతో గానంచేస్తూ బ్రహ్మను సేవించారు. అక్కడ వాయుదేవుడు దివ్యపుష్ప పరిమళాలతో వీచాడు. ఋతువులు కూడా విడివిడిగా సుగంధాలను కొనివచ్చాయి. దేవతలందరూ సమావేశమయ్యారు. సర్వప్రాణులు గుమిగూడాయి. దివ్యవాద్యధ్వని వినిపిస్తోంది. దివ్యాంగనాలు, చారణులు చుట్టూ నిలిచారు. అప్పుడు ఇంద్రుడు బ్రహ్మకు నమస్కరించి, ఇలా అడిగాడు. "పితామహా! స్వామీ! లోకపాలకులయిన దేవతల కన్నా పైన గోలోక మెందుకుంది? ఇది తెలియగోరుతున్నాను. ఈశ్వరా! గోవులు ఏ తపస్సునూ, ఏ బ్రహ్మచర్యాన్నీ పాటించాయి? ఏ కారణంగా రజోగుణరహితంగా, సుఖంగా, దేవతల కన్నా పైన అవి సుఖంగా నివసించగలుగుతున్నాయి? అప్పుడు బ్రహ్మ బలారి అయిన ఇంద్రునితో ఇలా అన్నాడు. "ఇంద్రా! నీవు ఎప్పుడూ గోవులను హేళన చేస్తుంటావు. ప్రభూ! దానివలన నీవు వాటి మాహాత్మ్యమెరుగవు. సురశ్రేష్ఠా! గోవుల ప్రభావాన్ని, పరమమాహాత్మ్యాన్ని విను. ఇంద్రా! గోవులు యజ్ఞాంగమని చెప్పబడ్డాయి. అవి యజ్ఞ స్వరూపాలే. ఇవి లేకుండా ఏ రీతిగానూ యజ్ఞం జరగదు. పాలతో, పెరుగుతో అది ప్రజలను పోషిస్తాయి. వాటి కుమారులు కూడా వ్యవసాయంలో సహకరిస్తాయి. ధాన్యాన్ని వివిధ బీజాలనూ మొలకెత్తిస్తాయి. వాటివలన యజ్ఞనిర్వహణ జరుగుతుంది. సర్వవిధాలుగా హవ్యకవ్యాలు కొనసాగుతాయి. సురేంద్రా! గోవుల నుండి పాలు, పెరుగు, నేయి వస్తాయి. గోవులు పవిత్రాలు. ఎద్దులు ఆకలిదప్పులననుభవిస్తూ కూడా వివిధ భారాలను మోస్తుంటాయి. ఇలా ఈ లోకంలో

గోవులు తమ కర్మతో మునులను, ప్రజలను పోషిస్తాయి. వీటి వ్యవహారంలో మాయ ఉండదు. ఇంద్రా! అవి మంచి పనులలోనే ఆసక్తి చూపుతాయి. అందువలననే అవి ఎప్పుడూ మన కన్నా పైన నివసిస్తాయి. ఇంద్రా! మనకన్నా పైన ఎలా నివసిస్తాయని నీవు అడిగిన దానికిదే కారణమూ, సమాధానమూ, ఇంద్రా! అంతేగాక దేవతల వరాలు పొందాయి. వరాలను ఇవ్వగలవు. కూడా. సురసత్తమా! ఇంద్రా! సురభులు పుణ్యకర్మలు చేసేవి. శుభలక్షణాలతో పవిత్రమైనవి. ఆ సురభులు ఎందుకోసం భూలోకానికి వెళ్ళాయో అది కూడా పూర్తిగా చెపుతాను విను.

నాయనా! పూర్వకాలంలో దేవయుగంలో మహాత్ములైన దేవేంద్రులు మూడులోకాలను శాసించేవారు. ఇంద్రా! అప్పుడు అదితి పుత్రప్రాప్తికై, ఒంటికాలిపై నిలిచి, దుష్కరమైన ఘోరతపస్సు చేసింది. విష్ణువు ఆమె గర్భంలో అడుగిడబోతున్నాడు. తీవ్రమైన తపస్సు చేస్తున్న ఆ మహాదేవిని – అదితిని చూసి, ధర్మపరాయణ, అయిన దక్షపుత్రి – సురభి ఎంతో ఆనందంతో ఘోరతపస్సు నారంభించింది. దేవతలు, గంధర్వులు సేవించే అందమైన కైలాస శిఖరంపై ఒంటికాలిపై నిలిచి, ఉత్తమయోగాన్ని ఆశ్రయించి, పదకొండు వేల సంవత్సరాలు తపస్సు చేసింది. ఆమె తపస్సుతో దేవతలు, ఋషులు, నాగులు తపించిపోయారు. వారంతా నాతో కలిసి, శుభలక్షణ అయిన ఆ తపస్వినీ దగ్గరకు వెళ్ళి నిలిచారు. అప్పుడు నేను అక్కడ ఆ దేవితో ఇలా అన్నాను: "దేవీ! అనిందితా! దేనికోసం ఘోరతపస్సు చేస్తున్నావు. మహాభాగా! శోభనా! ఈ నీ తపస్సుతో నేను ప్రీతిచెందాను. దేవి! వరాన్ని కోరుకో! ఇస్తాను." పురందరా! నేనలా ప్రోత్సహించాను. సురభి ఇలా అన్నది. "లోక పితామహా! నాకు వరమక్కరలేదు. నీవు నాపై ప్రసన్నుడవగుటయే ఇప్పుడు నాకు వరం". బ్రహ్మ ఇలా అన్నాడు. "త్రిదశేశ్వరా! శచీపతీ! దేవేంద్రా! అలా పలుకుతున్న ఆ సురభితో నేనిచ్చిన సమాధానం చెపుతా విను.

"దేవి! శుభాననా! నీవు లోభాన్నీ, కోరికలనూ విడిచావు. ఆ నీ తపస్సుతో ప్రసన్నుడనయ్యాను. కాబట్టి నీకు అమరత్వాన్ని వరంగా ఇస్తున్నాను. మూడులోకాలకూ పైభాగంలో నీవు నివసిస్తావు. నా అనుగ్రహంతో ఆ నీ చోటు గోలోకంగా ప్రసిద్ధికెక్కుతుంది. మహాభాగా! నీ సంతతి అంతా – పుత్రులూ, పుత్రికలూ మానవలోకంలో మానవుల కుపయోగపడే పనులు చేస్తూ నివసించగలరు. దేవి! కళ్యాణి! నీవు మనసా తలిస్తే చాలు, దివ్యమానుష భోగాలూ, స్వర్గసుఖమూ నీకు లభిస్తాయి. ఇంద్రా! ఆ గోలోకంలో అందరి కోరికలు అన్నీ తీరుతాయి. అక్కడ మృత్యువు కానీ, వార్ధక్యం కానీ అడుగు

పెట్టలేవు. అగ్ని ప్రజ్వలింపలేదు. ఇంద్రా! అక్కడ అదైవికమూ, అశుభమూ ఏదీ ఉండదు. అక్కడి అరణ్యాలు, భవనాలు కూడా దివ్యాలే. అక్కడి విమానాలు చక్కగా కూర్పబడినవి, ఇచ్ఛానుసారం ప్రయాణించేవి కూడా. కమలనయనా! బ్రహ్మచర్యంతో, తపస్సుతో, ప్రయత్నంతో, ఇంద్రియ నిగ్రహంతో, వివిధదానాలతో, పుణ్యంతో, తీర్థసేవనంతో మహాతపస్సుతో, మంచిపనులతో గోలోకాన్ని చేరవచ్చు. శక్రా! నీవడిగిన విషయమంతా నీకు చెప్పాను. అసురసూదనా! నీవు ఎప్పుడూ గోవులను పరిభవింపదగదు." భీష్ముడిలా చెప్తున్నాడు. "యుధిష్ఠిరా! ఇది విని ఇంద్రుడు నిత్యమూ గోవులను పూజింపసాగాడు. వాటిని ఎంతో గౌరవించాడు.

మహాతేజస్వీ! నేను పరమపావనమూ, పరమపవిత్రమూ, పరమోత్తమమూ అయిన గోమాహాత్మ్యాన్ని పూర్తిగా చెప్పాను. పురుషశ్రేష్ఠా! దీనిని కీర్తించితే సర్వపాపవిముక్తి లభిస్తుంది. సావధానంగా దీనిని నిత్యమూ యజ్ఞాలలో హవ్య సమర్పణ చేసేటప్పుడూ, శ్రాద్ధకర్మలలో కవ్య సమర్పణ చేసేటప్పుడు బ్రాహ్మణులకు వినిపించిన వాని కోరికలన్నీ తీరుతాయి. అక్షయాలై పితరులను చేరుతాయి. గోవులపై భక్తిగల మానవుడు తాను కోరినవన్నీ పొందగలడు. గోభక్తి గల స్త్రీలు కూడా కోరికలనన్నింటినీ తీర్చుకొనగలరు. పుత్రార్థి పుత్రుని పొందుతాడు. కన్యార్థి కన్యను పొందుతాడు. ధనార్థి ధనాన్ని, ధర్మార్థి ధర్మాన్ని పొందుతాడు. విద్యార్థి విద్యను పొందగలడు. సుఖార్థి సుఖాన్ని పొందగలడు. భారతా! గోభక్తునకు దుర్లభమైనది ఏదీ లేదు."

84. సువర్ణోత్పత్తి.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. "పితామహుడు మనుజుల కోసం, విశేషించి ధర్మదర్శనులైన రాజులకోసం ఉత్తమగోదానాన్ని గురించి చెప్పాడు. రాజ్యమెప్పుడూ దుఃఖరూపమే. మనస్సు వశంలో లేనివాడు రాజ్యరక్షణ చేయటం కష్టం. అందుకే రాజులలో చాలామంది సద్గతిని పొందటం లేదు. నియమపూర్వకంగా భూదానం చేసినవాడే పవిత్రుడు కాగలుగుతున్నాడు. కురునందనా! నీవు నాకు సర్వధర్మాలను చెప్పావు. అలాగే నృగమహారాజు చేసిన గోదానాన్ని గురించి, నాచికేతముని చేసిన గోదానాన్ని గురించి ఇంతకుముందే చెప్పావు. వేదాలు, ఉపనిషత్తులు కూడా సర్వకర్మలలోనూ దక్షిణలను నిర్దేశించాయి. సర్వక్రతువులలోనూ భూమి, గోవులు, బంగారం దక్షిణగా విధింపబడ్డాయి. వాటిలో కూడా సువర్ణదక్షిణ ఉత్తమమని శ్రుతి వచనం. పితామహా! దీనిని యథాతథంగా

వినగోరుతున్నాను. బంగారమేమిటి ? ఏ సమయంలో ఎలా పుట్టింది ? దాని స్వరూపమేమిటి ? దానికి దేవత ఎవరు ? దాని ఫలమేది ? ఎందువలన అది ఉత్తమమయింది ? ధీమంతులు సువర్ణదానాన్ని ఎందువలన ఆదరిస్తున్నారు? యజ్ఞ కర్మలలో దక్షిణగా అది ఎందువలన ప్రశస్తమైంది ? భూమికన్నా, గోవుల కన్నా బంగారం ఎలా పవిత్రం? ఎలా శ్రేష్ఠం ? దక్షిణలలో అది మేటి ఎలా అయింది ? పితామహా ! నాకు చెప్పు.

భీష్ముడు చెప్తున్నాడు. "రాజా! సావధానంగా విను. బంగారం పుట్టుకకు సంబంధించిన విషయం విస్తృతమైనది. నా అనుభవాన్ని బట్టి చెపుతాను. మహాతేజస్వి అయిన నా తండ్రి, శాంతనుడు మరణించాడు. ఆయనకు శ్రాద్ధం పెట్టడానికి నేను గంగాద్వారానికి వెళ్ళి, తండ్రికి శ్రాద్ధ కర్మను ఆరంభించాను. అప్పుడు నా తల్లి గంగాదేవి కూడా అక్కడ సహాయం చేసింది. ఆపై అక్కడ సిద్ధులను, ఎందరో ఋషులను నా ఎదుట కూర్చుండబెట్టి, జలదానం మొదలయిన కార్యాలను నేను ఆరంభించాను. నేను సావధానంగా పిండప్రదానానికి ముందు చేయవలసిన కర్మ యథావిధిగా ముగించి, యథాశాస్త్రంగా చక్కగా పిండ ప్రదానాన్ని ప్రారంభించాను. పిండ ప్రదానానికై పరిచిన దర్భలను చీల్చికొని, చక్కని అంగదాలు, వ్రేలాడే ఆభరణాలు గల చేయి పైకి లేచింది. పైకి వచ్చిన చేతిని చూసి, నేను ఎంతో ఆశ్చర్యపోయాను. సాక్షాత్తు నా తండ్రియే పిండస్వీకారానికి చేయి చాపాడు. అప్పుడు నేను శాస్త్రానుసారం ఆలోచించగా చేతిలో పిండప్రదానం చేయటం వేదవిహితం కాదని నాకు గుర్తు వచ్చింది. పితరు లెక్కడా సాక్షాత్తుగా మనుష్యుని చేతి నుండి పిండాలు స్వీకరించరు, పిండాన్ని దర్భల మీదనే ఉంచాలి. అప్పుడు నేను ఎదుట కనిపిస్తున్న తండ్రి చేతిని నిరాదరించి, శాస్త్రప్రమాణాల ననుసరించి, పిండ ప్రదానానికి సంబంధించిన సూక్ష్మవిధిని స్మరించి దర్భలమీదనే పిండ ప్రదానమంతా చేశాను. అదంతా శాస్త్రమార్గానుసారంగా జరిగిందని తెలిసికో! రాజా! ఆపై నా తండ్రి చేయి అంతర్ధానమైంది.

ఆ తరువాత కలలో పితరులు దర్శనమిచ్చారు. వారు ప్రసన్నతతో, నాతో ఇలా అన్నారు. "నీ జ్ఞానంతో ప్రీతినందాము. నీవు ధర్మవ్యామోహానికి లోనుకాలేదు. శాస్త్రాన్నే ప్రమాణంగా స్వీకరించి, ఇక్కడ ప్రవర్తించావు. ఆత్మ, ధర్మం, శాస్త్రం, వేదాలు, పితరులు, ఋషులు, సాక్షాత్తు పితామహుడైన బ్రహ్మ, గురువులు, ప్రజాపతి - ఈ అందరి గౌరవాన్ని పెంచావు. ధర్మపరులకు ప్రమాణంగా నిలిచి, వారు చలించకుండా స్థిరంగా ఉండేటట్లు చేశావు. నీవు దీనిని చక్కగా ప్రారంభించావు. కాని భూదానం,

గోదానాలకు బదులుగా సువర్ణదానం కూడా చేయి. ధర్మజ్ఞా! అలా చేస్తే మేమూ, మన పితామహులందరమూ కూడా పవిత్రులమవుతాము. ఎందుకంటే బంగారం అన్నింటికన్నా పవిత్రమైనది. సువర్ణదానం చేసినవారు ముందువెనుకల పదితరాలను తరింపజేస్తారు. రాజా! నా పితరులు అలా అనగానే నేను మేల్కొన్నాను. కలలో జరిగినదానికి ఎంతో ఆశ్చర్యపడ్డాను. అప్పటినుండి సువర్ణదానంపై బుద్ధిని నిలిపాను.

రాజా! పురాతనమైన ఈ ఇతిహాసాన్ని కూడా విను. ఇది పరశురామునకు సంబంధించినది. ధనాన్ని, ఆయుస్సును పెంపొందించేది. తీవ్రకోపంతో కూడిన పరశురాముడు గతంలో ఇరవైయొక్క సార్లు భూమిపై క్షత్రియులు లేకుండా చేశాడు. వీరుడయిన పరశురాముడు భూమినంతటినీ జయించి, బ్రాహ్మణ క్షత్రియ సమ్మతమై సర్వకామనలను నెరవేర్చగల అశ్వమేధయాగాన్ని చేశాడు. అశ్వమేధం సర్వప్రాణులనూ పవిత్రం చేయగలది. తేజస్సును, కాంతిని వృద్ధిచేయగలది. అయినా తేజస్వి అయిన పరశురాముడు ఆ యాగ ఫలంతో పాపవిముక్తి నందలేకపోయాడు. దానితో చిన్న బుచ్చుకొన్నాడు. మహాత్ముడైన ఆ పరశురాముడు భూరిదక్షిణలతో క్రతుశ్రేష్ఠమైన అశ్వమేధాన్ని అనుష్ఠించి జాలిపొంది, ఆగమ సంపన్నులైన ఋషులను, దేవతలను ఇలా అడిగాడు. "మహాభాగులారా! ఉగ్రకర్మలలో చిక్కుకొన్నవారికి పరమపావనమైన దేది? చెప్పండి" పరశురాముడలా అడగగానే వేదశాస్త్రవేత్తలయిన ఆ మహర్షులు ఇలా అన్నారు. "పరశురామా! వేదప్రామాణ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, బ్రాహ్మణులను సత్కరించు. ఆపై ఆ బ్రహ్మాది సముదాయాన్ని పవిత్రవస్తువును గురించి అడుగు. మహాప్రాజ్ఞులైన వారు చెప్పిన దానిని పాటించు". ఆపై భృగునందనుడు వసిష్ఠ, అగస్త్య, కాశ్యపుల దగ్గరకు పోయి ఆ విషయాన్నే అడిగాడు. "విప్రశ్రేష్ఠులారా! నేను పవిత్రుడను కావాలి. అని నాకు బుద్ధి పుట్టింది. ఎలా కాగలను? ఏ కర్మ చేత లేదా ఏ దానం చేత పవిత్రుడను కాగలను ? నాపై మీకు అనుగ్రహబుద్ధి కలిగితే చెప్పండి. నన్ను పవిత్రుని చేయగలదేది?"

ఋషులిలా అన్నారు. "భృగునందనా! పాపకర్మలు చేసిన నరుడు గోవులను, భూమిని, ధనాన్ని దానం చేస్తే పవిత్రుడు కాగలడని విన్నాం. పవిత్రమైన మరొక మహాదానాన్ని గురించి కూడా విను. అది దివ్యమూ, అద్భుతమూ కూడా. అగ్ని నుండి పుట్టిన వస్తువది. దాని పేరు సువర్ణం, గతంలో అగ్ని సర్వలోకాలనూ దహించి తన వీర్యంతో దానిని కల్పించాడు. ఆ సువర్ణదానం చేస్తే నీవు సిద్ధిని పొందవచ్చు. ఆపై కఠోరవ్రతపాలకుడైన వసిష్ఠ భగవానుడు పరశురామునితో ఇలా అన్నాడు. "రామా! అగ్నివలె ప్రకాశించే బంగారాన్ని

గురించి విను. సువర్ణదానం పరమదానం. అది నీకు ఫలాన్ని ఇవ్వగలదు. మహాబాహూ! సువర్ణమంటే ఏమిటో, ఎలా పుట్టిందో, ఎలా శ్రేష్ఠగుణరూపమైనదో - అంతా చెపుతాను. విను. సువర్ణం అగ్ని సోమస్వరూపం, నిశ్చయంగా గ్రహించు. మేక, అగ్ని, వరుణుడు, గొర్రె, గుర్రం - ఇవి సూర్య స్వరూపాలు. ఏనుగులు, మృగాలు, నాగాంశలు. దున్నపోతులు అసురాంశలు. కోళ్ళు, పందులు రాక్షసాంశలు. భార్గవా! ఆవు, ఎద్దు, పాలు, సోమం - ఇవి భూస్వరూపాలు అని స్మృతి చెపుతోంది. ఈ జగత్తునంతా మథించి తేజోరాశి వ్యక్తమయింది. అదే సువర్ణం. బ్రహ్మర్షీ! అది పరమోత్తమరత్నం. ఈ కారణం వలననే దేవతలు, గంధర్వులు, నాగులు, రాక్షసులు, మనుష్యులు, పిశాచాలు ప్రయత్న పూర్వకంగా దానిని ధరిస్తున్నారు. భృగూత్తమా! వారు బంగారంతో చేసిన కిరీటాలతో అంగదాలతో, ఇతర వివిధాలంకారాలతో విరాజిల్లుతుంటారు. కాబట్టి పవిత్రమైన సర్వవస్తుసముదాయం కన్నా పరమ పవిత్రంగా భావింపబడుతుంది బంగారం. నరోత్తమా! భూమికన్నా, గోవులకన్నా, రత్నాలకన్నా అది పవిత్రమని గ్రహించు. స్వామీ! భూమిని, గోవులను మరేదానమైనా కావచ్చు. కానీ సువర్ణదానం దానిని మించిపోతుంది. అది పరమదానం. సువర్ణదానం అక్షయం, పావనంకూడా. బ్రాహ్మణోత్తములకు ఈ ఉత్తమపావనసువర్ణాన్ని దానమివ్వు. అన్ని దక్షిణలలో సువర్ణమే విధింపబడుతుంది. సువర్ణదానం చేసినవారు సర్వదానాలనూ చేసినవా రవుతారు. సువర్ణదానం చేసినవారు దేవతలను కూడా దానమిచ్చినట్లే. ఎందుకంటే అగ్ని సర్వదేవతా స్వరూపం. సువర్ణం అగ్ని స్వరూపం. పురుషశ్రేష్ఠా! కాబట్టి సువర్ణదానం చేస్తే సర్వదేవతా దానం చేసినట్లే. అందుకే సువర్ణదానాన్ని మించినదానం లేదంటారు.

బ్రహ్మర్షీ! సువర్ణదానమాహాత్మ్యాన్ని గురించి ఇంకా చెపుతాను విను. భృగునందనా! గతంలో నేను పురాణంలో ప్రజాపతి యథాన్యాయంగా చెప్తుండగా దీన్ని విన్నాను. పర్వతశ్రేష్ఠమైన హిమాలయంపై శూలపాణి, మహాత్ముడు అయిన రుద్రునకు రుద్రాణితో వివాహం జరిగినప్పుడు, ఆ శివునకు దేవితో సమాగమం జరిగినప్పుడు జరిగిన సంగతి ఇది. మహాదేవుడైన రుద్రుడు, వరదాయిని అయిన ఉమాదేవి కైలాసగిరిపై కూర్చొని ఉండగా దేవతలందరూ ఉద్వేగంతో అక్కడకు వచ్చారు. వారందరూ శిరసా నమస్కరించి, రుద్రునితో ఇలా అన్నారు. "దేవా! దేవితో ఈ నీ సమాగమం తపస్వినితో తపస్వికి, తేజస్వినితో తేజస్వికి జరిగిన సమాగమం. దేవా! నీ తేజస్సు అమోఘం. ఈ ఉమ తేజస్సూ అటువంటిదే. స్వామీ! మీ సంతతి బలిష్ఠమవుతుంది. అది మూడులోకాలలో దేనినీ మిగల్చదు. కాబట్టి నీ పాదాలపై పడిన ఈ దేవతలకు త్రిలోకహితాన్ని కోరి వరమిమ్ము. స్వామీ! సంతతి

కొరకై నీ పరమతేజస్సును నిగ్రహించుకో! త్రిలోక సారభూతులైన మీరు లోకాన్ని తపింపజేయగలరు. మీ ఇద్దరికీ పుట్టిన కొడుకు . నిశ్చయంగా దేవతలను కూడా ఓడించగలుగుతాడు. నీ తేజస్సును భూమి కానీ, ఆకాశం కానీ ఈ స్వర్గం కానీ ధరింపలేవని మా నమ్మకం. అన్నీ కలిసి కూడా భరింపలేవు. నీ తేజస్సుతో ఈ విశ్వమంతా దగ్ధమై పోతుంది. కాబట్టి ప్రభూ! భగవన్, మాపై దయ చూపు. సురశ్రేష్ఠా! నీకు ఈ ఉమాదేవి ద్వారా పుత్రుడు జన్మించరాదు. ప్రజ్వలిస్తున్న ఉత్తమ తేజస్సును ధైర్యంతో నిగ్రహించు. బ్రహ్మర్షీ! దేవతలందరూ అలా ప్రార్థిస్తుంటే వృషభధ్వజుడైన ఆ భగవంతుడు "అలాగే జరుగుగాక!" అని వారితో అన్నాడు.

అలా చెప్పి వృషభవాహనుడు తన రేతస్సును పైకి పంపాడు. అప్పటినుండి ఆయన ఊర్ధ్వరేతస్కుడయ్యాడు. ఆ రీతిగా సంతాన విచ్ఛిత్తి జరగగానే రుద్రాణి కోపించి, స్త్రీ స్వభావాన్ని బట్టి దేవతలతో ఇలా పరుషవచనాలు పలికింది. దేవతలారా! సంతానాపేక్ష గల నా భర్తను మీరు దానినుండి విరమింపజేశారు కాబట్టి మీరంతా ఇకపై సంతానహీను లవుతారు దేవతలారా! మీరు నాకు సంతానం లేకుండా చేశారు కాబట్టి మీకెవ్వరికీ సంతానముండదు. భృగూద్వహా! ఆ శాపసమయంలో అగ్ని అక్కడ లేడు. దేవి ఇచ్చిన ఆ శాపం వలన దేవతలు సంతానహీనులయ్యారు. అప్పుడు రుద్రుడు సాటిలేని ఆ తేజస్సును అలాగే ధరించాడు. అయినా దానిలో కొంచెం జారి అక్కడే నేలపై పడింది. ఆ తేజస్సు అగ్నిలో పడి పెరుగుతూ అద్భుతంగా పైకి ప్రాకసాగింది. తేజస్సుతో కలిసిన ఆ తేజస్సు ఒక స్వయంభువు వలె వ్యక్తం కాసాగింది. అదే సమయంలో తారకుడనే అసురుడు పుట్టాడు. ఇంద్రాది దేవతలను అతడెంతో తపింప జేశాడు. ఆ దైత్యుని పరాక్రమానికి ఆదిత్యులు, వసువులు, రుద్రులు, మరుత్తులు, అశ్వినులు, సాధ్యులు – అందరూ బెదరిపోయారు. అసురులు దేవతల స్థానాలను, విమానాలను, నగరాలను, ఋషుల ఆశ్రమాలను అపహరించారు. ఆ సర్వదేవతలు, ఋషులు, దీనమనస్కులై అజరుడు, విభువు అయిన బ్రహ్మదేవుని శరణుకోరారు.

85. కార్తికేయ, సువర్ణోత్పత్తి.

దేవతలిలా అన్నారు. "ప్రభూ! తారకుడనే అసురుడు నీ నుండి వరాలను పొంది, దేవతలను, ఋషులను కష్టపెడుతున్నాడు. ఆతనిని వధించే ఏర్పాటు చేయాలి. పితామహా! ఆతనివలన మాకు భయం కలుగుతోంది. దేవా! మమ్ము కాపాడు. మాకు

మరొక దారిలేదు." బ్రహ్మ చెప్తున్నాడు. "సర్వప్రాణులూ నాకు సమానమే. అధర్మాన్ని నేను ఇష్టపడను. దేవ ఋషి గణాలను బాధిస్తున్న తారకుని వెంటనే చంపండి. సురోత్తములారా! వేదాలు కానీ, ధర్మం కానీ విచ్ఛిన్నం కారాదు. దీనిని నేను ముందుగానే ఏర్పాటు చేశాను. మీరు చింతించవద్దు. దేవతలిలా అన్నారు. "తమరు వరమిచ్చినందువలన ఆ దైత్యుడు బలంతో గర్విస్తున్నాడు. దేవతలు అతనిని చంపలేరు. అతడు ఎలా శాంతిస్తాడు ? పితామహా! దేవతలు కానీ, అసురులు కానీ, రాక్షసులు కానీ తనను చంపలేనట్లు తమరినుండియే ఆ తారకుడు వరం పొందాడు. జగత్పతీ! గతంలో మేము చేసిన పనివల్ల 'మాకెవ్వరికీ సంతానముండ'దని రుద్రాణి మమ్ము శపించింది.

బ్రహ్మ ఇలా అన్నాడు. "సురోత్తములారా! శాప సమయంలో అగ్ని అక్కడ లేడు. దైత్యవధ కోసం అగ్ని సంతానాన్ని కంటాడు. ఆ సంతతి సర్వదేవతలను, దానవులను, రాక్షసులను, మనుష్యులను, గంధర్వులను, నాగులను, పక్షులను అతిక్రమించి, మిమ్ము భయపెడుతున్న తారకుని, ఇతర దేవశత్రులను కూడా మొక్కవోని అస్త్రమైన శక్తితో సంహరిస్తాడు. సనాతన సంకల్పమే కామమనబడుతుంది. ఆ కామం చేతనే రుద్రతేజస్సు జారి, అగ్నిలో పడింది. దానిని అగ్ని గర్భించాడు. రెండవ అగ్నివలెనున్న ఆ మహాతేజస్సును అగ్ని గంగలో ప్రతిష్ఠించి, కుమారునిగా పుట్టిస్తాడు. దేవ శత్రువులను ఆ కుమారుడే సంహరిస్తాడు. అగ్ని ఆ సమయంలో అక్కడ కనిపించలేదు కాబట్టి ఆ శాపం అగ్నికి వర్తించదు. కాబట్టి దేవతలారా! అగ్ని నుండి పుట్టిన ఆ బాలుడు మీ భయాన్ని తొలగిస్తాడు. వెళ్ళి అగ్నిని వెతకండి, పనిలో నేడే నియోగించండి. అనఘులారా! తారకాసురవధోపాయాన్ని నేను చెప్పాను. తేజస్వులశాపం తేజస్వులపై ప్రభావాన్ని చూపలేదు. బలం కూడా తనను మించిన బలాన్ని తాకితే దుర్బలమవుతుంది. తపస్వుల కామం సంకల్పమనీ, అభిరుచి అనీ వ్యవహరింపబడుతుంది. అది సనాతనం. అది అవధ్యులను, వరదాతలను కూడా చంపగలుగుతుంది. అగ్ని జగత్పతి, అనిర్వచనీయుడు సర్వవ్యాపి. సర్వభావనుడు. అందరి హృదయాలలో శయనించేవాడు. సమర్థుడు రుద్రునికన్నా జ్యేష్ఠుడు. తేజోరాశి అయిన ఆ అగ్నిదేవుని వెంటనే వెదకండి. ఆ దేవుడే మీ మనోగతమైన కోరికను తీర్చగలడు.

మహాత్ములైన దేవతలు ఈ వాక్యాన్ని విని, సిద్ధ సంకల్పులై, అగ్నిని అన్వేషించటానికి బయలుదేరారు. ఆపై దేవతలతో కలిసి ఋషులు తదేకమనస్సుతో అగ్ని దర్శనాన్ని కోరుతూ మూడులోకాలలోనూ అన్వేషించసాగారు. భృగూత్తమా! ఉత్తమ తపస్సుతోకూడి, శ్రీమంతులై, లోక ప్రసిద్ధి చెందిన ఆ సిద్ధులు (దేవతలు) అందరూ

లోకాలన్నీ తిరుగసాగారు. తనలో తనను లీనం చేసికొని దాగియున్న అగ్నిని చూడలేకపోయారు. ఆపై అగ్ని దర్శనలాలసులై, అగ్ని కనిపించనందువలన భయానికి లోనైన ఆ దేవతలకు ఒక కప్ప కనిపించింది. ఆ జలచరం రసాతలం అడుగునుండి పైకి వచ్చింది. అది అగ్ని తేజస్సుతో తపిస్తూ కలతచెంది ఉంది. ఆ కప్ప ఇలా అన్నది. "దేవతలారా! అగ్ని రసాతలంలో నివసిస్తున్నాడు. ఆ అగ్ని నుండి పుట్టిన సంతాపంతో కలతపడి నేను ఇక్కడకు వచ్చాను. దేవతలారా! పూజ్యుడైన ఆ అగ్ని తన తేజస్సులను నీటితో కలిపి నీటిలో నిదురిస్తున్నాడు. ఆ తేజస్సుతో మేము తపించిపోతున్నాం. దేవతలారా! మీరు ఆ అగ్నిని చూడదలచుకొంటే, మీకు అగ్నితో పని ఉంటే మీరు అక్కడకే వెళ్ళండి. దేవతలారా! వెళ్ళండి. అగ్నిభయం వలన మేము మరొక చోటికి పోతాం." ఇలా పలికి కప్ప వేగంగా నీటిలో ప్రవేశించింది.

కప్ప తన గురించి చాడీలు చెప్పినట్లు అగ్ని గ్రహించాడు. దాని దగ్గరకు వచ్చి "నీకు రుచి తెలియకుండుగాక" అని దానిని శపించాడు. వ్యాపనశీలుడైన ఆ అగ్ని ఆ కప్పను శపించి వేగంగా మరొకచోట వసించటానికి వెళ్ళిపోయాడు. కానీ ప్రత్యక్షం కాలేదు. భృగూత్తమా! దేవతలు మండూకాలపై దయ చూపారు. వివరంగా చెపుతాను విను. దేవతలిలా అన్నారు. అగ్ని శాపం వలన నాలుకను కోలుపోయి రసజ్ఞానానికి దూరమయినా అనేక విధాలుగా మీరు వాణిని ఉచ్చరింపగలుగుతారు. బిలంలో నివసించే సమయంలో ఆహారం లేక, అచేతనంగా, ప్రాణరహితంగా మీరు ఎండిపోయినా భూమి మిమ్ములను ధరించి, ప్రాణాలతో నిలుపుతుంది. దట్టమైన చీకటి గల రాత్రివేళ కూడా మీరు సంచరించగలరు." వాటితో అలా చెప్పి, ఆపై దేవతలు మరల అగ్నికోసం ఈ భూమిమీద చరింపసాగారు. కానీ అగ్ని కనిపించలేదు. భృగూద్వహా! అప్పుడు ఐరావతం వంటి ఒక ఏనుగు 'అగ్ని అశ్వత్థ వృక్షంలో ఉన్నా'డని ఆ దేవతలతో చెప్పింది. భృగూద్వహా! క్రోధమూర్ఛితుడైన అగ్ని 'మీ నాలుక వెనుకకు తిరిగి ఉంటుంద"ని ఏనుగుల నన్నింటినీ శపించాడు. ఏనుగులచే సూచింపబడిన అగ్ని వాటినలా శపించి, అశ్వత్థవృక్షం నుండి వెలువడి నిదురించాలన్న కోరికతో శమీవృక్షంలో ప్రవేశించాడు. ప్రభూ! సత్యపరాక్రములైన దేవతలు ఏనుగుల నెలా అనుగ్రహించారో చెపుతా విను.

దేవతలిలా అన్నారు. "నాలుక వెనుదిరిగి ఉన్నా మీరు అన్ని ఆహారాలనూ తీసికొనగలరు. ఆ వ్యక్తాక్షరాలతో పెద్దగా మాటాడగలరు. అలా అనుగ్రహించి దేవతలు మరల అగ్నిని అనుసరించారు. అశ్వత్థవృక్షం నుండి వెలువడిన అగ్ని శమీగర్భంలో

ప్రవేశించాడు. బ్రాహ్మణా! చిలుక అగ్ని ఆచూకీ చెప్పగానే దేవతలు శమీవృక్షంవైపు పరుగెత్తారు. "మీకు మాటలు రాకుండుగాక" అని అగ్ని చిలుకను శపించాడు. అగ్ని దాని నాలుకను కూడా తిరగవేశాడు. దేవతలు అగ్నిని చూసి, దయామయులై చిలుకతో ఇలా అన్నారు. "నీవు చిలుకగా ఉన్న నీ వాక్కు పూర్తిగా నశించదు నాలుక తిరగబడినా నీ మాట మధురంగానే ఉంటుంది. పిల్లల మాటలు పెద్దలకు రుచించినట్లు నీమాట అవ్యక్త మధురంగా అద్భుతంగా ఉంటుంది. చిలుకతో అలా పలికి దేవతలు శమీగర్భంలో అగ్నిని గుర్తించి, శమీవృక్షాన్నే సర్వక్రియలలోనూ అగ్నికి పవిత్రస్థానంగా చేశారు. అప్పటినుండియే అగ్ని శమీగర్భంలో కనిపించసాగాడు. మానవులు నిప్పు పుట్టించటానికి శమీ వృక్షాన్నే ఉపాయంగా స్వీకరించారు. భార్గవా! రసాతలంలో అగ్ని, స్పృశించి, శయనించిన నీళ్ళు అగ్నితేజస్సుతో వేడెక్కాయి. అవి పర్వతం మీద నుండి జారిపడే సెలయేళ్ళ రూపంలో తమ వేడిని విడుస్తాయి. ఆపై అగ్ని దేవతలను చూసి, వ్యధ చెంది, 'ఎందుకు వచ్చారు?' అని వారిని అడిగాడు. అప్పుడు దేవతలు, పరమమునులు అందరూ "నిన్ను పనిలో నియోగిస్తున్నాం. అది చేయగలవాడవు నీవే" అన్నారు. అగ్ని ఇలా అన్నాడు. "దేవతలారా! మీ పని ఏమిటో చెప్పండి. దానిని నేను చేస్తాను. నన్ను మీరు నియోగించవచ్చు. మీకు మరో ఆలోచన వలదు." దేవతలిలా అన్నారు. బ్రహ్మవరాలతో పొగరెక్కిన తారకాసురుడు బలవంతుడై మమ్ము బాధిస్తున్నాడు. అతనిని చంపాలి. పావకా! ఈ దేవగణాలను, ప్రజాపతి గణాలను, ఋషిగణాలను రక్షించు. తేజస్వి, వీరుడు అయిన ఒక కొడుకును కను. అతడు మాకు రాక్షసుని వలన కలిగే భయాన్ని పోగొట్టాలి. మహాదేవిచే శపింపబడిన మాకు నీ వీర్యం తప్ప మరొక గతి లేదు. కాబట్టి ప్రభూ మమ్ము కాపాడు".

దేవతలిలా అనగానే "అలాగే" అని అంగీకరించి అగ్ని గంగానది దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు అగ్ని గంగతో కలిశాడు. గంగ గర్భాన్ని ధరించింది. ఎండు పుల్లలపై అగ్ని ప్రజ్వరిల్లునట్లు ఆ గర్భం గంగలో వృద్ధిచెందసాగింది. ఆ మహేశ్వరుని తేజంతో గంగ మనస్సు వ్యాకులమైంది. తీవ్రసంతాపానికి లోనైంది. ఆ తేజస్సును గర్భంలో సహించలేకపోయింది. అగ్ని ప్రతిష్ఠించిన ఆ తేజోవంతమైన గర్భం గంగలో పెరుగుతుండగా ఒక రాక్షసుడు అక్కడకు వచ్చి పెద్దగా, భీకరంగా అరిచాడు. హఠాత్తుగా ఆ భీకరనాదం వినిపించగానే గంగకు భయంతో కళ్ళు తిరిగాయి. ఆమె కన్నీరు కార్చసాగింది. గంగ చైతన్యాన్ని కోల్పోతోంది. గర్భాన్ని, తనను కూడా భరించలేకపోయింది. శరీరమంతా తేజస్సు వ్యాపించింది. ఆమెకు వణుకు పుట్టింది. ఆ గర్భభారంతో దెబ్బతిని ఆమె

అగ్నితో ఇలా అన్నది. "స్వామీ! నేను నీ ఈ గర్భభారాన్ని ధరించలేకపోతున్నాను. అనఘా! నాకు మూర్ఛవచ్చేటట్లుంది. ఇంతకు ముందువలె ఆరోగ్యంగా లేను. స్వామీ! నాకు కంగారుగా ఉంది. నేను చైతన్యాన్ని కోల్పోతున్నాను. అగ్నీ! తపించేవారిలో శ్రేష్ఠుడవు నీవు. ఈ గర్భాన్ని ధరించే శక్తి ఇక నాకు లేదు. దీనిని విడిచివేయబోతున్నాను. ఈ పని బాధతో చేస్తున్నదే కానీ ఇష్టంతో చేస్తున్నది కాదు. అగ్నీ! మహాద్యుతీ! ఈ తేజస్సుతో వాస్తవానికి నాకెటువంటి స్పర్శా లేదు. నాకున్న ఈ కొద్దిపాటి సంబంధం కూడా దేవతలకు కలిగిన ఆపదను తొలగించటానికి ఏర్పడింది మాత్రమే. హుతాశనా! ఈ పనిలో గుణమున్నా లేక దోషమున్నా, కేవలం ధర్మమయినా, అధర్మమయినా ఆ బాధ్యత మాత్రం నీదేనని నా భావన." అప్పుడు అగ్ని ఆమెతో ఇలా అన్నాడు. "ఈ గర్భం నా తేజస్సుతో కూడినది. మహాగుణాలతో కూడిన ఫలితాన్ని ఇచ్చేది. దీనిని ధరించు, ధరించు. ఈ భూమినంతటినీ కూడా భరించగలదానవు. ఈ గర్భాన్ని ధరించటం తప్ప నీకు సాధ్యమైనది ఏదీ లేదు". అలా అగ్ని, దేవతలు, వారిస్తున్నా కూడా ఆ నదీమతల్లి ఆ గర్భాన్ని అప్పుడు పర్వతశ్రేష్ఠమైన మేరుపర్వతంపై విడిచింది. గంగ ఆ గర్భాన్ని భరించగలిగినదే. కానీ రుద్ర తేజస్సు మేర మీరినందువలన తన శక్తితో ఆ గర్భాన్ని ధరించలేకపోయింది.

భృగునందనా! ప్రజ్వలించే అగ్నివలె ప్రకాశిస్తున్న ఆ గర్భాన్ని గంగ బాధపడుతూనే విసర్జించింది. అప్పుడు అగ్ని దానిని దర్శించి గంగతో ఇలా అన్నాడు. "గర్భం నీకు సుఖాన్నే కలిగించిందా? దాని వర్ణమేది? దాని రూపమేది? దాని తేజస్సు ఎటువంటిది ? ఇదంతా నాకు చెప్పు. గంగ ఇలా అన్నది. "అనఘా! ఆ గర్భం సువర్ణం. అనఘా! తేజస్సులో అది నీతో సమానం. బంగారం వలె నిర్మలంగా వెలుగొందుతూ అది పర్వతాన్ని ప్రకాశింపజేసింది. కమలాలతో, కలువలతో కూడిన కొలనులవలె అది చల్లనిది. కదంబకుసుమ పరిమళాల వంటి సుగంధాన్ని వెలువరించింది. సూర్యకిరణాలు తాకినట్లు ఆ గర్భం యొక్క తేజఃకిరణాలు ఆ పర్వతాలపై నున్న పదార్థాలను తాకగానే అదంతా బంగారమై అన్ని వైపులనుండి కనిపించింది. ఆ బాలుడు, స్థావర జంగమాత్మకాలైన మూడు లోకాలను తన తేజస్సుతో దీపింపజేస్తూ పర్వతాలవైపు, నదులవైపు, సెలయేళ్ళవైపు పరువెత్తాడు. స్వామీ! హవ్యవాహనా! నీ కుమారుని రూపం అటువంటిది. సూర్యునితో, అగ్నితో సమానమైన తేజస్సు. కాంతితో మరో చంద్రునివంటివాడు. అలాపలికి ఆ గంగ అక్కడే అంతర్ధానమయింది. భార్గవనందనా! తేజస్వి అయిన అగ్ని కూడా దేవతల పనిని నెరవేర్చి తనకిష్టమైన తావునకు వెళ్ళిపోయాడు. ఈ కర్మల వలన, గుణాలవలన, ఋషులు, దేవతలు కూడా

లోకంలో అగ్నిని **హిరణ్యకేతుడని** వ్యవహరిస్తారు. ఆ హిరణ్యాన్ని ధరించినందువలనే భూమిని కూడా **వసుమతి** అంటారు. అగ్నినుండి, గంగనుండి పుట్టిన మహాతేజస్సు గల ఆ గర్భం దివ్యమైన రెల్లు పొదపై నిలిచి, పెరుగుతూ, అద్భుతంగా కనిపించింది. బాలసూర్యుని వంటి కాంతిగల ఆ బాలకుని కృత్తికలు చూశారు. ఆ బాలుని తమ కుమారునిగా భావించి చనుబాలనిచ్చి పోషించారు. దానితో పరమతేజస్వి అయిన ఆ బాలుడు **కార్తికేయుడ**య్యాడు. జారిన వీర్యం నుండి పుట్టాడు కాబట్టి **స్కందుడ**య్యాడు. గుహలో వసించాడు కాబట్టి **గుహుడ**య్యాడు. ఈ రీతిగా అగ్ని సంతానంగా సువర్ణం పుట్టింది. ఆ బంగారంలో కూడా జాంబూనదం శ్రేష్ఠం. అది దేవతలకు కూడా ఆభరణం. అప్పటినుండియే ఇది **జాతరూపమని** వ్యవహరింపబడింది. రత్నాలలో, ఆభరణాలలో అదే ఉత్తమం. పవిత్రాలలో పవిత్రం. మంగళ ద్రవ్యాలకు కూడా మంగళద్రవ్యం. అదే సువర్ణం. అదే అగ్ని స్వరూపం, ఈశ్వర స్వరూపం, ప్రజాపతి స్వరూపం కూడా. బ్రాహ్మణోత్తములారా! పవిత్ర వస్తువులకే పవిత్రతను కూర్చేది బంగారం. అది అగ్ని స్వరూపం, సోమస్వరూపం కూడా.

వసిష్ఠుడిలా అన్నాడు "రామా! పరమాత్మ, పితామహుడు అయిన బ్రహ్మ గతంలో బ్రహ్మదర్శనాన్ని చెప్పగా విన్నాను. రామా! ఒకప్పుడు ఈశుడు, మహాదేవుడు అయిన రుద్రుడు వరుణ రూపాన్ని ధరించి, వరుణుని సామ్రాజ్యాన్ని అధిష్ఠించాడు. అప్పుడు అందరు మునులు, అగ్ని మొదలయిన దేవతలు, రూపాన్ని ధరించి సమస్త యాగాంగాలు, వషట్కారాలు, రూపుదాల్చిన సామలు, వేలకొలది యజుస్సులు, పదక్రమవిభూషితమైన ఋగ్వేదం అక్కడ చేరాయి. వేద లక్షణాలు, స్వరాలు, స్తోభాలు, నిరుక్తం, సురపంక్తులు, ఓంకారం, యాగనేత్రాలయిన ప్రగ్రహనిగ్రహాలు అక్కడ చేరాయి. వేదాలు, ఉపనిషత్తులు, విద్యలు, సావిత్రి అక్కడ చేరారు. భగవంతుడైన శివుడు భూత భవిష్యద్వర్తమాన రూపాలను ధరించాడు. అప్పుడు పినాకపాణి బహురూపమైన యాగాన్ని శోభిల్లజేశాడు. స్వయంగా తనను తాను ఆహుతిగా అర్పించుకొన్నాడు. ఈ శివుడే స్వర్గం, ఆకాశం, పృథివి, సమస్త శూన్యమూ, రాజు, సర్వవిద్యాధీశ్వరుడు, తేజస్వి అయిన అగ్ని కూడా. సర్వభూతపతి అయిన మహాదేవుడే బ్రహ్మ, శివుడు, రుద్రుడు, వరుణుడు, అగ్ని, ప్రజాపతి మొదలైన పేర్లతో కీర్తింపబడతాడు. భృగూద్వహా! ఈ రీతిగా పూజ్యుడైన పశుపతి యజ్ఞం సాగింది. తపస్సు, క్రతువులు, దీప్తవ్రత అయిన దీక్షాదేవి, దిక్కులు, దిక్పాలకులు, దేవపత్నులు, దేవకన్యలు, దేవదూతలు అక్కడ భాగస్వాములై చేశారు.

వరుణరూపాన్ని ధరించి ఉన్నా మహాత్ముడైన పశుపతి యాగానికి వచ్చి ఆ దేవతా స్త్రీలు ప్రసన్నులయ్యారు. స్వయంభువు బ్రహ్మ వారిని చూశాడు. స్థలించాడు. ఆ వీర్యం నేలపై పడింది. పూష ఆ వీర్యకణాలతో కలిసిన ధూళిని రెండు చేతులతో భూమినుండి పైకి తీసి, ఆ అగ్నిలోనే పడవేశాడు. ఆపై ప్రజ్వలిస్తున్న అగ్నితో ఆ యజ్ఞం అలా సాగుతుండగా బ్రహ్మ మరలా స్థలించాడు. భృగునందనా! వీర్యం అలా స్థలించగానే బ్రహ్మ స్వయంగా స్రువంతో దానిని తీసికొని, మంత్రపూర్వకంగా నేతిని వలె వీర్యాన్ని హోమం చేశాడు. బలశాలి అయిన బ్రహ్మ ఆ వీర్యం నుండి ప్రాణి సముదాయాన్ని సృష్టించాడు. ఆ వీర్యంలోని రజో గుణభాగం నుండి లోకంలో రజోగుణప్రధానులైన ప్రాణులు పుట్టారు. తమోగుణాంశ నుండి తామస పదార్థాలు (స్థావరాలైన వృక్షాదులు) పుట్టాయి. సత్త్వగుణాంశ రాజసతామసాల రెండింటిలో వ్యాపించింది. ఆ సత్త్వగుణం తేజస్సు (బుద్ధి) యొక్క నిత్యస్వరూపం. ఆకాశాదులు ఆ బుద్ధికార్యాలు. ఆ రీతిగా సర్వప్రాణులలోని సత్త్వగుణం, ఉత్తమతేజస్సు ప్రజాపతి వీర్యం నుండి పుట్టినవే. ప్రభూ! శుక్రాన్ని అగ్నిలో హోమం చేసినప్పుడు శరీరధారులైన ముగ్గురు పురుషులు పుట్టారు. వారు తమకు కారణమైన ఆయా గుణాలతో సంపన్నులు. భృక్కు (అగ్నిజ్వాల) నుండి పుట్టినవాడు భృగువు. అంగారం (నిప్పు) నుండి పుట్టినవాడు అంగిరుడు. అంగారానికి ఆశ్రయమైన స్వల్ప జ్వాలనుండి పుట్టినవాడు కవి. భృగువు జ్వాలలతో పాటు పుట్టాడు. అందువలననే ఆయన భృగువు. అగ్ని మరీచుల నుండి పుట్టినవాడు మరీచుడు. ఆయన కుమారుడు మారీచుడు కశ్యపుడుగా ప్రఖ్యాతుడు అంగారం నుండి అంగిరుడు, దర్భల సముదాయం నుండి వాలఖిల్యులు పుట్టారు. విభూ! ఇక్కడే (అత్రైవ) దర్భసమూహం నుండి పుట్టినవాడు అత్రి. బూడిదరాసుల నుండి బ్రహ్మర్షిగణాలు సమ్మానించే వైఖానసులు జనించారు. వారు తపస్సును, పాండితిని, గుణసముదాయాన్ని ఇష్టపడేవారు. అగ్నియొక్క అశ్రువుల నుండి అశ్వినులు పుట్టారు. వారు సుందరులుగా మన్నింపబడేవారు.

ఇతర ప్రజాపతులు అగ్ని యొక్క ఇంద్రియాల నుండి పుట్టారు. రోమకూపాల నుండి ఋషులు, చెమటనుండి ఛందస్సు, బలం నుండి మనస్సు పుట్టాయి. ఈ కారణం వలననే వేదసంపన్నులైన ఋషులు వేద సామ్రాజ్య దృష్టితో అగ్నిని సర్వదేవతా స్వరూపుడన్నారు. యజ్ఞసమిధలు, వాటిరసాలు మాసాలు, పక్షాలు, అహోరాత్రాలు, ముహూర్తాలు అయ్యాయి. అగ్నిలోని పిత్తమే (ధాతువులలో ఒకటి) ఉగ్రతేజస్సు అయింది. అగ్నితేజస్సును **లోహితమంటారు**. ఆ లోహితం నుండి **సువర్ణం** పుట్టింది. దానినే మైత్రమని తెలియాలి.

అగ్నిధూమం నుండి వసువులు పుట్టారు. అగ్విజ్వాలలే ఏకాదశరుద్రులు, మహాతేజస్సుగల ఆదిత్యులు కూడా యజ్ఞంలోని ఇతరాంగాలు, ఆకాశంలోని నక్షత్రమండలంలోని జ్యోతులు. లోకానికి సృష్టికర్త అయిన బ్రహ్మ ఆ అగ్నినే అక్షయ పరబ్రహ్మమన్నాడు. అది అన్ని కోరికలను తీర్చేది. అది రహస్యమనికూడా అన్నాడు. ఆపై వరుణ పవన స్వరూపుడైన మహాదేవుడు ఇలా అన్నాడు. "ఇది నా దివ్యయాగం. నేనే ఇక్కడ గృహపతిని (యజమానిని). దేవతలారా! ముందు పుట్టిన ఆ ముగ్గురు (భృగువు, అంగిరుడు, కవి) నా కుమారులు. సంశయం లేదు. యజ్ఞఫలమంతా నాదేనని మీరు గ్రహించాలి. అగ్ని ఇలా అన్నాడు. "వీరు నా శరీరం నుండి పుట్టారు. నా ఆశ్రయంలోనే బ్రహ్మ వీరిని సృష్టించాడు. కాబట్టి వారు నా కుమారులే. వరుణ రూపాన్ని ధరించిన మహాదేవునకు అధికారం లేదు. అప్పుడు జగద్గురువు, లోకపితామహుడు అయిన బ్రహ్మ ఇలా అన్నాడు. "వారు నా కుమారులు. నా వీర్యాన్ని ఆహుతి చేస్తేనే వారు పుట్టారు. యాగానికి కర్తను నేను. వీర్యాన్ని హోమం చేసింది నేనే. బీజమెవరిదో ఫలంకూడా వారిదే. శుక్రం నుండియే వీరు పుట్టినట్లయితే వారు నా కుమారులే. ఆపై దేవతలందరూ బ్రహ్మను సమీపించి, చేతులు జోడించి, శిరసా నమస్కరించి ఇలా అన్నారు.

"భగవంతుడా! మేమందరమూ, చరాచర స్వరూపమైన ఈ జగత్తు అంతా నీ సంతానమే. కాబట్టి ప్రజ్వలిస్తున్న ఈ అగ్ని వరుణరూపధారి ఈశ్వరుడు అయిన మహాదేవుడు కూడా వారి కోరికలను పొందేటట్లు చూడు. బ్రహ్మ అనుమతితో జలాధిపతి అయిన వరుణుని రూపంలో ఉన్న మహాదేవుడు సూర్యతేజస్సుగల భృగువును కొడుకుగా స్వీకరించాడు. ఆ ఈశ్వరుడే అంగిరుని అగ్ని కుమారునిగా నిర్ణయించాడు. ఆపై తత్త్వవేత్త అయిన పితామహుడు కవిని కుమారునిగా స్వీకరించాడు. అప్పుడు సంతానకర్తవ్య మెరిగిన భృగువు వారుణనామంతో ప్రసిద్ధికెక్కాడు. తేజస్వి అయిన అంగిరుడు ఆగ్నేయుడుగా, మహాయశస్వి అయిన కవి బ్రాహ్మనామంతో ప్రసిద్ధులయ్యారు. భృగువు అంగిరసుడు లోకంలో లోక విస్తారకులుగా భావింపబడ్డారు. ఈ రీతిగా వీరు ముగ్గురు ప్రజాపతులు. మిగిలిన అందరూ వారి సంతానమే. ఈ ప్రపంచమంతా వారి సంతతియే అని గ్రహించు. భృగువుకు ఏడుగురు కొడుకులు. వారందరూ భృగువుగుణాలవంటి గుణాలు గలవారే. చ్యవనుడు, వజ్రశీర్షుడు, శుచి, ఔర్వుడు, శుక్రుడు, వరుణుడు, సవనుడు - వీరే ఆ ఏడుగురు, భృగువంశీయులందరూ వారుణులే. నీవు కూడా ఆ వంశానికి చెందినవాడవే. అంగిరునికి ఎనిమిది మంది కొడుకులు. వారికి కూడా వరుణ యజ్ఞసంజాతులు కాబట్టి

వారణులని వ్యవహారం: బృహస్పతి, ఉతథ్యుడు, పయస్యుడు, శాంతి, ఘోరుడు, విరూపుడు, సంవర్తుడు, సుధన్వుడు – వీరు ఆ ఎనిమిదిమంది. వీరంతా అగ్నివంశంలో పుట్టినవారు. అందరూ జ్ఞాననిష్ఠులు శోకరోగరహితులు. బ్రహ్మపుత్రుడైన కవికి ఎనిమిదిమంది కొడుకులు. వారికి కూడా వారణులని వ్యవహారం. వారంతా బ్రహ్మవేత్తలు, శుభలక్షణులు పుత్రులకు తగిన గుణాలు గలవారు. కవి, కావ్యుడు, ధృష్ణుడు, బుద్ధిమంతుడైన శుక్రుడు, భృగువు, విరజుడు, కాశి, ధర్మవేత్త అయిన ఉగ్రుడు. ఈ ఎనిమిదిమంది కవికొడుకులు వీరు విశ్వమంతా వ్యాపించి ఉన్నారు. వీరందరూ ప్రజాపతులే. ప్రజాగుణసంపన్నులు కాబట్టి ప్రజలు కూడా. భృగుశార్దూలా! ఈ రీతిగా అంగిరుడు, కవి, భృగువంశీయులతో, వారి సంతాన పరంపరతో విశ్వమంతా వ్యాపించింది. విప్రా! ప్రభువు, వరుణరూపుడైన ఈశ్వరుడు కవిని, భృగువును ముందు పుత్రులనుగా స్వీకరించినందువలన వారికి వారుణులని పేరు.

జ్వాలలు గల అగ్ని అంగిరుని పుత్రునిగా స్వీకరించినందువలన ఆ వంశంలోని వారంతా ఆంగిరసులని తెలిసి కోవాలి. గతంలో దేవతలు పితామహుడైన బ్రహ్మను ప్రసన్నుని చేసికొని ఇలా అన్నారు. "ఈ భృగువు మొదలయిన వారి వంశాలలో పుట్టినవారు జగదీశ్వరులై తమ సంతానంతో మమ్ము తరింపజేయగలరు. ఆ ప్రజాపతులందరు మహాతపస్వులు, ఇప్పుడు నీ అనుగ్రహంతో వారు ఈలోకాన్ని ఉద్ధరించాలి. అలాగే వీరంతా వంశకర్తలు, తేజోవర్ధకులు, వేదవేత్తలు, కృతార్థులు కావాలి. ప్రజాపతుల వంశాలలో పుట్టిన ఈ సౌమ్య మహర్షులు దేవతల పక్షాన వ్యవహరిస్తూ, తపస్సు, ఉత్తమ బ్రహ్మచర్యాల ఫలాన్ని పొందాలి. ప్రభూ! మేమందరమూ, వీరు కూడా నీ సంతతియే. పితామహా! దేవతలకు, బ్రాహ్మణులకు కూడా నీవే కర్తవు. పితామహా! కశ్యపునితో ప్రారంభించి, భృగు వంశీయులమైన మేమందరమూ నీ సంతానమే అని భావించి మా లోపాలను మన్నించాలి. ఆ ప్రజాపతులందరూ ఈ రూపాలతోనే ప్రజోత్పాదన చేస్తారు. సృష్టి ప్రారంభం నుండి ప్రళయ పర్యంతమూ తమను తాము స్థిరపరచుకొంటారు. ఆ దేవతలు అలా పలుకగానే లోకపితామహుడైన బ్రహ్మ ప్రసన్నుడై 'అలాగే' అన్నాడు. వారు వచ్చిన రీతిగానే వెళ్ళిపోయారు. ఇది ఈ రీతిగా సృష్టిప్రారంభ సమయంలో వరుణ శరీరాన్ని ధరించిన మహాత్ముడైన ఆ మహేశ్వరుని యజ్ఞంలో జరిగిన సంఘటన.

అగ్ని, బ్రహ్మ, పశుపతి, శర్వుడు, రుద్రుడు, ప్రజాపతి వీరి స్వరూపం, ఆ అగ్ని సంతానమే సువర్ణమని అందరి నిశ్చయం. జమదగ్ని కుమారా! వేద ప్రమాణమెరిగిన

వారు వేదవాక్యాల నిదర్శనాన్ని బట్టి అగ్నిలేనపుడు ఆ స్థానంలో బంగారాన్ని వినియోగిస్తారు. దర్భల సమూహంపై, దానిపై నున్న బంగారంపై, పుట్ట తొర్రలో, మేకపోతు ఎడమచెవిలో, బండ్లు ప్రయాణించే బాటపై, ఇతరుల జలాశయంలో బ్రాహ్మణుని చేతిలో హోమం చేస్తారు. అలా హోమంచేస్తే పూజ్యుడైన అగ్ని దానిని ప్రీతికరమైన సమృద్ధిగానే భావిస్తాడు. కాబట్టి దేవతలందరిలో అగ్ని శ్రేష్ఠం అని వింటుంటాం. బ్రహ్మ నుండి అగ్ని, అగ్నినుండి కాంచనం ప్రభవించాయి. కాబట్టి ధర్మమెరిగిన వారు సువర్ణదానం చేస్తే సర్వదేవతలనూ దానం చేసినట్లే అని మేము విన్నాం. సువర్ణదాత పరమగతిని పొందుతాడు. చీకటిలేని లోకాలను చేరుతాడు. భార్గవా! స్వర్గంలో రాజాధిరాజైన కుబేరుని స్థానంలో అతనిని అభిషేకిస్తారు. సూర్యోదయవేళలో యథావిధిగా, మంత్ర పూర్వకంగా సువర్ణదానం చేసినవాడు పీడకలలను నశింపజేసికొంటాడు. సూర్యుడు ఉదయించగానే సువర్ణదానం చేసినవాడు తన పాపాలను తొలగించుకొంటాడు. మధ్యాహ్నం సువర్ణదానం చేస్తే భవిష్యత్పాపాలను నశింపజేసికొంటాడు. సాయంసంధ్యా కాలంలో వ్రతశీలుడై సువర్ణదానం చేసిన వాడు బ్రహ్మ, వాయు, అగ్ని, చంద్రుల లోకాలను చేరుతాడు. ఇంద్రునితో సహా సర్వలోకపాలకుల లోకాలలో శుభస్థితిని పొందగలడు. ఈ లోకంలో కీర్తిమంతుడై, పాపరహితుడై ఆనందాన్ని అనుభవిస్తాడు. మరణానంతరం పరలోకాలలో ఎప్పుడు అసామాన్యుడుగా గణింపబడుతాడు. తన గమనానికి ఎదురులేక స్వేచ్ఛగా ఎక్కడైనా విహరింపగలుగుతాడు. సువర్ణం అక్షయం, దానిని దానం చేసినవాడు ఆ పుణ్యలోకాల నుండి వెనుదిరగడు. మహాయశస్సును పొందగలడు. పుష్కల పుణ్యలోకాలను పొందగలడు. సూర్యోదయవేళలో అగ్నిని పుట్టించి, వ్రతాన్ని ఉద్దేశించి, సువర్ణదానం చేస్తే కోరికలనన్నింటినీ అనుభవింపగలడు. సువర్ణాన్ని అగ్ని అన్నారు. సువర్ణదానం సుఖావహం, అగ్ని యధేష్ట పుణ్యలోకాలను కల్పించగలదు. దానేచ్ఛను కూడా కలిగించగలదు. అనఘా! భృగునందనా! ప్రభూ! ఇది సువర్ణోత్పత్తికి, కార్తికేయోత్పత్తికి సంబంధించిన కథ. నీకు చెప్పాను. గ్రహించు. భృగూద్వహా! కార్తికేయుడు చాలా కాలానికి ఎదిగాడు. ఇంద్రునితో సహా దేవతలందరూ అతనిని తమ సేనాపతిగా వరించారు. బ్రాహ్మణా! లోకహితాన్ని కోరి, ఇంద్రుని ఆజ్ఞతో తారకుని, ఇతర రాక్షసులను కూడా సంహరించాడు కార్తికేయుడు. విభూ! నేను సువర్ణదానంలోని గుణాలను వివరించాను. కాబట్టి దేవతలలో శ్రేష్ఠుడవైన నీవు. బ్రాహ్మణులకు సువర్ణాన్ని దానమివ్వు. భీష్ముడు చెప్తున్నాడు. 'వసిష్ఠుడు అలా చెప్పగానే ప్రతాపవంతుడైన పరశురాముడు బ్రాహ్మణులకు

సువర్ణదానం చేసి పాపవిముక్తి పొందాడు. రాజా! యుధిష్ఠిరా! నీకు సువర్ణోత్పత్తిని గురించి, సువర్ణదాన ఫలాన్ని గురించి పూర్తిగా చెప్పాను. కాబట్టి నీవు కూడా బ్రాహ్మణులకు పుష్కలంగా సువర్ణాన్ని ఇవ్వు. రాజా! సువర్ణాన్ని ఇచ్చి పాపవిముక్తిని పొందగలవు.

86. తారకాసుర వధ.

యుధిష్ఠిరుడు అడిగాడు. "విధి పూర్వకంగా సువర్ణదానం చేస్తే కలిగే వేదోక్తఫలితాలను విస్తరంగా పితామహులు నాకు చెప్పారు. సువర్ణోత్పత్తి కారణాన్ని కూడా చెప్పారు. ఆ తారకుడు ఎలా చనిపోయాడో దానిని నాకు వివరంగా చెప్పండి. రాజా! ఆ తారకుని దేవతలు కూడా చంపలేరు అని చెప్పారు. అటువంటి వానికి మృత్యువు ఎలా ప్రాప్తించిందో వివరంగా చెప్పండి. కురుకులోద్వహా! తమ ద్వారా ఆ తారకవధను గూర్చి పూర్తిగా వినగోరుతున్నాను. నాకెంతో కుతూహలంగా ఉంది. భీష్ముడు చెప్తున్నాడు. "రాజేంద్రా! గంగ తనలోని గర్భాన్ని విడిచిపెట్టినప్పుడు దేవతలు, ఋషులు సంకటస్థితిలో పడ్డారు. ఆ గర్భాన్ని భరించటానికి వారు కృత్తికలను ప్రేరేపించారు. ఆ రుద్రాగ్ని తేజస్సును భరించటానికి దేవతాస్త్రీలలో ఒక్కరు కూడా సమర్థులు కారు. ఈ కృత్తికలే ఆ గర్భాన్ని తమ బలంతో ధరింపగలవారు. తన తేజస్సును నిలుపుకొని, ఉత్తమ వీర్యాన్ని గ్రహించి, ఆ ఆర్గురు కృత్తికలు గర్భాన్ని ధరించినందులకు అగ్ని వారిపై ఎంతో ప్రసన్నుడయ్యాడు. ప్రభూ! ఆ ఆరుగురు కృత్తికలు ఆ అగ్ని గర్భాన్ని పోషించారు. అగ్ని తేజస్సు మొత్తం ఆరు దారులలో వారిలో ప్రతిష్ఠించబడింది. ఆపై మహోత్ముడైన ఆ కుమారుడు ఎదుగుతుంటే ఆ తేజస్సు శరీరాలలో అంతటా వ్యాపించగా వారు సుఖంగా నిలువలేకపోయారు. నరశ్రేష్ఠా! ఆ పై తేజస్సు తమ శరీరాలలో అంతటా నిండగా ఆ కృత్తికలు ప్రసవకాలం సమీపించగానే ఒకేసారి ఆ గర్భాన్ని ప్రసవింపజేశారు. ఆ తరువాత ఆరుగురిలో నున్న ఆ గర్భం ఒక్కటై ఉద్భవించింది. అప్పుడు బంగారానికి దగ్గరగా ఉన్న ఆ బాలుని భూమి గ్రహించింది. ఆ శిశువు అగ్ని తేజస్సుతో కాంతిమంతుడై చూడ ముచ్చటగా ఉన్నాడు. ఆ దివ్యమైన శరీరం రెల్లుపొదలలో జన్మించి పెరగసాగాడు. సూర్యునివలె కాంతిమంతుడైన ఆ శిశువును కృత్తికలు చూశారు. వారిలో స్నేహం పెల్లుబికింది. సౌహార్దంతో తమ చనుబాలతో ఆ శిశువును పోషించారు. అందువలన స్థావరజంగమాత్మకాలైన మూడు లోకాలలో అతడు కార్తికేయుడుగా వ్యవహరింపబడ్డాడు. స్కందన కారణంగా స్కందుడయ్యాడు. గుహలో వసించాడు కాబట్టి గుహుడయ్యాడు. ఆపై ముప్పది ముగ్గురు

దేవతలు, దిక్కులు, దిక్పాలకులు, రుద్రుడు, బ్రహ్మ విష్ణువు, యముడు, పూష ఆర్యముడు, భగుడు, అంశుడు, మిత్రుడు, సాధ్యులు, ఇంద్రుడు, వసువులు, అశ్వినులు, వరుణుడు, వాయువు, ఆకాశం, చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు, సూర్యుడు, దేవతల నాశ్రయించి ఉన్న వివిధ ఇతర ప్రాణులు అగ్నికుమారుడైన ఆ కుమారుని చూడవచ్చారు.

ఋషులు స్తుతించారు. గంధర్వులు పాడారు. ద్విజ ప్రియుడైన ఆ కుమారుడు షడాననుడు. పండ్రెండు కన్నులవాడు, ద్వాదశభుజుడు, ఎగుబుజంబులవాడు, అగ్నివలె, సూర్యునివలె తేజస్వి, రెల్లుపొదలో శయినించి ఉన్న ఆ బాలుని చూసి, దేవతలు, ఋషులు పరమానందపడి ఆ అసురుడు తారకుడు మరణించినట్లే భావించారు. ఆపై దేవతలు అతనికి ఇష్టమైనవన్నీ సమకూర్చారు. బాలుడు ఆడుకొనేటప్పుడు పక్షిగణాలు ఆట వస్తువుల నిచ్చాయి. గరుడుడు వన్నెల ఈకలు గల నెమలిని కుమారునకు ఇచ్చాడు. రాక్షసులు ఆ బాలునికి వరాహాన్ని, దున్నపోతును ఇచ్చారు. వరుణుడు స్వయంగా అగ్నిలా ప్రకాశించే కోడినిచ్చాడు. చంద్రుడు మేకను ఇచ్చాడు. సూర్యుడు అందమైన కాంతినిచ్చాడు. గోమాత లక్షగోవులను ఇచ్చింది. అగ్ని గుణవంతమైన మేకపోతును, ఇల ఎన్నో పూలను, పండ్లను, సుధన్వుడు బండిని, విశాలాసనాలుగల రథాన్ని ఇచ్చారు. వరుణుడు వరుణలోకంలోని శుభలక్షణాలు గల దివ్యగజాలనిచ్చాడు. ఇంద్రుడు సింహాలను, పులులను, ఏనుగులను, ఇతర పక్షులను, భీకర క్రూర జంతువులను, గొడుగులను ఇచ్చాడు. రాక్షస సమూహాలు అసురసమూహాలు శక్తిమంతుడైన అతనిని అనుసరించాయి. ఎదుగుతున్న బాలుని చూసి తారకుడు యుద్ధానికి ఆహ్వానించాడు. అనేకోపాయాలతో ఆ విభుని చంపే, ప్రయత్నం చేశాడు. కానీ చంపలేకపోయాడు. గుహాలయుడైన ఆ గుహుని పూజించి, దేవతలు, సేనాధిపతిని చేశారు. తారకుడు తమను పెట్టిన కష్టాలను ఆయనకు చెప్పారు. మహాబలశాలి, ప్రభువు, దేవసేనాపతి అయిన ఆ గుహుడు ఎదిగి, అమోఘశక్తితో దానవుడైన తారకుని సంహరించాడు. ఆ కుమారుడు క్రీడామాత్రంగా ఆ అసురుని సంహరించగా దేవేంద్రుడు మరల దేవేంద్రుడుగా రాజ్యంలో ప్రతిష్ఠింపబడ్డాడు. ప్రతాపవంతుడైన ఆ స్కందుడు సేనాపతిగానే ప్రకాశింపసాగాడు. దేవతలకు ప్రభువు, రక్షకుడు అయ్యాడు. శంకరునకు ప్రియకారి అయ్యాడు. అగ్ని కుమారుడైన ఈ స్కందుడు సువర్ణమూర్తి. నిత్యమూ కౌమారంలోనే ఉంటూ దేవతల సేనాపతిత్వాన్ని పొందాడు. కాబట్టి సువర్ణం మంగళకరం, అక్షయమైన ఉత్తమరత్నం. కార్తికేయునితో పాటు పుట్టినది

అగ్ని యొక్క పరమతేజస్సు. కౌరవ్యా! ఈ రీతిగా గతంలో పరశురామునకు వసిష్ఠుడు చెప్పాడు. కాబట్టి రాజా! సువర్ణదానం చేయటానికి ప్రయత్నించు. పరశురాముడు సువర్ణదానం చేసియే సర్వపాపాలనుండి ముక్తిని పొందాడు. స్వర్గంలో నరులకు దుర్లభమైన మహాస్థానాన్ని అందుకొన్నాడు.

87. వివిధ తిథులలో శ్రాద్ధఫలము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "ధర్మాత్మా! నాలుగు వర్ణాలకు సంబంధించిన ధర్మాలను చక్కగా చెప్పారు. రాజా! అదే రీతిగా శ్రాద్ధ విధిని పూర్తిగా వివరంగా చెప్పండి". వైశంపాయనుడిలా అన్నాడు. "యుధిష్ఠిరుడు అలా అనగానే భీష్ముడు ఈ శ్రాద్ధ విధిని గూర్చి పూర్తిగా చెప్పటానికి ఉపక్రమించాడు. భీష్ముడు చెప్తున్నాడు. "రాజా! శ్రాద్ధక్రమ విధిని సావధానంగా విను. ఈ పితృ యజ్ఞం శుభకరం. ధనాన్ని, కీర్తినీ, పుత్రులను కలిగించగలదు. దేవతలు, అసురులు, మనుష్యులు, గంధర్వులు, నాగులు, రాక్షసులు, పిశాచులు, కిన్నరులు అందరూ ఎప్పుడూ పితరులను పూజించాలి. మనుష్యులు ముందు పితరులను పూజించి, ఆపై దేవతలను పూజిస్తారు. కాబట్టి పురుషుడు సర్వ యజ్ఞాలతోనూ, ఎప్పుడూ పితరులను పూజించాలి. పితరుల శ్రాద్ధాన్ని అన్వాహార్యమంటారు. కాబట్టి విశేషవిధితో ముందు దాన్ని అనుష్ఠించాలి. అన్ని రోజులలోనూ శ్రాద్ధాన్ని పెడితే పితరులు ప్రసన్నులవుతారు. తిథి, అతిథులకు సంబంధించిన గుణాలనన్నింటినీ వివరిస్తాను. అనఘా! ఏ రోజు శ్రాద్ధాన్ని నిర్వహిస్తే ఏ ఫలితం పొందవచ్చునో అదంతా యథాతథంగా చెపుతాను, విను.

పాడ్యమినాడు పితరులను అర్చిస్తే మంచి ఇంటిలో అనురూపమైన అందమైన భార్యను పొందవచ్చు. ఆమె ద్వారా బహుసంతానాన్ని పొందవచ్చు. విదియనాడు శ్రాద్ధాన్ని నిర్వహిస్తే కూతుళ్ళు పుడతారు. తదియనాడు గుర్రాలను పొందవచ్చు. చతుర్థినాడు నిర్వహిస్తే ఇంటిలో చిన్న చిన్న పశువుల సంఖ్య పెరుగుతుంది. రాజా! పంచమినాడు శ్రాద్ధకర్మ చేస్తే ఎందరో పుత్రులు పుడతారు. షష్ఠినాడు నిర్వహించినవారు కాంతిమంతులవుతారు. రాజా! సప్తమినాడు శ్రాద్ధాన్ని నిర్వహించినవాడు వ్యవసాయఫలాన్ని పొందుతాడు. అష్టమినాడు చేస్తే వ్యాపారంలో లాభపడతాడు. నవమినాడు శ్రాద్ధాన్ని పెడితే ఒంటిగిట్టగల పశువులు వృద్ధి చెందుతాయి. దశమినాడు శ్రాద్ధాన్ని నిర్వహిస్తే

గోవులు వృద్ధి చెందుతాయి. రాజా! ఏకాదశినాడు శ్రాద్ధాన్ని నిర్వహిస్తే మర్యుడు బంగారు, వెండి తప్ప ఇతర ధనాలను పొందగలడు. అతని ఇంట బ్రహ్మవర్చస్సు గల పుత్రులు పుడతారు. ద్వాదశినాడు శ్రాద్ధాన్ని నిర్వహిస్తే నిత్యమూ మనస్సును రంజింపజేసే బంగారం, వెండి, పుష్కలంగా డబ్బు లభించటం చూడవచ్చు. త్రయోదశినాడు శ్రాద్ధాన్ని పెడితే జ్ఞాతులలో గొప్పవాడు కాగలడు. చతుర్దశినాడు శ్రాద్ధాన్ని నిర్వహిస్తే ఇంటిలోని యువకులు తప్పక మరణిస్తారు. అంతేగాక తాను కూడా యుద్ధంలో పాలు పంచుకొంటాడు. అమావాస్య నాడు శ్రాద్ధాన్ని నిర్వహిస్తే కోరికలన్నీ తీరుతాయి. కృష్ణపక్షంలో దశమి నుండి అమావాస్య వరకు - చతుర్దశి తప్ప - శ్రాద్ధ కర్మకు ప్రశస్తాలు. ఇతరతిథులు అంత ప్రశస్తాలు కావు. శ్రాద్ధవిదికి శుక్లపక్షం కన్న కృష్ణపక్షం విశిష్టం. అలాగే పూర్వాహ్ణం కన్నా అపరాహ్ణం విశిష్టం.

88. శ్రాద్ధములో పితరుల తృప్తి - పితృగీత.

యుధిష్ఠిరుడు అడిగాడు. "రాజా! పితరులకు ఏమిస్తే అది అక్షయమవుతుంది? ఏ హవిస్సు చిరకాలం వారిని తృప్తి పరుస్తుంది? ఏది శాశ్వతంగా ఆనందింపజేస్తుంది ?" భీష్ముడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరా! శ్రాద్ధవేత్తలు శ్రాద్ధకల్పంలో హవిస్సులుగా భావించిన వన్నీ కామ్యాలు. ఆ కామ్యాలనూ, వాటి ఫలితాలను చెపుతా విను. రాజా! నువ్వులు, వ్రీహి, యవలు, మినుములు, జలం, కందమూలాలు, పండ్లు - వీటితో శ్రాద్ధాన్ని పెడితే పితరులు ఒక నెల వరకు తృప్తిపడతారు. శ్రాద్ధంలో నువ్వులు ఎక్కువగా వాడితే అది అక్షయమవుతుందని మనువు అన్నాడు. భోజ్య పదార్థాలన్నింటిలో తిలలు ప్రధానాలు. శ్రాద్ధంలో ఆవు పెరుగును దానంచేస్తే సంవత్సరం వరకు పితరులు తృప్తి పడతారు. ఆవు పెరుగువలె ఆవు నేతితో కలిసిన పాయసం కూడా ఫలితాన్ని ఇస్తుంది. యుధిష్ఠిరా! ఇక్కడ పితరులు గానం చేసిన గాధలను పెద్దలు చెప్తుంటారు. గతంలో పూజ్యుడైన సనత్కుమారుడు నాకు చెప్పాడు. "దక్షిణాయనంలో ఆశ్వయుజమాసంలో కృష్ణ పక్షంలో మఘా నక్షత్రంలో త్రయోదశినాడు మనకోసం నేతితో కలిసిన పాయసాన్ని దానమిచ్చేవాడు మన వంశంలో పుడతాడా ? నియతవ్రతుడై మఘా నక్షత్రంలో ఏనుగు నీడలో నిలిచి వాటి చెవులనే వీవనల గాలిని పొందుతూ. యథావిధిగా పాయసంతో కానీ పటిక బెల్లంతో కానీ శ్రాద్ధం పెట్టకపోతాడా ? కొడుకులను ఎక్కువమందిని పొందాలి. వారిలో ఒక్కడైనా

గయకు వెళతాడు. అక్కడ లోక ప్రసిద్ధి చెందిన అక్షయవటముంది. అది శ్రాద్ధఫలాన్ని అక్షయం చేస్తుంది. పితృక్షయ తిథిలో జలం, మూలం, ఫలం, ఫలరసం, అన్నం - ఇటువంటి వాటిని తేనెతో కలిపి ఇస్తే అది పితరులకు శాశ్వతతృప్తిని కలిగిస్తుంది.

89. వేర్వేరు నక్షత్రాలలోని శ్రాద్ధఫలము.

భీష్ముడు చెప్తున్నాడు. "యముడు శశబిందువునకు విభిన్న నక్షత్రాలలో చేసిన కామ్యశ్రాద్ధఫలాలను చెప్పాడు. వాటిని చెపుతా, వినుము. కృత్తికా నక్షత్రంలో అగ్నిని స్థాపించి నిత్యమూ కుమారునితో కలిసి పితృయాగాన్ని లేదా శ్రాద్ధాన్ని ఆచరించినవాడు రోగశోక రహితుడవుతాడు. సంతానాన్ని కోరేవాడు రోహిణిలో, తేజస్సును కోరేవాడు మృగశిరలో శ్రాద్ధవిధిని పాటించాలి. ఆర్ద్రానక్షత్రంలో శ్రాద్ధాన్ని నిర్వహించిన మనిషి క్రూరకర్మలు చేస్తాడు. ధనాభిలాష గలవాడు పునర్వసు నక్షత్రంలో శ్రాద్ధాన్ని నిర్వహించాలి. పుష్టిని కోరుకొనే మానవుడు పుష్యమినాడు శ్రాద్ధాన్ని పెట్టాలి. ఆశ్లేషలో శ్రాద్ధాన్ని నిర్వహిస్తే ధీరులైన కొడుకులు పుడతారు. మఘా నక్షత్రంలో శ్రాద్ధపిండాన్ని పెట్టినవాడు దాయాదులలో మేటి కాగలడు. పూర్వ ఫల్గుని (పుబ్బలో శ్రాద్ధాన్ని నిర్వహిస్తే సౌభాగ్యశాలి అవుతాడు. ఉత్తరలో సంతానవంతుడవుతాడు. హస్తానక్షత్రంలో శ్రాద్ధాన్ని నిర్వహిస్తే ఇష్టఫలాలను పొందుతాడు. చిత్ర (చిత్తా) నక్షత్రంలో శ్రాద్ధపిండాన్ని పెడితే అందమైన కొడుకులు పుడతారు. స్వాతి నక్షత్రంలో పితరుల నర్చిస్తే వ్యాపారంతో బ్రతుకు సాగుతుంది. పుత్రుని కోరి విశాఖా నక్షత్రంలో శ్రాద్ధాన్ని నిర్వహిస్తే చాలామంది కొడుకులు కలుగుతారు. అనూరాధా నక్షత్రంలో శ్రాద్ధాన్ని పెడితే రాజమండలాన్ని శాసిస్తాడు. కురువంశశ్రేష్ఠా! జ్యేష్ఠా నక్షత్రంలో ఇంద్రియ నిగ్రహంతో పిండదానం చేసిన నరుడు సమృద్ధిని పొంది, అధిపతి కూడా కాగలడు. మూలా నక్షత్రంలో శ్రాద్ధ నిర్వహణతో ఆరోగ్యాన్ని పొందవచ్చు. పూర్వాషాఢలో మంచిపేరు వస్తుంది. ఉత్తరాషాఢలో శ్రాద్ధాన్ని నిర్వహించి శోకరహితుడై చరించవచ్చు. అభిజిత్తులో శ్రాద్ధాన్ని నిర్వహించిన వైద్యుడు సిద్ధిని పొందగలడు. శ్రవణా నక్షత్రంలో పిండప్రదానం చేస్తే మరణానంతరం సద్గతిని పొందవచ్చు. ధనిష్ఠలో శ్రాద్ధాన్ని నిర్వహించిన నరుడు తప్పక రాజ్యాన్ని పొందుతాడు. శతభిషనక్షత్రంలో చేస్తే పురుషుడు వైద్యసిద్ధిని పొందగలడు. పూర్వాభాద్రలో శ్రాద్ధాన్ని నిర్వహిస్తే ఎక్కువగా మేకలు, గొర్రెలు మొదలగువాటిని పొందవచ్చు. ఉత్తరాభాద్రలో శ్రాద్ధాన్ని పెడితే వేలకొలదిగ గోవులను పొందుతాడు. రేవతిలో శ్రాద్ధాన్ని ఆశ్రయిస్తే వెండి, బంగారు తప్ప ఇతర ధనాన్ని

విరివిగా పొందవచ్చు. అశ్వనిలో గుర్రాలను, భరణిలో ఉత్తమాయుస్సును పొందవచ్చు. ఈ శ్రాద్ధవిధిని విని శశబిందుడు అలాగే పాటించాడు. అనాయాసంగా భూమిని జయించి, పరిపాలించాడు.

90. శ్రాద్ధభోక్తల నిరూపణము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "పితామహా! శ్రాద్ధంలో ఎటువంటి బ్రాహ్మణులను నిమంత్రించాలి. కురుశార్దూలా! నాకు చెప్పవలసినది. భీష్ముడు చెప్తున్నాడు. "దానధర్మమెరిగిన క్షత్రియుడు దేవకర్మలలో విప్రులను పరీక్షించరాదు. కాని పితృ కర్మలతో బ్రాహ్మణపరీక్షణం న్యాయమే అన్నారు. దేవతలు ఈ లోకంలో తమ దివ్యతేజస్సుతోనే బ్రాహ్మణులను పూజిస్తున్నారు. కాబట్టి దేవతాదృష్టితో నరుడు సర్వ బ్రాహ్మణులకు దానమివ్వాలి. కానీ మహారాజా! శ్రాద్ధ కర్మల యందు పండితుడు వంశం, స్వభావం, రూపం, విద్య, జన్మ స్థలం మొదలయిన విషయాలలో బ్రాహ్మణులను పరీక్షించాలి. వారిలో కొందరు పంక్తి దూషకులు. కొందరు పంక్తి పావనులు. రాజా! పంక్తిదూషకులైన బ్రాహ్మణులను గురించి చెపుతాను, విను. జూదగాడు, గర్భచ్ఛేదం చేసినవాడు, క్షయరోగి, పశుపాలుడు, చదువులేనివాడు, గ్రామంలో అందరికి బంట్రోతుగా ఉండేవాడు. వడ్డివ్యాపారి, గాయకుడు, అన్నీ అమ్మేవాడు, ఇళ్ళు తగులబెట్టేవాడు, విషమిచ్చేవాడు, ఉపపతిద్వారా పుట్టినవాని ఇంట భుజించేవాడు, సోమరసాన్ని అమ్మేవాడు, సాముద్రికుడు, రాజసేవకుడు, నూనె అమ్మేవాడు, దొంగ సాక్ష్యం చెప్పేవాడు, తండ్రితో గొడవపడేవాడు, జారులతో చేరినవాడు, కళంకితుడు, చోరుడు, శిల్పకారి, వేషాలు మార్చేవాడు, చాడీకోరు, మిత్రద్రోహి, పరదారాసక్తుడు, వ్రతహీనులకు చదువుచెప్పేవాడు, ఆయుధాలు చేసి బ్రతుకు గడిపేవాడు, కుక్కను వెంటబెట్టుకొని తిరిగేవాడు, కుక్క కరిచినవాడు, తమ్ముడికి పెళ్ళి అయినా తాను అవివాహితుడుగా ఉన్నవాడు (పరివిత్తి), చర్మరోగి, గురుపత్నితో రమించేవాడు, నటుడు, అర్చకుడు, జ్యోతిషంతో బ్రతికేవాడు - వీరంతా పంక్తి బాహ్యులు. ఇటువంటి వారికి ఇచ్చిన హవ్యం రాక్షసులకు చేరుతుంది అని బ్రహ్మవేత్తలంటారు. శ్రాద్ధభోజనానంతరం వేదాధ్యయనం చేసేవాడు, శూద్రస్త్రీతో సంగమించేవాడు - ఇటువంటివాని పితరులు ఒక నెల వరకు ఆ బ్రాహ్మణుని పురీషంపై శయనించ వలసివస్తుంది.

సోమవిక్రేతకు ఇచ్చే శ్రాద్ధాన్నం పితరులకు పురీషంతో సమానం. వైద్యునకిచ్చిన శ్రాద్ధాన్నం అపవిత్రం, నెత్తుటితో సమానం. పూజారికిచ్చిన శ్రాద్ధాన్నం నిష్ప్రయోజనం.

వడ్డీ వ్యాపారికిచ్చిన శ్రాద్ధాన్నం అస్థిరం. వ్యాపారికి ఇచ్చిన శ్రాద్ధాన్నం ఇహపరాలకు రెండింటికీ పనికిరాదు. పౌనర్భవుడు (మొదటి భర్తను విడిచిన స్త్రీకి రెండవభర్త వలన పుట్టినవాడు) అయిన బ్రాహ్మణునకు పెట్టిన శ్రాద్ధాన్నం బూడిదలో చేసిన హోమం వంటిది. ధర్మాన్ని తప్పి, చరిత్రను కోల్పోయిన వారికిచ్చిన హవ్యకవ్యాలు పరలోకానికి పనికిరావు. తెలిసి తెలిసి అల్పబుద్ధులు అటువంటి పంక్తి - బాహ్యులకు శ్రాద్ధాన్నాన్ని పెడితే, ఆ యజమానికి పితరులు పరలోకంలో అతని పురీషాన్ని తింటారు. అనుమానం లేదు. ఇలాంటి ద్విజాధములు అందరూ పంక్తి బాహ్యులని గ్రహించాలి. అల్పబుద్ధులై శూద్రులకు వేదోపదేశం చేసేవారు కూడా పంక్తిబాహ్యులే. రాజా! ఒంటి కన్నువాడు అరవైమందిని, నపుంసకుడు వందమందిని, బొల్లిగలవాడు తన చూపు సారినంత మేర పంక్తిలోని వారిని అపవిత్రం చేయగలరు. తలపై తలపాగా (టోపీ) పెట్టుకొని తిన్నా, దక్షిణాభిముఖుడై తిన్నా, పాదరక్షలు ధరించి తిన్నా అది అసుర భోజనం. అసూయతో ఇచ్చినా, శ్రద్ధను వీడి ఇచ్చినా అదంతా రాక్షసరాజైన బలికి చెందుతుందని బ్రహ్మ భాగాన్ని కల్పించాడు. కుక్కలు గానీ, పంక్తి బాహ్యులుకానీ భోజనం చేయటం చూడకూడదు. కాబట్టి తెరచాటు చేసి, శ్రాద్ధ భోజనం పెట్టాలి. నువ్వులను అంతటా చల్లి ఉంచాలి. నువ్వులు లేకుండా శ్రాద్ధం పెట్టినా, కోపానికి లోనయి శ్రాద్ధం పెట్టినా ఆ హవిస్సును రాక్షసులు, పిశాచాలు లోపింపజేస్తాయి. పంక్తి బాహ్యుడు పంక్తి భోజనం చేస్తున్న వారిలో ఎంతమందిని చూస్తే, అంతమందికి పెట్టిన ఫలితాన్ని మూర్ఖుడైన ఆ దాత కోల్పోతాడు.

భరతశ్రేష్ఠా! ఇక పంక్తి పావనులను గురించి వివరిస్తాను. నీవు శ్రాద్ధవిధిలో బ్రాహ్మణులను పరీక్షించటానికి వీలుగా వారిని గురించి చెప్తున్నాను. విద్యావేదవ్రతాల్లో నిష్ణాతులైన బ్రాహ్మణులు సదాచారపరులై ఉంటే వారందరూ సర్వపావనులని గ్రహించాలి. పంక్తికి యోగ్యులయిన బ్రాహ్మణులను గురించి చెప్పబోతున్నాను. వారు పంక్తి పావనులు. త్రిణాచికేతమంత్రాన్ని జపించే వారు, పంచాగ్నులను సేవించేవారు, త్రిసుపర్ణ మంత్రజపకులు, షడంగవేత్తలు పంక్తి పావనులు. పరంపరగా వేదాలను లేదా పరావిద్యను వ్యాపింపజేసేవాడు, ఛందః పండితుడు, జ్యేష్ఠ సామమంత్ర గాయకుడు, తల్లిదండ్రుల అదుపులో నున్నవాడు, పదితరాలుగా శ్రోత్రియుడు పంక్తిపావనులు. ధర్మపత్నితో ఋతుకాలమందే సంగమించే వాడు, వేదవిద్యావ్రత నిష్ణాతుడు అయిన విప్రుడు పంక్తిని పవిత్రం చేయగలడు. అధర్వవేదవేత్త, బ్రహ్మచారి, వ్రతశీలుడు, సత్యవాది, ధర్మశీలుడు, స్వకర్మ తత్పరుడు కూడా పంక్తిపావనుడే. పుణ్యతీర్థాలలో మునగటానికి శ్రమపడిన వారు, మంత్రసహితాలైన యాగాలు చేసి

అవభృథస్నానం చేసినవారు, క్రోధ రహితులు, చపలతలేనివారు, సహనశీలురు, మనో నిగ్రహం, ఇంద్రియనిగ్రహం గలవారు, సర్వభూత హితాసక్తులు – ఇటువంటి బ్రాహ్మణులను శ్రాద్ధవిధిలో నిమంత్రించాలి.

వీరంతా పంక్తిపావనులు. కాబట్టి వారికిచ్చినది అక్షయమవుతుంది. వీరే కాక ఇంకా మహాభాగులయిన పంక్తిపావనులున్నారు. వారిని గురించి తెలిసికోవాలి. మోక్షధర్మ మెరిగిన యతులు, చక్కగా వ్రతాలు పాటించే యోగులు, పాంచరాత్రాగమవేత్తలు, పరమభాగవతులు, వైఖానసులు, వంశశ్రేష్ఠులు, వైదికాచార పరాయణులు, మనస్సును నియమించి ఇతిహాస ప్రవచనం చేసే బ్రాహ్మణోత్తములు, మహాభాష్య వ్యాకరణ పండితులు, పురాణాలను, ధర్మశాస్త్రాలను అధ్యయనం చేసి యథావిధిగా, యథాన్యాయంగా వాటిని ఆచరించేవారు, గురుకులంలో నియమబద్ధంగా అధ్యయనం చేసినవాడు, వేలమార్లు సత్యవాదిగా నిలిచినవాడు, సర్వ వేదాలలో, సర్వప్రవచనాలలో అగ్రగణ్యులు – ఇటువంటి బ్రాహ్మణులు తమ దృష్టి పడినంత మేర పంక్తిని పవిత్రం చేయగలరు. పంక్తిని పావనం చేస్తాడు కాబట్టి తాను పంక్తిపావనుడు. వేదాన్ని అధ్యాపనం చేసే బ్రహ్మజ్ఞాని ఒంటరిగానే మూడున్నర క్రోసుల దూరం మేర పవిత్రం చేయగలడని బ్రహ్మవేత్తలంటారు. ఋత్విక్కు, ఉపాధ్యాయుడు కాకపోయినా ఋత్విక్కుల అనుజ్ఞతో శ్రాద్ధంలో అగ్రాసనాన్ని పొందినవాడు కూడా పంక్తిలోని దోషాలను తొలగించగలడు. రాజా! పంక్తిదోషాలు ఏవీ లేనివాడు. అందువలననే పతితుడు కాని వాడు పంక్తి పావనుడే. కాబట్టి సర్వ ప్రయత్నాలతోనూ పరీక్షించి, స్వకర్మ నిరతులై, సద్వంశంలో పుట్టి పండితులైన బ్రాహ్మణులనే శ్రాద్ధంలో నిమంత్రించాలి. శ్రాద్ధభోజనంలో మిత్రులకే ప్రాధాన్యమిస్తే ఆ శ్రాద్ధంకానీ, ఆ హవిస్సు కానీ పితరులను తృప్తిపరచదు. ఆ శ్రాద్ధంపెట్టినవాడు స్వర్గానికి వెళ్ళలేడు కూడా. శ్రాద్ధభోజనం పెట్టి మైత్రిని కొనసాగించేవాడు మరణానంతరం దేవమార్గంలో వెళ్ళలేడు. పిప్పలి తొడిమనుండి వీడిపడినట్లు శ్రాద్ధాన్ని మైత్రీ సాధనంగా భావించేవాడు స్వర్గభ్రష్టుడవుతాడు. అందువలననే శ్రాద్ధవిధిలో మిత్రులను నిమంత్రించరాదు. మిత్ర సంగ్రహం కోసం ధనాన్ని ఇవ్వవచ్చు. హవ్యకవ్యవిధిలో మాత్రం శత్రుమిత్రులను వీడి మధ్యస్థులనే నిమంత్రించాలి.

చవిటి నేలలో నాటిన గింజ మొలకెత్తదు. విత్తినవాడు ఏ ఫలాన్నీ పొందలేడు. అలాగే అనర్హులైన బ్రాహ్మణులకు శ్రాద్ధాన్నం పెడితే అది ఇహలోకంలో కానీ, పరలోకంలో కానీ ఏ ఫలితాన్ని ఇవ్వదు. అధ్యయనం లేని బ్రాహ్మణుడు గడ్డిమంటవలె వెంటనే

తేజస్సు కోల్పోతాడు. అందువలన అటువంటివానికి శ్రాద్ధాన్నం పెట్టరాదు. బూడిదలో హోమం చేయము గదా! పరస్పరం శ్రాద్ధంలో నిమంత్రించుకొని, దక్షిణల నిచ్చుకొంటే అది పిశాచ దక్షిణ. దేవతలకు కానీ, పితరులకు కానీ అది దక్కదు. పుణ్యానికి దూరమైన ఆ దక్షిణ దూడను కోల్పోయిన ఆవు గోశాలలోనే తిరుగుతున్నట్లుగా ఈ లోకంలోనే తిరుగుతుంటుంది. నిప్పుచల్లారిన తరువాత నేతితో హోమం చేస్తే అది దేవతలకూ చెందదు, పితరులకూ చెందదు. అలాగే నర్తకులకు, గాయకులకు, అసత్యవాదులకు ఇచ్చిన దక్షిణ నిరర్థకం. తగనివారికి ఇచ్చిన దక్షిణ దాతకూ, భోక్తకూ కూడా నిరుపయోగమే. పైపెచ్చు ఇద్దరినీ నాశనం చేస్తుంది. వినాశకారణమై నిందింపదగిన ఈ దక్షిణ యజమాని పితరులను దేవమార్గం నుండి పడగొడుతుంది. యుధిష్ఠిరా! ఋషులు చెప్పిన మార్గంలో ఎప్పుడూ సంచరిస్తూ, సర్వధర్మాలనెరిగి, నిశ్చయజ్ఞానం కలవారే బ్రాహ్మణులని దేవతలంటారు. భారతా! ఋషులలో కొందరు స్వాధ్యాయనిష్ఠ గలవారు, మరికొందరు జ్ఞాననిష్ఠులు, కొందరు తపోనిష్ఠులు, ఇంక కొందరు కర్మనిష్ఠులు. భారతా! శ్రాద్ధకర్మలలో జ్ఞాననిష్ఠులయిన బ్రాహ్మణులనే నిమంత్రించాలి. బ్రాహ్మణులను నిందించే నరులు శ్రేష్ఠులు కారు. మాటామంతిలో బ్రాహ్మణ నింద చేసేవారికి శ్రాద్ధభోజనం పెట్టదగదు. రాజా! నిందపడిన బ్రాహ్మణుడు నిందించినవాని వంశాన్ని మూడుతరాల వరకు నశింపజేయగలరని వైఖానసముని వచనం. వేదపారంగతులైన పండితులను దూరం నుండియే పరీక్షించాలి. భారతా! వేదపండితులు తనకు ఇష్టులయినా కాకపోయినా శ్రాద్ధ భోజనంలో వారిని నిమంత్రించాలి. పది లక్షల మంది అనర్హులకు భోజనం పెట్టడంకన్నా, నిత్య సంతుష్టుడై మంత్రవేత్త అయిన ఒక్కనికి భోజనం పెట్టడం ఉత్తమం.

ఇది అనుశాసనపర్వం మొదటిభాగం



భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా మెలగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకు తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నప్పుడే భారతం చదివితే ఇహపర సౌఖ్యాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చెరుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.